Kaaba Sandesam (The Message of Kaaba - Telugu)

# కాబా సందేశం


రచన
అబుల్ ఇర్ఫాన్

ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్, ఫ్లాట్ నెం.106,
సహారాకాంప్లెక్స్, పత్తర్‌గట్టి, హైదరాబాద్-2,
✆ 040-66710795, 91-9441515414

వెల..................................................................రూ. 100/-లు



| | |
|---|---|
| Name of the Title: | Kaaba Sandesam<br>Telugu<br>(The message of Kaaba) |
| Compilation : | **ABUL IRFAN**<br>Hyderabad-2 |
| All rights reserved with: | Islamic Resource Centre |
| First Edition: | November, 2006 |
| Copies: | 1000 |
| Published by: | Islamic Resource Centre<br>Lakkadkot, Chatta Bazar,<br>Hyderabad-2, Ph: 66710795 |
| Type set by: | Alifain, I.R.C. Graphics<br>Lakkadkot, Chatta Bazar,<br>Hyderabad-500002 |
| Printed at: | Cosmic Printers<br>Lakkadkot, Chatta Bazar,<br>Hyderabad-500002 |
| Price: | Rs. 100/- |



====( See Page- 186 )====

కరుణామయుడు, కృపాసాగరుడయిన అల్లాహ్ పేరుతో ప్రారంభం



## మొట్టమొదటి ఆరాధనాలయం

"మానవుల కోసం నిర్మించబడిన మొట్టమొదటి ఆరాధ నాలయం మక్కాలో ఉన్నదే (కాబాగృహం). అది ఎంతో శుభప్రదమైనది, యావత్‌మానవాళికి మార్గదర్శకమైనది."
(దివ్యఖుర్ఆన్-3:96)



# విషయసూచిక


| నెం. | విషయం | పేజి |
|---|---|---|
| 1. | సృష్టికర్త ముందు ప్రమాణం | 012 |
| 2. | ఇబ్రాహీం (అలైహి) ధర్మం | 013 |
| 3. | మహోత్కృష్ట జీవి | 014 |
| 4. | దుష్టశక్తి (షైతాన్) ఆరాధన | 017 |
| 5. | మానవోత్కృష్టతకు తగని బలహీనతలు | 020 |
| 6. | అణువణువూ అల్లాహ్‌నే స్మరిస్తోంది | 022 |
| 7. | దేవుని పట్ల కృతఘ్నుతే బహుదైవారాధన | 024 |
| 8. | సర్వేశ్వరుడే సర్వశక్తిమంతుడు | 028 |
| 9. | జీవిత పరమార్థం, ఆరాధనా భావం | 030 |
| | ✠ దైవారాధనే మానవపుట్టుక లక్ష్యం | 031 |
| 10. | సమాధులు, స్మారక చిహ్నాలు | 032 |
| | ✠ మృతమానవులు-మిధ్యాదైవాలు | 033 |
| | ✠ వ్యక్తి పూజ | 035 |
| 11. | షిర్క్ చేసేవారికి సిఫారసు లేదు | 036 |
| 12. | విగ్రహారాధన | 039 |
| 13. | భూత పిశాచాల పూజ | 040 |
| 14. | మనోవాంఛల దాస్యం | 041 |
| 15. | విగ్రహారాధన | 043 |
| 16. | అంధానుకరణ | 044 |
| 17. | సంఘనాయకుల ఆరాధన | 046 |
| 18. | మతగురువులు, బాబాల ఆరాధన | 048 |
| | ✠ అజ్ఞాన చర్యలు | 049 |
| | ✠ అగోచరజ్ఞాని అల్లాయే | 050 |
| 19. | బంధుమిత్రుల ఆరాధన | 051 |
| 20. | అధికసంఖ్యాకుల ఆరాధన | 052 |
| 21. | హజ్ పైకంతో దానం | 054 |
| 22. | అధర్మ సంపాదనతో హజ్‌యాత్ర | 056 |

23. హజ్‌యాత్ర సన్నాహాలు 058
24. హజ్ ప్రయాణీకులకు సూచనలు 059
25. మా విమానయానం 061
26. మదీనా ఔన్నత్యం 064
27. మదీనా నగర ప్రవేశం 067
✠ అదో అద్భుత సన్నివేశం 069
28. మస్జిదెనబవీ పునర్నిర్మాణ ఘట్టాలు 070
29. మిహ్రాబ్, మింబర్‌ల ప్రత్యేకతలు 073
✠ మింబర్ రోదన 074
✠ ఒక నమాజ్‌కు వేయి నమాజ్‌ల పుణ్యం 076
30. ప్రవక్త (స) పరలోక ప్రస్థానం 077
31. “శుభసమాధి సందర్శనం 079
32. ఖుబా, ఖిబ్లతైన్ మసీదులు 082
✠ ఖిబ్లామార్పుకు స్మారకచిహ్నం 085
33. ఉహుద్ కొండ వద్ద గందరగోళం 087
34. కదనరంగంలో కందకం 091
35. అపరిచిత హాజీలతో పరిచయం 093
36. ఉమ్రా దీక్షతో మక్కా ప్రయాణం 094
37. ఇబ్రాహీం ప్రవక్త (అలై) జీవిత చరిత్ర 099
✦ సందేశ ప్రచారం, జాతి వైముఖ్యం 099
✦ గ్రహణం పట్టిన విగ్రహాలు 101
✦ అగ్ని పరీక్ష 102
✦ తండ్రితో వైరం 105
✦ విశ్వనాయకత్వం, పునర్జీవన పరీక్ష 105
✦ దైవదూతలు, సంతాన శుభవార్త 106
✦ బలిదానం, కాబా నిర్మాణం 107
38. హజ్, ఉమ్రాల ప్రాముఖ్యం 108
✠ దేవుని అతిథులు 109



✠ స్త్రీల జిహాద్ 110
✠ నాల్గింటిలో ఒకటి పోతే సున్న! 111
✠ మబ్రూర్ హజ్ 112
39. హజ్ నియమాలు 113
✠ ఫరజ్ నియమాలు 113
✠ వాజిబ్ నియమాలు 114
40. ఇహ్రాం నిషేధితాలు, తల్బియా పఠనం 114
41. ఉమ్రా విధానం 117
42. కాబా నిర్మాణ చరిత్ర 121
✦ దైవప్రవక్త (స) గతస్మృతులు 122
✦ కాబా పునర్నిర్మాణ ఘట్టాలు 125
✦ కాబా తొలి నిర్మాణం 126
✦ ప్రవక్త (స) కాలంలో కాబా పునర్నిర్మాణం 127
✠ అమీన్ తీర్పు అందరికీ శిరోధార్యమే 130
✦ అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) పాలనలో పునర్నిర్మాణం 131
✠ అసమగ్ర కట్టడంగా మిగిలిన కాబా 133
43. జమ్‌జమ్ జలనిధి పుట్టుపూర్వోత్తరాలు 134
✦ తల్లీ బిడ్డల నీటితపన 134
✦ కనుమరుగైన జలనిధి కలలో కన్పించింది 135
44. కాబాలోని ప్రత్యేక భాగాలు 138
✦ జమ్‌జమ్ ఔన్నత్యం, దాని విశిష్టతలు 138
✦ జమ్‌జమ్‌తో హృదయశుద్ధి 141
✦ సర్వరోగ నివారిణి ఈ జమ్‌జమ్ జలం 142
✠ జమ్‌జమ్ రసాయనిక విశ్లేషణ 144
✦ నల్లరాయిగా మారిన తెల్లరాయి 145
✦ ముల్తజమ్, రుకునె యమాని 146
✦ హతీం (ఖాళీగా వదలిన కాబా స్థలం) 147
✦ మఖామె ఇబ్రాహీం 148
45. హిరాగుహలో తొలి దివ్యావిష్కృతి 149

46. సౌర్‌గుహలో శరణుపొందిన సందేశహరుడు 153
✠ మక్కాలో కార్చిచ్చు వార్త 155
✠ పాద చిహ్నాలు 156
47. మసీదులుగా మారిన చారిత్రక ప్రదేశాలు 158
✦ మస్జిదె ఆయిషా (మస్జిదె తన్‌ఈమ్) 158
✦ మస్జిదె జిన్ 159
✦ మస్జిదె జీరాన 162
48. మీఖాత్ ప్రదేశాలు, ఇహ్రాం 162
49. మేము నిర్వహించిన హజ్ 163
✦ జిల్‌హజ్జ 8వ తేదీ కార్యకలాపాలు 163
✦ జిల్‌హజ్జ 9వ తేదీ కార్యకలాపాలు 165
✦ అరఫాత్ ఔన్నత్యం 167
✦ హజ్జతుల్ విదా ప్రసంగం 169
✠ ఆధిక్యతకు గీటురాయి దైవభీతే 171
✠ కరుణామృతపు కడపటి బిందువులు 173
✦ జిల్‌హజ్జ 10వ తేదీ కార్యకలాపాలు 173
✠ అంతర్జాతీయ సమానత్వం 175
✠ సైనిక శిక్షణా శిబిరం 176
✦ కాబా ముందు అబ్రహా పర్యవసానం 177
✦ 'రమీ' (జమ్రాలపై కంకరాళ్ళు విసరడం) 180
✠ స్తంభం స్థానంలో పొడుగాటి గోడ 181
✦ ఖుర్బానీ (బలిదానం) 181
✦ తఖ్సీర్ (క్షవరం) 185
✦ జిల్‌హజ్జ 11వ తేదీ కార్యకలాపాలు 186
✦ జిల్‌హజ్జ 12వ తేదీ కార్యకలాపాలు 188
✠ తొక్కిసలాటలో వేలాదిమంది హతం 188
50. ఖుర్బానీ అంటే త్యాగం 189
✦ ఇబ్రాహీం ప్రవక్త (అలైహి) త్యాగనిరతి 190



✦ యావత్తు ఆస్తిపాస్తుల త్యాగం 191
✦ హ్జరత్ అబూతల్హా (రజి) త్యాగం 193
✦ హ్జరత్ అబూదహ్దా (రజి) త్యాగం 193
✦ సహన త్యాగాలు 195
✦ ధర్మసంస్థాపన కోసం ధనత్యాగాలు 195
51. ధర్మసంస్థాపనా బాధ్యత 198
✦ చెడును త్రుంచే, మంచిని పెంచే బాధ్యత 199
52. పాప పరిహారం 200
✦ హజ్ సీజన్‌లో జీవనోపాధి 203
53. ఐదురోజుల హజ్ సంక్షిప్త స్వరూపం 205
✦ మొదటిరోజు జిల్‌హజ్జ 8వ తేది 205
✦ రెండవరోజు జిల్‌హజ్జ 9వ తేది 206
✦ మూడవరోజు జిల్‌హజ్జ 10వ తేది 207
✦ నాల్గవరోజు జిల్‌హజ్జ 11వ తేది 208
✦ అయిదవరోజు జిల్‌హజ్జ 12వ తేది 208
54. మహిళా హాజీల సమస్యలు 208
55. బదులు హజ్ 210
56. మా తిరుగు ప్రయాణం 212
57. హాజీ ఎలా ఉండాలి? 214
✠ హ్జరత్ జునైద్ బగ్దాది (రహ్మలై) 216
58. హజ్ చేసివచ్చిన తరువాత? 218
✠ ధనవ్యామోహం 220
59. మృత్యువు తరుముకొస్తోంది 222
✠ జనాజా నమాజ్ 223
✠ కర్మవిచారణ కోసం సిద్ధంగా ఉండాలి 223

# ముందు మాట

కాబా ప్రతిష్ఠాలయం ఇచ్చే సందేశంలోని మొదటి అంశం హజ్ యాత్రే. స్తోమత ఉన్న ప్రతి ముస్లిం హజ్ చేయడం విధిగా నిర్ణయించబడింది. ఇస్లాం సౌధానికి ఉండే అయిదు మూలస్తంభాలలో హజ్ ఒకటి. ఇస్లాం పట్ల విశ్వాసం వ్యక్తపరుస్తూ "అల్లాహ్ తప్ప వేరే ఆరాధ్యుడు లేడని, ముహమ్మద్ (సల్లం) ఆయన నియమించిన ప్రవక్త అని సాక్ష్యం ఇవ్వడం మొట్టమొదటి మూలస్తంభం. కాగా అలా సాక్ష్యమిచ్చి ముస్లిం అయిన వ్యక్తి మిగతా నాలుగు మూలస్తంభాలలో ఏ ఒక్క దాన్ని నెరవేర్చకపోయినా మిగిలిన మూడింటిని నెరవేర్చడం వల్ల అతనికి ఎలాంటి ప్రయోజనం ఉండదని హదీసులు స్పష్టం చేస్తున్నాయి.

ముఖ్యంగా హజ్ నిర్వహణలో హాజీలు పాటించవలసిన జాగ్రత్తలను గురించి కూడా దైవప్రవక్త (సల్లం) తెలిపారు. వాటిని గురించి కూడా యాత్రికులు హజ్ యాత్ర జరపడానికి ముందుగానే తెలుసుకోవడం ఎంతో మంచిది. ఇస్లాం పేర్కొనే అంతర్జాతీయ సమతా సోదర భావాలు హజ్, ఉమ్రా విధుల నిర్వహణలోనే స్పష్టంగా వ్యక్తమవుతాయి. కనుక హాజీలు ఈ సమతా సౌభ్రాతృత్వాలకు ఏ మాత్రం విఘాతం కలిగించకుండా జాగ్రత్త వహించినప్పుడే వారి హజ్ విధిని సృష్టికర్త స్వీకరిస్తాడని ఆశించ గలుగుతారు.

లక్షలాది మంది యాత్రికులు ఒకే ప్రాంతంలో ఒకేసారి హజ్ విధులు నిర్వహిస్తున్నప్పుడు మనకు ఏ సందర్భంలోనైనా కాస్తో కూస్తో కష్టం కలగవచ్చు. ఆ మాత్రానికే సహనం కోల్పోవడం మోమిన్ (విశ్వాసి) లక్షణం అన్పించుకోదు. హజ్ నియమాలు కాస్త కుడి ఎడమ్‌గా ముందు చేయవలసిన పని వెనుక, వెనుక చేయవలసిన పని ముందుగా చేయడం వల్ల పెద్ద తప్పులేదు గాని, తోటి హాజీలకు బాధ కలిగించే చర్యలకు మాత్రం ఎట్టి పరిస్థితిల్లోనూ పాల్పడకూడదని దైవప్రవక్త (సల్లం) తాకీదు చేసి మరీ చెప్పారు. కనుక హాజీలు ఈ విషయాన్ని కూడా దృష్టిలో పెట్టుకొని సహనం, సంయమనాలతో మసలుకోవాలి.

కాబా యావత్తు ప్రపంచంలోనే మొట్టమొదట నిర్మించబడిన దైవగృహం. ఈనాడిది ఇరవై నాలుగు గంటలూ (Around the Clock) నిరంతరాయంగా దైవారాధన సాగుతున్న అంతర్జాతీయ ఆరాధనా కేంద్రమయి ప్రతి ఏడూ ప్రపంచంలోని నలుమూలల్లో ఉన్న లక్షలాది ముస్లింలను ఆకర్షిస్తోంది. అయితే ముస్లింలు హజ్ నియమాలు పాటించడమయితే చేస్తున్నారు గాని, ఆ నియమాల వెనుక కాబా ఇస్తున్న అసలు సందేశం ఏమిటో చాలా మంది గమనించడం లేదు. వారు ఆనవాయితీగా జరిపే ఈ హజ్ వల్ల వారిపై ఉన్న ఒక విధి అయితే నెరవేరుతుంది.



కాని కాబా ఇచ్చే సందేశం ఏమిటో పూర్తిగా అర్థం చేసుకోకుండా, ఆ సందేశం ప్రకారం మన జీవితాన్ని సంస్కరించుకోకుండా మల్కుల్‌మౌత్ దైవాజ్ఞ తీసుకొచ్చేవరకూ యాంత్రిక జీవితం గడుపుతూ ఉంటే, ఆ తరువాత పరలోక న్యాయస్థానంలో మనం ఊహించని దుష్పరిణామాలు ఏవైనా ఎదురయినప్పుడు మన పరిస్థితి ఏమవుతుంది? ఇది ఎంతో ఆలోచించవలసిన విషయం.

వీటన్నిటిని దృష్టిలో పెట్టుకొని "కాబా సందేశం" పేరుతో ఈ పుస్తకాన్ని ఎంతో విపులంగా వ్రాయడం జరిగింది. కాబాలయం నిర్మాత అయిన హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) దైవప్రవక్తగా మానవాళికి ఇచ్చిన క్రియాత్మక సందేశం, ఆ మహనీయుని 'మిషన్' లక్ష్యాలు ఏమిటో ఈ పుస్తకంలో వివరంగా పేర్కొనడం జరిగింది. వాటితో పాటు హజ్, ఉమ్రా విధులు నెరవేర్చే విధానాలు, ఆ విధులు నిర్వహించడంలో రచయితకు ఎదురైన అనుభవాలు కూడా ఇందులో పేర్కొనబడ్డాయి. ఇవే కాకుండా ఈ పుస్తకంలో సందర్భానుసారం తగిన ఫొటోలు, మరెన్నో ఆసక్తికరమైన విషయాలు కూడా ఉన్నాయి. ప్రత్యేకంగా ఉర్దూ చదవడంరాని తెలుగు ముస్లింల కోసం వ్రాయబడిన ఈ పుస్తకం హజ్‌యాత్రికుల కోసమే గాకుండా తెలుగు చదవగలిగే ప్రతి పాఠకునికీ ఎంతగానో ఉపయోగపడుతుందని ఆశిస్తున్నాను.

## రచనకు ఆధార గ్రంథాలు


(1) హజ్ ఔర్ ఉస్కే మసాయెల్.........మౌలానా ముహమ్మద్ యూసుఫ్ ఇస్లాహి

(2) ఖుత్బాతె హరం.............................మౌలానా అబుల్‌ఆలా మౌదూది

(3) మషాలె రాహ్................................మౌలానా గులాం ముహమ్మద్ మన్సూరి

(4) తారీఖె మదీనా మునవ్వరా...........మౌలానా సఫీవుర్రహ్మాన్, ముబారక్‌పూరి

(5) తారీఖె మక్కా ముకర్రమా............మౌలానా సఫీవుర్రహ్మాన్, ముబారక్‌పూరి

(6) హజ్ గైడ్-2006..అబ్దుర్రషీద్, చీఫ్ ఎగ్జిక్యుటివ్ ఆఫీసర్, హజ్‌కమిటి, ముంబయి

(7) అల్‌హసనాత్, 11/1972 ఖాస్ నంబర్......ముదీర్ మౌలానా అబ్దుల్ హై

(8) ఖుర్‌ఆన్ భావామృతం..................ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్, హైదరాబాద్-2

(9) ముహమ్మద్(స)ఆదర్శ జీవితం.......ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్, హైదరాబాద్-2

(10) అట్లాస్ ఆఫ్ది ప్రాఫెట్స్ బయోగ్రాఫి...డాక్టర్ షావ్‌ఖి అబూ ఖలీల్, సౌదీఅరేబియా


**అబుల్ ఇర్ఫాన్**
11-10-2006
(--రచయిత--)

కరుణామయుడు, కృపాసాగరుడయిన అల్లాహ్ పేరుతో ప్రారంభం

# కాబా సందేశం

సరిహద్దులులేని సువిశాల విశ్వంలో అదో బ్రహ్మాండమైన రోదసీ మైదానం!

ఆ మైదానంలో కోటానుకోట్ల మంది అశరీర మానవులతో కూడిన అసాధారణమైన మహాసభ!! కనీ వినీ ఎరగని గంభీరమైన వాతావరణంలో చిత్రవిచిత్ర సంకేతాలతో అలరారుతున్న అద్భుతమైన సన్నివేశం అది!!

చీమ చిటుక్కుమన్నా చెవులు చిల్లులు పడేటంతటి నిశ్శబ్దం!

అంతలో హఠాత్తుగా ఓ విశేష కాంతిపుంజం!!

అగోచర జీవుల అంతరంగాల నుండి అర్థంకాని భాషలో స్తుతి పలుకులు!!!

కటిక నిశ్శబ్దాన్ని క్రమంగా చీల్చుతూ గూబల నుండి గుండెల్లోకి దూసుకుపోయిన నభోవాణి....

"నేను మీ ప్రభువును కానా?"

"మీరు తప్పకుండా మా ప్రభువే" అదృశ్య నరుల అంతరాత్మ ఘోష.

"దీనికి నేను భూమ్యాకాశాలను, మీ తండ్రి (ఆదం)ని సాక్షులుగా చేస్తున్నాను. రేపు ప్రళయ దినాన మాకీ సంగతి తెలియదని చెప్పడానికి మీకు ఆస్కారంలేకుండా ఉండేందుకే (మీ చేత నేనీ ప్రమాణం చేయిస్తున్నాను). బాగా గుర్తుంచుకోండి. నేను తప్ప మరో ఆరాధ్యుడు లేడు; నేను తప్ప మరో ప్రభువు, పోషకుడు లేడు; కనుక మీరు ఎట్టి పరిస్థితిలోనూ ఎవరినీ నాకు సాటి కల్పించకూడదు. మీరు నా ముందు చేసిన ఈ ప్రమాణాన్ని మీకు జ్ఞాపకం చేయడానికి నేను మీ దగ్గరకు ప్రవక్తలను పంపిస్తుంటాను. మీ కోసం దివ్యగ్రంథాలను కూడా అవతరింపజేస్తాను" కాంతిపుంజం నుండి వెలువడింది పరబ్రహ్మ వాణి.

"“మేమిందుకు సాక్షులం. మీరే మాప్రభువు. మీరే మా ఆరాధ్యదైవం. మీరు తప్ప మాకు మరో ప్రభువుగాని, ఆరాధ్యదైవంగాని ఎవరూలేరు" అన్నారు ఆత్మల రూపంలో ఉన్న మానవులంతా ముక్తకంఠంతో.

మానవమాత్రుడయిన ఒక అధికారి పిలవగానే "యస్ బాస్!" అంటూ తక్షణమే వచ్చి వినయంగా నిల్చుంటాడు క్రిందిఉద్యోగి, ఆ అధికారి ఇవ్వబోయే ఆజ్ఞను శిరసావహించడానికి సిద్ధమవుతూ.

అదే పూర్వం హైదరాబాద్ నవాబు పిలిస్తే ముఖ్యమంత్రి సైతం 'జీ హుజూర్!' అంటూ పరుగెత్తుకు వచ్చి చేతులు కట్టుకొని మరీ నిలబడతాడు ఎంతో వినయ విన్యాసాలు చేస్తూ.



అలాంటప్పుడు సర్వసృష్టికర్త, సర్వాధికారి, ప్రభువు, పోషకుడయిన పరబ్రహ్మ పిలిచినప్పుడు ఆయన దాసులు ఆయన ఆజ్ఞలను శిరసావహించడానికి ఎంత వినయంతో, మరెంత తొందరపడవలసిందో ఆలోచించవలసిన విషయం కాదా?

నిస్సందేహంగా ఇదెంతో ఆలోచించవలసిన విషయం. అందుకే మానవులు తాము భౌతికంగా ఉనికిలోకి రాకముందే సృష్టికర్త ఆజ్ఞలను శిరసావహించడానికి తాము అనుక్షణం సిద్ధంగా ఉంటామని ప్రమాణంచేశారు. ఆ సమయం వచ్చినప్పుడు **"లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్, లబ్బైక్, లాషరీక్ లక లబ్బైక్, ఇన్నల్‌హమ్ద వనిఅ్‌మత, లక వల్‌ముల్‌క లాషరీక లక"** (నేను హాజరయ్యాను దేవా! నేను హాజరయ్యాను, నీ సన్నిధిలో హాజరయ్యాను. నీకు సాటి ఎవరూ లేరు, నేను హాజరయ్యాను. నిస్సందేహంగా నీవే ప్రశంసనీయుడవు. సమస్త వరప్రసాదాలకు నీవే అర్హుడవు. రాజ్యాధికారం కూడా నీదే. నీకు సాటి ఎవరూ లేరు.) అంటూ ఆయన ఆదేశాలను పాటించడానికి ముందుకు రావలసి ఉంటుంది.

## 1. సృష్టికర్త ముందు ప్రమాణం

కాబాయాత్రకు బయలుదేరే యాత్రికులు ఇదే నినాదంతో మక్కా చేరుకుంటారు. హజ్ నియమాలు ఆచరిస్తూ వివిధ పుణ్యస్థలాలు పర్యటించే సందర్భంలో కూడా ఈ నినాదాన్ని పాటిస్తారు. నాలుగు వేల సంవత్సరాల క్రితం ఇబ్రాహీం ప్రవక్త (అలైహి) ఇచ్చిన పిలుపుకు ప్రతిస్పందనే ఈ నినాదం. ఈ నినాదం వెనుక మానవులు తామీ లోకంలోకి రాకముందు విశ్వప్రభువు ముందు చేసిన ప్రమాణం ఉంది. కాబా యాత్రికులు ఆ ప్రమాణాన్ని ఓసారి గుర్తుచేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. దాన్ని గురించి ఖుర్ఆన్ ఇలా తెలియజేస్తోంది:

"నీ ప్రభువు ఆదంసంతతి వీపుల నుండి వారి భావితరాలను తీసి ప్రమాణం చేయించిన సందర్భం. అప్పుడు మేము వారికి వారినే సాక్షులుగా పెడుతూ 'నేను మీ ప్రభువుని కానా?' అని అడిగాము. దానికి వారు 'మీరే మా ప్రభువు. అందుకు మేమే సాక్షులం' అన్నారు."

"మేమిలా చేయడానికి కారణం, రేపు ప్రళయదినాన మీరు 'మాకీ విషయం తెలియద'ని చెప్పవచ్చు. లేదా 'బహుదైవారాధన మాకు పూర్వం మా తాత ముత్తాతలు ప్రారంభించారు. మేము ఆ తరువాత వారి సంతతి నుండి పుట్టాము. అలాంటప్పుడు దుర్జనులు చేసిన ఈ తప్పుకు మమ్మల్ని పట్టుకుంటారా?' అని చెప్పవచ్చు. వారు సన్మార్గం వైపు మరలుతారన్న ఉద్దేశ్యంతో మేమిలా మా సూక్తులు విడమరచి తెలుపుతున్నాము." (ఖుర్ఆన్- 2:172-174)

సకల చరాచరాలకు సృష్టికర్త, దేవుడు ఒకడున్నాడని, ఆయనే అందరి ప్రభువు, పోషకుడని ప్రతి మానవుని అంతరాత్మ ప్రబోధిస్తుంది. ఈ భావన అతని ఆంతర్యంలో సహజంగానే వేళ్ళూనుకొని ఉంది. దానిక్కారణం మానవుడ్ని సృష్టించే సమయంలోనే

దేవుడు ప్రళయం వరకు పుట్టబోయే మానవులందరి ఆత్మలను సమావేశపరచి, ఈ విషయం గురించి వారిచేత ప్రమాణం చేయించడమే.

కనుక ఏ మానవుడు కూడా తనకు ఏక దైవారాధనను గురించి తెలియదని; తన తాతముత్తాతల మతాచారాలు, తన చుట్టూ ఉండిన పరిస్థితులు, పరిసరాల ప్రభావం వల్ల తాను దేవుని ఏకత్వాన్ని గుర్తించలేక పోయానని, అందువల్ల తన మార్గ భ్రష్టతకు తాను బాధ్యుడ్ని కానని, దైవన్యాయస్థానంలో చెప్పలేడు. ఏక దైవారాధనా భావం ప్రతి మానవుని అంతఃచేతనలో నిక్షిప్తమయి ఉంది. దౌర్జన్యం, అబద్ధం, వ్యభిచారం, పాపకార్యాలన్న భావన మానవుని నైజంలో ఎలా వేరుగొనిఉందో, బహు దైవారాధన కూడా పాపకార్యమన్న భావన అతని నైజంలో ఉంది.

పోతే ఈ ప్రమాణాన్ని మానవులకు గుర్తు చేయించి రుజుమార్గం చూపడానికి దేవుడు ప్రతి యుగంలో, ప్రతి జాతిలో తన ప్రవక్తలను ఉద్భవింపజేస్తూ వచ్చాడు. అయితే దాంతోపాటు ఆయన స్వయంగా తన ప్రత్యర్థి అయిన షైతాన్‌ని సృష్టించి, వాడి పట్ల అప్రమత్తులయి ఉండాలని తన ప్రవక్తల ద్వారా మానవుల్ని హెచ్చరించే ఏర్పాటు కూడా చేశాడు. అందరికంటే చివర్లో వచ్చిన అంతిమ దైవప్రవక్త మహనీయ ముహమ్మద్ (సల్లం) కూడా షైతాన్‌ని గురించి మానవుల్ని హెచ్చరించారు.

## 2. ఇబ్రాహీం (అలైహి) ధర్మం

హజ్ లేక కాబాయాత్ర ప్రస్తావనకు వచ్చినప్పుడు ముస్లింల హృదయాలలో హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) పేరు అప్రయత్నంగా మెదలుతుంది. హజ్రత్ ఇబ్రాహీం (అలైహి)ని ముస్లింలు దైవప్రవక్తగా విశ్వసిస్తారు. ముస్లింలే కాదు క్రైస్తవులు, యూదులు కూడా ఆ మహనీయుడ్ని దైవప్రవక్తగానే నమ్ముతారు. 1400 సంవత్సరాల పూర్వంవరకూ అరబ్ బహుదైవారాధకులు సైతం హజ్రత్ ఇబ్రాహీం (అలైహి)ని యుగపురుషుడిగా, మహనీయుడిగా విశ్వసించేవారు.

కాని అరబ్బులు కాలక్రమంలో ఇబ్రాహీం ప్రవక్త (అలై) బోధనలను మరచిపోయి, ఆయన విగ్రహాన్ని చేసుకొని పూజించడం ప్రారంభించారు. రెండున్నర వేల సంవత్సరాల దాకా, అంటే అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) వచ్చేవరకూ వారి పరిస్థితి ఇలాగే కొనసాగింది. ఇక యూదులు, క్రైస్తవులైతే హజ్రత్ ఇబ్రాహీం (అలై) తర్వాత హజ్రాత్ మూసా, ఈసా (అలై) ప్రవక్తలు తెచ్చిన బోధనలను తారుమారు చేసి పక్కదారులుపట్టారు. ఇబ్రాహీంప్రవక్త (అలై) ఏనాడూ దైవేతరశక్తుల్ని ఆరాధించ లేదు. ఆయన విశ్వప్రభువుకు పూర్తిగా విధేయుడైన ఏకదైవారాధకుడు.

"యూదులయిపోతే సన్మార్గంలో ఉంటారని యూదులు, క్రైస్తవులుగా మారితేనే రుజుమార్గం లభిస్తుందని క్రైస్తవులు అంటారు. వారికి చెప్పు: 'ఇబ్రాహీం అనుచర సముదాయమే సన్మార్గంలో ఉంది. ఇబ్రాహీం స్వచ్ఛమైన ఏకదైవారాధకుడు, బహు దైవారాధకుడు కాదు." (ఖుర్ఆన్-2:135)



ఇబ్రాహీం ప్రవక్త (అలైహి) ఏకదైవారాధన గురించే ప్రజలకు ఉపదేశిస్తూ ప్రచారం చేశారు. ఏకదైవారాధన కోసమే ఆయన జీవితాంతం అవిశ్రాంత పోరాటం జరిపారు. ఏకదైవారాధన కోసమే ఆయన ఎన్నో త్యాగాలు కూడా చేశారు.

ఆ ఏకదైవారాధనకు సంబంధించిన ధర్మమే ఇస్లాం. హజ్రత్ ఇబ్రాహీం (అలై) ఏకదైవారాధనా భావనను సర్వసామాన్యం చేయడానికి, ఇస్లాం సంస్థాపన కోసం పడిన శ్రమ-కష్టాలు, చేసిన కృషి-త్యాగాలు అసాధారణమైనవి. అవి ముస్లింలకు, ముఖ్యంగా హాజీలకు ఎంతో అనుసరణనీయమైనవి. హజ్రత్ ఇబ్రాహీంతో పాటు దైవప్రవక్త లంతా మౌలికంగా ఏకదైవారాధన గురించే మానవులకు బోధించారు. దాని కోసం సృష్టిలో మానవుని అసలు స్థానం, అతనికి దేవునికి ఉన్న వాస్తవ సంబంధం ఏమిటో కూడా వారు తెలియజేశారు. ఇక్కడ ముందుగా వాటిని గురించి తెలుసుకుందాం.

## 3. మహోత్కృష్ట జీవి

యావత్తు సృష్టిరాసుల్లో మానవుడే మహోత్కృష్టుడైన జీవుడు. ఈ కారణంగానే దైవదూతలు సైతం ఆదిమానవుడు ఆదం ముందు వినయంతో వంగి అభివాదం చేశారు. అంతేగాక తెలివితేటల్లో, శక్తిసామర్థ్యాలలో కూడా మానవుడే అందరికన్నా మిన్న. ఖుర్ఆన్‌లోని ఈ సూక్తులు చూడండి:

"నీ ప్రభువు దైవదూతలతో 'భూలోకంలో నేనొక ఖలీఫా (ప్రతినిధి)ని నియమించబోతున్నా'నని అన్నప్పుడు దైవదూతలు ఏమన్నారో తెలుసా? 'ఏమిటీ...! మీరు ప్రపంచ వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసి, రక్తపాతానికి వడిగట్టేవాడ్ని భూలోకంలో నియమించబోతున్నారా? మేము మిమ్మల్ని అనుక్షణం స్తుతిస్తూ, మీ పవిత్రతను కొనియాడుతూనే ఉన్నాం కదా?' అని అన్నారు. దానికి దేవుడు "మీకు తెలియని విషయాలెన్నో నాకు తెలుసు' అన్నాడు." (2:30).

"ఆ తరువాత ఆయన ఆదంకు సమస్త వస్తువుల పేర్లు తెలియజేశాడు. ఆపై వాటిని దైవదూతల ముందు ప్రవేశపెట్టి 'మీ అభిప్రాయం సరైనదయితే కాస్త ఈ వస్తువుల పేర్లేమిటో చెప్పండి' అని అడిగాడు." (2:31)

"మీరు పరిశుద్ధులు, మీరు మాకు తెలియజేసినంత మేరకే మాకు తెలుసు. దానికి మించి ఒక్క విషయం కూడా మాకు తెలియదు. వాస్తవానికి మీరే అన్నీ తెలిసినవారు, వివేకవంతులు' అన్నారు దైవదూతలు." (2:32)

"తర్వాత దేవుడు ఆదంతో 'ఈ వస్తువుల పేర్లేమిటో చెప్పు' అన్నాడు. ఆదం వాటి పేర్లన్నీ తెలియజేశాడు. అప్పుడు దేవుడు దైవదూతలతో ఇలా అన్నాడు: 'భూమ్యాకాశాల్లో గుప్తంగా వున్న సమస్త విషయాలు నాకు తెలుసని నేను ముందే మీతో అనలేదా? మీరు పైకి వెలిబుచ్చే, లోనదాచే విషయాలు సైతం నాకు తెలుసు." (2:33)

"ఆతర్వాత మేము ఆదంకు గౌరవసూచకంగా అభివాదం చెయ్యండని దైవదూతలను ఆదేశించాము. అప్పుడు ఇబ్లీసు తప్ప అందరూ అభివాదం చేశారు. ఇబ్లీసు తనేదో

గొప్పవాణ్ణన్న అహంకారంతో విర్రవీగుతూ, తిరస్కరించి అవిధేయుడైపోయాడు." (2;34)

"(ఇబ్లీస్!) నేను ఆజ్ఞాపించినా (నువ్వెందుకు అభివాదం చేయలేదు?) ఏ విషయం నిన్ను అభివాదం చేయకుండా నిరోధించింది?' మేము ప్రశ్నించాము."

"దానికి వాడు 'నేను ఇతనికంటే శ్రేష్ఠుడ్ని. నీవు నన్ను అగ్నితో సృష్టించావు. అతడ్ని (ఎలాంటి విలువలేని) మట్టితో సృజించావు' అన్నాడు." (7:12)

"అలాగానా! అయితే నీవిక్కడ్నుంచి దిగిపో. ఇక్కడ అహంకారంతో విర్రవీగడానికి నీకెలాంటి హక్కులేదు. వెళ్ళిపో ఇక్కడ్నుంచి. నీవు (మా ఆదేశాన్ని ధిక్కరించి) పరమ నీచుడవయి పోయావు' అన్నాము మేము." (7:13)

"అయితే (దేవా!) మానవులు మళ్ళీ బ్రతికించబడే వరకు నాకు గడువునివ్వు' అన్నాడు (ఇబ్లీసు). 'అలాగే ఇస్తున్నాం వెళ్ళు' అన్నాము (మేము)." (7:14,15)

"సరే, నీవు నన్ను ఏవిధంగా మార్గభ్రష్టుడ్ని చేశావో, నేను కూడా మానవ జాతిని దారి తప్పించడానికి నీ రుజుమార్గంలో మాటువేసి కూర్చుంటాను. వీరిని ముందు నుంచి, వెనుక నుంచి, కుడి నుంచి, ఎడమ నుంచి అన్ని వైపుల నుంచీ చుట్టు ముట్టుతాను. వీరిలో చాలా మందిని నీవు విశ్వసనీయులుగా, కృతజ్ఞులుగా చూడలేవు' అన్నాడు ఇబ్లీసు." (7:16,17)

"ఓరి నీచుడా! శాపగ్రస్తుడవయి ఇక్కడ్నుంచి వెళ్ళిపో. (బాగా విను,) నీతో సహా నిన్ను అనుసరించే వారందర్నీ నరకంలోకి విసరివేస్తాను." (7;18)

"ఆదం! నీవు, నీభార్యా స్వర్గంలో నివసించండి. ఇక్కడ మీరు కోరిందల్లా తింటూ హాయిగా ఉండండి. అయితే (అదిగో) ఆ చెట్టు దగ్గరికి మాత్రం వెళ్ళకండి. వెళ్ళారా, మీరు దుర్మార్గులలో చేరిపోతారు' అన్నాము మేము." (7:19)

"ఆ తర్వాత షైతాన్ వారి ఆచ్ఛాదిత మర్మావయవాలను పరస్పరం వారి ముందు బహిర్గతం చేయడానికి మాయమాటలతో వారిని మభ్యపెట్టాడు. వాడు (వారి దగ్గరకు వెళ్ళి) 'మీ ప్రభువు మిమ్మల్ని ఆచెట్టు దగ్గరికి పోవద్దని ఎందుకన్నాడో తెలుసా? మీరు దైవదూతలైపోతారని, లేదా శాశ్వత (స్వర్గ)జీవితం లభిస్తుందని దాని దగ్గరకు పోనివ్వ కుండా మిమ్మల్ని వారించాడు' అని చెప్పాడు. పైగా వాడు ప్రమాణంచేసి మరీ 'నేను మీకు నిజమైన శ్రేయోభిలాషిని (నామాట నమ్మండి)' అని నమ్మబలికాడు." (7:20,21)

"ఈవిధంగా వాడు మోసపుటెత్తుగడలతో వారిద్దర్నీ తన వలలో వేసుకున్నాడు. చివరికి వారిరువురు (నిషేధిత) వృక్షాన్ని రుచిచూశారు. దాంతో వెంటనే వారి మర్మావ యవాలు ఒకరి ముందు మరొకరివి బహిర్గతమయి పోయాయి. వారు (సిగ్గుతో బిక్క చచ్చిపోయి) స్వర్గంలోని ఆకులతో తమ దేహాలను కప్పుకోవడానికి ప్రయత్నించారు."

"అప్పుడు వారిప్రభువు 'నేను మిమ్మల్ని ఆ చెట్టు వద్దకు పోవద్దని వారించలేదా? షైతాన్ మీకు బద్ధవిరోధి అని చెప్పలేదా?' అని అడిగాడు."



"ప్రభూ! (మేము ఆత్మవంచనకు పాల్పడి) మాకు మేమే అన్యాయం చేసుకున్నాం. (ఇక నీవే మాకు దిక్కు.) నీవు మమ్మల్ని కనికరించి క్షమించకపోతే మేము సర్వనాశనమై పోతాం' అన్నారు వారిద్దరూ (పశ్చాత్తాపంతో కుమిలిపోతూ)." (7:22,23)

"దిగిపోండి. మీరంతా ఒకరికొకరు శత్రువులు. మీరు ఒక నిర్ణీతకాలం వరకు భూ లోకంలో గడపవలసిఉంది. అక్కడ మీకు నివాసం, జీవనోపాధి (వగైరా) సదుపాయా లున్నాయి. అక్కడే మీరు జీవించాలి, అక్కడే చనిపోవాలి. చివరికి అక్కడ నుంచే మిమ్మల్ని తిరిగి లేపడం జరుగుతుంది' అన్నాము మేము." (7:24,25)

"ఆదం సంతానమా! (షైతాన్ చేష్టల పట్ల అనుక్షణం అప్రమత్తంగా ఉండండి.) వాడు మీ తల్లిదండ్రుల్ని మభ్యపెట్టి స్వర్గం నుండి తీసివేయించాడు. ఒకరి మర్మావయ వాలు మరొకరి ముందు బహిర్గతం కావడానికి వారి దుస్తులు తొలగించాడు. జాగ్రత్త! ఆవిధంగా వాడు మిమ్మల్ని కూడా మాయమాటలతో మభ్యపెట్టవచ్చు. వాడు, వాడి అనుచరమూకలు మిమ్మల్ని మీరుచూడని వైపు నుండి చూస్తారు. ఈ పిశాచమూకలను మేము విశ్వసించని వారికి సహచరులుగా, సంరక్షకులుగా చేశాము." (7:27)

"ఈవిధంగా మేము మిమ్మల్ని సృష్టించి మీకు రూపురేఖలను కల్పించిన తర్వాత ఆదంకు గౌరవసూచకంగా అభివాదం చేయండని దైవదూతల్ని ఆదేశించాం. మా ఆదేశం పాటిస్తూ అందరూ అభివాదంచేశారు ఒక్క ఇబ్లీసు తప్ప. అతను అభివాదం చేసేవారిలో చేరలేదు." (ఖుర్ఆన్-7:11)

ఇక్కడ గౌరవసూచకంగా ఆదంకు అభివాదం చేయండంటే ఆదంకు మాత్రమే ఒక వ్యక్తిగా అభివాదం చేయమని అర్థంకాదు. యావత్మానవాళికి ప్రాతినిధ్యం వహించే మానవుడిగా ఆదంకు అభివాదం చేయమని అర్థం. దేవుడు మానవుడ్ని సర్వోత్కృష్ట జీవిగా సృష్టించి, తన వైపున ఆజ్ఞలు పాలిస్తూ జీవితవ్యవహారాలు చక్క బరిచే ప్రతినిధిగా నియమించడంతో పాటు, ప్రాతినిధ్య బాధ్యతలు నిర్వహించడానికి కావలసిన సంపూర్ణ జ్ఞానసంపత్తి కూడా అతనికి ప్రసాదించాడు. కనుక అలాంటి సర్వోత్కృష్ట జీవికి గౌరవ సూచకంగా మీరంతా అతని ముందు తలవంచి లొంగి పొమ్మని దీని అర్థం.

దీన్నిబట్టి మానవుడు తనపై దేవుడు మోపిన ప్రాతినిధ్యబాధ్యతల్ని సక్రమంగా, సంపూర్తిగా జీవితాంతం నిర్వహిస్తే అతను నిజంగా సర్వోత్కృష్టుడిగా, దైవదూతల కంటే ఉన్నతుడిగా భాసిల్లగలడు. ఆబాధ్యతలు నిర్వహించకుండా, మనోవాంఛలకు బానిసయి విశృంఖల జీవితం గడిపితే అతనికన్నా నికృష్టజీవి ప్రపంచంలో మరొకటి ఉండదు. చివరికి చీమలు, దోమలకన్నా అధోగతిపాలవుతాడు.

చీమలు, దోమలు, పశువులు, పక్షులు మొదలైన జీవరాసులపై ఇలాంటి బాధ్యతలు లేవు. వాటిని కూడా దేవుడు మానవుని సేవకోసమే సృష్టించాడు. మరణా నంతరం వాటికి స్వర్గ నరకాలు ఉండవు. అందువల్ల ప్రాతినిధ్య బాధ్యతలు

నిర్వహించకుండా నేరస్థుడిగా మారిన మానవుడికన్నా ఈ అల్పజీవులే మిన్న.

"మేము ఆదం సంతతికి గౌరవప్రతిష్ఠలు ప్రసాదించాము. వారికి నేలపై, నీటిపై ప్రయాణం చేయడానికి వాహనాలు, తినడానికి పరిశుద్ధమయిన ఆహారపదార్థాలు ఇచ్చాము. మేము సృష్టించిన అనేక సృష్టితాలపై వారికి ఎంతో ఆధిక్యత, ఔన్నత్యాలు ప్రసాదించాం." (ఖుర్ఆన్–17:70)

"మానవులారా! మీ ఆరాధ్యదైవం ఒక్కడే. కరుణామయుడు, కృపాసాగరుడయిన ఆ దేవుడు తప్ప మరోదేవుడు లేనేలేడు. భూమ్యాకాశాల సృజనలో, రేయింబవళ్ళ చక్ర భ్రమణంలో, సముద్రాలలో పయనిస్తూ మానవులకు ప్రయోజనం చేకూర్చే ఓడలలో, దేవుడు పైనుంచి కురిపించే వర్షపు నీటిలో, తద్వారా ఆయన మృతభూమికి జీవం పోసే (చెట్లూ చామల్ని పచ్చదనం చేసే) పనిలో, పుడమిపై పలువిధాల జీవరాసుల్ని విస్తరింప జేసే ఆయన సృష్టి నైపుణ్యంలో, గాలుల సంచారంలో, నేలకు నింగికి మధ్య నియమ బద్ధంగా సంచరించే మేఘాలలో బుద్ధిమంతులకు (దేవునిఆస్తిత్వం, ఆయన ఏకత్వాన్ని తెలిపే) అనేక నిదర్శనాలు ఉన్నాయి." (ఖుర్ఆన్–2:163,164)

"అయితే (సృష్టిలో దేవుని ఏకత్వాన్ని తెలిపే ఎన్నో నిదర్శనాలు కళ్ళెదుట కన్పిస్తున్నా) కొందరు నిజదేవుడ్ని వదలి, మిధ్యాదైవాలను పట్టుకు వ్రేలాడుతున్నారు. పైగా వారు వాటిని నిజదేవుడ్ని అభిమానిస్తున్నట్లు అమితంగా అభిమానిస్తున్నారు. విశ్వాసులు మాత్రం అందరికన్నా (నిజదేవుడైన) అల్లాహ్‌నే అధికంగా అభిమానిస్తున్నారు. దుర్మార్గులు (నరక)యాతన చూసినప్పుడు 'సర్వశక్తులు, సర్వాధికారాలు అల్లాహ్‌కే ఉన్నాయని, ఆయన అతి కఠినంగా శిక్షించేవాడని' తెలుసుకుంటారు. ఆ విషయం వారు (ఈనాడే) తెలుసుకుంటే బాగుంటుంది." (ఖుర్ఆన్–2:165)

## 4. దుష్టశక్తి (షైతాన్) ఆరాధన

మంచి, చెడులకు సంబంధించిన స్పృహ మానవుని ప్రవృత్తిలోనే వేరుగొని ఉంది. మంచికి ప్రతిరూపం దేవుడు. చెడుకు ప్రతిరూపం షైతాన్ (ఇబ్లీస్). దేవుడు ప్రసాదించిన స్వేచ్ఛను మానవుడు దుర్వినియోగం చేయకుండా జీవితాంతం ఆయన చూపిన రుజుమార్గం అనుసరిస్తే అతను పరలోకంలో మోక్షానికి అర్హుడవుతాడు. అలా కాకుండా అతను విశృంఖుల స్వేచ్ఛతో మనోవాంఛలకు బానిసై, చెడుకు ప్రతి రూపమైన షైతాన్ ఆడించినట్లు ఆడుతూ, సృష్టితాలను పూజిస్తూ అవినీతి, అధర్మ కార్యకలాపాలలో మునిగిపోతే మాత్రం పరలోకంలో దైవాగ్రహానికి గురయి నరక కూపంలో పడిపోతాడు.

"ఆదం సంతానమా! షైతాన్‌ని ఆరాధించవద్దని, వాడు మీకు బహిరంగ శత్రువని నేను మిమ్మల్ని హెచ్చరించలేదా? నన్నే ఆరాధించాలని, అదే రుజుమార్గమని ఉపదేశించ లేదా? అయినా వాడు మీలో అత్యధిక మందిని దారి తప్పించాడు. మీకా (మాత్రం) జ్ఞానం లేదా?" (ఖుర్ఆన్–36:60–62)



ఈ సూక్తిలో 'ఆరాధన' అనే పదాన్ని విధేయతా భావంలో ప్రయోగించబడింది. సాధరణంగా షైతాన్‌ని ఎవరూ పూజించరు. అతని ఆజ్ఞలను మాత్రం శిరసావహిస్తారు. మానవులకు దేవుడు తన ప్రవక్తల ద్వారా ఆజ్ఞలు జారీచేశాడు. కాని అనేకమంది మానవులు షైతాన్ ప్రేరణతో దేవుని ఆజ్ఞలు త్రోసిపుచ్చి, ఇతరుల ఆజ్ఞలు పాటిస్తారు. ఉదాహరణకు, వడ్డీ వ్యవస్థను అంతమొందించాలని దేవుడు ఆజ్ఞాపిస్తున్నాడు. షైతాన్ దానికి వ్యతిరేకంగా ప్రచారంచేస్తూ, వడ్డీ వల్ల బోలెడు లాభాలున్నాయని; అసలీ వడ్డీ వలనే పేదవాడి నడ్డి విరగొట్టయినా సరే నువ్వు మేడలు కట్టగలవు, స్వర్గభోగాలు అనుభవించగలవు అని ధనికుడ్ని ఉసిగొల్పుతాడు; వడ్డీయే దేశప్రగతికి రాచబాట నిర్మిస్తుందని పాలకులను ప్రేరేపిస్తాడు.

ఇలా మానవుడు షైతాన్‌కు భక్తుడయిపోతాడు. ఒక ఉద్యోగి తన పైఅధికారిని ప్రసన్నం చేసుకొని ప్రయోజనాలు పొందడానికి అతను చెప్పిన పనల్లా, చివరికి అతని సొంతపనులు కూడా చేస్తాడనుకుందాం. అప్పుడు మనం "అతనా... అతను మేనేజర్ గారి భక్తుడండీ!" అంటాం. అలాగే ఈ సూక్తిలో కూడా దేవుడు, షైతాన్ పట్ల విధేయతా భావాన్ని షైతాన్ ఆరాధనతో పోల్చుతున్నాడు. అంటే దేవుని ఆజ్ఞలకు, ఆయన ప్రవక్త హితవులకు వ్యతిరేకంగా దైవేతరులు చెప్పే మాటలు పాటిస్తే, అది షైతాన్ ఆరాధన క్రిందికి వస్తుందన్న మాట.

మానవుడు షైతాన్ చేసే మోసాలకు, వాడి ప్రలోభాలకు గురికాకుండా ఉండా లంటే దేవుడు తనప్రవక్తల ద్వారా పంపే ఆజ్ఞలు పాటిస్తూ నీతిమంతమైన జీవితం గడప వలసి ఉంటుంది. ఇలా మానవుడు జీవితాంతం ప్రాతినిధ్య బాధ్యతలు నిర్వహించడం ద్వారా సర్వోత్కృష్టజీవి అయి దైవప్రసన్నతను, తన అసలు నివాసమైన స్వర్గధామాన్ని పొందగలడు. ఖుర్ఆన్‌లోని ఈ సూక్తులు గమనించండి:

"మానవులారా! మీరు లోకంలో లభించే ధర్మసమ్మతమైన పరిశుద్ధ పదార్థాలే తినండి. షైతాన్ అడుగుజాడలలో నడవకండి. వాడు మీకు ఆగర్భశత్రువు. మిమ్మల్ని వాడు దుష్ట కార్యాలకు, అశ్లీల చేష్టలకు పురిగొల్పుతాడు. దేవుని విషయంలో మీకే మాత్రం తెలియని విషయాల్ని గురించి దేవునిపేర పలకమని మిమ్మల్ని పురిగొల్పుతాడు." (ఖుర్ఆన్–2:168,169)

"విశ్వసించిన ప్రజలారా! ఇస్లాంలో పూర్తిగా ప్రవేశించండి. షైతాన్ అడుగు జాడలలో నడవకండి. వాడు మీకు ఆగర్భశత్రువు. స్పష్టమైన బోధనలు అందినప్పటికీ మీరు తిరిగి తప్పటడుగులు వేస్తే మటుకు, బాగా తెలుసుకోండి! దేవుడు సర్వశక్తి మంతుడు, సర్వం తెలిసిన మహావివేకి." (ఖుర్ఆన్–2:208,209)

"దేవుని పేరు స్మరించకుండా కోసిన పశువును తినకండి. అలా తినడం పాపం. పైశాచిక శక్తులు తమ అనుచరుల హృదయాల్లో లేనిపోని అనుమానాలు రేకెత్తించి వారిని మీపై ఉసిగొల్పుతాయి. వారి మాటలు విని నడచుకుంటే మీరు కూడా బహుదైవారాధకులయి పోతారు." (ఖుర్ఆన్–6:121)

"కరుణామయుని బోధన, ప్రస్తావనల పట్ల ఏమరుపాటు వహించినవాడిపై మేము ఒక పిశాచ శక్తిని రుద్దుతాం; అది అతనికి సహచరి అయిపోతుంది. అలాంటి వ్యక్తులను ఈ పిశాచ శక్తులు సన్మార్గంలోకి రాకుండా నిరోధిస్తుంటాయి. దాంతో వారు తాము చేస్తున్న పని సముచితమైనదేనని భావిస్తుంటారు." (ఖుర్ఆన్-43:36,37)

"ఈవిధంగా చివరికా వ్యక్తి మా దగ్గరకు చేరుకుంటాడు. అప్పుడతను తన పిశాచ సహచరునితో 'అయ్యయ్యో! నీకూ నాకూ మధ్య తూర్పు పడమరలంత దూరం ఉంటే ఎంత బాగుండేది! నీవు నాకు అతి చెడ్డ స్నేహితుడిగా దొరికావు' అని అంటాడు (పశ్చాత్తాపపడుతూ). అప్పుడు వారికి (దైవదూతలు) 'మీరు దుర్మార్గపు పనులు చేశారు గనక, ఈరోజు మీకెలాంటి సహాయం లభించదు. మీరంతా శిక్షలో సమానులే' అని చెబుతారు." (ఖుర్ఆన్-43:38,39)

"సత్యాన్ని ధిక్కరించిన ప్రతి కృతఘ్నుడ్నీ నరకంలో పడవేయండి. వాడు సత్కార్యాలు స్వయంగా చేయకపోవడమే గాకుండా ఇతరుల్ని కూడా నిరోధించేవాడు. హద్దుమీరి పోయేవాడు. తాను అనుమానంలో పడిపోవడమే గాకుండా ఇతరులలో కూడా అనుమానాలు రేకెత్తించేవాడు. దేవునితో పాటు దైవేతరశక్తుల్ని ఆరాధించేవాడు. పడేయండి వాడ్ని భీకర (నరక)యాతనలో' అని ఆజ్ఞవుతుంది."

"(ఆవ్యక్తి దేవుని ముందు షైతాన్‌ని ఆడిపోసుకుంటూ, ఈ దుర్మార్గుడు తన వెంటబడి తనను సర్వనాశనం చేశాడని ఆరోపించినప్పుడు) అతని సహచరుడు (ఈ ఆరోపణను ఖండిస్తూ) 'మహాప్రభో! నేనితడ్ని తిరుగుబాటుకు ప్రేరేపించలేదు. ఇతను తనంతటతానే మార్గభ్రష్టత్వంలో పడి చాలా దూరం కొట్టుకుపోయాడు' అని అంటాడు.

"దానికి 'నా ముందు వాదించకండి. నేను ముందే దుష్పర్యవసానం గురించి మిమ్మల్ని హెచ్చరించాను. నా దగ్గర మాట మారదు. నేను నా దాసులకు అన్యాయం చేసేవాడ్ని కాను' అని సమాధానం లభిస్తుంది." (ఖుర్ఆన్-50:24-29)

"వారక్కడ (అక్కసు వెళ్ళబుచ్చుకుంటూ) 'ప్రభూ! మమ్మల్ని పెడదారి పట్టించిన మానవుల్ని, జిన్నుల్ని మాకు చూపించు. వారిని మేము కాళ్ళక్రింద పడేసి (కసితీరా) తొక్కి అవమానపరుస్తాం' అనంటారు." (ఖుర్ఆన్-41:29)

"పాపాత్ములారా! ఈరోజు మీరు (మా నుంచి) తొలగి దూరంగా ఉండండి... ఆదం సంతానమా! షైతాన్‌ని ఆరాధించవద్దని, వాడు మీకు బహిరంగ శత్రువని నేను మిమ్మల్ని హెచ్చరించలేదా? నన్నే ఆరాధించాలని, అదే రుజుమార్గమని ఉపదేశించ లేదా? అయినా వాడు మీలో అత్యధిక మందిని దారి తప్పించాడు. మీకా (మాత్రం) జ్ఞానం లేదా? నరకమంటే ఇదే. దీన్ని గురించే మిమ్మల్ని లోగడ హెచ్చరించడం జరిగింది. ఇహలోకంలో అవలంబించిన తిరస్కార వైఖరికి పర్యవసానంగా ఈరోజు మీరు దీనికి సమిధలయి పోండి". (ఖుర్ఆన్-36:59-64)

"తీర్పు ముగిసిన తర్వాత షైతాన్ వారితో ఇలా అంటాడు: 'మీకు దేవుడు చేసిన



వాగ్దానాలన్నీ నిజమయ్యాయి. కాని నేను చేసిన వాగ్దానాలలో ఒక్కటీ నిజం కాలేదు. అసలు మీచేత బలవంతంగా ఏదైనా చేయించడానికి మీమీద నాకేదైనా శక్తి ఉంటే కదా! నేను మిమ్మల్ని నామార్గం వైపుకు పిలిచాను. అంతే, మరేమీ చేయలేదు. మీరే నా పిలుపుకు స్పందించి వచ్చారు. కనుక మీరిప్పుడు అనవసరంగా నన్ను నిందించకండి. మిమ్మల్ని మీరే నిందించుకోండి. ఇక్కడ మీ గోడు నేను ఆలకించలేను; నా గోడు మీరు ఆలకించలేరు. ఇంతకు ముందు (ఇహలోకంలో) మీరు నన్ను దేవునికి సాటి కల్పించారు. (నాక్కూడా దైవత్వం ఆపాదించారు. అది మీ పనేగాని, నాపని కాదు.) నేను దీన్ని ఖండిస్తున్నాను. అలాంటి దుర్మార్గులకు తప్పకుండా ఘోరమైన శిక్ష పడుతుంది." (ఖుర్ఆన్-14:22)

కాబట్టి మానవులు దైవప్రవక్తల హితోపదేశాలు పాటిస్తూ షైతాన్ పెట్టే భయప్రలోభాల పట్ల సదా అప్రమత్తులయి ఉండాలని పై సూక్తుల్ని బట్టి తెలుస్తోంది.

## 5. మానవోత్కృష్టతకు తగని బలహీనతలు

అదీగాక మానవుడు ఒక్క సృష్టికర్త ముందు తప్ప సృష్టితాల ముందు సాష్టాంగ పడటం, పూజించడం, సృష్టికర్త ఆజ్ఞలకు వ్యతిరేకంగా తోటిమానవుల ఆజ్ఞలను పాటించడం, మనోవాంఛలకు బానిసైపోవడం నిషిద్ధం. అలా చేయడాన్ని ఇస్లాం 'షిర్క్' అంటుంది. షిర్క్‌చేస్తూ అదేస్థితిలో చనిపోయినవారికి నరకమే శాశ్వతనివాసం.

మానవుడు బుద్ధిజీవి. మంచీచెడుల విచక్షణాజ్ఞానం కలవాడు. మంచిని కోరుకునే, చెడును అసహ్యించుకునే గీటురాయి అతని స్వభావంలోనే ఉంది. కాని ఈ మానవుడు మహా తొందరపాటు జీవుడు. త్వరగా లభించే, సమీపంలో కన్పించే తళుకుబెళుకు వస్తువుల మీదనే లంఘిస్తాడు. ఆలస్యంగా లభించే, మరుగున దూరంగా ఉండే, శాశ్వతమైన, నాణ్యమైన, విలువైనవాటి మీదికి అతని దృష్టి తొందరగా పోదు. దివ్యఖుర్ఆన్‌లోని ఈ క్రింది సూక్తులు గమనించండి:

"మానవుడు ముందుచూపు లేకుండా) మేలుకు బదులు కీడు కోరుకుంటున్నాడు. అతను నిజంగా చాలా తొందరపాటు కలవాడు." (17:11)

"మానవుడు సహనం లేనివాడుగా సృజించబడ్డాడు. ఏదైనా కాస్త ఆపద వస్తే కంగారుపడిపోతాడు. సంపద ఒనగూడితే పిసినారితనం వహిస్తాడు." (79:19-21)

"మానవుడు తన శ్రేయస్సు కోసం ఎంత వేడుకున్నా అలసిపోడు. కాని ఎప్పుడైనా కాస్తంత కష్టం వస్తే చాలు, వెంటనే నిరాశతో క్రుంగిపోతాడు. అయితే మేమతడ్ని ఆ కష్టం నుండి గట్టెక్కించి మా కారుణ్యాన్ని చవిచూపించగానే (మా మేలు మరచి) 'నేనిందుకు అర్హుడ్ని. (నా శక్తిసామర్థ్యాల వల్లనే నాకిది లభించింది) ప్రళయదినం ఒకటుందని, అది తప్పకుండా వస్తుందని నేను భావించడం లేదు. ఒకవేళ నన్ను నిజంగానే నా ప్రభువు దగ్గరకు తీసికెళ్ళడం జరిగితే అక్కడా నాకు సుఖాలే లభిస్తాయి' అనంటాడు." (41:49)

"మానవుడు చిత్రమైన మనిషి. మేమతనికి మా అనుగ్రహం చవిచూపిస్తే సంతోషంతో పొంగిపోతాడు. కాని చేజేతులా చేసుకున్న దుష్కార్యమేదైనా ఆపద రూపంలో వచ్చిపడితే (లోగడ దేవుడు చేసిన మేలంతా మరచిపోయి) కృతఘ్నుడైపోతాడు." (42:48)

"మేము అనేకమంది మానవులను, జిన్నులను నరకం కోసమే పుట్టించాము. వారికి హృదయాలున్నాయి గాని, వాటితో అర్థం చేసుకోరు; వారికి కళ్ళున్నాయి గాని, వాటితో చూడరు; వారికి చెవులున్నాయి గాని, వాటితో వినరు. వారు పశువుల్లాంటివారు. వారసలు అంతకంటే కూడా దిగజారిపోయారు. వారు పూర్తిగా ఏమరుపాటుకు లోనయ్యారు." (ఖుర్‌ఆన్-7:179)

హృదయముండి ఆలోచించనివారు, కళ్ళుండి చూడనివారు, చెవులుండి వినని వారు ఎవరూ ఉండరు. కాని ఖుర్‌ఆన్ ఇలా ఆరోపిస్తుందంటే దానిక్కారణం, వారు పరలోక విషయంలో మాత్రమే ఇలా ప్రవర్తిస్తారు. విశ్వవ్యవస్థ వెనుక ఉన్న సృష్టికర్త హస్తాన్ని గురించి ప్రశాంతంగా ఆలోచించరు. సృష్టి వ్యవస్థలో ఆయన ఏకత్వాన్ని, ఔన్నత్యాన్ని చాటుతున్న అసంఖ్యాక నిదర్శనాలను గమనించరు. దైవం, పరలోకం గురించిన సత్యవాక్కులు వీరి చెవుల కెక్కవు.

ఈ వైఖరి కారణంగానే వారు మానవ స్థాయి నుంచి దిగజారి పశువులకన్నా నికృష్టులయ్యారని ఖుర్‌ఆన్ అంటోంది. ఇలాంటివారికి ప్రపంచమే సర్వస్వం. ఏవిధంగా నైనా వీలైనన్ని ప్రాపంచిక సుఖాలు జుర్రుకోవాలన్నదే వీరి ధ్యేయం. మంచీ చెడులతో, ధర్మాధర్మాలతో వీరికి నిమిత్తం లేదు. వీరి దృష్టిలో దగా, మోసం, అవినీతి, అన్యాయం, అన్నీ ధర్మసమ్మతమే. నీటిబుడగలాంటి ఇహిక జీవితం కోసం శాశ్వత పరలోక జీవితాన్ని విస్మరించడంకంటే మించిన ఆత్మవంచన మరేదయినా ఉందా? ఖుర్‌ఆన్‌లోని ఈ సూక్తులు కూడా చూడండి:

"దేవుడు తనకు సాటి కల్పించడాన్ని ఎట్టి పరిస్థితిలోనూ క్షమించడు. అది తప్ప ఇతర పాపాలను ఆయన తలచుకుంటే క్షమిస్తాడు. దేవునికి (ఆయన దైవత్వంలో, గుణగణాల్లో, శక్తిసామర్థ్యాల్లో) సాటి కల్పించడమంటే ఘోరమైన పాపం మూట కట్టుకున్నట్లే." (4:48)

ప్రవక్తా! వారినిలా అడుగు: "అజ్ఞానులారా! మీరు దేవుడ్ని వదలి ఇతరుల్ని ఆరాధించమని నాకు చెబుతున్నారా?"- "మీరు దేవునికి ఇతరుల్ని సాటికల్పిస్తే మీరు చేసే (మంచి)పనులు (కూడా) వ్యర్థమవుతాయి, మీరు ఘోరంగా నష్ట పోతారు" అని నీ దగ్గరకు, నీకుపూర్వం వచ్చిన ప్రవక్తలందరి దగ్గరకు దివ్యావిష్కృతి (వహీ) పంపబడింది." (ఈవిషయం వారికి స్పష్టంగా చెప్పు.) (ప్రవక్తా!) నీవు మాత్రం ఏకైక దేవుడ్నే ఆరాధిస్తూ కృతజ్ఞులయిన దాసులలో చేరిపో. (39:64-66)

"ముహమ్మద్ (సల్లం)! నీవు మాత్రం (ఏకేశ్వరుడైన) అల్లాహ్‌ను తప్ప మరే దైవాన్నీ ప్రార్థించకు. అలా చేశావంటే నీవు కూడా శిక్షించబడతావు." (26:213)



పై సూక్తిలోని హెచ్చరిక దైవప్రవక్త (సల్లం)ను ఉద్దేశించినది కాదు. ఇది దేవునికి సాటికల్పించే వారిని ఉద్దేశించి పరోక్షంగా చేసిన హెచ్చరిక. దేవునికి సాటి కల్పించడం ఘోరమైన నేరం. ఇలాంటి నేరానికి దైవప్రవక్త అంతటి వ్యక్తి పాల్పడినాసరే వదలి పెట్టేది లేదని ఈసూక్తి స్పష్టం చేస్తోంది.

"దేవుడు తనకు సాటి కల్పించడాన్ని ఎట్టి పరిస్థితిలోనూ క్షమించడు. అది తప్ప మరే పాపాన్నయినా తాను తలచుకుంటే క్షమించగలడు. దేవునికి సాటి కల్పించినవాడు సన్మార్గానికి బహుదూరంగా పోయిపడినట్లే." (ఖుర్‌ఆన్-4:116)

## 6. అణువణువూ అల్లాహ్‌నే స్మరిస్తోంది

"భూమ్యాకాశాల్లోని అణువణువూ అల్లాహ్ ఔన్నత్యాన్ని, ఆయన పవిత్రతను ప్రశంసిస్తోంది. ఆయన మహా శక్తిమంతుడు, అసామాన్య వివేకవంతుడు. ఆయనే భూమ్యాకాశాల సామ్రాజ్యానికి అధినేత. జీవన్మరణాలు ఆయన చేతిలోనే ఉన్నాయి. ఆయన ప్రతి పనీ చేయగల సమర్థుడు, సర్వ శక్తిమంతుడు. ఆయనే మొదటివాడు, ఆయనే చివరివాడు కూడా. ఆయనే బాహ్యశక్తి, ఆయనే నిగూఢశక్తి కూడా. ఆయనే సర్వజ్ఞుడు, సర్వజ్ఞాని." (ఖుర్‌ఆన్-57:1-3)

"సృష్టిప్రణాళికను రూపొందించి దాన్ని అమలుపరిచేవాడు ఆ దేవుడే. ఆయనకు అత్యంత శ్రేష్ఠమైన పేర్లున్నాయి. భూమ్యాకాశాల్లోని అణువణువూ ఆయన ఔన్నత్యాన్నే కీర్తిస్తోంది. ఆయన మహా శక్తిసంపన్నుడు, వివేకవంతుడు." (ఖుర్‌ఆన్-59:24)

"ఆయనే నీటితో నిండిన మేఘాలను సృజిస్తున్నాడు. ఆ మేఘాలు అద్భుతమైన గర్జనలతో ఆయన్ని (అనుక్షణం) స్తుతిస్తూ, ఆయన పవిత్రతను కొనియాడుతుంటాయి." (ఖుర్‌ఆన్-13:12,13)

భూమ్యాకాశాల్లో ఉన్న సమస్త సృష్టిరాసులు దేవుని ముందు సాష్టాంగపడుతున్న విషయం నీవు గమనించ లేదా? సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, పర్వతాలు, వృక్షాలు, జంతువులు, అనేకమంది మానవులు, (దైవ)శిక్షకు అర్హులైపోయిన చాలామంది మానవులు కూడా (సాష్టాంగపడుతున్నారు). దేవుడు ఒకవ్యక్తిని నీచుడిగా, క్షుద్రుడిగా చేయదలచుకుంటే, ఇక అతడ్ని ఎవరూ గౌరవించరు. దేవుడు తాను తలచిన పని తప్పకుండా చేస్తాడు. (ఖుర్‌ఆన్-22:18)

"ఆయనే (పరాత్పరుడు, పరమోన్నతుడయిన) అల్లాహ్. భూమ్యాకాశాల్లోని అణువణువూ తన ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా ఆయనకే సాష్టాంగపడుతోంది. ఉదయం, సాయంత్రం సమస్త వస్తువుల ఛాయలు కూడా ఆయనకే మోక రిల్లుతున్నాయి." (13:15)

పై సూక్తిలోని మూలభాషలో సజ్దా అనే పదం ఉంది. సజ్దా చేయడం అంటే సాష్టాంగపడటం, సాగిలబడటం, శిరసావహించడం, వినయపూర్వకంగా తల

వంచడం. విధేయత చూపడం అని అనేక అర్థాలున్నాయి. దీన్నిబట్టి విశ్వంలోని సమస్త సృష్టి రాసులు, దేవునికి విధేయత చూపుతూ, ఆయన నిర్దేశించిన ఆజ్ఞలకు కట్టుబడి పని చేస్తున్నాయి. దేవుడు నిర్దేశించిన ఈ ప్రకృతి శాసనాలను ఏ జీవి, మరేతర సృష్టితాలు కూడా ధిక్కరించలేవు.

సూర్యచంద్ర నక్షత్రాలన్నీ తమకు నిర్దేశించిన ప్రకృతిచట్టాలకు కట్టుబడి ఉంటూ దేవునికి విధేయత చూపుతున్నాయి. యావత్తు నభోమండలంలోని రోదసీ వస్తువులన్నీ తమతమ నిర్ణీత కక్ష్యల్లో, నిర్దేశిత వేగాలతో సంచరిస్తున్నాయి. వాటిలో ఏ ఒక్కటీ దైవ శాసనాన్ని ధిక్కరించి ఇష్టానుసారం సంచరించలేదు. సూర్యుడు, సముద్రం, గాలి, మేఘాలు కూడా దైవచట్టం ప్రకారమే పనిచేస్తూ వృక్షజాతికి, జీవరాసులకు కావలసిన వర్షం, శీతోష్ణస్థితులు సమకూర్చుతున్నాయి. అలాగే జంతువులు, పక్షులు, జలజీవాలు కూడా దేవుడు తమకు నిర్దేశించిన ఆజ్ఞల ప్రకారమే మనుగడ సాగిస్తున్నాయి.

చివరికి మానవుడు కూడా తనకు స్వాతంత్ర్యాధికారాలులేని కార్యరంగాల్లో దేవుడు నిర్దేశించిన ఈ ప్రకృతి చట్టానికే తలవొగ్గి వ్యవహరిస్తున్నాడు. దాన్ని అతను ఎట్టి పరిస్థితుల్లోనూ ధిక్కరించలేడు. ఉదా:- మానవుడు కాళ్ళకు బదులు చేతులతో నడవలేడు. కళ్లకు బదులు చెవులతో చూడలేడు. నోటికి బదులు ముక్కుతో మాట్లాడ లేడు. తనకు స్వాతంత్ర్యాధికారాలు ఇవ్వబడిన కార్యరంగంలోనే దేవుడు నిర్దేశించిన చట్టాలను నిరాకరించగలడు. ఉదా: అతను దేవుడు నిర్దేశించిన ఆరాధనా పద్ధతులు, సామాజిక ఆర్థిక రాజకీయ విధానాలను విశ్వాసపరంగా, క్రియాత్మకంగా తిరస్కరించి దేవునికి అవిధేయుడైపోగలడు.

యావత్తు సృష్టిరాసుల్లో దేవుడు బుద్ధిజీవులైన మానవులకు మాత్రమే మంచీ చెడు, సత్యం-అసత్యం, ధర్మాధర్మాల విచక్షణాజ్ఞానం, అందులో ఏదో ఒకదాన్ని ఎంచుకునే, దాని ప్రకారం నడచుకునే స్వేచ్ఛ ప్రసాదించాడు. కాని మానవుల్లో అనేక మంది ఈస్వేచ్ఛను దుర్వినియోగపరుస్తూ దేవుని శిక్షకు అర్హులయి పోతున్నారు. వారు దైవప్రవక్తలు బోధించిన ధర్మపథాన్ని, జీవన విధానాన్ని ధిక్కరించి దైవాగ్రహానికి గురవుతున్నారు. అయితే మరొకవైపు వారు తమకు స్వేచ్ఛ ఇవ్వబడని కార్యరంగాల్లో తమకు తెలియకుండానే దైవాజ్ఞల్ని శిరసావ హిస్తున్నామన్న వాస్తవం గ్రహించలేక పోతున్నారు.

కాబట్టి మానవుడు తనకు స్వేచ్ఛ ఇవ్వబడిన కార్యరంగాల్లో కూడా దేవునికి విధేయుడై ఆయన శాసనాలు శిరసావహించాలని ఖుర్‌ఆన్ చెబుతోంది. ఈ శాసనాల్ని ధిక్కరిస్తే అతను ఇహలోకంలో అశాంతికి గురయి, పరలోకంలో నరక యాతనలు అనుభవిస్తాడని హెచ్చరిస్తోంది. అంచేత మానవుడు స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు ప్రసాదించబడిన కార్యరంగాల్లో కూడా దేవునికి విధేయుడయి, ఆయన నిర్దేశించిన శాసనాలు శిరసావహిస్తే ఇహలోకంలో శాంతీ, పరలోకంలో దేవుని ప్రసన్నతాభాగ్యం, స్వర్గసౌఖ్యాలు లభిస్తాయని చెబుతోంది.



# 7. దేవుని పట్ల కృతఘ్నతే బహుదైవారాధన

"ఆయనే అంతర్‌బాహ్య విషయాలన్నీ ఎరిగినవాడు. ఆయన మహా శక్తిమంతుడు, అమిత దయామయుడు. ఆయన ప్రతిదాన్నీ సముచిత రీతిలో అద్భుతంగా సృష్టించాడు. ఆయన మానవసృష్టిని మన్నుతో ఆరంభించాడు. తరువాత ఓ నీచమైన (వీర్య) బిందువుతో అతని సంతతిని ఉత్పత్తి చేయసాగాడు. ఆపై అతడ్ని పరిపూర్ణ మానవుడిగా రూపొందించి అతని (శరీరం)లో తనఆత్మను ఊదాడు. (ఆలోచించండి.) ఆయన మీకు చెవులిచ్చాడు, కళ్ళిచ్చాడు, హృదయాన్నీ ఇచ్చాడు. కాని మీరు మాత్రం (ఆయనకు) చాలా తక్కువగా కృతజ్ఞత చూపుతున్నారు." (ఖుర్‌ఆన్-32:6-9)

"మానవులారా! మీకు దేవుడు చేసిన మహోపకారాలు జ్ఞాపకం చేసుకోండి. దేవుడు తప్ప మీకు భూమ్యాకాశాల నుండి ఉపాధినిచ్చే మరో సృష్టికర్త ఎవడైనా ఉన్నాడా? (లేడు) ఆయన తప్ప మరో ఆరాధ్యుడు లేడు. అలాంటప్పుడు మీరు ఎలా మోస పోతున్నారు?" (ఖుర్‌ఆన్-35:3)

"ఆయనే మీకోసం సముద్రాన్ని అదుపులో ఉంచాడు. అందులో నుంచి మీరు తినడానికి మాంసం, ధరించడానికి నగలు తీస్తారు. సముద్రంలో ఓడలు నీటిని చీల్చివేస్తూ ఎలా ముందుకు సాగుతాయో మీరు చూస్తూనే ఉన్నారు. మీరు మీ ప్రభువు అనుగ్రహం (ఉపాధి) అన్వేషిస్తూ, ఆయనకు కృతజ్ఞులై ఉండటానికే ఇదంతా సృష్టించబడింది." (ఖుర్‌ఆన్-16:14)

ఎవరైనా మనకు ఓ యాభై రూపాయల విలువగల ఏదైనా సహాయం చేస్తే మనం అతనికి ఎంతో కృతజ్ఞత చూపుతాం. మరికాస్త ఎక్కువ సహాయం చేస్తే 'నేను మీకెంతో రుణపడి ఉన్నాను, మీ మేలు ఎన్నటికీ మరచిపోలేను' అంటాము కృతజ్ఞత పూర్వకంగా. తోటి మానవులు చేసే ఈ చిరుసహాయం విశ్వప్రభువు చేసిన, చేస్తున్న సహాయంలో 0.00000000001 శాతం కూడా ఉండదు. అయినా ఈ మానవుడు సృష్టికర్తను వదలి సృష్టితాల వెంటపడ్డాడు!

అయితే దేవుడు తాను ప్రసాదించిన మహాభాగ్యాలను గురించి మానవుల నుండి పరలోకంలో లెక్క తీసుకుంటాడు; ఈ మహాభాగ్యాలను మీరు నా ఆదేశాల ప్రకారమే ధర్మయుక్తంగా సంపాదించారా లేక అక్రమంగా సంపాదించారా? నా ఆదేశాల ప్రకారం వాటిని మీరు ఏమేరకు సద్వినియోగం చేశారు? అని తప్పకుండా నిలదీస్తాడు. అప్పుడు దైవాజ్ఞలను విస్మరించి వాటిని దుర్వినియోగం చేసినవారి గతి ఏమవుతుంది? తాము అవలంబించిన విధానాలు తప్పని తెలిసినప్పుడు వారి పరిస్థితి ఏమిటీ?

ఇది గంభీరంగా ఆలోచించాల్సిన విషయం. ఈ భాగ్యాలు ప్రసాదించిన సృష్టికర్తకు కృతజ్ఞులయి ఆయన ఆదేశాల ప్రకారం జీవితాంతం సత్కర్మలు ఆచరించినవారే నరకయాతనల నుండి తప్పించుకుంటారు. అలాంటివారే స్వర్గప్రవేశానికి, దైవదర్శన భాగ్యానికి నోచుకుంటారు. ఖుర్‌ఆన్‌లోని ఈ సూక్తులు కూడా చూడండి:

"మరి (వివిధసృష్టితాలను) సృష్టించేవాడు, ఏ వస్తువునూ సృష్టించలేనివాడు (ఇద్దరూ) సమానులవుతారా? మీరు ఆమాత్రం అర్థం చేసుకోలేరా? మీరు దేవుని అనుగ్రహాలు లెక్కించదలచుకుంటే వాటిని ఎన్నటికీ లెక్కించలేరు. నిస్సందేహంగా ఆయన గొప్ప క్షమాశీలి, పరమదయామయుడు. ఆయనకు మీ అంతర్‌బాహ్యాలన్నీ తెలుసు."(16:17-19)

"ప్రజలు ఏదైనా కష్టం వచ్చినప్పుడు తమ (నిజ)ప్రభువు వైపుకు మరలి ఆయన్నే వేడుకుంటారు. అయితే ఆయన (ఆ కష్టం దూరంచేసి) తన కారుణ్యాన్ని కాస్త చవి చూపించగానే వారిలో కొందరు మళ్ళీ బహుదైవారాధనకు పాల్పడతారు. ఇలా చేసిన మేలుకు మాపట్ల (కృతజ్ఞత చూపకుండా) కృతఘ్నులయి పోతున్నారు. సరే, కొంతకాలం (ఐహిక) సుఖాలు జుర్రుకోండి. (దీని పర్యవసానం ఏమిటో) మీకు త్వరలోనే తెలుస్తుంది. మీరు చేస్తున్న ఈ బహుదైవారాధన సత్యమని నిరూపించే ఆధారం ఏదయినా మేము మీ దగ్గరకు పంపించామా?" (30:33-35)

"ప్రజలకు ఎప్పుడైనా మా కారుణ్యం చవిచూపిస్తే చాలు, వారు సంతోషంతో పొంగిపోతారు. (అపై అదంతా తమకృషి ఫలితమని మిడిసిపడతారు.) కాని చేజేతులా చేసుకున్న దాని ఫలితంగా ఏదైనా ఆపద వచ్చిపడితే వెంటనే నిరాశ చెందుతారు. దేవుడే తాను కోరిన విధంగా కొందరికి పుష్కలంగా, మరికొందరికి స్వల్పంగా ఉపాధినిస్తున్న సంగతి వీరు గమనించడం లేదా? విశ్వసించేవారికి ఇందులో గొప్ప సూచనలు ఉన్నాయి." (30:36,37)

"దేవుడే మిమ్మల్ని ఏకైక ఆత్మ నుండి సృష్టించాడు. అదే జీవి నుండి దాని జతను కూడా సృష్టించాడు, దాని దగ్గర సౌఖ్యం పొందడానికి. పురుషుడు స్త్రీని కప్పివేసుకున్నప్పుడు ఆమె ఓ తేలికపాటి భారం ధరిస్తుంది. దాన్ని తీసుకొని తిరుగుతుంది ఆమె. అది మరింత భారంగా తయారైన తర్వాత వారుభయులు "(దేవా!) నీవు గనక మాకు మంచి పిల్లవాడ్ని అనుగ్రహిస్తే మేము నీపట్ల కృతజ్ఞులయి ఉంటాము" అని తమ ప్రభువయిన దేవుడ్ని వేడుకుంటారు." (7:189)

"అయితే దేవుడు వారికి ఎలాంటి లోపంలేని చక్కటి పిల్లవాడ్ని ప్రసాదించగానే వారు (దేవుడ్ని మరచిపోయి) ఆయన అనుగ్రహించిన ఈ భాగ్యంలో ఇతరుల్ని ఆయనకు సాటి కల్పిస్తారు. వారి బహుదైవారాధనా చేష్టలకు దేవుడు ఎంతో అతీతుడు, ఉన్నతుడు." (7:190)

ఇక్కడ బహుదైవారాధకుల అజ్ఞాన వైఖరిని విమర్శించడం జరిగింది. ఆనాడు అరబ్ బహుదైవారాధకులు సంతానం కోసం దేవుడ్నే ప్రార్థించేవారు. అయితే బిడ్డ పుట్టిన తర్వాత వారు దేవుని అనుగ్రహంలో (విగ్రహ)దేవతలకు భాగం కల్పిస్తారు. ఇదీ బహుదైవారాధకుల ధోరణి. కాని ఏకేశ్వరోపాసకులమని చెప్పుకునే నేటి ముస్లింలలో కొందరు ఆనాటి అరబ్ బహదైవారాధకులకు మించిపోయారు. వీరు సంతానం కోసం దైవేతరులనే (వలీలను) వేడుకుంటున్నారు. బిడ్డపుట్టిన తర్వాత వారి సమాధుల దగ్గరికెళ్ళి మొక్కుబడి తీర్చుకుంటున్నారు. అయినా వీరి ఏకేశ్వరోపాసనా విశ్వాసానికి



ఏమాత్రం భంగంరాదట! ఈ ద్వంద్వ వైఖరినే ప్రముఖ తత్వవేత్త మౌలానా హాలి ఇలా పేర్కొన్నారు:

విగ్రహపూజ చేస్తే అవిశ్వాసం - దైవపుత్ర విశ్వాసమూ అవిశ్వాసమే
అగ్నిముందు యజ్ఞం పరమ అవిశ్వాసం - తారాబల నమ్మకం అంతకన్నా ఘోరం
విశ్వాసమంటే అసలు విశ్వాసులదే - వారి విశ్వాసం విశ్వమంత సువిశాలం
తలచిన వారికెల్లా తలవంచడమే - తాతల నుండి వస్తున్న సంప్రదాయం
ప్రవక్తను పొగిడి పరమాత్మతో కలుపు- మహాప్రవక్త(స) కన్నా మహనీయులే మిన్న
సమాధుల మీదే సదా సాష్టాంగపడు - అమరవీరులే మనకు శరణాగతులు
ఐనా ఏకదైవారాధనకు రాదులోపం-విశ్వజనీనఇస్లాం కదా మన దైనందిన విశ్వాసం
నిత్యజీవనసరళే సత్యవచనానికి సాక్ష్యం-మచ్చలేనివారు కదా ముస్లింసముదాయం!

"సముద్రాలలో మీ శ్రేయస్సు కోసం నౌకలు నడిపేవాడు మీప్రభువే. ఆయన అనుగ్రహం అన్వేషించడానికి మీరు సముద్రయానం చేస్తారు. నిజంగా ఆయన మీపట్ల ఎంతో దయామయుడు. సముద్రయానం చేస్తున్నప్పుడు మీకేదైనా ఆపద వస్తే (మీరు నిజదేవుడ్నే వేడుకుంటారు.) ఆయన తప్ప మీరు (రోజూ) వేడుకునే మిథ్యాదైవాలన్నీ అప్పుడు కనుమరుగయి పోతాయి. కాని ఆయన మిమ్మల్ని ఆపద నుండి కాపాడిన తర్వాత మీరు (చేసిన మేలు మరచి) ఆయనకు విముఖులయి పోతారు. నిజంగా మానవుడు చాలా కృతఘ్నుడు." (ఖుర్ఆన్-17:66,67)

"దేవుడు మిమ్మల్ని భూమిలోకి అణగద్రొక్కడని నిర్భయంగా ఉన్నారా? లేక మీపైకి రాళ్లవర్షంతో కూడిన తుఫాను పంపడని నిశ్చింతగా ఉన్నారా? అప్పుడా దుస్థితి నుండి మిమ్మల్ని కాపాడేవారే ఉండరు. దేవుడు మళ్ళీ ఎప్పుడైనా మిమ్మల్ని సముద్రంలోకి తీసికెళ్ళి మీరు చూపిన కృతఘ్నతకు ప్రతీకారంగా మీపైకి భయంకరమైన పెనుగాలులు పంపి మిమ్మల్ని సముద్రంలో ముంచివేయడని నిర్భయంగా ఉన్నారా? ఒకవేళ అలా జరిగితే మమ్మల్ని ప్రశ్నించేవాడే ఉండడు." (ఖుర్ఆన్-17:68,69)

"ముహమ్మద్ (సల్లం)! వారిని ఈ సంగతి అడుగు: "మీరు అడవుల్లో, సముద్రాలలో చిక్కుకున్నప్పుడు ఆ చీకటికూపాల నుండి మిమ్మల్ని ఎవరు కాపాడుతున్నారు? (ఆపద సమయంలో) మీరు ఘోరంగా విలపిస్తూ దీనంగా మొరపెట్టుకునేది ఎవరిని? 'ఈ ఆపద నుండి మమ్మల్ని గట్టెక్కిస్తే మేము తప్పకుండా నీకు కృతజ్ఞులయి ఉంటామ'ని మీరు ఎవరిని వేడుకుంటారు?" చెప్పు: "దేవుడే మిమ్మల్ని ప్రతి ఆపద నుండి, కష్టం నుండి కాపాడుతున్నాడు. మరి మీరు ఆయనకు ఇతరులను ఎలా సాటికల్పిస్తున్నారు?" (ఖుర్ఆన్-6:63-64)

"వారికీ సంగతి కూడా చెప్పు: "ఆయన తలచుకుంటే మీ మీదికి పైనుండి గాని, లేదా మీకాళ్ళ కింద నుండి గాని శిక్ష రప్పించగలడు. లేదా మిమ్మల్ని విభిన్న వర్గాలుగా చీల్చి ఒక వర్గం శక్తిని మరొక వర్గానికి చవిచూపించగలడు." చూడు, వారు వాస్తవం

తెలుసుకోవడానికి మేము రకరకాలుగా మా సూక్తులు వారి ముందు ఎలా వివరిస్తున్నామో." (ఖుర్ఆన్-6:63-65)

"మిమ్మల్ని నేలమీద, నీటిమీద నడిపించేవాడు దేవుడే. మీరు ఓడలలో ఎక్కినప్పుడు చల్లటి వాతావరణం మధ్య ఆ ఓడలు గాలివాటుకు చక్కగా ముందుకు సాగిపోతుంటే మీరు హాయిగా ప్రయాణం చేస్తారు. (అయితే ఒక్కోసారి) కొంత దూరం పోయాక హఠాత్తుగా వాతావరణం మారిపోతుంది. గాలి ఉధృతంగా వీస్తుంది. ఓడ నలువైపుల నుండి అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతూ బీభత్సం సృష్టిస్తాయి. దాంతో ప్రయాణీకులు తాము తుఫానులో చిక్కుకున్నామని తెలిసి భయపడిపోతారు. అప్పుడు వారంతా (తమ తమ మిథ్యాదైవాలు మరచిపోయి) ఒక్కదేవుని మీదే విశ్వాసం ఉంచుతూ "దేవా! నీవు మమ్మల్ని ఈ ఆపద నుండి గట్టెక్కిస్తే మేము నీ పట్ల కృతజ్ఞులయి ఉంటామ"ని వేడుకుంటారు." (ఖుర్ఆన్-10:22)

"అయితే దేవుడు వారిని ఆపదనుండి గట్టెక్కించగానే వారు మళ్ళీ సత్య విముఖులై ధరణిలో తిరుగుబాటుకు ఒడిగడ్తారు. మానవులారా! (తెలుసుకోండి) "ఈ తిరుగుబాటు వైఖరి వికటించి స్వయంగా మీకే వ్యతిరేకంగా పరిణమిస్తుంది. ప్రాపంచిక సుఖాలు కొన్నాళ్ల ముచ్చట మాత్రమే. చివరికి మీరు మా దగ్గరికే రావలసి ఉంటుంది. అప్పుడు మేము మీరు ప్రపంచంలో ఉండగా ఏమేమి చేస్తుండేవారో మీకు తెలియజేస్తాము." (ఖుర్ఆన్-10:23)

మృత్యువు కండ్లముందు తాండవిస్తున్నప్పుడు సాధారణంగా బహుదైవారాధకులు మిథ్యాదైవాలన్నిటిని వదిలేసి ఒక్క నిజదేవుణ్ణి మాత్రమే వేడుకుంటారు. ఈ యదార్థాన్నే ఇక్కడ ప్రస్తావించడం జరిగింది. దైవప్రవక్త (సల్లం) మక్కా జయించిన తర్వాత అబూజహల్ కొడుకు ఇక్రమా జిద్దా రేవుకు పారిపోయి, అక్కడ ఓడెక్కి అబిసీనియా దారి పట్టాడు. అయితే దారిలో తుఫాన్ వచ్చి ఓడ మునిగిపోయే ప్రమాదం ఏర్పడింది. ప్రయాణీకులు మొదట్లో తమతమ ఇష్టదేవతల్ని ప్రార్థించారు. కాని తుఫాన్ తగ్గకపోగా మరింత ఉధృతమయింది. దాంతో జనం భయపడి "దేవుణ్ణి తప్ప మరెవర్నీ వేడుకునే సమయం కాదిది. ఆయన తలచుకుంటేనే మనం ఈ ఆపద నుండి గట్టెక్కుతాం" అన్నారు.

ఈ మాట ఇక్రామాకు కనువిప్పు కలిగించింది. "ఇక్కడ దేవుడు తప్ప మరెవరూ సహాయం చేసేవారు లేరా? మరి ఈ విషయాన్నే కదా ఆ పుణ్యాత్ముడు ఇరవై ఏండ్ల నుంచి చెబుతూవస్తోంది. మనం అనవసరంగా ఆయనతో పోరాడుతున్నాం" అనుకున్నా డతను. వెంటనే అతను "ఈతుఫాన్ నుంచి బయటపడితే తాను నేరుగా ముహమ్మద్ (సల్లం) దగ్గరికెళ్ళి ఆయన చేతిలో చేయివేసి కలుపుతాను" అని నిర్ణయించుకున్నాడు. దాని ప్రకారం ఇక్రమా (రజి) దైవప్రవక్త (సల్లం) సన్నిధికెళ్ళి ఇస్లాం స్వీకరించారు.

"మానవుడు ఏదైనా ఆపద వచ్చినప్పుడు తన ప్రభువుని మొరపెట్టుకుంటాడు.



అయితే అతని ప్రభువు అతనికి తన అనుగ్రహభాగ్యం ప్రసాదించగానే, అతను లోగడ మొరపెట్టుకున్న ఆపద మరచిపోయి ఇతరుల్ని దేవునికి సాటికల్పిస్తాడు. ఈవిధంగా అతను ఇతరులను కూడా దైవమార్గం నుండి తప్పిస్తున్నాడు. 'కొన్నాళ్లు తన అవిశ్వాస వైఖరిద్వారా ప్రయోజనం పొందమ'ని చెప్పు అతనికి. చివరికి అతను తప్పకుండా నరకానికి పోవలసిందే." (ఖుర్ఆన్-39:8)

"దీనికి భిన్నంగా మరొక వ్యక్తి ఉన్నాడు. అతను (దేవునికి, దైవప్రవక్తకు) విధేయుడై రాత్రివేళ (ప్రార్థన చేస్తూ) నిలబడతాడు; సాష్టాంగపడతాడు. పరలోకంలో ఎదురయ్యే పరిణామాలను గురించి భయపడుతుంటాడు. తన ప్రభువు కారుణ్యాన్ని ఆశిస్తుంటాడు. "ఇలాంటి వ్యక్తి శ్రేష్ఠుడా లేక అతనా? (సత్యం గురించి) తెలిసినవాళ్ళు, తెలియనివాళ్ళు ఒకటేనా?" అని అడుగు వారిని. (మా) హితబోధను బుద్ధిమంతులే స్వీకరిస్తారు." (ఖుర్ఆన్-39:9)

## 8. సర్వేశ్వరుడే సర్వశక్తిమంతుడు

దేవుడు ప్రతి వస్తువుపై, ప్రతి విషయంపై అదుపు, అధికారం గల సర్వ శక్తిమంతుడు. సృష్టి ఆయనదే, అధికారం కూడా ఆయనదే. దీన్ని గురించి ఖుర్ఆన్‌లోని ఈ క్రింది సూక్తులు చూడండి:

"ఈ భూమి, ఇందులో ఉన్నదంతా ఎవరిదో చెప్పండి, మీకు తెలిస్తే?' అని అడుగు. వారు ఇవన్నీ దేవునివే అని తప్పకుండా అంటారు. "అయితే మీరు స్పృహలోకి ఎందుకు రారు?" అని అడుగు. (సరే) 'సప్తాకాశాలకు, మహోన్నత సింహాసనానికి యజమాని ఎవర'ని అడుగు. వారు దేవుడేనని తప్పకుండా అంటారు. 'అలాంటప్పుడు మీరు (ఆ దేవునికి) ఎందుకు భయపడర'ని అడుగు." (23:84-87)

"(పోనీ, ఈ సృష్టివ్యవస్థలో) 'ప్రతి వస్తువుపై పాలనాధికారం ఎవరికుందో చెప్పండి మీకు తెలిస్తే' అని వారినడుగు. (వారు దేవునికే ఉందని చెబుతారు.) అలాగే '(మీకు) ఆశ్రయమిచ్చేవాడు ఒకడున్నాడు; ఆయనకు వ్యతిరేకంగా మరెవరూ (మీకు) ఆశ్రయమివ్వలేరు. అలాంటి శక్తిస్వరూపుడెవరు' అని అడుగు. దేవుడే అని వారు తప్పకుండా అంటారు. 'మరయితే మీరు ఎలా మోసపోతున్నార'ని అడుగు." (23:88,89)

"ఒకవేళ నీవు 'మిమ్మల్ని ఎవరు సృష్టించార'ని అడిగితే, 'దేవుడే' అని వారు తప్పకుండా చెబుతారు. మరి వీరు ఎలా మోసపోతున్నారు?" (43:87)

"నీవు గనక ఈ భూమ్యాకాశాలను ఎవరు సృష్టించారని అడిగితే దేవుడే అని వారు తప్పకుండా అంటారు. వారికిలా చెప్పు: 'సరే, దేవుడు నాకేదయినా కష్టం కలిగించదలిస్తే మీరు దేవుడ్ని కాదని ప్రార్థిస్తున్న మిథ్యాదైవాలు నన్నీ ఆపద నుండి కాపాడగలవా? పోనీ దేవుడు నన్ను కరుణించదలిస్తే ఈశక్తులు ఆయన కారుణ్యాన్ని అడ్డుకోగలవా? నాకు దేవుడే చాలు. నమ్ముకునేవారు దేవుడ్నే నమ్ముకుంటారు. ఆయన మీదే ఆధారపడతారు." (39:38)

ఈ సందర్భంగా దైవప్రవక్త (సల్లం) చెప్పిన ఈ హితోక్తి వినండి: "ప్రజలందరిలోకెల్లా శక్తిమంతుడు కాదలచుకున్నవాడు దేవుడ్నే నమ్ముకొని ఆయన మీదే భారం వేయాలి. అందరికంటే గొప్ప స్థితిపరుడు కాదలచుకున్నవాడు తన దగ్గరున్నదాని కంటే దేవుని దగ్గర (స్వర్గంలో) ఉన్నదాని మీదే ఎక్కువ నమ్మకం పెట్టుకోవాలి. అందరి కంటే ఎక్కువ గౌరవనీయుడు కాదలచుకున్నవాడు అత్యంత గౌరవనీయుడు, మహోన్నతుడైన దేవునికి భయపడుతూ ఉండాలి". (ఇబ్నె అబ్బాస్)

బహుదైవారాధకులు సర్వేశ్వరుని శక్తిసామర్థ్యాలను, అవిభాజ్యమైన ఆయన దైవత్వాన్ని విభజించారు. ఈ కారణంగానే వారు దేవుడు ఒక్కడేనని అంగీకరించినప్పటికీ ఏకదైవారాధనను క్రియాత్మకంగా పాటించలేకపోతున్నారు.

"(అసలైన ఆరాధ్యనీయుడు) అల్లాహ్‌యే. ఆయన తప్ప మరో ఆరాధ్యుడు లేడు. ఆయన నిత్యజీవుడు; ఎన్నటికీ నిద్రించనివాడు; కునుకుపాట్లు కూడా పడనివాడు. భూమ్యాకాశాలలోవున్న సమస్తం ఆయనదే. ఎవరి విషయంలోనైనా సరే, ఆయన అనుమతి లేకుండా ఆయన సన్నిధిలో ఎవరు సిఫారసు చేయగలుగుతారు? వారి ముందున్న దేమిటో, వారికి గోచరించకుండా ఉన్నదేమిటో అంతా ఆయనకు తెలుసు. ఆయన తలచుకుంటే తప్ప ఆయనకున్న జ్ఞానసంపదలోని ఏ విషయమూ ఎవరికీ తెలియదు. ఆయన రాజ్యాధికారం భూమ్యాకాశాలను పరివేష్ఠించి ఉంది. వాటి రక్షణ ఆయనకు ఏమాత్రం కష్టమైన పని కాదు. ఆయన సర్వాధికారి, సర్వోన్నతుడు." (దివ్య ఖుర్‌ఆన్–2:255)

- ✠ భూమ్యాకాశాల్లోని సమస్తం దేవునికి చెందినదే. సకల సృష్టిరాసులు ఆయన ఆజ్ఞలకు కట్టుబడి ఉన్నాయి. (ఖుర్‌ఆన్-30:26)
- ✠ దివి నుండి భువి దాకా యావత్ పాలనా ఏర్పాట్లు ఆయనే నిర్వహిస్తున్నాడు. (ఖుర్‌ఆన్-32:5)
- ✠ భూమ్యాకాశాల సామ్రాజ్యమంతా ఆయనదే. సమస్త వ్యవహారాలు ఆయన వైపునకే మరలించబడతాయి. (ఖుర్‌ఆన్-57:5)
- ✠ పరిపాలన, రాచరిక వ్యవహారాల్లో ఆయనకు భాగస్వాములు ఎవరూ లేరు. (ఖుర్‌ఆన్-25:2)
- ✠ ప్రతి విషయంలోనూ పాలనాహక్కు, రాజ్యాధికారం ఆయన చేతిలోనే ఉంది. (ఖుర్‌ఆన్-36:83)
- ✠ ఆయన తలచుకున్న ప్రతి పనీ చేసితీరుతాడు. (ఖుర్‌ఆన్-85:16)
- ✠ ఆయన ఏపని చేసినా దానికి ఆయన ఎవరి ముందూ సమాధానం చెప్పుకోనవసరం లేదు. ఇతరులే ఆయన ముందు తమ కర్మలకు సమాధానం చెప్పుకోవలసి ఉంటుంది. (ఖుర్‌ఆన్-21:23)



"తాను తప్ప మరో ఆరాధ్యుడు లేనివాడే అల్లాహ్. ఆయన గోచర, అగోచర విషయాలన్నీ ఎరిగినవాడు, అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు. తాను తప్ప మరో ఆరాధ్యుడు లేనివాడే అల్లాహ్. ఆయన రాజాధిరాజు. పరమపవిత్రుడు, శాంతి మయుడు, శరణునిచ్చేవాడు, సంరక్షకుడు, పర్యవేక్షకుడు, సర్వాధికుడు, సర్వోన్నతుడు, చండశాసనుడు. ప్రజలు చేస్తున్న బహుదైవారాధనకు అల్లాహ్ ఎంతో అతీతుడు, పరిశుద్ధుడు." (ఖుర్‌ఆన్–59:22,23)

"ఆ రోజు నిజమైన సామ్రాజ్యాధికారం కరుణామయునిదే అవుతుంది. అది సత్య తిరస్కారులకు అతి కఠినమైన దుర్దినంగా దాపురిస్తుంది. ప్రతి దుర్మార్గుడు (ఆరోజు తీవ్రమైన పశ్చాత్తాపంతో) తన చేతిని కొరుక్కుంటూ ఇలా అంటాడు: 'అయ్యో! నేను దైవప్రవక్తతో సహకరించి సన్మార్గగామి అయివుంటే ఎంత బాగుండేది!! అయ్యయ్యో! నేను ఫలానావాడ్ని స్నేహితుడిగా చేసుకోకుండా ఉంటే బాగుండేది!! వాడి మాయదారి మాటలు విని నాదగ్గరకు వచ్చిన హితోపదేశాన్ని దూరం చేసుకున్నానే! నేనెంత దౌర్భాగ్యుడ్ని!!" (ఖుర్‌ఆన్–25:27–29)

ఇహలోకంలో పెద్దపెద్ద రాజ్యాలు ఏలి, దైవదాసులను తమ దాసులుగా చేసుకున్న చక్రవర్తులు, చండశాసనుల అధికార మైకం పూర్తిగా దిగిపోతుంది. అలాంటి వారిని గురించి దైవప్రవక్త (సల్లం) ఇలా తెలిపారు: "దేవుడు (ఆరోజు) ఒక చేత్తో భూమిని, మరొక చేత్తో ఆకాశాన్ని పట్టుకొని 'నేనే చక్రవర్తిని, నేనే సార్వభౌముడ్ని. మరి ఏరి ఆ భూలోకచక్రవర్తులు? ఎక్కడున్నారు ఆ చండశాసనులు? ఏమయ్యారు ఆ అహంకారులు?' అని అంటాడు." (బుఖారి, ముస్లిం)

## 9. జీవిత పరమార్థం, ఆరాధనాభావం

"మేము భూమ్యాకాశాల్ని, వాటి మధ్య ఉన్న సమస్తాన్ని ఏదో తమాషా కోసం సృష్టించలేదు. వాటిని మేము (ఒక మహోన్నత లక్ష్యం కోసం) సత్యం ప్రాతిపదికపై సృజించాం. కాని చాలామందికి (ఈసత్యం) తెలియదు." (ఖుర్‌ఆన్–44:38,39)

"మేము భూమ్యాకాశాలను, వాటిలో ఉన్నవాటిని ఏదో ఆట (తమాషా) కోసం సృష్టించలేదు. మేమేదైనా ఆటవస్తువును తయారు చేసుకోదలచుకుంటే, ఈవిధంగానే చేయాలనుకుంటే మా దగ్గర ఉన్నవాటితోనే తయారు చేసుకునేవారం. కాని మేము (ఇక్కడ) సత్యం ద్వారా అసత్యంపై దెబ్బతీస్తున్నాం. ఇలా సత్యం అసత్యం తల పగలగొడ్తుంది. చూస్తుండగానే అసత్యం అంతిమశ్వాస విడుస్తుంది. కనుక మీ అభూత కల్పనలకు మీకు వినాశం తప్పదు." (ఖుర్‌ఆన్–21:16–18)

పైనపేర్కొన్న సూక్తులలో సృష్టికర్త విశ్వవ్యవస్థను తాను లక్ష్యరహితంగా నిర్మించలేదని, దాని వెనుక ఒక మహోన్నత లక్ష్యం ఉందని అన్నాడు. ఆ లక్ష్యం ఏమిటో ఈ సూక్తులలో తెలియజేయలేదు. అది ఈ క్రిందిసూక్తిలో తెలియజేశాడు:

"నేను మానవుల్ని, జిన్నుల్ని (అంటే భూతాలను) నన్ను ఆరాధించడానికి తప్ప

మరే లక్ష్యంతో పుట్టించలేదు." (ఖుర్ఆన్-51:56)

**దైవారాధనే మానవపుట్టుక లక్ష్యం:-** యావత్తు సృష్టిలో మహోత్కృష్టుడైన మానవుని ప్రయోజనార్థమే సృష్టికర్త మొత్తం విశ్వాన్ని సృష్టించాడు. ఆ తరువాత మానవుడ్ని తన ఆరాధన కోసమే సృష్టించానని పైసూక్తిలో తెలియజేస్తున్నాడు.

ఈ సూక్తిలో రెండర్థాలు ఇమిడి ఉన్నాయి. ఒకటి, దేవుడ్ని తప్ప మరెవ్వరినీ ఆరాధించకూడదు. రెండు, దైవారాధన తప్ప మరేపనీ చేయకూడదు. మొదటి విషయం అందరికీ అర్థమవుతోంది. కాని రెండో విషయం నేడు అనేకమంది ముస్లింలకు సైతం అర్థం కావడంలేదు. కారణం వారి మష్తిష్కాలలో "ఆరాధన" పదానికి పరిమిత భావం ఉండిపోవడమే.

ఇస్లాంలో ఆరాధన అనే పదానికి చాలా విస్తృతమైన భావం ఉంది. నమాజ్, ఉపవాసం, కాబాయాత్ర, దైవధ్యానం లాంటి పూజాపురస్కారాలే కాదు; ఉపాధి సముపార్జన, కుటుంబజీవనం, తోటి మానవులతో సంబంధాలు, వ్యాపారం, ఆర్థిక లావాదేవీలు, దేశ పరిపాలనా వ్యవహారాలు, యుద్ధం, స్నేహ ఒడంబడికలు, అంతర్జాతీయ సంబంధాలు సైతం ఆరాధన క్రిందికే వస్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే మానవ జీవితంలోని సకలరంగాలకు చెందిన సమస్త వ్యవహారాలు దైవారాధనల క్రిందికే వస్తాయి. కాకపోతే ఇవన్నీ దేవుడు, ఆయన ప్రవక్త (సల్లం) అందజేసిన ఆదేశాల ప్రకారం పాటించినప్పుడే దైవారాధనలుగా పరిగణించబడతాయి.

ఆరాధనలోని ఈ విస్తృత భావం తెలుసుకుంటే మనిషి జీవితంలోని సమస్త వ్యవహారాల్లో ఎలాంటి అపమార్గం పట్టకుండా సృష్టికర్తను మాత్రమే ఆరాధించగలడు. అంటే మనిషి ఖుర్ఆన్, హదీసుల పరిధుల్లో మాత్రమే తన జీవిత వ్యవహారాలు సాగించాలన్నమాట.

ఒకే దేవుడ్ని ఆరాధిస్తున్నామని చెప్పుకునేవారు ఎన్ని నమాజులు చేస్తున్నా, ఎన్ని ఉపవాసాలు పాటిస్తున్నా. ఎంత ధ్యానం చేస్తున్నా- దైనందిన వ్యవహారాల్లో దైవేతర శక్తులకో లేక మనోవాంఛలకో దాస్యం చేస్తుంటే మాత్రం ఆ మేరకు వారు దైవారాధన పరిధిని అతిక్రమిస్తున్నట్లే. అంటే ఆయా వ్యవహారాల్లో వారు దేవునికి సాటి కల్పిస్తున్నారన్నమాట. ఈ వైఖరి దైవాగ్రహానికి గొనిపోతుంది.

కొందరు ఈ వైఖరి కప్పిపుచ్చుకోడానికి లేక అజ్ఞానంవల్ల "ఇవి మతవిషయాలు, అవి ప్రపంచవ్యవహారాల"ని వాదిస్తారు. కాని ప్రపంచ వ్యవహారాలు కూడా దేవుని ఆజ్ఞలు, దైవప్రవక్త హితవుల వెలుగులోనే ఉండాలన్న యదార్థాన్ని వీరు గ్రహించకపోవడం ఎంతో విచారకరం.

ఇస్లాం సంపూర్ణమైన జీవన వ్యవస్థ. ఇందులో మతం వేరు, ప్రపంచం వేరన్న భావన లేదు. ప్రపంచ వ్యవహారాలని చెప్పబడే విషయాలు కూడా దైవాజ్ఞల పరిధిలోనే ఉన్నాయి. కనుక ఇస్లాం ధర్మాన్ని విశ్వసించిన మనిషి ప్రపంచ వ్యవహారాలకు



సంబంధించిన ఏ పని చేసినా అది దైవాజ్ఞల ప్రకారమే, అంటే ఖుర్ఆన్, హదీసుల వెలుగులోనే చేయవలసి ఉంటుంది. అప్పుడే అతను దేవుని దృష్టిలో పరిపూర్ణ ముస్లింగా పరిగణించబడతాడు.

# 10. సమాధులు, స్మారకచిహ్నాలు

దైవప్రవక్తలు, సజ్జనులయిన వారి అనుయాయులు సృష్టికర్త, సర్వేశ్వరుడయిన దేవుడ్ని మాత్రమే ఆరాధించాలని ప్రజలకు బోధించేవారు. కాని మూఢులు, స్వార్థపరులు పదార్థ పూజారులు ఆ మహనీయుల జీవితకాలాల్లో వారి హితోపదేశాలను పాటించకుండా వారు ఇహలోకం నుంచి వెళ్ళిపోగానే వారి విగ్రహాలను, సమాధులను, స్మారక చిహ్నాలను పూజించడం మొదలెడతారు.

"చెప్పు: 'భూమ్యాకాశాల్లో దేవునికి తప్ప మరెవరికీ అగోచర (అతీంద్రియ) విషయాలు తెలియవు. వారికసలు తాము ఎప్పుడు (బ్రతికించి) లేపబడతారో కూడా తెలియదు." (ఖుర్ఆన్-27:65)

"దేవుడు (ప్రళయ దినాన) ఈసాను నిలబెట్టి 'మర్యం కుమారుడవయిన ఈసా! నన్ను కాదని నిన్ను, నీ తల్లిని దేవుళ్ళుగా చేసుకొని ఆరాధించాలని నీవు ప్రజలకు బోధించావా?" అని అడుగుతాడు."

"దానికి ఈసా ఇలా చెబుతాడు: 'మీరు ఎంతో పవిత్రులు, పరిశుద్ధులు. నాకు అధికారంలేని విషయం గురించి నేనెలా అనగలను? నేనలాంటి మాటేదైనా అనిఉంటే అది తప్పకుండా మీ దృష్టికి వచ్చేది. నా అంతరంగంలో ఏముందో మీకు బాగా తెలుసు. కాని మీ అంతరంగంలో ఏముందో నాకేమాత్రం తెలియదు. మీరు సమస్త అగోచర విషయాలు ఎరిగినవారు." (ఖుర్ఆన్-5:16,117)

"మీరు ఆదేశించిన విషయాలే నేను వారికి బోధించాను. నాప్రభువు, మీప్రభువు కూడా అయిన దేవుడ్ని మాత్రమే ఆరాధించండని నేను వారికి చెప్పాను. వారి మధ్య జీవించి ఉన్నంతవరకే నేను వారిని కనిపెట్టుకొని ఉన్నాను. మీరు నన్ను పైకెత్తుకున్న తరువాత వారిని మీరే కనిపెట్టుకొని ఉన్నారు. మీరు అందర్నీ, అన్ని విషయాల్ని (అన్ని వేళలా) కనిపెడ్తూ ఉంటారు. ఇప్పుడు మీరు వారిని శిక్షిస్తే వారు మీ దాసులే. ఒకవేళ క్షమిస్తే మీరెంతో శక్తిమంతులు, మహా వివేకవంతులు." (ఖుర్ఆన్-5:118)

"ఆరోజు దేవుడు వారిని, నిజదేవుడ్ని వదలి వారు పూజించిన మిథ్యాదైవాలను ఒక చోట చేర్చుతాడు. అప్పుడాయన మిథ్యాదైవాలను ఉద్దేశించి 'నా యీ దాసులను మీరు అపమార్గం పట్టించారా లేక వారంతటవారే దారితప్పారా?' అని అడుగుతాడు."

"దానికి వారు ఇలా అంటారు: '(దేవ దేవ! ఎంతమాట!!) మీరు ఎంతో పరిశుద్ధులు. మిమ్మల్ని గాకుండా మరొకర్ని రక్షకుడిగా, పోషకుడిగా చేసుకునేటంతటి ధైర్యం మాకే లేదు. (ఇక వారికి మేమెలా చెప్పగలం?) అసలు మీరే వారికి, వారి తాతముత్తాత

లకు పుష్కలంగా జీవన సామగ్రి ప్రసాదిస్తూ పోయారు. చివరికి వారు (మేలు చేసిన) మిమ్మల్నే మరచిపోయి సర్వనాశనమయ్యారు.” (ఖుర్ఆన్-25:17,18)

“ఈవిధంగా (మీదైవాలు) నేడు మీరంటున్న మాటల్ని (రేపు ప్రళయదినాన) తిరస్కరిస్తారు. ఆ తర్వాత మీకు విధించబడే శిక్షనుండి మీరు ఏమాత్రం తప్పించుకోలేరు. ఎలాంటి సహాయమూ లభించదు. మీలో దౌర్జన్యానికి (సత్యతిరస్కారానికి) పాల్పడిన ప్రతివాడికీ మేము కఠినాతికఠిన యాతన చవిచూపిస్తాం.” (ఖుర్ఆన్-25:19)

“వారు నిజదేవుడ్ని వదలి ఆరాధిస్తున్న మిథ్యాదైవాలు ఏ ఒక్క వస్తువుకూ సృష్టి కర్తలు కారు. వారు స్వతహాగా సృష్టితాలు, నిర్జీవులు; సజీవులు కాదు. వారికి తాము ఎప్పుడు (బ్రతికించి) లేపబడతారో కూడా తెలియదు.” (16:20,21)

**మృతమానవులు-మిథ్యాదైవాలు:** ఇక్కడ మిథ్యాదైవాలంటే విగ్రహాలు కాదు. మరణించిన మానవులని అర్థం. దైవప్రవక్తలు, దైవప్రియులు, అమరవీరులు, పుణ్యపురుషులు చనిపోయాక మూఢజనం వారి విగ్రహాలు చేసి పూజిస్తారు. ఇస్లాంలో విగ్రహారాధన నిషేధం కనుక ఈనాడు కొందరు ముస్లింలు పక్కదారులు పట్టి వారి సమాధులను, స్మారక చిహ్నాలను ఆరాధించడం మొదలుపెట్టారు. ఆ సమాధుల్ని అలంకరిస్తారు; మొరపెట్టుకుంటారు; మొక్కుబడులు చేసుకుంటారు. ఏకేశ్వరోపా సనకు వ్యతిరేకమైన ఈ వైఖరిని ఖుర్ఆన్ తీవ్రంగా ఖండిస్తోంది.

“దేవుడు ఒక మనిషికి గ్రంథం, రాజ్యాధికారం, దైవదౌత్యం ప్రసాదించినప్పుడు, ఆ వ్యక్తి ప్రజలతో మీరు దేవుడ్ని వదలి తనకు భక్తులుగా మారమని అనడం తగదు. దానికి బదులు “మీరు (దైవ)గ్రంథాన్ని (ప్రజలకు) బోధిస్తున్నారు, స్వయంగా పఠిస్తున్నారు కూడా. అందువల్ల మీరు (మీ) ప్రభువుకు విశ్వసనీయులైన దాసులుగా రూపొందండి” అని అంటాడు అతను. అంతేకాకుండా మీరు దైవదూతలను, దైవప్రవక్త లను దేవుళ్ళుగా చేసుకొని అరాధించండని కూడా అతను ప్రజలతో అనడు. మీరొకసారి ముస్లింలైపోయిన తరువాత తిరిగి అవిశ్వాస (తిరస్కార) వైఖరి అవలంబించమని అతను ఎలా చెప్పగలడు?” (ఖుర్ఆన్-3:79,80)

“ఎంత మూఢులు వీరు, ఎలాంటి వస్తువునీ సృజించలేని వాటిని దేవునికి సాటి కల్పిస్తున్నారు! అవి స్వయంగా సృజించబడ్డాయి (అని వారికి తెలియదా?) అంతే కాదు, అవి వారికి ఏవిధమైన సహాయం చేయలేవు. అసలవి తమకుతామే సహాయం చేసుకో లేవు. మీరు వాటిని సన్మార్గం వైపుకు పిలిస్తే అవి మీ పిలుపుకు స్పందించలేవు. మీరు అరిచి గీపెట్టినా లేక మౌనంగాఉన్నా సరే, అవి మీమాటలుససేమిరా ఆలకించలేవు.” (ఖుర్ఆన్-7:191-193)

సాధారణంగా బహుదైవారాధకులు చనిపోయిన మహనీయుల సమాధులను, స్మారక చిహ్నాలను ఆరాధించడం, అక్కడ మొక్కుబడులు చెల్లించుకోవడం అందరికీ తెలిసిందే. కాని మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) దివంగతులైన కొన్నేళ్ళకు ఈ వ్యాధి



ముస్లిం సముదాయానికి కూడా సోకింది. కనుక ఈ సందర్భంగా ఆ మహనీయుని మహితోక్తులు కాస్త మననం చేసుకుందాం.

“సమాధుల్ని సందర్శించే స్త్రీలను, సమాధులపై ఆరాధనాలయాలు (దర్గాలు) నిర్మించేవారిని, అక్కడ దీపాలంకరణ చేసేవారిని దేవుడు శపించాడు.” (తిర్మిజి, అబూదావూద్, నసాయి)

“జాగ్రత్త! మీకుపూర్వం గతించిన ప్రజలు తమప్రవక్తల సమాధుల్ని ఆరాధనా లయాలుగా చేసుకునేవారు. ఈచర్య నుండి నేను మిమ్మల్ని వారిస్తున్నాను.” (ముస్లిం)

“యూదులు, క్రైస్తవులు తమ ప్రవక్తల సమాధుల్ని ఆరాధనాలయాలుగా చేసు కున్నారు. అందువల్ల దేవుడు వారిని శపించాడు.” (ముస్లిం, నసాయి)

“వారిలో ఎవరయినా సత్పురుషుడు చనిపోయిన తరువాత వారతని సమాధిని ఆరాధనాలయంగా చేసివేస్తారు. అతని చిత్రాలను (విగ్రహాలను) తయారుచేస్తారు. ప్రళయదినాన వీరు యావత్తు సృష్టిలో పరమ నికృష్టులవుతారు.” (బుఖారి, ముస్లిం)

“ఖుర్ఆన్‌లో నీవు మాటిమాటికి నీ ప్రభువు ఒక్కడ్ని గురించే ప్రస్తావిస్తుంటే వారు ఏవగింపుతో ముఖాలు తిప్పుకుంటున్నారు.” (ఖుర్ఆన్-17:46)

“ఏక దేవుడ్ని గురించి ప్రస్తావన వచ్చినప్పుడు పరలోకంపై నమ్మకంలేనివారి ముఖాలు వాడి ముడుచుకు పోతాయి. ఆయన్ని వదలి ఇతరుల్ని గురించి ప్రస్తావిస్తే చాలు, వారి ముఖాలు ఒక్కసారిగా దివిటీల్లా వెలిగిపోతాయి” (ఖుర్ఆన్-39:45)

ఈ ధోరణి దాదాపు యావత్తు బహుదైవారాధకుల్లో కన్పిస్తుంది. చివరికి ఈ జాడ్యం దురదృష్టవశాత్తు ముస్లింలకు కూడా సోకింది. ఏకదైవారాధకులని చెప్పబడే ఈ ముస్లింలు పైకి “దేవుడ్ని విశ్వసించాం, అల్లాయే మా ఆరాధ్యదైవం” అని అంటారు. కాని ఆ ఏకైక దేవుడ్ని గురించి ఎవరైనా ప్రస్తావిస్తుంటే ‘ఈ మనిషి ఎప్పుడు చూసినా దేవుడ్ని గురించే మాట్లాడుతాడు. దేవుని ప్రియభక్తులైన వలీలు, మహాపురుషు లంటే ఇతనికి అసలు గిట్టదు’ అనంటారు.

ప్రఖ్యాత తత్వవేత్త ఆలూసి రూహుల్‌మాని గ్రంథంలో తన స్వానుభవాన్ని ఇలా పేర్కొన్నారు: ఓరోజు ఒకతను ఏదో కష్టాల్లోఉండి చనిపోయిన ఓ మహనీయుడ్ని సహాయం కోసం అర్థిస్తున్నాడు. నేనతడ్ని చూసి ‘దైవదాసుడా! దేవుడ్ని అర్థించు’ అన్నాను. నామాటలు విని అతను మండిపడ్డాడు. తరువాత ప్రజలు, అతడు నా గురించి నేను వలీలకు వ్యతిరేకినని అన్నాడని తెలియజేశారు.

“మీరూ, మీ మిథ్యాదైవాలూ నరకాగ్నికి సమిధలై పోవడం ఖాయం. నరకానికే మీరంతా పోతారు. అవి నిజంగా దైవాలయితే నరకానికి పోవు. మీరంతా అక్కడే శాశ్వతంగా పడిఉండాలి. వారక్కడ తీవ్రమైన యాతనలతో హాహాకారాలు చేస్తుంటారు. రొదలు, రోదనల మధ్య వారికి ఏదీ సరిగా విన్పించదు.” (ఖుర్ఆన్-21:98-100)

మక్కాపట్నంలో అబ్దుల్లా బిన్ జబారా అనే ఒక బహుదైవారాధకుడు ఈ సూక్తిని విమర్శిస్తూ "ఈవిధంగా మా దేవతలేగాకుండా మసీహ్ (ఏసు), ఉజైర్, దైవదూతలు కూడా నరకానికి పోతారన్న మాట!" అన్నాడు. దానికి దైవప్రవక్త (సల్లం) "ఆ...దేవునికి బదులు తనను ఆరాధించాలని కోరుకునే ప్రతివ్యక్తీ తనను ఆరాధించినవారిలో చేరి పోతాడు" అని అన్నారు.

**వ్యక్తిపూజ** : దీన్నిబట్టి ప్రపంచంలో తమకు తాము దేవుళ్ళమని, భగవత్ స్వరూపులమని, అవతార పురుషులమని, అతీంద్రియ శక్తులు గలవారమని చెప్పుకుంటూ ప్రజల నుండి పూజలు, కానుకలు అందుకునే బూటకపు బాబాలు, దొంగ స్వాములు కూడా నరకానికి పోతారని తెలుస్తోంది. అయితే ప్రాపంచిక ప్రయోజనాలు లేదా పారలౌకిక సిఫారసు కోసం మహనీయుల విగ్రహాలను, వారి స్మారక చిహ్నాలను పూజించేవారు మాత్రమే నరకానికి పోతారుగాని, వారి పూజ సంగతే తెలియని ఆ మహనీయులు, వలీలు నరకానికి పోరు. వారి పూజాపురస్కారాలలో ఆ మహనీయుల పాత్ర, ప్రేరణలు ఏమాత్రం ఉండవు గనక, వారు నరకానికి పోయే ప్రసక్తే లేదు.

సాధారణంగా వ్యక్తిపూజ (Hero worship) బహుదైవారాధకుల్లో విగ్రహ పూజకు దారితీస్తుంది. ఇది ఈనాడు ముస్లింలలో సమాధి పూజకు దారితీసింది. దైవప్రవక్తల, మహాపురుషుల సమాధులను పూలదండలు, గలేబులు, దీపాలతో అలంకరించడం; వాటి చుట్టు ప్రదక్షిణలు చేయడం జరుగుతోంది. మరోవైపు వారి స్మారకచిహ్నాల విషయంలో కూడా హద్దు మీరిపోతున్నారు. ఇవన్నీ షిర్క్ (బహు దైవారాధన)కు దారితీసే విషయాలు. 'షిర్క్' మనిషిని నేరుగా నరకానికి చేర్చుతుంది.

రెండవ ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) బహుదైవారాధన (షిర్క్)కు సంబంధించిన ఛాయను కూడా సహించేవారు కాదు. మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఓసారి మక్కా నగరం శివార్లలోని హుదైబియా ప్రాంతంలో ఒక చెట్టు క్రింద నిల్చొని దౌత్యనీతిని ఉల్లంఘించిన అవిశ్వాసులకు వ్యతిరేకంగా అనుచరుల్ని ధర్మపోరాటానికి ప్రేరేపిస్తూ వారి చేత శపథం చేయించారు. దైవప్రవక్త (స) కాలంలో ఆ చెట్టుకు అంతకుమించి మరెలాంటి ప్రాముఖ్యం లేదు. కాని ఆ తర్వాత హజ్రత్ ఉమర్ (రజి) పాలనా కాలంలో ప్రజలు దాన్ని ఎంతో పవిత్రమైన శుభవృక్షంగా భావించి సందర్శనం కోసం సుదూర ప్రాంతాల నుంచి కూడా రావడం ప్రారంభించారు.

హజ్రత్ ఉమర్ (రజి) ఈసంగతి విని ఆందోళన వెలిబుచ్చారు. భవిష్యత్తులో ఈవ్యాధి ముదిరి 'షిర్క్'కు దారి తీయవచ్చని భావించి, వెంటనే ఆయన కొందరు మనుషుల్ని పంపి ఆ చెట్టును కూకటివేళ్ళతో సహా నరికివేయించారు.

మరోసారి ఆయన హజ్ చేసి తోటియాత్రికులతో కలసి మదీనా తిరిగొస్తుంటే దారిలో ఒక మసీదు వచ్చింది. దాన్ని చూడగానే జనం ఎంతో ఉత్సాహంతో ఆ మసీదులో నమాజ్ చేయడానికి పరుగెత్తారు. ఆ మసీదులో దైవప్రవక్త (స) ఓసారి



నమాజ్ చేశారు. అందువల్ల ప్రజలు దానికి ఎంతో ప్రాముఖ్యం ఇవ్వసాగారు. ఈనాడు కూడా కొందరు హాజీలు దైవప్రవక్త (సల్లం) నమాజ్ చేసిన ప్రతి చోటా నమాజ్ చేయడానికి పరుగులు పెడుతున్నారు.

అయితే హజ్రత్ ఉమర్ (రజి)కు ఈ వైఖరి కూడా నచ్చలేదు. ఆయన వారి దగ్గరకెళ్ళి అన్నారు: "గ్రంథప్రజలు (యూదులు, క్రైస్తవులు) తమ ప్రవక్తల సమాధుల్ని, వారి స్మారకచిహ్నాలను ఆరాధనాలయాలుగా చేసుకున్నారు. కేవలం ఈ కారణంగానే వారు నాశనమయ్యారు. మీరు కూడా ఇలాంటి అవాంఛనీయ పనులకు పాల్పడి చేజేతులా నాశనం కొని తెచ్చుకోకండి."

కొందరు బహుదైవారాధకులు కాబాలో శివలింగాన్ని పోలిన నల్లరాయి ఉందని, ముస్లింలు అలాంటి గుడి చుట్టూ ప్రదక్షిణ చేస్తారని, కాబట్టి ఇది కూడా విగ్రహారాధన క్రిందికే వస్తుందని విమర్శిస్తారు. కాని నల్లరాయి కాబా గర్భగుడిలో కాకుండా, దాని వెలుపల ఓమూలన గోడలో అమర్చబడిఉందని, ఆ నల్లరాయి లింగాకారంలో గాకుండా గుంటపడి అండాకారంలో ఉందని వారు తెలుసుకోవాలి.

హజ్ సందర్భంగా యాత్రికులు కాబా చుట్టు ఏడు ప్రదక్షిణలు చేయవలసి ఉంటుంది. ఆసంఖ్యను లెక్కపెట్టుకోవడానికి వారీ నల్లరాయి దగ్గర్నుండి ప్రదక్షిణ చేయడం ప్రారంభిస్తారు. కనుక ఇలా ప్రదక్షిణ చేయడం విగ్రహారాధన క్రిందికి రాదు. ఆ మాటకొస్తే కాబా ప్రదక్షిణ కంటే నల్లరాయిని ముద్దాడటం మరింత తీవ్రమైన విషయం. దాన్ని గురించి ఖలీఫా ఉమర్ (రజి) ఏమన్నారో చూడండి:

"ఆయన ఓసారి కాబా (గర్భగుడి) గోడలోని నల్లరాయిని సంబోధిస్తూ ఇలా అన్నారు: 'నీవు ఎలాంటి లాభంగాని, నష్టంగాని కలిగించలేని ఒక రాయివి మాత్రమే. దైవప్రవక్త (సల్లం) గనక నిన్ను ముద్దడటాన్ని చూసి ఉండకపోతే నేను నిన్ను ఎన్నిటికీ ముద్దాడను." (బుఖారి)

## 11. షిర్క్ చేసేవారికి సిఫారసు లేదు

"ఆయన్ను వదలి ఇతరులను సంరక్షకులుగా, సహాయకులుగా చేసుకున్నవారు "ఈ దైవాలు (విగ్రహాలు, దైవదూతలు వగైరా) మమ్మల్ని దేవుని సన్నిధికి చేర్చుతాయని మాత్రమే మేము వీటిని ఆరాధిస్తున్నాం" అంటారు. (ఇలా) వారు విభేదిస్తున్న వ్యవహారాలను గురించి (తీర్పుదినాన) దేవుడు తప్పకుండా వారి మధ్య తీర్పుచేస్తాడు. అబద్ధాల కోరు, సత్యతిరస్కారి అయిన ఏ మనిషికీ దేవుడు సన్మార్గం చూపడు." (ఖుర్ఆన్-39:3)

బహుదైవారాధకులు సృష్టికర్త, విశ్వప్రభువయిన దేవుడు ఒక్కడే అని అంగీక రించినప్పటికీ విగ్రహాలను, ప్రకృతిశక్తులను, మతగురువులను ఆరాధించడానికి వారు రెండు కారణాలు చెబుతున్నారు. ఒకటి, ఈ 'దేవతలు' తమను దేవుని సామిప్యానికి గొనిపోతాయని, దేవుని దగ్గర సిఫారసుచేసి తమను గట్టెక్కిస్తాయని అంటారు. రెండు,

ఏకాగ్రత కోసం మాత్రమే తాము విగ్రహాలను ముందుంచుకొని ప్రార్థన చేస్తామని మరికొందరు బహుదైవారాధకులు చెబుతారు. కాని ఈ రెండు వాదనలు ఏకేశ్వరోపాసనకు విరుద్ధమైనవని, ఏ దేవతలనయితే వారు ఆరాధిస్తున్నారో ఆ దేవతలు వారి ఆరాధనను పరలోకంలో ఖండిస్తాయని ఖుర్ఆన్ నిష్కర్షగా చెబుతోంది.

సూత్రప్రాయంగా సర్వమతస్థులు దేవుడు ఒక్కడే అని ఒప్పుకుంటూనే ఆచరణలో అనేకమంది ఆ ఏకేశ్వరుడ్ని ఆరాధించలేక పోతున్నారు. సృష్టికర్త, ప్రభువు, పోషకుడైన అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలని, కష్టాలలో ఆయన్నే వేడుకోవాలని; ఆయన ఆజ్ఞల్నే శిరసావహించాలని; సృష్టితాలను ఆయనకు సాటి కల్పించకూడదని; జీవితంలోని ఏ రంగంలో కూడా ఆయన ఆజ్ఞలకు వ్యతిరేకంగా నడచుకోరాదని ఖుర్ఆన్ పలువిధాలా చెబుతోంది. అలా చేయకపోతే పరలోకంలో శాశ్వత నరక శిక్షలు చవిచూడవలసి వస్తుందని కూడా ఖుర్ఆన్ హెచ్చరిస్తోంది.

"ఆయన్ను వదలి వీరు ప్రార్థిస్తున్న దైవేతరులకు ఎలాంటి సిఫారసు చేసే అధికారం లేదు. కాకపోతే వీరేదైనా విషయపరిజ్ఞానం ఆధారంగా సత్యానుగుణమైన సాక్ష్యమిస్తే అందుకు అనుమతి లభిస్తుంది." (ఖుర్ఆన్–43:86)

"ఉపాధి విషయంలో దేవుడే మీలో కొందరికి కొందరిపై ఆధిక్యత నిచ్చాడు. ఇలా ఆధిక్యత పొందినవారు తమ బానిసలతో సమానులయ్యే విధంగా వారికి తమ ఉపాధిని పంచివ్వరు కదా! అలాంటప్పుడు వారు దేవుడు చేసిన మేలును ఎలా మరచి ఆయన్ని నిరాకరిస్తున్నారు?' వారు నిజదేవుడ్ని వదలి, భూమ్యాకాశాల నుండి తమకు ఏమాత్రం ఉపాధినిచ్చే శక్తిలేని మిథ్యాదైవాలను ఆరాధిస్తున్నారు. అసలా దైవాలు ఈపని చేయలేవు కూడా. కనుక దేవుని విషయంలో (తప్పుడు) ఉదాహరణలు ఇవ్వకండి. (సరైన ఉదాహరణలు) దేవునికి మాత్రమే తెలుసు, మీకు తెలియదు" (ఖుర్ఆన్–16:71-74)

బహుదైవారాధకులు తమ సృష్టికర్త, స్వామి, ప్రభువు, పోషకుడయిన దేవుడు ఒక్కడే అని నమ్ముతారు. అయితే ప్రకృతిశక్తులు, విగ్రహాలు, తాము కల్పించుకున్న ఇతర మిథ్యాదైవాలు ఆ మహాదేవుని ప్రభుత్వంలో పనిచేస్తున్న అధికారులని, ఆయన కొలువులో వాటి సిఫారసు చెల్లుతుందని భావించి మిథ్యాదైవాల్ని ఆరాధిస్తారు. వారు దేవుడ్ని ప్రాపంచిక చక్రవర్తులతో పోల్చుతూ, చక్రవర్తి దగ్గరకు నేరుగా వెళ్ళడం, అతడ్ని ఒప్పించడం కష్టం గనక, అతని ఆస్థానంలో ఉండే ఉద్యోగుల్ని ప్రసన్నం చేసుకుంటే వారతని వద్ద తమనుగురించి సిఫారసు చేస్తారని, అలాగే తాము పూజించే ఈ దేవతలు కూడా దేవుని దగ్గర సిఫారసు చేస్తారని అంటారు. ముస్లింలలో కూడా ఒక వర్గం ఇదే అపోహలో పడి దైవప్రియులను మధ్యవర్తులుగా స్వీకరించింది.

ఖుర్ఆన్ ఈ అభిప్రాయాన్ని ఖండిస్తోంది. తప్పుడు తార్కాణాల ద్వారా దేవుడ్ని ప్రాపంచిక రాజులతో పోల్చుతూ, ఆయనకు మానవ బలహీనతల్ని ఆపాదించకూడదని, ఈవిషయంలో దేవుడు మాత్రమే సరైన తార్కాణాలు ఇచ్చి వాస్తవం తెలియజేయగలడని చెబుతోంది. ఆ తార్కాణాలు ఇలా పేర్కొనబడ్డాయి:



"దేవుడు ఒక ఉదాహరణ ఇస్తున్నాడు (వినండి): ఒక బానిస ఉన్నాడు ఇతరుల అధీనంలో. తనంతటతాను ఏపనీ చేయడానికి అతనికి అధికారం లేదు. (స్వతంత్రుడైన) మరొక వ్యక్తి ఉన్నాడు. మేమతనికి మంచి ఉపాధి ప్రసాదించాం. అందులో కొంత భాగాన్ని అతను రహస్యంగాను, బహిరంగంగానూ (మా మార్గంలో) ఖర్చు పెడ్తున్నాడు. ఇప్పుడు చెప్పండి. వీరిద్దరూ ఒకటేనా? (కాదని వారు చెప్పక తప్పదు.) దేవుడే ప్రశంసనీయుడు. కాని చాలామంది (ఈ ముక్కుసూటి మాట కూడా) అర్థం చేసుకోలేక పోతున్నారు." (ఖుర్ఆన్–16:75)

"దేవుడు మరొక ఉదాహరణ ఇస్తున్నాడు: ఇద్దరు మనుషులు ఉన్నారు. వారిలో ఒకడు మూగవాడు. పైగా ఏ పనీ చేయలేని అసమర్థుడు. అందువల్ల అతను తన యజమానికి భారమై ఉన్నాడు. యజమాని అతడ్ని ఎక్కడికి పంపినా ఎలాంటి లాభాన్నీ తీసుకురాలేడు. అయితే రెండవ వ్యక్తి (ప్రజలకు) మంచిని బోధిస్తూ ఉంటాడు. స్వయంగా తాను కూడా సన్మార్గంలో నడుచుకుంటాడు. చెప్పండి, వీరిద్దరు ఒకటేనా?" (ఖురాన్–16:76)

"ఆయన మీ గురించి ఒక ఉదాహరణ ఇస్తున్నాడు: మేము మీకు ప్రసాదించిన సిరిసంపదల్లో మీతోపాటు సమాన భాగస్వాములైన మీబానిసలు ఎవరైనా ఉన్నారా? మీరు మీతోటి యజమానులకు భయపడినట్లు వారిని చూసి మీరు భయపడతారా? ఈ విధంగా మేము బుద్ధిజ్ఞానం కలవారి కోసం మా సూక్తులు విడమరచి తెలియజేస్తున్నాము." (ఖుర్ఆన్–30:28)

"దేవుడు వేరొక ఉదాహరణ ఇస్తున్నాడు, (జాగ్రత్తగా వినండి): ఒక మనిషి ఉన్నాడు. అతనికి వక్ర మనస్కులయిన అనేకమంది యజమానులు ఉన్నారు. వారిలో ప్రతి ఒక్కడూ అతడ్ని తన వైపు లాగుతుంటాడు. దీనికి భిన్నంగా మరొక వ్యక్తి ఉన్నాడు. అతను పూర్తిగా ఒకే యజమానికి బానిసగా ఉన్నాడు. మరి వీరిద్దరి పరిస్థితి ఒకటేనా? (కాదు.) సకల స్తోత్రాలకు దేవుడే అర్హుడు. కాని చాలామంది అజ్ఞానాంధకారంలో పడిఉన్నారు." (ఖుర్ఆన్–39:29)

"అసత్యాలు, అభూత కల్పనలు మానేయండి. పూర్తిగా ఏకోన్ముఖులై అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించండి. ఆయనకు ఎవరినీ సాటి కల్పించకండి. దేవునికి సాటి కల్పించినవాడు ఆకాశం నుండి అమాంతం అథఃపాతాళంలోకి పడిపోయినట్లే. ఇక అతడ్ని పక్షులయినా పొడుచుకొని తింటాయి; లేదా గాలి అయినా ఎత్తి దూరంగా విసిరి పడ వేస్తుంది." (ఖుర్ఆన్–22:30,31)

దేవునికి ఇతరుల్ని సహవర్తులుగా చేయడం, ఆయన గుణగణాల్లో, శక్తి సామర్థ్యాలలో, అధికారాల్లో, హక్కుల్లో ఆయన దాసులకు భాగస్వామ్యం కల్పించడం వగైరా విషయాలు అసత్యాలు, అభూతకల్పనల క్రిందికే వస్తాయి. ఏ విషయంలోనైనా దేవుని ఆజ్ఞలకు, ఆయనప్రవక్త బోధనలకు వ్యతిరేకంగా ఇది ధర్మం, అది అధర్మమని నిర్ణయించడం, దాన్ని ఆచరించడం కూడా అసత్యం క్రిందికే వస్తాయి.

# 12. విగ్రహారాధన

“మీరు ఇహలోక జీవితంలో దేవుడ్ని వదలి విగ్రహాలను మీ మధ్య పరస్పరం ప్రేమాభిమానాలు జనింపజేసే సాధనాలుగా చేసుకున్నారు. కాని పునరుత్థాన దినాన మీరు ఒకర్నొకరు ఖండించుకుంటూ దూషించుకుంటారు. నరకాగ్నే మీ నివాసం అవుతుంది. మీకక్కడ సహాయం చేసేవాడే లభించడు.” (ఖుర్‌ఆన్–29:25)

“మానవులారా! ఒక ఉదాహరణ ఇస్తున్నాం, వినండి: మీరు దేవుడ్ని వదలి ప్రార్థిస్తున్న మిథ్యాదైవాలన్నీ కలసి కనీసం ఒక ఈగ నయినా సృష్టించదలచుకుంటే, దాన్ని కూడా సృష్టించ లేవు. పైపెచ్చు ఆ ఈగ వాటి దగ్గర్నుంచి ఏదయినా వస్తువుని గుంజుకుంటే ఆ వస్తువుని కూడా అవి దాన్నుండి విడిపించుకోలేవు. సహాయం అర్థించేవారు, సహాయం అర్థించబడేవారు ఇద్దరూ బలహీనులే. అసలు శక్తిమంతుడు, గౌరవనీయుడు దేవుడు మాత్రమే.” (ఖుర్‌ఆన్–22:73,74)

ఈ సూక్తుల సందర్భంలో నాకు “ప్రపంచమతాలు-ఇస్లాం” అనే పుస్తకంలో మౌలానా మతీన్ తారిఖ్ బాగ్పతి తెలిపిన ఒక సంఘటన గుర్తుకొచ్చింది. ఆయన ఆ పుస్తకంలో ఇలా వ్రాశారు:

“స్వామి దయానంద సరస్వతి ఆర్యసమాజం వ్యవస్థాపకుడు. ఆయనకు మొదట్లో విగ్రహారాధన పట్ల గట్టి నమ్మకముండేది కాని శివరాత్రినాడు ఆయన శివపూజ చేస్తుండగా ఒక ఎలుక శివుని విగ్రహంపైకెక్కి, శివుని నైవేద్యం తినసాగింది. ఈ దృశ్యంతో ఆయన కళ్ళు తెరచుకున్నాయి. శివుడు ఒక ఎలుకను తనపై నుండి తొలగించలేక పోయాడు. ఇలాంటి దేవుడ్ని పూజించడం వల్ల లాభం ఏమిటి? ఇలా ఆలోచించిన తరువాత ఆయన హిందూ మతాన్ని సంస్కరించాలని కంకణం కట్టుకున్నారు. వివిధ మతగ్రంథాలను అధ్యయనం చేశారు. ఆయనగారు హజ్‌యాత్ర కూడా చేశారట. ఆ తరువాత ఆయన అనేక దేవతల ఆరాధనకన్నా, ఒకేదైవాన్ని పూజించడం మంచిదన్న అభిప్రాయానికి వచ్చారు. వేదాలలో ఎక్కడా విగ్రహారాధన ప్రసక్తి లేదని కూడా ఆయన అన్నారు.”

ఆర్యసమాజ నాయకులు స్వామి అగ్నివేశ్ ఒక సమావేశంలో ప్రసంగిస్తూ “స్వామి దయానంద సరస్వతి శివపూజ చేస్తున్నప్పుడు ఒక ఎలుక వచ్చి శివుని విగ్రహం మీద మూత్రవిసర్జన చేసింద”ని తెలియజేశారు. ఈ సంఘటనతో దయానంద సరస్వతి విగ్రహారాధన, బహుదైవారాధనలను వ్యతిరేకించి ఒకే దైవాన్ని ఆరాధించడం మంచి దన్న అభిప్రాయానికయితే వచ్చారుగాని, విభిన్న మతగ్రంథాలు అధ్యయనం చేసి, చివరికి హజ్ కూడా చేసి ఆ ఏకదైవారాధనా భావన ఇస్లాంలో మాత్రమే ఉందన్న యదార్థాన్ని ఆయన జీర్ణం చేసుకోలేకపోయారు. దానికి బదులు ఆయన కొత్తాది దైవాలకు స్థానం కల్పించిన హిందూమతాన్ని సంస్కరించడానికి పూనుకున్నారు.

“మీరూ, మీ మిథ్యాదైవాలూ నరకాగ్నికి సమిధలయి పోవడం ఖాయం. నరకానికే



మీరంతా పోవలసి ఉంటుంది. అవి నిజంగా దైవాలయితే నరకానికి పోవు. అప్పుడు మీరంతా అక్కడే శాశ్వతంగా పడి ఉండాలి. వారక్కడ తీవ్రమయిన యాతనలతో హాహా కారాలు చేస్తూ ఉంటారు.” (ఖుర్‌ఆన్–21:98,99)

“కనుక మనుషులు, రాళ్ళు ఇంధనం కాగల నరకాగ్నికి భయపడండి. సత్య తిరస్కారుల కోసం అది సిద్ధపరచబడి ఉంది.” (ఖుర్‌ఆన్–2:23,24)

పరలోకంలో సత్యతిరస్కారులే కాదు, వారు ఆరాధిస్తూ వచ్చిన విగ్రహాలు కూడా నరకాగ్నికి సమిధలయి పోతాయని ఈ సూక్తిలో దేవుడు పరోక్షంగా హెచ్చరిస్తున్నాడు. అప్పుడు సత్యతిరస్కారుల ముందు తాము ఇంతకాలంగా పూజిస్తూ వచ్చిన విగ్రహాలు మిథ్యాదైవాలన్న సత్యం బట్టబయలవుతుంది.

“కనుక మీరు విగ్రహాల మాలిన్యానికి దూరంగా ఉండండి.” (ఖుర్‌ఆన్–22:30)

“మీరు దేవుడ్ని వదలి ప్రార్థిస్తున్న మిథ్యాదైవాలు మీకు ఏమాత్రం సహాయపడలేవు. అసలవి తమకుతామే సహాయం చేసుకోలేవు. పైగా, మీరు వాటిని సన్మార్గం వైపు పిలిస్తే అవి మీ మాటలు ఆలకించలేవు. అవి మీవైపు చూస్తున్నట్లు పైకి కన్పిస్తాయి. నిజానికి అవి దేన్నీ చూడటంలేదు.” (ఖుర్‌ఆన్–7:197,198)

“వారు (నిజ)దేవుడ్ని వదలి మిథ్యాదైవాలనే ఆరాధిస్తున్నారు. పైగా కష్టకాలంలో అవి తమను ఆదుకుంటాయని ఆశలు పెట్టుకున్నారు. కాని ఆ దైవాలు వారిని ఏవిధంగానూ ఆదుకోలేవు. పైపెచ్చు స్వయంగా వారే వాటి (రక్షణ) కోసం సైన్యాలుగా తయారై ఉన్నారు.” (ఖుర్‌ఆన్–36:74,75)

“(విశ్వాసులారా!) వారు నిజదేవుడ్ని వదలి ప్రార్థించే మిథ్యాదైవాలను మీరు దూషించకండి. అలాచేస్తే వారు బహుదైవారాధనను కూడా మించిపోయి, అజ్ఞానంతో నిజదేవుడ్నే దూషించడానికి సిద్ధపడతారు. మేము ప్రతి వర్గానికీ వారు చేస్తున్న పనులనే ఆకర్షణీయమైనవిగా చేశాం. చివరికి వారు తమ ప్రభువు సన్నిధికే మరలి పోవలసిఉంది. అప్పుడాయన గతంలో వారు చేస్తుండిన (తప్పుడు) పనులేమిటో వారికి తెలియజేస్తాడు.” (ఖుర్‌ఆన్–6:108)

# 13. భూత పిశాచాల పూజ

“మానవులు తమ సృష్టికర్తయిన దేవునికి భూతపిశాచాలను సాటికల్పించి పూజిస్తున్నారు. పైగా వారు తెలిసో తెలియకో ఆయనకు కొడుకుల్ని, కూతుళ్ళను కూడా అంటగడుతున్నారు. కాని దేవుడు ఎంతో పరిశుద్ధుడు. వారు కల్పించి పలుకుతున్న మాటలకు ఆయన ఎంతో అతీతుడు. ఆయన యావత్తు భూమ్యాకాశాలనే సృష్టించిన అద్భుత శక్తిసంపన్నుడు. ఆయనకసలు భార్యే లేనప్పుడు సంతానం ఎలా కల్గుతుంది? ఆయనే ప్రతిదాన్నీ సృష్టించేవాడు. ప్రతి విషయమూ తెలిసినవాడు కూడా ఆయనే.” (ఖుర్‌ఆన్–6:100,101)

“కొందరు మానవులు జిన్నులలో కొందరి రక్షణ కోరుతున్నారు. ఈవిధంగా వారు జిన్నుల గర్వాన్ని మరింత అధికం చేశారు.” (ఖుర్ఆన్–72:6)

“వారక్కడ (అక్కసు వెళ్ళబుచ్చుకుంటూ) ‘ప్రభూ! మమ్మల్ని పెడదారి పట్టించిన మానవుల్ని, జిన్నుల్ని మాకు చూపించు. వారిని మేము కాళ్ళక్రింద పడేసి (కసితీరా) తొక్కి అవమానపరుస్తాం’ అనంటారు.” (ఖుర్ఆన్–41:29)

“ఆయన మానవులందరినీ సమావేశపరచిన తరువాత ‘వీరు మిమ్మల్ని ఆరాధిస్తుండేవారా?’ అని దైవదూతల్ని ప్రశ్నిస్తాడు. దానికి వారు ‘మీరు పరమపవిత్రులు. మాకు మీతోనే సంబంధం ఉంది. వారితో మాకెలాంటి సంబంధం లేదు. వీరసలు మమ్మల్ని కాదు, భూతపిశాచాల్ని మాత్రమే పూజిస్తుండేవారు. వారిలో చాలామంది భూతాలనే నమ్మేవారు’అని సమాధానమిస్తారు. అప్పుడు మేము ‘ఈరోజు మీలో ఏఒక్కడూ ఎవరికీ ఎలాంటి లాభంగాని, నష్టంగాని కలిగించలేడు’ అంటాం. మరోవైపు దుర్మార్గులతో ‘ఇక మీరు తిరస్కరిస్తూ ఉండిన ఈ నరకశిక్ష చవిచూడండి’ అంటాం.” (ఖుర్ఆన్–34:40–42)

“వారు, సులైమాన్ పాలనాకాలం పేరుతో దయ్యాలు చెప్పే విషయాల్ని పాటించనారంభించారు. కాని సులైమాన్ ఎన్నడూ సత్యతిరస్కారం జోలికే పోలేదు. జనానికి భూతవిద్య నేర్పుతుండిన ఆ దయ్యాలే సత్యతిరస్కారానికి పాల్పడ్డాయి. అంతేకాదు, బాబిల్‌లో హారూత్, మారూత్ అనే ఇద్దరు (మానవాకారంలో వచ్చిన) దైవదూతలపై అవతరించిన విషయాల్ని కూడా వారు పట్టుకు వ్రేలాడారు. కాని ఆ దైవదూతలు జనానికి ఆ విషయాలు నేర్పే ముందు “మేము ప్రజల్ని పరీక్షించడానికి పంపబడిన వాళ్ళం మాత్రమే. అందువల్ల మీరు సత్యతిరస్కారానికి పాల్పడకండి” అని వారికి స్పష్టంగా చెప్పేవారు. అయినా వారు భార్యాభర్తల్ని విడదీసే ఆ క్షుద్రవిద్యనే నేర్చుకోవడానికి ఉబలాటపడేవారు.”

“దైవాజ్ఞ లేనిదే ఆ చేతబడి వల్ల కూడా ఎవరికీ ఎలాంటి నష్టం వాటిల్లేది కాదు. దాన్ని కొన్నవాడికి పరలోక(స్వర్గ)ంలో ఎలాంటి చోటు లేదని వారికి బాగా తెలుసు. అయినా వారు లాభానికిబదులు నష్టం కల్గించేదానినే నేర్చుకోవడానికి ఉత్సాహపడ్డారు. వారు తమ అంతరాత్మలను అమ్ముకొని ఎంతటి నీచమైన సరుకు కొన్నారు! వారికీ విషయం తెలిసివుంటే ఎంత బాగుండేది! వారు గనక విశ్వసించి భయభక్తుల వైఖరి అవలంబించిఉంటే, వారికి దేవుని వద్ద ఎంతోమంచి ప్రతిఫలం లభించివుండేది. వారికీ విషయం తెలిసిఉంటే ఎంత బాగుండేది!” (ఖుర్ఆన్–2:102,103)

## 14. మనోవాంఛల దాస్యం

ఏమతాన్ని, వ్యవస్థను, ఇజాన్నీ అనుసరించకుండా ఇష్టానుసారం విశృంఖల జీవితం గడిపే పచ్చి స్వార్థపరులకు, నాస్తికులకు వారి అభీష్టం, మనోవాంఛలే వారికి దేవుళ్ళవుతాయి. దేవుడు లేడని అనే వాడిక్కూడా అతనిమనోవాంఛ దేవుడవుతుంది.



ఇలాంటి మనుషుల మస్తిష్కంలోకి ఈవిధంగా నిజదేవుని స్థానంలో మనోవాంఛ రూపంలో ఒక మిథ్యాదైవం వచ్చి చేరుతుంది.

“తన మనోవాంఛని దైవంగా చేసుకున్నవాడ్ని గురించి నీవెప్పుడైనా ఆలోచించావా? అతను విద్యాజ్ఞానాలు కలిగివున్నా దేవుడు అతడ్ని దారి తప్పించాడు. అతని హృదయ కవాటాలు మూసివేశాడు; చెవులకు సీలువేశాడు; కళ్ళకు గంతలు కట్టాడు. దేవుడే అలా చేసిన తర్వాత ఇక అతనికి ఎవరు దారి చూపగలరు? మీరు గుణపాఠం నేర్చుకోరా?” (ఖుర్ఆన్–45:23)

“తన మనోవాంఛనే దైవంగా చేసుకున్నవాడ్ని చూశావా నీవు? అలాంటివాడ్ని దారిలోకి తీసుకురాగలవా? వారిలో చాలామంది (నీ మాటలు) వింటారని, అర్థం చేసుకుంటారని భావిస్తున్నావా? వారసలు పశువుల్లాంటివారు. కాదు, అంతకన్నా దిగజారిపోయారు.” (ఖుర్ఆన్–25:43,44)

మనోవాంఛను దైవంగా చేసుకోవడం ఏమిటని కొందరు ఆశ్చర్యపోవచ్చు. కాని నిజదేవుడు పంపిన ధర్మం వదలి మనోవాంఛలకు బానిసైన ప్రతి మనిషికీ అతని మనోవాంఛలే దైవాలవుతాయి. మిథ్యాదైవం గురించి దైవప్రవక్త (స) ఇలా చెప్పారు: “ఈ ఆకాశం క్రింద దేవుడు మినహా పూజలందుకుంటున్న ఇతర ఆరాధ్యదైవాలలో అతి నికృష్టదైవం ఏదైనా ఉందంటే అది మనిషి అనుసరించే మనోవాంఛే.”

“మానవాత్మ సాక్షి! దాన్ని తీర్చిదిద్ది, దానికి పాపపుణ్యాలను గురించి తెలిపిన వాడి సాక్షి! నిస్సందేహంగా ఆత్మ ప్రక్షాళనం చేసుకున్నవాడు ధన్యుడు. అంతరాత్మను అణచి పెట్టినవాడు నాశనమవుతాడు.” (ఖుర్ఆన్–91:6–10)

ఇక్కడ తీర్చిదిద్దడం అంటే మనిషిగా మనుగడ సాగించడానికి దేవుడు అతనికి తగిన శక్తిసామర్థ్యాలిచ్చాడు. నడవడానికి కాళ్ళు, పనిచేయడానికి చేతులు, చూడటానికి కళ్ళు, వినడానికి చెవులు, మాట్లాడటానికి నోరు, రుచి చూడటానికి నాలుక, వాసన చూడటానికి ముక్కు, ఆలోచించడానికి మేధ వగైరా అవయవాలు ప్రసాదించాడు.

అంతేకాదు, అతనికి మంచీచెడుల విచక్షణాజ్ఞానం కూడా ప్రసాదించాడు. పాపం ఏదో, పుణ్యం ఏదో తెలుసుకునే జ్ఞానాన్ని దేవుడు అతని అంతఃచేతనలో ఉంచాడు. ఆపై అతనికి తన ప్రవక్తల ద్వారా సన్మార్గం ఏదో, అపమార్గం ఏదో, ధర్మం ఏదో, అధర్మం ఏదో కూడ తెలియజేశాడు. అలాంటప్పుడు అతను అంతరాత్మ ప్రబోధన విని రుజుమార్గం అవలంబిస్తే అతని జీవితం సార్థకమవుతుంది. పరలోకంలో మోక్షం పొందగలడు. దానికి భిన్నంగా అతను అంతరాత్మ ప్రబోధనను నొక్కిపట్టి మనోవాంఛలకు బానిసయిపోతే దైవాగ్రహానికి గురై మరణానంతరం నరకకూపంలో పడిపోతాడు. దివ్యఖుర్ఆన్‌లోని ఈ సూక్తులు వినండి:

“ప్రవక్తా! కాస్త ఈ మనిషి గాథ వారికి విన్పించు: మేమతనికి మా సూక్తుల జ్ఞానం ప్రసాదించాం. కాని అతను వాటిని ఆచరించకుండా పారిపోయాడు. షైతాన్ అతని

వెంటపడ్డాడు. ఈవిధంగా అతను చివరికి దారి తప్పినవారిలో కలసిపోయాడు. మేము తలచుకుంటే అతనికి ఆ సూక్తుల ద్వారా ఉన్నతిని ప్రసాదించి ఉండేవారం. కాని అతను ప్రపంచ వ్యామోహం వైపుకే మొగ్గి మనోవాంఛలకు బానిసైపోయాడు. కుక్కను కొట్టినా కొట్టకపోయినా అది నాలుకను చాచిపెట్టే ఉంచుతుంది. ఇలా తయారైంది ఆ మనిషి పరిస్థితి. మాసూక్తులు తిరస్కరించేవారికి కూడా ఈ దృష్టాంతమే వర్తిస్తుంది. నీవీ గాథ వారికి విన్పించు, (సత్యం గురించి) ఆలోచిస్తారేమో." (7:175,176)

"ఒకవేళ సత్యం వారి మనోవాంఛలకు అనుగుణంగా పనిచేస్తుంటే భూమ్యాకాశాలు, వాటిలో ఉన్న సృష్టిరాసుల వ్యవస్థ అంతా ఛిన్నాభిన్నమైపోయేది.... కాదు, మేము వారి దగ్గరకు వారి ప్రస్తావనే తీసుకొచ్చాము. కాని వారు తమ ప్రస్తావన పట్లే విముఖులయి పోతున్నారు." (ఖుర్‌ఆన్–23:71)

ఇక్కడ వారి ప్రస్తావన అంటే మానవుల జీవిత విధానానికి సంబంధించిన విషయాలని అర్థం. మానవులు ఈ ప్రపంచంలో ప్రశాంత జీవితం గడపాలంటే సమంజసమైన, సముచితమైన, న్యాయమైన, నిష్పాక్షికమైన ఒక సామాజిక వ్యవస్థ (Social Order) ఎంతో అవసరం. భాష, వర్ణం, వర్గం, మతం, జాతి, తెగ, కులం, ప్రాంతం మొదలైన ప్రాతిపదికలపై ఏర్పడే దురభిమానాలతో, ఇతర బలహీనలతో సతమతమయ్యే మానవులు ఇలాంటి "మంచి వ్యవస్థ"ను నిర్మించుకోలేరు. దాన్ని మానవుల సృష్టికర్త, సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు, ప్రభువు, పోషకుడయిన దేవుడు మాత్రమే నిర్మించగలడు. ఆయనే ఇలాంటి వ్యవస్థ ద్వారా మానవుల్ని అదుపు చేస్తూ ప్రపంచంలో శాంతీ సుస్థిరతలు, నీతి న్యాయాలను నెలకొల్పగలడు.

మన మెదడు కేంద్రనాడీమండల వ్యవస్థద్వారా మన అవయవాల్ని కంట్రోల్ చేస్తూ మన ఆరోగ్యానికి, మన కార్యకలాపాల సక్రమ నిర్వహణకు ఎలా దోహదపడుతున్నదో, దేవుడు కూడా తాను నిర్ణయించిన "ఏకదైవారాధనా విధానం" (ఇస్లాం) ద్వారా మానవుల్ని కంట్రోల్ చేస్తూ వారి పరస్పర సంబంధాలకు, శాంతియుతమైన జీవితానికి దోహదపడతాడు. అదీగాక, ఈ విధానం ద్వారా మానవుడు పరలోకంలో దైవప్రసన్నతకు, స్వర్గసౌఖ్యాలకు కూడా అర్హుడవుతాడు. ఇలాంటి జీవనవిధానాన్ని, సామాజిక వ్యవస్థను, దైవధర్మాన్ని మానవుడు త్రోసిపుచ్చుతున్నాడంటే, అతను తనకు శ్రేయస్కరమైన సొంత జీవిత విధానానికే తూట్లుపొడిచి ఇహలోకంలో అశాంతి, పరలోకంలో నరకయాతనలను చేజేతులా కొని తెచ్చుకుంటున్నాడన్న మాట.

## 15. ప్రకృతిశక్తుల ఆరాధన

ఏకేశ్వర భావం ప్రతి మానవుని నైజంలో వేళ్ళూని ఉన్నప్పటికీ ఆచరణలో అనేక మంది ఈ సత్యానికి కట్టుబడి ఉండలేకపోతున్నారు. ఆధిక్యత ఉన్న చోటికే అవసరార్థులు గుమికూడటం సహజం. కనుక ఆధిక్యత కలిగిఉన్నవాడే అర్థులకు ఆరాధ్యుడుగా, అర్థించదగినవాడిగా, ఆశ్రయమిచ్చేవాడిగా, ఆపదల మొక్కులవాడిగా అవుతాడు. బహుదైవారాధ్య భావం కలిగినవారంతా ఈ అర్థాలలోనే అసాధారణ శక్తి ఉందని



భావించిన ప్రతి సృష్టితం (Creature)ను పూజించడం ప్రారంభించారు. బహుదైవారాధకుల్లో మొదట ప్రకృతిశక్తుల ఆరాధన ఈ విధంగానే మొదలయింది.

ఈ భావన నుండే సూర్యభగవానుడు, అగ్నిదేవుడు, వాయుదేవుడు, వరుణ దేవత మున్నగు దేవుళ్ళు ఉనికిలోకి వచ్చారు. చివరికి బహుదైవారాధకుల్లో "ఏకోబ్రహ్మ ద్వితీయనాస్తి, ఏకోనారాయణ, అద్యితీయుడు" అని చెప్పుకునే అద్వైత మతస్థులు కూడా ఆచరణలో ఏకదైవారాధనకు కట్టుబడి ఉండలేకపోయారు.

ఇస్లాం అనాదికాలం నుండీ సృష్టికర్త (Creator) మాత్రమే ఆరాధ్యుడు, ఆశ్రయమిచ్చేవాడు, అర్థించదగినవాడు, కష్టసుఖాలకు మూలకారకుడు అయిన దేవుడని చెబుతూవస్తోంది. అలాగే సృష్టితాలు (Creatures) సంపూర్ణ దైవత్వం కలిగిన అలాంటి దేవుడ్ని ఆరాధించే, అర్థించే, ఆశ్రయం కోరే దాసులు మాత్రమేనని కూడా మానవులకు ఉపదేశిస్తూ వస్తోంది. ఖుర్‌ఆన్‌లోని ఈ సూక్తులు గమనించండి:

"రాత్రి, పగలు, సూర్యుడు, చంద్రుడు (ప్రకృతి శక్తులన్నీ) దేవుని (ఏకత్వానికి, ఆయన శక్తిసామర్థ్యాలకు) నిదర్శనాలే. (కనుక) సూర్యచంద్రులకు సాష్టాంగ పడకండి. మీరు నిజంగా దేవుడ్ని ఆరాధించేవారయితే, వాటిని సృష్టించిన దేవునికే సాష్టాంగ పడండి. ప్రవక్తా! వీరు గనక తలబిరుసుతో మొండిగా వ్యవహరిస్తే వ్యవహరించనీ. (నీ ప్రభువు దైవత్వానికొచ్చే లోటేమీలేదు.) నీప్రభువు సన్నిధిలోని దైవదూతలు రేయింబవళ్ళు ఆయన్ని స్మరిస్తూనే ఉన్నారు. వారా స్మరణలో ఎన్నటికీ అలసిపోరు." (41:37,38)

## 16. అంధానుకరణ

"దేవుడు మీకోసం భూమ్యాకాశాల్లోని సమస్త వస్తువుల్ని అదుపులో ఉంచిన సంగతి మీరు గమనించలేదా? అదీగాక ఆయన తన గోచర, అగోచర మహాభాగ్యాలు (ఎన్నో) మీకోసం సమకూర్చాడు. కాని మానవుల్లో కొందరు ఎలాంటి జ్ఞానంగాని, హితబోధగాని, కాంతి ప్రసాదించే గ్రంథంగాని లేకుండానే దేవుని విషయంలో జగడమాడుతున్నారు. దేవుడు పంపినదాన్ని అనుసరించండని చెబితే మా తాతముత్తాతల నుండి వస్తున్నదాన్నే అనుసరిస్తామని అంటారు. షైతాన్ తమను మండుతున్న నరకాగ్ని వైపు ఆహ్వానిస్తున్నా వారు తమ తాతముత్తాతలనే అనుసరిస్తారా?" (ఖుర్‌ఆన్–31:20,21)

"కనుక ప్రవక్తా! వారు ఆరాధిస్తున్నవాటిని గురించి నీవు ఏమాత్రం సందేహించకు. పూర్వం తమ తాతముత్తాతలు ఎలా (గుడ్డిగా మిథ్యాదైవాలను) ఆరాధిస్తూ ఉండేవారో వీరు కూడా అలాగే (గుడ్డిగా) ఆరాధిస్తున్నారు. మేము వారికి రావలసిన కర్మఫలం వారికి పూర్తిగా ఇచ్చి వేస్తాము. అందులో ఎలాంటి కొరత చేయము." (ఖుర్‌ఆన్–11:109)

"దేవుడు అవతరింపజేసినదాని వైపుకు, దైవప్రవక్త వైపుకు రండని చెబితే, "మా తాత ముత్తాతల నుండి వస్తున్న ఆచారాలే మాకు చాలు" అంటారు వారు. మరి వీరి తాత ముత్తాతలు ఏమీ ఎరగకపోయినా, వారికి సన్మార్గం ఏమిటో తెలియకపోయినా వీరు తమ తాతముత్తాతలనే గుడ్డిగా అనుసరిస్తారా?" (ఖుర్‌ఆన్–5:104)

"వారేదయినా సిగ్గుమాలిన పని చేస్తూ, తమ తాతముత్తాతలు కూడా ఇలాగే చేస్తుండేవారని అంటారు. పైగా దేవుడే అలా చేయమని తమను ఆజ్ఞాపించాడని చెబుతారు. వారికి చెప్పు: 'నీతిబాహ్యమైన పనులు చేయమని దేవుడు ఎన్నటికీ ఆజ్ఞాపించడు. మీరు దేవుని పేరుచెప్పి మీకు తెలియని విషయాల్ని గురించి దేవుడే బోధిస్తున్నాడని అంటారా?" (7:28)

ఖుర్ఆన్‌అవతరణకు పూర్వం అరబ్బులు మతాచారమన్న భ్రమతో కాబాగృహాన్ని నగ్నంగా ప్రదక్షిణ చేసేవారు. ఖుర్ఆన్ ఈ దురాచారాన్ని నిషేధించింది.

"వీరు కరుణామయుని దాసులయిన దైవదూతల్ని స్త్రీలుగా పరిగణించారు. వారి శరీరాకృతి చూశారా వీరు? వీరి సాక్ష్యాన్ని మేము నమోదుచేస్తున్నాం. దాన్ని గురించి వీరు (మాముందు) సమాధానం ఇచ్చుకోవలసి ఉంటుంది. "దేవుడు తలచివుంటే మేము ఎన్నడూ వారిని పూజించేవారం కాదు' అనంటారు వారు. ఈ వ్యవహారంలో వాస్తవం ఏమిటో వారికి బొత్తిగా తెలియదు. కేవలం ఊహాగానాలు చేస్తున్నారు. ఇంతకు పూర్వం వారికి మేమేదైనా గ్రంథం ప్రసాదించామా? ఆ గ్రంథానికి సంబంధించి వారి దగ్గర ఏదైనా ప్రమాణం ఉందా? ఎంతమాత్రం లేదు. (ప్రమాణం లేకపోయినా) 'మా తాత ముత్తాతలు ఒక సంప్రదాయం పాటిస్తూ ఉండగా చూశాం గనక, మేము వారి అడుగు జాడల్లోనే నడచుకుంటున్నాం' అంటారు వారు." (ఖుర్ఆన్-43:19-22)

"దేవుడు అవతరింపజేసినదాన్ని అనుసరించండని అంటే 'కాదు, మా తాత ముత్తాతలు అనుసరించినదాన్నే అనుసరిస్తాం' అంటారు వారు. వారి తాత ముత్తాతలు తెలివిహీనులయినా, సన్మార్గంలో లేకపోయినా (వారినే వీరు గుడ్డిగా అనుసరిస్తారా)? కాపరి పిలుపు తప్ప మరే పిలుపూ వినలేని పశువుల్లా వుంది (ఈ) తిరస్కారుల ధోరణి. వారు (సత్యం వినలేని) బధిరులు, (సత్యం పలకలేని) మూగలు, (సత్యం కానలేని) అంధులు. అందువల్ల వారికిక ఏ విషయమూ తలకెక్కదు." (ఖుర్ఆన్-2:170,171)

అనుకరణ సహజ విషయమే. కాని అంధానుకరణ మానవునిలో ఉన్న ఓ పెద్ద బలహీనత. తాత ముత్తాతల ఆచారాలు, సంప్రదాయాలు సమంజసమయినంత వరకు వాటిని పాటించవచ్చు. కాని సమంజసం, సముచితం కాకపోతేనే చిక్కు. వాటిని పాటించడం వల్ల ప్రపంచంలోనేగాక, పరలోకంలోనూ నష్టదాయకమే.

ఈనాటి ముస్లింలలో కూడా అనేకమంది అమాయకులు, అజ్ఞానులు ధర్మ శాస్త్రంలో లేని ఆచారాలు ఎన్నెన్నో కల్పించుకున్నారు. తాము కల్పించుకున్న ఈ ఆచారలకు ఖుర్ఆన్, హదీసుల్లో ఏమయినా ఆధారాలు ఉన్నాయా అని కూడా ఆలోచించరు. సరైన దైవజ్ఞానం కలవారు ఎవరైనా "ఇలాంటి ఆధారంలేని ఆచారాలు పాటించడం మీకు తగదు, దైవక్రోధానికి గురికావలసివస్తుంద"ని అంటే..."ఓ యబ్బో! మీరేదో ఈరోజు కొత్తగా చెబుతున్నారుగాని, ఇవి మాపూర్వీకుల నుండి వస్తున్న ఆచారాలే. వీటిలో తప్పులేదు. వీటినే మేము అంటిపెట్టుకొని ఉంటాం" అంటారు. ఇలాంటి ఆంధానుకరణనే పై సూక్తులలో విమర్శించడం జరిగింది.



కొందరు అనుకరణ విషయంలో అతివాదానికి పోయి, అనుకరణ అంటేనే అంధానుకరణ అని వాదిస్తారు. కాని ఒక విషయం వీరు మరచిపోతున్నారు. 2:133 సూక్తిలో యాఖూబ్ ప్రవక్త (అలై) ఇహలోకం వీడిపోతూ "నా తరువాత మీరు ఎవరిని ఆరాధిస్తార"ని తన సంతానాన్ని అడిగినప్పుడు "మేము మీ తాత ముత్తాతలయిన ఇబ్రాహీం, ఇస్హాఖ్‌లు ఆరాధించిన ఏకేశ్వరుడ్నే ఆరాధిస్తాము" అని సమాధాన మిచ్చారు వారు. 2:170, 5:104 సూక్తులలో "మీ తాత ముత్తాతలు ఆరాధించిన ఏకేశ్వరుడ్ని" అని ఉంటే, పై రెండు సూక్తులలో "మా తాతముత్తాతలు అనుసరించిన మార్గం" అని ఉంది. ఈ రెండిటిలోనూ అనుకరణభావం ఉంది. అయితే మొదటిది సరయిన అనుకరణ, ధర్మసమ్మతమయిన వ్యవహారం క్రిందికి వస్తుంది. రెండోది అంధానుకరణ, ధర్మసమ్మతం కాని వ్యవహారం క్రిందికి వస్తుంది.

## 17. సంఘనాయకుల ఆరాధన

సమాజంలో పెద్దలుగా చెలామణి అయ్యేవారు సమాజశ్రేయోభిలాషులుగా, సత్యప్రియులుగా, నిస్వార్థపరులుగా ఉన్నంతవరకు ఇతరులు వారిని అనుసరించ వచ్చు. సంఘనాయకులు అలాకానప్పుడు గుడ్డిగా వారిని అనుసరించే ప్రజలు ఎప్పటి కైనా నష్టపోక తప్పదు. అనుచరులు కూడా స్వార్థపరులయితే మంచీచెడుల విచక్షణా జ్ఞానం కోల్పోయి సుదీర్ఘ కాలంలోనైనా నష్టపోవలసి వస్తుంది. సత్యాన్ని ప్రేమించే మనస్తత్వం కలవారినే దేవుడు రుజుమార్గం చూపి స్వార్థపరులకు పావులుగా మారకుండా కాపాడుతాడు. ఖుర్ఆన్‌లోని ఈ క్రింది సూక్తులు చూడండి:

"వారిని ఎవరైనా మీప్రభువు ఏం అవతరింపజేశాడని అడిగితే 'అదా, అవేవో పూర్వీకుల పుక్కిటి పురాణాలు లెండి' అని అంటారు. ప్రళయదినాన వారు తమ (పాప) భారంతో పాటు, తమ అజ్ఞానం అభూతకల్పనలతో ఎవరెవరిని అపమార్గం పట్టించారో వారందరి (పాప) భారం కూడా మూట కట్టుకుంటారు. చూడు, వారు ఎంత నీచమైన భారం తలకెక్కించు కుంటున్నారో!" (ఖుర్ఆన్-16:24,25)

"ఈ ఖుర్ఆన్‌ని, దీనికి పూర్వం వచ్చిన మరే గ్రంథాన్నీ మేము ఎన్నటికీ విశ్వసించం' అంటున్నారు అవిశ్వాసులు. ఈ దుర్మార్గులు తమ ప్రభువు సన్నిధిలో నిలబడినప్పుడు నీవు వారి పరిస్థితి చూస్తే బాగుంటుంది! అప్పుడు వీరు ఒకరిపైనొకరు నిందారోపణలు చేసుకుంటారు. ఇహలోకంలో అణచి వేయబడినవారు, నాయకులుగా చెలామణయిన వారితో 'మీరు లేకపోతే మేము విశ్వాసులై ఉండేవాళ్ళం' అంటారు." (ఖుర్ఆన్-34:31)

"అప్పుడు నాయకులుగా చెలామణయినవారు, అణగిమణగి ఉన్నవారితో 'మీదగ్గరికి వచ్చిన సన్మార్గం అవలంబించకుండా మేము మిమ్మల్ని నిరోధించామా? అసలు మీరు స్వతహాగానే పాపాత్ములు' అంటారు. అణగిమణగి ఉన్నవారు, నాయకులుగా చెలా మణయిన వారితో 'కాదు, ఇవన్నీ రేయింబవళ్ళు మీరు పన్నిన

కుత్రలు, మీరు మమ్మల్ని (నిజ)దేవుడ్ని తిరస్కరించి, ఆయనకు ఇతరుల్ని సాటికల్పించమని చెబుతుండేవారు' అని అంటారు. చివరికి వారు (నరక)యాతనలను ప్రత్యక్షంగా చూడగానే (బెంబేలెత్తిపోయి) లోలోన పశ్చాత్తాపపడతారు. మేము ఇలాంటి తిరస్కారుల మెడలకు గుదిబండలు కడ్తాం. వారికి వారికర్మలకు తగ్గ ప్రతిఫలమే లభిస్తుంది." (ఖుర్ఆన్-34:32,33)

"వారు (పిడివాదం చేస్తూ) 'మేము చచ్చి మట్టిలో కలిసి అస్తిపంజరాల్లా మారినా మమ్మల్ని మళ్ళీ బ్రతికించి లేపడం జరుగుతుందా? మాకు పూర్వం చనిపోయిన మా తాత ముత్తాతలను కూడా బ్రతికించి లేపుతారా?' అని అడుగుతున్నారు. 'తప్పకుండా, మీరు (దేవుని శక్తిముందు) నిమిత్తమాత్రులేన'ని చెప్పు." (ఖుర్ఆన్-37:16-18)

"ఒకేఒక భయంకరమయిన గర్జన విన్పిస్తుంది. అంతే, ఒక్కసారిగా వారి కళ్ళ ముందు అంతా ప్రత్యక్షమౌతుంది. అప్పుడు వారు (బిత్తరబోయి చూస్తూ) 'అయ్యయ్యో, మా పాడుగాను! (మనమెంత ఏమరుపాటులో పడివున్నాం!) ఇది తీర్పుదినమే!!' అంటారు."

"మీరు (నిన్నటిదాకా) నిరాకరిస్తుండిన తీర్పుదినం ఇదే'... 'దుర్మార్గుల్ని, వారి అనుచర మూకను చుట్టుముట్టి తీసుకురండి. (నిజ)దేవుడ్ని వదలి వారు పూజించిన మిధ్యాదైవాలను కూడా చుట్టుముట్టి తీసుకురండి. తర్వాత వారందరికీ నరకం దారి చూపండి. ఆపండి వారిని ప్రశ్నించాలి. ఏమయింది మీకు? ఇప్పుడు మీరు ఒకరికొకరు సహాయం చేసుకోరెందుకు?' ఈరోజు వీరు(మాకు) పూర్తిగా లొంగిపోయారు." (ఖుర్ఆన్-37:19-26)

"ఆతర్వాత వారు ఒకరి వైపు ఒకరు తిరిగి పరస్పరం వాదించుకోవడం మొదలెడతారు. (అనుచరులు తమ నాయకులతో) 'మీరు మా దగ్గరికి అరచేతి వైకుంఠం చూపుతూ, మాయోపాయాలతో వస్తుండేవారు' అంటారు." (ఖుర్ఆన్-37:27,28)

"వారి నాయకులు దాన్ని ఖండిస్తూ 'అసలు మీరే స్వయంగా (సత్యాన్ని) విశ్వసించేవారు కాదు. మేము మీపై ఎలాంటి వత్తిడి తీసుకురాలేదు. మీరు స్వతహాగానే దుర్మార్గులు, తలపొగరు మనుషులు. చివరికి మనమంతా 'మేము శిక్ష చవిచూపిస్తాం' అన్న దైవాజ్ఞకు అర్హులైపోయాము. అందుకే మేము దారి తప్పడమేగాక మిమ్మల్ని కూడా మాయమాటలతో దారి తప్పించాం' అని చెబుతారు." (ఖుర్ఆన్-37:29-32)

"(సత్యతిరస్కారులైన) నాయకులు ఆరోజు తమ అనుచరుల్ని అసహ్యించుకుంటూ, వారితో తమకు ఎలాంటి సంబంధం లేదన్నట్లు ప్రవర్తిస్తారు. అయితే (వారందరూ) శిక్ష మాత్రం చవిచూస్తారు. వారి మధ్య (నాయకానుచరుల) సంబంధాలు పూర్తిగా తెగిపోతాయి. అప్పుడు వారి అనుయాయులు పశ్చాత్తాపంతో కుమిలిపోతూ, తమకు మరొకసారి (ఇహలోకానికి) తిరిగివెళ్ళే అవకాశం లభిస్తే, ఇప్పుడు వీరు తమల్ని అసహ్యించుకున్నట్లు తాము వీరిని అసహ్యించుకుంటాం అంటారు. ఈవిధంగా దేవుడు,



వారు ఇహలోకంలో చేసిన దుర్మార్గం, దుష్టకార్యాలను వారి పశ్చాత్తాపానికి కారణభూతంగా చేసి చూపిస్తాడు. వారిక నరకాగ్ని నుండి ఏవిధంగానూ బయటపడలేరు." (ఖుర్ఆన్-2:166,167)

"వారంతా (ప్రళయ దినాన) దేవుని ముందు (దోషులుగా) నిలబడతారు. అప్పుడు వారిలో (శక్తిసామర్థ్యాలు అంతగాలేని) బలహీనులు తమపై పెత్తందారులయి కూర్చున్న నాయకులతో 'ప్రపంచంలో మేము మీకు విధేయులై మీ వెనుక నడిచాం కదా; ఇప్పుడు మమ్మల్ని దైవశిక్ష నుండి కాపాడేందుకు ఏమైనా చేయగలరా?' అని అడుగుతారు."

"దానికి వారు సమాధానమిస్తూ 'దేవుడు గనక మా విముక్తి కోసం ఏదైనా దారి చూపిస్తే మీక్కూడా (ఆ దారి) తప్పకుండా చూపిస్తాం. కాని ఇప్పుడు మనం ఎంత ఏడ్చి మొత్తుకున్నా, ఓర్పు వహించినా ప్రయోజనం లేదు. మనమిక (ఈ నరకకూపం నుంచి) బయటపడే ప్రసక్తే లేదు' అని అంటారు." (ఖుర్ఆన్-14:21)

## 18. మతగురువులు, బాబాల ఆరాధన

ధర్మజ్ఞానంలేని అజ్ఞానులు, తాంత్రికచర్యలు చూసి ప్రభావితులయ్యేవారు, మతం ద్వారా ప్రాపంచిక ప్రయోజనాలు ఆశించేవారు, ధర్మశాస్త్రం ఆజ్ఞలను పాటించడానికి బద్ధకించేవారు ఎల్లప్పుడూ 'షార్ట్‌కట్' మార్గాలనే వెతుకుతారు. అలాంటి 'షార్ట్‌కట్' మార్గాలను వారికి స్వార్థపరులైన మతగురువులు, స్వాములు, బాబాలు చూపిస్తారు. దైవాజ్ఞలకు వ్యతిరేకంగా అలాంటి మతగురువుల్ని, బాబాలను విధేయించడం కూడా "షిర్క్" (బహుదైవారాధన) క్రిందికే వస్తుంది.

మహాప్రవక్త ముహమ్మద్ (స) ఇలా తెలిపారు: "మీలో ఎవరూ (కర్మవిచారణ విషయమయి) దేవునితో ప్రత్యక్షంగా మాట్లాడని వారుండరు. దాసునికి, అతని ప్రభువుకు మధ్య ఎలాంటి మాధ్యమంగాని, తెరగాని ఉండదు. అప్పుడు దాసుడు తన కుడివైపు చూస్తాడు. అక్కడ అతనికి తనకర్మలు తప్ప మరేమీ కన్పించదు. అతను తన ఎడమవైపు చూస్తాడు. అక్కడ ఇంతకుముందు చేసుకొని పంపుకున్న కర్మలు కన్పిస్తాయి. దాసుడు తన ముందు చూసుకుంటాడు. ఎదురుగా నరకం కన్పిస్తుంది. కనుక మీ దగ్గర ఒక ఖర్జూరపు ముక్క ఉన్నా సరే, దాన్ని (దైవప్రసన్నత కోసం) దానంచేసి నరకంనుండి మిమ్మల్నిమీరు కాపాడుకోండి." (బుఖారి, ముస్లిం)

"వారు నిజదేవుడ్ని వదలి తమ ధర్మవేత్తలు, సాధువులను దేవుళ్ళుగా, ప్రభువులుగా చేసుకున్నారు. అలాగే మర్యం కుమారుడు మసీహ్‌ని కూడా. కాని ఏకైక దేవుడ్ని తప్ప మరెవరినీ ఆరాధించకూడదని వారికాజ్ఞ ఇవ్వబడింది. ఆయన తప్ప మరెవరూ ఆరాధనకు, దాస్యానికి అర్హులు కారు. వారు కల్పించుకున్న బహుదైవారాధనా భావాలకు, పలుకులకు ఆయన ఎంతో అతీతుడు, పవిత్రుడు." (ఖుర్ఆన్-9:31)

పూర్వం క్రైస్తవమతంలో ఉండి ఆ తరువాత ఇస్లాం స్వీకరించిన హజ్రత్ అదీ బిన్ హాతిం (రజి) దైవప్రవక్త (సల్లం) ముందు ఈ సూక్తిని ప్రస్తావిస్తూ "ఈ సూక్తిలో

మేము మా ధర్మవేత్తలను, సాధువులను దేవుళ్ళుగా చేసుకున్నామనే అభియోగం మా మీద మోపబడింది. (కాని మేము మా ధర్మవేత్తల్ని, సాధువుల్ని ఆరాధించడం లేదే! (మరి దీని గూఢార్థం ఏమిటీ?)" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) ఇలా అన్నారు. "వారు నిషేధించిన వాటిని మీరు నిషేధితాలుగా, వారు ధర్మసమ్మతం (హలాల్) చేసినవాటిని మీరు ధర్మసమ్మతమైనవిగా ఒప్పుకోవడం లేదా?" అది విని హజ్రత్ అదీ (రజి) "నిజమే, మేము అలాగే చేస్తున్నాం" అన్నారు. అప్పుడు దైవప్రవక్త (స) "వారిని దేవుళ్ళుగా, ప్రభువులుగా ఆరాధించడమంటే ఇదే" అన్నారు. (ఇబ్నె కసీర్)

దీన్నిబట్టి ఎవరయినా దైవగ్రంథంలో ఎలాంటి ప్రమాణం లేకపోయినా" ఇది ధర్మం (హలాల్), అది అధర్మం (హరాం)" అని హద్దులు నిర్ణయిస్తే నిజానికి వారు దేవుని స్థానంలో దేవుళ్ళయి కూర్చున్నారన్నమాట. వారి ఆజ్ఞల్ని ధర్మశాస్త్రం ఆజ్ఞలుగా పరిగణించి పాటించేవారు నిజానికి వారిని దేవుళ్ళుగా ఆరాధిస్తున్నారన్నమాట.

**అజ్ఞాన చర్యలు:** దైవప్రవక్తల్ని, మహాపురుషుల్ని వారి నిష్క్రమణ తర్వాత ప్రజలు హద్దుమీరిన ప్రశంసలతో ఆకాశానికి ఎత్తడం, వారికి లేనిపోని అతీంద్రియ శక్తుల్ని ఆపాదించడం, చివరికి వారిని దేవుని స్థాయికి చేర్చడం అనాది నుంచి వస్తున్న అజ్ఞానచర్యలే. క్రైస్తవులు కూడా ఈసాప్రవక్త (అలైహి)ను దేవుని కుమారునిగా చిత్రించి దేవుని స్థాయికి చేర్చారు. అలాంటి పోకడలకు పోవద్దని దేవుడు ఈక్రింది సూక్తిలో క్రైస్తవులకు హితవు చేస్తూ, ఇటు ముస్లింలను కూడా పరోక్షంగా హెచ్చరించాడు.

"గ్రంథప్రజలారా! మీరు మీధర్మం విషయంలో అతిశయానికి పోయి హద్దులు మీరకండి. సత్యం తప్ప దేవునికి మరే విషయాన్నీ ఆపాదించకండి. మర్యం కుమారుడు ఈసా మసీహ్ దేవుని ప్రవక్తలలో ఒక ప్రవక్త తప్ప మరేమీ కాదు. కాకపోతే ఆయన 'మర్యం దగ్గరకు దేవుడు పంపిన ఒక ఆజ్ఞ; దేవుని దగ్గరనుండి పంపబడిన ఒక ఆత్మ మాత్రమే.' (ఈ ఆజ్ఞ, ఆత్మలే మర్యం గర్భంలో బిడ్డరూపం సంతరించుకున్నాయి.)"

"కనుక మీరు దేవుడ్ని, ఆయన ప్రవక్తల్ని విశ్వసించండి. ముగ్గురు (దేవుళ్ళు) అనకండి. అలా అనడం మానేస్తే అది మీకే క్షేమం. నిజానికి దేవుడు ఒక్కడే. ఆయనకు కుమారుడు ఉన్నాడని అనడం తగదు. అలాంటి బలహీనతలకు దేవుడు అతీతుడు, ఎంతో పరిశుద్ధుడు. భూమ్యాకాశాల్లో ఉన్న సమస్తం దేవునిదే. అన్నిటికీ ఆయనే స్వామి, యజమాని. వాటి సంరక్షణ, నిర్వహణలకు ఆయన ఒక్కడే చాలు." (ఖుర్ఆన్–4:171)

"విశ్వాసులారా! గ్రంథప్రజలకు చెందిన ధర్మవేత్తలు, సాధువులలో అనేక మంది అక్రమ పద్ధతుల ద్వారా ప్రజల ధనాన్ని కాజేస్తున్నారు. పైగా వారిని దైవమార్గంలోకి రాకుండా నిరోధిస్తున్నారు." (ఖుర్ఆన్–9:34)

ఈనాడు కొందరు ముస్లింలలోకి కూడా దైవప్రవక్తలను, దైవప్రియులను దేవుని స్థాయికి చేర్చే వ్యాధి చొచ్చుకువచ్చింది. వారు మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం)ని దాదాపు దేవుని స్థాయికి చేర్చారు. దేవునికి లాగే ఆయనకూ అగోచర జ్ఞానం ఉందని,



ఆయనసలు మానవజాతికి చెందినవారే కాదని వాదిస్తున్నారు. అలాంటివారు ఖుర్ఆన్ లోని ఈ సూక్తుల్ని గురించి ఆలోచించాలి:

"యావత్తు భూమ్యాకాశాల్లో దేవుడు తప్ప మరెవరూ అగోచర జ్ఞానం (అతీంద్రియ జ్ఞానం) కలవారు లేరు." (ఖుర్ఆన్–27:65)

**అగోచరజ్ఞాని అల్లాయే:** అగోచర విషయాలు (అతీంద్రియ విషయాలు) దేవునికి తప్ప మరెవరికీ తెలియదని ఈ సూక్తిలో తెలియజేయబడింది. అంటే దేవుడు మాత్రమే అతీంద్రియ జ్ఞానసంపన్నుడు (ఆలిముల్‌గైబ్) అన్న మాట. దైవప్రవక్తలకు కూడా దేవుడు ఎంత మేరకు అతీంద్రియ జ్ఞానం, అగోచర విషయాలు దివ్యావిష్కృతి ద్వారా తెలియజేశాడో అంతమేరకే వారికి తెలుసు. అంతమాత్రాన దైవప్రవక్తలు అతీంద్రియ జ్ఞానులని చెప్పడాన్ని ఇస్లాం అంగీకరించదు.

ప్రవక్త సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) ఇలా ఉల్లేఖిస్తున్నారు: "దైవప్రవక్త (స)కు రేపటిరోజు సంభవించే విషయాలు తెలుసని ఎవరైనా భావిస్తే, అతను దేవుని మీద పెద్దఅభాండం వేస్తున్నాడన్నమాట. యావత్తు భూమ్యాకాశాల్లో అతీంద్రియ జ్ఞానం దేవునికి మాత్రమే ఉందని స్వయంగా దేవుడే తెలియజేస్తున్నాడు." (ముస్లిం)

"దేవుడు మాత్రమే గోచర, అగోచరాలు ఎరిగినవాడు. వారు చేస్తున్న బహు దైవారాధన (షిర్క్)కు ఆయన ఎంతో అతీతుడు." (ఖుర్ఆన్–23:92)

"అగోచర విషయాలకు సంబంధించిన నిగూఢ రహస్యాలన్నీ ఆయనకు మాత్రమే తెలుసు. ఆయనకు తప్ప వాటిని గురించి మరెవరికీ తెలియదు. నదీ నదాల్లో, కీకారణ్యాల్లో ఏముందో ఆయనకే తెలుసు. చెట్టునుండి రాలే ఏ ఆకూ ఆయన దృష్టి పథం నుండి తప్పించుకోజాలదు. చివరికి భూపొరలలో నిక్షిప్తమయి ఉండే విత్తనం సైతం ఆయన జ్ఞానపరిధిలో ఉంటుంది. పచ్చి వస్తువులు, ఎండు వస్తువులు సైతం ఆయన దగ్గర స్పష్టంగా గ్రంథస్తం చేయబడిఉన్నాయి." (ఖుర్ఆన్–6:59)

"ఆ (ప్రళయ)ఘడియ ఎప్పుడు సంభవిస్తుందో దేవునికి మాత్రమే తెలుసు. మాతృ గర్భంలో ఏం పెరుగుతున్నదో కూడా ఆయనకే తెలుసు. రేపు తాను ఏం చేయనున్నాడో ఏ మనిషికీ తెలియదు. అలాగే తనకు ఏ భూభాగంలో మృత్యువు కాటువేస్తుందో కూడా ఎవరికీ తెలియదు. సమస్త విషయాలు దేవునికి మాత్రమే తెలుసు. ఆయన సర్వజ్ఞాని, సమస్తం ఎరిగినవాడు." (ఖుర్ఆన్–31:34)

మాతృగర్భంలో ఏం పెరుగుతున్నదో అంటే ఇక్కడ ఆడపిల్లా, మగపిల్లవాడా అని అర్థం కాదు. స్త్రీ గర్భంలో పడిన వీర్యబిందువు ఎలాంటి మార్పులు చెంది చివరికి ఏ రూపం సంతరించుకుంటుందో, ఏఏ గుణగణాలు దాని స్వభావంలో వేరుగొంటాయో మొదలైన అనేక విషయాల్ని పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది. ఇవన్నీ దేవునికి తప్ప మరెవరికీ తెలియదని ఈసూక్తి మనకు తెలియజేస్తోంది.

“ముహమ్మద్ (స) వారితో ఇలా అను: నాదగ్గర దేవుని నిక్షేపాలు ఉన్నాయనిగాని, నేను అగోచరజ్ఞానం కలవాడిననిగాని నేను మీతో అనడం లేదు. నేను దైవదూతనని కూడా చెప్పుకోవడం లేదు.” (ఖుర్ఆన్–6:50)

“ప్రవక్తా! చెప్పు:– నేను మీలాంటి మానవుడ్నే. కాకపోతే మీ ఆరాధ్య దేవుడు ఒక్కడే అని నాకు దివ్యావిష్కృతి ద్వారా తెలియజేయబడుతోంది.” (ఖుర్ఆన్–18:110)

దైవప్రవక్త (సల్లం) ఓసారి రైతులతో “మీరు తోటలో అంటుకట్టడం వదిలేస్తే మంచిదేమో చూడండి” అన్నారు. దాంతో వారు అంటుకట్టడం మానేశారు. దాని వల్ల ఆయేడు ఫలసాయం తగ్గిపోయింది. అప్పుడు దైవప్రవక్త (సల్లం) “నేను మానవుడ్ని మాత్రమే. అంచేత నేను ధర్మవ్యవహారాలలో ఏదైనా ఆజ్ఞాపిస్తే దాన్ని పాటించండి. (ఇతర వ్యవహారాల్లో) నాసొంత అభిప్రాయంతో ఏదైనా చెబితే, (అందులో పొరపాటు ఉండవచ్చు) నేను మానవుడ్ని మాత్రమే” అన్నారు. (ముస్లిం)

## 19. బంధుమిత్రుల ఆరాధన

మనం విధేయించడానికి, సలహాలు తీసుకోవడానికి మన తల్లిదండ్రులకు మించిన అర్హులు ఎవరూ ఉండరు. కాని తల్లిదండ్రులయినా సరే ధర్మశాస్త్రం ఆజ్ఞలకు వ్యతిరేకంగా ఏదైనా చెయ్యమని ఆజ్ఞపిస్తే లేదా సలహా ఇస్తే అలాంటి ఆజ్ఞలను, సలహాలను విశ్వాసి (మోమిన్) ఏమాత్రం పాటించకూడదు. అలాగే మన ప్రాపంచిక ప్రయోజనాల కోసం కొందరు బంధుమిత్రులు ఎంతో శ్రేయోభిలాషులా షరీఅత్ ఆజ్ఞల్ని ఖాతరుచేయకుండా మనకు ఉచిత సలహాలు ఇస్తుంటారు. విశ్వాసి అలాంటివారి పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలి.

“తల్లిదండ్రులకు సేవచేయాలని, వారి పట్ల సద్భావంతో మెలగాలని మేము మానవునికి ఉపదేశించాము. అయితే “వారొకవేళ నీకు తెలియని మరొక దైవాన్ని నాకు సాటి కల్పించమని వత్తిడి తెస్తే మాత్రం నీవు వారికి విధేయత చూపకు. మీరంతా చివరికి నాదగ్గరకే తిరిగిరావలసి ఉంది. అప్పుడు నేను మీరు (ప్రపంచంలో ఉండగా) ఏమేమి చేస్తుండేవారో మీకు తెలియజేస్తాను” అని కూడా మేమతనికి బోధించాం. సత్యాన్ని విశ్వసించి సదాచార సంపన్నులైనవారిని మేము తప్పకుండా సజ్జనులుగా పరిగణిస్తాము.” (ఖుర్ఆన్–29:8,9)

“మీ సంతానం, సిరిసంపదలు మీ పాలిట పరీక్షా సాధనాలని గుర్తుంచుకోండి. మీకోసం దేవుని వద్ద ఇంతకంటే ఎంతోగొప్ప ప్రతిఫలం ఉంది.” (8:27,28)

“విశ్వాసులారా! మీ సంతానం, సిరిసంపదలు మిమ్మల్ని దైవధ్యానం నుండి మరపింప జేయకూడదు. అలా చేసేవారే నష్టపోయేవారు.” (ఖుర్ఆన్–63:9)

“విశ్వాసులారా! మీ భార్యాపిల్లలలో కొందరు మీకు శత్రువులై ఉంటారు. వారి పట్ల అప్రమత్తంగా ఉండండి. అయితే వారిని దయార్ద్ర హృదయంతో క్షమిస్తే దేవుడు (కూడా మీ పట్ల) క్షమాశీలి, దయానిధి (అవుతాడు). మీ సంతానం, సిరిసంపదలు మీకు



పరీక్షగా చేయబడ్డాయి. (ఈపరీక్ష నుండి గట్టెక్కితే మీకోసం) దేవుని దగ్గర గొప్ప ప్రతిఫలం ఉంది.” (ఖుర్ఆన్–64:14,15)

మనిషికి సాధారణంగా సంతానం, సిరిసంపదల పట్లే ఎక్కువ వ్యామోహం ఉంటుంది. సంతానం, సిరిసంపదలే అతనికి దైవమార్గంలో అవరోధాలై నిలుస్తాయి. అందుకే విశ్వాసి వాటిపట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఈసూక్తి చెబుతోంది. అంచేత దైవప్రవక్త (సల్లం) కూడా సంతానం, సిరిసంపదలను గురించి తన అనుచరులను ఇలా హెచ్చరించారు:

“నీవొక శత్రువుని చంపి విజయం సాధించాననో లేక అతను నిన్ను చంపడం వల్ల నీకు స్వర్గప్రాప్తి కలుగుతుందనో అనుకుంటావు. కాని నీ అసలు శత్రువు అతను కాదు. నీ అసలు శత్రువు నీకడుపున పుట్టిన పిల్లవాడు కావచ్చు. అంతకంటే పెద్ద శత్రువు నీ అధీనంలో ఉన్న నీ సిరిసంపదలే.” (తబ్రాని)

“ప్రతి దుర్మార్గుడు (ఆరోజు తీవ్రమైన పశ్చాత్తాపంతో) తన చేతిని కొరుక్కుంటూ ఇలా అంటాడు: ‘అయ్యో! నేను దైవప్రవక్తతో సహకరించి సన్మార్గగామి అయివుంటే ఎంత బాగుండేది!! అయ్యయ్యో! నేను ఫలానావాడ్ని స్నేహితుడిగా చేసుకోకుండా ఉంటే బాగుండేది!! వాడి మాయదారి మాటలు విని నా దగ్గరకు వచ్చిన హితోపదేశాన్ని దూరం చేసుకున్నానే! నేనెంత దౌర్భాగ్యుడ్ని!!” (ఖుర్ఆన్–25:27–29)

ఈవిధంగా చివరికా వ్యక్తి మా దగ్గరకు చేరుకుంటాడు. అప్పుడతను తన పిశాచ సహచరునితో “అయ్యయ్యో! నీకూ నాకూ మధ్య తూర్పుపడమరలంత దూరం ఉంటే ఎంత బాగుండేది!! నీవు నాకు అతిచెడ్డ స్నేహితుడిగా దొరికావు” అనంటాడు. అప్పుడు వారికి (దైవదూతలు) “మీరు దుర్మార్గపుపనులు చేశారు గనక, ఈరోజు మీకెలాంటి సహాయం లభించదు. మీరంతా (నరక) శిక్షలో సమానులే” అని చెబుతారు. (ఖుర్ఆన్–43:38,39)

## 20. అధికసంఖ్యాకుల ఆరాధన

సాధారణంగా ప్రపంచంలో మంచివాళ్ళు, చెడ్డవాళ్ళు చాలా తక్కువ మంది ఉంటారు. మంచీ, చెడులు రెండూ చేసే మధ్యతరహా ప్రజలే ఎక్కువమంది ఉంటారు. అయితే నిర్మాణానికి సుదీర్ఘ కాలం, విచ్ఛిన్నానికి అతిస్వల్ప (ఘడియ) కాలం పట్టినట్లే మంచివాళ్ళు ప్రజలను సంస్కరించడానికి సుదీర్ఘ కాలం పడ్తుంది. ఈలోగా చెడ్డవాళ్ళు మధ్యతరహా ప్రజలను ఆకట్టుకొని వారిలో అనేక చెడులను వ్యాపింపజేస్తారు.

అంతేకాదు, వారు అధికసంఖ్యాక ప్రజలు నడిచే బాటే రాచబాట అనే భావాన్ని కూడా మధ్యతరహాప్రజలలో కలగజేస్తారు. “అందరిదీ ఒక దారయితే ఉలిపికట్టెది మరొక దారి” అనే సామెత ఇలాంటివారి నుండే పుట్టిఉంటుంది. అంచేత స్వచ్ఛమైన ఏకదైవా రాధకులు “గొర్రెదాటుడు” పద్ధతిన అధికసంఖ్యాకులు నడిచే మార్గాన్ని

గుడ్డిగా అవలంబించకూడదు. ఈ అంధానుకరణ మంచిని ప్రేమించేవారిని కూడా ప్రమాదపుటంచులకు తీసికెళ్తుంది. ఖుర్‌ఆన్ ఈ ప్రమాదాన్ని గురించి ఈవిధంగా హెచ్చరిస్తోంది:

"ముహమ్మద్ (స)! నీవు భూవాసుల్లోని ఆధికసంఖ్యాకులు చెప్పే మాటలు గనక వింటే వారు నిన్ను దైవమార్గం నుండి తప్పిస్తారు. వారు కేవలం ఊహాలోకంలో విహరిస్తూ నిరాధారమైన విషయాలు అనుసరిస్తారు. నిజానికి ఎవరు నీ ప్రభువు మార్గం తప్పివున్నారో, ఎవరు సరైన మార్గంలో ఉన్నారో నీప్రభువుకు బాగాతెలుసు." (ఖుర్‌ఆన్-6:116,117)

గతంలో ఒక క్రైస్తవ మిత్రుడు కూడా నిజమయిన మతానికి అధికసంఖ్యాకుల అనుసరణనే ప్రమాణంగా చూపెట్టడానికి యత్నించాడు. అతను నాతో మతాలను గురించి మాట్లాడుతూ "ప్రపంచంలో ఏమతస్థులు అత్యధికసంఖ్యలో ఉన్నారో మీరు చూడటం లేదా? దాన్నిబట్టి ఏది నిజమైన మతమో మీరే ఊహించండి" అన్నాడు. ఈ ఆలోచనాధోరణి ఎంత ప్రమాదకరమైనదో చెప్పనవసరం లేదు. వందమంది ప్రజలలో తొంభైమంది మద్యపానానికి అనుకూలంగా ఓటేస్తే అది ధర్మసమ్మతమైన వ్యవహారంగా, ఆరోగ్యకరమైన పానీయంగా మారుతుందా?

అందుకే మానవుల స్వభావాన్ని ఆపాదమస్తకం ఎరిగిన మన సృష్టికర్త మానవుల జీవితవిధాన నిర్ణయాన్ని అధికసంఖ్యాకుల అభిలాషలకు, అభిరుచులకు వదలిపెట్టకుండా యావన్మంది మానవుల ఇహపరాల శ్రేయస్సు కోసం తాను స్వయంగానే ఇస్లాం అనే న్యాయవంతమైన ఓ సమగ్రవ్యవస్థను నిర్ణయించాడు. కనుక దాని పరిధిలోనే అధికసంఖ్యాకుల అభిమతం, అభిరుచులు కూడా ఉండాలి. దానికి వ్యతిరేకంగా ఉన్నప్పుడు సత్యప్రేమికులు వారిని అనుసరించకూడదు. అలాంటివారిని అనుసరిస్తే అది అధికసంఖ్యాకుల ఆరాధన క్రిందికి వస్తుంది. అంటే బహుదైవారాధన (షిర్క్) అన్నమాట. ప్రతి దైవేతరఆరాధన నరకానికే దారి తీస్తుంది. ఏకదైవారాధకులం అని చెప్పుకునేవారు ఈ విషయాన్ని విస్మరించకూడదు.

దేవుణ్ని, ఆయన ప్రవక్తను విశ్వసించడంతో పాటు వారి ఆజ్ఞల్ని గట్టిగా పాటించినప్పుడే మనిషి ఇలా షిర్క్‌ఛాయ కూడా లేని స్వచ్ఛమైన ఏకదైవారాధకునిగా దేవుని దృష్టిలో పరిగణించబడతాడు. కాని ఈనాడు ముస్లింలలో అత్యధిక మంది నైతిక, ఆర్థిక, సామాజిక వ్యవహారాల్లో దైవాజ్ఞలను పూర్తిగా పాటించడంలేదు. చివరికి నమాజ్, రోజాలను పాటించే; హజ్‌యాత్ర జరిపివచ్చేవారి పరిస్థితి కూడా ఇలాగే ఉంది. కొందరు ముస్లింలు అక్రమసంపాదనతో కూడబెట్టిన సొమ్ముతో హజ్ చేస్తారు. మరికొందరు ఇరుగుపొరుగు పేదల హక్కులను నిర్వర్తించరు. ఇలాంటి ముస్లింల హజ్ ఎలా స్వీకరించ బడుతుంది? పూర్వం హజ్ కోసం మిగుల్చుకున్న పైకం పేదలకు దానం చేసిన ఓ మహానుభావుణ్ని గురించి తెలుసుకుందాం:



# 21. హజ్ పైకంతో దానం

ఊరి బయట అదొక పాడుబడిన ప్రదేశం. అక్కడ ఓబాలిక దేనికోసమో వెతుకుతున్నట్లు చూస్తూనిల్చున్నది. పది, పదకొండేళ్ళు ఉంటాయేమో, బక్కపల్చగా, చినిగిన బట్టలతో, తైలసంస్కారంలేని జుట్టుతో, లోతుకు పీక్కుపోయిన కళ్ళతో ఊరి దైన్యమంతా ఆ అమ్మాయిలోనే గూడు కట్టుకున్నట్లు కన్పిస్తోంది. అక్కడ ఏదో వస్తువు మీద ఆమె దృష్టి పడింది. కాంతి విహీనమైన ఆమె కళ్ళు కాస్తంత మెరిశాయి.

అది చచ్చిపడి ఉన్న పక్షి. ఆ అమ్మాయి తనను ఎవరైనా చూస్తున్నారేమోనని గబుక్కున వంగి ఆ పక్షిని చేతిలోకి తీసుకున్నది. సరిగ్గా అదే సమయంలో ఆ పక్కన డొంకదారి గుండా గుర్రంమీద పోతున్న ఓ యాత్రికుడు ఈదృశ్యం చూసి క్షణంపాటు కంపించిపోయాడు. వెంటనే గుర్రం దిగి తడబడుతున్న అడుగులతో ఆ అమ్మాయి వైపుకు నడిచాడు. బాలిక భయం భయంగా అతని వైపు చూస్తూ లేచినిల్చున్నది.

"ఏమిటమ్మా ఇది?" చచ్చిపోయిన ఈ పక్షిని తీసికెళ్ళి ఏం చేస్తావు?" యాత్రికుడు చిరునవ్వుతో గోముగా అడిగాడు.

పాప కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి. బట్టలకు అంటుకున్న దుమ్మును మెల్లగా దులుపుకున్నది. కాస్సేపటి దాకా ఆమె మాట్లాడలేక పోయింది. తర్వాత కట్టలు తెంచుకువస్తున్న దుఃఖాన్ని ఎలాగో ఆపుకుంటూ గద్గద స్వరంతో అన్నది:

"బాబాయ్! మాకు అమ్మా నాన్నా లేరు. కొందరు దుర్మార్గులు మా నాన్నను చంపి మాఇంట్లో ఉన్న ఆస్తంతా దోచుకుపోయారు. ఒక్క పైసా మిగల్చలేదు."

"అయ్యో పాపం! ఎంత పని జరిగిందమ్మా!" అన్నాడు యాత్రికుడు సానుభూతితో. బాలికి తల వొంచుకొని కళ్ళు తుడుచుకుంటూ తిరిగి అన్నది:

"ఇప్పుడు మాఇంట్లో నేను, నా తమ్ముడు ఉన్నాం. దేవుడు తప్ప మాకెవరూ దిక్కు లేదు. తింటానికి చాలినంత తిండి లేక, కట్టుకోడానికి సరైన బట్టలు లేక అవస్థ పడుతున్నాం. ఇలా ఎన్నో రోజులు గడచిపోయాయి. రెండ్రోజుల నుంచి అన్నం కూడా దొరక్క పస్తులుండాల్సి వచ్చింది. నేనెలాగో ఓర్చుకుంటున్నా. కాని మా తమ్ముడు ఆకలితో ఢీలా పడిపోయాడు. వాడి పరిస్థితి చూస్తుంటే నా గుండె తరుక్కుపోతోంది..... ఏం చేయను బాబాయ్! తింటానికి ఏదయినా దొరుకుతుందేమోనని ఇలా బయలుదేరాను. ఇక్కడకొస్తే డొంకపక్క ఈ చచ్చిన పక్షి దొరికింది. చూడగానే నాకు ప్రాణం లేచివచ్చింది. దీన్ని తీసికెళ్ళి మా తమ్ముడికి వండిపెడ్తా, ఈపూటయినా తిని హాయిగా ఉంటాడు."

ఈ మాటలు వినగానే యాత్రికుడు షాక్ తగిలినట్లు చలించిపోయాడు. అతని హృదయం పెనం మీద పడిన మంచుముక్కలా ఒక్కసారిగా కరిగిపోయింది. మమతా మానవత్వాలు పొంగిపొరలాయి. అతనా అనాథ బాలికను దగ్గరకు తీసుకొని ఆమె తల నిమురుతూ తను కూడా కంటతడి పెట్టుకున్నాడు.

కొన్ని క్షణాలు మౌనంగా గడచిపోయాయి. తర్వాత అతను వెంట వచ్చిన సేవకుడ్ని ఉద్దేశించి "ఇప్పుడు మన దగ్గర ఎంత డబ్బుంది?" అని అడిగాడు.

"ఇప్పుడు మన దగ్గర వేయి రూపాయలున్నయ్ దొరా!" అంటూ సేవకుడు చంకలో ఉన్న తోలుసంచి తీశాడు. "మరూ పట్నం తిరిగి వెళ్ళిపోవడానికి మనకు ఇరవై రూపాయలు సరిపోతా యనుకుంటా?" అంటూ యాత్రికుడు సేవకుని వైపు ప్రశ్నార్థకంగా చూశాడు. సేవకుడు "ఆ....సరిపోవచ్చు దొరా!" అన్నాడు.

"అయితే ఇరవై రూపాయలు ఉంచి మిగిలిన డబ్బు ఈ పాపకు ఇచ్చెయ్యి. ఈ యేడు మనం తలపెట్టిన హజ్ యాత్ర ఇక్కడే నెరవేరింది. ఇది కాబాయాత్ర కంటే గొప్పయాత్ర" అన్నాడు యాత్రికుడు హజ్ కంటే గొప్ప పుణ్యకార్యం చేశానన్న తలంపుతో తృప్తిగా.

"నిజమేనయ్యా! ఇంతకంటే గొప్పయాత్ర, గొప్ప పుణ్యకార్యం మనకింకేం కావాలి" అంటూ సేవకుడు తోలుసంచి నుంచి ఇరవై రూపాయలు తీసుకొని మిగిలిన డబ్బంతా సంచితో సహా ఆ అనాథ బాలికకు ఇచ్చేశాడు.

దుర్భర ఆకలితో, పుట్టెడు దుఃఖంతో బాగా వాడిపోయిన ఆ బాలిక ముఖ పద్మం ఒక్కసారిగా వికసించింది. కళ్ళు ఆనందాశ్రువులతో నిండిపోయాయి. అమితమయిన ఉత్సాహంతో డబ్బు సంచి అందుకున్నది.

అమ్మాయి ముఖంలో మెరిసిన ఆనందరేఖలు చూసి యాత్రికుని హృదయం కూడా సంతోషంతో పులకించిపోయింది. అతను ఎంతో ప్రేమగా గోముగా ఆ బాలిక తలను మరోసారి నిమురుతూ ఇలా అన్నాడు:

"ఇక వెళ్ళమ్మా! ఈ డబ్బు తీసుకొని నువ్వూ, నీ తమ్ముడు చీకూచింతా లేకుండా హాయిగా ఉండండి. మీ దారిద్ర్యాన్ని తొలగించిన దేవునికి కృతజ్ఞులయి ఉండండి. దుబారా ఖర్చు చేయకుండా డబ్బు జాగ్రత్తగా వాడుకుంటూ, సంతోషంగా గడపండి. ఇక ఈ చచ్చిపోయిన పక్షిని పారేసి ఇంటికి వెళ్ళు పాపా! పాపం నీ తమ్ముడు నీ కోసం ఎదురుచూస్తున్నాడేమో తొందరగా వెళ్ళు."

చేతిలో ఉన్న పక్షి కళేబరాన్ని దూరంగా విసిరి పారేసింది బాలిక.

"బాబాయ్! చచ్చినదాన్ని తినడం ఇప్పుడు మాక్కూడా ధర్మసమ్మతం కాదు. సమయానికి మమ్మల్ని ఆదుకున్నారు. మీ మేలు మేము మరచిపోలేం. వెళ్తానండీ!" అంటూ బాలిక సంతోషంతో వడివడిగా అడుగులేస్తూ ఇంటి దారి పట్టింది.

యాత్రికుడు బాలిక పోయిన వైపే కాస్సేపు చూసి తృప్తిగా నిట్టూర్చాడు.

"ఇక ఇంటికి వెళ్దాం పద. ఈ సంవత్సరం మనం చేయదలచుకున్న 'హజ్'ని దేవుడు ఇక్కడే స్వీకరించాడు" అన్నారు సేవకునితో హజ్ సంకల్పం చేసుకున్న హజ్రత్ అబ్దుల్లా బిన్ ముబారక్ (రహ్మాలై) గుర్రం ఎక్కుతూ.....



# 22. అధర్మ సంపాదనతో హజ్‌యాత్ర!

మనిషి ఏ సత్కార్యం చేసినా కేవలం దేవుని ప్రసన్నతం కోసమే చేయాలి. లోకులమెప్పు కోసం చేసే సత్కార్యాలు బూడిదలో పోసిన పన్నీరులా వ్యర్థమవుతాయి. కాబట్టి హజ్‌యాత్రకు వెళ్ళేవారి సంకల్పం పవిత్రంగా ఉండాలి. సమాజంలో తమ పవిత్రతను చాటుకునే, పేరుప్రతిష్ఠలు సంపాదించుకునే ఉద్దేశంతో హజ్ చేయ కూడదు. ఇలాంటి దురుద్దేశాలు మరణానంతరం నరక యాతనలకు కారణ మవుతాయి. దీన్ని గురించి మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ప్రవచించిన ఈ హదీసులు గమనించండి:

"నరకంలో ఓ లోయ ఉంది. దీని కీడు నుండి స్వయంగా నరకం కూడా రోజుకు నాలుగు వందల సార్లు దైవాన్ని శరణు కోరుతుంది. ఈ లోయ ముహమ్మద్ (సల్లం) అనుచర సముదాయంలోని పేరు ప్రతిష్ఠల కోసం ప్రాకులాడేవారి కోసం తయారుచేయబడింది. (ముఖ్యంగా) ఖుర్‌ఆన్ విద్య నేర్చుకున్న పండితుల కోసం, దానధర్మాలు చేసేవారి కోసం, హజ్‌యాత్ర చేసేవారి కోసం ఇది తయారుచేయ బడింది." (మిష్కాత్)

"ప్రజలకు భవిషత్తులో ఒక కాలం రానున్నది. ఆ కాలంలో ధనికులు వినోదం కోసం హజ్ చేస్తారు; మధ్యతరగతి ప్రజలు వ్యాపారం కోసం హజ్ చేస్తారు; ధర్మ వేత్తలు పేరుప్రతిష్ఠల కోసం హజ్ చేస్తారు; పేదలు యాచన కోసం హజ్ చేస్తారు." (మషాలెరాహ్)

హజ్‌యాత్రకు బయలుదేరే ముస్లింలు ముందుగా తమపై తమ కుటుంబానికి, ఇతరులకు ఉండే హక్కులు నెరవేర్చాలి. కొందరు ముస్లింలు ఎన్ని పాపాలు చేసినా పశ్చాత్తాపంతో దైవాన్ని క్షమాపణ వేడుకుంటే చాలనుకుంటారు. కాని దేవుని హక్కుల విషయంలో మాత్రమే ఇలా చేస్తే పాపాలు క్షమించబడతాయి. దైవదాసుల హక్కుల విషయంలో దాసులు తమను క్షమించనంతవరకూ లేదా వారి హక్కులు నిర్వహించ నంతవరకూ ఈ పాపాలను దేవుడు క్షమించడు. అందువల్ల హజ్‌యాత్రకు వెళ్ళేవారు ఎవరినైనా బాధించివుంటే వారి దగ్గరికెళ్ళి క్షమాపణ కోరుకోవాలి. వారి వస్తువులు ఏవైనా తీసుకొని ఉంటే వాటిని తిరిగిచ్చేయాలి. అప్పులు ఏమైనా చేసివుంటే వాటిని తీర్చకుండా హజ్‌కు వెళ్ళడం మంచిది కాదు. దైవప్రవక్త (స) ఇలా అన్నారు:

"ఎవరయినా తన సోదరుడెవరిపై నయినా దౌర్జన్యం చేస్తే, అతడ్ని అవమానం పాలుజేస్తే, అతని హక్కేమయినా కొల్లగొడితే అలాంటి మనిషి ఎలాంటి సిరిసంపదలు పనికిరాని (ప్రళయం) రోజు రాక ముందే బాధితునికి క్షమాపణ చెప్పుకొని, అతని హక్కేమయినా ఉంటే దాన్ని తిరిగిచ్చి వేయాలి. (అలా చేయకపోతే తీర్పురోజున నష్ట పోతాడు.) అతను ఏవయినా సత్కర్మలు చేసిఉంటే, వాటిలో నుంచి అతని దౌర్జన్యానికి సమానమయిన సత్కర్మలు తీసి బాధితునికి ఇప్పించడం జరుగుతుంది. ఒకవేళ ఆ దౌర్జన్యానికి సరిపడ సత్కర్మలు లేకపోతే బాధితుడు చేసిన దుష్కర్మలు దౌర్జన్యపరుడి

ఖాతాలో వేయబడతాయి.'' (బుఖారి)

పోతే హజ్‌యాత్ర కోసం ఖర్చుపెట్టే డబ్బు ధర్మసంపాదన నుండి తీసినదయి ఉండాలి. వడ్డీ, జూదం, లాటరీ, లంచం, దగా, మోసం, దోపిడీ, దొంగతనాల ద్వారా సంపాదించిన డబ్బుతో ఏమాత్రం హజ్ చేయకూడదు. అసలు అధర్మ సంపాదనే పెద్ద నేరం. అలాంటిది అధర్మ సంపాదన నుండి తీసిన డబ్బుతో హజ్ వంటి గొప్ప దైవకార్యం నిర్వహించడం మరింత పెద్ద నేరం అవుతుంది. ''దేవుడు ఎంతో పవిత్రుడు, పరిశుద్ధుడు. ఆయన పరిశుద్ధమైన పవిత్ర వస్తువులనే స్వీకరిస్తాడు'' అన్నారు మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం). ఆయన మరొక హదీసులో సత్కార్యాల కోసం వెచ్చించే ధనం గురించి ఇలా తెలియజేశారు:

''ఒక హాజీ ధర్మసంపాదనతో కూడిన పైకంతో హజ్ చేయడానికి బయలుదేరి, వాహనం మీద కూర్చొని 'లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్' అని నినదించినపుడు ఆకాశం నుండి ఓ ప్రకటనకర్త (దైవదూత) ముందుకువచ్చి 'దేవుడు నీ హజ్‌ను స్వీకరించాడు. ఎందుకంటే నీ ప్రయాణఖర్చులు ధర్మసమ్మతమైనవి; నీ వాహనం ధర్మసమ్మతమైనది; నీ హజ్ చిత్తశుద్ధితో కూడుకున్నది' అని ప్రకటిస్తాడు. అలాగే అక్రమ సంపాదనతో ఎవరైనా హజ్‌కు బయలుదేరి 'లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్' అని నినదించినపుడు ఆకాశం నుండి ఓ ప్రకటనకర్త ముందుకువచ్చి 'నీ హజ్ దేవుని దగ్గర స్వీకరించబడలేదు. ఎందుకంటే నీ ప్రయాణఖర్చులు అధర్మమైనవి; నీ వాహనం అధర్మమైనది; నీ హజ్ నిర్దేశిత నియమాలకు భిన్నంగా ఉంది; పాపంతో కూడుకున్నది' అని ప్రకటిస్తాడు.'' (మషాలెరాహ్)

హజ్రత్ సదఖా బిన్ ఖాలిద్ (రహ్మలై) ఉల్లేఖనం ప్రకారం కొందరు మషాయెఖ్‌ల కథనం: మేము హజ్ చేయడానికి వెళ్ళాము. తిరిగొచ్చేటప్పుడు మా బృందంలో ఒకతను దారిలో చనిపోయాడు. మేము అక్కడి గ్రామంలో ఒకతని దగ్గర గడ్డపార అడిగి తీసుకొని సమాధి తవ్వాము. ఆ సమాధిలో మా సహచరుడి శవాన్ని పూడ్చిపెట్టాము. పూడ్చిన తరువాత గడ్డపార సమాధిలో వదిలేశామే అన్న సంగతి గుర్తొచ్చింది. అంచేత మేము సమాధిని మళ్ళీ తవ్వవలసి వచ్చింది. కాని కాస్త తవ్వగానే సమాధిలో ఓ భయంకర దృశ్యం కన్పించింది. ఆ గడ్డపార శవం మెడకు, చేతులకు మధ్య ఉంచి కట్టివేయబడి ఉంది. మేమీ దృశ్యం చూసి వెంటనే సమాధిని మట్టితో పూడ్చేశాము. సమాధిలో నుంచి గడ్డపారను తీయలేక పోయాము. గడ్డపార యజమానికి దాని ధర ఇచ్చి వచ్చాము.

మేము స్వస్థలం చేరుకోగానే మృతుని భార్య దగ్గరకు వెళ్ళాము. ఆమెకు జరిగిన సంఘటన వివరించి పరిస్థితి ఏమిటని అడిగాం. దానికి ఆమె ''మా ఆయన ఒకతనితో కలసి ఎక్కడికో వెళ్ళాడు. ఆ మనిషి దగ్గర డబ్బుంది. మా ఆయన దారిలో అతడ్ని హత్య చేసి అతని దగ్గర్నుంచి ఆ డబ్బు తీసుకున్నాడు. ఆ డబ్బుతోనే ఆయన ఈ హజ్‌యాత్ర చేయడానికి వెళ్ళాడు'' అని చెప్పింది. (మౌత్కారుఖుట్కా)



# 23. హజ్‌యాత్ర సన్నాహాలు

గత సంవత్సరం (2005) మే నెలలో నేను, మా శ్రీమతి హజ్‌యాత్ర చేయడానికి సంకల్పించుకున్నాం. సత్తెనపల్లి నుండి మా మామయ్య కూడా హజ్ చేయడానికి నిర్ణయించుకున్నట్లు తెలియజేశాడు. హజ్ కమిటీ ద్వారా హజ్ చేయడానికి పద్ధతి ఏమిటని ఒక మిత్రుడ్ని అడిగితే అతను హైదరాబాద్‌లోని నయాపూల్-మదీనా హోటల్ రోడ్డు మధ్య ఉన్న ''హుసామీ లిబాస్ ఘర్'' అనే షాపుకు వెళ్తే వాళ్ళు వివరాలన్నీ తెలియజేస్తారని అన్నాడు.

మరుసటి రోజు నేను 'హుసామీ లిబాస్ ఘర్'కు వెళ్ళి షాపు యజమాని ముహమ్మద్ ఫారూఖ్ గారిని కలుసుకొని విషయం చెప్పాను. ఆయన హజ్‌కమిటీకి సంబంధించిన ఒక అప్లికేషన్ ఫారం చూపిస్తూ దాన్ని పూర్తిచేసి రూ.10,700/-ల డిమాండ్ డ్రాఫ్టు జతచేసి హజ్ కమిటీకి పంపాలని అన్నారు. అప్లికేషన్ ఫారం ట్రిప్లికేట్‌లో ఉండాలని కూడా ఆయన చెప్పారు. నేను మా ముగ్గురి కోసం ఆయన దగ్గర్నుంచి మొత్తం తొమ్మిది ఫారాలు తీసుకొని ఇంటికి తిరిగొచ్చాను. అప్లికేషన్ ఫారాలు పూర్తిచేసి, తగినన్ని పాస్‌పోర్టు ఫొటోలు అతికించాను. ఆ తరువాత 3-6-2005న ఒక్కొక్కరికి రూ.10,700/-ల చొప్పున మా ముగ్గురి కోసం మూడు డిమాండ్ డ్రాఫ్టులు తీసి అప్లికేషన్ ఫారాలకు జతచేసి 27-6-2005న హుసామీ లిబాస్ ఘర్ యజమాని ఫారూఖ్ గారి ద్వారా ఆంధ్రప్రదేశ్ స్టేట్ హజ్ కమిటీ కార్యదర్శికి పంపాను. దాంతో మా ముగ్గురి పేర్లు హజ్‌కు వెళ్ళేవారి జాబితాలో చేరిపోయాయి. మేము పంపిన దరఖాస్తుల ప్రకారం మాకు ''కవర్ నెం. ఎ.పి. 1308-3, కేటగిరి నెం.1'' అనే గుర్తింపు నెంబర్ లభించింది.

2-11-2005న హజ్‌హౌస్‌లో హజ్ కమిటీ చైర్మన్ జనాబ్ గౌస్ మొహియుద్దీన్ గారితో పరిచయమైంది. ఆ సందర్భంలో నేను ఆయనకు ''ఖుర్ఆన్ భావామృతం'' ఇచ్చాను. నేను హజ్ పైకం పూర్తిగా పంపక పోయినా 16-11-2005న నాకు సెంట్రల్ హజ్‌కమిటీ, ముంబై నుంచి హజ్ ధృవీకరణ పత్రం లభించింది. అందులో మా ప్రయాణ తేది 7-12-05 అని నిర్ణయించబడింది.

నేనా పత్రం తీసుకొని అదేరోజు హజ్ హౌస్‌కు వెళ్ళి చైర్మన్ గారితో మాట్లాడాను. ఆయన విషయం వివరిస్తూ ''ఎయిర్‌చార్జెస్ ఇంకా డిసైడ్ కాలేదు. మీరు హజ్ ఖర్చుల కోసం 59,204/-రూపాయల డి.డి.తోపాటు, ఎయిర్‌చార్జెస్ కోసం విడిగా మరో 12,000- రూపాయల డ్రాఫ్టు తీసి సెంట్రల్ హజ్‌కమిటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ముంబై)కు పంపండి చాలు'' అని చెప్పారు. వెంటనే నేను మా ముగ్గురికోసం (59,204X3=)రూ.1,77,612-లతో కూడిన ఒక డి.డి., (12,000X3=)36,000/- రూపాయలతో కూడిన మరో డి.డి. తీసి వాటిని ఒక కవరింగ్ లెటర్‌కు జతచేసి కొరియర్ సర్వీస్ ద్వారా సెంట్రల్ హజ్ కమిటీకి పంపించాను. తరువాత దాని రశీదు కూడా నాకు ముట్టింది.

ఈవిధంగా మొదటి కేటగరి హాజీ మొత్తం (10,700+59,204+12,000=) 81,904/-రూపాయలు హజ్ కమిటీకి చెల్లించవలసి వచ్చింది. రెండవ, మూడవ, నాల్గవ కేటగరీ హాజీలకు 5000/-రూపాయల చొప్పున ఖర్చు తగ్గుతుంది. ఈ అయిదు వేల రూపాయల తేడా మక్కాలో కేటాయించే వసతిగృహం నుండి కాబాలయానికి ఉండే దూరాన్ని బట్టి నిర్ణయించబడింది. మూడు, నాలుగు కేటగరీ హాజీలకు కేటాయించిన వసతిగృహాలు కాబాకు 10 నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. అందువల్ల ఆ హాజీలు బస్సు ఏర్పాట్లు ఉన్నా నమాజు కోసం ప్రతివేళా కాబాషరీఫ్‌కు రాలేరు.

24-11-2005న మేము హజ్‌హౌస్‌కు వెళ్ళి టీకాలు వేయించుకొని హెల్త్ కార్డులు తీసుకున్నాం. హైదరాబాద్ హజ్ హౌస్‌లో ఇమిగ్రేషన్ ధృవీకరణ కోసం సెంట్రల్ హజ్ కమిటీ అధికారులు వచ్చి కూర్చున్నారని తెలిసి, నేను 5-12-2005న సెంట్రల్ హజ్ కమిటీ వారు పంపిన హజ్ ధృవీకరణ పత్రం తీసుకొని హజ్‌హౌస్‌కు వెళ్ళాను. దాని మీద ఆ అధికారులు ఇమిగ్రేషన్ ధృవీకరణ ముద్ర వేసిచ్చారు.

## 24. హజ్‌ప్రయాణీకులకు సూచనలు

హజ్‌యాత్రకు వెళ్ళేవారు, ముఖ్యంగా రాష్ట్ర హజ్ కమిటీ ద్వారా వెళ్ళేవారు కొన్ని సూచనలను గురించి తెలుసుకోవలసిన అవసరం ఎంతయినా ఉంది.

✦ రాష్ట్రంలోని హజ్ కమిటీ కేంద్రాలకు వెళ్ళి 'మెడికల్ చెకప్' చేయించుకోవాలి. టీకాలు కూడా వేయించుకొని 'హెల్త్‌కార్డ్' తీసుకోవాలి.

✦ శీతాకాలంలో మక్కాలో కంటే మదీనాలో చలి ఎక్కువగా ఉంటుంది. కనుక ప్రతి హాజీ ఒక స్వెట్టర్, ఒక ఉన్నిదుప్పటి వెంట తీసికెళ్ళడం మంచిది. ఇవి ఎలాంటి గుడారాల సదుపాయంలేని "ముజ్దలిఫా"లో ఎంతగానో పనికొస్తాయి. అలాగే సాధారణ దుస్తులతో పాటు రెండుజతల ఇహ్రాం బట్టలు కూడా తీసికెళ్ళడం మరచిపోకూడదు.

✦ హజ్‌యాత్రకు బయలుదేరేటప్పుడు లగేజి సామగ్రి హ్యాండ్‌బ్యాగ్‌తో సహా మొత్తం 35 కిలోలకు మించకూడదు. సౌదీ నుండి తిరిగొచ్చేటప్పుడు పది కిలోల హ్యాండ్ బ్యాగ్‌తో కలుపుకొని మొత్తం 55 కిలోలకు మించకూడదు.

✦ మక్కా, మదీనాలలో హాజీలకు కేటాయించే లాడ్జి (హోటల్ పేరు, దాని నెంబర్, చుట్టుపక్కల ఉండే గుర్తులను తప్పకుండా గుర్తుంచుకోవాలి. ఆ మేరకు ఇచ్చే 'భవన గుర్తింపుకార్డు'ను బయటికి వెళ్ళేటప్పుడు వెంటతీసికెళ్ళాలి. అంతేకాదు, మన హజ్‌కమిటీ ఇచ్చే స్టీల్ కంకణం (Bracelete), గుర్తింపుకార్డు, సౌదీలో ముఅల్లిం ఇచ్చే ముంజేతి పట్టీ, గుర్తింపుకార్డులు కూడా దగ్గర పెట్టుకోవడం మరచిపోకూడదు. ఒకవేళ అప్పటికీ హాజీ తప్పిపోవడం జరిగితే దగ్గర్లో ఉండే భారత హజ్ మిషన్ ఆఫీసుకు వెళ్ళి గుర్తింపు కార్డు చూపిస్తే వారతడ్ని అతని విడిది స్థలానికి చేరుస్తారు.



✦ మక్కా, మదీనాలలో హాజీలకు కేటాయించే లాడ్జింగ్‌గదులలో మంచాలు, పరుపులు, దుప్పట్లు, ఫ్రిజ్‌లు ఉంటాయి. అక్కడి ఉమ్మడి వంటగదులలో వంట చేసుకోవడానికి స్టౌ, గ్యాస్ సిలిండర్ సౌకర్యం కూడా ఉంటుంది. అగ్ని ప్రమాదాలు నివారించడానికి వంటచేసేవాళ్ళు వంటచేస్తున్నంత సేపు వంటగదిలోనే ఉండాలి. బెడ్‌రూంలో ఎయిర్‌కండిషన్ సౌకర్యం కూడా ఉంటుంది.

✦ మక్కా, మదీనాలలో హాజీలకు కేటాయించే లాడ్జింగ్‌లలో "త్రీ ఇన్ ఒన్ బాత్ రూములు" కూడా ఉంటాయి. ఇవి కూడా రెండు మూడు పోర్షన్ల హాజీలకు సంబంధించిన ఉమ్మడి బాత్‌రూంలు. ఈ గదులలో మలమూత్ర విసర్జన, స్నానాల ఏర్పాటు, ఒక వాష్‌బేసిన్ ఉంటాయి. వాటితోపాటు ఒక బకెట్, ఒక చెంబు కూడా ఉంటాయి. స్నానానికి వేడినీళ్ళు, చన్నీళ్ళ కోసం ఓ 'గిజర్' కూడా ఉంటుంది.

✦ ప్రతిహాజీకు సగటున రోజుకు ఒక లీటర్ చొప్పున జమ్‌జమ్ నీళ్ళు సరఫరా చేయబడతాయి. హాజీలు పరస్పర సహకారభావంతో ఈ నీటిని వాడుకోవాలి.

✦ మక్కా, మదీనాలలో ఉచిత వైద్యసేవలు పొందగోరేవారు అక్కడ "భారత హజ్ మిషన్"వారు ఏర్పాటుచేసే ఆసుపత్రులకు వెళ్ళవచ్చు.

✦ హజ్‌యాత్రికుని సామగ్రి ఏదైనా తప్పిపోతే లేదా కనపడకుండా పోతే, అతను వెంటనే "తప్పిపోయిన బ్యాగేజి విభాగం" (Lost baggage section) ఆఫీసుకు పోయి కంప్లయింట్ చేస్తే వారు తగిన చర్యలు తీసుకుంటారు.

✦ అలాగే మారకద్రవ్యం లేక కరెన్సీ ఏమైనా పోతే "సాధారణ సంక్షేమ విభాగం" (General welfare section) ఆఫీసుకు పోయి కంప్లయింట్ చేయాలి.

✦ తిరుగు ప్రయాణంలో ప్రతి హాజీకు పది లీటర్ల జమ్‌జమ్ నీళ్ళు తెచ్చుకునే అనుమతి ఉంది. అంతేకాకుండా ఎయిర్‌లైన్స్ వారు కూడా ప్రతి హాజీకి పది లీటర్ల జమ్‌జమ్ నీళ్ళు సరఫరా చేస్తారు.

✦ "భారత హజ్ మిషన్" అధికారులు బ్లూకలర్ జాకెట్ ధరించి ఉంటారు. దాని మీద జాతీయపతాకం ముద్రించబడిఉంటుంది. వెనుక వైపు వీపుమీద భారత్, ఇండియా అని రాయబడి ఉంటాయి. వాళ్ళే మన దేశ హాజీలకు సహాయపడేవారు. వారు జిద్దా, మదీనా ఎయిర్‌పోర్టులకు వచ్చి హాజీలకు స్వాగతం చెబుతారు. మదీనా, జిద్దా ఎయిర్ పోర్టుల నుండి వసతిగృహాలకు హాజీలను, వారి సామగ్రిని బస్సుల ద్వారా వారే చేరుస్తారు. హాజీలు వారితో సహకరించాలి.

✦ ప్రతి వసతిగృహం గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఒక "రిసెప్షన్ కౌంటర్" ఉంటుంది. అక్కడ "బిల్డింగ్ కంప్లయింట్ రిజిష్టర్" కూడా ఉంటుంది. హాజీలు తమ వసతి గృహానికి సంబంధించిన అసౌకర్యాలు ఏమయినా ఉంటే ఆ రిజిష్టర్‌లో తమ కంప్లయింట్ వ్రాయవచ్చు.

✦ 'మినా'లో బసచేసినప్పుడు ప్రతివేళా హాజీలకు వారి గుడారాలలో భారత హజ్ మిషన్ తరఫున భోజనం సరఫరా చేయబడుతుందని ఇండియన్ సెంట్రల్ హజ్ కమీటీ ప్రచురించిన "హజ్ గైడ్-2006" పుస్తకంలో పేర్కొన్నారు. కాని నాకు తెలిసినంతవరకూ మినాలో హజ్‌మిషన్ ఎలాంటి భోజనసౌకర్యం కల్పించలేదు. అందువల్ల హాజీలు మినాలో తమ భోజనఏర్పాట్లు తామే చేసుకోవడం మంచిది.

✦ అదేవిధంగా అరఫాత్, మినాల మధ్యఉండే 'ముజ్దలిఫా' నుండి మినాకు తిరిగొచ్చే ముఅల్లిం బస్సుల కోసం ఎదురుచూడకుండా ప్రైవేటు ట్యాక్సీ మాట్లాడుకొని మినాకు బయలుదేరడం మంచిది. ముఅల్లింగారి బస్సుల కోసం ఎదురు చూడటం కాలహరణం (Time waste), చివరికి నిరాశ తప్ప ఏమీ ఉండదు.

✦ ఖుర్బానీ పశువు కొనడానికి డబ్బు అపరిచిత వ్యక్తులకు ఇవ్వకూడదు. తెలిసినవారు ఎవరైనా ఉంటే వాళ్ళకు మాత్రమే డబ్బివ్వాలి. లేదా వీలైతే ఖుర్బానీ పశువును మనమే స్వయంగా కొని జిబహ్ చేయడానికి ప్రయత్నించాలి. అది కుదరకపోతే "ఇస్లామిక్ డెవలప్‌మెంట్ బ్యాంకు" నుండి ఖుర్బానీ కూపన్ కొనుక్కోవాలి.

✦ తవాఫ్, సయీ, రమీ చేసే సమయాల్లో సాధారణంగా గుంపు ఎక్కువగా ఉంటుంది. దైవభీతిపరుడైన హాజీ తోటిహాజీలకు కష్టం కలిగేలా వారిని తోసుకుంటూ ముందుకు పోకూడదు. ఈ చర్య మన పుణ్యాన్ని తగ్గిస్తుందేగాని పెంచదు.

హజ్రత్ ఉమర్ (రజి) కాబాప్రదక్షిణ చేస్తూ 'ఇస్తిలాం' కోసం జనాన్ని త్రోసుకుంటూ ముందుకు పోవడానికి ప్రయత్నించారు. దైవప్రవక్త (స) చూసి "ఉమర్! నువ్వసలే బలాఢ్యుడివి. ఇలా జనాన్ని త్రోసుకుంటూపోతే వారికి బాధ కలగదూ! దూరం నుంచి చేత్తో సైగచేసినా ఇస్తిలాం విధి నెరవేరుతుంది" అన్నారు. (హదీసు)

## 25. మా విమానయానం

నేను, మా శ్రీమతి, మా మామయ్య ముగ్గురం హజ్‌యాత్ర సన్నాహాలలో నిమగ్నమయ్యాం. 6-12-2005 తేదీన మా ఇల్లు బంధువులతో కిటకిటలాడిపోయింది. నేను హజ్‌యాత్ర కోసం వెళ్తున్నానని తెలిసి 'తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్' చైర్మన్ జనాబ్ అబ్దుల్‌బాసిత్ అన్వర్ గారు నన్ను కలుసుకోవడానికి ఆరోజు రాత్రి మా ఇంటికి వచ్చారు. కుశల ప్రశ్నలయ్యాక ఆయన మా కోసం సందేశ భవనం (మెసేజ్ హౌస్) నుండి హజ్ హౌస్‌కు వెళ్ళడానికి కారు ఏర్పాటు చేశారు. మేము ముగ్గురం రెండు రకాతులు నఫిల్ నమాజ్ చేసి ఇంటి నుండి బయలుదేరాం.

కారు అనగానే మా వెంట ఓ పెద్ద పటాలం బయలుదేరింది. దాని వెనుక ఆటోలు, స్కూటర్లు, బైకులు షరా మామూలే. మేమా రాత్రి 11 గంటలకు హజ్‌హౌస్‌కు చేరుకున్నాం. అప్పటికే అక్కడ లగేజి సామానుల ఓ పెద్ద "క్యూ" తయారయి ఉంది. మేము మా లగేజి సామగ్రిని కారులో నుంచి దించి ఆ 'క్యూ' చివర్లో పెట్టాం.



అర్ధరాత్రి 12గంటలకు మా లగేజి వంతు వచ్చింది. లగేజిబరువు, స్కానింగ్‌ల తర్వాత పాస్‌పోర్ట్, వీసా వగైరా ఇమిగ్రేషన్ పనులు జరిగాయి.

ఇలా చెకింగ్ అయిన తరువాత సెంట్రల్ హజ్ కమిటీ వారు మాకు ముంజేతికి కట్టుకోవడానికి ఒక స్టీలు కంకణం, మెడలో వేసుకునేందుకు జాతీయపతాకానికి సంబంధించిన మూడు రంగుల పట్టీ కలిగిన ఒక గుర్తింపు కార్డు, ఎయిర్ టికెట్, దాదాపు 24 వేల రూపాయలు విలువ చేసే 2 వేల సౌదీ రియాళ్ళు ఇచ్చారు.

మా ముగ్గురిని సాగనంపడానికి వచ్చిన మా బంధుమిత్రులు మాకు వీడ్కోలు చెప్పిన తరువాత మేము ఇతర యాత్రికులతో కలసి ఒక పెద్ద హాలులో సమావేశం అయ్యాం. అక్కడ హజ్ కమిటీ అధికారి ఒకాయన ఉపన్యాసమిస్తూ హాజీలకు కొన్ని సూచనలు ఇచ్చారు. ఆ తర్వాత 7-12-2005 ఉదయం 4 గంటలకు హజ్‌హౌస్ నుండి హజ్‌కమిటీ తరఫున ఏర్పాటు చేసిన బస్సుల్లో బయలుదేరి 4.30కు ఎయిర్‌పోర్టుకు చేరుకున్నాం. ఎయిర్‌పోర్టులో కూడా స్కానింగ్, చెకింగ్‌లు జరిగాయి. తర్వాత గాలిబండి ఎక్కడానికి ఎయిర్‌లైన్స్ అధికారులు మాకు బోర్డింగ్ పాసులు ఇచ్చారు. ఈ తతంగం పూర్తయిన తరువాత హాజీలంతా మరో హాల్లోకి చేరుకున్నారు.

ఫజర్ నమాజు వేళ కావడానికి ఇంకా కొన్ని నిమిషాలు ఉన్నాయి. అంతలో ఎయిర్‌లైన్స్ అధికారులు బోర్డింగ్ టైం అయింది, బయలుదేరండి అంటూ కేకలు పెట్టారు. హనఫీ దృక్పథం ప్రకారం ఫజర్‌నమాజు వేళ ప్రారంభం కావడానికి మరో ఏడెనిమిది నిమిషాలు ఉన్నాయి. అటు అధికారు బయలుదేరమని గోల చేస్తున్నారు. అప్పుడు కొందరు వెంటనే అజాన్ చెప్పి నమాజు ప్రారంభించారు. నాతో పాటున్న మరి కొందరు 'వేళ కాకముందే ఎలా నమాజు చేస్తారు?' అని ప్రశ్నించారు. వారికి నేనొక హదీసు గుర్తుచేసి తక్షణమే నమాజుకు ఉపక్రమింపజేశాను.

ఇలా నమాజు ముగించుకొని తొందర తొందరగా విమానంలోకి గొనిపోయే ఒక 'సెక్యూరిటీ సొరంగం'లోకి ప్రవేశించాం. ఆ సొరంగం మమ్మల్ని 'రన్‌వే' దగ్గరికి తీసుకుపోకుండా నేరుగా విమానంలోకి తీసికెళ్ళింది. జీవితంలో మొదటిసారి విమానం ఎక్కిన మేం ముగ్గురం విచిత్రానుభూతికి లోనవుతూ వెళ్ళి కేటాయించిన సీట్లలో కూర్చున్నాం. పదిమంది సిబ్బందితోపాటు మొత్తం మూడొందలమంది ప్రయాణీకుల్ని ఎక్కించుకొని ఈ లోహశకటం గాలిలో ఎలా తేలిపోతుందోనని ఆలోచిస్తుంటే "ఇన్నల్లాహ అలాకుల్లి షైయిన్ ఖదీర్" అనే ఖుర్‌ఆన్ సూక్తి గుర్తొచ్చింది.

ఇంజన్ స్టార్ట్ అయింది. సరిగ్గా ఉదయం 6.10 గంటలకు మా విహంగ యంత్రం 'టేకాఫ్' తీసుకుంది. చూస్తుండగానే మేము భూతలం వదలి గాలిలోకి దూసుకు పోయాం. భాగ్యనగరంలోని పెద్ద పెద్ద భవంతులు సైతం అగ్గిపెట్టెల్లా మారిపోతూ కొన్ని క్షణాల్లోనే కనుమరుగైపోయాయి. మాకు కింద, పైనా, ఎటు చూసినా మబ్బులమయం. ఆ మేఘమాలికల మధ్య గరుడ వాహనం రివ్వున ముందుకు దూసుకుపోతుండగా మా విమానయానం హాయిగా సాగింది.



↑ మా విమానయానం, మదీనా నగర చిహ్నాలు ↓





ఇలా మేము 5 గంటలు ప్రయాణం చేసి సౌదీ కాలమానం ప్రకారం 7.12.05న ఉదయం 8.45 గంటలకు మదీనా ఎయిర్‌పోర్టుకు చేరుకున్నాం. చెకింగ్ తరువాత అక్కడ్నుంచి ముఅల్లిమ్ ఏర్పాటు చేసిన బస్సులో 11 గంటలకు మాకు నిర్ణయించిన లాడ్జింగ్‌కు చేరి మధ్యాహ్నం ఒంటి గంటకు కేటాయించిన గదిలోకి ప్రవేశించాం.

## 26. మదీనా ఔన్నత్యం

ఆహా, ఎన్నేండ్లకు మాకు మదీనా సందర్శించే మహాభాగ్యం లభించింది! మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) మక్కా నుండి వలస వచ్చి స్థిరపడిన పట్టణం!! ఇస్లామీయ ఉద్యమ వైతాళికుడు ఆశీర్వదించిన పవిత్ర నగరం!!!

దైవప్రవక్త (సల్లం), ఆయన అనుచరులు మక్కా నుండి మదీనాకు వలస రాక పూర్వం ఈ పట్టణం, దాని పరిసర ప్రాంతాలన్నిటిని కలిపి యస్రిబ్ అని పిలిచేవారు. నూహ్ ప్రవక్త (అలైహి) సంతతిలోని యస్రిబ్ అనే నాయకుడు తన తెగవాళ్ళతో వచ్చి ఈ ప్రాంతంలో స్థిరపడిపోయినందున, అతని పేరుతో ఇది యస్రిబ్‌గా ప్రసిద్ధి చెందింది. నిఘంటువు ప్రకారం యస్రిబ్ అంటే అభిశాపం, అల్లకల్లోలం అనే అర్థాలు కూడా ఉన్నాయి. బహుశా ఈ కారణంగానే మహాప్రవక్త (స) ఇక్కడకు వలసవచ్చిన తరువాత "తాబ, తయ్యిబ, మదీనా"అనే పేర్లు పెట్టారు. తాబ లేక తయ్యిబ అంటే పవిత్రమైనది, పరిశుద్ధమైనది అని అర్థం. మదీనా అంటే పట్టణం అని భావం.

దైవప్రవక్త (సల్లం), ఆయన అనుచరులు మదీనాకు వలస రాక ముందువరకూ ఇక్కడి వాతావరణం బాగుండేదికాదు. తరచుగా అంటువ్యాధులు ప్రబలుతుండేవి. ఈ కారణంగా ముస్లింలు ఇక్కడకు వలసవచ్చిన కొత్తలో హజ్రత్ బిలాల్, అబూబకర్ (రజి)లు తీవ్రంగా జబ్బుపడ్డారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఇలా దుఆ చేశారు:

"దేవా! మా హృదయాల్లో మక్కా పట్ల జనించిన అభిమానం కంటే మదీనా పట్ల ఎక్కువ అభిమానం జనింపజెయ్యి. దేవా! మా ధాన్యాల్లో, ఆహారోత్పత్తుల్లో శుభం కలిగించు. ఈ పట్టణజ్వరాన్ని జుహుఫ్ఫాకు తరలించు. ఇక్కడి వాతావరణాన్ని మాకు అనుకూలంగా, ఆహ్లాదకరంగా ఉండేలా చెయ్యి." (బుఖారి, ముస్లిం)

"(దైవప్రవక్త) ఇబ్రాహీం (అలైహి) మక్కాను నిషిద్ధ (పుణ్య) క్షేత్రం (హరం)గా నిర్ణయించారు. మక్కా ప్రజల శ్రేయస్సు కోసం దైవాన్ని ప్రార్థించారు. అదేవిధంగా నేనిప్పుడు మదీనాను నిషిద్ధ క్షేత్రంగా నిర్ణయిస్తున్నాను. దీని ఉపాధి, ఆహారోత్పత్తుల విషయంలో మక్కా కంటే రెట్టింపు శుభం ప్రసాదించమని దైవాన్ని ప్రార్థిస్తున్నాను." (బుఖారి, ముస్లిం)

"దైవప్రవక్త (సల్లం) ప్రయాణం నుండి తిరిగి వచ్చిన ప్రతిసారీ దూరం నుంచి మదీనా ఇండ్లు కన్పించగానే ఎంతో ఉత్సాహంతో 'తాబా వచ్చేసింది' అంటూ తాను కూర్చున్న ఒంటెను వేగంగా తోలేవారు." (బుఖారి)

ఆ సందర్భంలో "ఆయన దుప్పటిని భుజం మీద నుంచి కిందికి జారవిడుస్తూ 'ఇవి తయ్యిబా నుండి వీస్తున్న గాలుల'ని అనుచరులతో అనేవారు. అనుచరుల్లో ఎవరైనా దుమ్ము ధూళి ముఖం మీద పడకుండా దేన్నయినా అడ్డం పెట్టుకున్నప్పుడు దైవప్రవక్త (సల్లం) వారినా పని నుండి వారిస్తూ 'మదీనా మన్నులో స్వస్థత ఉంది' అని చెప్పేవారు." (జజ్బుల్ ఖులూబ్)

మరో సందర్భంలో ఆయనిలా అన్నారు: "ఎవరి అధీనంలో నా ప్రాణముందో ఆ శక్తిస్వరూపుని సాక్ష్యం! మదీనా మట్టిలో ప్రతివ్యాధికీ స్వస్థత ఉంది." (అత్తర్గీబ్)

దైవప్రవక్త (సల్లం) ప్రవచించిన మరికొన్ని హదీసులు చూడండి:

"పేదరికం, ఇతర కష్టాల పట్ల సహనం వహిస్తూ మదీనాలోనే ఉండి, మదీనా లోనే చనిపోయే వ్యక్తి కోసం నేను ప్రళయదినాన (దేవుని సన్నిధిలో) సిఫారసు చేస్తాను. అయితే అతను ముస్లిం అయిఉండాలి." (సహీ ముస్లిం)

"ఎవరైనా మదీనా ప్రజలకు కీడు చేయదలిస్తే దేవుడు అతడ్ని అగ్నిలో పడేసి సీసాన్ని కరిగించినట్లు కరిగిస్తాడు. లేదా నీళ్ళలోని ఉప్పులా కరగబెడ్తాడు." (ముస్లిం)

"మదీనాకు వచ్చే మార్గాలలో దైవదూతలు నియమించబడ్డారు. అందువల్ల మదీనాలోకి ప్లేగు, దజ్జాల్ ప్రవేశించడం సాధ్యంకాదు." (బుఖారి, ముస్లిం)

"నా అనుచర సముదాయంలోని ప్రజలలో నేను మొట్టమొదట మదీనా వాసుల్ని గురించి (దేవుని దగ్గర) సిఫారసు చేస్తాను. తర్వాత మక్కావాసుల్ని గురించి, ఆ తరువాత తాయిఫ్ వాసుల్ని గురించి సిఫారసు చేస్తాను." (తబ్రాని)

మదీనాకు దక్షిణ దిక్కులోని 'అయిర్' కొండకు, ఉత్తర దిక్కులోని 'సౌర్' కొండకు మధ్య ఉన్న ప్రాంతాన్ని దైవప్రవక్త (సల్లం) నిషిద్ధ క్షేత్రం (హరం)గా నిర్ణయించారు. దీన్ని గురించి ఆయన ఇలా ప్రవచించారు:

"మదీనా 'అయిర్' కొండ నుంచి 'సౌర్' కొండ వరకు (నిషిద్ధక్షేత్రం) హరం(గా నిర్ణయించబడింది). కనుక ఈ ప్రదేశంలో ఎవరైనా కల్లోలం సృష్టిస్తే లేదా కల్లోలాలకు పాల్పడేవారికి ఆశ్రయమిస్తే అలాంటి వ్యక్తిని దేవుడు, దైవదూతలు, యావన్మంది ప్రజలు శపిస్తారు. ప్రళయ దినాన దేవుడు అతని ఫరజ్, నఫిల్ ఆరాధనలు స్వీకరించడు." (బుఖారి)

"దైవప్రవక్త 'హరం'గా నిర్ణయించిన (ఈ) ప్రదేశంలో చెట్ల ఆకులు రాల్చడం గాని, వాటిని కోయడంగాని చేయకూడదు. కాకపోతే (పశుగ్రాసం కోసం పండుటాకుల్ని రాల్చడానికి) చెట్లను మెల్లగా ఊపవచ్చు." (అబూదావుద్)

ఈ హదీసుల్నిబట్టి మదీనాకు ఎంత ప్రాముఖ్యం, ఔన్నత్యాలున్నాయో తెలుస్తు న్నాయి. మేము ఇన్నాళ్ళకైనా మదీనా సందర్శించడం నిజంగా మా అదృష్టం. ఈ విష యాలన్నీ తెలిసి కూడా హజ్ చేయని ధనిక ముస్లిం ఎంత దురదృష్టవంతుడు!





↑ మదీనా నగర ప్రవేశం, మస్జిదె నబవీ ముందు ↓



# 27. మదీనా నగర ప్రవేశం

దేవుని దయవల్ల మా ముగ్గురికి ప్రత్యేకంగా ఒక గది లభించింది. మేమా గదిలో ప్రవేశించి సంచులకు, సూట్‌కేసులకు బంధవిముక్తి గావించి కొన్ని బట్టలు, వంటపాత్రలు బయటికి తీసి బీరువాలలో సర్ది పెట్టుకున్నాం. జుహర్ నమాజ్, భోజనాలు ముగించేటప్పటికి మధ్యాహ్నం మూడు గంటలయింది. ఆ తరువాత వెంటనే అసర్ నమాజు కోసం నేను, మా మామయ్య "మస్జిదె నబవీ" (ప్రవక్త మసీదు)కు చేరుకున్నాం. మసీదులోకి ప్రవేశించే ముందు ప్రధాన ద్వారం దగ్గర నిలబడి మసీదు స్వరూపం పరికించి చూశాను. మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) తన స్వహస్తాలతో నిర్మించిన మసీదు! ఆ మహనీయుడు (సల్లం) మక్కా నుండి మదీనాకు వలస వచ్చిన వ్రాతపూర్వక దృశ్యం నా మనసులో మెదిలింది......

...దైవప్రవక్త (సల్లం) పట్నం వస్తున్నారని మదీనావారందరికీ తెలిసిపోయింది. ఇంకే ముంది! ఆనందభరితమైన ఓ కలకలం బయలుదేరింది. ముస్లింలు, యూదులు, బహు దైవారాధకులు అంతా అమిత సంతోషంతో ఎగిరిగంతులేశారు. ఆనందడోలికల్లో ఊగుతూ గానాలాపనం చేయసాగారు. అంతులేని అనురాగంతో, ఆగలేని ఆత్రంతో ఆడసాగారు. పరమ సంతోషం పరవశించిపోతూ పాడసాగారు. ప్రతి మనిషి కళ్ళలో దైవసందేశహరుని (సల్లం) కోసం నిరీక్షిణాజ్యోతులు వెలిగిపోతున్నాయి.

చిన్నారి పిల్లలు సైతం సంతోషంతో వీధి వీధి తిరుగుతూ "ప్రియప్రవక్త వస్తున్నారు, త్వరలో వస్తున్నారు" అని చెబుతూ సంతోషంతో గంతులేయసాగారు. వారు ప్రతిరోజూ ఉదయాన్నే పట్నం బయటికెళ్ళి, కళ్ళలో వత్తులు వేసుకొని దైవప్రవక్త (సల్లం) వచ్చే దారి వైపు గంటల తరబడి చూసేవారు. అలా మధ్యాహ్నం దాకా చూసి, వచ్చే జాడ కన్పడకపోవడంతో నిరాశపడి ఇళ్ళకు వెళ్ళిపోయేవారు. అలాంటి పరిస్థితిలో ఓరోజు హఠాత్తుగా.....

"మదీనాప్రజలారా! మీరు ఎవరికోసం ఇన్నాళ్ళ నుంచి ఎదురుచూస్తున్నారో ఆయన వచ్చేశారు" ఓ గుట్ట మీది నుంచి ఒక యూదుని గొంతు పట్నంలో ప్రతి ధ్వనించింది.

అంతే, ఆ కేక విని మదీనా ప్రజావాహిని ఆనందాతిశయంతో పరవళ్ళుతొక్కింది. పెద్దలు, పిల్లలు, స్త్రీలు, పురుషులు ఆబాలగోపాలమంతా బిలబిలమంటూ ఇళ్ళలో నుంచి బయటికి వచ్చేశారు. ప్రతిఒక్కడూ పట్టరాని సంతోషంతో వీథుల్లోకి దూసుకు వచ్చాడు. అందరి కళ్ళు పూర్ణశశాంకుడ్ని చూసిన కలువపువ్వుల్లా ఒక్కసారిగా వికసించాయి. బాలబాలికల ఆనందం అవధులుదాటింది. ప్రతిఒక్కడూ తనకేదో గొప్ప పెన్నిధి లభించబోతున్నట్లు మహా సంబరపడిపోతున్నాడు.

ఎక్కడ చూసినా ఒకటే సందడి. ఆఖరికి చంటిపిల్లలు సైతం ఏడ్పులు మానేసి, సంతోషంతో కేరింతలు కొట్టసాగారు. అంతా ఆనందడోలికల్లో ఉర్రూతలూగుతున్నారు.



ముస్లింలు, యూదులు, బహుదైవారాధకులు- ఒకరేమిటీ? యావన్మంది కుల,మత,వర్ణ విభేదాలులేకుండా ఆ విశిష్ఠవ్యక్తి దర్శనభాగ్యం కోసం తహతహలాడి పోతున్నారు.

"ఇంకా మీరిక్కడే ఉన్నారా? కదలండి మానవమహోపకారి వస్తున్నారు. బయ లెడండి ఆయన దివ్యమోము తనివితీరా చూసి తరిద్దాం. నడవండి మన ప్రియనగరాన్ని పావనం చేయడానికి కారుణ్యమూర్తి వస్తున్నారు. పదండి ఆ మహనీయుడికి స్వాగత గానం చేద్దాం."

"రండిరండి. ధర్మస్థాపన కోసం దైవసందేశహరుడు వస్తున్నాడు, ఎదురెళ్ళి తీసు కొద్దాం. పగ, ప్రతీకారం, స్వార్థం, ద్వేషం, దుఃఖం, దురాచారాలు ఆవరించిన మన హృదయాల్లో జీవనజ్యోతి వెలిగించడానికి మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) వస్తున్నారు, ఆతిథ్యమిద్దాం పదండి."

"ఎన్నాళ్ళ నుంచో ఎదురుచూస్తున్న మన ఆశాజ్యోతి మహనీయ ముహమ్మద్ (సల్లం) పట్నంలో ప్రవేశిస్తున్నారు పరుగెత్తండి."

ముందుగా పెద్దలు, వృద్ధులు స్వాగతం చెప్పడానికి అంతులేని ఉత్సాహంతో పట్నం బయటికి పోయి నిరీక్షించసాగారు. అలా చూస్తుండగానే వారి కళ్ళు తళుక్కున మెరిశాయి. ఆయన వచ్చేశారు. నిరీక్షణా ఘడియలకు గడిపెట్టి ఆయన వచ్చేశారు. సహచరులు పట్టరాని ఆనందంతో ఆలింగనం చేసుకొని ఆయన్ని తీసుకొస్తున్నారు.

అయితే శతకోటి తారల మధ్య భాసిల్లుతున్న పూర్ణశశాంకునిలా, భారీఎత్తు మందీ మార్బలం మధ్య గొప్ప రాజలాంఛలతో వస్తున్న రాజాధిరాజులా ప్రత్యేకతలేవీ లేకుండా అత్యంత నిరాడంబరంగా, అందరితో కలసి ఎలాంటి ఆర్భాటంలేని ఒక సామాన్యుడిలా వస్తున్నారు.

అందువల్ల మదీనావాసులకు దైవప్రవక్త (స)ను గుర్తించడం కష్టమయిపోయింది. అయితేనేం? వారి హృదయచక్షువులు గుర్తిస్తున్నాయి. వారిదేహంలోని అణువణువులో ప్రవక్త ప్రేమాభిమానాలు జీర్ణించుకుపోయాయి.

ఎండ తీక్షణంగా ఉండటంతో ప్రియ సహచరుడు హజ్రత్ అబూబకర్ (రజి) ముందుకొచ్చి దైవప్రవక్త (సల్లం) తల మీద దుప్పటి లాగి పట్టుకున్నారు. అప్పుడు గ్రహించారు మదీనావాసులు ఆయనే దైవసందేశహరుడని.

ఎడతెరిపి లేకుండా జనం తండోపతండలుగా వస్తున్నారు. ఖుబా నుంచి మదీనా వరకు మూడు మైళ్ళ పొడవున దైవప్రవక్త (సల్లం)కు ఇరువైపులా అనుచరులు బారులుతీరి నిలబడ్డారు. అక్కడక్కడ వారి మధ్య కొందరు పిల్లలు కూడా ముందుకు తోసుకుంటూ ఆ మహనీయుడ్ని చూడటానికి ఆరాటపడిపోతున్నారు.

అది శుక్రవారం. దైవప్రవక్త (స) అనుచరులతో బనీసాలమ్ వాడలోకి వచ్చేటప్పటికి జుమానమాజ్ వేళయింది. అంతాకలిసి అక్కడే నమాజ్ చేశారు. తర్వాత ఆయన తన

మాతృమూర్తి వంశస్తులు నివసిస్తున్న ప్రదేశం మీద కాలుమోపారు. తన రక్తమాంసాల కోసం ఎగబడిన ఖురైషీయులకు వ్యతిరేకంగా తనపట్ల అచంచల విశ్వాసంతో ప్రాణ త్యాగమైనా చేయడానికి సిద్ధమైన ధర్మయోధుల పవిత్ర నగరంలో అడుగుపెట్టారు.

**అదో అద్భుత సన్నివేశం.** మదీనా చరిత్రలో కనీవినీ ఎరగని అపూర్వ సంఘటన. ప్రతి కుంటుంబం దైవప్రవక్త (స)ను తన అతిథిగా చేసుకోవాలని ఉవ్విళూరుతోంది. ప్రతిఒక్కరూ వచ్చి "దైవప్రవక్తా! మా ఇంటికి రండి, మాఇల్లు విశాలంగా ఉంది. మాదగ్గర అన్ని సౌకర్యాలున్నాయి" అని ప్రాధేయపడుతున్నారు.

దైవప్రవక్త (స) చిరునవ్వుతో వారికి కృతజ్ఞతలు చెప్పి ముందుకు సాగిపోతున్నారు. ఒంటె ముకుతాడు కొంచెం వదులుచేసి "ఈ ఒంటె ద్వారా దేవుడు నన్ను ఎక్కడుండమని సూచిస్తాడో అక్కడుంటాను" అన్నారు.

దైవప్రవక్త (స) కూర్చున్న ఒంటె మదీనా వీథుల్లో నడుస్తోంది. ఒంటెకు కుడి ఎడమలా, వెనుక వైపునా ప్రియశిష్యులు నడుస్తున్నారు. ఒంటె ముందు కొంచెం దూరంలో జన సమూహం చేసే హర్షధ్వానాలు మిన్నుముట్టుతున్నాయి. చిన్నారి బాలికలు గెంతులు వేస్తూ, డప్పులు వాయిస్తూ ఆనందాతిశయంతో ఇలా పాడుతున్నారు:

"సీనాయి కొండల నుంచి మా ముందు పున్నమి చంద్రుడు ఉదయించాడు. దైవాన్ని వేడుకునే భక్తులారా! దైవానికి కృతజ్ఞులయి ఉండటమే మన కర్తవ్యం. మాలో ప్రవేశించే మహానుభావా! ఇక్కడ నీ అమృత ప్రవచనాలే మాకు వీనులవిందు."

పురుషులు ఎత్తయిన ప్రదేశాలు ఎక్కి చూడసాగారు. స్త్రీలు ఇండ్ల కప్పుల పైకెక్కి తమ ప్రియతమ అతిథిని తిలకించసాగారు.

దైవప్రవక్త (సల్లం) ఒంటె అలా నడచీ నడచి చివరకు విశాలమైన ఓ మైదానంలోకి ప్రవేశించి కూర్చున్నది. అప్పుడు జనం 'అల్లాహుఅక్బర్' అంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినదించారు. మరుక్షణమే ఒంటె లేచి ముందుకు కొంచం దూరం నడిచింది. ఆ తరువాత గిర్రున వెనక్కి తిరిగొచ్చి కూర్చున్నది. కూర్చోగానే మోర కిందికి వాల్చి తోకాడించడం మొదలెట్టింది. జనం మరోసారి అల్లాహుఅక్బర్ నినాదం చేశారు.

ఆ ప్రదేశం నజ్జార్ వంశానికి చెందిన ఇద్దరు అనాథ బాలురది. ఆ ప్రదేశానికి దగ్గర్లోనే అబూఅయ్యూబ్ (రజి) గారి రెండస్థుల మేడుంది. అందువల్ల ఆయన వెంటనే దైవప్రవక్త (సల్లం) అనుమతితో ఆయన సామగ్రిని తన ఇంటికి చేర్చారు. దైవప్రవక్త (సల్లం) ఒంటె దిగి "ఈ చోటు ఎవరిది?" అని అడిగారు మస్జిద్ నిర్మించాలన్న ఉద్దేశ్యంతో.

హజ్రత్ ముఆజ్ బిన్ అఫ్రా (రజి) ముందుకు వచ్చి "ఈ భూమి సహెల్, సుహైల్ అనే అనాథ పిల్లలది. పసితనంలోనే తండ్రిని కోల్పోయారు. ప్రస్తుతం వీరిద్దరు నా సంరక్షణలో ఉన్నారు. మీరిక్కడ సంతోషంగా మస్జిద్ నిర్మించవచ్చు. పిల్లలకు నేను నచ్చజెబుతాను" అని చెప్పారు.



దైవప్రవక్త (సల్లం) ఆ ఇద్దరు పిల్లల్ని పిలిపించి విషయం తెలియజేశారు. పిల్లలు భూమిని ఉచితంగా ఇవ్వడానికి అంగీకరించారు. అయితే దైవప్రవక్త (సల్లం) ఉచితంగా తీసుకోవడానికి ఒప్పుకోలేదు. దానికి తగిన ధర చెల్లించి తీసుకున్నారు.

మరుసటి రోజు ప్రవక్త అనుచరులు చెట్లు నరికి ఆ స్థలాన్ని చదును చేశారు. మసీదు నిర్మాణం ప్రారంభమయింది. దాన్ని బంకమన్ను, పచ్చి ఇటుకలతో లేపారు. ఖర్జూరపు చెట్ల మ్రానులను దూలాలుగా ఉపయోగించారు. ఆకులతో కప్పు వేసి దాన్ని బంక మన్నుతో అలికారు. మసీదు నిర్మాణంలో అనుచరులతోపాటు దైవప్రవక్త (సల్లం) కూడా పాల్గొన్నారు. మసీదులో నమాజు చేయించే చోట ప్రసంగవేదికగా ఓ ఖర్జూరపు మొద్దు కోసి నిలబెట్టారు. ఇలా కొన్ని రోజుల్లోనే మసీదునిర్మాణం పూర్తయింది....


ఆనాటి ప్రవక్త మసీదు గత 1400 సంవత్సరాల నుంచి అనేక విధాల మార్పు చెందుతూ, నలువైపులా విస్తరిస్తూ ఈనాడీ స్వరూపం సంతరించుకుంది.

## 28. మస్జిదెనబవీ పునర్నిర్మాణ ఘట్టాలు

దైవప్రవక్త (సల్లం) కాలంలోనే ముస్లింల సంఖ్య క్రమంగా పెరుగుతుండటం వల్ల ఖైబర్ యుద్ధం ముగిసిన తర్వాత మొదటిసారిగా మసీదును పడగొట్టి పునర్నిర్మించారు. అప్పుడది 2,500 చదరపు మీటర్ల వైశాల్యంలో ఉండేది. తరువాత రెండవ ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) పాలనలో మరికొంత విస్తరణ జరిగింది. ఆ తరువాత మూడవ ఖలీఫా హజ్రత్ ఉస్మాన్ (రజి) పాలనలో హిజ్రీశకం 29వ యేట మరొకసారి మసీదును పడగొట్టి పునర్నిర్మించడం జరిగింది. అప్పుడు ఆరడుగుల లోతు పునాదులు తవ్వి, పునాదులదాకా రాళ్ళు-గచ్చుతో, నేల ఉపరితలం నుంచి పైవరకు పచ్చి ఇటుకలు- గచ్చుతో గోడలు నిర్మించారు. కప్పును సువాసన గల టేకు కలపతో నిర్మించారు.

తిరిగి హిజ్రీశకం 88వ ఏట ఖలీఫా వలీద్ బిన్ అబ్దుల్‌మలిక్ పాలనలో మదీనా గవర్నర్‌గా ఉన్న హజ్రత్ ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ (రహ్మలై) నేతృత్వంలో ఈ మసీదు విస్తరణ, పునర్నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. నూతన నిర్మాణం హి.శ. 91లో ముగిసింది. విస్తరణ కోసం విశ్వాసుల మాతృమూర్తుల ఇండ్లను వేరే చోటికి మార్చి ఆ స్థలాలను మసీదులో కలిపేయబడ్డాయి. ఇది పక్కా నిర్మాణం. మసీదు వెలుపల నలు మూలలా నాలుగు మీనార్లు కూడా నిర్మించబడ్డాయి. ఆ తర్వాత హి.శ. 161-165 మధ్య ఖలీఫా మెహ్దీ అబ్బాస్ పాలనాకాలంలో అనేక ఇండ్లను కొని, ఆ స్థలాలను కలుపుతూ మసీదును వేరొకసారి విస్తరించడం జరిగింది.

హి.శ. 656లో అబ్బాసీ ఖలీఫాల పాలనాకాలం ముగిసి ఈజిప్టు రాజుల పాలనా కాలం మొదలయింది. ఆ రాజులు మస్జిదెనబవీ నిర్మాణంలో ప్రత్యేక శ్రద్ధ చూపేవారు. వారిలో సుల్తాన్ అష్రఫ్ ముఖ్యుడు. హి.శ. 886లో ప్రవక్త మసీదుకు అగ్నిప్రమాదం సంభవించింది. వెంటనే సుల్తాన్ పని ప్రారంభించి 84 గజాలు పొడవు, 14 గజాలు



↑ మస్జిదె నబవీ రాత్రివేళ, మస్జిద్ నబవీ ఆవరణ ↓





ఎత్తు విస్తరణతో మసీదును పునర్నిర్మింపజేశాడు. ఆ తరువాత హి.శ. 1265లో ఉస్మానీ ఖలీఫాల పాలనలో ఎంతో శ్రేష్ఠమైన రీతిలో పునర్నిర్మాణం మొదలయి హి.శ. 1277లో ముగిసింది. అప్పుడు దాని వైశాల్యం 4056 చదరపు మీటర్లు ఉండేది.

సౌదీ ప్రభుత్వం నెలకొన్న తరువాత హి.శ. 1369 (క్రీ.శ. 1952)లో సౌదీరాజు మలిక్ అబ్దుల్ అజీజ్ పర్యవేక్షణలో మరింత విస్తరణతో 16,326 చదరపు మీటర్ల స్థలంలో మసీదు పునర్నిర్మాణం ప్రారంభమయి క్రీ.శ. 1955లో పూర్తయింది. అప్పుడీ మసీదు పొడవు 128 మీటర్లు, వెడల్పు 91 మీటర్లు ఉండేది. 232 స్తాంభాలు కలిగిన ఈ మసీదు వెలుపల నాలుగు మూలలా 72 మీటర్ల ఎత్తు గల నాలుగు మీనార్లు నిర్మించబడ్డాయి. భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నందు వల్ల షాహ్ ఫైసల్ (రహ్మలై) కాలంలో 1973లో మసీదు పశ్చిమ భాగాన 5 కోట్ల రియాళ్ళతో 35,000 చదరపు మీటర్ల స్థలం సేకరించి షెడ్డులు నిర్మించడం జరిగింది.

సౌదీరాజుల కాలంలోని రెండవ విస్తరణ షాహ్ ఫహద్ బిన్ అబ్దుల్ అజీజ్ పాలనలో జరిగింది. మొదటి విస్తరణకు తొమ్మిది రెట్లు ఎక్కువ విస్తరణ జరగడంతో మస్జిదెనబవీ చరిత్రలో దీన్ని గొప్ప విస్తరణగా పేర్కొన్నారు. సాధ్యమైన సమస్త సౌకర్యాలతో విస్తరణ పనులు 1985లో ప్రారంభమయి 1994లో ముగిశాయి. ఆనాటి నుంచి ఈనాటి (2006) వరకు మస్జిదెనబవీ రూపురేఖలు దాదాపు అలాగే ఉన్నాయి.

ఈ విస్తరణ ప్రత్యేకతలు కూడా తెలుసుకోవడం సందర్భోచితంగా ఉంటుంది. మొదటి సౌదీ విస్తరణలోని పాత కట్టడాన్ని యధాతథంగా ఉంచి దాని ముందు భాగంలో విస్తరణ నిర్మాణం జరిగింది. ఈ విస్తరణలో ద్వారాలు, స్తంభాలు, కప్పులు, నగిషీలు పాతకట్టడంలో లాగానే ఉన్నాయి. ఈ రెండు కట్టడాలు కలిపేయబడినప్పటికీ కాస్త పరికించి చూస్తే తేడా స్పష్టంగా కన్పిస్తుంది. కొత్త కట్టడం కింద భూగర్భ అంతస్తు (cellar) కూడా ఉంది. మసీదు లోపలి భాగం పాలరాతి ఫ్లోరింగ్‌తో, 2104 పిల్లర్లతో 82,000 చదరపు మీటర్ల విస్తీర్ణం కలిగివుంది.

మసీదు మొత్తం కప్పు ఒకే బ్లాకుగా కాకుండా అనేక బ్లాకులుగా నిర్మించారు. వాటిలో గోపురాకారంలో ఉండే 27 బ్లాకులను “కదిలే కప్పులు”గా నిర్మించారు. అంటే, అవసరమైనప్పుడు సహజసిద్ధమైన గాలి, వెల్తురు రావడానికి వీలుగా వీటిని యంత్రాల ద్వారా పక్కకు లాగి పెట్టవచ్చన్న మాట. ఈ గోపురాకారపు కప్పుల పైభాగాలు జర్మన్ సిరామిక్‌తో చేయబడ్డాయి. లోపలిభాగం కలపతో చేసి దానిమీద వివిధ రకాల నగిషీలు చెక్కారు. కొన్ని చోట్ల స్వచ్ఛమైన బంగారపు తీగలు కూడా పూశారు. మొట్టమొదట మేము మసీదులో ఉన్నప్పుడు హఠాత్తుగా పై నుండి లోపలికి ఎండ రావడం గమనించి తల పైకెత్తి చూసి ఆశ్చర్యపోయాం. మా తలలపై కప్పు మెల్లగా పక్కకు జరుగుతూ నీలాకాశం కన్పించింది.

అదేవిధంగా మేము నమాజ్ చేసి కూర్చున్న చోట పాత కట్టడం కొత్త కట్టడం మధ్య ఒక పిల్లర్‌కు చతుస్రాకారపు గొడుగులా లావుపాటి కాన్వాస్ గుడ్డతో కట్టిన

పందిరి లాంటివి రెండు పందిరులున్నాయి. కాస్సేపటికి అకస్మాత్తుగా ఆ రెండు పందిరులు ముడుచుకు పోయి ఉత్త స్తంభాలు మాత్రమే కన్పించాయి. ఇవి కూడా ఒక మీట నొక్కడం ద్వారా ముడుచుకోవడం, తెరచుకోవడం జరుగుతుంది.

పోతే మసీదు వెలుపల నాలుగు వైపులా 2,35,000 చదరపు మీటర్ల విశాలమైన ఆవరణలు కూడా ఉన్నాయి. ఆవరణ కింద భూగర్భ అంతస్తులో ఉజూ, స్నాన శాలలు, విశ్రాంతి గదులతో పాటు కార్‌పార్కింగ్ స్థలాలు కూడా ఉన్నాయి. ఉజూ, స్నానాలు చేయడానికి వెళ్ళేవారి కోసం అవసరమైన ఎస్కలేటర్లు కూడా ఉన్నాయి. ఇలా ఈ ఆవరణల క్రింది రెండు అంతస్తులు ఉన్నట్లు అన్పిస్తుంది.

రెండవ సారి సౌదీ విస్తరణ జరిగిన తరువాత మస్జిదెనబవీలో ఎంతమంది నమాజీలు వచ్చినా చోటుకు కొదువే లేకుండా పోయింది. మసీదు (గ్రౌండ్‌ఫ్లోర్) పాలరాతితో ఫ్లోరింగ్ చేసి దాని మీద ఖరీదైన తివాచీలు పరిచారు. ఇక్కడ ఒకేసారి 1,78,000 మంది భక్తులు నమాజు చేయడానికి అవకాశం ఉంది. మసీదు కప్పుపై 90,000 మంది నమాజీలకు చోటుంది. మసీదు ఆవరణల్లో ఒకేసారి 4,30,000 మంది భక్తులు నమాజు చేయవచ్చు. ఈవిధంగా మొత్తం మసీదు పరిధిలో ఒకేసారి దాదాపు ఏడు లక్షల (7,00,000) మంది నమాజు చేయడానికి వీలుంది.

మసీదు కప్పు మీద, ఆవరణల్లో బాగా ఎండ తగిలే చోటులు గ్రీస్ దేశానికి చెందిన శీతల పాలరాళ్ళు పరచబడ్డాయి. ఇవి తీక్షణమైన ఎండకు కూడా వేడెక్కవు. మసీదు లోపలా బయటా ప్రతివేళా నమాజు ముగిసిన వెంటనే ఎప్పటికప్పుడు యంత్రాల ద్వారా శుభ్ర పరచడం జరుగుతుంది. ఇక మసీదు లోపల ఎయిర్‌కండిషన్ గురించి చెప్పనవసరమే లేదు.

## 29. మిహ్రాబ్, మింబర్‌ల ప్రత్యేకతలు

మస్జిదెనబవీలో ఇమామ్ నమాజ్ చేయించే కొత్త గూడు (మిహ్రాబ్)ను మొదట హి.శ. 888లో సుల్తాన్ ఖాయిత్‌బాయి పాలనాకాలంలో నిర్మించారు. తరువాత హి.శ. 1404లో షాహ్ ఫహద్ పాలనాకాలంలో పునర్నిర్మించారు. ఇప్పుడిక్కడ ఇమాములు మిహ్రాబ్‌లో దైవప్రవక్త (స) పాదాలు మోపిన చోటుకు కొంచెం క్రింది భాగాన నిలబడి నమాజ్ చేయిస్తున్నారు. అంటే వారు సజ్దా (సాష్టాంగ ప్రమాణం) చేస్తున్నప్పుడు వారి నుదురు దైవప్రవక్త (స) పాదాలు మోపిన చోటు మీద ఉంటుందన్న మాట.

మస్జిదెనబవీలో ప్రసంగవేదిక (మింబర్)కు కూడా ఓ ప్రత్యేకత ఉంది.

మసీదు నిర్మాణం పూర్తికాగానే దైవప్రవక్త (సల్లం) అందులో సామూహిక నమాజు చేయించడం ప్రారంభించారు. ప్రసంగం చేయవలసివస్తే ప్రసంగవేదికగా నిలబెట్టిన ఖర్జూరపు మ్రాను భాగాన్ని ఊతగా చేసుకొని నిలబడి ప్రసంగించేవారు. ఓరోజు ఆయన నమాజు ముగిసిన తరువాత అనుచరులతో ముచ్చటిస్తుంటే ఒకతను కలపతో చేసిన ప్రసంగ వేదిక తీసుకొని మసీదులో ప్రవేశించాడు.



"దైవప్రవక్తా! మీ కోసం నేను మూడుమెట్లతో కూడిన ఓ మింబర్ తయారుచేసి తెచ్చాను. మీరు అనుమతిస్తే దీన్ని ఇక్కడ ప్రతిష్ఠిస్తాను" అన్నాడా వ్యక్తి ఎంతో వినయంగా. దైవప్రవక్త (సల్లం) కలపతో చేసిన ఆ ప్రసంగ వేదికను పరికించిచూసి "సరే, అలాగే చెయ్యి" అన్నారు. అప్పుడా వ్యక్తి దాన్ని సముచిత స్థానంలో కదలకుండా పెట్టేశాడు.

**మింబర్ రోదన:** అప్పుడు దైవప్రవక్త (స) ఆ వేదికపై కూర్చొని ఉపన్యసించడానికి ఉపక్రమించారు. అంతలో మసీదులోనే ఎవరో ఏడుస్తున్న ధ్వని విన్పించసాగింది. ప్రవక్త అనుచరులు నిర్ఘాంతపోయి నలువైపులా కలియజూశారు. కాని మసీదులో ఎక్కడా ఏడుస్తున్న మనిషి ఛాయలు కన్పించలేదు. కాస్త పరికించి చూస్తే ఆ ధ్వని మొదట ప్రసంగ వేదికగా నిలబెట్టిన ఖర్జూరపు మ్రాను నుండి వస్తున్నట్లు తెలిసింది. ఈ సంగతి తెలియగానే అనుచరులు సంభ్రమాశ్చర్యాలతో దానివైపు చూడసాగారు.

దైవప్రవక్త (సల్లం) దాని రోదనను భరించలేకపోయారు. నోరులేని మూగజీవాలు, ప్రాణంలేని వస్తువుల దీనావస్థను సయితం భరించలేని విశ్వకారుణ్యమూర్తి ఆయన. వెంటనే ఆయన లేచి ఆ మ్రానును గుండెలకు హత్తుకున్నారు. దాన్ని చేత్తో మృదువుగా నిమిరారు. అప్పుడు అందులో నుంచి రోదన ధ్వని రావడం ఆగిపోయింది. అనుచరులు ఆశ్చర్యచకితులయి చూస్తూ "ప్రాణంలేని ఈ మ్రానుకు దైవప్రవక్త (సల్లం)పై ఎంత ప్రేమ ఉందో!" అనుకున్నారు.

దైవప్రవక్త (సల్లం) మూడుమెట్ల కలపవేదిక మొదటి మెట్టు మీద కూర్చొని రెండవ మెట్టుపై కాళ్ళు పెట్టుకునేవారు. తరువాత మొదటి ఖలీఫాగా వచ్చిన హజ్రత్ అబూబక్ర్ (రజి) రెండవ మెట్టు మీద కూర్చొని మూడవ మెట్టుపై కాళ్ళు పెట్టుకునేవారు. రెండవ ఖలీఫాగా వచ్చిన హజ్రత్ ఉమర్ (రజి) మూడవ మెట్టు మీద కూర్చొని కాళ్ళు నేల మీద పెట్టుకునేవారు. నాల్గవ ఖలీఫాగా వచ్చిన హజ్రత్ ఉస్మాన్ (రజి) కూడా ఆరేండ్ల వరకు అలాగే చేశారు. తరువాత ఆయన దైవప్రవక్త (సల్లం) కూర్చొనే స్థానం మీద కూర్చోవడం ప్రారంభించారు.

మొట్టమొదట హి.శ. 8వ ఏట తయారుచేసిన ఈ మింబర్‌కు హజ్రత్ ముఆవియా (రజి) పాలనలో మరో ఆరు మెట్లు కలిపి తొమ్మిది మెట్ల మింబర్‌గా పునర్నిర్మించారు. అప్పట్నుంచి ఆ మింబర్‌పై నుండి ప్రసంగించే ఇమాములు ఏడవ మెట్టు మీద కూర్చునే వారు; ఎనిమిదో మెట్టు మీద నిలబడి ఉపన్యాసం (ఖుత్బా) ఇచ్చేవారు. తరువాత హి.శ. 654లో మస్జిదెనబవీ అగ్నిప్రమాదానికి గురయినప్పుడు ఈ మింబర్ కూడా కాలి పోయింది. అందువల్ల దాని స్థానంలో యమన్‌రాజు మలిక్ ముజఫ్ఫర్ ఒక కొత్త మింబర్ తయారుచేయించి పెట్టించాడు.


ఆ మింబర్ కాలక్రమంలో అనేక మార్పులు చెందుతూ హి.శ. 998 నాటికి ప్రస్తుత రూపం సంతరించుకుంది. ఈ సరికొత్త ప్రసంగవేదికను రెండవ సుల్తాన్ మురాద్



↑ మస్జిదె నబవీలో మిహ్రాబ్ నబవీ

↓ మస్జిదె నబవీలో శుభసమాధి బయట, ప్రవక్త ప్రసంగవేదిక ↓

ఇది తొమ్మిది మెట్ల ప్రసంగవేదిక (మింబర్). ఈ మింబర్‌పై నుండి ప్రసంగించే ఇమాములు ఇప్పుడు ఏడవ మెట్టు మీద కూర్చొని, ఎనిమిదో మెట్టు మీద నిలబడి ఉపన్యాసం (ఖుత్బా) ఇస్తారు.







ఉస్మానీ కానుకగా సమర్పించుకున్నాడు. వివిధ రకాల డిజైన్లతో, మంచి ఫినిషింగ్‌తో అత్యంత సుందరమైన ఈ ప్రసంగవేదిక ఇప్పటికీ మస్జిదెనబవీలో ఉండి బయట నుంచి వచ్చే యాత్రికుల్ని ఆకట్టుకుంటోంది.

దైవప్రవక్త (సల్లం) తన ప్రసంగవేదిక (మింబర్)ను గురించి ప్రస్తావిస్తూ "నా ఇంటికి, నా మింబర్‌కు మధ్య ఉన్న చోటు స్వర్గవనాలలో ఒక వనంగా ఉంది. నా మింబర్ కౌసర్ సరస్సు" అని అన్నారు. (బుఖారి, ముస్లిం)

ఈ మింబర్ దగ్గర నిలబడి దైవసాక్షిగా ప్రమాణం చేయడాన్ని ధర్మసమ్మతం చేశారు. అయితే అసత్య ప్రమాణం చేసేవారికి నరకాగ్ని శిక్ష విన్పించారు. ఆయన ఇలా అన్నారు:

"ఎవరైనా నా ప్రసంగవేదిక దగ్గర ఓ పలుదోముపుల్ల విషయంలోనైనా సరే అసత్య ప్రమాణం చేస్తే అతనిక తన నివాసం నరకాగ్నిలో ఏర్పరచుకున్నట్లే." (అబూదావుద్)

మస్జిదెనబవీలో చేసే నమాజ్ ఔన్నత్యాన్ని గురించి దైవప్రవక్త (స) ఇలా చెప్పారు:

**ఒక నమాజ్‌కు వేయినమాజ్‌ల పుణ్యం:** "నాయీ మస్జిద్‌లో ఒక నమాజ్‌కు లభించే పుణ్యం ఇతర మస్జిద్‌లలోని వేయినమాజ్‌ల పుణ్యంకన్నా శ్రేష్ఠమైనది. అయితే కాబామస్జిద్‌లో లభించే పుణ్యం అంతకంటే ఎంతో ఎక్కువ ఉంటుంది." (బుఖారి)

"నాయీ మస్జిద్‌లో ఎవరైనా ఒక్క నమాజ్ కూడా తప్పిపోకుండా నిరంతరాయంగా నలభై వేళల నమాజులు చేస్తే అతనికోసం నరకాగ్ని, ఇతర (నరక)యాతనలన్నిటి నుండి రక్షణ హామీ వ్రాయబడుతుంది." (ముస్నద్ అహ్మద్)

ఈ హదీసు ప్రకారం మేము, మా విడిదిలో ఉన్న ఇతర హాజీలంతా 7.12.05 తేదీ నుండే క్రమం తప్పకుండా ప్రతివేళా మస్జిదెనబవీకు వెళ్తూ నమాజ్ చేయడం ప్రారంభించాం. దైవానుగ్రహం వల్ల మేమా నలభై నమాజులు పూర్తిచేసుకున్నాం.

మస్జిదెనబవీలో ప్రవేశించేటప్పుడు ముందుగా కుడికాలు పెడుతూ "బిస్మిల్లాహి వస్సలాతు వస్సలాము అలా రసూలిల్లాహి, అల్లాహుమ్మఫ్‌తహ్‌లీ అబ్వాబ రహ్మాతిక్" అని పఠించాలి. (ముస్లిం, తిర్మిజి). అర్థం:- దేవుని పేరుతో ప్రవేశిస్తున్నాను. దైవప్రవక్తపై శాంతీ శ్రేయాలు వర్షించుగాక. దేవా! నా కోసం నీ అనుగ్రహద్వారాలు తెరువు.)

పుణ్యక్షేత్రాల యాత్రకు వెళ్ళేవారికి మక్కాలోని మస్జిదుల్‌హరాం, మదీనాలోని మస్జిదెనబవీ, బైతుల్‌ముఖద్దస్-(పాలస్తీనా)లోని మస్జిదుల్‌అఖ్సా మాత్రమే పుణ్య క్షేత్రాలుగా దైవప్రవక్త (సల్లం) పరిగణించారు.

"మూడు మసీదులను తప్ప మరే ప్రదేశాన్ని పుణ్యక్షేత్రాలుగా భావించి అక్కడికి సుదీర్ఘ ప్రయాణం చేయకూడదు. ఆ మూడు మసీదులు- (1) మస్జిదుల్‌హరాం, (2) మస్జిదెనబవీ, (3) మస్జిదుల్‌అఖ్సా." (బుఖారి, ముస్లిం)

# 30. ప్రవక్త పరలోక ప్రస్థానం

8-12-2005న మస్జిదెనబవీలో జుహర్ నమాజ్ తరువాత నేను, మా మామయ్య ప్రవక్త సమాధి సందర్శనం కోసం 'క్యూ'లో నిల్చున్నాం. ఆ 'క్యూ'లో మెల్లగా ముందుకు పోతూ సమాధి దగ్గరకు చేరుకునేటప్పటికి ప్రవక్త పరలోకప్రస్థానం గుర్తుకొచ్చి శరీరం ఒక్కసారిగా గగుర్పొడిచింది. ఆయన ముందు మరణదూత ప్రత్యక్షమయ్యాడు...

...శరీరం కాలిపోతోంది. అవయవాలు ఎక్కడికక్కడ బలహీనమైపోయాయి. దైవప్రవక్త (స) పక్కనున్న చన్నీళ్ళపాత్రలో చేయి ముంచి, ఆ తడిచేతిని ముఖం మీద రుద్దుకోవడం ప్రారంభించారు. ఇలా అనేకసార్లు చేశారు. తరువాత ఆయన దుప్పటిని కాస్సేపు ముఖమ్మీద కప్పుకోవడం, కాస్సేపు తీసివేయడం చేయసాగారు. అలాచేస్తూ "దేవా! ప్రాణం తోడే ఈ బాధను సులభతరం చెయ్యి" అన్నారు.

హజ్రత్ ఫాతిమా (రజి) తండ్రి అనుభవిస్తున్న బాధ చూసి తల్లడిల్లిపోయారు. "అయ్యయ్యో! మా నాన్న ఎంత బాధపడుతున్నారు!!" అంటూ ఆమె తీవ్రమైన ఆందోళన, ఆవేదన వెలిబుచ్చారు. "ఫాతిమా! బాధపడకమ్మా! ఈరోజు తరువాత మీ నాన్నకు ఇక ఎన్నటికీ ఎలాంటి బాధ ఉండదు" అన్నారు దైవప్రవక్త (సల్లం) కూతుర్ని ఓదార్చుతూ.

మధ్యాహ్నం దాటింది. దైవప్రవక్త (స) పరిస్థితి మరింత విషమించింది. ఆయాసం ఎక్కువయింది. ఊపిరి పీల్చుకోవడం కష్టమైపోయింది. పెదవులు మెల్లిగా కదిలాయి: "నమాజ్, నమాజ్.... బానిసలతో మంచిగా వ్యవహరించండి." ఆ తరువాత ఆయన చేయి పైకి లేచింది. చూపుడువ్రేలితో సైగచేస్తూ "ఆ మహా మిత్రుడు తప్ప ఇప్పుడిక ఎవరూలేరు" అన్నారు.

దైవప్రవక్త (సల్లం) నోట ఈ అమృత పలుకులు వెలువడిన మరుక్షణమే ఆయన చేయి వ్రేలాడిపోయింది. కనుగుడ్లు నిలిచిపోయాయి. శరీరం చల్లబడి పోయింది. అశాశ్వతమైన మట్టిముద్దలో అరవయి మూడేండ్లు కాపురముండిన ఓ దివ్యతేజం నేడు దైవ సన్నిధికేగింది. (ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్.)

హిజ్రీశకం 11వ సంవత్సరం, రబీవుల్ అవ్వల్ మాసం 12వ తేది, సోమవారం విశ్వకారుణ్యమూర్తి (స) యావత్తు ముస్లింజగత్తును శోకసముద్రంలో ముంచిపోయారు.

ఈవార్త విన్న అనేకమంది ప్రజలు గుండెలు బాదుకున్నారు. కొందరు ఈ వార్తను ఓ పట్టాన నమ్మలేకపోయారు. హజ్రత్ ఉమర్ (రజి) ఈ వార్త వినగానే ఆయనకు కాళ్ళ క్రింద భూమి కంపించినట్లు అన్పించింది. ఆయన కూడా ఈ విషయాన్ని నమ్మలేక పోయారు. మసీదు ఏడ్పులు, ఎక్కిళ్ళతో ప్రతిధ్వనిస్తోంది. ప్రవక్త అనుచరులు తమ ప్రియతమ నాయకుడ్ని తలచుకొని కన్నీరు మున్నీరుగా దుఃఖిస్తున్నారు.

హజ్రత్ ఉమర్ (రజి) వర నుంచి ఖడ్గం లాగి "ఖబర్దార్! ఎవరైనా దైవప్రవక్త ముహమ్మద్ (స) చనిపోయారని అంటే అతని తల ఎగిరిపోతుంది" అన్నారు మసీదులోకి



ప్రవేశిస్తూ. "ప్రజలారా! కొంతమంది దైవప్రవక్త (స) చనిపోయారని చెబుతున్నారు. లేదు, ఆయన చనిపోలేదు, స్పృహ తప్పారు. కాస్సేపటికి స్పృహలోకి రావచ్చు. మూసా ప్రవక్తలా ముహమ్మద్ ప్రవక్త కూడా నలభైరోజుల పాటు అదృశ్యమై ఉంటారు. ఆ తర్వాత తిరిగొస్తారు......" అంటూ ఆయన వేదిక ఎక్కి ఉపన్యాసం మొదలెట్టారు.

దైవప్రవక్త (సల్లం) సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) ఇల్లు విషాదనిలయమై పోయింది. దైవప్రవక్త (సల్లం) భౌతికకాయం పడక మీద చలనరహితంగా పడిఉంది. అక్కడ వేలాదిమంది జనం గుంపులు గుంపులుగా గుమిగూడారు. వారి కళ్లు కుండ పోతలా కన్నీళ్ళు వర్షిస్తున్నాయి. హజ్రత్ ఆయిషా (రజి) నాన్నగారు హజ్రత్ అబూబకర్ (రజి) దుప్పటి తొలగించి దైవప్రవక్త (స) ముఖపద్మాన్ని తనివితీరా దర్శించారు. కళ్ళ నుండి అశ్రుధారలు కారుతుండగా ఆయన దైవసందేశహరుని (స) నుదుటిపై ముద్దాడారు. ఆ తరువాత ఆయన బయటికొచ్చి మసీదుకు వెళ్ళారు.

మసీదులో హజ్రత్ ఉమర్ (రజి) దైవప్రవక్త (సల్లం) బ్రతికే ఉన్నారని చెబుతూ ఇంకా ప్రసంగిస్తూనే ఉన్నారు. హజ్రత్ అబూబకర్ (రజి) లోపలికి ప్రవేశించి సోదరులారా! అని జనాన్ని సంబోధిస్తూ మాట్లాడటం ప్రారంభించారు. ఆయన పలుకులు వినగానే జనమంతా ఒక్కసారిగా ఆయన వైపు దృష్టి మళ్ళించారు. దాంతో ఉమర్ (రజి) తన ప్రసంగాన్ని ఆపేయవలసి వచ్చింది. హజ్రత్ అబూబకర్ కట్టలు తెంచుకొని వస్తున్న దుఃఖాన్ని బలవంతంగా దిగమింగి ఎంతో నిబ్బరంగా ఇలా ప్రసంగించారు:

"సోదరులారా! వినండి. ఒకవేళ ఎవరయినా ముహమ్మద్ (స)ని ఆరాధిస్తుంటే ముహమ్మద్ (స) ఇహలోకం వీడిపోయారని తెలుసుకోవాలి. అల్లాహ్‌ని మాత్రమే ఆరాధించేవారికి అల్లాహ్ సజీవంగా ఉన్నసంగతి తెలిసిందే. నిత్యజీవుడు అల్లాహ్ మాత్రమే. ఆయనకు మరణ మన్నదే లేదు. ఆయన మనకు ఇదివరకే దైవప్రవక్తను గురించి ఇలా వివరించాడు:

"ముహమ్మద్ (మానవమాత్రుడయిన) దైవప్రవక్త మాత్రమే. అతనికి పూర్వం కూడా అనేకమంది దైవప్రవక్తలు వచ్చిపోయారు. మరి ఇతనిప్పుడు చనిపోతే లేక చంపబడితే మీరు (ధర్మపథం నుండి) వెనుదిరిగి పోతారా? గుర్తుంచుకోండి. అలా వెనుదిరిగి పోయేవాడు దేవునికి ఎలాంటి నష్టం కలిగించలేడు. దేవుడు తనకు కృతజ్ఞత చూపేవారికే తగిన బహుమానం ప్రసాదిస్తాడు" (ఖుర్ఆన్-3:144)

"సోదరులారా! దైవప్రవక్త (సల్లం) దైవధర్మాన్ని స్థాపించారు. దైవమార్గంలో తన శక్తిసామ ర్థ్యాలన్నీ ధారపోసి దైవసందేశాన్ని నలుమూలలా వ్యాపింపజేశారు. అప్పటి దాకా ఆయన్ని దేవుడు సజీవంగా ఉంచాడు. దైవప్రవక్త (సల్లం) మనకు రుజమార్గం చూపించారు. అజ్ఞానాంధకారం పటాపంచలు చేసి జ్ఞానజ్యోతి ప్రసాదించారు. ఇలాంటి పరిస్థితిలో ఎవరయితే దైవధర్మాన్ని విడనాడి దుర్మార్గంలో పడిపోతారో దానికి వారే బాధ్యులవుతారు.

“సోదరులారా! దేవునికి భయపడండి. ఆయన్నే నమ్ముకోండి. ఆయన ధర్మాన్ని ఎవరూ తుడిచిపెట్టలేరు. దైవధర్మానికి సహాయపడుతూ, దాని వృద్ధివికాసాల కోసం పోరాడేవారికి దేవుడు తప్పకుండా సహాయం చేస్తాడు. దైవగ్రంథం మన పాలిట జ్యోతిర్మండలం. మన కోసం దేవుడు ధర్మసమ్మతం చేసినవి, నిషేధించినవి అన్నీ అందులోనే ఉన్నాయి.”

అబూబకర్ ప్రసంగంతో ప్రజలకు కాస్తంత ధైర్యం వచ్చింది. క్రుంగినవారి హృదయాలకు ఊరట చేకూరింది. విషాదమేఘాలు విడిపోసాగాయి. పుట్టిన ప్రతిజీవీ గిట్టక తప్పదన్న యదార్థంతో పాటు, దైవప్రవక్త (స) దివంగతులైనప్పటికీ నిత్యజీవుడైన దేవుని ఆరాధన మాత్రం నిరంతరం కొనసాగాలన్న నిజాన్ని గ్రహించారు వారు....

మేము దరూద్ పఠిస్తూ ముందుకు సాగాము. దైవప్రవక్త (స) దివంగతులయిన తరువాత ఆయన భౌతికకాయాన్ని హజ్రత్ ఆయిషా (రజి) ఇంట్లో ఆయన ప్రాణం వదిలిన చోటనే ఖననం చేశారు. హి.శ. 89-91లో మస్జిదెనబవీ విస్తరించవలసి వచ్చినప్పుడు హజ్రత్ ఆయిషా (రజి) ఇంటితోపాటు మరికొన్ని ఇతర ఇండ్లను వేరే చోటికి తరలించి ఆ స్థలాలను మసీదు పరిధిలో కలిపేశారు. అప్పటి నుంచి దైవప్రవక్త (సల్లం) సమాధి మస్జిదెనబవీలోకి చేరింది.

## 31. “శుభ సమాధి” సందర్శనం

మొదటి ఖలీఫా హజ్రత్ అబూబకర్ (రజి) చనిపోయిన తరువాత హజ్రత్ ఆయిషా (రజి) అనుమతితో ఆయన భౌతిక కాయాన్ని దైవప్రవక్త (సల్లం) సమాధి పక్కన కొంచెం దిగువన ఖననం చేశారు. రెండవ ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) చనిపోయిన తరువాత హజ్రత్ ఆయిషా (రజి) అనుమతితో ఆయన భౌతిక కాయాన్ని కూడా అక్కడే హజ్రత్ అబూబకర్ (రజి) సమాధి పక్కన కొంచెం దిగువన ఖననం చేశారు. ఈ విధంగా ఇప్పుడు మస్జిదెనబవీలో దైవప్రవక్త (సల్లం) సమాధి పక్కన కాస్త కిందికి హజ్రత్ అబూబకర్ (రజి) సమాధి, ఆయన సమాధి పక్కన కాస్త కిందికి హజ్రత్ ఉమర్ (రజి) సమాధి ఉన్నాయి.

దైవప్రవక్త (సల్లం) సమాధి దగ్గరకు చేరుకోగానే “అస్సలాము అలైక యా రసూలల్లాహి వరహ్మతుల్లాహి వబరకాతుహూ” (దైవప్రవక్తా! మీకు సలాం. దేవుని కారుణ్యం, ఆయన శుభాలు మీపై వర్షించుగాక) అని పఠించాలి. అలాగే హజ్రత్ అబూబకర్ (రజి) సమాధి దగ్గర ఆగి “అస్సలాము అలైక యా అబూబకర్” అని; హజ్రత్ ఉమర్ (రజి) సమాధి దగ్గర ఆగి “అస్సలాము అలైక యా ఉమర్” అని పలకాలి.

‘శుభ సమాధి’ దర్శనం గురించి ప్రవక్త (స) చెప్పిన ఈ హదీసులు గమనించండి:

“మరే ఇతర పనులు లేకుండా కేవలం నా (సమాధి) దర్శనం కోసం మాత్రమే వచ్చిన మనిషి కోసం నేను (ప్రళయదినాన దేవుని సన్నిధిలో) సిఫారసు చేస్తాను.” (ఇల్ముల్ ఫిఖా)





↑ దైవప్రవక్త (స) శుభసమాధి, జన్నతుల్‌బఖీ (మదీనా)↓



"ఎవరైతే హజ్ విధి నిర్వహించి నా తదనంతరం నా సమాధిని సందర్శిస్తాడో, అతను నన్ను నా జీవితంలో సందర్శించినవాడిలా నా దర్శనభాగ్యం పొందిన వాడవుతాడు." (బైహఖి)

"స్తోమత ఉండికూడా నా (సమాధి) దర్శనం చేయనివాడు దానికి చెప్పే కారణం ఎంతమాత్రం అంగీకారయోగ్యం కాజాలదు." (ఇల్ముల్ ఫిఖా)

పై హదీసుల్ని బట్టి హనఫీ ధర్మవేత్తలు, హజ్ నియమాల్లో 'శుభ సమాధి' దర్శనం లేకపోయినా దాన్ని తప్పకుండా దర్శించాలని అన్నారు. అహ్లెహదీస్ ధర్మవేత్తలు పై హదీసులు ప్రమాణంరీత్యా బలహీనమైనవని, కల్పితమైనవని కొట్టిపారేస్తారు. ఏమైనప్పటికీ ఈ హదీసులన్నీ 'శుభసమాధి' దర్శనం గురించి నొక్కి చెబుతున్నాయి. 'శుభసమాధి' దర్శనం ప్రాముఖ్యాన్ని అహ్లెహదీసు పండితులు కూడా కాదనలేరు.

సరే, మేమింత కష్టపడి ఎంతో దూరం నుంచి వస్తే దైవప్రవక్త (సల్లం) సమాధిని దర్శించగలిగామా? అని నన్ను నేను ప్రశ్నించుకుంటే నా అంతరంగం నుంచి లేదని సమాధానం వచ్చింది. ప్రవక్త శుభసమాధిని ఎలా చూడగలం? దైవప్రవక్త (స) హితోపదేశాలను గాలికి వదలి ఆ మహానుభావుడి స్మారకచిహ్నాలపై వీరాభిమానం చూపే కొందరు 'వీరవిశ్వాసుల' పైశాచిక చేష్టలకు సౌదీ ప్రభుత్వం హడలిపోయి ప్రవక్త సమాధి చుట్టూ దట్టమైన గ్రిల్ కట్టివేసింది. కాకపోతే ఆ గ్రిల్‌కు అక్కడక్కడా చిన్న చిన్న రంధ్రాలు పెట్టింది సందర్శనా ప్రియుల కోసమని.

ఆ కన్నాల్లో నుంచి లోపలి భాగాన్ని కళ్ళు చించుకొని చూడవచ్చు. లోపల లైట్లు ఉండవులెండి. కానీ.... అప్పటికీ మన 'వీరవిశ్వాసుల' ఆటలు ఆగి పోలేదు కాబోలు, సౌదీ ప్రభుత్వం మరింత కట్టుదిట్టమైన చర్యలతో ఆ గ్రిల్‌కు గజం దూరంలో కటకటాలు పెట్టి అక్కడే నిలబడి సమాధిని సందర్శించమని చెప్పింది. ఇక మీరే చెప్పండి, మేము ప్రవక్త సమాధిని చూడగలమా? నా మటుకు నేను కాస్తంత నిరుత్సాహపడ్డాను. మూఢజనం ఫొటోలు తీసుకొని పూజిస్తారేమోనని కాబోలు, సౌదీ ప్రభుత్వం చివరికి తన టీవీ ఛానళ్లలో సైతం శుభసమాధిని చూపకుండా జాగ్రత్త పడుతోంది.

ఆ తరువాత మేము 'శుభసమాధి'కి, మింబర్‌కు మధ్య నఫిల్ నమాజ్ చేయడానికి మస్జిద్ బయటికి వచ్చి మరోద్వారం గుండా లోపలికి ప్రవేశించాం. కాని అక్కడ అనేక మంది హాజీలు కాస్తయినా సందులేకుండా నమాజులో లీనమయి ఉన్నందున మేము అవకాశం కోసం ఎదురుచూస్తూ నిల్చున్నాం. కాస్సేపటికి నా ఎదురుగా ఉన్న ఒకతను నమాజు ముగించి వెళ్ళిపోగానే నేనా చోటుకెళ్ళి రెండు రకాతుల నఫిల్ నమాజ్ మొదలెట్టాను. నా నమాజ్ పూర్తికాగానే నా వెనక నిల్చున్న మా మామయ్యను రమ్మని సైగచేసి నేను పక్కకు తప్పుకున్నాను.

అక్కడ్నుంచి నేను, మా మామయ్య "జన్నతుల్ బఖీ" సందర్శనం కోసం బయలుదేరాం. ఇక్కడ కూడా హాజీలు ఒకరినొకరు త్రోసుకుంటూ అత్యుత్సాహం చూపసాగారు.



జన్నతుల్ బఖీని "బఖీవుల్ గర్ఖద్" అని కూడా అంటారు. ఇది మస్జిదెనబవీ పరిధిలోనే తూర్పు వైపున ఉంది. ఇక్కడ దాదాపు పదివేల మంది సహాబీల సమాధులున్నాయి.

దైవప్రవక్త (సల్లం) తరచుగా ఈ శ్మశాన వాటికకు వస్తూ ఇలా 'దుఆ' చేసేవారు: "విశ్వాసుల నగర వాసులారా! మీకు శాంతి కలుగుగాక. రేపు (ప్రళయదినాన) మీకు వాగ్దానం చేయబడిన వస్తువులన్నీ లభిస్తాయి. మీరు (ప్రళయందాకా) ఆపి ఉంచబడుతున్నారు. దైవచిత్తమయితే మేము కూడా త్వరలో మీ దగ్గరకు చేరుకుంటాం. దేవా! బఖీవుల్ గర్ఖద్‌లో ఖననమయినవారిని క్షమించు." (ముస్లిం)

మనమీ శ్మశానవాటికను ఎప్పుడైనా సందర్శించినప్పుడు "అస్సలాము అలైకుమ్ అహ్లద్దియారి మినల్ ముఅ్మినీన వల్ ముస్లిమీన వయర్‌హముల్లాహుల్ ముస్తఖ్దిమీన మిన్నా వల్ ముస్తాఖిరీన వఇన్నా ఇన్షాఅల్లాహు బికుమ్ లలాహిఖూన్" అని పఠించాలి. (ముస్లిం).

అర్థం:- ఈ శ్మశానవాసులైన విశ్వాసులకు, ముస్లింలకు శాంతి కలుగుగాక. మాకు ముందు మరణించినవారిని, తరువాత మరణించేవారిని కూడా దేవుడు కరుణించుగాక. దైవచిత్తమయితే (త్వరలో) మేము కూడా మీ దగ్గరకు చేరుకుంటాం.

మేమిలా "జన్నతుల్‌బఖీ వాసుల" కోసం దుఆ చేసిన తరువాత అక్కడ్నుంచి మా విడిదికి చేరుకున్నాం. తిరిగి రెండు మూడు రోజుల తరువాత నేను, మా శ్రీమతి, మా మామయ్య కలసి ఒక టూరిస్టు బస్సులో మదీనాలోని ఇతర చారిత్రక స్థలాలను చూడటానికి బయలుదేరాం.

## 32. ఖుబా, ఖిబ్లతైన్ మసీదులు

మేము చూసిన చారిత్రక స్థలాలో "ఖుబా మస్జిద్"కు ఎంతో ప్రాముఖ్యం ఉంది. ఈ మసీదు మదీనా శివార్లలో ఉంది. దైవప్రవక్త (స) మక్కా నుండి మదీనాకు వలస వస్తూ ఖుబాగ్రామంలో ఆగిపోయారు. ఖుబావాసుల్లో అత్యధికమంది ఇదివరకే ముస్లింలయి ఉన్నారు గనక, వారు దైవప్రవక్త (స)ను స్వాగతకుసుమాల్లో ముంచెత్తారు.

ఆ మహనీయుని రాక సంగతి తెలిసి స్త్రీలు, పిల్లలు కూడా సంతోషాతిశయంతో పరవశించిపోతూ ఇండ్లలో నుంచి వీథుల్లోకి వచ్చి చూడసాగారు. దాదాపు అయిదొందల మందితో కూడిని జనవాహిని "అల్లాహుఅక్బర్" అంటూ దిక్కులు పిక్కుటిల్లేలా నినాదాలు చేస్తూ ఆయన్ని ఊళ్లోకి తీసుకొచ్చింది. వారిలో ప్రతి ఒక్కడూ ఆయన్ని అతిథిగా స్వీకరించడానికి తానంటే తానని ముందుకు రాసాగాడు. చివరికి దైవప్రవక్త (స)కు ఆతిథ్యమిచ్చే భాగ్యం హజ్రత్ కుల్సూమ్ బిన్ బదమ్ (రజి)కు లభించింది.

దైవప్రవక్త (స) అమృతపలుకులు వింటేనే జీవితం తరిస్తుందన్న భావనతో అనేక మంది ఎడతెరిపిలేకుండా ఆయన సన్నిధికి రాసాగారు. దైవప్రవక్త (స) మరునాడు ఒక సమావేశంలో ప్రసంగిస్తూ "మసీదును నిర్మించే, నిత్యం ఖుర్ఆన్ పఠించే, రాత్రివేళ

(నమాజ్ చేస్తూ) జాగరణచేసే ప్రతి వ్యక్తీ సాఫల్యం చెందుతాడు" అన్నారు.

ఈ మాట వినగానే అనేకమంది మసీదు నిర్మాణం కోసం ముందుకు వచ్చారు. వెంటనే పని కూడా మొదలయింది. కొందరు గడ్డపలుగులతో నేల త్రవ్వుతుంటే, మరి కొందరు పారలతో మట్టితీసి పడేస్తున్నారు. ఇంకొందరు రాళ్ళు మోసుకొస్తున్నారు. ఈ పవిత్రకార్యంలో దైవప్రవక్త (సల్లం) కూడా పాల్గొన్నారు. అనుచరులు వారించడానికి ప్రయత్నిస్తే ఆయన చిరునవ్వు నవ్వి తన పనిలో మళ్ళీ లీనమైపోయేవారు.

ఇలా కొన్నాళ్ళలోనే మసీదునిర్మాణం పూర్తయింది. దైవప్రవక్త (స) అందులో నమాజు చేసిన తరువాత ప్రియ అనుచరుల్ని ఉద్దేశించి "శుభ్రంగా ఉజూ చేసి ఖుబా మసీదులో నమాజు చేసేవారికి ఉమ్రా (కాబా సందర్శనం) చేసినంత పుణ్యం లభిస్తుంది" అన్నారు. (హదీస్)

ఈ హదీసు కారణంగానే హాజీలు ఈ మసీదులో నమాజు చేయడానికి ఎంతో ఉత్సాహపడతారు. మేము కూడా ఈ మసీదులో రెండురకాతులు నఫిల్ నమాజ్ చేశాం. కాలక్రమంలో ఖుబామస్జిద్ కూడా అనేక మార్పులు చెందుతూ, విస్తరిస్తూ ప్రస్తుత రూపం సంతరించుకుంది. ఇక్కడ ఒకేసారి 20,000 మంది నమాజ్ చేయ గలుగుతారు.

దైవప్రవక్త (సల్లం) ఖుబా గ్రామంలో 14 రోజులు ఉండి ఆతర్వాత మదీనాకు బయలు దేరారు. ఆయన తన అనుచర వాహినీతో మదీనాలో ప్రవేశించి బనూసాలం వాడలోకి వచ్చేటప్పటికి జుమానమాజ్ వేళయింది. అందువల్ల ఆయన అక్కడే జుమా నమాజ్ చేశారు. ఈ కారణంగా ఇక్కడ కూడా ఒక మసీదు వెలిసింది. దీన్ని జుమామస్జిద్ అంటారు.

మదీనాలోని బనూమావియా వాడలో మస్జిదుల్ ఇజాబా పేరుతో మరొక మసీదు ఉంది. దీనికి కూడా ఓప్రత్యేకత ఉంది. దైవప్రవక్త (స) ఓసారి ఈ మసీదులో నమాజు చేసిన తర్వాత మూడు విషయాలను గురించి దుఆ చేశారు. దేవుడు ఆ మూడింటిలో రెండిటిని స్వీకరించి, ఒకదాన్ని స్వీకరించలేదు. దాన్ని గురించి దైవప్రవక్త (స) దుఆ చేసిన తరువాత తన అనుచరులకు ఈవిధంగా తెలియజేశారు:

"నేను నా ప్రభువును మూడు విషయాలు అర్థించాను. దేవుడు నాకు రెండిటిని ఇచ్చాడు. ఒకదాన్ని ఇవ్వలేదు. నేను నా ప్రభువును 'నా అనుచర సముదాయాన్ని కరువు కాటకాలతో చంపవద్ద'ని ప్రార్థించాను. దేవుడు ఈ ప్రార్థన అంగీకరించాడు. తరువాత 'నా అనుచర సముదాయాన్ని నీటిలో ముంచి చంపవద్ద'ని ప్రార్థించాను. ఈ ప్రార్థనను కూడా దేవుడు అంగీకరించాడు. ఆ తరువాత నేను 'నా అనుచర సముదాయం ప్రజలు పరస్పరం పోట్లాడుకోకుండా (ఐకమత్యంతో) ఉంచ'మని వేడుకున్నాను. దేవుడు ఈ వేడుకోలును ఒప్పుకోలేదు." (సహీ ముస్లిం)

మదీనాలో "మస్జిదె ఖిబ్లతైన్" అనే వేరొక విశిష్ఠ ఆరాధనాలయం ఉంది. మస్జిదె





↑ జుమా మస్జిద్ (మదీనా), మస్జిదె ఖిబ్లతైన్ (మదీనా) ↓



ఖిబ్లతైన్ అంటే రెండు ఖిబ్లా (ఆరాధనా దిశ)ల మసీదు అని అర్థం. దాని పూర్వపరాలను గురించి తెలుసుకోవడం కూడా ఇక్కడ సందర్భోచితంగా ఉంటుంది....

బషీర్ బిన్ బరా (రజి) ఆహ్వానంపై ఓరోజు మహాప్రవక్త (సల్లం) ఆయన ఇంటికి వెళ్ళారు. వచ్చిన పని పూర్తయ్యేటప్పటికి జుహర్ నమాజ్ వేళయింది. దైవప్రవక్త (సల్లం) అక్కడున్న అనుచరులకు నాయకత్వం వహించి ప్రార్థన (నమాజ్) చేయించసాగారు. రెండవ రకాతులో అకస్మాత్తుగా దైవసందేశం అవతరించింది:

"ముహమ్మద్! నీవు మాటిమాటికి ముఖం పైకెత్తి ఆకాశం వైపు చూడటాన్ని మేము గమనిస్తూనే ఉన్నాం. కనుక నీకు ప్రియమైన దిశకే (ప్రార్థనకై) మేము నిన్ను మరలిస్తున్నాం. ఇకనుంచి మీరు ప్రతిష్ఠాలయం వైపునకు తిరగండి. మీరు ఎక్కడున్నా సరే దాని వైపునకే తిరిగి ప్రార్థన చేయండి. (ఖిబ్లా మార్పుకు సంబంధించిన) ఈ ఆదేశం నీ ప్రభువు నుండి వచ్చిన సత్యమని గ్రంథప్రజలకు బాగా తెలుసు. (అయినా వారు తమ పంతాన్ని మానలేక పోతున్నారు.) వీరి చర్యల్ని దేవుడు ఓకంట గమనిస్తూనే ఉన్నాడు. (ఖుర్ఆన్–2:144)

ఈ సందేశం అవతరించగానే దైవప్రవక్త (సల్లం) నమాజ్ స్థితిలోనే బైతుల్‌మఖ్దిస్ వైపు నుంచి కాబాగృహం వైపుకు మరలారు. వెనుక ఉన్న సహచరులు కూడా ఆయన్ని అనుసరిస్తూ కాబా దిశకు మరలారు.

**ఖిబ్లామార్పు స్మారకచిహ్నం:** ఆ తర్వాత మదీనాలో, దాని పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న ముస్లిములందరికీ ఖిబ్లా (దిశ)మార్పు గురించి దండోరా వేయించి తెలియజేశారు. ఖిబ్లామార్పు ప్రకటన విన్పించే సమయంలో కొందరు రుకూలో ఉన్నారు. వెంటనే వారు రుకూ స్థితిలోనే కాబావైపుకు తమ దిశను మార్చుకున్నారు.

కొత్తగా వచ్చిన ఈమార్పుకు యూదులు ఆశ్చర్యపోయారు. "ఏమైంది ఈ ముస్లింలకు, బైతుల్ మఖ్దిస్ ఉన్న దిక్కుకు తిరిగి నమాజ్ చేసేవారల్లా అకస్మాత్తుగా కాబాదిశకు తిరిగారు? గతప్రవక్తలు బైతుల్‌మఖ్దిస్‌నే తమ ఆరాధనా కేంద్రంగా చేసుకున్నారు కదా! ఎందుకీ ప్రవక్త తరతరాల నుంచి వస్తున్న ఖిబ్లాను ఇప్పుడు మార్చివేశాడు?" అంటూ ముఖం చిట్లించుకున్నారు, తమ ప్రతిష్ఠేదో దిగజారిపోతున్నట్లు.

నిజమే మరి. తమ జాతిలో ప్రభవించిన దైవప్రవక్తలంతా బైతుల్ మఖ్దిస్‌నే ఖిబ్లాగా చేసుకున్నారు. అలాంటి తమఖిబ్లా వైపుకే ముస్లింలు కూడా మరలి నమాజ్ చేస్తుంటే "అబ్బ! వీరు మా బైతుల్‌మఖ్దిస్ వైపుకే తిరిగి నమాజ్ చేస్తున్నారని సంబరపడిపోయారు. తమ జాతి ఔన్నత్యాన్ని గురించి ఎన్నో గొప్పలు చెప్పుకున్నారు. కాని ఇప్పుడు ముస్లింలు తమ ఖిబ్లాను మార్చుకునేటప్పటికి వారిలో అసూయ ఏర్పడింది. ఖిబ్లా మార్పు గురించి ఈ క్రింది ఖుర్ఆన్ సూక్తులు అవతరించాయి:

"ఏమయింది వీరికి, నిన్నటిదాకా ఒక దిక్కుకు తిరిగి ప్రార్థన చేస్తుండిన వీరు ఈరోజు హఠాత్తుగా మరో దిక్కుకు తిరిగారు?" అంటారు మూఢులు. ప్రవక్తా! వారికి చెప్పు: "తూర్పు పడమరలన్నీ దేవుని దిక్కులే. ఆయన తాను కోరినవారికి సన్మార్గం



చూపుతాడు." ఈవిధంగా మేము మిమ్మల్ని మధ్యస్థ సమాజంగా చేశాం. మీరు ప్రపంచ ప్రజలకు సాక్షులుగా, ప్రవక్త మీకు సాక్షిగా ఉండాలని ఇలా చేశాము. (2:142)

"దైవప్రవక్తను ఎవరు అనుసరిస్తారు, ఎవరు విముఖులవుతారని పరీక్షించడానికి మేము మొదట మీరు (ప్రార్థనకై) మరలే దిక్కును ఆరాధనా కేంద్రంగా నిర్ణయించాము. ఇది ప్రజలకు చాలాకష్టం అన్పించింది. కాని దేవుని మార్గదర్శకత్వం లభించిన వారికి ఇది ఏమాత్రం కష్టమన్పించలేదు. దేవుడు మీ విశ్వాసాన్ని అనవసరంగా వృథా చేయడు. మానవుల పాలిట ఆయన అపార కృపాశీలుడు, అమిత దయామయుడు. (2:143)

"గ్రంథ ప్రజలకు నీవు ఎన్ని నిదర్శనాలు చూపినా వారు మీ ప్రార్థనాదిశను అనుసరించరు. మీరూ వారి ప్రార్థనాదిశను అనుసరించలేరు. స్వయంగా వారిలో కూడా ఒక వర్గం వారు అనుసరించే ప్రార్థనాదిశను మరొక వర్గంవారు అనుసరించరు. ఒకవేళ (మా గ్రంథ) జ్ఞానం అందిన తరువాత కూడా వారి కోరికలను అనుసరిస్తే మాత్రం నీవు దుర్మార్గులలో చేరినట్లు పరిగణించబడతావు. (2:145)

"మేము గ్రంథం ప్రసాదించినవారు తమ కన్నకొడుకులను ఎలా గుర్తిస్తున్నారో దీన్ని ఆవిధంగా (ఎలాంటి సంకోచంలేకుండా) గుర్తిస్తున్నారు. కాని వారిలో ఒక వర్గం వాస్తవాన్ని బుద్ధిపూర్వకంగా కప్పిపుచ్చుతోంది. నిస్సందేహంగా ఇది నీ ప్రభువు నుండి వచ్చిన పరమ సత్యం. కనుక ఈ విషయంలో నీవు ఎలాంటి అనుమానానికి ఆస్కారమివ్వకు. (2:146,147)

"ప్రతి వర్గానికి ఒక ప్రార్థనాకేంద్రం ఉంది. వారా వైపుకు తిరుగుతారు. అందువల్ల మీరు (దీన్నిగురించి అట్టే ఆలోచిస్తూ సమయం వృథా చేసుకోకుండా) సత్కార్యాలు చేయటంలో ఒకర్నొకరు మించిపోవడానికి ప్రయత్నించండి. మీరు ఎక్కడున్నా దేవుడు మిమ్మల్నందర్నీ ఒకచోటికి చేరుస్తాడు. ఆయన ప్రతిపనీ చేయగల సమర్థుడు, సర్వశక్తిమంతుడు. (2:148)

"మీరు ఏప్రాంతానికి వెళ్ళినా అక్కడ్నుంచి మీరు ప్రతిష్ఠాలయం (కాబా) వైపుకే తిరిగి ప్రార్థన చేయండి. నిస్సందేహంగా ఇది మీ ప్రభువు నుండి వచ్చిన సత్యం. మీరు చేసే పనులన్నిటినీ దేవుడు గమనిస్తూనే ఉంటాడు. మీరు ఎక్కడున్నా, ఏ ప్రాంతానికి వెళ్ళినా అక్కడ నుంచి మీరు ప్రతిష్ఠాలయం వైపుకే అభిముఖులుకండి. మీకు వ్యతిరేకంగా ఇతరులు ఎలాంటి మాట అనడానికైనా ఆస్కారం ఇవ్వకుండా మీరు దాని వైపుకే తిరిగి ప్రార్థన చేయండి. ఇక దుర్మార్గుల విషయానికొస్తే, వారు ఎల్లప్పుడూ మీకు వ్యతిరేకంగా ఏదో ఒకటి వాగుతూనే ఉంటారు. కనుక మీరు వారికి భయపడకూడదు. నాకే భయపడాలి." (2:149,150)

వేలాది సంవత్సరాల నుంచి ప్రపంచనాయకత్వం వహిస్తున్న యూదుల్ని తొలగించి ఆ స్థానంలో సత్యధర్మం ఆశ్రయించిన ముస్లింలను నిలబెట్టడమే ఈ ఖిబ్లా మార్పు అంతరార్థం. కాని జాత్యోన్మాదులైన యూదులకు ఈ విషయం

అర్థంకాలేదు. ముస్లింల ద్వారా దేవుని ధరిత్రిపై ధర్మసంస్థాపన గావించి ప్రపంచజాతుల మధ్య నీతినిజాయతీలకు, సమతా సౌభ్రాతృత్వాలకు వారిని ఆదర్శప్రాయులుగా తీర్చిదిద్దడానికి ఈమార్పు తొలిమెట్టని; దైవధర్మాన్ని తారుమారుచేసి జాత్యహంకారంతో విర్రవీగుతూ అంతిమ దైవప్రవక్త తెచ్చిన ధర్మాన్ని నిరాకరించినందువల్లనే తమకీ అవమానమని వారు తెలుసుకోలేక పోయారు.

నిజం చెప్పాలంటే ప్రపంచంలో మానవుల కోసం నిర్మించిన మొట్టమొదటి ఆరాధ నాలయం మక్కాలో ఉన్న కాబాగృహమే. దేవుడు దానికి ఎన్నో శుభాలనిచ్చి దాన్నొక అంతర్జాతీయ ప్రబోధనా కేంద్రంగా నిర్ణయించాడు. అరబ్బు తెగలన్నిటికీ మూల పురుషుడైన ఇబ్రాహీం ప్రవక్త (అలైహి) నిర్మించిన ఆరాధనాలయం కూడా కాబాయే. అందువల్లనే దేవుడు ఈ పురాతన ఆలయాన్నే మళ్ళీ ఖిబ్లాగా నిర్ణయించాడు.

మదీనాలో దైవప్రవక్త (సల్లం) నమాజు చేసిన ప్రతిచోటా ఒకమసీదు వెలిసింది. వాటిలో ప్రముఖమైనవి పైన పేర్కొన్న మసీదులే. మేము ముగ్గురం మస్జిదె ఖిబ్లతైన్ సందర్శనం తర్వాత ఇతర చారిత్రకస్థలాలు చూడటానికి బయలుదేరాము. మా బస్సు ఓ కొండ దగ్గరకు చేరుకొని ఆగింది. హాజీలు 'ఇదే ఉహద్ పర్వతం' అంటూ బస్సులో నుంచి బిలబిల కిందికి దిగారు. మేము కూడా బస్సుదిగి ఉహద్ కొండ చూశాం.

## 33. ఉహుద్ కొండ వద్ద గందరగోళం

నేను ఉహద్ పరిసరాలను పరికించి చూస్తుంటే నా మస్తిష్కంలో ఉహద్ సమర దృశ్యం మెదిలింది.... దైవప్రవక్త (సల్లం) మదీనా రాగానే దాని పరిసర ప్రాంతాల్లోని యూద తెగలతో స్నేహఒప్పందం చేసుకున్నారు. కాని బద్ర్ యుద్ధంలో మక్కా అవిశ్వాసులు ఓడిపోయిన తర్వాత ఆ యూదతెగలు స్నేహఒప్పందాన్ని గౌరవించకుండా ముస్లింలకు వ్యతిరేకంగా రకరకాల కుట్రలు పన్నడం ప్రారంభించారు.

ముఖ్యంగా బనీఖైనుఖా తెగ ఈ విషయంలో హద్దుమీరిపోయింది. వారు దైవప్రవక్తను హతమార్చడానికి కూడా కుట్రపన్నారు. దాంతో దైవప్రవక్త (స) వారిపై దాడిచేశారు. చివరికి వారు సంధి చేసుకొని దానిప్రకారం మదీనా వదలిపోయారు. అయితే బనీనజీర్ అనే మరో యూదతెగ మక్కా బహుదైవారాధకులతో చేతులుకలిపి ముస్లింలతో చేసుకున్న స్నేహఒప్పందం ఉల్లంఘించడానికి పాల్పడింది. వారిని ముస్లింలకు వ్యతిరేకంగా ఉసిగొల్పింది. దాంతో ఉహుద్ యుద్ధం జరిగింది. అప్పుడు యూదులేగాక, కపటవిశ్వాసులు కూడా ముస్లింలకు వ్యతిరేకంగా దుష్ట పన్నాగాలు పన్నారు. మరోవైపు కొందరు ముస్లిం యోధులలోని కొన్ని బలహీనతల వల్ల ఉహుద్ యుద్ధంలో మొదట ఇస్లాంవ్యతిరేక శక్తుల వైపు విజయం మొగ్గింది.

ఈ యుద్ధంలో దైవప్రవక్త (సల్లం) కొందరు విలుకాండ్రను ఓ కీలక ప్రదేశంలో నిలబెట్టి తన దగ్గర్నుంచి తిరిగి ఉత్తర్వు రానంతవరకు ఆ ప్రదేశాన్ని వదలిపెట్టి పోకూడదని ఆజ్ఞాపించారు. అయితే యుద్ధంలో శత్రువులు పారిపోవడం



చూసి ముస్లిం యోధులు వారు వదలిపోయిన సమరసొత్తును సేకరించుకోవడం ప్రారంభించారు. నిర్ణీత కీలక ప్రదేశంలో నియమించబడిన విలుకాండ్రు కూడా వారి నాయకుడు వారిస్తున్నా విన్పించుకోకుండా ఒకరిద్దరు మినహా అందరూ తమతమ స్థానాలు వదలి సమరసొత్తు సేకరించుకోవడానికి వెళ్ళిపోయారు. అప్పుడు శత్రువులు కొండ వెనుక నుంచి వచ్చి ఆ కీలకప్రదేశం గుండా ముస్లింలపై హఠాత్తుగా మెరుపు దాడి చేశారు. దాంతో ముస్లిమ్ సైన్యంలో గందరగోళం ఏర్పడింది. కొందరు ప్రాణ భీతితో పారిపోసాగారు. దాన్ని గురించి ఖుర్ఆన్ ఇలా పేర్కొన్నది:

"దేవుడు మీకు చేసిన (సహాయ) వాగ్దానాన్ని నెరవేర్చాడు. ప్రారంభంలో మీరే దేవుని ఆజ్ఞతో అవిశ్వాసుల్ని వధిస్తుండేవారు. కాని ఆ తరువాత మీరు కోరుకున్న దాన్ని (అంటే సమరసొత్తును) దేవుడు చూపగానే మీరు ధైర్యం కోల్పోయారు. (ప్రవక్త) ఆజ్ఞ విషయంలో మీరు పరస్పరం విభేదాలకు లోనయి అవిధేయత చూపారు. మీలో కొందరు ప్రాపంచిక సంపదను ఆశించారు. మరికొందరు పరలోక ప్రతిఫలం కోరుకున్నారు. అప్పుడు దేవుడు మిమ్మల్ని పరీక్షించడానికి శత్రువుల నుండి మీ దృష్టిని (వేరే వైపునకు) మరల్చి పారిపోయేలా చేశాడు. అయితే మీరలా పారిపోయినప్పటికీ దేవుడు మిమ్మల్ని క్షమించాడు. ఆయన విశ్వాసుల పాలిట అత్యంత దయామయుడు." (ఖుర్ఆన్–3:152)


విలుకాండ్ర పొరపాటు వల్ల జరిగిన ఈ గందరగోళానికి తోడు పుండుమీద కారం చల్లినట్లు దైవప్రవక్త (స) అమరగతులయ్యారని వదంతి పుట్టింది. దాంతో ముస్లింలు బాగా క్రుంగిపోయారు. వారిలో అనేకమంది "మన ప్రియతమ నాయకుడే మనల్ని వీడి పోయినప్పుడు ఇక మనం ఎవరికోసం ఈ యుద్ధం చేయాలి?" అన్న భావనతో అస్త్రసన్యాసం చేసి యుద్ధరంగం నుంచి పక్కకు తప్పుకున్నారు. మరికొందరు ఏమీ పాలుపోక అయోమయంలో పడిపోయారు. ఇంకొందరు పలాయనం చిత్తగించే ప్రయత్నంలో ఉన్నారు. ఆ సందర్భాన్ని గురించి ఖుర్ఆన్ ఇలా పేర్కొన్నది:

"మరో సంఘటన కూడా గుర్తుకు తెచ్చుకోండి. అప్పుడు మీరు వెనుదిరిగి చూడనైనా చూడకుండా పారిపోసాగారు. వెనకాల దైవప్రవక్త మిమ్మల్ని పిలుస్తున్నా మీరు విన్పించుకునే స్థితిలో లేకపోయారు. ఈ వైఖరికి శాస్తిగా దేవుడు మీకు పుట్టెడు దుఃఖం కలిగించాడు. భవిష్యత్తులో మీనుండి ఏదైనా వస్తువు చేజారిపోయినా లేక మరేదైనా ఆపద వచ్చిపడినా మీరు చింతించకుండా ఉండేందుకు ఈవిధంగా దేవుడు మీకొక గుణపాఠం నేర్పాడు. మీరు చేసే పనులన్నీ దేవునికి బాగా తెలుసు." (3:153)

"మీరు ఇట్టే స్వర్గంలో ప్రవేశిస్తామనుకుంటున్నారా? మీలో దైవమార్గంలో పోరాడేవారిని దేవుడింకా పరీక్షించనే లేదు. వారు ఏమేరకు సహనం వహించి ధ్యేయపథంలో స్థిరంగా ఉంటారో ఆయన చూడదలిచాడు. ఇదివరకు (పోరాడి) మరణించే అవకాశం రాకముందు మీరు దాన్ని కోరుతుండేవారు. ఇప్పుడది మీముందుకు వచ్చింది. మీరు దాన్ని కళ్ళారా చూసుకున్నారు కూడా. (కనుక మీరు ప్రాణాలకు తెగించి పోరాడాలిగాని, ధైర్యం కోల్పోయి ఢీలా పడిపోకూడదు)."



↑మస్జిదె ఖుబా (మదీనా), ఉహద్ యుద్ధభూమి (మదీనా)↓





"ముహమ్మద్ ఒక దైవప్రవక్త మాత్రమే. ఇతనికి పూర్వం కూడా అనేక మంది దైవప్రవక్తలు వచ్చిపోయారు. మరి ఇతనిప్పుడు చనిపోతే లేక చంపబడితే మీరు (ధర్మపథం నుండి) వెనుదిరిగి పోతారా? గుర్తుంచుకోండి, (ఇస్లాం నుండి) అలా వెనుదిరిగి పోయేవాడు దేవునికి ఎలాంటి నష్టం కల్గించలేడు. దేవుడు తనకు కృతజ్ఞత చూపేవారికే తగిన బహుమానం ఇస్తాడు."

"దేవుని అనుజ్ఞ లేనిదే నిర్ణీత సమయానికి ముందు ఏ ప్రాణికీ చావు రాదు. ప్రతి ప్రాణికీ మరణకాలం వ్రాయబడి ఉంది. కేవలం ప్రాపంచిక ప్రతిఫలాపేక్షతో పనిచేసేవారికి మేము ప్రపంచంలోనే వారి ప్రతిఫలం ఇచ్చివేస్తాం. పరలోక ప్రతిఫలాపేక్షతో పనిచేసేవారికి పరలోకంలో వారికి రావలసిన ప్రతిఫలం అనుగ్రహిస్తాం. కృతజ్ఞులై ఉండేవారికి మేము తప్పకుండా తగిన బహుమానం ప్రసాదిస్తాం." (ఖుర్ఆన్. 3:142-145)

"పరలోక జీవితం కోసం ప్రాపంచిక జీవితం అమ్మదలచుకున్నవారు దైవమార్గంలో పోరాడాలి. దైవమార్గంలో పోరాడి అమరగతినొందినా లేక విజయం సాధించినా అలాంటి వ్యక్తికి మేము గొప్ప ప్రతిఫలం ప్రసాదిస్తాము. దిక్కులేక పోవడం చూసి అణచి వేయబడ్డ స్త్రీలు, పురుషులు, పిల్లలను రక్షించడానికి మీరు దైవమార్గంలో ఎందుకు పోరాడరు? వారు (బాధలు భరించలేక) 'దేవా! దుర్మార్గులు నివసిస్తున్న ఈ నగరం నుండి మమ్మల్ని బయటికి తీసి కాపాడు. మాకు రక్షణ కల్పించి అండగా నిలిచేవారినెవరినైనా నీ వైపునుండి మా దగ్గరికి పంపు' అని మొరపెట్టుకుంటున్నారే! అలాంటి పీడితప్రజల రక్షణ కోసం ఎందుకు పోరాడరు మీరు?" (ఖుర్ఆన్. 4:74-75)

"(ముహమ్మద్!) దైవానుగ్రహంవల్లనే నీవు వారి విషయంలో ఎంతో మృదుహృదయుడవయ్యావు. దీనికి భిన్నంగా నీవు కోపిష్టి, కఠిన హృదయుడవయి ఉంటే వారంతా నీకు దూరమయ్యేవారు. ఒక్కడూ నీ చెంతకు చేరేవాడు కాదు. కనుక నీవు వారిని క్షమించు. వారి పొరపాట్ల కోసం (దేవుని) మన్నింపు అర్థించు. నీవు తలపెట్టే పనుల విషయంలో వారిని సంప్రదిస్తూ ఉండు. ఏదైనా పని గురించి నిర్ణయం తీసుకున్నప్పుడు దేవుని మీద భారం వెయ్యి. దేవుడు తనను నమ్ముకున్నవారినే ప్రేమిస్తాడు." (ఖుర్ఆన్-3:159)

ఎట్టకేలకు ముస్లింలలోని అనాసక్తత దూరమయింది. వారు నూతన ఉత్తేజంతో మళ్ళీ యుద్ధం ప్రారంభించి అంతిమ విజయం సాధించారు. అయితే ముస్లింలకు చాలా నష్టం జరిగింది. దైవప్రవక్త (సల్లం) కొండ ఎక్కుతుంటే శత్రువులు తవ్విన ఒక గోతిలో పడిపోవడం వల్ల ఒక పన్ను విరిగింది. ఆయన అనుచరులలో డెబ్భయిమంది అమరగతులయ్యారు. ఆ ప్రాంతంలో వారి సమాధులు కూడా ఉన్నాయి....

"ఉహుద్ పర్వతమా! మా పాపమన్నింపు కోసం నీ ప్రభువును ప్రార్థించవూ?" అని మనసులో అనుకుంటూ నేను బస్సు వైపు నడిచాను. అక్కడ్నుంచి బయలుదేరి మేము చారిత్రక కందకం వైపుకు వెళ్ళాము.

# 34. కదనరంగంలో కందకం

మేము బస్సులో పోతూ కొంచెం దూరంనుంచి కందకం చిహ్నాలు మాత్రమే చూడ గలిగాం. నేను దాని గతచరిత్రను కూడా ఓసారి నెమరేసుకున్నాను......

......ముస్లింలకు స్వల్పకాలంలో లభించిన అనేక విజయాలతో యావత్తు అరబ్ తెగలు నీరుకారిపోయాయి. ఇస్లాం ఇప్పుడు అజేయశక్తిగా ఎదిగిందని, ఒకటి రెండు తెగలు దాన్ని ఎదుర్కోలేవని అరబ్బులు గ్రహించారు. అందువల్ల ఇస్లాంను తుడిచి పెట్టేందుకు మొత్తం తెగలు ఏకమయి దాడిచేయాలని నిర్ణయించుకున్నాయి. మదీనా నుండి బహిష్కృతులై ఖైబర్‌లో స్థిరపడిన బనీనజీర్ తెగ(యూద) నాయకులు మక్కా ఖురైషుల్లో తీవ్రమైన ప్రతీకారజ్వాలలు రేకెత్తించారు. దాంతో హి.శ. 5వ ఏట కనీవినీ ఎరగనంత గొప్ప సైన్యం మదీనాపై దాడిచేయడానికి సిద్ధమయింది. ఖురైషీయులు కూడా 12,000 మంది భారీ సైన్యంతో బయలుదేరారు.

ఈ సంగతి తెలుసుకున్న దైవప్రవక్త (స) నగరం చుట్టూ కందకం త్రవ్వించారు. యుద్ధతంత్రంగా కందకం గురించి అరబ్బులకు అప్పటిదాకా ఏమీ తెలియదు. అందువల్ల మక్కా ఖురైషీయులు ఈ కందకం చూసి నిర్ఘాంతపోయారు. కందకం దాటి నగరంలోకి చొచ్చుకొని రావడానికి వారు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. ఇక వారికి ఒకేఒక మార్గం మిగిలింది. మదీనా సమీపంలో ఆగ్నేయదిక్కున ఉన్న ఖురైజా తెగయూదుల్ని ముస్లింల నుండి తమవైపుకు తిప్పుకోవడానికి ప్రయత్నించారు. ఖురైజా తెగయూదులు కూడా ముస్లింలతో చేసుకున్న స్నేహఒప్పందానికి తిలోదకాలిచ్చి ఖురైషీయులతో చేతులు కలపడానికి సిద్ధమయ్యారు.

ఈవిధంగా నగరం బయట నుంచి కయ్యానికి కాలుదువ్వుతున్న బహుదైవా రాధకులు, నగరంలోపల ఒప్పందం ఉల్లంఘించిన యూదులు కలిసి ముస్లింలకు ముప్పుగా పరిణమించారు. దీనికితోడు పుండుమీద కారం చల్లినట్లు కపటవిశ్వాసులు కూడ ఇస్లాంవ్యతిరేక కార్యకలాపాలు ముమ్మరం చేశారు. వారు బహుదైవారాధకుల సైనికసంఖ్యను చూపి ముస్లింలను నిరుత్సాహపరచడానికి, వారిలో అపార్థాలు సృష్టించడానికి ప్రయత్నించారు. అయితే అలాంటి క్లిష్టపరిస్థితిలో సైతం దైవప్రవక్త (స) చాకచక్యంతో వ్యవహరిస్తూ ముస్లింలలో ధైర్యస్థయిర్యాలు కలిగించారు.

ఇదిలా ఉండగా అటు బహుదైవారాధకుల్లో గత్ఫాన్ తెగకు చెందిన "నయీమ్ బిన్ మస్‌వూద్" అనే ఓ ఉపతెగ నాయకుడికి దేవుడు ఇస్లాంస్వీకార భాగ్యం ప్రసాదించి ముస్లింల పక్షాన రంగంలోకి దించాడు. హజ్రత్ నయీమ్ (రజి) దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి, తాను ఇస్లాం స్వీకరించినట్లు ఇంకా ఎవరికీ తెలియదు గనక, తనను ఏదైనా పనికోసం వినియోగించుకో వలసిందిగా మనవి చేశారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) "అయితే నువ్వెళ్ళి శత్రువుల మధ్య విభేదాలు సృష్టించి వారిని చీల్చడానికి ప్రయత్నించు" అని చెప్పారు.



ఈమాట విని నయీమ్ (రజి) మొదట బనీఖురైజా తెగయూదుల దగ్గరకు వెళ్ళి వారితో మాట్లాడుతూ "ఖురైషీయులు, గత్ఫాన్ తెగవాళ్ళు సుదీర్ఘముట్టడితో విసిగిపోయి యుద్ధరంగం నుండి వెళ్ళిపోతే మీరు స్నేహఒప్పందం ఉల్లంఘించి నందుకు ప్రమాదంలో పడిపోతారు. అంచేత బయట నుండి వచ్చిన తెగల్లో నుంచి కొందరు ప్రముఖ వ్యక్తుల్ని మీ దగ్గరికి తాకట్టు బందీలుగా పంపనంతవరకు మీరు యుద్ధంలో పాల్గొనరని గత్ఫాన్, ఖురైష్ నాయకులకు కబురు పంపండి" అని సలహా ఇచ్చారు. ఈ సలహా వారికి నచ్చింది.

హజ్రత్ నయీమ్ (రజి) వెంటనే అక్కడ్నుంచి బయలుదేరి ఖురైష్ నాయకుల దగ్గరకు వెళ్ళారు. వారితో కూడా ఆయన యుద్ధ పరిస్థితిని గురించి మాట్లాడుతూ "బనీఖురైజా యూదులు సుదీర్ఘముట్టడితో ఢీలాపడినట్లు కన్పిస్తోంది. వారు మీదగ్గర కొందర్ని తాకట్టు బందీలుగా అడిగి తీసుకొని వారిని ముహమ్మద్‌కు అప్పగించి తమ వ్యవహారం పరిష్కరించుకోవడానికి ప్రయత్నించినా ఆశ్చర్యంలేదు. అంచేత వారిపట్ల కాస్త జాగ్రత్తగా వ్యవహరించడం మంచిది" అని అన్నారు.

ఖురైష్, గత్ఫాన్ నాయకులు నయీమ్(రజి) మాటలతో బనీఖురైజా యూదుల్ని అనుమానిస్తూ సందిగ్ధంలో పడిపోయారు. వెంటనే వారొక నిర్ణయానికి వచ్చి "మేమీ సుదీర్ఘ ముట్టడితో విసిగిపోయాము. ఇప్పుడిక సర్వశక్తులు ఒడ్డి పోరాడి అటో ఇటో తేల్చుకోవాలి. కనుక రేపు ఇటునుంచి మేము, అటునుంచి మీరు ఒకేసారి దాడిచేసి ముస్లింలపై మూకుమ్మడిగా విరుచుకుపడదాం" అని బనీఖురైజా నాయకులకు సమాచారం పంపారు.

నయీమ్ (రజి) మాటలతో ఇంతకుముందు నుంచే వారిని అనుమానిస్తున్న బనీఖురైజా యూదులు ఈ సందేశంతో ఆగ్రహోదగ్రులయి "మీరు కొందరు ప్రముఖ వ్యక్తుల్ని మా దగ్గర తాకట్టు బందీలుగా పంపనంతవరకు మేము యుద్ధప్రమాదం కొని తెచ్చుకోదలచలేదు" అని సమాధానమిచ్చారు. ఖురైష్, గత్ఫాన్ నాయకులు నయీమ్ ఇచ్చిన సలహాను నెమరేసుకుంటూ, తమవారిని బందీలుగా వారికివ్వడానికి నిరాక రించారు. దాంతో బనీఖురైజా యూదులు తమకు నయీమ్ (రజి) మంచి సలహాయే ఇచ్చాడని భావించారు.

ఈ విధంగా నయీమ్ (రజి) పన్నిన యుద్ధతంత్రం ఫలించి శత్రుసేనల ఐక్య సంఘటన నిట్టనిలువుగా చీలిపోయింది.

ముట్టడి 25 రోజులకు పైగా కొనసాగినా సమస్య ఓ కొలిక్కి రాలేదు. అది ఎముకలు కొరికే చలికాలం. విపరీతమైన చలితో రాత్రివేళలు శత్రుసేనలకు చాలా దుర్భరంగా పరిణమించాయి. వెంట తెచ్చుకున్న ఆహారసామగ్రి, పశువుల మేత చాలా వరకు తరిగిపోయింది. వీటికి తోడు విభేదాలు వచ్చి యూదులు తమతో కలసి రానందున కూడా బహుదైవారాధక సైనికుల్లో ధైర్యం సన్నగిల్లింది.

ఈ పరిస్థితిలో ఓరోజు రాత్రి హఠాత్తుగా భయంకరమైన తుఫాను విరుచుకు పడింది. తీవ్రమైన వేగంతో వీస్తున్న ఈదురు గాలులు, గజగజ వణికిస్తున్న చలి, కళ్ళు చించుకున్నా కానరాని కటికచీకటి, ఉరుములు మెరుపులతో పరిస్థితి చాలా భయానకం గా తయారయింది. శత్రువుల గుడారాలు, వంటసామగ్రి గాలి తాకిడికి ఎగిరిపోసాగాయి. దాంతో శత్రు సైనికుల్లో తీవ్రమైన గందరగోళం ఏర్పడింది. వారు ఏం చేయాలో దిక్కు తోచక చివరికి పెడబొబ్బలు పెడుతూ ప్రాణాలు అరచేత పట్టుకొని బ్రతుకుజీవుడా అంటూ పారిపోయారు.

మరునాడు ఉదయం తుఫాను ఉధృతం తగ్గిన తర్వాత ముస్లింలు వెళ్ళిచూస్తే అక్కడ ఒక్క పురుగూ లేదు. యుద్ధమైదానం ఖాళీగా ఉంది. ముస్లింలు అది చూసి చల్లగా ఊపిరి పీల్చుకున్నారు. దైవప్రవక్త (సల్లం) ఆ నిర్జన ప్రదేశం చూసి "ఇప్పుడిక ఖురైషీయులు మీమీద ఎన్నటికీ దాడిచేయడానికి రాలేరు. మీరే వారిపై దాడిచేయ డానికి వెళ్తారు" అన్నారు అనుచరులతో. ఈ యుద్ధాన్ని అహ్జాబ్ యుద్ధమంటారు. దీన్ని ఖందఖ్ (కందకం) యుద్ధమని కూడా అంటారు.........

## 35. అపరిచిత హాజీలతో పరిచయం

నేను మదీనాలో ఉన్నన్నాళ్ళు, ఆ తర్వాత మక్కాలో కూడా గమనిస్తే హాజీలలో అత్యధిక మంది టర్కీ ప్రజలే ఉన్నారనిపించింది. ఆ తరువాత అత్యధిక సంఖ్యాకులు మలేషియా, ఇండోనేషియా దేశస్థులని చెప్పవచ్చు. వస్త్రధారణ, రూపురేఖలను బట్టి మలేషియా, ఇండోనేషియా ప్రజలను విడదీసి చూడలేము. టర్కీ, ఇండోనేషియా, మలేషియా, గినీ దేశాల హాజీలు యూనిఫారం దుస్తులు ధరించారు. మన దేశంలోని కేరళ హాజీలు కూడా యూనిఫారం దుస్తులు ధరించారు.

అజాన్‌కు అరగంట ముందుగానే జనం మస్జిదెనబవీకు వస్తుంటారు. అజాన్‌కు ముందుగాని, అజాన్ తరువాతగాని వీలైనప్పుడల్లా నేను నా ఇరుపక్కల ఉండే హాజీలను పలకరించేవాడ్ని. నేను మెల్లిగా 'అస్సలాము అలైకుం' అంటూ కరచాలనం కోసం చేయిజాపితే, అతను చిరునవ్వుతో ప్రతిసలాం చేసి కరచాలనం చేసేవాడు. ఆ తర్వాత నేను ఇండియా నుంచి వచ్చానని చెబితే, అతను తన దేశం పేరు చెప్పే వాడు. అంతకంటే మా పరిచయం ముందుకు సాగేదికాదు.

తోటి హాజీలతో 'సంక్షిప్త పరిచయం' సంగతి పర్వాలేదుగాని, వివరాలకు పోవా లనుకుంటేనే ఉభయుల మధ్య భాష పెద్ద అడ్డుగోడయి నిలిచింది. అయినా నేను నా పరిచయ పరంపర ప్రయత్నం మానుకోలేదు. ఒకసారి మస్జిద్‌లో నా పక్కన ఒక టర్కీ హాజీ కూర్చున్నాడు. నేను ఉర్దూలో సలాం చేసి పలకరించాను. నేను ఇండియా నుంచి వచ్చానని చెబితే, అతను టర్కీ నుంచి అని చెప్పాడు. అతను చెప్పిన వాక్యం లో నాకు టర్కీ అనే పదమొక్కటే అర్థమయింది. నేను, భాష మనకు అడ్డుగోడయి పోయిందని చెబుతూ "జబానే యార్ మన్‌తుర్కీ, నమీదానం నమీదానం" అన్నాను. పార్సీభాషలోని ఈ కవితాపాదం అర్థమయిందేమో అతను పకపకా నవ్వాడు.



ఇలా నేను అనేకమందిని కలుసుకొని సౌభ్రాతృత్వపు పలకరింపు కోసం ఇంగ్లీషు లో "నేను ఇండియా నుంచి వచ్చాన"ని చెప్పేవాడ్ని. అవతలి వ్యక్తి తన దేశం పేరు మాత్రమే చెప్పి ఊరుకుండేవాడు. ఇంగ్లీషు నేడు గొప్ప అంతర్జాతీయ భాషగా మారిన మాట కొంతవరకు నిజమే అయినా, మనం మన మాతృభాషను తుంగలో తొక్కి ఇంగ్లీషును అతిగా పొగుడుతున్నాం. కాని ఇంగ్లీషుకు ఇంత ప్రాముఖ్యం భారత ఉప ఖండంలోనేగాని, ప్రపంచంలో మరే దేశంలోనూ లేదు. చివరికి మన దేశంలో అనేక ముస్లిం విద్యాసంస్థలు ఇటు తమ మాతృభాషనుగాని, అటు ప్రాంతీయ భాషనుగాని కాకుండా ఆంగ్లేయాన్ని మాధ్యమంగా స్వీకరిస్తున్నాయంటే ఇంగ్లీషువాడు మన మీద తన మాతృభాషను ఎంత గట్టిగా రుద్దాడో, రుద్దుతున్నాడో ఊహించవచ్చు.

మక్కాలో మా వసతి గృహానికి దగ్గర్లో ఉండే ఒక మసీదులో ఓ చైనా యువ హాజీని కలుసుకున్నాను. ఈనాడు అనేక విదేశీ ఎలక్ట్రానిక్ వస్తువులపై "మేడ్ ఇన్ చైనా" అని ఉండటం అందరికీ తెలిసిందే. దాన్ని దృష్టిలో పెట్టుకొని "మీకు ఇంగ్లీషు గాని, అరబీగాని వచ్చా" అనడిగాను. దానికతను ఇంగ్లీషు రాదని, అరబీభాషే కొద్దిగా వచ్చని చెప్పి ముందుకు సాగాడు. నేనప్పుడు అతడ్ని మనసులోనే అభినందించాను, ఇంగ్లీషుపై అతను అరబీకి ఇచ్చిన ప్రాధాన్యత పట్ల సంతోషిస్తూ.

అరె! మదీనా దాటక ముందే నా ఆలోచన మక్కాకు పోయిందే!! సరే, ఓరోజు నేను అసర్ నమాజ్ చేసి మస్జిదెనబవీ ముందు రోడ్డు పక్కన ఒక చోట కూర్చున్నాను. కాస్సేపటికి నల్లగా, పొడుగ్గా, స్మార్ట్‌గా ఉన్న ఓ యువకుడు రావడం చూసి నేను లేచి నిలబడ్డాను. బహుశా అతను ఆఫ్రికా నివాసి అయివుంటాడని అనుకున్నాను. నేను సలాం చెప్పి మీరు ఏ దేశస్థులని అడిగాను ఇంగ్లీషులో. అతను దక్షిణరేబియా అన్నాడు. నేనా మాట సరిగా వినకుండా "మీరు దక్షిణాఫ్రికా నుంచి వచ్చారా?" అని అడిగాను. అతను "కాదు, దక్షిణరేబియా. నేను నల్లగా ఉన్నానని అలా అంటున్నారా మీరు?" అని అన్నాడు. నేను "నో, హవ్వార్యూ" అంటూ మాటమార్చాను.

హజ్ సీజన్‌లో మక్కా, మదీనాలు విభిన్న దేశాల, భాషల, జాతుల హాజీలతో కళ కళలాడుతూ నిజమైన అంతర్జాతీయ సౌభ్రాతృత్వ సుగంధ పరిమళం వెద జల్లుతాయి. ఒకరి భాష ఒకరికి తెలియకపోయినా సలాం కరచాలనలు, చిరునవ్వు పలకరింపులతో మేనులు పులకరిస్తాయి.

## 36. ఉమ్రాదీక్షతో మక్కా ప్రయాణం

ఈ విధంగా మేము తోటిహాజీలతో ప్రేమామృతం పంచుకుంటూ, ప్రతివేళా మస్జిదెనబవీకి వెళ్ళి నమాజు చేస్తూ, తీరిక సమయాల్లో చారిత్రక స్థలాలు సందర్శిస్తూ 15-12-05 వరకు మదీనాలోనే గడిపాం. ఆరోజు సాయంత్రం ముఅల్లిమ్ మనిషి వచ్చి "ఈరోజు మక్కాకు బయలు దేరాలి. ఇషానమాజ్ కాగానే సిద్ధంగా ఉండండి" అని చెప్పి వెళ్ళిపోయాడు. అప్పుడు మా లాడ్జిలో హడావిడి మొదలయింది.



↑ మస్జిదె నబవీ లోపలి దృశ్యాలు ↓





మేము జుహర్ నమాజ్ చేసివచ్చి బ్యాగులు, సూట్‌కేసులు సర్దుకోవడం ప్రారంభించాం. మగ్రిబ్ నమాజ్ తరువాత ముఅల్లిమ్ మనిషి మరొకసారి వచ్చి "రాత్రి 8 గంటలకు బస్సెక్కాలి"అని ప్రకటించాడు. మేము మగ్రిబ్, ఇషా నమాజులు ముగించుకొని స్నానాలు చేశాం. నేను, మా మామయ్య ఇహ్రాం బట్టలు కట్టుకొని రెండు రకాతులు నఫిల్ నమాజ్ చేశాం. ఆ తర్వాత "ఉమ్రాదీక్ష" పూనాం. మా శ్రీమతి కూడా స్నానం చేసి, రెండురకాతులు నఫిల్ నమాజ్ చేసి ఉమ్రాదీక్ష పూనింది.

దీక్ష (ఇహ్రాం) కోసం కుట్టులేని రెండు వస్త్రాలు తీసుకొని ఒకదాన్ని లుంగీలా నడుముకు కట్టుకోవాలి. లుంగీ ఊడకుండా బిర్రుగా ఉండేందుకు హజ్ వస్తువులు అమ్మే దుకాణాలలో లభించే బెల్టు కూడా కట్టుకుంటే మంచిది. వెడల్పుగా ఉండే ఈ బెల్టుకు జిప్స్‌తో కూడిన రెండు జేబులుంటాయి. ఆ తర్వాత రెండవ వస్త్రాన్ని ఒక కొన కుడిభుజం కిందినుంచి తీసి ఎడవ భుజమ్మీదుగా లాగి కట్టుకోవాలి. ముఖ్యంగా కాబా ప్రదక్షిణ చేసేటప్పుడు ఈవిధంగా రెండవ వస్త్రం తప్పకుండా కుడిభుజం కిందికి ఉండేలా కప్పుకోవాలి. ఇతర వేళల్లో రెండు భుజాలు కనపడకుండా కప్పుకోవచ్చు. దీక్ష విరమించేదాకా ఈ వస్త్రాలు వంటిపై ఇలాగే ఉండాలి. తలపై మాత్రం ఎట్టి పరిస్థితిలోనూ టోపీగాని, మరెలాంటి ఆచ్ఛాదనగాని ఉండకూడదు. స్త్రీలకు ఇహ్రాందుస్తుల షరతు లేదు. వారు రోజూ ధరించే సాధారణ దుస్తులే ధరించాలి.

నేను లాడ్జి నాల్గో అంతస్తు నుండి కిందికి దిగి చూస్తే లాడ్జి ముందు రోడ్డు మీద అనేక బస్సులు వచ్చి సిద్ధంగా ఉన్నాయి. నేను వెంటనే మళ్ళీ పైకెళ్ళి మా శ్రీమతి, మామయ్యలతో కలసి ప్రయాణసామగ్రిని లిఫ్టులో కిందికి దించాను. చూస్తే గ్రౌండ్ ఫ్లోర్‌లో అనేక బ్యాగులు, సూట్‌కేసులు మాత్రమే కన్పించాయి. అక్కడ నలుగురైదుగురు హాజీలు తప్ప ఎవరూ లేరు. రోడ్డు మీద బస్సులు బారులుతీరి నిలబడి ఉన్నాయి. ముఅల్లిమ్ మనుషులు హాజీల సామాను క్రేన్‌లతో బస్సుల మీదికి ఎక్కిస్తున్నారు.

మేము ప్రకటన ప్రకారం సరిగ్గా 8 గంటలకు మాకు కేటాయించిన బస్సెక్కాం. అప్పుడు బస్సులో ఒక్క పురుగూ లేదు. కాస్సేపటికి నిదానంగా ఒక్కొక్కరే బస్సెక్కడం మొదలెట్టారు. రాత్రి 10 గంటలకు హాజీలతో మా బస్సు దాదాపు నిండిపోయింది. కాని ఘడియలు, గంటలు గడుస్తున్నా బస్సు కదలదే! నిరీక్షణలో నా నడుములు బాధగా మూల్గసాగాయి. నేనా నడుములు పట్టుకొని మెల్లిగా లేచి కిందికి దిగాను.

అంతలో డ్రైవర్ ఆదరాబాదరాగా వచ్చి "ఎక్కండి ఎక్కండి, బస్సు బయలుదేరుతుంది" అన్నాడు. నేను నడుములు పట్టుకొని ఓసారి వెనక్కి వొంగి వెన్నెముక సరి చేసుకొని మళ్ళీ బస్సెక్కాను. నా వెనకాల మరో నలుగురు ఇహ్రాం బట్టలు పైకెత్తి పట్టుకొని గబగబా బస్సెక్కారు. ఇంజన్ స్టార్ట్ అయింది. రాత్రి 12 గంటలకు మా బస్సు 'లబ్‌బైక్ అల్లాహుమ్మ లబ్‌బైక్' అంటూ బయలుదేరింది.

మదీనా భవనాలు డబుల్‌డెక్కర్ బస్సుల్లా శరవేగంతో వెనక్కి పరుగెత్తుతుంటే నేను విస్తుబోయి చూస్తూ "మేమిక్కడ తొమ్మిది రోజులు గడిపామా?" అన్న సందేహం కలిగింది. ఈ ఆశ్చర్యం, అనుమానాల నుండి తేరుకోక ముందే మదీనా భవనాలు దాదాపు కనుమరుగైపోయాయి. కాస్సేపటికి మాబస్సు ఓ పెద్ద బస్టాండ్‌లో ఆగింది.

ఆ ప్రాంతాన్ని 'జుల్‌హులైఫా' అంటారు. మదీనా హాజీలు, మదీనా నుండి వచ్చే ఇతర హాజీల కోసం అది "మీఖాత్"గా నిర్ణయించబడిన ప్రదేశం. మీఖాత్ అంటే హజ్ లేక ఉమ్రా దీక్ష (ఇహ్రాం) పూనడానికి దైవప్రవక్త (సల్లం) నిర్ణయించిన ప్రదేశం అన్నమాట. హాజీలు దీక్ష పూనకుండా ఇక్కడ్నుంచి ముందుకు సాగడం ధర్మసమ్మతం కాదు. అందువల్ల మదీనాలో దీక్ష పూనని హాజీలు బస్సు ఆగగానే కిందికి దిగారు.

ఇక్కడ ఒక పెద్ద మసీదు ఉంది. ఈ మసీదుకు "మస్జిదె జుల్‌హులైఫా, మస్జిదె మీఖాత్, మస్జిదె ఇహ్రాం, మస్జిదె షజరా" అని నాలుగు పేర్లున్నాయి. షజరా అంటే చెట్టు. దైవప్రవక్త (స) ప్రయాణావస్థలో ఈ చెట్టు కింద ఆగి విశ్రాంతి తీసుకునేవారు, దైవప్రవక్త (స) కాలంలోనే ఇక్కడ మసీదు నిర్మించబడింది. ఆ మసీదులో ఆయన నమాజ్ కూడా చేశారు; ఇహ్రాం కూడా పూనారు. ఆ తరువాత అది అనేక మార్పులు చెందుతూ, విస్తరిస్తూ పునర్నిర్మించబడింది.

ఇప్పుడీ మసీదు మొత్తం పరిధి 60,000 చదరపు మీటర్లు ఉంది. ఇందులో మసీదు, తత్సంబంధిత కట్టడాలు 26,000 చదరపు మీటర్ల వైశాల్యంలో విస్తరించి ఉన్నాయి. మిగతా 34,000 చదరపుమీటర్ల స్థలంలో బస్టాండు, కార్‌పార్కింగ్, రోడ్డులు, ఫుట్‌పాత్‌లు, దుకాణాల కోసం తాత్కాలిక షెడ్డులు ఉన్నాయి. ప్రత్యేకంగా హాజీల కోసం నిర్మించిన ఈ మసీదులో ఎయిర్‌కండిషన్ సౌకర్యం కూడా ఉంది. హజ్ సీజన్‌లో ఇక్కడ చాలామంది హాజీలు వస్తూ పోతుంటారు. అంచేత ఇక్కడ 384 'ఉజూ'శాలలు, 512 మూత్రశాలలు, 566 స్నానశాలలు నిర్మించబడ్డాయి.

బస్సు దిగిన మా హాజీలు ఉజూ, గుసుల్ అనంతరం రెండు రకాతులు నఫిల్ నమాజ్ చేసి ఉమ్రా దీక్ష పూనారు. ఈ మసీదులో స్త్రీలకు ప్రత్యేక సౌకర్యాలు ఉన్నాయి. కాస్సేపటికి మేము కూడా బస్సు దిగి మా అత్యవసరాలు తీర్చుకున్నాం. కాస్తంత నోళ్ళకు కూడా పని కల్పించి సేద తీర్చుకున్నాం.

హాజీలను గైడ్ చేయడానికి మాతోపాటు బస్సులో ముగ్గురు స్థానిక అరబ్బులు వచ్చారు. బస్సు దిగాక వారిలో ఓ యువకుడు చక్కని ఉర్దూలో మాట్లాడుతుంటే నేనతని దగ్గరికెళ్ళి మాట కలిపాను. పరస్పరం పరిచయాలయ్యాయి. అప్పుడు ఆ యువకుని తాత, మరికొందరు బంధువులు హైదరాబాద్ వాసులని తెలిసింది. కాని అతను హైదరాబాద్‌లో తనకు ఒక్క చార్‌మినార్ తప్ప మరేమీ తెలియదని అన్నాడు.

మొత్తంమీద అతను సగం భారత సంతతికి చెందినవాడని, ముఖ్యంగా ఆంధ్ర ప్రదేశ్‌తో సంబంధం ఉన్నవాడని తెలిసి నేనతడ్ని అభినందించాను. ఆ సందర్భంలో



నేనతనికి "ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్" గురించి పరిచయం చేస్తూ "తెలుగులో మేము చేసే ఈ ధార్మికసేవలో మాకు మీరేమైనా సహకారం అందజేయగలరా?" అని అడిగా. అతను తప్పకుండా అందజేస్తానన్నాడు. "అయితే మీ ఫోన్ నెంబర్ ఇవ్వండి" అన్నా నేను. దానికా యువకుడు "ఎందుకండీ, నేను మీసేవలోనే ఉంటున్నాగా!" అన్నాడు. అంతే, మక్కా చేరుకొని బస్సు దిగిన తరువాత చూస్తే అతను పత్తాలేకుండా పోయాడు. నేనక్కడ నెల రోజులున్నా అతని అడ్రసు దొరకలేదు.

సరే, ఈ మీఖాత్ ప్రదేశంలో ఒక్కోసారి అనేక బస్సులు వచ్చి వరుసగా నిలబడి ఉంటాయి. అంచేత బస్సు దిగే హాజీలు బస్సు నెంబర్ గుర్తు పెట్టుకొని మరీ తమతమ అవసరాలు తీర్చుకోవడానికి పోవలసి ఉంటుంది. మా బస్సు దాదాపు రెండు గంటలపాటు విశ్రాంతి తీసుకొని బయలుదేరింది.

ఇప్పుడు మా ముందు మదీనా ఛాయలు కూడా లేకుండా పోయాయి. "ప్రవక్త ప్రియ పట్టణమా! మళ్ళీ నాకు నీ దర్శనభాగ్యం ఎప్పుడు లభిస్తుందో నాకైతే తెలియదు. నీ పవిత్రభవనాలు, చారిత్రక కట్టడాలు, మస్జిదెనబవీ మనోహరదృశ్యాలు నా మదిలో శాశ్వతంగా ఉండిపోయేలా చేయమని నీ ప్రభువును ప్రార్థించవా" అని అర్థింపు ముఖంతో ఓసారి కిటికీ గుండా వెనుక వైపు చూశాను.

ఆ తరువాత క్రుంగిన హృదయంతో ముందు వైపు చూశాను. ఎటు చూసినా కొండలు, ఇసుకతిన్నెలే కన్పిస్తున్నాయి. "చూడు చూడు, తనివితీరా చూడు" అని మనసు మారాము చేస్తుంటే, కళ్ళు క్షణక్షణానికి క్రుంగిపోతూ కాస్సేపటికి మూతలు పడ్డాయి. ఆ పరిస్థితిలో ఎన్ని గంటలు గడిచాయో కాని, బస్సు ఒక చోటికి చేరి మూగబోయింది. లయబద్ధమైన ఇంజన్ సౌండ్ ఒక్కసారిగా ఆగిపోవడంతో నేను కళ్ళు తెరిచి చేతి గడియారం చూసుకున్నాను. టైం నాలుగున్నర అయింది. హాజీలు బస్సు దిగసాగారు. కాస్సేపటికి మేము ముగ్గురం కూడా బస్సు దిగాం.

ఆ ప్రదేశంలో ఒక మసీదు ఉంది. హాజీలలో కొందరు మూత్రశాలలకు పరుగెత్తితే మరికొందరు ఉజూశాలల వైపుకు నడిచారు. మేమా మసీదులో ఫజర్ నమాజ్ చేసి, కాస్సేపు అటూఇటూ తిరిగి బస్సెక్కాము. మా బస్సు రోడ్డునపడి మళ్ళీ వేగం పుంజుకుంది. కొండలను గుట్టలను వెనక్కి నెట్టుతూ, చీకటి తెరలను చీల్చు కుంటూ బస్సు పరుగులు పెడుతోంది. కాస్సేపటికి బాలభాస్కరుడు తన బంగారు కిరణాలతో మాకు స్వాగతం చెబుతూ మక్కా నగరంలోకి దారి చూపాడు.

మాబస్సు మేము నిరీక్షిస్తున్న పుణ్యభూభాగంలోకి దూసుకుపోయింది. మేము 'లబ్బైక్' అంటూ ఇబ్రాహీం ప్రవక్త (అలై) పునాదులేసిన పవిత్రనగరిలో ప్రవేశించాం. మా బస్సు మా ముఅల్లిమ్ ఇంటి దగ్గరకు చేరిఆగింది. కాస్సేపటికి ముఅల్లిమ్ మనుషులొచ్చి మాకందరికీ ఆహారపొట్లాలు అందజేశాడు. ఒకతను మా పాస్‌పోర్టులు, వీసాలు ఇచ్చి చెక్ చేయించుకొని, మా పేర్లన్నీ ధృవపరచుకొని వాపసుతీసుకున్నాడు.

ఆ తర్వాత మాబస్సు అక్కడ్నుంచి కదలి అనేక రోడ్లు, సొరంగాలు సర్వే చేస్తూ పరుగులు పెట్టసాగింది. గంటన్నర గడచినా గమ్యస్థానానికి చేరుకోలేకపోయింది. డ్రైవర్‌కు మాకు కేటాయించిన లాడ్జీ అడ్రసు సరిగ్గా తెలియక తికమక పడుతూ ఎట్టకేలకు అక్కడికి చేర్చగలిగాడు మా బస్సును. మేము బస్సు దిగి (16-12-05) ఉదయం 10 గంటలకు మాలాడ్జీలో ప్రవేశించాం దైవానికి కృతజ్ఞతలు చెబుతూ.

ఇక్కడ మాకు నాలుగు పడకల గది కేటాయించారు. అంచేత ఇందులో మా ముగ్గురితోపాటు మరోహాజీకి కూడా చోటిచ్చారు. మరుసటిరోజు ముఅల్లిమ్ మనిషి వచ్చి మాకు మెళ్లో వేసుకునే, చేతికి కట్టుకునే రెండు రకాల 'గుర్తింపుకార్డులు' ఇచ్చాడు. మేము ముగ్గురం సామాను సర్దిపెట్టుకొని, కాలకృత్యాలు ముగించుకొని జుహర్‌నమాజు కోసం ప్రతిష్ఠాలయమైన "కాబా"కు బయలుదేరాం. జీవితంలో మొదటిసారి కాబా దర్శనభాగ్యం లభించబోతున్నందుకు హృదయం ఆనందాతిశయంతో పులకరించింది; దైవసన్నిధిలో కృతజ్ఞతా కుసుమాలు వెదజల్లింది;

# 37. ఇబ్రాహీం ప్రవక్త (అలై) జీవితచరిత్ర

ఇది ఇబ్రాహీం ప్రవక్త (అలైహి) పునాది వేసిన పవిత్ర స్థలం; విభిన్న కాలాలలో పునర్నిర్మించబడుతూ మహా నగరంగా వెలసిన ఏకైక పుణ్యక్షేత్రం. క్రీ.శ. 4000 సంవత్సరాల క్రితం చెట్లు, చామలులేని భయంకరమైన ఈ నిర్జన ప్రదేశం లక్షలాది భక్తులకు అంతర్జాతీ ఆరాధనా కేంద్రంగా విరాజిల్లేలా హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) దీనికి ఇంతటి వైభవం ఎలా కలగజేశారు? ఆ మహనీయుడు చేపట్టిన మిషన్ లక్ష్యం ఏమిటీ? సమాధానాలు దివ్యఖుర్‌ఆన్ మాటల్లో వినండి:

"ఇబ్రాహీం (యావత్ సమాజానికి) గొప్ప నాయకుడు. దేవుని పట్ల పూర్తి విధేయతతో కూడిన అంకితభావం గల భక్తుడు. అతను ఏనాడూ దైవేతరశక్తుల్ని ఆరాధించినవాడు కాదు. అదీగాక దేవుడు చేసిన మహోపకారాల పట్ల ఆయనకు సదా కృతజ్ఞుడయి ఉండేవాడు. (అంచేత) దేవుడు అతడ్ని ప్రత్యేకంగా ఎన్నుకొని రుజుమార్గం చూపాడు. పైగా ప్రపంచంలో అతనికి మంచిని ప్రసాదించాడు. పరలోకంలో అతను తప్పకుండా సజ్జనులలో పరిగణించబడతాడు." (16:120-122)

## సందేశప్రచారం, జాతివైముఖ్యం

"ఇబ్రాహీం తనతండ్రి ఆజర్‌తో అన్న మాటలు గుర్తుకుతెచ్చుకో. అతను తన తండ్రితో 'ఏమిటీ, మీరు విగ్రహాలను దేవుళ్లుగా చేసుకున్నారు? మీరు, మీజాతి ప్రజలు పూర్తిగా అపమార్గంలో పడిపోయారు' అని అన్నాడు. ఇబ్రాహీం నమ్మేవారిలో చేరడానికి మేమతనికి ఈవిధంగా భూమ్యాకాశాల సామ్రాజ్యవ్యవస్థను చూపించాము:" (6:74,75)

"ఒకరోజు అతనిపై చీకటి కమ్ముకోగానే అతనొక నక్షత్రం చూసి 'ఇతను నా ప్రభువు' అన్నాడు. కాని ఆ నక్షత్రం అస్తమించగానే 'అస్తమించేవాటిని నేను ప్రేమించను' అన్నాడు. తర్వాత చంద్రుడు ప్రకాశిస్తూ కన్పించగానే ఇతనే నాప్రభువు' అన్నాడు. కాని



ఆ చంద్రుడు కూడా అస్తమించడంతో '(ఇతనూ నా ప్రభువు కాలేదు) నాప్రభువు నాకు మార్గం చూపకపోతే నేను మార్గభ్రష్టుణ్ణయిపోతాను' అన్నాడు." (6:76-77)

ఆ తర్వాత (మరునాడుదయం) సూర్యుడు దేదీప్యమానంగా వెలిగిపోతూ కన్పించాడు, అప్పుడు ఇబ్రాహీం 'ఇతనే నా ప్రభువు, అందరి కంటే గొప్ప ప్రభువు' అన్నాడు. అయితే సూర్యుడు కూడా అస్తమించిపోవడంతో (అతనికి జ్ఞానోదయం అయింది.) అతను తన జాతి ప్రజల్ని ఉద్దేశించి ఇలా అన్నాడు: 'నాజాతి సోదరులారా! మీరు దేవునికి సాటికల్పిస్తున్న మిథ్యాదైవాలతో నేను విసిగిపోయాను. నేనిప్పుడు పూర్తి ఏకాగ్రతతో భూమ్యాకాశాల్ని సృష్టించినవాని వైపు మరలాను. నేను ఏమాత్రం బహుదైవారాధకుడ్ని కాను." (6:78,79)

"వాస్తవానికి దేవుడ్ని వదలి మీరు పూజిస్తున్న ఈవిగ్రహాలు మీకు ఎలాంటి ఉపాధి ఇవ్వలేవు. కనుక మీరు దేవుని సన్నిధిలో ఉపాధిని గురించి అర్థించండి. ఆయన్నే ఆరాధించండి, ఆయనకే కృతజ్ఞతలు తెలుపుకోండి. చివరికి మీరు ఆయన సన్నిధికే పోవలసిఉంది. మీరు నామాటలు తిరస్కరిస్తే (నాకొచ్చే నష్టమేమీ లేదు.) మీకు పూర్వం కూడా అనేక జాతులు తిరస్కరించాయి. (దైవ)సందేశాన్ని స్పష్టంగా అందజేయడం తప్ప దైవప్రవక్తపై మరెలాంటి బాధ్యత లేదు." (29:16-18)

"ఈ విషయంలో ఇబ్రాహీంజాతి ప్రజలు అతనితో వాదనకు దిగారు. అప్పుడతను ఇలా అన్నాడు: 'ఏమిటీ, మీరు దేవుని విషయంలో నాతో వాదనకు దిగారు? అసలు ఆయనే కదా నాకు రుజుమార్గం చూపింది. ఏమైనా మీరు దేవునికి సాటికల్పించిన మిథ్యాదైవాలకు నేను భయపడను. ఏదైనా నాప్రభువు తలచుకుంటేనే జరుగుతుంది. నా ప్రభువు జ్ఞానం ప్రతిదాన్నీ పరివేష్ఠించి ఉంది. మీరు ఇప్పుడైనా స్పృహలోకి వస్తారా?"

"బహుదైవారాధన గురించి మీవద్దకు దేవుడు ఎలాంటి ప్రమాణం పంపకపోయినా, మీరు ఆయన దైవత్వంలో ఇతరుల్ని భాగస్వాములు చేశారు. అలాంటి పని చేసి కూడా మీరు దేవునికి భయపడనప్పుడు, మీ కల్పితదైవాలకు నేనెందుకు భయపడాలి? మన ఉభయుల్లో నిర్భయం, నిశ్చింతలకు ఎవరెక్కువ అర్హులో మీరే చెప్పండి తెలిస్తే. సత్యాన్ని విశ్వసించి, అందులో బహుదైవారాధనా భావానికి ఏమాత్రం ఆస్కారం ఇవ్వనివారికే శాంతి, స్థిమితాలు లభిస్తాయి. అలాంటివారే సన్మార్గంలో ఉంటారు" (6:80-82)

"అతను తన తండ్రిని, తన జాతిని "మీరు దేన్ని పూజిస్తున్నారు?' అని అడిగాడు. దానికి వారు 'మేము విగ్రహాల్ని పూజిస్తున్నాం. ఎల్లప్పుడూ వీటి ఆరాధనలోనే ఉంటాం' అన్నారు. 'అయితే మీరు ప్రార్థిస్తున్నప్పుడు ఇవి మీప్రార్థనల్ని ఏమైనా ఆలకిస్తాయా? లేక ఇవి మీకేమైనా లాభంగాని, నష్టంగాని కలిగిస్తాయా?' అడిగాడు ఇబ్రాహీం. అందుకు వారు 'లేదు, మా తాతముత్తాతలు ఇలా చేస్తుంటే చూశాం' అన్నారు." (26:70-74)

"మీరు, పూర్వం మీ తాతముత్తాతలు పూజించే ఈ వస్తువులేమిటో ఎప్పుడైనా ఆలోచించారా? ఒక్క విశ్వ ప్రభువు తప్ప ఇవన్నీ నాకు శత్రువులు. నన్ను విశ్వప్రభువు

సృష్టించాడు. ఆయనే నాకు (రుజు)మార్గం చూపించాడు. నాకు ఆహారపానీయాలు కూడా ఆయనే ప్రసాదిస్తున్నాడు. నేను జబ్బుపడితే స్వస్థత చేకూర్చేవాడు కూడా ఆయనే. నాకు మరణం కలిగించేవాడు, (పరలోకంలో) నన్ను పునర్జీవింపజేసేవాడు కూడా ఆ ప్రభువే. ఆయన తీర్పుదినాన నా పాపాలు క్షమిస్తాడని నేను ఆశిస్తున్నాను' అన్నాడు ఇబ్రాహీం." (26:75-82)

"(ఆ తర్వాత అతనిలా ప్రార్థించాడు:) "ప్రభూ! నాకు విద్యావివేకాలు ప్రసాదించు. నన్ను సజ్జనులలో చేర్చు. భావితరాలలో నాకు సత్కీర్తి ప్రసాదించు. మహాభాగ్యాలతో నిండిన స్వర్గానికి వారసులయ్యేవారి జాబితాలో నన్ను చేర్చు. (ప్రభూ!) నాతండ్రిని క్షమించు. ఆయన దారితప్పి ఉన్నాడు. మానవులు మళ్ళీబ్రతికించి లేపబడేరోజున నన్ను నవ్వులపాలు చేయకు. ఆరోజు సంతానం, సిరిసంపదలు ఏమాత్రం ఉపయోగపడవు. నిష్కల్మషమైన హృదయంతో దేవుని సన్నిధికి వచ్చినవారికే ఆరోజు ప్రయోజనం ఉంటుంది." (26:83-88)

## గ్రహణం పట్టిన విగ్రహాలు

"అతను తన తండ్రిని, తనజాతి ప్రజల్ని ఉపదేశిస్తూ 'మీరంతగా అభిమానిస్తున్న ఈ విగ్రహాల సంగతేమిటీ?' అని అడిగాడు." (21:51,52)

"మా తాతముత్తాతలు వీటిని పూజిస్తుండేవారు. అందువల్ల మేము కూడా వీటిని పూజిస్తున్నాము' అన్నారు వారు. "అయితే మీరు దారి తప్పారు; మీ తాతముత్తాతలు అంతకన్నా ఘోరంగా దారి తప్పారు' అన్నాడు ఇబ్రాహీం." (21:53,54)

"నువ్వు మా ముందు నీ అసలు భావాలు వ్యక్తపరుస్తున్నావా లేక పరిహాస మాడుతున్నావా?' అడిగారు వారు. "(పరిహాసం) కాదు, నిజంగానే (చెబుతున్నాను). భూమ్యాకాశాల ప్రభువే మీ ప్రభువు. ఆయనే వాటిని సృష్టించాడు. అందుకు నేను మీ ముందు సాక్ష్యం ఇస్తున్నాను. దైవసాక్షి! మీరు లేనప్పుడు నేను తప్పకుండా మీ విగ్రహాల సంగతేమిటో తేల్చుకుంటాను' అన్నాడతను." (21:55-57)

"ఇబ్రాహీం కూడా నూహ్ మార్గాన్నే అనుసరించేవాడు. అతను తన ప్రభువు సన్నిధికి నిష్కల్మషమైన హృదయంతో వచ్చాడు. తన తండ్రిని, తన జాతి ప్రజలను ఉద్దేశించి 'మీరు పూజిస్తున్న ఈ వస్తువులేమిటి? మీరు (నిజ)దేవుణ్ని వదలి స్వయంకృత దైవాలను ఇష్టపడుతున్నారా? మరి సర్వలోక ప్రభువు, పోషకుడైన దేవుని గురించి మీరేమను కుంటున్నారు?' అని అడిగాడు." (37:83-87)

(దీనికి వారిదగ్గర ఎలాంటి సమాధానం లేదు. తరువాత కొన్నాళ్ళకు ఉర్‌పట్నం బయట పెద్ద జాతర మొదలయింది. స్త్రీలు, పురుషులు, పిల్లలు ఆబాలగోపాల మంతా ఆ జాతరలో పాల్గొనడానికి వెళ్ళారు. వారిలో కొందరు జాతరకు వెళ్తూ "మేమంతా జాతరకు వెళ్తున్నాం, నువ్వు రావా జాతరలో పాల్గొనడానికి?" అనఅడిగారు హజ్రత్ ఇబ్రాహీం-అలైహిని.)



"అప్పుడతను (ఆకాశంలోని) నక్షత్రాల వైపు చూసి 'నాకు వంట్లో బాగా లేదు' అన్నాడు. అందువల్ల వారతడ్ని వదలి (జాతరలో పాల్గొనడానికి) వెళ్ళిపోయారు."

"వారలా వెళ్ళిపోగానే ఇబ్రాహీం వారి దేవతల గుళ్ళోకి జొరబడి 'మీరు (ఈ ప్రసాదం) తినరేమిటీ? ఏమయింది మీకు కనీసం మాట్లాడనయినా మాట్లాడరు?' అని అన్నాడు. (37:88-92)

ఆతర్వాత అతను (అన్నట్లే వారు జాతరకు పోయారో లేదో) ఆ విగ్రహాలను తునా తునకలుగా విరగ్గొట్టాడు. వాటిలో పెద్ద విగ్రహాన్ని మాత్రం వదలిపెట్టాడు, వారు (విచారించడానికి తనవైపు) మరలుతారన్న ఉద్దేశ్యంతో." (21:58)

"జనం (జాతర నుంచి తిరిగొచ్చి చూసి) 'మన దైవాలకు ఈదుస్థితి కలిగించింది ఎవరో, చూస్తే పరమదుర్మార్గుడిలా ఉన్నాడు' అన్నారు. 'మేము ఇబ్రాహీం అనే యువకుడు వాటినిగురించి ప్రస్తావిస్తుంటే విన్నాం' అన్నారు (కొందరు)." (21:59,60)

"అయితే అతడ్ని పట్టి తీసుకురండి జనం ముందుకు, అందరూ (అతని సంగతి) చూస్తారు' అన్నారు వారు. (ఇబ్రాహీం వచ్చాక) 'ఇబ్రాహీం! నువ్వేనా మా దేవతల పట్ల ఇలా ప్రవర్తించింది?' అని అడిగారు వారు. 'అసలు ఇదంతా వాటి నాయకుడే చేసి ఉంటాడు, అడిగి చూడండి మాట్లడితే' అన్నాడు ఇబ్రాహీం." (21:61-63)

"ఈమాట వినగానే వారు (తెల్లబోయి ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు.) తమ అంతరాత్మల వైపుకు మరలి 'నిజంగా మనం చాలాదుర్మార్గులం' అనుకున్నారు స్వగతంలో. 'అయితే ఆతర్వాత వారి బుద్ధి వక్రీకరించింది. అంచేత '(ఏవిటయ్యా నువ్వనేది! ఇవి మాట్లాడలేవని నీకు తెలుసు కదా?' అన్నారు వారు." (21:64,65)

"మరైతే మీరు (మాట్లాడలేని ఈ విగ్రహాల్ని), (నిజ)దేవుణ్ని వదలి మీకెలాంటి లాభంగాని, నష్టంగాని కలిగించలేని ఈ మిథ్యాదైవాలను ఎందుకు పూజిస్తున్నారు? ఛీ! దేవుణ్ని వదలిమీరు పూజిస్తున్న మీమిథ్యాదైవాలు పాడుగాను!! మీకు కాస్తయినా బుద్ధీ, జ్ఞానం లేదా?' అన్నాడు ఇబ్రాహీం (వారిని దెప్పిపొడుస్తూ)." (21:66,67)

(దీనికి ఆ మూర్ఖులు అవాక్కయిపోయారు. కాని ఉక్రోషం పట్టలేక దూషిస్తూ అక్కడ్నుంచి వెళ్ళిపోయారు.)

## అగ్నిపరీక్ష

"ఇబ్రాహీం అనే యువకుడు మన విగ్రహాలు ధ్వంసంచేశాడట!" ఉర్‌పట్నంలో ఈవార్త అట్టుడికిపోయింది. జనం కోపోద్రేకాలతో ఇబ్రాహీం మీద కారాలు,మిరియాలు నూరసాగారు. కొందరు పెద్దలు ఇబ్రాహీంపై రాజుకు ఫిర్యాదుచేశారు. తక్షణమే రక్షక భటులు రంగంలోకి దిగి ఇబ్రాహీంని అరెస్టుచేసి రాజు ఆస్థానంలో ప్రవేశపెట్టారు.

ఆస్థానం ఆలయ ధర్మకర్తలు, పూజారులు, రాజోద్యోగులతో నిండిపోయింది. ఇరాఖ్ నియంత నమ్రూద్ రత్నఖచిత సింహాసనంపై ఠీవిగా కూర్చున్నాడు. అతని

ముందు దైవప్రవక్త హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) ముద్దాయిగా నిల్చున్నారు.

"ఇబ్రాహీం! ఇరాఖ్ ప్రజలంతా నన్నే ప్రభువుగా కొలుస్తుంటే, నువ్వు నన్ను కాదని మరొకడ్ని ప్రభువుగా చేసుకున్నావటగా! ఎవరు నీ ప్రభువు?" అడిగాడు చక్రవర్తి నమ్రూద్ గంభీర స్వరంతో.

"ఎవరి అధీనంలో జీవన్మరణాలున్నాయో ఆయనే నా ప్రభువు' అన్నాడు ఇబ్రాహీం (నిర్భయంగా)." (ఖుర్ఆన్–2:258)

"చావు బ్రతుకులు నా అధీనంలో కూడా ఉన్నాయి. (నేను కోరిన మనిషిని హత మారుస్తాను, కోరిన మనిషిని జీవింపజేస్తాను' అన్నాడతను." (ఖుర్ఆన్–2:258)

"అయితే దేవుడు సూర్యుడ్ని తూర్పునుండి ఉదయింపజేస్తున్నాడు కదా, నీవు కాస్త అతడ్ని పడమర నుండి ఉదయింపజెయ్యి చూద్దాం' అన్నాడు ఇబ్రాహీం." (2:258)

"దానికి ఆ దైవతిరస్కారి సమాధానం ఇవ్వలేక తెల్లమొహం వేశాడు. దేవుడు దుర్మార్గులకు ఎన్నటికీ సన్మార్గం చూపడు." (ఖుర్ఆన్–2:258)

"మీరేదైనా చేయాలనుకుంటే ఇతడ్ని కాల్చివేయండి, మీ దేవతలను కాపాడుకోండి' అన్నారు (అతని ఆస్థానంలో పనిచేసే) వారు." 21:68) "అప్పుడు వారు పరస్పరం సంప్రదించుకొని 'అతనికోసం ఓ అగ్నిగుండం తయారుచేసి, భగభగమండే ఆ అగ్నిగుండంలో అతడ్ని విసిరిపడేద్దాం' అని నిర్ణయించుకున్నారు." (ఖుర్ఆన్–37:97)

"సరే, ఇతడ్ని తీసికెళ్ళి అగ్నిగుండంలో విసిరి పడేయండి" ఆజ్ఞాపించాడు నమ్రూద్ చక్రవర్తి సింహాసనం నుండి లేస్తూ.

వెంటనే రాజభటులు రంగంలోకి దిగి ఓ పెద్ద గుంట తవ్వారు. అందులో పెద్ద ఎత్తున కలపదుంగలు తెచ్చి పడవేశారు. తరువాత ఓ పదిమంది భటులు కాకడాలు తెచ్చి దానికి నిప్పంటించారు. క్షణాల్లో అగ్నిజ్వాలలు ఆకాశాన్ని తాకాయి. ఆ తరువాత మరికొందరు భటులు హజ్రత్ ఇబ్రాహీం (అలైహి)ని అక్కడికి ఈడ్చుకొచ్చారు. శిక్ష ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. చక్రవర్తి కళ్ళు చించుకొని మరీ చూడసాగాడు.

రాజభటులు హజ్రత్ ఇబ్రాహీం (అలైహి)ని వడిసెలవంటి ఒక సాధనంలో కూర్చోబెట్టి భయంకరమైన ఆ అగ్నిగుండంలోకి విసిరి పడేశారు. అంతే- చిటికలో ఆయన కాలి బూడిదయి పోతాడనుకున్నారు అందరూ. కాని-

ఆశ్చర్యం! అత్యంతాశ్చర్యం!! హజ్రత్ ఇబ్రాహీం (అలైహి)ని ఆ అగ్నిమంటలు ఏ మాత్రం కాల్చలేదు. కనీసం ఆ మహనీయుడి బట్టలు కూడా అంటుకోలేదు. ఆయన అగ్నిగుండం నుంచి నడుచుకుంటూ నిక్షేపంగా బయటికి వచ్చారు.

"మేము 'అగ్నీ! ఇబ్రాహీం కోసం శాంతించు, చల్లబడిపో' అని ఆదేశించాము. వారు ఇబ్రాహీంకు కీడు చేయజూశారు. అయితే మేము వారి దుష్టయత్నాన్ని తిప్పి కొట్టాము." (ఖుర్ఆన్–21:69,70)



అంతటి గొప్ప మహిమ చూసినా చక్రవర్తికి కనివిప్పు కలగలేదు. అతను దేవుడ్ని, ఆయన ప్రవక్తను విశ్వసించలేదు. పైపెచ్చు ఆ దుర్మార్గుడు ఇబ్రాహీం (అలైహి)పై పగబూని ప్రతీకారం తీర్చుకోవడానికి ఇతరమార్గాలు అన్వేషించడం ప్రారంభించాడు.

అనాదికాలం నుండీ బహుదైవారాధకులు దైవత్వాన్ని రెండుభాగాలుగా విభజిస్తూ వచ్చారు. మొదటిది, ప్రకృతిశక్తులపై అధికారం చెలాయించడానికి సంబంధించిన "అసాధారణ దైవత్వం" (Super Natural Divinity). మానవుడు ఈ భాగపు దైవత్వంలో దైవదూతలను, భూతాలను, విగ్రహాలను, ప్రకృతి శక్తులను దేవునికి సహవర్తులుగా చేసి పూజిస్తూ, తన కష్టనష్టాలను గురించి వాటినే వేడుకుంటాడు.

రెండవది- సామాజిక, సాంస్కృతిక, రాజకీయ వ్యవహారాలకు సంబంధించిన దైవత్వం. అంటే జీవిత శాసనాల నిర్ణయం, సామాజిక వ్యవస్థను రూపొందించడం మొదలైన ప్రపంచ వ్యవహారాలకు సంబంధించిన అధికారాన్ని దేవుని దైవత్వం నుంచి తొలగించి, దాన్ని రాజ్యాధినేతలకు, మతపెద్దలకు, సంఘనాయకులకు హస్తగతం చేయబడుతుంది. అందువల్లనే రాజవంశీయులు రెండవ కోవకు చెందిన దైవత్వాన్ని తమ జన్మహక్కుగా భావించి, దాన్ని మరింత పటిష్ఠపరచుకోవడానికి మొదటి కోవకు చెందిన దేవతల సంతానంగా, దైవాంశసంభూతులుగా చెప్పుకుంటారు.

ఉదాహరణకు, పూర్వం బ్రిటిష్చక్రవర్తులు తమల్నితాము దైవాంశ సంభూతులుగా చెప్పుకునేవారు. స్వయంగా మన దేశంలోనూ సూర్యవంశపు రాజులు, చంద్ర వంశపు రాజులు అని ఉండేవారు.

ఇక్కడ ఇరాఖ్చక్రవర్తి కూడా అంతే. అతనసలు దేవుని ఉనికిని తిరస్కరించ లేదు. భూమ్యాకాశాలను తానే సృష్టించానని, విశ్వంలోని ప్రకృతిశక్తులపై తన పెత్తనమే ఉందని కూడా చెప్పుకోలేదు. అతని వాదనల్లా ఒక్కటే- "తాను చెప్పిందే శాసనం, తన ఆజ్ఞలకు తిరుగులేదు." ఈభావనతో అతను తన రాజ్యంలో తన సార్వభౌమత్వాన్ని అంగీకరించని ప్రతి పౌరుడూ రాజద్రోహి అని మాత్రమే వాదిస్తాడు.

అంచేత హజ్రత్ ఇబ్రాహీం "ఈవిశ్వాన్ని సృష్టించి దానిపై అధికారం చెలాయించే దేవుడే నా ప్రభువు, ఆరాధ్యనీయుడు. ఆయన తప్ప ఇతరుల దైవత్వాన్ని, సార్వభౌమత్వాన్ని నేను తిరస్కరిస్తున్నాన"ని అన్నప్పుడు, దాని ప్రభావం తాతముత్తాతల నాటి ఆచారాలు, విగ్రహాలపైన్నే గాక తన దేశం, అధికార పీఠంపై కూడా పడుతుందని నమ్రూద్ భయపడ్డాడు. అందుకే అతను దైవప్రవక్తకు పరమ శత్రువయ్యాడు.

రాజ్యాధికారాన్ని గుప్పెట్లో పెట్టుకొని విశృంఖల జీవితం గడిపేవారు ప్రతి యుగంలోనూ ఇలా సమగ్ర జీవనవ్యవస్థ అయిన ఇస్లాం నుంచి రాజకీయరంగాన్ని వేరుచేస్తూ వచ్చారు. ఈ రోజుల్లో కూడా 'మతం వేరు, రాజకీయం వేరు' అనే మాటను వింటున్నాం అంటే కారణం అదే. అందుకే ఆనాడైనా, ఈనాడైనా ఏ రాజ్యాధినేతైనా సృష్టికర్తే మన జీవిత శాసనకర్త అంటే భుజాలు తడుముకొని భగ్గుమంటాడు.

## తండ్రితో వైరం

“(ఇబ్రాహీం తన తండ్రికి హితోపదేశం చేస్తూ) ‘నాన్నా! మీరు వినలేని, చూడలేని వాటిని పూజిస్తున్నారేమిటీ? అవి మీకు ఏవిధంగాను తోడ్పడలేవుకదా? నాన్నా! మీదగ్గర లేనటువంటి (దివ్య)జ్ఞానం నా దగ్గరుంది. కనుక మీరు నన్ను అనుసరించండి, నేను మీకు రుజుమార్గం చూపుతాను. నాన్నా! మీరు షైతాన్‌ని ఆరాధించకండి. షైతాన్ కరుణామయుడ్ని తిరస్కరించిన అహంకారి. నాన్నా! (మీ ధోరణి చూస్తుంటే) మీరు కరుణామయుని శిక్షకు గురయి, ఆతర్వాత షైతాన్‌కు సహచరులై పోతారేమోనని నాకు భయంగా ఉంది’ అని అన్నాడు.” (ఖుర్‌ఆన్–19:41–45)

“దానికి తండ్రి (మండిపడుతూ) ‘ఇబ్రాహీం! నీవు మన దేవతలకు విముఖుడయి పోయావా? నీ వైఖరి గనక మార్చుకోకపోతే నేను నిన్ను రాళ్ళతో కొట్టి చంపేస్తాను. (వెళ్ళిపో) నానుండి శాశ్వతంగా వేరయిపో’ అన్నాడు.” (ఖుర్‌ఆన్–19:46)

“మీకు శాంతి కలుగుగాక! మిమ్మల్ని క్షమించమని నేను నా ప్రభువును ప్రార్థిస్తాను. ఆయన నా పట్ల అమిత దయగలవాడు. నేను మిమ్మల్ని, దేవుడ్ని కాదని మీరు ప్రార్థిస్తున్న మీ దైవాల్ని వదలి వెళ్తున్నాను. నేను మాత్రం నాప్రభువునే ప్రార్థిస్తాను. నాప్రభువుని ప్రార్థించి నేను వైఫల్యం చెందనని ఆశిస్తున్నాను’ అన్నాడు ఇబ్రహీం.” (ఖుర్‌ఆన్–19:47,48)

“తరువాత ఇబ్రాహీం అతడ్ని అసహ్యించుకున్నాడు. ఇబ్రాహీం ఎంతో దయార్ద్ర హృదయుడు, సహనశీలి, సాధుస్వభావి.” (ఖుర్‌ఆన్–9:114)

“ఇబ్రాహీం (ప్రజలను ఉద్దేశించి) ‘నేను నాప్రభువు (ఆదేశం) వైపు (వలస)వెళ్తున్నాను. ఆయనే నాకు మార్గదర్శనం చేస్తాడు’ అన్నాడు. (ఆ సందర్భంలో) ‘ప్రభూ! నాకొక సద్గుణ సంపన్నుడైన కుమారుడ్ని ప్రసాదించు’ అని దేవుడ్ని వేడుకున్నాడు. మేమతనికి సహనశీలుడైన ఒక పిల్లవాడు కలుగుతాడని శుభవార్త అందజేశాము.” (ఖుర్‌ఆన్–37:99–101)

## విశ్వనాయకత్వం, పునర్జీవన పరీక్ష

దేవుడు ఇబ్రాహీం ప్రవక్తను యావత్తు మానవులకు నాయకుడిగా చేశాడు. అందుకే ఈనాడు ముస్లింలే కాకుండా యూదులు, క్రైస్తవులు కూడా ఆయన్ని విశ్వస్తున్నారు.

“ఇబ్రాహీంప్రభువు కొన్ని విషయాల్లో ఇబ్రాహీంని పరీక్షించగా అందులో అతను కృతార్థుడయ్యాడు. అప్పుడు దేవుడు అతనితో ‘నేను నిన్ను యావత్తు మానవజాతికి నాయకుడిగా నియమించబోతున్నాను’ అన్నాడు.”

“అప్పుడతను ‘ప్రభూ! మరి నా సంతానంలో కూడా (ఎవరికైనా ప్రపంచ నాయకత్వం ప్రసాదిస్తావా)?’ అని అడిగాడు. దానికి దేవుడు ‘మాఈ వాగ్దానం దుర్మార్గులకు వర్తించదు’ అన్నాడు.” (ఖుర్‌ఆన్–2:124)

“మరోసంఘటన. అప్పుడు ఇబ్రాహీం ‘ప్రభూ! నీవు మృతుల్ని ఎలా బ్రతికిస్తావో ఓసారి నాకు చూపు’అన్నాడు.’ దానికి దేవుడు ‘నీకు (మామీద) నమ్మకంలేదా?’ అనడిగాడు.



“ఎందుకు లేదూ, ఉంది. కాని నా మనోతృప్తి కోసం అడుగుతున్నాను’ అన్నాడు ఇబ్రాహీం.’ అయితే నాలుగు పక్షుల్ని తీసుకొని వాటిని మచ్చిక చేసుకో. తర్వాత (వాటిని కోసి) వాటిభాగాలు ఒక్కోదాన్ని ఒక్కో కొండపై ఉంచి వాటిని పిలువు. వెంటనే అవి ఎగిరి నీ దగ్గరకు వచ్చేస్తాయి. (ఆసందర్భంగా) దేవుడు సర్వశక్తిమంతుడు, అత్యంత వివేచనా పరుడన్న విషయం బాగా గుర్తుంచుకో’ అన్నాడు దేవుడు.” (ఖుర్‌ఆన్–2:260)

## దైవదూతలు, సంతాన శుభవార్త

“ఇబ్రాహీం దగ్గరకు మా దూతలు శుభవార్త తీసికెళ్ళి ‘మీకు శాంతీశ్రేయాలు కలుగుగాక!’ అన్నారు. దానికి ఇబ్రాహీం ‘మీక్కూడా శాంతి కలుగుగాక!’ అన్నాడు.”

“ఆ తర్వాత కాస్సేపటికి ఇబ్రాహీం ఒక ఆవుదూడను కాల్చి తెచ్చాడు. కాని వారి చేతులు భోజనం మీదికి పోవడంలేదు. దాంతో అనుమానం కలిగి అతను లోలోన భయపడసాగాడు. అప్పుడు వారు ‘భయపడకు. మేము లూత్‌జాతి వైపుకు పంపబడ్డాము’ అన్నారు.” (ఖుర్‌ఆన్–11:69,70)

“తరువాత ‘నీకు (త్వరలోనే) బుద్ధికుశలతగల కొడుకు పుడ్తాడని మేము శుభవార్త అందజేస్తున్నాము’ అన్నారు వారు.” (ఖుర్‌ఆన్–15:53)

“ఏమిటీ! ఈ ముసలితనంలో నాకు పిల్లలు పుడ్తారని శుభవార్త విన్పిస్తున్నారా మీరు!! కాస్త ఆలోచించండి, ఎలాంటి వార్త విన్పిస్తున్నారో నాకు మీరు’ అన్నాడు ఇబ్రాహీం.” (ఖుర్‌ఆన్–15:54)

“మేము నీకు సత్యంతో కూడిన శుభవార్తే విన్పిస్తున్నాము. నీవు (అనవసరంగా) నిరాశచెందకు’ అన్నారు దైవదూతలు.” (ఖుర్‌ఆన్–15:55)

“మార్గభ్రష్టులే తమ ప్రభువు కారుణ్యం పట్ల నిరాశ చెందుతారు’ అన్నాడు ఇబ్రాహీం.” (ఖుర్‌ఆన్–15:56)

“అతని భార్య (సారా) ఈమాట విని అరుస్తూ వచ్చి, నెత్తీ నోరు బాదుకుంటూ ‘ముసలిదాన్ని, గొడ్రాలిని (నాకు సంతానమేమిటీ!)’ అన్నది.” (ఖుర్‌ఆన్–51:29)

“మేమామెకు ఇస్‌హాఖ్ పుట్టుక గురించి, ఇస్‌హాఖ్ తర్వాత యాఖూబ్ పుట్టుక గురించి శుభవార్త చెప్పాము. దానికి ఆమె ‘అయ్యో, నా పాడుగాను! ఈ వయస్సులోనా నాకు సంతానం? నేను పండుముసలి దాన్నయి పోయానే! నా భర్త కూడా ముసలివాడై పోయాడే!! చాలా విచిత్రంగా ఉందే!!!’ అన్నది (ఆశ్చర్యపోతూ)” – (ఖుర్‌ఆన్–11:71,72)

“దైవాజ్ఞ విని ఆశ్చర్యపోతున్నావా నీవు? ఇబ్రాహీం కుటుంబ సభ్యులారా! మీపై దేవుని కారుణ్యం, ఆయన శుభాలు ఉన్నాయి. నిస్సందేహంగా దేవుడు ఎంతో ప్రశంసనీయుడు, మహోన్నతుడు’ అన్నారు దైవదూతలు.” (ఖుర్‌ఆన్–11:73)

దీనికిపూర్వం హజ్రత్ ఇబ్రాహీంకు ఓ కొడుకు పుట్టాడు. ఆబాబు పేరే ఇస్మాయీల్. అయితే కొన్నాళ్ళకు హజ్రత్ ఇబ్రాహీం దైవాజ్ఞ ప్రకారం చంటి ఇస్మాయీల్‌ని, అతని తల్లి

హజ్రత్ హాజరా (అలైహి)ని జనవాసాలు మచ్చుకైనాలేని ఒక ఎడారి ప్రదేశంలో వదలి వెళ్ళిపోతారు. ఆ సందర్భంలో ఆయన ఈ విధంగా దేవుడ్ని ప్రార్థిస్తారు:

“ప్రభూ! నేను నాసంతానాన్ని ఎలాంటి చెట్టూ పుట్టాలేని ఎడారి ప్రాంతంలో నీ ప్రతిష్ఠాలయం దగ్గరకు తీసుకొచ్చి వశింపజేశాను. వీరు (భవిష్యత్తులో) ఇక్కడ ప్రార్థనా వ్యవస్థ నెలకొల్పుతారన్న ఆశతో నేనిలా చేశాను. కనుక వీరిపట్ల నీవు ప్రజల హృదయాల్లో ఆసక్తి అభిమానాలు కలిగించు. వీరికి తినడానికి పండ్లు ఫలాలు ప్రసాదించు, బహుశా అందుకు కృతజ్ఞులై ఉంటారు. ప్రభూ! మేము దాస్తున్నదీ, బహిర్గతం చేస్తున్నదీ అంతా నీకు తెలుసు.’ నిస్సందేహంగా దేవునికి భూమ్యాకాశాల్లో ఏదీ కనుమరుగుగా లేదు.” (ఖు–14:37,38)

“ఈ వృద్ధాప్యంలో నాకు ఇస్మాయీల్, ఇస్‌హాఖ్‌ల వంటి సంతానాన్ని ప్రసాదించిన దేవునికి కృతజ్ఞతలు. నా ప్రభువు తప్పకుండా (నా) మొరాలకిస్తాడు. ప్రభూ! నన్ను ప్రార్థనా వ్యవస్థ నెలకొల్పేవానిగా చెయ్యి. నా సంతానాన్ని కూడా. ప్రభూ! నావిజ్ఞప్తి స్వీకరించు. నా తల్లిదండ్రుల్ని, యావత్తువిశ్వాసుల్ని కర్మవిచారణ రోజు క్షమించు.” (ఖురాన్–14:39-41)

## బలిదానం, కాబానిర్మాణం

“ఆ బాలుడు అతనితోపాటు పరుగెత్తే వయస్సుకు చేరుకున్న తర్వాత (ఓరోజు) ఇబ్రాహీం అతనితో ‘బాబూ! నేను నిన్ను బలిస్తున్నట్లు కలగన్నాను. దీనిపై నీ అభిప్రాయం ఏమిటో చెప్పు’ అన్నాడు. దానికా బాలుడు (ఏమాత్రం కంగారు పడకుండా) ‘నాన్నా! మీకు దేన్ని గురించి ఆజ్ఞాపించబడిందో దాన్ని నెరవేర్చండి. దైవచిత్తమైతే మీరు నన్ను సహనశీలిగా చూస్తారు’ అన్నాడు.” (ఖుర్‌ఆన్–37:102)

“ఇలా వారిద్దరూ (మాఆజ్ఞ) శిరసావహించారు. ఆ తర్వాత ఇబ్రాహీం తన కుమారుడ్ని బోర్లాపడవేశాడు (బలివ్వడానికి). అప్పుడు మేము ‘ఇబ్రాహీం! నీవు స్వప్నాన్ని నిజపరచి చూపావు. సజ్జనులకు మేము ఇలాంటి ప్రతిఫలాన్నే ఇస్తుంటాం. నిజంగా ఇది నీకొక స్పష్టమైన పరీక్ష. (అందులో నీవు నెగ్గావు.)’ అని అన్నాం.” (ఖు–37:103-106)

“మేము పరిహారం క్రింద ఒక పెద్ద బలిదానం ఇచ్చి ఆ బాలుడ్ని కాపాడాము. అతని కీర్తిప్రతిష్ఠలను తరువాతి తరాలలో శాశ్వతంగా వదలిపెట్టాము. ఇబ్రాహీంకు శాంతి కలుగుగాక! సజ్జనులకు మేము ఇలాంటి ప్రతిఫలమే ప్రసాదిస్తాం. నిజంగా అతను విశ్వసించిన మా ప్రియదాసులలో ఒకడు.” (ఖుర్‌ఆన్–37:107,108)

“ఇబ్రాహీం, ఇస్మాయీల్ ఇద్దరూ కలసి దైవగృహానికి పునాదులు తీసి గోడలు నిర్మిస్తూ ఇలా వేడుకున్నారు: ‘ప్రభూ! మాఈ సేవ స్వీకరించు. నీవే (మొరలు) ఆలకించేవాడవు, సమస్తం తెలిసినవాడవు. ప్రభూ! మాఇద్దర్నీ నీ విశ్వసనీయ దాసులుగా చెయ్యి. మా సంతతి నుండి నీకు విధేయులయి ఉండే ఒక జాతిని ఆవిర్భవింపజేయి. నిన్ను ఆరాధించే విధానం ఏమిటో మాకు తెలియ జెయ్యి. మా పొరపాట్లు మన్నించు. నిజంగా నీవు మన్నించేవాడవు, కరుణించేవాడవు. ప్రభూ! ఆజాతి ప్రజలకు నీ సూక్తులు విన్పించే, నీ గ్రంథజ్ఞానాన్ని, వివేకాన్ని నేర్పి వారి జీవితాలను సంస్కరించే ఒక ప్రవక్తను ఆ జాతిలో పుట్టించు. నీవు



ఎంతో శక్తిమంతుడవు, వివేకవంతుడవు.” (ఖుర్‌ఆన్–2:127-129)

“ఇబ్రాహీం (మరో సందర్భంలో దేవుడ్ని) ఇలా వేడుకున్నాడు: ‘ప్రభూ! ఈ (మక్కా) నగరాన్ని శాంతి నగరంగా చెయ్యి. నన్ను, నా సంతానాన్ని విగ్రహారాధనా బారి నుండి కాపాడు. ప్రభూ! ఈ విగ్రహాలు అనేక మందిని దారితప్పించాయి. (నా సంతానాన్ని కూడా దారితప్పించే ప్రమాదం ఉంది. కనుక వారిలో) నా విధానాన్ని అనుసరించేవారు నా వారవుతారు. నా విధానానికి వ్యతిరేకంగా నడిచేవారికి (నీవే దిక్కు.) నీవు క్షమించే వాడవు, కరుణించేవాడవు.” (ఖుర్‌ఆన్–14:35,36)

“ఇబ్రాహీం దేవుడ్ని ప్రార్థిస్తూ ‘ప్రభూ! ఈ పట్టణాన్ని శాంతినగరంగా చెయ్యి. ఇక్కడ నివసించే ప్రజల్లో దైవాన్ని, పరలోకాన్ని విశ్వసించేవారికి తినేందుకు అన్ని విధాల పండ్లు-ఫలాలు ప్రసాదించు’ అని అన్నాడు.”

“దానికి దేవుడు ‘(ఈమూన్నాళ్ళ ప్రపంచంలో) నేను విశ్వసించనివారి కూడా ఎంతో కొంత ఉపాధి నిస్తాను. అయితే ఆ తర్వాత వారిని నరకాగ్ని వైపు ఈడుస్తాను. అది అత్యంత ఘోరమైన ప్రదేశం’ అని చెప్పాడు.” (ఖుర్‌ఆన్–2:126)

# 38. హజ్, ఉమ్రాల ప్రాముఖ్యం

‘హజ్’ అంటే సందర్శనా సంకల్పం అని అర్థం. షరీఅత్ పరిభాషలో హజ్ అంటే కాబాలయం చేరుకొని ప్రత్యేక నియమాలతో చేసే సమగ్ర ఆరాధన అని అర్థం. ఇది నిర్ణీత దినాలలో మాత్రమే నెరవేర్చవలసి ఉంటుంది. హజ్‌లో ముస్లింలు దైవగృహాన్ని సందర్శిస్తామని సంకల్పించుకుంటారు గనక దీన్ని హజ్ అన్నారు. ‘ఉమ్రా’ అంటే కూడా సందర్శనా సంకల్పం అనే అర్థం. షరీఅత్ పరిభాషలో ఉమ్రా అంటే చిన్న హజ్ అని అర్థం. దీనికి ఒక నిర్ణీత మాసం, తేదీ అంటూ ఏమీ లేవు. ఎప్పుడైనా చేయవచ్చు.

“మానవుల కోసం నిర్మించబడిన మొట్టమొదటి ఆరాధనాలయం మక్కాలో ఉన్నదే. అది ఎంతో శుభప్రదమైనది, యావత్ మానవాళికి మార్గదర్శకమైనది. అందులో (కళ్ళున్నవారికి) అనేక సూచనలున్నాయి. ఆ సూచనల్లో ఇబ్రాహీం (ప్రార్థనకోసం నిలబడే) చోటొకటి. అందులో (కాబాలో) ప్రవేశించే ప్రతివ్యక్తీ శాంతీ, రక్షణా పొందగలడు.” (ఖుర్‌ఆన్–3:96)

“సత్యతిరస్కారులు (ప్రజలను) దైవమార్గంలోకి రానివ్వకుండా నిరోధిస్తున్నారు. మేము ప్రజలందరి కోసం నిర్మించిన ప్రతిష్ఠాలయాన్ని సందర్శించ నీయకుండా ఆటంకాలు సృష్టిస్తున్నారు. ప్రతిష్ఠాలయంపై స్థానికులకేగాకుండా, బయట నుండి వచ్చేవారి కూడా సమాన హక్కులున్నాయి. అలాంటి దేవాలయంలో ఎవరైనా సరే నీతిమార్గం తప్పి దౌర్జన్యానికి పాల్పడితే వారికి మేము దుర్భరశిక్ష చవిచూపిస్తాం.” (ఖుర్‌ఆన్–22:25)

“అక్కడకు చేరుకోగలిగేవారు దాన్ని విధిగా సందర్శించాలి. (హజ్ చేయాలి.) ఇది ప్రజలపై దేవునికున్న హక్కు. ఈ ఆజ్ఞను శిరసావహించడానికి నిరాకరించేవాడు దేవుడు నిరపేక్షాపరుడని తెలుసుకోవాలి.” (ఖుర్‌ఆన్–3:97)

దైవప్రవక్త (స)ను కొందరు అనవసరమైన విషయాలను గురించి అడిగేవారు. ఖుర్‌ఆన్‌లో హజ్‌యాత్ర విధిగా చేయబడిందని అవతరించిన సూక్తి విని ఒకతను "ప్రతియేడూ (హజ్) విధిగా చేయాలా?" అనడిగాడు. దానికి ఆయన జవాబివ్వలేదు. అతను మళ్ళీ అడిగాడు. దానికీ జవాబివ్వలేదు. ఆ వ్యక్తి మూడోసారి అడిగినప్పుడు దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "మీధోరణి చాలా శోచనీయం. నేను గనక ఔనంటే హజ్ ప్రతి యేడూ విధి అవుతుంది. అప్పుడు మీరే దాన్ని పాటించలేక అవిధేయతకు పాల్పడతారు." (ముస్లిం)

దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "ప్రజలారా! మీ కోసం హజ్ విధిగా నిర్ణయించ బడింది. కనుక ఆ విధిని పాటించే విషయాన్ని గురించి ఆలోచించండి." (ముస్లిం)

ఒక వ్యక్తి దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి "హజ్‌ను ఏ విషయాలు విధి (ఫర్జ్)గా చేస్తున్నాయి?" అని అడిగాడు. దానికి ఆయన "దారి ఖర్చులు, వాహన ఏర్పాటు" అని సమాధానమిచ్చారు. (హదీసు)

స్తోమతఉన్న ముస్లిం జీవితకాలంలో ఒకసారి హజ్, ఉమ్రా విధులు తప్పనిసరిగా నిర్వహించాలి. హజ్ చేసేటంత డబ్బు సమకూరగానే హజ్ విధి (ఫరజ్) అవుతుంది. మున్ముందు పరిస్థితులు ఎలా ఉంటాయో చెప్పలేం. అంచేత ఆరోగ్యం, ఆర్థికస్తోమత ఉన్నప్పుడే వీలైనంత త్వరగా హజ్‌విధి నిర్వహించాలి. హజ్, ఉమ్రాల ప్రాముఖ్యం గురించి దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు:

"హజ్ చేయడానికి నిర్ణయించుకున్న మనిషి దాన్ని తొందరగా నెరవేర్చాలి. (అలా చేయకపోతే) బహుశా (వచ్చే ఏడు) అతను వ్యాధిగ్రస్తుడయినా కావచ్చు లేదా అతని వాహనం కనపడకుండా ఎటయినా పోవచ్చు. లేదా (వచ్చే ఏడు) హజ్ చేయడానికి వీలుకుదరని మరేదైనా పని తగలవచ్చు." (ఇబ్నెమాజ)

"హజ్, ఉమ్రా యాత్రలు చేసేవారు **దేవుని అతిథులు.** కనుక వారు ఏదీ వేడుకున్నా దేవుడు వారికి దాన్ని అనుగ్రహిస్తాడు. క్షమాపణ కోరుకుంటే దేవుడు వారి పాపాలను క్షమిస్తాడు." (ఇబ్నెమాజ)

"హాజీ ఎన్నటికీ పేదరికానికి గురికాలేడు." (తబ్రాని)

"దేవుని ప్రవక్త దావూద్ దేవుడ్ని ప్రార్థిస్తూ 'ప్రభూ! నీ ఆలయాన్ని దర్శించడానికి వచ్చిన నీ దాసులకు ఏం ప్రతిఫలం లభిస్తుంది?' అనడిగారు. దానికి దేవుడు 'దావూద్! వారు నా అతిథులు. నేను ప్రపంచంలో వారి పాపాలు క్షమిస్తాను. ఇది వారి హక్కు. వారు నన్ను కలుసుకున్నప్పుడు నేను వారిని మన్నిస్తాను' అని అన్నాడు." (హదీసు)

"అన్నిటికంటే శ్రేష్ఠమైన ఆచరణ విశ్వాసానికి సంబంధించి సాక్ష్యం చెప్పడం. తరువాత హిజ్రత్ (వలస), జిహాద్ (ధర్మ పోరాటం)లు. ఆ తర్వాత మబ్రూర్ హజ్, మబ్రూర్ ఉమ్రాలకు మించిన గొప్ప ఆచరణ లేదు." (ముస్నద్ అహ్మద్)



మబ్రూర్‌హజ్ లేక మబ్రూర్‌ఉమ్రా అంటే చిత్తశుద్ధితో, పూర్తి స్పృహతో, నియమ నిబంధనలతో నెరవేర్చే హజ్ లేక ఉమ్రా అని అర్థం. ప్రయాణం చేస్తున్నప్పుడు, హజ్ ఆచారాలు పాటిస్తున్నప్పుడు మనిషి ఎలాంటి పాపాలకు పాల్పడకుండా నిష్ఠతో మసలు కోవడానికి కూడా ప్రయత్నించాలి. దైవప్రవక్త (స) చేసిన ఈ హితవులు చదవండి:

"హజ్ సందర్భంలో ఎలాంటి అశ్లీల విషయాలకు పాల్పడకుండా, దేవుని అవిధే యతకు దూరంగా మసలుకుంటూ హజ్ చేసే వ్యక్తి పాపాలను దేవుడు పూర్తిగా తుడిచి పెట్టి, ఈరోజే అతను తన తల్లి గర్భం నుండి పుట్టినంత పవిత్రంగా అతడ్ని ప్రక్షాళనం చేస్తాడు" (బుఖారి, ముస్లిం)

హజ్, ఉమ్రాలు ఒకదాని తరువాత ఒకటి వరుసగా నిర్వహించండి. ఏవిధంగా కొలిమి లోహాన్ని, వెండి బంగారాలను కరగబెట్టి వాటి మాలిన్యాలను తొలగించి శుద్ధి చేస్తుందో, అదేవిధంగా హజ్, ఉమ్రాలు రెండూ దారిద్ర్యాన్ని, పాపాలను సమూలంగా తుడిచివేస్తాయి. మబ్రూర్ హజ్‌కు ప్రతిఫలం స్వర్గమే." (తిర్మిజి, నసాయి)

"ఎవరైనా హజ్ లేక ఉమ్రా చేసే ఉద్దేశంతో ఇంటి నుండి బయలుదేరి దారి లోనే చనిపోతే, దేవుడు అతని కర్మపత్రంలో హాజీకి, గాజీ (సమరయోధుడు)కి, ఉమ్రా చేసేవానికి నిర్ణయించిన పుణ్యఫలమే వ్రాస్తాడు." (హదీసు)

**స్త్రీల జిహాద్:** దేవుడు స్త్రీల కోసం జిహాద్‌ను విధి (ఫర్జ్)గా చేయలేదు. అయితే వారికోసం దేవుడు హజ్‌యాత్రను జిహాద్‌తో సమానమైన సత్కార్యంగా నిర్ణయించాడు. దీన్ని గురించి దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు:

"వృద్ధులు, బలహీనులు, మహిళలకు హజ్, ఉమ్రాల వల్ల లభించే పుణ్యఫలం జిహాద్ పుణ్యఫలంతో సమానంగా ఉంటుంది." (హదీసు)

హజ్రత్ హుసైన్ (రజి) కథనం: ఒక వ్యక్తి దైవప్రవక్త (స) దగ్గరకు వచ్చి "అయ్యా! నా శరీరం కూడా బలహీనమైనది, నా హృదయం కూడా బలహీనమైనది. (ఇలాంటి పరిస్థితిలో నేను ధర్మయుద్ధంలో ఎలా పాల్గొనాలి?)" అని అన్నాడు. దైవప్రవక్త (స) ఈ మాట విని "అయితే నీవు ఒక ముల్లు కూడా గుచ్చుకొనని ధర్మయుద్ధం (జిహాద్) చెయ్యి" అన్నారు. ఆ వ్యక్తి (ఆశ్చర్యపోతూ) "ఏమాత్రం కష్టనష్టాలు ఎదురుకాని ధర్మ యుద్ధం ఏమిటీ?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) "నీవు హజ్‌యాత్ర జరుపు" అని సమాధానమిచ్చారు. (తబ్రాని)

"ఒకతను అరఫాత్ మైదానంలో దైవప్రవక్త (స)కు చాలా దగ్గర్లో తన ఒంటె మీద కూర్చున్నాడు. కాని హఠాత్తుగా అతను ఒంటె మీద నుంచి క్రిందపడి చనిపోయాడు. అప్పుడు దైవప్రవక్త (స) అనుచరులతో మాట్లాడుతూ ఇలా అన్నారు: 'ఇతని భౌతిక కాయానికి స్నానం చేయించి, ఇహ్రాం దుస్తుల్లోనే ఇతడ్ని ఖననం చేయండి. ఇతను ప్రళయదినాన (లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్ అని) తల్బియా పఠిస్తూ లేస్తాడు. ఇతని తల మీద, ముఖం మీద ఆచ్ఛాదన లేకుండా ఉంచండి." (బుఖారి, ముస్లిం)

"ఒకతని దగ్గర హజ్ చేయడానికి కావలసిన ప్రయాణసామగ్రి, వాహనం ఉండి తద్వారా కాబా చేరుకోగల శక్తి ఉన్నప్పటికీ అతను హజ్ చేయకపోతే, అలాంటి వ్యక్తి యూదుడయి చనిపోయినా లేక క్రైస్తవుడయి చనిపోయినా ఒకటే; భేదమేమీ లేదు. ఎందుకంటే 'దైవగృహానికి చేరుకోగలిగేవారు దాన్ని విధిగా సందర్శించాలి. ఇది ప్రజలపై దేవునికున్న హక్కు' అని ఖుర్‌ఆన్‌లో ఉంది." (హదీసు)

దివ్యఖుర్‌ఆన్‌లో ఒక చోట "నమాజ్‌ని స్థాపించండి, బహుదైవారాధకులతో కలసిపోకండి" (30:31) అని ఉంది. అంటే నమాజు చేయని ముస్లింలను ఖుర్‌ఆన్ బహుదైవారాధకులతో పోల్చింది. అలాగే పై హదీసులో స్తోమత ఉన్నా హజ్ విధి నిర్వహించకుండా చనిపోయే ముస్లింలను దైవప్రవక్త (సల్లం) యూదులతో, క్రైస్తవులతో పోల్చారు.

అజ్ఞానకాలంలో అరబ్ బహుదైవారాధకులు హజ్ చేసేవారు కాని, నమాజ్ చేసేవారు కాదు. అందువల్ల ఖుర్‌ఆన్ ఈ సూక్తిలో నమాజ్ చేయని ముస్లింలను బహుదైవారాధకుల (ముష్రిక్‌ల)తో పోల్చింది. అలాగే యూదులు, క్రైస్తవులు నమాజ్ చేస్తారు కాని, హజ్‌విధిని పూర్తిగా వదిలేశారు. అందుకే దైవప్రవక్త (సల్లం) హజ్ చేయని ముస్లింలను యూదులు, క్రైస్తవులతో పోల్చారు.

**నాల్గింటిలో ఒకటి పోతే సున్నా:** "దేవుడు ఇస్లాంలో నాల్గు విషయాల్ని విధిగా నిర్ణయించాడు. ఈ నాల్గింటిలో ఎవరైనా మూడింటిని మాత్రమే పాటిస్తే, నాల్గవ దాన్ని పాటించనంతవరకూ ఈ మూడింటి వల్ల అతనికి ఎలాంటి ప్రయోజనం ఉండదు. ఈ నాల్గు విషయాలు ఇవి: నమాజ్, జకాత్, రమజాన్ ఉపవాసాలు, హజ్‌యాత్ర." (హదీసు)

"దైవప్రవక్త (స) ఒక హదీసులో దేవుని మాటలను ఇలా తెలియజేశారు: 'నేను ఏ దాసునికి ఆరోగ్యభాగ్యం, విస్తృతమైన ఉపాధి ప్రసాదిస్తానో, అతను నా సన్నిధికి (కాబాగృహానికి) రాకుండా అదే స్థితిలో అయిదేండ్లు గడిపితే, అతను సర్వం కోల్పోయిన దురదృష్టవంతుడవుతాడు." (హదీసు)

సన్మార్గగామి అయిన రెండవ ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) హజ్‌కు ఇంతటి ప్రాముఖ్యం ఉన్నందునే హజ్ చేయనివారిని హెచ్చరిస్తూ ఇలా అన్నారు:

"ఇస్లామీయ రాజ్యంలోని వివిధ పట్టణాలకు కొందరు వ్యక్తులను పంపి, స్తోమత ఉండి కూడా హజ్ విధి నిర్వహించనివారు ఎవరెవరు ఉన్నారో తెలుసుకొని వారిపై జిజియా (ముస్లిమేతరులపై విధించే రక్షణ రుసుం) విధించాలని అనుకుంటు న్నాను. వీరసలు ముస్లింలు కారు; ముస్లింలు కారు." (అల్‌మున్తఖా)

ఇస్లామీయ సౌధానికి "సద్వచనం (కలిమా)పై విశ్వాసం" సెంట్రల్ పిల్లర్ అయితే నమాజ్, రోజా, జకాత్, హజ్ ఆరాధనలు ఆ సౌధానికి నాలుగు మూలలా ఉండే ప్రధానమైన స్తంభాలు ఈ నాలుగు స్తంభాలలో ఏ ఒక్కటి లేకపోయినా



ఇస్లామీయ సౌధం కూలిపోతుంది. కాని ఈనాడు అనేక మంది ముస్లింలు నమాజ్, రోజాలు మాత్రం నిష్ఠతో పాటిస్తారుగాని జకాత్, హజ్‌లను విస్మరిస్తారు.

మరికొందరు ఏటేటా జకాత్ ఇస్తారుగాని హజ్ చేయడానికి సాకులు చెబుతారు. హజ్ సీజన్ సమీపంలో 70, 80 వేల రూపాయలు సమకూరి ఉంటే హజ్ చేయడం విధి (ఫరజ్) అవుతుంది. ఈ విధంగా అయిదేండ్లు గడచిపోతే ఒక హదీసు ప్రకారం అలాంటి ముస్లిం సర్వం కోల్పోయిన దురదృష్టవంతుడవుతాడని ఉంది. మరొక హదీసులో ఇస్లామీయ సౌధానికి మూలాధారమైన నాలుగు స్తంభాలలో ఏ ఒక్కదాన్ని వదిలేసినా మిగిలిన నాలుగు స్తంభాల వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని ఉంది.

అందువల్ల హజ్ యాత్ర జరపడానికి సాకులు చెప్పేవారు, ఏమరుపాటు వహించేవారు ఆత్మవంచనకు పాల్పడకుండా ఈ హదీసుల వెలుగులో తమ విశ్వాసాన్ని పటిష్ట పరచుకొని వీలయినంత త్వరగా హజ్ చేయడానికి ప్రయత్నించాలి. ఈనాడు ఇస్లాం పట్ల ముస్లింల విశ్వాసం డబ్బు ఖర్చుకాని ఆరాధనలకు పరిమితమై పోయింది. అలాంటి ముస్లింలు జకాత్ ఇవ్వడానికి నిరాకరించిన ముస్లింల విషయంలో మన తొలి ఖలీఫా హజ్రత్ అబూబకర్ (రజి) తీసుకున్న సైనికచర్య గురించి ఆలోచించాలి.

**మబ్రూర్ హజ్:** "ఒకతను 'అన్నిటికంటే ఏఆచరణ ఎక్కువ శ్రేష్ఠమైనది' అనడిగాడు దైవప్రవక్త (స)ను. దానికాయన 'దేవుణ్ని, ఆయన ప్రవక్తను విశ్వసించడం' అన్నారు. ఆ వ్యక్తి 'తర్వాత ఏదీ?' అనడిగాడు. దానికి దైవప్రవక్త (స) 'దైవమార్గంలో పోరాడటం (జిహాద్)' అన్నారు. 'ఆ తర్వాత ఏదీ?' అని అడిగాడు మళ్ళీ అతను. అప్పుడు దైవప్రవక్త (స) 'మబ్రూర్ హజ్' అని సమాధానమిచ్చారు." (హదీసు)

మౌలానా గులాం ముహమ్మద్ మన్సూరీ 1980వ సంవత్సరం, అక్టోబర్ 10వ తేదీన కువైట్ రేడియోలో ప్రసంగిస్తూ 'మబ్రూర్ హజ్' గురించి ఇలా వివరించారు:

"....ఈ వివరణను బట్టి హజ్‌విధికి ఎంత ప్రాముఖ్యం ఉందో తెలుస్తోంది. హజ్ నిర్వహణలో మన శరీరంతోపాటు ఆత్మ కూడా పాల్గొంటుంది. మనస్సు దైవప్రేమలో లీనమైపోతుంది. బుద్ధిజ్ఞానాలు దైవసన్నిధిలో మోకరిల్లుతాయి. కళ్ళ నుండి అశ్రు ధారలు ప్రవహిస్తాయి. నోరు దైవనామం, పాపమన్నింపు వచనం జపిస్తుంటుంది. పాపాలను తలచుకొని మనిషి సిగ్గుతో కుంచించుకుపోతాడు. తన బద్ధకం, ఏమరు పాటుల పట్ల పశ్చాత్తాపం చెందుతాడు. పాపాలు మన్నించమని దేవుణ్ని దీనాతి దీనంగా వేడుకుంటాడు. ఇతరుల హక్కులు ఏవైనా హరించివుంటే వాటిని తిరిగిచ్చి వేస్తానని వాగ్దానం చేస్తాడు. దైవధర్మాన్ని ప్రచారం చేస్తానని, దాని ఉన్నతికోసం తన సుఖం, సమయం, సంపద, చివరికి ప్రాణాన్ని సైతం త్యాగం చేస్తానని ప్రమాణం చేస్తాడు. అతని అంతరంగంలో విశ్వాసచైతన్యం ఉరకలు వేస్తుంది. హృదయంలో ఇస్లాం గురించిన నూతనుత్తేజం ఉప్పొంగుతుంది. ఇదీ నిజమైన హజ్ (మబ్రూర్‌హజ్)

అంటే. ఇవేమీలేని హజ్ ప్రాణం లేని దేహం వంటిది. అలాంటి మృతప్రాయమైన హజ్ జీవితంలో ఎలాంటి పరివర్తన కలగజేయదు. అతని ఆలోచనలను సైతం మార్చలేదు. తల్లిగర్భం నుండి అప్పుడే పుట్టిన బిడ్డలా మనిషి పాపాలను పూర్తిగా పరిహరింపజేసి పరమ పవిత్రుడ్ని చేసేది 'మబ్రూర్ హజ్' మాత్రమే. ఇలాంటి హజ్ చేయడానికే మనిషి ప్రయత్నించాలి."

## 39. హజ్ నియమాలు

హజ్ మూడు విధాలుగా ఉంది. ఈ మూడింటిలో యాత్రికులు తమ తమ సౌకర్యాలను బట్టి దేన్నయినా అవలంబించవచ్చు.

**(1) హజ్జె ఇఫ్రాద్**:- మీఖాత్‌లో (ఇహ్రాం)దీక్ష పూని హజ్ మాత్రమే చేయడం.

**(2) హజ్జె ఖిరాన్**:-హజ్, ఉమ్రాలకు ఒకేసారి దీక్షపూని రెంటిని కలిపి చేయడం.

**(3) హజ్జె తమత్తో** :- మొదట దీక్షపూని ఉమ్రా చేయాలి. తరువాత దీక్ష విరమించి జిల్‌హజ్జ 8వ తేదీన దీక్షపూని హజ్ చేయాలి. చాలామంది హాజీలు ఇలాగే చేస్తారు. "మీలో ఎవరైనా హజ్‌దినాలు రాకముందే యాత్రాస్థలానికి చేరుకొని ఉమ్రా ఆచారం పాటిస్తే, అలాంటివారు తమ స్తోమతనుబట్టి బలిదానం ఇవ్వాలి." (ఖుర్ఆన్-2:196)

హజ్ ఆచారంలో కొన్ని ముఖ్యమైన నియమాలు ఉన్నాయి. వాటిలో ఏ ఒక్క నియమాన్ని పాటించకపోయినా హజ్ విధి నెరవేరదు. ఆ నియమాల్లో ఫరజ్ నియమాలని, వాజిబ్ నియమాలని రెండు రకాల నియమాలు ఉన్నాయి.

### ఫరజ్ నియమాలు

**(1) ఇహ్రాం**:- ఇది హజ్ ప్రారంభించడానికి ఒక షరతు. దాంతోపాటు ఇది హజ్ నియమాల్లో ఒక నియమం కూడా. కుట్టులేని రెండు బట్టలు కట్టుకోవడం, హజ్ సంకల్పం చేసుకోవడం, (లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్ అని) తల్బియా పఠించడం- ఈ మూడు పనులు 'ఇహ్రాం' కిందికే వస్తాయి.

**(2) వఖూఫె అరఫాత్**:- జిల్‌హజ్జ 9వ తేదీన సూర్యుడు వాలినప్పటి నుంచి సూర్యాస్తమయం వరకు అరఫాత్ మైదానంలో కొద్ది సేపైనా సరే ఆగాలి. ఇలా అరఫాత్‌లో ఆగడాన్నే 'వఖూఫెఅరఫాత్' అంటారు.

**(3) తవాఫె జియారత్**:- అంటే సందర్శనా ప్రదక్షిణ. జిల్‌హజ్జ 10వ తేదీ నుండి 12వ తేదీ వరకు ఎప్పుడయినా కాబా చుట్టూ ఏడు సార్లు ప్రదక్షిణ చేయాలి. మొదటి నాలుగుచుట్లు ఫరజ్, మిగిలిన మూడుచుట్లు వాజిబ్. ఫరజ్‌కు, వాజిబ్‌కు పెద్ద తేడాలేదు. అంచేత హాజీలు ఏడుచుట్లు తప్పనిసరిగా తిరగవలసి ఉంటుంది.

**(4) నిర్ణీత స్థలాలు, నిర్ణీత వేళలు**:- పైమూడు ఫరజ్ విధుల్ని నిర్ణీత స్థలాల్లో, నిర్ణీత సమయాల్లో, నిర్ణీత క్రమం ప్రకారం పాటించాలి.



### వాజిబ్ నియమాలు

**(1) తవాఫెఖుదూమ్**:- మక్కా బయటిప్రాంతాల నుంచి వచ్చే హాజీలు మక్కాలో ప్రవేశించిన తరువాత మొట్టమొదట కాబా ప్రదక్షిణ చేయాలి. దీన్నే తవాఫె ఖుదూమ్ అంటారు. అలాంటి హాజీలు ఉమ్రా సాధారణంగా చేస్తారు. తవాఫె ఖుదూమ్ ఉమ్రాలోని భాగమే.

**(2) సయీ**:- కాబా ప్రదక్షిణ తరువాత సఫా, మర్వా కొండల మధ్య అటు నుంచి ఇటు, ఇటునుంచి అటు తిరగడాన్ని, పరుగెత్తడాన్ని 'సయీ' అంటారు. ముస్లింలో "సఫా, మర్వాల మధ్య సయీ చేయనివ్యక్తి చేసే హజ్, ఉమ్రాలను దేవుడు సమగ్రమైనవిగా పరిగణించడు" అని ఉంది. అహ్లెహదీసు పండితులు ఈ హదీసును దృష్టిలో పెట్టుకొని 'సయీ'ని ఫరజ్ నియమంగా పరిగణిస్తారు.

**(3) వఖూఫె ముజ్దల్ఫా**:- అరఫాత్, మినాల మధ్య ఉన్న ముజ్దల్ఫాలో జిల్‌హజ్జ 9వ తేదీన ఉషోదయం నుండి సూర్యోదయం వరకు కొద్ది సేపయినా సరే ఆగాలి. ఇక్కడ ఇలా ఆగడాన్నే 'వఖూఫె ముజ్దల్ఫా' అంటారు.

**(4) జమా బైనుస్సలాతీన్**:- అంటే ఒకే సమయంలో రెండు ఫరజ్ నమాజులు కలిపి వరుసగా చేయడమన్నమాట. జిల్‌హజ్జ 8న అరఫాత్‌లో జుహర్, అసర్‌ల ఫరజ్ నమాజుల్ని; 9న మినాలో మగ్రిబ్, ఇషాల ఫరజ్ నమాజుల్ని కలిపి చేయాలి.

**(5) రమీ**:- జిల్‌హజ్జ 10, 11, 12 తేదీలలో మినా ప్రాంతంలోని జమ్రాలపై కంకరాళ్ళు విసరడాన్ని 'రమీ' అంటారు. ఇలా రమీ చేయడం వాజిబ్ (విధి).

**(6) హలఖ్ లేక తఖ్సీర్**:- హలఖ్ అంటే పూర్తిగా తల గొరిగించుకోవడం. తఖ్సీర్ అంటే కటింగ్ చేయించుకోవడం. ఈ రెండిటిలో ఏదైనా చేయించుకోవచ్చు. అయితే తల పూర్తిగా గొరిగించుకోవడమే మంచిది.

**(7) ఖుర్బాని**:- అంటే పశుబలి. జిల్‌హజ్జ 10వ తేదీన మినాలో 'రమీ' చేసిన తరువాత ఒక మేకనో, పొటేలునో బలి ఇవ్వాలి.

**(8) తవాఫెవిదా**:- అంటే 'వీడ్కోలు ప్రదక్షిణ' అన్నమాట. హాజీలు మక్కా వీడి పోతున్నప్పుడు చివరి కార్యక్రమంగా కాబా ప్రదక్షిణ చేయవలసి ఉంటుంది. ఇలా వీడ్కోలు ప్రదక్షిణ చేయకుండా మక్కా వదలిపోకూడదు.

**(9) వరుసక్రమం**:- కంకరాళ్ళు విసరడం, పశుబలి ఇవ్వడం, క్షవరం చేయించు కోవడం పనులు వరుసక్రమంలో ఉండాలి.

## 40. ఇహ్రాం నిషేధితాలు, తల్బియా పఠనం

కాబా యాత్రికుడు హజ్ లేక ఉమ్రా దీక్ష పూనక ముందు గోళ్ళు కత్తిరించుకొని, క్షవరం చేయించుకొని, అనవసరమైన వెంట్రుకలు గొరిగేసి, శుభ్రంగా స్నానం చేయాలి. దీక్ష పూనిన తరువాత కొన్ని పనులు నిషిద్ధమవుతాయి.

- పురుషులు రోజూ ధరించే సాధారణ దుస్తులు వదిలేసి కుట్లులేని రెండు తెల్లబట్టలు మాత్రమే కట్టుకోవాలి.
- తలపై టోపీ పెట్టుకోవడంగాని, ఆచ్ఛాదన కోసం మరేదైనా వస్త్రం కప్పు కోవడంగాని చేయకూడదు.
- స్త్రీలు ముఖ ముసుగు (నిఖాబ్) ధరించకూడదు.
- సంభోగం, ఇతర లైంగికోద్రేక చర్యలకు పాల్పడకూడదు.
- సువాసనలు వాడకూడదు. షాంపుతో, సువాసన సబ్బుతో కడుక్కోకూడదు.
- శరీరంలోని ఏ భాగం నుంచి కూడా వెంట్రుకలు తీయకూడదు.
- గోళ్ళు కత్తిరించ కూడదు.
- వెంట్రుకలకు నూనె పూసుకోకూడదు. నూనెతో శరీరం మర్దన చేయరాదు.
- చెట్టు రెమ్మలు విరచడం, ఆకులు రాల్చడం, గడ్డి పీకడం చేయకూడదు.
- అడవి జంతువులను, పక్షులను వేటాడటం, వేటాడేవారికి సహకరించడం. అయితే విషపురుగులు, క్రూరజంతువులను చంపవచ్చు.

ఈ క్రింది పనులు ఎలాంటి పరిస్థితిలోనైనా చేయడం అధర్మమే. అయితే వీటిని ఇహ్రాం స్థితిలో చేయడం మరింత ఘోరమైన పాపం అవుతుంది:

- అశ్లీల చేష్టలకు పాల్పడటం, వాటిని గురించి మాట్లాడటం, ఆసక్తితో వినడం, అశ్లీల చిత్రాలు చూడటం.
- పోట్లాడటం, దుర్భాషకు దిగడం, దురుసుగా ప్రవర్తించడం.

వేట, పోట్లాటలను గురించి ఖుర్‌ఆన్‌లోని ఈక్రింది సూక్తులు గమనించండి:

"విశ్వాసులారా! నియమ నిబంధనలను పూర్తిగా పాటించండి. ఇకముందు మీకు తెలియజేయబోయేవి తప్ప పశువుల్ని పోలిన చతుష్పాదాలన్నీ మీ కోసం (ఆహారంగా) ధర్మసమ్మతం చేయబడ్డాయి. అయితే ఇహ్రాం (కాబాయాత్ర దీక్ష)లో ఉన్నప్పుడు మాత్రం వేటాడటాన్ని ధర్మసమ్మతం చేసుకోకండి. దేవుడు తాను తలచుకున్న ఆదేశం జారీ చేస్తాడు."

"జాగ్రత్త! కొందరు మిమ్మల్ని ప్రతిష్ఠాలయానికి పోకుండా నిరోధించారన్న ఆగ్రహంతో మితిమీరి వారిపై దౌర్జన్యం చేయకూడదు సుమా!! సత్కార్యాల్లో, దైవభక్తికి సంబంధించిన పనుల్లో పరస్పరం సహకరించుకోండి. అంతేగాని, పాపకార్యాల్లో, హింసా దౌర్జన్యాల్లో మాత్రం ఎవరితోనూ సహకరించకూడదు. దేవునికి భయపడండి. ఆయన (నేరస్థుల్ని) చాలాకఠినంగా శిక్షిస్తాడని తెలుసుకోండి." (ఖుర్‌ఆన్-5:1,2)

"విశ్వాసులారా! మీరు చేతులతో, ఈటెలతో చేసే వేట ద్వారా దేవుడు మిమ్మల్ని



కఠిన పరీక్షకు గురిచేయనున్నాడు. మీలో ఎవరు దేవుడ్ని ప్రత్యక్షంగా చూడకుండానే ఆయనకు భయపడతారో చూసేందుకు ఈవిధంగా ఆయన మీకు పరీక్ష పెడుతున్నాడు. (కనుక దీక్షలో ఉండి వేటాడటం నిషిద్ధమన్న సంగతి గుర్తుంచుకోండి.) ఈ హెచ్చరిక విన్న తర్వాత కూడా హద్దుమీరితే అలాంటివారికి బాధాకరమైన (నరక)యాతన తప్పదు." (ఖుర్‌ఆన్-5:94)

కాబాయాత్ర కోసం దీక్ష (ఇహ్రాం) పూనిన తరువాత చేయకూడని పనులు (నిషేధితాలు) ఏమిటో తెలుసుకున్నాం. ఇక్కడ చేయవలసిన పనులు ఉన్నాయి. వాటిలో కొన్ని పనులు చేయడం విధి (ఫర్జ్), కొన్ని పనులు సంప్రదాయం (సున్నత్), కొన్ని పనులు అభిలషనీయం (ముస్తహబ్). మరికొన్ని పనులు చేయడంలో తప్పు లేదు. వాటిని గురించి తెలుసుకుందాం:

- స్నానం చేయవచ్చు. అయితే సువాసగల సబ్బుతో శరీరం కడగకూడదు.
- ఇహ్రాం బట్టలు మార్చుకోవచ్చు, విడిచిన బట్టలు ఉతికేయవచ్చు.
- సువాసనలేని సుర్మా, కాటుక పెట్టుకోవచ్చు.
- గడియారం, ఉంగరం ధరించవచ్చు. నడుముకు బెల్టు కట్టుకోవచ్చు. బెల్టుకు ఉండే జేబులలో డబ్బు, ముఖ్యమైన కాగితాలు దాచుకోవచ్చు.
- పాము, తేలు, పులి మొదలైన విషపురుగుల్ని, క్రూరజంతువుల్ని చంపవచ్చు. "ప్రతిష్ఠాలయం పరిధిలో ఇహ్రాం స్థితి (దీక్ష)లో ఉన్నప్పుడు ఐదు రకాల ప్రాణుల్ని చంపడంలో ఎలాంటి తప్పులేదు. అవి: ఎలుక, కాకి, గ్రద్ద, తేలు, దాడిచేసే కుక్క" అని దైవప్రవక్త (సల్లం) తెలిపారు."
- సముద్రంలో, నదులలో చేపలు, రొయ్యలు వగైరా పట్టవచ్చు.

**తల్బియా**:- "లబ్‌బైక్ అల్లాహుమ్మ లబ్‌బైక్, లబ్‌బైక్, లాషరీక్ లక లబ్‌బైక్, ఇన్నల్‌హమ్ద వనిఅ్‌మత, లక వల్‌ముల్‌క లాషరీక లక"

(అర్థం:- నేను హాజరయ్యాను దేవా! నేను హాజరయ్యాను, నీ సన్నిధిలో హాజ రయ్యాను. నీకు సాటి ఎవరూలేరు, నేను హాజరయ్యాను. నిస్సందేహంగా నీవే ప్రశంస నీయుడవు. సమస్త వరప్రసాదాలకు నీవే అర్హుడవు. రాజ్యాధికారం కూడా నీదే. నీకు సాటి ఎవరూలేరు.)

దీన్నే 'తల్బియా' అంటారు. ఇహ్రాం (హజ్ దీక్ష) పూనగానే ఈవిధంగా 'తల్బియా' కనీసం ఒకసారి పఠించడం విధి (ఫర్జ్). ఒకటి కంటే ఎక్కువసార్లు పఠించడం సంప్రదాయం (సున్నత్). తల్బియాను పురుషులు బిగ్గరగా పఠించాలి; స్త్రీలు మాత్రం మెల్లిగా పఠించాలి. తల్బియాను పఠించినప్పుడల్లా కనీసం మూడుసార్లు పఠించడం అభిలషనీయం (ముస్తహబ్). మహాప్రవక్త ముహమ్మద్ (స) తల్బియా ప్రాముఖ్యం తెలుపుతూ ఇలా అన్నారు:

"ముస్లిం దైవదాసుడు లబ్బైక్, లబ్బైక్ అంటూ నినదించినప్పుడల్లా అతని కుడి ఎడమల వైపుండే రాళ్ళు రప్పలు, చెట్లు చామలు, మట్టి మశానం వగైరా నేల మీదుండే సమస్తం అతనితో గొంతు కలుపుతాయి." (తిర్మిజి)

"కాబాయాత్రికుడు సూర్యాస్తమయం అయ్యేవరకూ పగలంతా లబ్బైక్, లబ్బైక్ అంటూ నినదిస్తే, అతని పాపాలన్నీ పరిహరించబడి అతని తల్లి అతడ్ని ఇప్పుడే కనినట్లు పరమ పవిత్రుడయి పోతాడు." (తిర్మిజి)

తల్బియా తరువాత ఈ క్రింది దుఆ (వేడుకోలు) పఠించడం సంప్రదాయం:

"అల్లాహుమ్మ ఇన్నీ అస్అలుక రిజ్వానక వల్ జన్నత వ అవూజు బిరహ్మతిక మినన్నార్" (అర్థం: దేవా! నేను నీ ప్రసన్నతా భాగ్యాన్ని, స్వర్గ వైభవాన్ని అర్థిస్తున్నాను. నరకాగ్ని బారి నుండి నీ కారుణ్యఛాయలో శరణు గోరుతున్నాను.)

"దైవప్రవక్త (స) తల్బియా పఠించినప్పుడల్లా, తల్బియా పఠనం తరువాత 'దేవుడ్ని తన ప్రసన్నత-స్వర్గ భాగ్యాలు ప్రసాదించమని, తన కారుణ్యంతో నరకాగ్ని నుండి కాపాడమని ప్రార్థించే వారు." (ముస్నద్ షాఫయి)

## 41. ఉమ్రా విధానం


మేము మదీనాలో ఉమ్రాదీక్ష పూని మక్కా చేరుకున్న (16.12.05) రోజు జుహర్ నమాజు కోసం కాబాకు చేరుకున్నాం. ఇక్కడ "బాబుస్సలాం" ద్వారం గుండా ప్రవేశించడం మంచిది. "బిస్మిల్లాహి వస్సలాతు వస్సలాము అలా రసూలిల్లాహ్" అంటూ ముందు కుడికాలు పెట్టాలి. తరువాత "అల్లాహుమ్మగ్ఫిర్లి జునూబి వఫ్తహ్లీ అబ్వాబ రహ్మతిక" (దేవా! నా పాపాలు క్షమించు. నన్ను పరిశుద్ధపరచు. నా కోసం నీ అనుగ్రహ ద్వారం తెరువు) అంటూ లోపలికి పోవాలి. ఆ తర్వాత మేము మసీదు భవన సముదాయంలోనే నమాజ్ చేసి కాబాదర్శనం కోసం ముందుకు వెళ్ళాము.

నల్లటి గిలాఫులో ఎత్తయిన చతురస్రాకారపు 'కాబా' గర్భగుడి కళ్ళ ముందు కన్పించగానే మా ఆత్మలు పరవశించిపోయాయి. ఇక్కడ కొన్ని సందర్భానా నియమాలు పాటించవలసి ఉంటుంది. కాబా కన్పించగానే "అల్లాహుఅక్బర్, లా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహుఅక్బర్" అని పఠించాలి. తరువాత "అల్లాహుమ్మ జిద్ హాజల్బైత తష్రీఫన్ వ్వతాజీమన్వ్వ మహామతన్వ్వ బిర్రా" (దేవా! నీయీ ఆలయానికి శ్రేయోశుభాలు, గౌరవం, గాంభీర్యతలు అత్యధికంగా ప్రసాదించు) అని వేడుకోవాలి.

మేము కాబా దర్శనం తరువాత విడిదికి తిరిగొచ్చి భోజనం చేసి కాస్తంత విశ్రాంతి తీసుకున్నాం. ఆ తరువాత మళ్ళీ కాబాలయానికి పోయి సామూహిక అసర్ నమాజ్‌లో పాల్గొన్నాం. ఆ వెనువెంటనే 'ఉమ్రా' కోసం సిద్ధమయ్యాం.

'ఉమ్రా'లో ఐదు ముఖ్యాంశాలు ఉన్నాయి. (1) ఉమ్రా చేస్తామని సంకల్పించుకోవడం, (2) కుట్టులేని రెండు వస్త్రాలు కట్టుకొని దీక్ష (ఇహ్రాం) పూనడం, (3) ఏడు





↑ కాబా మస్జిద్ రాత్రివేళ దృశ్యం, సఫా-మర్వా కొండల మధ్య 'సయీ' ↓



సార్లు కాబా ప్రదక్షిణ (తవాఫ్) చేయడం, (4) సఫా, మర్వా కొండల మధ్య ఏడు సార్లు 'సయీ' చేయడం (తిరగడం), (5) క్షవరం చేయించుకోవడం. ఈ అయిదింటిలో ఏ ఒక్క అంశం తప్పిపోయినా ఉమ్రా విధి నెరవేరదు.

మేము ముగ్గురం మసీదు భవన సముదాయానికి, కాబా గర్భగుడికి మధ్య ఉన్న విశాలమైన మైదానంలో ప్రవేశించాం. నేను, మా మామయ్య ఇహ్రాం బట్టను కుడిచంక కిందినుంచి తీసి ఎడమ భుజమ్మీదుగా రొమ్ము మీదికి లాగి కట్టుకున్నాం. హజ్రెఅస్వద్ (నల్లరాయి)కి ఎదురుగా మసీదు సముదాయం గోడకు ఓ పచ్చలైట్ ఉంది. దీన్ని తవాఫ్ ప్రారంభం, ముగింపుల గుర్తు కోసం ఏర్పాటుచేశారు.

మేము హజ్రెఅస్వద్‌కు ఎదురుగా నిలబడి, రెండు చేతులు చెవులదాకా ఎత్తి "బిస్మిల్లాహి అక్బర్ లాఇలాహ ఇల్లల్లాహు వలిల్లాహిల్ హమ్ద్" (అందరికంటే గొప్పవాడైన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను. అల్లాహ్ తప్ప మరే దేవుడు లేడు. ఆయనే ప్రశంశనీయుడు.) అంటూ 'హజ్రెఅస్వద్'ని చేత్తో సైగచేసి 'ఇస్తిలాం' చేశాం. తర్వాత తవాఫ్ చేస్తూ పచ్చలైట్ దగ్గరకు చేరుకున్నాం. దాంతో ఒకచుట్టు పూర్తయింది. మళ్ళీ ఇస్తిలాంచేసి తవాఫ్ ప్రారంభించాం. ఇలా 7చుట్లు తిరిగి తవాఫ్‌విధి నెరవేర్చాం.

తవాఫ్ సందర్భంలో గమనించవలసిన కొన్ని విషయాలు ఉన్నాయి.

✪ నమాజు కోసం మనం ఎలా శుచి శుభ్రతలు పాటిస్తామో తవాఫ్ కోసం కూడా అలా శుచి శుభ్రతలు పాటించాలి. బహిష్టు స్త్రీలు తవాఫ్ చేయకూడదు.

✪ తవాఫ్ కాబాగర్భగుడి గోడవెలుపల ఓ మూలనున్న హజ్రెఅస్వద్ నుంచి ప్రారంభించి, పచ్చలైటు దగ్గరకు చేరుకోగానే ఒక చుట్టు పూర్తవుతుంది.

✪ ప్రతి చుట్టూ ప్రారంభించే ముందు, దాన్ని పూర్తిచేసిన తరువాత హజ్రె అస్వద్ (నల్లరాయి)ని ముద్దాడాలి. దీన్నే 'ఇస్తిలాం' అంటారు. దగ్గరకు పోయి అలా చేయడం సాధ్యం కాకపోతే దూరం నుంచయినా చేత్తో సైగచేసి ముద్దాడవచ్చు. ఈవిధంగా హజ్రె అస్వద్‌ని ముద్దాడటం సంప్రదాయం (సున్నత్).

✪ తవాఫ్‌లో మొదటి మూడు చుట్లు భుజాలు ఎగరేస్తూ, ఠీవీ-దర్పం ప్రదర్శిస్తూ కాస్త వేగంగా నడవాలి. దీన్ని "రమల్" అంటారు. ఇలా చేయడం సంప్రదాయం (సున్నత్). ఇదైనా తవాఫ్ తర్వాత 'సయీ' (సఫా-మర్వాల మధ్య నడవడం) చేయవలసి ఉన్నప్పుడే చేయాలి. ఒకవేళ ఎవరైనా మొదటి మూడు చుట్లలో రమల్ చేయడం మరచిపోతే, ఆతర్వాత చుట్లలో రమల్ చేయకూడదు.

తవాఫ్ చేసిన తర్వాత మేము 'మఖామెఇబ్రాహీం' వైపుకు నడిచాం. "వత్తఖిజూ మిమ్మఖామి ఇబ్రాహీం ముసల్లా" అని పఠిస్తూ మఖామె ఇబ్రాహీం దగ్గరకు వెళ్ళి రెండు రకాతులు నఫిల్‌నమాజ్ చేయాలి. మొదటి రకాతులో "ఖుల్‌యా అయ్యుహల్ కాఫిరూన్" సూరా, రెండవ రకాతులో "ఖుల్‌హువల్లాహు" సూరా పఠించాలి.



హజ్రెఅస్వద్‌కు, దానికి కొద్ది దూరంలో కుడివైపున్న తలుపుకు మధ్య భాగాన్ని "ముల్తజమ్" అంటారు. దాన్ని గట్టిగా పెనవేసుకొని ఏదైనా మంచి దుఆ (అల్లాహుమ్మ రబ్బహాజల్ బైతిల్ అతీఖి ఆతిఖు రిఖాబనా మినన్నారి వఅద్ ఖిల్‌నల్ జన్నత బిగైరి హిసాబ్"= ఈ ఆలయ ప్రభూ! కాబా ప్రభూ! నీ దాసుడు నీ సన్నిధిలో నిల్చున్నాడు. నన్ను కరుణించు. నాస్వామీ! నీవే పాపాలను క్షమించేవాడివి. నా పాపాలు క్షమించు.) అని పఠించాలి. మేమీ పని చేయలేకపోయాం. జనం ఎక్కువయి తోపులాట ప్రమాదం ఉండటంతో 'ముల్తజమ్' దగ్గరకు చేరుకోలేకపోయాం.

మేము 'మఖామె ఇబ్రాహీం'కు కొద్ది దూరంలో రెండు రకాతులు నఫిల్ నమాజ్ చేసి అక్కడే ఉన్న జమ్‌జమ్ నీళ్ళు తాగాం. జమ్‌జమ్ నీటిని నిలబడి ఖిబ్లా వైపు తిరిగి బిస్మిల్లా అని చెప్పి మూడు గుక్కెళ్ళలో తాగగల్గినంత తాగాలి. తాగేటప్పుడు "అల్లాహుమ్మ ఇన్నీ అస్‌అలుక ఇల్మన్ నాఫిఅన్ వఅమలన్ ముతఖబ్బిలన్ వరిజ్‌ఖన్ వాసిఅన్‌వషిఫాఅన్ మిన్‌కుల్లి దాయిన్" (దేవా! నాకు ప్రయోజనకరమైన విద్యాజ్ఞానాలు ప్రసాదించు. నా కర్మలను స్వీకారయోగ్యమైనవిగా చెయ్యి. నాకు విస్తృతమైన ఉపాధి అనుగ్రహించు. సమస్త వ్యాధుల నుండి నాకు స్వస్థత చేకూర్చు) అని దుఆ చేయాలి. ఈ దుఆలన్నీ మనకు తెలిసిన భాషలోనైనా చేయవచ్చు.

ఆ తర్వాత మేము "సయీ" చేయడానికి సఫా, మర్వా కొండలు ఉండే దారికి వెళ్ళాము. (ఇక్కడ మనకు కొండలు కనపడవులెండి. వాటి చిహ్నాలు మాత్రమే నామ మాత్రంగా కన్పిస్తాయి. రెండుకొండల మధ్య విశాలమైన మంచి రోడ్డు, పైన కప్పు, కళ్ళు మిరుమిట్లు గొలిపే లైట్లతో అందమైన ఓ పెద్దహాలు మాదిరిగా ఉంటుంది.) ఈ కొండల మధ్యనే హజ్రత్ హాజరా (రజి) తన పసిబిడ్డ హజ్రత్ ఇస్మాయీల్ (అలై) కోసం నీటిని అన్వేషిస్తూ ఆ కొండ మీదనుంచి ఈ కొండ మీదకు, ఈ కొండ మీద నుంచి ఆ కొండమీదకు ఏడుసార్లు తిరిగారు. ఈ ప్రయత్నం (సయీ), తహతహలు దేవునికి నచ్చినందువల్ల ఆయన సయీ ఆచారాన్ని హజ్‌లో భాగంగా చేశాడు.

కనుక హాజీలు కూడా ఇలా తప్పనిసరిగా 'సయీ' చేయవలసి ఉంటుంది. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) సఫా కొండ మీదనుంచే ఖురైష్ ప్రజలను ఎలుగెత్తి పిలిచి దైవసందేశం విన్పించారు.

ఇక్కడ ముందుగా మనం సఫా కొండ ఎక్కి దుఆ చేసి సయీ ప్రారంభించాలి. సఫా, మర్వాల మధ్య ఇరు వైపులా గుర్తుగా రెండు పచ్చ లైట్లు ఉంటాయి. హాజీలు ఈ గుర్తుదాకా సాధారణ నడకతో వచ్చి ఇక్కడ్నుంచి పరుగెత్తాలి. ఇలా కొద్ది దూరం పరుగెత్తిన తర్వాత మరోచోట ఇరువైపులా మళ్ళీ పచ్చలైట్లతో కూడిన రెండు గుర్తులు ఉంటాయి. ఇక్కడకు చేరుకోగానే వేగం తగ్గించి మామూలుగా నడవాలి. ఈవిధంగా మర్వా పైకి వెళ్ళి దుఆ చేయాలి. తర్వాత అక్కడ్నుంచి పైన పేర్కొన్నట్లే సఫా పైకి చేరుకోవాలి. ఈవిధంగా ఏడు సార్లు 'సయీ' చేయాలి. సఫా, మర్వాల మధ్య సయీ చేస్తున్నప్పుడు ఏమీ పఠించకుండా మౌనంగా ఉన్నా సయీ విధి నెరవేరుతుంది. కాని

మౌనంగా ఉండే బదులు పాపక్షమాపణ దుఆలు చేయడం మంచిది.

**సఫా** »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» **మర్వా**
**సఫా** ««««««««««««««««««««««««««««««««««««««««« **మర్వా**
**సఫా** »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» **మర్వా**
**సఫా** ««««««««««««««««««««««««««««««««««««««««« **మర్వా**
**సఫా** »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» **మర్వా**
**సఫా** ««««««««««««««««««««««««««««««««««««««««« **మర్వా**
**సఫా** »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» »» **మర్వా**

మనం ఇక్కడ 'ఉమ్రా' ఆచారం పాటిస్తున్నందున తవాఫ్, సయీ తరువాత ఖసర్ (క్షవరం) చేయించుకోవాలి. ఉమ్రాలో ఈ మూడు పనులు తప్పనిసరి (ఫర్జ్)గా నెరవేర్చాలి. 'ఖసర్'కు ముందు రెండు రకాతులు నఫిల్ నమాజ్ చేయడం సున్నత్ (సంప్రదాయం). క్షవరం చేయించుకోవడంతో ఉమ్రా విధి నెరవేరినట్లే. ఇప్పుడు విడిదికి వెళ్ళి ఇహ్రాం దుస్తులు వదలి సాధారణ దుస్తులు ధరించవచ్చు. ఈవిధంగా మేము ఉమ్రా విధి నెరవేర్చి విడిదికి తిరిగొచ్చాం.

## 42. కాబా నిర్మాణ చరిత్ర

మక్కా పట్టణానికి అనేక పేర్లున్నాయి. వాటిలో ఈ క్రింది పేర్లు ముఖ్యమైనవి:

☸ **మక్కా:** "దేవుడే మక్కా లోయలో వారి చేతుల్ని మీనుండి, మీ చేతుల్ని వారి నుండి (యుద్ధం జరగకుండా) నిరోధించాడు." (ఖుర్ఆన్-48:24)

☸ **బక్కా:** "మానవుల కోసం నిర్మించబడిన మొట్టమొదటి ఆరాధనాలయం బక్కా (మక్కా)లో ఉన్నదే." (ఖుర్ఆన్-3:96)

☸ **ఉమ్ముల్‌ఖురా:** "ఈ గ్రంథంలోని బోధనల ద్వారా నీవు ఉమ్ముల్‌ఖురా (రాజధానినగర) వాసుల్ని, దాని పరిసర ప్రాంతాల్లో నివసించే వారిని హెచ్చరించడానికి దీన్ని అవతరింపజేశాము." (ఖుర్ఆన్-6:92)

దేవుడు మక్కా పట్టణాన్ని దాని పునాది ఏర్పడిన నాటి నుండే పుణ్యక్షేత్రం (హరం)గా నిర్ణయించాడు. ప్రపంచంలోని నగరాలన్నిటిలో దేవునికి, ఆయన ప్రవక్త (స)కు మక్కా నగరమే ఎక్కువ ప్రియమైనది. మక్కా క్రమేణా విస్తరిస్తూ నగరంగా రూపొంది ఇంతటి పవిత్రత, ప్రతిష్ఠలు సంతరించుకోవడానికి కారణం దైవప్రవక్తలయిన హజ్రత్ ఇబ్రాహీం (అలై), ఆయన కుమారరత్నం హజ్రత్ ఇస్మాయీల్ (అలై)లు కలసి నిర్మించిన కాబా మందిరం, అందులోని జమ్‌జమ్ జలాశయాలే.

అయితే అలాంటి పవిత్రమైన పట్టణంలో పుట్టి పెరిగి సత్యసంధుడు (సాదిఖ్), నిజాయితీపరుడు (అమీన్) అని ప్రజల చేత ప్రశంసబడిన ముహమ్మద్ (సల్లం)



దైవప్రవక్త అయి ఏకదైవారాధన గురించి ప్రచారం ప్రారంభించగానే అక్కడి 'పెద్దలే' ఆ మహనీయుణ్ణి వేధించడం మొదలెట్టారు. చివరికి హత్య కుట్ర కూడా పన్ని ఆయన్ని పట్టణం వదలిపోయేలా చేశారు ఈ విధంగా:-

### దైవప్రవక్త (స) గతస్మృతులు

మహాప్రవక్త (స) దైవాజ్ఞతో శత్రువుల కళ్ళుగప్పి ఎలాగో నగరం నుంచి బయట పడ్డారు. కొంతదూరం నడచిన తర్వాత విడనాడని బంధమేదో పెనవేసు కోగా అప్రయత్నంగా నిలబడి ఓసారి వెనక్కి తిరిగిచూశారు. ఆకాశదీపాల క్రింద తన ప్రియనగరం ఎంతో శోభాయమానంగా కన్పించింది. ఒక్కసారిగా గతస్మృతులు గుర్తుకువచ్చాయి.

'తానీ నగరంలో పుట్టి పెరిగారు. ఇక్కడే ఓఇంట్లో వివాహం చేసుకున్నారు. ఇక్కడే తనకు దివ్యావిష్కృతి (వహీ) భాగ్యం లభించింది. ఈనగరం నుంచే తాను దివ్య లోకాలకు వెళ్ళి దైవసాన్నిధ్యం పొందారు. ఈ పవిత్ర క్షేత్రమే తన ధార్మికోద్యమానికి ప్రథమ వేదిక అయ్యింది. ఇలాంటి తన ప్రియనగరానికి ఈరోజు తాను మార్గాంతరంలేక వీడ్కోలు చెప్పవలసి వస్తోంది....'

ఈ ఆలోచనతో దైవప్రవక్త (సల్లం) అవ్యక్తమైన బాధతో నిట్టూర్చారు. మనసు కకా వికలమైపోయింది. కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. మాటిమాటికి వెనక్కి తిరిగి మక్కా వైపు చూడసాగారు. స్వదేశస్థులు వెళ్ళగొట్టినా స్వదేశాభిమానం వీడని ఆయన హృదయ వీణ బాధగా విలపించింది:

"మక్కా నగరమా! ప్రపంచ నగరాలన్నిటిలో నీవే దేవునికి ఎక్కువ ప్రియమైన దానవు. నాక్కూడా నీవే ఎక్కువ ప్రియమైన దానవు. బహుదైవారాధకులు గనక బహిష్కరించకపోతే నేను ఎన్నటికీ నిన్ను వీడిపోయేవాడ్ని కాను." (ముస్నద్ అహ్మద్)

ఆవిధంగా దైవప్రవక్త (స) మనోవ్యధతో మదీనా వలసపోయారు. అప్పుడు ఏ ప్రాంతం నుండయితే ఆయన ఒకే ఒక అనుచరుడితో నిస్సహాయ స్థితిలో నలువైపుల నుండి బద్ధవిరోధులు వెంటాడుతుండగా పోవలసి వచ్చిందో ఎనిమిదేండ్ల తరువాత ఆ ప్రాంతంలోకే పదివేల మంది సమరయోధులతో నిర్భయంగా ప్రవేశించారు.

అయితే గొప్ప యోధుడిగా విజయగర్వంతో గుండెలు విరుచుకొని ప్రవేశించ లేదు. ఒంటె మీద తన వెనుక మాజీ బానిసయిన హజ్రత్ జైద్ (రజి) కుమారుడ్ని కూర్చోబెట్టుకొని ఎంతో అణుకువ, వినయవిధేయతలు కలిగిన దైవదాసుడిగా శిరస్సును ఒంటె మూపురం దాకా వంచిమరీ, దైవవాణి (ఫతహ్‌సూరా) పఠిస్తూ ప్రవేశించారు!

ముస్లింసేనలు శాంతియుతంగా మక్కాలో ప్రవేశించాయి. కత్తులు, ఈటెలకు పని తగల్లేదు. రక్తం ప్రవహించలేదు. ఒకచోట మాత్రం కాస్తంత అలజడి చెలరేగింది. అదయినా తిరుగుబాటు వైఖరితో కత్తుల దూసిన కొందరిని అణచవలసి వచ్చింది. ఆ తర్వాత నగరంలో పూర్తిగా శాంతియుత వాతావరణం నెలకొన్నది. కాబా ధర్మకర్త ఉస్మాన్ బిన్ తల్హా వచ్చి దైవప్రవక్త (సల్లం)కు వినయపూర్వకంగా నమస్కరించాడు.

"రాజాధిరాజా! మక్కా విజేతా!! స్వాగతం! సుస్వాగతం!! ఇదిగో ప్రతిష్ఠాలయం తాళపు చెవులు తీసుకోండి. తరతరాల నుంచి మావంశంలో ఉంటూ వస్తున్న ఈ తాళపు చెవుల్ని ఈరోజు మీకు హస్తగతం చేస్తున్నాను" అంటూ అతను వణుకుతున్న చేతులతో కాబా మందిరం తాళపుచెవుల్ని దైవప్రవక్త (సల్లం) చేతికి అందించాడు.

దైవప్రవక్త (సల్లం) చిరునవ్వు నవ్వుతూ తాళపుచెవులు తీసుకున్నారు.

దైవప్రవక్త (స) మక్కాలో ఉన్నప్పుడు ఓరోజు కాబాకు వెళ్ళి తాళపుచెవులు ఇవ్వమని అడిగితే, ఉస్మాన్ నిరాకరిస్తూ దురుసుగా సమాధానమిచ్చాడు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) "ఉస్మాన్! గుర్తుంచుకో. నువ్వీ తాళపుచెవుల్ని ఏదో ఓరోజు నా చేతికి అందిస్తావు. అప్పుడు నేను తలచిన వారికి వీటిని  ఇచ్చేస్తాను" అన్నారు.

ఆ మాటకు ఉస్మాన్ తీవ్రంగా స్పందిస్తూ "అలా జరిగితే ఆరోజు ఖురైషీయులకు వినాశం, అవమానం కలిగే దుర్దినం అవుతుంది" అన్నాడు. "కాదు. ఆరోజు వారు శాంతి యుతంగా, గౌరవప్రదంగా ఉంటారు" అన్నారు దైవప్రవక్త (సల్లం).

ఈ మాటలు ఉస్మాన్ బిన్ తల్హా (రజి) చెవుల్లో ఇప్పటికీ ప్రతిధ్వనిస్తున్నాయి. అతను ఆనాడే అనుకున్నాడు, ఆ మహనీయుడు అన్నట్లే జరుగుతుందని. అది ఈరోజు జరగడం కూడా అతను కళ్ళారా చూసుకున్నాడు.

ఆ తరువాత దైవప్రవక్త (స) అతడ్ని పిలిపించి "ఉస్మాన్! ఇదిగో నీ తాళపుచెవులు. ఈరోజు సద్వర్తనం, నిజాయితీల దినం. ఈ తాళపు చెవులు ఈరోజు నుంచి ఇక ఎల్లప్పుడూ నీ కుటుంబంలోనే ఉంటాయి. దుర్మార్గులు తప్ప మరెవరూ దీన్ని మీ దగ్గర్నుంచి లాక్కోలేరు" అన్నారు  తాళపుచెవులు అతనికి శాశ్వతంగా అప్పగిస్తూ.

ఉస్మాన్ సంతోషంతో ఉక్కిరిబిక్కిరయ్యాడు. అతని కళ్ళ నుండి ఆనందాశ్రవులు రాలసాగాయి. అతని నోట "అల్లాహ్ తప్ప మరే ఆరాధ్యుడు లేడని, ముహమ్మద్ ఆయన ప్రవక్తని నేను సాక్ష్యమిస్తున్నాను" అన్న మాటలు అప్రయత్నంగా  వెలువడ్డాయి.

మరుసటిరోజు ఖుజాఅ తెగవారి చేతికి హుజైల్ తెగ మనిషి ఒకడు చిక్కాడు. అతనితో ఖుజాఅ తెగవాళ్ళకు పాతవైరం ఉంది. అంచేత వారా వ్యక్తిని వెంటనే హతమార్చారు. ఖుజాఅ తెగ ముస్లింలకు మిత్రపక్షం. అంచేత ఈ దుర్ఘటన సంగతి తెలియగానే దైవప్రవక్త (స)కు పట్టరాని కోపం వచ్చింది. తక్షణమే ఆయన ప్రజలను సమావేశపరచి వారి ముందు ఆవేదనాభరిత హృదయంతో ఇలా ప్రసంగించారు:


"ప్రజలారా! శ్రద్ధంగా వినండి. ఏరోజయితే దేవుడు భూమ్యాకాశాల్ని సృజించాడో ఆరోజు నుండే ఆయన మక్కాను పుణ్యక్షేత్రంగా చేశాడు. ఇప్పుడిది ప్రళయం దాకా పుణ్యక్షేత్రంగానే ఉంటుంది. ఇక్కడ ఎలాంటి రక్తపాతం చెయ్యడంగాని, చెట్లు నరకడం గాని ఎవరికీ ధర్మసమ్మతం కాదు. నాకు పూర్వం ఇది ఏ ఒక్కరికీ ధర్మసమ్మతం చెయ్యబడ లేదు. నా తరువాత కూడా ఎవరికీ ధర్మసమ్మతం కాబోదు. ఇక్కడి ప్రజలపై దైవాగ్రహం విరుచుకు పడినప్పుడు మాత్రమే నాకయినా ఈ పని ధర్మసమ్మతం





↑ ఇబ్రాహీం, ఇస్మాయీల్ ప్రవక్తల (అలైహి) కాబా తొలినిర్మాణం

కాబాలయం  (మక్కానగరం) పునర్నిర్మాణంలో ఒక ఘట్టం ↓



చేయబడింది. ఇప్పటికీ క్షేత్ర పవిత్రత తిరిగొచ్చింది. ఈ విషయాన్ని మీరు ఈ సభలో పాల్గొనలేకపోయిన వారికి కూడా తెలియజేయండి. ఒకవేళ మీతో ఎవరైనా దైవప్రవక్త ఇక్కడ యుద్ధం చెయ్యలేదా అని అడిగితే 'దేవుడు దీన్ని తన ప్రవక్త కోసం ధర్మసమ్మతం చేశాడు కాని, మీకోసం కాద'ని చెప్పేయండి."

## కాబా పునర్నిర్మాణ ఘట్టాలు

కాబా మందిరం ముస్లింల అంతర్జాతీయ ఆరాధనా కేంద్రం, సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం. అరబ్బులు బహుదైవారాధకులుగా ఉండిన మధ్య యుగాలలో కూడా ఇది యావత్తు అరేబియా ఉపఖండం ప్రజలకు కేంద్రీయ పుణ్యక్షేత్రంగా ఉండేది.

"మానవుల కోసం (ఇబ్రాహీం, ఇస్మాయీల్ ప్రవక్తల చేత) నిర్మించబడిన మొట్ట మొదటి ఆరాధనాలయం మక్కాలో ఉన్నదే. (కాబాగృహం.) అది ఎంతో శుభప్రదమైనది, యావత్ మానవాళికి మార్గదర్శకమైనది." (3:96)

"అందులో ప్రవేశించే ప్రతివ్యక్తీ శాంతీ, రక్షణా పొందగలడు." (ఖుర్ఆన్-3:97)

"దేవుడు కాబా ప్రతిష్ఠాలయాన్ని మానవుల కోసం శాంతిభద్రతల నిలయంగా చేశాడు." (ఖుర్ఆన్-5:98)

కాబా మందిరానికి బైతుల్లా, బైతుల్ హరాం, మస్జిదుల్ హరాం, బైతుల్ అతీఖ్ అనే పేర్లు కూడా ఉన్నాయి. వాటి వివరాలు ఇలా ఉన్నాయి:

❁ **కాబా:** కాబాలయం మొదట్లో తన చుట్టూ ఉండిన భూభాగం కంటే ఎత్తుగా ఉండటం వల్ల దీనికీ పేరు వచ్చిందని భాషావేత్తల, చరిత్రకారుల అభిప్రాయం.

❁ **బైతుల్లా:** దీని శాబ్దికభావం దేవాలయం. ఈ అర్థంతో ప్రతి మసీదును బైతుల్లా అనవచ్చు. కాని అరబ్బీలో బైతుల్లా అని కాబా మసీదును మాత్రమే అంటారు.

❁ **బైతుల్ హరాం:** సృష్టికర్త కాబాను, దాని పరిసర ప్రదేశాలన్నిటిని కలిపి నిషిద్ధక్షేత్రంగా, పుణ్యస్థలంగా నిర్ణయించాడు. అంటే ఈ ప్రాంతంలో హింసా దౌర్జన్యాలు, రక్తపాతాలు నిషిద్ధం అన్నమాట. ఈ కారణంగానే కాబాకు బైతుల్ హరాం అని కూడా పేరొచ్చింది. ఆ భవంలో దీన్ని పుణ్యక్షేత్రం, ప్రతిష్ఠాలయం అని కూడా చెప్పవచ్చు. పూర్వం చీటికిమాటికి కత్తులు దూసుకునే అరబ్ బహుదైవారాధకులు కూడా కాబాలో కలహించుకోకుండా దాని పవిత్రను కాపాడుతుండేవారు.

❁ **బైతుల్ అతీఖ్ :** దేవుడు కాబాను అవిశ్వాసులయిన రాజుల నుండి రక్షించి నందువల్ల దీనికి బైతుల్ అతీఖ్ అని కూడా పేరొచ్చింది. హజ్రత్ అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా తెలిపారు- "కాబాను అవిశ్వాసి అయిన ఏరాజు కూడా ఆక్రమించుకోలేడు కాబట్టి దీన్ని బైతుల్అతీఖ్ అన్నారు." (తిర్మిజి)



కాబాలయం గత నాలుగు వేల సంవత్సరాల కాలంలో ఎన్ని సార్లు పునర్నిర్మించ బడిందో కచ్చితంగా ఎవరూ చెప్పలేక పోతున్నారు. అయితే కనీసం అయిదు సార్లు పునర్నిర్మించబడిందని కొందరు పండితుల అభిప్రాయం. మొట్టమొదటి సారి దీన్ని దైవదూతలు నిర్మించారు. రెండవసారి ఆదిమానవుడైన హజ్రత్ ఆదం (అలైహి) నిర్మించారు. మూడవసారి ఇబ్రాహీం ప్రవక్త (అలైహి) నిర్మించారు. దాన్ని గురించిన సంక్షిప్త సమాచారం ఖుర్ఆన్ (2:127-129)లో ఉంది. నాలగవసారి అజ్ఞానకాలంలో ఖురైష్ తెగవాళ్ళు నిర్మించారు. అయిదవసారి మహాప్రవక్త (స) అనుచరుడైన హజ్రత్ అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) పాలనాకాలంలో నిర్మించబడింది.

## కాబా తొలి నిర్మాణం

హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) దైవప్రవక్తగా పాలస్తీనాలో ధర్మప్రచారం చేస్తున్న రోజుల్లో ఆయనకు మొదటి భార్య హజ్రత్ హాజరా (రజి) ద్వారా ఇస్మాయీల్ (అలైహి) జన్మించారు. దీనిపై రెండవ భార్య హజ్రత్ సారా (రజి)కు ఒక విధమైన అసూయ ఏర్పడటంతో "ఇప్పుడీమె నా కళ్ళ ముందు ఉండకూడదు" అన్నారు హజ్రత్ ఇబ్రాహీం (అలైహి)తో. అప్పుడాయన హజ్రత్ హాజరా (రజి)ను, ఆమె కొడుకు హజ్రత్ ఇస్మాయీల్ (అలై)ను తీసుకొని అరేబియా ప్రాంతానికి బయలుదేరారు. అరేబియాలోని భయంకరమైన ఒక నిర్జన ఎడారి ప్రదేశంలో వాళ్ళిద్దర్ని దిగబెట్టి వెనక్కి మళ్ళారు.

హజ్రత్ హాజరా (రజి) విస్తుబోయి చూస్తూ "ఏమిటీ, మమ్మల్ని ఇక్కడ నిర్జన ప్రదేశంలో వదిలేసి వెళ్ళిపోతున్నారు?" అని అడిగారు.

ఈవిధంగా ఆమె అనేక సార్లు అడిగినా హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) సమాధానం ఇవ్వలేదు. చివరికి ఆమె "దేవుడు ఈవిధంగా చేయమని మిమ్మల్ని ఆదేశించాడా?" అని ప్రశ్నించారు. దానికి హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) ఔనన్నారు.

హజ్రత్ హాజరా (రజి) ఈమాట విని "అయితే దేవుడు మమ్మల్ని వృధా చేయడు. (ఆయనే మాకు రక్ష.)" అని అన్నారు.

హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) ఈమాట చెప్పి ఆమె నుండి కనుమరుగై పోయారు. కొంచెం దూరం పోయాక వెనక్కి తిరిగి చూస్తూ చేతులెత్తి ఇలా ప్రార్థించారు:

"ప్రభూ! నేను నాసంతానాన్ని ఎలాంటి చెట్టూ, పుట్టాలేని ఎడారిప్రాంతంలో నీ ప్రతిష్ఠాలయం వద్దకు తెచ్చి వశింపజేశాను. వీరు (భవిష్యత్తులో) ఇక్కడ ప్రార్థనావ్యవస్థ నెలకొల్పుతారన్న ఆశతో నేనిలా చేశాను. కనుక వీరిపట్ల నీవు ప్రజల హృదయాల్లో ఆసక్తి అభిమానాలు కలిగించు. వీరికి తినడానికి పండ్లు ఫలాలు ప్రసాదించు, బహుశా అందుకు కృతజ్ఞులై ఉంటారు. ప్రభూ! మేము దాస్తున్నదీ, బహిర్గతం చేస్తున్నదీ అంతా నీకు తెలుసు.' నిస్సందేహంగా దేవునికి భూమ్యాకాశాల్లో ఏదీ కనుమరుగుగా లేదు." (ఖుర్ఆన్-14:37,38)

హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) భార్యాపిల్లల్ని ఇలా ఈ ఎడారి ప్రాంతంలో వదిలేసి వెళ్ళిపోయినప్పటికీ ఆయన అప్పుడప్పుడు వచ్చి వాళ్ళను చూసిపోయేవారు. ఈవిధంగా అనేక సంవత్సరాలు గడచిపోయాయి. హజ్రత్ ఇస్మాయీల్ (అలైహి) యౌవన దశలో అడుగుపెట్టారు. ఒకసారి హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) వచ్చినప్పుడు హజ్రత్ ఇస్మాయీల్ (అలై) ధనస్సు సరిచేస్తూ కూర్చున్నారు.

ఆయన హజ్రత్ ఇబ్రాహీం (అలైహి)ని చూడగానే లేచి ఆయనకు ఎదురుగా వెళ్ళారు. తండ్రీకొడుకులు ఇద్దరూ కౌగలించుకొని పరస్పరం యోగక్షేమాలు విచారించి తెలుసుకున్నారు. ఆ సందర్భంలో ఇబ్రాహీం (అలైహి) మాట్లాడుతూ "ఇస్మాయీల్! దేవుడు నాకు ఒక విషయం గురించి ఆదేశించాడు" అని అన్నారు.

హజ్రత్ ఇస్మాయీల్ (అలైహి) ఈమాట విని "మంచిది. దేవుడు ఏ పని గురించి ఆదేశించాడో ఆ పని చేయండి" అన్నారు.

"మరి ఈ పనిలో నువ్వేమైనా నాకు సహాయపడగలవా?" అని అడిగారు హజ్రత్ ఇబ్రాహీం (అలైహి).

"తప్పకుండా సహాయపడ్తాను" అన్నారు హజ్రత్ ఇస్మాయీల్ (అలైహి).

"ఈ ప్రదేశంలో ఒక దేవాలయం నిర్మించమని దేవుడు నన్ను ఆదేశించాడు" అని చెప్పారు హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) ఓ ఎత్తయిన ప్రదేశం వైపు చూపిస్తూ.

ఆ తరువాత ఇద్దరూ కలసి ఆ ప్రదేశంలో పునాదులు తవ్వి గోడలు లేపారు. హజ్రత్ ఇస్మాయీల్ (అలై) రాళ్ళు మోసుకొచ్చి పడేస్తుంటే, హజ్రత్ ఇబ్రాహీం (అలై) కట్టడం పని చేయసాగారు. ఇలా గోడలు పైకి వచ్చాక హజ్రత్ ఇస్మాయీల్ (అలై) తెచ్చిన ఓ పెద్దరాయి మీద హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) నిలబడి గోడల నిర్మాణం కొనసాగించారు. ఈవిధంగా "ఇబ్రాహీం, ఇస్మాయీల్ ఇద్దరూ కలసి దైవగృహానికి పునాదులు తీసి గోడలు నిర్మిస్తూ 'ప్రభూ! మాఈ సేవ స్వీకరించు. నీవే (మొరలు) ఆలకించేవాడవు, సమస్తం తెలిసినవాడవు, అని వేడుకునేవారు." (ఖుర్ఆన్-2:127)

హజ్రత్ ఇబ్రాహీం (అలై) ఆనాడు కాబాలయం గోడలు పైకెత్తడానికి నిలబడిన ఆ రాయినే "మఖామె ఇబ్రాహీం" అంటారు. ఇలా కాబా తొలినిర్మాణం జరిగింది.

## ప్రవక్త (స) కాలంలో కాబా పునర్నిర్మాణం

ఆ తరువాత అంతిమ దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సల్లం) కాలం వచ్చింది. అయితే ఆయన ఇంకా దైవప్రవక్తగా నియమించబడలేదు.

ఒక రోజు నిర్మలంగా ఉన్న ఆకాశం క్రమంగా మేఘావృతమయింది. ఉన్నట్లుండి రివ్వున గాలి వీచింది. ఆ వెనువెంటనే పెళపెళమంటూ పిడుగు పడినంత భీకర గర్జన. ఆ తర్వాత కాస్సేపటికే చల్లటి గాలులతో చిటపట చినుకులు మొదలయ్యాయి. చూస్తుండగానే అది కాస్తా ఉధృతమయి భారీ వర్షం కురవసాగింది.



చెవులు చిల్లులు పడే ఉరుములు! కళ్ళు మిరుమిట్లు గొలిపే మెరుపులు!! సూదుల్లా గుచ్చుకునే వర్షపు ధారలు!!! ఆకాశం ఎక్కడికక్కడ చిల్లులు పడినట్లు కుండపోతగా కురుస్తూనే ఉంది. ఘడియలు, గంటలు దొర్లిపోతున్నాయి. పూటలు, రోజులు కూడా గడచిపోతున్నాయి. కాని వర్షం వెలిసే సూచనలు కానరావడం లేదు. మక్కా ప్రజలు ఎవరి ఇళ్ళలో వారు నిర్బంధంగా ఉండిపోయి నింగికేసి వింతగా చూడసాగారు.

ఈ ముసురులో సూర్యుడు ఎప్పుడు ఉదయిస్తున్నాడో, ఎప్పుడు అస్తమిస్తున్నాడో తెలియడంలేదు. వర్షం! వర్షం!! ఒకటే వర్షం!!! కష్టజీవులకు కష్టపడకుండానే కష్టం అనుభవించే పరిస్థితి ఏర్పడింది. ఎడతెరిపి లేకుండా భోరున వర్షం కురుస్తూనే ఉంది. ఒంటెలు, మేకలు అల్లాడి పోతున్నాయి. వర్షపు నీటికి గుంటలు, గోతులు నిండి పొర్లుతున్నాయి. వీధుల్లో వరద నీళ్ళు పరవళ్ళు తొక్కుతున్నాయి. నానిన గోడలు నేలబారుగా పడిపోతున్నాయి. కారుతున్న ఇండ్ల కప్పులు కుప్పకూలి పోతున్నాయి. ప్రజలు భయాందోళనలతో తమ ఇష్ట దేవతలను వేడుకుంటున్నారు. అయినా వర్షం తగ్గలేదు. సరికదా, ప్రకృతి మరింత ప్రకోపించింది. గుండెలు పగిలిపోయే ఉరుములతో వర్షం వీర ప్రతాపం ప్రదర్శిస్తోంది.

అలా ఎలా ఎన్ని రోజులు గడిచాయో కాని, వర్షం వెలిసేటప్పటికి మక్కాపట్టణం ఓ పెద్ద చెరువులో తేలుతున్నట్లు కన్పించింది. రెండు మూడు రోజుల తరువాత వరదనీరు క్రమంగా తగ్గి పోయింది. ప్రజలు బయటికి వచ్చి చూస్తే పడిపోయిన ఇళ్ళతో, గోతులు పడ్డ వీధులతో పట్టణం బీభత్సంగా తయారయి ఉంది. ఈ వరద తాకిడికి కాబా మందిరం కూడా గురయింది. దాని గోడలు బీటలు వారాయి. కొన్ని గోడలు పూర్తిగా పడిపోయాయి. 'హజ్రె అస్వద్ (నల్లరాయి)' కూడా గోడలో నుంచి జారి కింద పడిపోయింది.

కాబా దుస్థితి చూసి మక్కావాసులు తల్లడిల్లిపోయారు. కాబా మందిరం వారి సర్వస్వం. కాబా దర్శనం కోసం సుదూర ప్రాంతాల నుంచి కూడా ప్రజలు వస్తుంటారు. కాబా వల్ల అరేబియాలో వారికి అమితమయిన గౌరవ ప్రతిష్ఠలు కూడా లభిస్తుంటాయి. అందుకే వారు కాబా వరద తాకిడికి శిథిలమైపోవడం చూసి ఎంతో ఆందోళన చెందారు. ఓరోజు పట్టణ ప్రముఖులంతా సమావేశమయి పరిస్థితి సమీక్షించారు. చివరికి దైవ గృహాన్ని పునర్నిర్మించాలని అందరూ ఏకగ్రీవంగా తీర్మానించారు.

అయితే పునర్నిర్మాణానికి ముందు పాత కట్టడాన్ని పడగొట్టాలి. అమ్మో! దైవగృహాన్ని పడగొట్టడమే!! అంతా కంపించిపోయారు. గునపం తగిలితే ఏ పాపం చుట్టుకుంటుందోనని అందరూ భయపడిపోయారు. పైగా గతంలో ఓసారి అబ్రహా రాజు కాబాను నేలమట్టం చేయడానికి వస్తే దైవశిక్ష విరుచుకుపడి సర్వనాశన మయ్యాడు. అంచేత దైవగృహాన్ని కూలగొడ్తే ఏ ఆపద వచ్చి పడుతుందోనని అందరూ భయపడసాగారు.

కాని కాబా గోడలు పూర్తిగా బీటలు వారాయి. ఏ క్షణంలోనైనా అది సమూలంగా కూలిపోవచ్చు. అందుకని ఎలాగైనా సరే దాన్ని పడగొట్టి పునర్నిర్మించాలనే నిర్ణయానికి వచ్చారు. కొత్త పునాదులతో సరికొత్త కట్టడం నిర్మించాలి. మరి అనుభవశాలురైన మేస్త్రీలు, నిర్మాణ నిపుణులు కావద్దూ? కప్పు వేయాలంటే సామగ్రి కూడా కావాలాయె. ఎలా? పెద్దలు మళ్ళీ ఆలోచనలో పడ్డారు.

విధివశాత్తు ఆ రోజుల్లోనే నిర్మాణ సామగ్రి మోసుకెళ్తున్న ఓడ ఒకటి ఈజిప్టు నుండి అబిసీనియాకు బయలుదేరింది. అది జిద్దా వద్ద రేవుకు ఢీకొని బాగా దెబ్బతిన్నది. ఓడలోని వ్యాపార సామానంతా రేవుకు చేర్చి మరో ఓడ వస్తే తిరిగి ప్రయాణమవుదామని భావించి ఎదురు చూస్తున్నాడు యజమాని.

మక్కావారికి ఈ సమాచారం అందింది. వెంటనే వారు జిద్దా పోయి కాబా నిర్మాణం గురించి అతనికి తెలిపారు. అదృష్టవశాత్తు ఓడ యజమాని భవన నిర్మాణ నైపుణ్యం కూడా కలిగిఉన్నవాడు. కాబా నిర్మాణం అనగానే అతను సంతోషంతో తన సామగ్రిని అమ్మడమే గాక, నిర్మాణకార్యంలో సహకరించడానికి కూడా సమ్మతించాడు.

కాబా గోడలు పడగొట్టే సమయం వచ్చింది. ఈ ఆలోచన రాగానే అందరూ మరోసారి కంపించి పోయారు. తీవ్ర సందిగ్ధంలో పడిపోయారు. తమ సంకల్పం కట్టడాన్ని పునర్నిర్మించాలన్నదే గాని, అబ్రహాలా నాశనం చేయాలన్నది కాదు. ఈ ఆలోచన వారికి కొంత ధైర్యాన్నిచ్చింది. పాత కట్టడం పడగొట్టడానికి ముందుగా వారు పూజలు చేశారు. కానుకలు సమర్పించుకున్నారు. జంతుబలులు చేశారు. ఆ తరువాత వలీద్ అనే ఒకతను ముందుకు వచ్చాడు. వణుకుతున్న చేతులతో గడ్డపార తీసుకున్నాడు. గుండె దిటవు చేసుకొని, నరాలు బిగబట్టి గడ్డపారతో ఒక స్తంభాన్ని పడగొట్టాడు.

ఇక చూడండి. అతనిపై ఏ ఆపద విరుచుకు పడిపోతుందోనని జనం భయపడుతూ ఊపిరి బిగబట్టి ఎదురుచూడసాగారు. అంతా నిశ్శబ్దం. కొన్ని క్షణాలు గడచిపోయాయి. ఊహు, ఏమీకాలేదు. ఆ రాత్రి గడిచింది. ఉదయభానుడు యథాప్రకారం మక్కా గగన తలంపైకి వచ్చాడు. కాని వలీద్ నిక్షేపంగానే ఉన్నాడు. దాంతో ప్రజల మనస్సులు కుదుటపడ్డాయి. ఇక అందరూ కలసి కాబా గోడలు పడగొట్టడం ప్రారంభించారు.

పాత గోడలు పడగొట్టడం పూర్తయ్యాక పునాదుల పని మొదలై చకచకా సాగిపోతోంది. పునర్నిర్మాణ పనిలో మహనీయ ముహమ్మద్ (స), ఆయన పెదనాన్న అబూ తాలిబ్‌లు కూడా పాల్గొన్నారు. ప్రజలు దగ్గర్లో వున్న గుట్టల నుండి రాళ్ళు మోసుకొచ్చారు. చూస్తూ ఉండగానే కాబా గోడలు నిటారుగా లేచి నిల్చున్నాయి.

ఆ తర్వాత కాబాగోడల్లో తూర్పు వైపున 'హజ్రెఅస్వద్'ని యథాస్థానంలో అమర్చే సమయం వచ్చింది. హజ్రెఅస్వద్‌కి అరబ్బులు ఎంతో ప్రాముఖ్యం ఇస్తారు. హజ్



సందర్భంలో దీన్ని వారు ముద్దాడుతారు. అందువల్ల ఈ రాయిని ఎవరు గోడలో అమర్చాలి; ఈ ఘనత ఎవరికి దక్కాలి అనే సమస్య వచ్చింది. ప్రతిఒక్కరూ తనకే దాని పుణ్యం లభించాలని ఆశిస్తున్నారు. ప్రతి తెగా ఈ పుణ్యకార్యం చేసేహక్కు తనకే ఉందని భావిస్తోంది.

దీనిపై పెద్ద వివాదం చెలరేగింది. అది చిలికి చిలికి గాలివానలా తయారయింది. ఎట్టి పరిస్థితిలోనూ ఆ అదృష్టాన్ని తానే దక్కించుకోవాలని ప్రతి వర్గం పట్టుబట్టింది. వాగ్వివాదాలు జరిగాయి. అదిలింపులు, బెదిరింపులు అయ్యాయి. పరిస్థితి అంతకంతకూ విషమిస్తూ పోయింది. ఏ ఒక్కరూ వెనక్కి తగ్గే సూచనలు కన్పించలేదు.

అయిదు రోజులు గడచినా సమస్య ఓ కొలిక్కి రాలేదు. దానిపై పెద్దరభస జరిగింది. చివరికి కొందరు చెయ్యడమో, చావడమో తేల్చుకోవడానికి సిద్ధమయ్యారు. ప్రత్యర్థులు కూడా అందుకు నడుం బిగించారు. పరస్పరం సవాళ్ళు విసురుకున్నారు. పళ్ళు నూరారు. పిడికిళ్ళు బిగించారు. బుసలు కొట్టారు. కత్తులు దూశారు. అంతలో.....

"నాయనలారా! ఆగండి. గౌరవమర్యాదలు, నాయకత్వాలలో మీరందరూ సమానులే. అనవసరంగా ఆవేశపడి కొట్లాడుకోకండి. కాస్త నామాట వినండి" అన్నాడు అబూ ఉమయ్య అనే ఓ వృద్ధుడు.

**అమీన్ తీర్పు అందరికీ శిరోధార్యమే:** అబూఉమయ్యాని అన్ని తెగల వారూ ఎంతో గౌరవిస్తారు. అతని మాటను సాధారణంగా ఏ ఒక్కరూ తీసిపారేయరు. అందువల్ల అందరూ 'సరే వింటాం చెప్పు' అంటూ అతని దగ్గరకు వచ్చారు.

"ఈ సమస్యకు ఒక్కటే పరిష్కారం. సఫా ద్వారం నుంచి మొట్టమొదట ఎవరైతే లోనికి ప్రవేశిస్తారో అతణ్ని మధ్యవర్తిగా స్వీకరించాలి. అతను ఎలా చెబితే అలా నడచుకోవాలి" అన్నాడు అబూఉమయ్య.

ఈ సలహా అందరికీ నచ్చింది. సరేనంటూ ఆ వ్యక్తి కోసం వారు ఎదురుచూడసాగారు. కాబాగృహం చుట్టూ ఉన్న నాలుగు ప్రహరీ గోడలకు నాలుగు ముఖద్వారాలు ఉన్నాయి. అందులో సఫాద్వారం పట్నం వైపు గాకుండా దానికి అభిముఖంగా కొండల వైపుంది. అందరి దృష్టీ సఫాద్వారం వైపు కేంద్రీకృతమయింది.

కొంతసేపయ్యాక ఆ ద్వారం గుండా ఓ అందమైన యువకుడు లోనికి ప్రవేశించాడు. అతణ్ని చూడగానే అందరూ సంతోషంతో ఒక్కసారిగా ఎలుగెత్తి అరిచారు:

"అమీన్! అమీన్!! ముహమ్మద్ అమీన్ చెప్పే తీర్పు మాకందరికీ సమ్మతమే."

సత్యసంధుడైన ముహమ్మద్ (స) పట్ల జనానికి ఎంత నమ్మకం! ఆయన లోపలికి వచ్చి విషయం ఏమిటో తెలియక ప్రజల వైపు ప్రశ్నార్థకంగా చూడసాగారు.

ఖురైష్ నాయకులు సమస్యను ఆయన ముందుంచారు. ముహమ్మద్ (సల్లం) అంతావిని ఒక దుప్పటి తెప్పించారు. దాన్ని నేలమీద పరచి మధ్యలో 'హజ్రెఅస్వద్'ని

ఎత్తిపెట్టారు. దుప్పటి అంచుల్ని అన్ని వర్గాల నాయకులు పట్టుకొని ఆ శిల పెట్టవలసిన చోటికి ఎత్తి పట్టుకురమ్మని చెప్పారు. అలా అందరూ కలసి తెచ్చిన తర్వాత ముహమ్మద్ (సల్లం) తన స్వహస్తాలతో ఆ రాయిని ఎత్తి దాని స్థానంలో అమర్చారు.

ఈ న్యాయనిర్ణయం, సమయస్ఫూర్తి చూసి అందరూ ఎంతో అబ్బురపడ్డారు. ఆయన్ని ఎంతగానో ప్రశంసించారు. గంట క్రితం ఘోరరక్తపాతానికి దారి తీస్తుందను కున్న సమస్య ఇలా ప్రశాంతంగా పరిష్కారమయింది. అమీన్ చూపిన ఉపాయం వల్ల అంతఃకలహం ఆరంభంలోనే అంతరించినందుకు అందరూ ఎంతో ఆనందించారు.

ఆ తరువాత కాబా పునర్నిర్మాణం కొద్ది రోజుల్లోనే ముగిసింది. అప్పటికి అమీన్ జీవితంలో ముప్ఫయి అయిదు వసంతాలు గడచిపోయాయి.

## అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) పాలనలో పునర్నిర్మాణం

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ప్రత్యక్ష అనుచరులలో హజ్రత్ అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) గురించి చాలామంది ముస్లింలకు తెలుసు.

మూడవ శ్రేష్ఠ ఖలీఫా హజ్రత్ ఉస్మాన్ (రజి) పాలనాకాలంలో మొదటిసారిగా "ఖిలాఫత్ వ్యవస్థ" పునాదులు కదిలాయి. ముస్లిం వేషంతో 'ముస్లిం సముదాయం' లోకి జొరబడిన అబ్దుల్లా బిన్ సబా అనే యూదుడు ముస్లింలలో అంతఃకలహాలకు బీజం వేశాడు. పాలకవర్గంలో "బనూ ఉమయ్యా, బనూ అబ్బాసియా" అనే రెండు ప్రముఖ తెగకులుండేవి. హజ్రత్ ఉస్మాన్ (రజి) బనూఉమయ్యా తెగకు చెందినవారు. ఆయన పాలనలో బనూ ఉమయ్యా తెగకు చెందిన వ్యక్తులే ఎక్కువగా ఉండేవారు. అబ్దుల్లా బిన్ సబా ఈ పరిస్థితిని తనకు అనుకూలంగా వాడుకున్నాడు.

ఆ దుర్మార్గుడు రెండు తెగల మధ్య అపోహలు సృష్టిస్తూ, రకరకాల కుట్రలు పన్నుతూ బనూఅబ్బాసియా వారిని బనూఉమయ్యావారి పైకి ఎగదోశాడు. రెండు తెగల మధ్య భయంకరమైన విద్వేషాగ్ని రగులుకొని క్రమంగా దాని జ్వాలలు మింటికెగిశాయి. దాంతో ఈ కలహాగ్నికి హి.శ. 35వ సంవత్సరంలో ఖలీఫా కూడా ఆహుతి కావలసి వచ్చింది. ఆ కాలంలో ఉండిన ప్రవక్త సహచరులలో కొందరు ప్రముఖులు కూడా అబ్దుల్లా బిన్ సబా సృష్టించిన అపోహల సుడిగుండంలో చిక్కుకొని అయోమయంలో పడిపోయారు. వాడు పన్నిన కుట్రతో రాజ్యం నలుమూలల నుండి వేలాది దుండగులు మదీనా వచ్చి నిరాధారమైన ఆరోపణలతో ఖలీఫా ఇంటిని దిగ్బంధించారు. చివరికి వారిలో కొందరు ఇంట్లోకి జొరబడి ఖుర్ఆన్ పారాయణం చేస్తున్న ఖలీఫా హజ్రత్ ఉస్మాన్ (రజి)ని దారుణంగా హతమార్చారు.

ఖలీఫా హత్యతో కూడా ఈ అల్లర్లు అంతంకాలేదు. ఈ హత్యతో ఏర్పడిన అగాధాన్ని పూడ్చడానికి ప్రవక్తప్రత్యక్ష అనుచరులలోని కొందరు ప్రముఖులు సమావేశమయి బనూ అబ్బాసీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న హజ్రత్ అలి (రజి)ని ఖలీఫా పదవికి ఒప్పించారు. అయితే హజ్రత్ ఉస్మాన్ (రజి) అమరగతి కావడానికి కారణమైన



దుండగులంతా హజ్రత్ అలి (రజి)కు మద్దతునిస్తూ ఆయన పంచన చేరిపోయారు.

మరోవైపు హజ్రత్ అలి (రజి) నాల్గవఖలీఫాగా పరిపాలనా పగ్గాలు చేతిలోకి తీసుకోగానే ఇస్లామీయ రాజ్యంలోని ఒక రాష్ట్రానికి గవర్నర్‌గా ఉన్న (బనూఉమయ్యా తెగకు చెందిన) హజ్రత్ ముఆవియా (రజి) ఆయనకు ప్రత్యర్థి అయ్యారు. ముందు ఉస్మాన్ (రజి) హత్యకు ప్రతీకారం తీర్చుకోనిదే తాను అలి (రజి) ప్రభుత్వాన్ని సమర్థించనని పట్టుబట్టారు. దాంతో మరో కొత్త గొడవ మొదలయింది.

ఇది చిలికిచిలికి గాలివానలా మారి కలహాగ్నికి ఆజ్యం పోయడమేగాకుండా సమిష్టి మతనమ్మకాలలో పగుళ్లకు తలుపు కూడా తెరిచింది. ఈపగుళ్లు చివరికి మొత్తం ముస్లిం సముదాయం ముఖ్యంగా షియా, సున్నీలుగా చీలిపోవడానికి దారితీశాయి. అబ్దుల్లా బిన్ సబా సృష్టించిన అపోహలు-అపార్థాలు, పన్నిన కుట్రలు-కుతంత్రాలు పరాకాష్ఠకు చేరుకున్నాయి. దాంతో హజ్రత్ అలి (రజి) కూడా అమరగతినొందారు.

హజ్రత్ ముఆవియా (రజి) తరువాత ఆయన కొడుకు యజీద్ వచ్చి దుర్భర దౌర్జన్యకాండ జరిపించాడు. అతని సైనికులు హజ్రత్ అలి (రజి) కుమారరత్నం హజ్రత్ ఇమామ్ హుసైన్ (రజి)ని కూడా పొట్టన పెట్టుకున్నారు. ఆ కాలంలోనే హజ్రత్ అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) మక్కానగరాన్ని స్వాధీనం చేసుకొని పరిపాలన చేయనారంభించారు. కొంతకాలానికి ఇరాఖ్ కూడా ఆయన అధీనంలోకి వచ్చింది. యజీద్ రాజ్యం సిరియా, ఈజిప్టు, మదీనాలకు పరిమితమై పోయింది.

యజీద్ తన ప్రత్యర్థి అయిన హజ్రత్ అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి)ని లోబరచుకోవడానికి సిరియా నుంచి ఒక సైనిక దళాన్ని మక్కా పంపించాడు. సిరియా సైనికులు మక్కాను దిగ్బంధించి ఓ కొండ మీద నుంచి రాళ్ళవర్షం కురిపించారు. తరువాత దూది, గంధకాలతో కూడిన అగ్నిగోళాలు కూడా విసిరారు. దాంతో కాబాగోడలు బీటలు వారాయి, దాని గిలాఫు కాలిపోయింది, కప్పు కూలిపోయింది. ఇక్కడ కాబాపై ఈ దహనకాండ జరుగుతున్న రోజుల్లోనే సిరియాలో యజీద్ మరణించాడు.

యజీద్ మరణవార్త విన్న శత్రుసైనికులు యుద్ధం ఆపి సిరియా వెళ్ళిపోయారు. హజ్రత్ అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) కాస్త ప్రశాంత పరిస్థితి నెలకొన్న తర్వాత హి.శ. 64వ యేట కాబా పునర్నిర్మాణం వైపు దృష్టి సారించారు. ఆయన ఇబ్రాహీం ప్రవక్త (అలైహి) తీసిన పునదులపై కాబాను పునర్నిర్మించాలని సంకల్పించుకొని నగర ప్రముఖులతో సంప్రదింపులు జరిపారు. అయితే హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి)తో సహా అనేకమంది ఈ ప్రతిపాదనను వ్యతిరేకించారు. కొందరు మాత్రమే సమర్థించారు. హజ్రత్ అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) ప్రతిపాదనను వ్యతిరేకించినవారికి నచ్చజెపుతూ కాబానిర్మాణం గురించి దైవప్రవక్త (సల్లం) చెప్పిన ఈ మాటలను గుర్తుచేశారు:

"దైవప్రవక్త (స) హజ్రత్ ఆయిషా (రజి)తో మాట్లాడుతూ 'ఆయిషా! నీకీ సంగతి తెలియదు. నీ జాతి (ఖురైష్) వాళ్ళు దైవమందిరాన్ని పూర్తిగా ఇబ్రాహీమి పునాదులపై

నిర్మించలేక పోయారు. వారు కొంత భాగం తగ్గించారు' అని అన్నారు. హజ్రత్ ఆయిషా (రజి) ఈమాట విని 'అలాగయితే దైవప్రవక్తా! మీరు ఇబ్రాహీమి పునాదుల ప్రకారం దాన్ని మళ్ళీ ఎందుకు నిర్మించలేదు?' అని ప్రశ్నించారు. దానికి దైవప్రవక్త (సల్లం) సమాధానమిస్తూ 'నీ జాతి (ఖురైష్) వాళ్ళు ఇప్పుడిప్పుడే (ఇస్లాం స్వీకరించి) ముస్లింలయి పోయారు. వారు మార్గభ్రష్టులయి పోతారన్న ప్రమాదం గనక లేకపోతే నేను అలాగే నిర్మించేవాడ్ని' అని అన్నారు." (సహీ బుఖారి)

అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) ఈవిధంగా నచ్చజెప్పి, చివరికి ఇబ్రాహీమి పునాదుల ప్రకారం పూర్వం ఖురైషీయులు వదలిన ఖాళీస్థలాన్ని (హతీంని) కాబా పరిధిలో చేర్చి పునర్నిర్మించారు. దానికి తూర్పు, పడమరల వైపున రెండుద్వారాలు కూడా నేలబారుగా ఏర్పరిచారు. ప్రజలు అప్పట్నుంచి కాబాప్రదక్షిణ చేస్తూ దాని నాలుగు మూలలనూ చేత్తో తాకేవారు. అంతకుముందు ఖురైషీయుల నిర్మాణంలో కొంతభాగం ఖాళీగా వదిలేసి నందున దైవప్రవక్త (సల్లం) రెండు మూలలను మాత్రమే తాకేవారు.

**అసమగ్ర కట్టడంగా మిగిలిన కాబా:** కొత్త నిర్మాణం తరువాత ప్రజలు కాబా సమగ్ర కట్టడం ప్రదక్షిణ చేశాక తూర్పు ద్వారం గుండా లోపలికి ప్రవేశించి పడమర ద్వారం గుండా బయటికి వచ్చేవారు. ఈవిధంగా చాలాకాలం జరిగింది.

యజీద్ మరణించిన తరువాత అతని కుమారుడు ముఆవియా కొన్నాళ్ళు మాత్రమే ఖలీఫాగా పరిపాలను చేసి తనువు చాలించాడు. అప్పటి నుంచి ఆరేడు నెలల వరకూ మొత్తం ఇస్లామీయ రాజ్యానికి హజ్రత్ అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) మాత్రమే ఖలీఫాగా ఉండేవారు. ఆ తరువాత ఆయన అధీనంలోని ప్రాంతాలపై ప్రత్యర్థి వర్గాల దాడులు పెరిగిపోయి పరిస్థితులు క్రమంగా విషమించాయి.

సిరియా ఖలీఫాగా వచ్చిన అబ్దుల్ మలిక్ హి.శ. 72లో హజ్జాజ్ బిన్ యూసుఫ్‌కు ఓపెద్ద సైన్యాన్నిచ్చి మక్కా పంపాడు. అతను మక్కా నగరాన్ని దిగ్బంధం చేసి యుద్ధం ప్రారంభించాడు. దిగ్బంధం నాలుగు నెలలు కొనసాగింది. ఈ సుదీర్ఘ ముట్టడితో ఇబ్బందులు పాలయి అనేకమంది ప్రజలు మక్కా వదలి పోయారు. అటు హజ్జాజ్ సైనిక సంఖ్య క్రమంగా పెరిగిపోయింది. హజ్జాజ్ దౌర్జన్యాల వల్ల హజ్ కోసం బయటి నుంచి వచ్చిన యాత్రికులు సైతం హజ్ నియమాలు పూర్తిగా పాటించలేక పోయారు.

హజ్ దినాలు పోగానే హజ్జాజ్ మక్కాపై రాళ్ళు, అగ్నిగోళాలతో తీవ్రమైన దాడులు ప్రారంభించాడు. ఆ సందర్భంలో ఓ పెద్దరాయి వచ్చి కాబా మీద పడింది. దాంతో కాబా కప్పు కూలిపోయింది. సరిగ్గా అదే సమయంలో ఆకాశం నుండి భయంకరమైన ఓ గర్జన విన్పించి, ఓ మెరుపు మెరిసింది. ఆ తర్వాత నింగి నేల అంతా గాఢాంధకారం అలుముకుంది. ఈ పరిస్థితి చూసి హజ్జాజ్ సైనికులు భయపడిపోయి రాళ్ళు విసరడం మానేశారు. వారిలో అనేకమంది చనిపోయారు కూడా. కాని హజ్జాజ్ బిన్ యూసుఫ్ సైనికులకు నచ్చజెబుతో "ఈ గర్జన, మెరుపులు మన విజయానికి సంకేతం" అన్నాడు.



ఆ తరువాత ఆ దుర్మార్గుడు ఓ దుష్టపన్నాగం పన్నాడు. దాని వల్ల హజ్రత్ అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) సైన్యంలోని అనేకమంది సైనికులు ఆయన్ని వదిలేసి హజ్జాజ్ దగ్గరకు వెళ్ళిపోయారు. ఆఖరికి ఆయన కుమారులలో కూడా ఇద్దరు ఆయన్ని వదలి వెళ్ళిపోయారు. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో సైతం హజ్రత్ అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) ఏమాత్రం నిరాశచెందకుండా శత్రువుతో హోరాహోరిగా పోరాడి హి.శ. 73లో నేల కూలిపోయారు.

ఆ తరువాత హజ్జాజ్ మక్కాలో ప్రవేశించి కాబాలయంలో పడిన రాళ్ళు, రక్త బిందువుల్ని చూసినా చలించలేదు. అతను కాబా నూతననిర్మాణం గురించిన ఒక నివేదిక ఖలీఫా అబ్దుల్ మలిక్‌కు పంపించాడు. ఖలీఫా అబ్దుల్ మలిక్ కాబాను విస్తరించి కట్టినంత మేరకు పడగొట్టి నిర్మించమని హజ్జాజ్‌ని ఆదేశించాడు. దాని ప్రకారం హజ్జాజ్ కాబా గర్భగుడిని ప్రవక్త కాలంలో వున్న విధంగా పునర్నిర్మించాడు. ఆ తరువాత ఖలీఫా దృష్టికి హజ్రత్ ఆయిషా (రజి) ఉల్లేఖించిన ప్రవక్త ప్రవచనాలు రాగానే అతను చాలా పశ్చాత్తాప పడ్డాడు. కాని కాబాను దైవప్రవక్త (స) ప్రవచనాల ప్రకారం విస్తరించకుండా యధాతథంగా ఉంచాడు. (సహీముస్లిం)

# 43. జమ్‌జమ్ జలనిధి పుట్టుపూర్వోత్తరాలు

జమ్‌జమ్ నీళ్ళు తొలిసారిగా తాగుతున్నప్పుడు హాజీల మస్తిష్కాలలో హజ్రత్ హాజరా (రజి), ఆమె పసిబిడ్డ హజ్రత్ ఇస్మాయీల్ (అలైహి)లు నీటికోసం తపించిపోయిన దృశ్యం మెదలుతుంది. అదో గొప్ప చారిత్రక సంఘటన.

'జమ్‌జమ్' అనేది నాలుగు వేల సంవత్సరాల క్రితం మహిమాన్వితంగా వెలసిన ఓ మంచినీటి ఊటబావి; పచ్చదనం మచ్చుకైనాలేని భయంకరమైన ఎడారి ప్రాంతంలో దేవుని ప్రియదాసుల కోసం హఠాత్తుగా ఉబికివచ్చిన విశిష్ఠ జలధార; ఎంత నీరు తోడినా తరగని అపూర్వ జలనిధి; ఏటా లక్షలాది యాత్రికుల ఆధ్యాతిక సేద తీర్చుతున్న అమృత జలాశయం ఇది.

## తల్లీబిడ్డల నీటి తపన

నాలుగు వేల సంవత్సరాలకు పూర్వం హజ్రత్ ఇబ్రాహీం (అలై) విశ్వప్రభువు ఆజ్ఞ ప్రకారం తన సతీమణి హజ్రత్ హాజరా (రజి)ను, పసి కుమారుడు హజ్రత్ ఇస్మాయీల్ (అలై)ను కొండలు, గుట్టల మధ్య ఓ నిర్జనప్రదేశంలో వదలిపెట్టి వెళ్ళి పోయారు. అప్పుడా తల్లి కొడుకుల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించవచ్చు. దిక్కులేని వారికి దేవుడే దిక్కు అన్నట్లు, ఆ దేవుడే వారిని ఆకలిదప్పుల బాధ నుండి కాపాడాడు.

అంతా విధి నిర్ణయం ప్రకారమే జరుగుతుంది. అది సృష్టికర్త నిర్ణయించిన ఓ భవిష్యత్ ప్రణాళిక. అది ఎట్టి పరిస్థితుల్లోనూ అమలు జరిగితీరుతుంది. దాన్ని ఏ దుష్టశక్తీ అడ్డుకోలేదు. అయితే ఆశాజీవి అయిన మానవుడు ఏమాత్రం నిరాశ చెందకుండా తన వంతు ప్రయత్నం చేయాలి. హజ్రత్ హాజరా (అలైహి) కూడా వెంట

తెచ్చుకున్న నీళ్ళు అయిపోయి చంటి పిల్లవాడు దప్పికతో ఏడుస్తున్నప్పుడు నిరాశ చెందకుండా తన వంతు ప్రయత్నం చేశారు.

ఆ సాధ్వీమణి పిల్లవాణ్ణి ఓ చోట పండబెట్టి నీటి అన్వేషణ కోసం బయలుదేరారు. ఆమె సమీపంలోని 'సఫా' కొండ పైకి ఎక్కి చూశారు ఎవరైనా బాటసారులు కన్పిస్తారేమో నని. కాని ఎవరూ కన్పించక పోవడంతో ఆమె కొండ దిగి క్రిందికి వచ్చారు. పిల్లవాడి పరిస్థితి చూడలేక ఆమె ఆందోళన పడుతూ 'సఫా' కొండకు ఎదురుగా ఉన్న 'మర్వా' కొండ వైపు పరుగెత్తారు. దాని మీద ఎక్కిచూస్తే అక్కడా బాటసారులెవరూ కన్పించలేదు. ఈవిధంగా ఆమె ఆ కొండ మీదనుంచి ఈ కొండ మీదికి, ఈ కొండ మీదనుంచి ఆ కొండ మీదకు ఏడు సార్లు తిరిగారు.

ఏడవ సారి 'మర్వా' కొండ ఎక్కినప్పుడు ఆమెకు దూరాన్నుంచి ఓ మానవ కంఠస్వరం విన్పించింది. మొదట్లో ఆమె అదేదో తన భ్రమ అనుకొని పట్టించుకోలేదు. జాగ్రత్తగా వింటే ఆ ధ్వని మాటిమాటికి విన్పిస్తోంది. అప్పుడు హజ్రత్ హాజరా (అలైహి) ధ్వని వస్తున్న వైపు తిరిగి "నేను నీ కంఠస్వరం విన్నాను. ఏదైనా సహాయం చెయ్యగలిగితే చెయ్యి" అని అన్నారు.

దానికి ఎలాంటి సమాధానం రాలేదు కాని, కొండ మీది నుంచి పిల్లవాడ్ని పండ బెట్టినవైపు చూస్తే అక్కడ ఓ అపూర్వదృశ్యం కన్పించింది. ఒక మనిషి (జిబ్రీల్) నిలబడి కాలితో నేల మీద తట్టాడు. వెంటనే నేలలో నుంచి నీరు ఉబికి వచ్చింది.

హజ్రత్ హాజరా (రజి) ఈ దృశ్యం చూడగానే గబగబా కొండ దిగి అటువైపు పరుగెత్తారు. అక్కడకు చేరుకొని తొందర తొందరగా దోసిలితో తోలుతిత్తిలో నీళ్ళు నింపుకున్నారు. ఆ నీటిని పిల్లవాడికి తాగించి, తాను కూడా కడుపారా తాగారు. నేలలో నుంచి నీళ్ళు ఇంకా ఉబికి వస్తూనే ఉన్నాయి. హజ్రత్ హాజరా (రజి) నీళ్ళు వృధాపోకుండా ఉండేందుకు ఆ ఊట చుట్టూ ఇసుకతో కట్ట కట్టి జలధారను ఆపడానికి ప్రయత్నించారు. కట్ట కట్టగానే జలధార ఆగిపోయింది.

అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఈ సంఘటన గురించి ప్రస్తావిస్తూ ఇలా అన్నారు: "హజ్రత్ హాజరా (రజి) జమ్‌జమ్ నీటిని ఆవిధంగా దోసిలితో తోలుతిత్తిలో పోయకుండా ఉండినట్లయితే జమ్‌జమ్ (బావిగా మారడానికి బదులు) సెలయేరులా ప్రవహిస్తూ ఉండేది." (సహీ బుఖారి)

## కనుమరుగైన జలనిధి కలలో కన్పించింది

ఈ సంఘటన జరిగిన రెండున్నరవేల ఏండ్ల తరువాత మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) తాతగారు అబ్దుల్ ముత్తలిబ్ కాబా ధర్మకర్త అయ్యారు. కాని ఆనాడు మక్కాలో జమ్‌జమ్ బావి కాదు కదా, దాని చిహ్నాలు కూడా లేకుండా పోయాయి.

అబ్దుల్ ముత్తలిబ్ కాబా నిర్వహణ బాధ్యత చేపట్టగానే మొదట కాబా యాత్రికుల సమస్యల్ని గురించి ఆలోచించాడు. వాటిలో అతనికి మంచినీటి కొరత పెద్ద సమస్యగా



గోచరించింది. మక్కా ప్రజలకు పట్నం వెలుపల శివార్లలో ఉన్న కొన్ని బావుల్లో నుంచి మాత్రమే కొంత నీరు లభిసున్నది. అంతదూరం నుంచి పట్నంలోకి యాత్రికుల కోసం నీరు మోసుకురావడం కూడా సమస్యగానే ఉంది.

ఈ సమస్యే అబ్దుల్ ముత్తలిబ్‌ని నిరంతరం బాధిస్తూ ఉంది. జమ్‌జమ్ బావినీరు ఎంతో మధురంగా ఉంటుంది. ఎంత తోడినా తరగని అపార జలనిధి. అదీగాక నీరు ఎంతో పైకి ఉండేది. సులభంగా తోడుకోవచ్చు. అలాంటి బావి కనపడకుండా పోయింది. దాన్ని ఎవరు పూడ్చి నాశనం చేశారో! అబ్దుల్ ముత్తలిబ్ ఓరోజు ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ "జమ్‌జమ్ బావిని ఎవరు పూడ్చారు? ఎందుకు పూడ్చవలసి వచ్చింది?" అని అడిగాడు కొందరు వృద్ధ ఖురైషీయుల్ని.

"మొదట్లో ఇక్కడ జుర్హుమ్ తెగవాళ్ళు పరిపాలన చేస్తుండేవారు. అయితే కొంత కాలానికి ఆ తెగవాళ్ళలో నీతినియమాలు సన్నగిల్లడం ప్రారంభమయింది. అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయి. దాంతో బనూ ఖుజాఅ తెగవాళ్ళు వారిమీద తిరగబడ్డారు. జుర్హుమ్ తెగవారికి, వారి రాజు ముజాజ్ జుర్హుమికి వ్యతిరేకంగా యుద్ధం ప్రారంభించారు. ఈ యుద్ధంలో జుర్హుం తెగవాళ్ళు చిత్తుగా ఓడిపోయారు. అప్పుడు ముజాజ్ జుర్హుమి మక్కా నుండి పారిపోతూ ప్రతీకారంగా కాబాలోని కానుకల్ని జమ్‌జమ్ బావిలో విసిరేసి, దాన్ని పూడ్చి వెళ్ళాడు" చెప్పారు వృద్ధ ఖురైషీయులు.

"అట్లాగానా! ఎంత దుర్మార్గానికి పాల్పడ్డారు!! సరే..... ఏమయినప్పటికీ జమ్‌జమ్ బావిని వెతికి తీసి, దాని నీటిని ప్రజలు వాడుకునేలా చేసే వరకు నాకు మనశ్శాంతి ఉండదు" అన్నాడు అబ్దుల్ ముత్తలిబ్.

అలా అన్నాడేకాని, చాలా కాలందాకా అతనికి ప్రత్యామ్నాయ మార్గం కన్పించలేదు. కాలం మరికొన్నేండ్లు ముందుకు సాగింది. అబ్దుల్ ముత్తలిబ్‌కు వివాహమయి అనేక సంవత్సరాలు గడచినా ఒక్క కొడుకు మాత్రమే పుట్టాడు. అతను పెరిగి పెద్దవాడయి తండ్రికి కుడిభుజంలా మసలుకుంటున్నాడు. ఆ తరువాత ఓరోజు.......

..కళ్ళు చించుకున్నా కానరాని కటిక చీకటిలో మక్కాపట్నం పూర్తిగా సద్దుమణిగింది. చీమ చిటుక్కుమన్నా విన్పించేటంతటి గంభీరమైన నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. కాకపోతే అక్కడక్కడ కొన్ని ఇండ్ల నుండి గురకలు మాత్రం లయబద్ధంగా విన్పిస్తున్నాయి. పొద్దస్తమానం కష్టపడిన శ్రమజీవులు మేను మరచి గాఢంగా నిద్రపోతున్నారు. అబ్దుల్ ముత్తలిబ్ కూడా ఓ పక్కకు తిరిగి ప్రశాంతంగా నిద్రపోతున్నాడు.

అప్పుడు "అబ్దుల్ ముత్తలిబ్! లే. లేచి జమ్‌జమ్‌ని వెలికి తియ్యి" అన్న ధ్వని విన్పించింది. దాంతో అబ్దుల్ ముత్తలిబ్ ఉలిక్కిపడి లేచాడు. చూస్తే పడక గదిలో ఎవరూ లేరు. అదేదో తన భ్రమ అనుకొని అతను మళ్ళీ నిద్రకు ఉపక్రమించాడు.

తెల్లవారింది. అబ్దుల్ ముత్తలిబ్ ఆ విషయం అంతటితో మరచిపోయి దైనందిన కార్యకలాపాలలో నిమగ్నుడయి పోయాడు. సూర్యాస్తమయం కాగానే చీకటి రక్కసి

మళ్ళీ జడలు విప్పింది. జనం యథాప్రకారం తలుపులు మూసుకొని పడకల మీదికి చేరారు. సరిగ్గా నడిరేయి సమయంలో మళ్ళీ అదే విచిత్ర ధ్వని! "అబ్దుల్ ముత్తలిబ్! లే. లేచి జమ్‌జమ్ బావిని వెలికి తియ్యి."

అబ్దుల్ ముత్తలిబ్ మళ్ళీ ఉలిక్కిపడిలేచి, చుట్టూ కలియజూస్తే ఎవరూ కన్పించ లేదు. "ఏమిటీ వింత శబ్దం! ఎవరు తనను పిలుస్తున్నది?" ఇలా ఆలోచిస్తూ తిరిగి నిద్రలోకి ఒరిగిపోయాడు. కాని ఉదయం లేవగానే ఆ విషయం గురించిన ఆలోచనలు ముసురుకున్నాయి. అయినా ఎలాంటి నిర్ణయానికి రాలేకపోయాడు. మరచిపోవాలన్నా మరువలేక పోతున్నాడు.

మూడవ రోజు కూడా నడిరేయి సమయంలో అదే కంఠస్వరం విన్పించింది. "అబ్దుల్ ముత్తలిబ్! లే. లేచి జమ్‌జమ్ బావిని వెలికి తియ్యి. దానివల్ల నీకు, నీ సంతతికి గౌరవప్రతిష్ఠలు లభిస్తాయి. అది ఎన్నటికీ ఎండిపోదు; దాని నీరు తరగిపోవడం కూడా జరగదు. ఆ నీరు హాజీలు తాగుతారు. 'జమ్‌జమ్ బావి' పేడ, రక్తం మధ్య తెల్లకాకి పొడిచి తినే బలిప్రదేశంలో ఉంది."

కలలో ఎవరో పుణ్యపురుషుడు ఈ మాటలు చెబుతూ అబ్దుల్ ముత్తలిబ్‌ని కాబా మందిరానికి తీసి కెళ్ళాడు. అక్కడ జమ్‌జమ్ బావి ఉన్న బలిప్రదేశాన్ని కూడా చూపించాడు. ఆతర్వాత ఆ వ్యక్తి అదృశ్యమై పోయాడు. కల చెదరిపోయింది. అబ్దుల్ ముత్తలిబ్ తృళ్ళిపడి లేచాడు. ఇది నిజంగా కాబా ప్రభువు నుండి వచ్చిన ఆదేశమయి ఉంటుందని భావించాడు. ఈ ఆలోచనతో ఆయనకు ఆ తర్వాత నిద్ర పట్టలేదు.

తెల్లవారిన తర్వాత కొడుకు హారిస్‌ని పిలిచి కలలో అందిన ఆజ్ఞ గురించి తెలియ జేశాడు. ఆ తర్వాత హారిస్‌ని వెంటబెట్టుకొని కాబాలయానికి వెళ్ళాడు. అక్కడ ఖురైష్ నాయకుల్ని పిలిపించి వారిక్కూడా ఈ విషయం తెలియజేస్తూ ఇలా అన్నాడు:

"సోదరులారా! గత మూడు రాత్రులు కలలో నాకిలాంటి ఆజ్ఞలు లభించాయి. కలలో తెలియజేయబడినట్లు ఈ ప్రదేశంలోనే జమ్‌జమ్ బావి ఉంటుందని నాకు గట్టి నమ్మకం ఉంది. కాని ఇక్కడ త్రవ్వకం జరిపి జమ్‌జమ్‌ను వెలికితీయడం ఎంతో శ్రమతో కూడిన పని. మీరు కూడా నాతో సహకరిస్తే ఈ పని సులభమవుతుంది".

ఖురైష్ నాయకులు ఈ మాటలు విని ఒకరి ముఖాలు ఒకరు చూసుకోసాగారు. ఒకతను ముందుకొచ్చి "ఇదంతా మీ భ్రమ. కలలోని మాటలు నిజమవుతాయ నుకోవడం కన్నా మించిన వెర్రితనం మరొకటిలేదు. జమ్‌జమ్‌ను వెతికితీయడం సాధ్యమయ్యే పనికాదు" అన్నాడు నిర్లక్ష్యంగా. "ఈ ప్రదేశంలో మనం త్రవ్వకం ఎలా జరపగలం? దీనికి ఇరువైపులా మన దేవతా విగ్రహాలున్నాయి. ఇక్కడ త్రవ్వితే పాపం మూట కట్టుకున్నట్లే" అన్నాడు మరొకడు.

"విగ్రహాలు పెద్దసమస్య కాదు. వీటిని ఇక్కడ్నుంచి తీసి వేరే చోటికి తరలించ వచ్చు" అన్నాడు అబ్దుల్ ముత్తలిబ్.



"ఎంతమాత్రం వీల్లేదు. వీటిని ఇక్కడే ఉండనివ్వాలి. ఎన్నో యేండ్లుగా ఇక్కడ వుంటున్న ఈ విగ్రహాల్ని తొలగించడమంటే దేవతల ఆగ్రహాన్ని మనం చేజేతులా కొని తెచ్చుకోవడమే. మేమీ పనిలో మీతో సహకరించలేం" అన్నాడు వేరొక వ్యక్తి. "ఔను, మేము మీతో ఏమాత్రం సహకరించలేం" అన్నారు మరో నలుగురు.

"సరే, మీరు సహకరించినా సహకరించకపోయినా, నేను మాత్రం ఈ పని చేసి తీరుతాను" అన్నాడు అబ్దుల్ ముత్తలిబ్ ఎంతో ఆత్మవిశ్వాసంతో.

"సరే మీ ఇష్టం.... ఈయన గారికేదో కీడు మూడింది. అందుకే ఈ దుస్సాహసానికి పాల్పడుతున్నాడు" అన్నారు కొందరు. "పర్యవసానం ముందుకు వస్తేగాని వాస్తవం అర్థం కాదు." అని మరికొందరు చెప్పుకుంటూ అక్కడ్నుంచి వెళ్ళిపోయారు.

ఆ తరువాత అబ్దుల్ ముత్తలిబ్ కొడుకు హారిస్ సహాయంతో 'జమ్‌జమ్' చోటు నుండి విగ్రహాలను వేరే చోటుకు తరలించి త్రవ్వకం మొదలుపెట్టాడు. చివరికి ఆయన శ్రమ ఫలించింది. జమ్‌జమ్ జలం చూసి ఆయన పరమానందభరితుడయ్యాడు.

జమ్‌జమ్ బావిలో జుర్హుమీ తెగ నాయకుడు ముజాజ్‌కు చెందిన అనేక ఖడ్గాలు, డాళ్ళు, కవచాలు దొరికాయి. ప్రజలు దేవతలకు సమర్పించుకున్న కానుకలు కూడా లభించాయి. ఆ కానుకలలో రెండు బంగారుజింకలు కూడా ఉన్నాయి. ఖురైష్ నాయకులు ఇదంతా చూసి సిగ్గుపడిపోయారు. ఈ పవిత్రకార్యంలో తాము పాలుపంచు కోలేకపోయామే అని తెగ బాధపడిపోయారు.

"మేము అబ్దుల్ ముత్తలిబ్‌కు ఏదో పిచ్చి పట్టిందని అనుకున్నాం. కాని ఆయన తాననుకున్న కార్యం సాధించితీరే దృఢ మనస్కుడని ఇప్పుడర్థమయింది" అని చెప్పు కున్నారు వారు తమ సహాయనిరాకరణకు సిగ్గుపడుతూ.

జమ్‌జమ్ బావి బయటపడిందని, ఇకనుంచి ఎడతెగకుండా లభించే దాని మధురమైన నీటిని హాయిగా తాగవచ్చని తెలియగానే జనం గుంపులు గుంపులుగా వచ్చి చూడసాగారు. అబ్దుల్ ముత్తలిబ్‌ని వారు ప్రశంసలతో ముంచెత్తనారంభించారు.

## 44. కాబాలోని ప్రత్యేక భాగాలు

కాబాలయంలో కొన్ని ప్రత్యేక భాగాలు ఉన్నాయి. వాటిలో జమ్‌జమ్, హజ్రె అస్వద్, రుకునె యమాని, హతీం, మఖామె ఇబ్రాహీం అనేవి ముఖ్యమైన భాగాలు. హజ్ యాత్రికులు వీటి పుట్టు పూర్వోత్తరాలు, ఔన్నత్యాలను గురించి తెలుసుకోవలసిన అవసరం ఎంతయినా ఉంది. అప్పుడే వారు వాటి పట్ల తమ ప్రవర్తన, ఆచరణల ద్వారా పూర్తి ప్రయోజనం పొందగలుగుతారు.

### జమ్‌జమ్ ఔన్నత్యం, దాని విసిష్ఠతలు

జమ్‌జమ్ జలాశయం కాబా గర్భగుడికి తూర్పు వైపున ఉంది. దీనికి అనేక పేర్లు ఉన్నాయి. ఒక వస్తువుకు అనేక పేర్లు ఉండటం కూడా దాని ఔన్నత్యానికి ఓ

నిదర్శనం అని చెప్పవచ్చు. 'జమ్‌జమ్'కు రెండు అర్థాలు ఉన్నట్లు పరిశోధనలో వెల్లడయింది. ఒక పరిశోధన ప్రకారం అరబ్బులు పదార్థం లేక వస్తువులు అత్యధికంగా ఉండటాన్ని జమ్‌జమ్ అంటారు. అనేకం ఒకచోట కూడి ఉండటాన్ని కూడా జమ్‌జమ్ అంటారు. అంచేత ఈ బావికి జమ్‌జమ్ అని పేరొచ్చిందని చెబుతారు. మరొక పరిశోధన ప్రకారం హజ్రత్ హాజరా (రజి) నేలనుండి ఉబికి వస్తున్న నీరు నలువైపులా వ్యాపించి వృధాపోకుండా ఉండేందుకు కట్ట వేసినందున దీనికి జమ్‌జమ్ అని పేరొచ్చింది.

జమ్‌జమ్‌ను దేవుని ఆజ్ఞతో దైవదూత హజ్రత్ జిబ్రీల్ (అలై) తవ్వారని హదీసు ద్వారా తెలుస్తోంది. దాన్నిగురించి మహాప్రవక్త (స) ఇలా అన్నారు: "ఇది జిబ్రీల్ తవ్విన బావి; ఇస్మాయీల్ కోసం నిర్మించిన జలనిధి (వాటర్‌ట్యాంక్)." (దారె ఖుత్నీ)

సఫా, మర్వా కొండల మధ్య 'సయీ' చేసి, క్షవరం చేయించుకున్న తరువాత జమ్‌జమ్ నీళ్ళను పక్కటెముకలు నిటారయ్యేలా బాగా కడుపునిండా తాగాలి. జమ్‌జమ్ ఎంతెక్కువ తాగితే అంత మంచిది. కపట విశ్వాసి పక్కటెముకలు నిటారయ్యేలా కడుపు నిండా తాగలేడు. ఈ విషయం గురించి దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు:

"మనకు, కపట విశ్వాసులకు ఓ ప్రత్యేక తేడా ఉంది. కపటులు పక్కటెముకలు నిటారయ్యే వరకు జమ్‌జమ్ నీళ్ళను కడుపునిండా తాగలేరు." (ఇబ్నెమాజ)

మహాప్రవక్త (స) జమ్‌జమ్ జలం ఔన్నత్యం, విశిష్ఠతలను గురించి ప్రవచించిన హదీసులు హాజీలకు గొప్ప వరాలని చెప్పవచ్చు. ఆయనిలా తెలిపారు:

"జమ్‌జమ్ నీటిని ఏ ఉద్దేశంతో తాగితే ఆ ఉద్దేశం నెరవేరుతుంది." (ఇబ్నెమాజ)

"ఎవరైనా శత్రువుల బారి నుండి రక్షణ పొందే ఉద్దేశంతో జమ్‌జమ్ నీరు తాగితే అతనికా రక్షణ లభిస్తుంది." (హాకిమ్)


"భూమండలపై అన్నిటికంటే అత్యంత శ్రేష్ఠమైన నీరు జమ్‌జమ్ నీరే; అతిచెడ్డ నీరు హజ్రెమౌత్ (యమన్ ఎడారిఊబి)లోని బర్హూత్‌లోయ నీరే. ఆ నీటిలో మిడత కాళ్ళంతటి పొడవైన పురుగులుంటాయి. ఆ నీరు ఉదయం (మరుగుతున్న నీటిలా పొంగుతుంటుంది. కాని సాయంత్రం కాగానే అక్కడ తడి కూడా కన్పించదు." (తబ్రాని)

ఒక హదీసు ప్రకారం "దైవప్రవక్త (సల్లం) హజ్రెఅస్వద్ నుండి హజ్రెఅస్వద్ వరకు 'రమల్' చేస్తూ (అంటే ఠీవీ, దర్పంతో నడుస్తూ) మూడు ప్రదక్షిణలు చేశారు. తరువాత రెండు రకాతులు నమాజ్ చేసి హజ్రెఅస్వద్ వైపుకు నడిచారు. ఆ తరువాత జమ్‌జమ్ బావి దగ్గరకు వెళ్ళి జమ్‌జమ్ నీళ్ళు తాగారు. తల మీద కూడా కొంచెం జమ్‌జమ్ నీళ్ళు పోసుకున్నారు." (ముస్నద్ అహ్మద్, ముస్లిం)

"జమ్‌జమ్‌ను ఏలక్ష్యంతో తాగితే ఆ లక్ష్యానికి ఇది దోహదపడుతుంది. స్వస్థత కోసం తాగితే దేవుడు స్వస్థత చేకూర్చుతాడు. సుఖంగా ఉండాలని తాగితే దేవుడు మీకు సుఖం కలిగిస్తాడు. దప్పిక తీరడానికి తాగితే దప్పిక తీరుస్తాడు. ఇది జిబ్రీల్



కాబా గర్భగుడి కొలతలు(డయాగ్రం)




**↑ కాబా గర్భగుడి డయాగ్రం- కొలతలు, జమ్‌జమ్‌ఊటలు ↓**



తన కాలితోపుతో తవ్విన బావి; ఇస్మాయీల్ కోసం వెలసిన జలధార." (దారెఖుత్నీ)

అబూజర్ గిఫ్ఫారీ (రజి) కథనం: "నేను ముస్లిం అయినతర్వాత దైవప్రవక్త (స)తో మాట్లాడుతూ 'దైవప్రవక్తా! నేను ముప్ఫయిరోజులు రాత్రింబవళ్ళు ఇక్కడే (కాబాలో) గడిపాను'అన్నాను. దైవప్రవక్త (స) ఈమాట విని 'అయితే (అన్ని రోజులదాకా) అన్నం నీళ్ళు ఎక్కడ్నుంచి వచ్చాయి?' అనడిగారు. దానికి నేను 'దైవప్రవక్తా! జమ్‌జమ్ నీళ్ళు తప్ప మరేలాంటి తిండిలేదు నాకు. అయినా నాలో ఎలాంటి నీరసం రాలేదు. పైగా నేను పొట్టమీద మడతలు పడేటంతగా లావెక్కాను' అని చెప్పాను. అప్పుడు దైవప్రవక్త (స) 'ఇది శుభవంతమైన నీరు, ఆహారంగా కూడా పనిచేస్తుంది' అన్నారు." (ముస్లిం)

## జమ్‌జమ్‌తో హృదయశుద్ధి

జమ్‌జమ్ నీళ్ళతో రెండుసార్లు దైవప్రవక్త (సల్లం) హృదయాన్ని శుద్ధి చేయడం కూడా జరిగింది. ఒకసారి బాల్యంలో, మరొకసారి మేరాజ్ (గగన పర్యటన) సందర్భంలో ఆయనకు జమ్‌జమ్‌తో చిత్తశుద్ధి జరిగింది. అది ఎలాగో వింటారా? వినండి మరి.....

బాలముహమ్మద్ (సల్లం) తన స్తన్యసంబంధ సోదరుడు అబ్దుల్లాతో కలసి మేకలు కాయడం ప్రారంభించారు. ఓరోజు యథాప్రకారం వారిద్దరూ మేకలను ఊరి బయటికి తోలుకెళ్ళారు. వాటిని ఆకులు అలములు మేయడానికి వదిలేసి ఒకచోట ఆడుకోవడం మొదలెట్టారు. వారికి మరికొందరు పిల్లలు కూడా తోడయ్యారు.

అంతలో ఇద్దరు అపరిచిత వ్యక్తులు వారి దగ్గరకు వచ్చారు. వారిలో ఒకతను చిన్నారి ముహమ్మద్ (సల్లం)ని వడిసి పట్టుకున్నాడు. వెంటనే రెండో వ్యక్తి ఆయన రొమ్మును కత్తితో చీల్చి గుండెకాయను బయటికి తీశాడు.

ఈ భయంకర దృశ్యం చూసి అబ్దుల్లాతో పాటు పిల్లలంతా "వామ్మో!" అంటూ పరుగు లంకించుకున్నారు. "అమ్మా! అమ్మా!! మరేమో... మన ముహమ్మద్‌ని ఎవరో చంపేశారే" అన్నాడు అబ్దుల్లా రొప్పుతూ రోజుతూ.

ఈమాట విని హలీమా, ఆమె భర్త అదిరిపడ్డారు. ఇద్దరూ కంగారుపడుతూ ఊరి బయట మేకలు మేస్తున్న చోటికి పరుగుతీశారు. చూస్తే బాల ముహమ్మద్ (స) నిక్షేపంగానే ఉన్నారు. కాకపోతే ఢీలాపడిపోయి బిత్తరచూపులు చూస్తూ కన్పించారు.

హలీమా రాగానే "ఏమైంది బాబూ!" అంటూ చిన్నారి ముహమ్మద్‌ని గుండెలకు హత్తుకుంది. "అసలేం జరిగింది బాబూ, చెప్పు" అన్నాడు ఆమె భర్త హారిస్.

"మరేమో మేము ఆడుకుంటుంటే మాదగ్గరికి ఎవరో ఇద్దరు మనుషులు వచ్చారమ్మా! వారిలో ఒకాయన నన్ను పట్టుకొని నేలమీద పడుకోబెట్టాడు. రెండోఆయన కత్తితో నారొమ్ము చీల్చి గుండెకాయ బయటికి తీశాడు. దాన్ని నీళ్ళతో కడిగాడు. తర్వాత దాన్ని మళ్ళీ నాశరీరంలో పెట్టేసి కుట్టేశారమ్మా! దానివల్ల నాకేమీ కాలేదు. అసలు నాకు బాధే అన్పించలేదమ్మా!" అన్నారు బాలముహమ్మద్ (స) అమాయకంగా చూస్తూ.



ఈ విచిత్ర మాటలు విని హలీమా ఆశ్చర్యపోయింది. హారిస్ అయోమయంగా చూడసాగాడు. ఆ తరువాత వారిద్దరూ చిన్నారి ముహమ్మద్‌ని తీసుకొని, మేకల్ని తోలుకుంటూ ఇంటికి తిరిగొచ్చారు......

ఓరోజు.....అర్ధరాత్రి సమయం. మక్కా పట్టణం గాఢనిద్రలో జోగుతోంది. ఉమ్మెహానీ ఇంట్లో నిద్రపోతున్న దైవప్రవక్త (స) ఏదో అలికిడికి ఉలిక్కిపడి లేచారు. చూస్తే దైవదూత జిబ్రీల్ (అలై) ఇంటికప్పు చీల్చుకొని లోపలికి దిగుతున్నారు. ఆ దృశ్యం చూసి దైవప్రవక్త (స) క్షణంపాటు నివ్వెరపోయారు. ఆయన ఆశ్చర్యం నుంచి తేరుకున్నారో లేదో జిబ్రీల్ (అలై) వచ్చి చేయి పట్టుకొని కాబాలయానికి తీసికెళ్ళారు.

అక్కడ ఆయన దైవప్రవక్త (స) రొమ్ము చీల్చి హృదయాన్ని బయటికితీశారు. దాన్ని జమ్‌జమ్ నీటితో శుభ్రంగా కడిగారు. తరువాత దాన్ని విశ్వాసం, ఔదార్యం, వివేచనలతో నింపి యథాస్థానంలో పెట్టి కుట్టేశారు. ఆ తరువాత ఆయన దైవప్రవక్త (స)ను బురాఖ్ మీద సప్తాకాశాల పర్యటన (మేరాజ్) కోసం తీసికెళ్ళారు.

## సర్వరోగ నివారిణి ఈ జమ్‌జమ్ జలం

జమ్‌జమ్ నీటితో వివిధ రోగులకు స్వస్థత చేకూరినట్లు అనేక సంఘటనలు ఉన్నాయి. చివరికి వైద్యులు నిరాశచెంది వదిలేసిన మొండి రోగాలు కూడా జమ్‌జమ్ నీటితో నయమయిన సంఘటనలు ఉన్నాయి. వాటిలో క్రానిక్ కేన్సర్‌తో బాధపడుతూ జమ్‌జమ్ జలంతో స్వస్థత పొందిన మహిళా ఉదంతం చాలా ప్రసిద్ధిచెందింది.

ఇరవై ఏళ్ళ క్రితంనాటి సంఘటన. మొరాకోలో లైలా అనే ఓ యువతి ఉంది. ఆమెకు దేవుడు అందచందాలతోపాటు ఉత్తముడైన భర్త, రత్నాల్లాంటి ఇద్దరు పిల్లల్ని కూడా ప్రసాదించాడు. భర్త అనురాగం, పిల్లల ముద్దుముచ్చట్లు, అపార భోగభాగ్యాల మధ్య ఎలాంటి చీకూచింతా లేకుండా ఆమె జీవితం సుఖంగా సాగిపోతుండేది. ఎనలేని సౌఖ్యాలు, ప్రాపంచిక వినోదాలలో తేలియాడేవారికి సహజంగానే దేవుడు గుర్తుకురాడు. లైలా పరిస్థితి కూడా అంతే. ఆమె దైవాన్ని పూర్తిగా మరచిపోయింది.

అయితే జీవితం ఎల్లప్పుడూ ఒకేవిధంగా ఉండదు. లైలా జీవితంలో కూడా అకస్మాత్తుగా ఓ అనుకోని పరిణామం సంభవించింది. ఆమె ఓసారి భర్త, పిల్లలతో కలసి వినోద పర్యటనకై సముద్రతీరానికి వెళ్ళింది. ఇంటికి తిరిగొచ్చిన తర్వాత ఆమె ఎడమ స్తనం మీద ఎర్రటి మచ్చలు ఏర్పడ్డాయి. అవి క్రమంగా పెరిగిపోతూ రెండు రోజుల్లోనే చనుకుదురు కందగడ్డలా మారి అందులోనుంచి నల్లటి ద్రవం కారసాగింది. దాంతో లైలా తీవ్రమైన ఆందోళనకు గురయింది. డాక్టర్‌కు చూపిస్తే అది కేన్సర్ అని చెప్పాడు. ఈ వ్యాధికి ఇక్కడ సరైన చికిత్స లేదని, వెంటనే బెల్జియంగాని, ఫ్రాన్స్‌గాని వెళ్ళి కేన్సర్ స్పెషలిస్టుకు చూపించుకోమని అతను సలహా ఇచ్చాడు.

కేన్సర్ అనగానే లైలా నిలువునా కంపించింది. జీవితమంతా ఒక్కసారిగా అంధకారమైనట్లు అన్పించింది. భర్త కూడా ఆందోళన చెందాడు. భార్యాభర్తలు తక్షణమే ఫ్రాన్స్‌కు

వెళ్ళిపోయారు. అక్కడ ఆర్గురు స్పెషలిస్టులు ఆమెను పరీక్షించి "వక్షోజాలు ఆపరేషన్ చేసి తీసేయాలి. ఈ వ్యాధికి వాడే కొన్ని మందులవల్ల శిరోజాలు రాలిపోతాయి; గోళ్ళు, పళ్ళు ఊడుతాయి; గడ్డం, మీసాలు మొలిచే అవకాశం కూడా ఉంది" అని చెప్పారు.

లైలా ఈమాటలు విని తన పాదాల కింద భూమి బ్రద్దలయినట్లు అపాదమస్తకం వణికిపోయింది. మృత్యువు తనను అతివేగంగా తరుముకొస్తున్నట్లు భావించి కుమిలి కుమిలి ఏడ్వసాగింది. ఆమె భర్త మరింత క్రుంగిపోయి దిక్కుతోచని స్థితిలో పడిపోయాడు. అయితే లైలా ఆపరేషన్ చేయించుకోవడానికి నిరాకరించి భర్తతో కలసి స్వదేశం తిరిగి వెళ్ళిపోయింది. మొరాకోలోనే ఉంటూ ఏవో మందులు వాడసాగింది.

కాని ఆ మందుల వల్ల రోగం తగ్గకపోగా మరింత ముదరసాగింది. కొన్నాళ్ళ తర్వాత మెడ మీద, చెవుల కింద, చంకల్లో చిన్నచిన్న కురుపులు లేచాయి. ఇవి క్రమంగా పెరిగిపోతూ బాధపెట్ట నారంభించాయి. దాంతో ఆమె మళ్ళీ ఫ్రాన్స్‌కు పరుగెత్తింది. ఫ్రాన్స్ డాక్టర్లు ఆమెను పరిశీలించి పెదవి విరిచారు.

వారామె భర్తను విడిగా పిలిచి "వ్యాధి బాగా ముదిరిపోయింది. ఊపిరితిత్తులు పాడయిపోయాయి. ఇలాంటి స్థితిలో మేమేమీ చేయలేం. త్వరగా మీరీమెను మీ దేశానికి తీసికెళ్ళండి, కనీసం ఈమెను స్వదేశంలోనైనా ఖననం చేయడం సాధ్యమవుతుంది" అని చెప్పారు. అతనీ మాట విని నిరాశతో క్రుంగిపోయాడు.

అయితే అప్పుడతనికి మెరుపులాంటి ఓ ఆలోచన తట్టింది. అతను "మనం కాబాదర్శనం కోసం మక్కా వెళ్తే బాగుంటుంది. దేవుడు మన ఏమరుపాటును క్షమించి కరుణించవచ్చు" అని అన్నాడు. కాబా దర్శనం అనగానే ఆమె మనసులో మేటవేసిన ఏమరుపాటు పొర కరిగిపోతుండగా "నిజమేనండీ! అలాగే వెళ్దాం పదండి" అన్నది.

ఈవిధంగా దంపతులిద్దరూ కాబాయాత్రకు సన్నాహాలు ప్రారంభించారు. ప్యారిస్ రోడ్ల మీద నుంచే "లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్" అంటూ నేరుగా మక్కా వెళ్ళిపోయారు. మక్కాలో కాబాను చూడగానే లైలా కళ్ళు చిల్లులు పడిన నీటికుండలయి పోయాయి. అశ్రుపూరిత నయనాలతో ఆమె కాబా ప్రభువును మొరపెట్టుకుంది:

"దేవా! జగద్రక్షకా! సకల సృష్టిరాసులకు స్వస్థత చేకూర్చే నా స్వామీ! పాపాత్మురాలైన ఒక దాసి నీ ఆస్థానంలో హాజరయింది. ఓ నాప్రభువా! ఈ దాసి చాలా దూరం నుంచి కేన్సర్‌తో బాధపడుతూ ఎంతోఆశతో నీ దివ్యసన్నిదికి వచ్చింది. డాక్టర్లంతా దీనికి చికిత్స చేయలేక చేతులెత్తేశారు. ఇక నీవే ఈ దాసిని కాపాడాలి. నీవే సమస్త వ్యాధులకు స్వస్థత చేకూర్చేవాడవు. నీవే అందరి రక్షకుడవు. ప్రభూ! నన్ను కనికరించు. నీ కరుణాకటాక్షాలతో నాకు స్వస్థత చేకూర్చు."

లైలా కాబాలయం ప్రాంగణంలోనే ఓ మూలన గుడారం వేసుకొని రేయింబవళ్ళు దైవాన్ని స్మరిస్తూ, ఖుర్‌ఆన్ పఠిస్తూ, జమ్‌జమ్ నీరు తాగుతూ ఉండసాగింది. ఒక్కోసారి ఆమె సుదీర్ఘమైన రుకూలు, సజ్దాలు చేసేది. మరొక్కసారి కాబా గలేబు పట్టుకొని



రోదిస్తూ దీనాతిదీనంగా దైవాన్ని మొరపెట్టుకునేది. జమ్‌జమ్‌ను తాగుతున్నప్పుడల్లా మహాప్రవక్త (స) ప్రవచించిన దివ్యసూక్తుల్ని జ్ఞాపకం చేసుకునేది. రోజుకు ఒక కోడిగుడ్డు, ఒక రొట్టెముక్క మాత్రమే తినేది. జమ్‌జమ్ నీటిని మాత్రం కడుపునిండా తాగేది.

అమితమైన భక్తిపారవశ్యంలో మనిషి ఒక్కోసారి తన ఉనికినే మరచిపోతాడు. లైలా పరిస్థితి కూడా అలాగే మారింది. ఆమె తనచుట్టూ ఉన్న పరిసరాలను మరచిపోయి పూర్తిగా దైవధ్యానంలో లీనమైపోయింది. అయిదు రోజుల తర్వాత ఆమె తన శరీరంలో ఒక విధమైన నూతనుత్తేజం జనించినట్లు అనుభూతి చెందింది. కేన్సర్ వ్రణాల బాధ ఉన్నట్లు కూడా అన్పించలేదు. దాన్ని గురించి ఆమె ఇలా అన్నది:

"అప్పుడు నేను నా బ్లౌజ్‌లోకి చేయి దూర్చి కేన్సర్ వ్రణాలు, వాపు ఉన్న శరీర భాగాలను తడిమి చూసుకున్నాను. కాని నాకక్కడ ఎలాంటి పుండుగాని, వాపుగాని ఉన్నట్లు అన్పించలేదు. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. ఇది నా భ్రమ కాదుకదా అనుకున్నాను. నాతోపాటు దైవారాధనలో నిమగ్నులైవున్న తోటి స్త్రీలకు నా శరీరాన్ని చూపిస్తూ 'చూడండి! నా మెడ మీదగాని, చంకల కిందగాని ఏవైనా కురుపులు ఉన్నట్లు కన్పిస్తున్నాయా మీకు?' అని అడిగాను. దానికి వారు తమకు ఎలాంటి కురుపులు, పుండ్లు ఉన్నట్లు కన్పించడం లేదే! అన్నారు ఆశ్చర్యంగా చూస్తూ.

లైలా ఈ మాట వినగానే సంతోషంతో పొంగిపోయింది. వెంటనే ఆమె కాబాలో మరో మూలన ఉన్న తన భర్త దగ్గరకు వెళ్ళి ఈ శుభవార్త విన్పించింది. ఈ శుభవార్త విని భర్త కూడా ఎంతో సంతోషించాడు. అతను మాట్లాడుతూ "లైలా! ప్యారిస్‌లో డాక్టర్లు నిన్ను పరీక్షించి మహాఅయితే ఇక నువ్వు రెండుమూడు వారాలు మాత్రమే బ్రతుకుతావని చెప్పారు. కాని దేవుడు మన మొర ఆలకించాడు" అని అన్నాడు.

లైలా మరికొన్నాళ్ళు కాబాలో గడిపి భర్తతో కలసి ఫ్రాన్స్‌కు బయలుదేరింది. అక్కడ డాక్టర్లు ఆమెను చూసి కొయ్యబారి పోయారు. దైవానుగ్రహంతో తాను జమ్‌జమ్ నీటి ద్వారా స్వస్థత పొందినట్లు ఆమె తెలిపినప్పుడు ఆ డాక్టర్లు ఓ పట్టాన నమ్మలేకపోయారు. కాని తాము రెండుమూడు వారాల్లోనే చస్తుందనుకున్న మనిషి సంపూర్ణారోగ్యంతో ఎదురుగా కన్పిస్తుంటే నమ్మక ఏం చేస్తారు?

**జమ్‌జమ్ రసాయనిక విశ్లేషణ:** జమ్‌జమ్‌లో రసాయనిక పదార్థాల రీత్యా ఏమేమున్నాయో తెలుసుకుందాం. శాస్త్రవేత్తలు జమ్‌జమ్‌ని రసాయనిక చర్యల ద్వారా విశ్లేషించి అందులో ఈ క్రింది పదార్థాలు ఉన్నట్లు కనుగొన్నారు:

• **మెగ్నీషియం సల్ఫేట్:** ఇది శరీరంలోని వేడిని తగ్గిస్తుంది. వాంతుల్ని, వాంతుల సందర్భంలో వచ్చే తలనొప్పిని అరికడ్తుంది.

• **సోడియం సల్ఫేట్:** ఇది మలబద్ధకాన్ని పోగొడ్తుంది, కీళ్ళ నొప్పుల్ని తగ్గిస్తుంది. అంతేగాక చక్కెర వ్యాధి, అతిదాహం, రక్త విరోచనాలు, మూత్రపిండం రాళ్ళకు ఎంతో ఉపయోగపడుతుంది.

- **సోడియం క్లోరైడ్:** ఇది రక్తపోటుకు, శరీర శుభ్రతకు ఎంతగానో ఉపయోగ పడుతుంది. నిర్విరామంగా వచ్చే కడుపునొప్పిని తగ్గించి నీళ్ళ విరోచనాలను అరికడ్తుంది. విషప్రభావాన్ని పోగొడ్తుంది.
- **క్యాల్షియం కార్బొనేట్:** ఇది ఆహారం జీర్ణం కావడానికి, మూత్రపిండం రాళ్ళను కరిగించడానికి, కీళ్ళనొప్పులు తగ్గించడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. శరీరంలోని వేడిని తగ్గించి ఎండదెబ్బ ప్రభావాన్ని కూడా పోగొడ్తుంది.
- **పొటాషియం నైట్రేట్:** ఇది మూత్రపిండ వ్యాధులకు బాగా ఉపయోగ పడుతుంది. అలసటను తగ్గించి ఎండదెబ్బ ప్రభావాన్ని పోగొడ్తుంది. మూత్రవ్యాధుల నివారణకు కూడా ఇది బాగా ఉపయోగపడుతుంది.

## నల్లరాయిగా మారిన తెల్లరాయి

కాబా గర్భగుడిపై వెలుపల తూర్పు దిక్కున ఓ మూలలో ఆరడుగుల ఎత్తున అమర్చబడిన నల్లరాయినే "హజ్రెఅస్వద్" అంటారు. ఇది దైవప్రవక్త (స) తన శుభహస్తంతో, పెదవులతో స్పర్శించిన పవిత్ర శిల. అంచేత హాజీలు కాబాప్రదక్షిణ చేసే ప్రతిసారి దీన్ని ముద్దాడుతారు లేదా చేత్తో తాకుతారు. చేత్తో తాకలేనంత దూరంలో ఉన్నప్పుడు చేత్తో సైగచేసి ఆ చేతిని ముద్దాడుతారు. ఇలా చేయడం హజ్, ఉమ్రాల నియమాల్లో ఒక నియమం. దీన్ని షరీఅత్ పరిభాషలో "ఇస్తిలాం" అంటారు. ఇది ప్రవక్త సంప్రదాయం. దీనికి అంతకుమించి మరెలాంటి ప్రాముఖ్యం లేదు.

హజ్రత్ ఉమర్ (రజి) ఓసారి హజ్రెఅస్వద్‌ని సంబోధిస్తూ "నీవు ఎలాంటి లాభ నష్టాలు కలిగించలేని ఒక రాయివి మాత్రమే. దైవప్రవక్త (స) గనక నిన్ను ముద్దాడటాన్ని చూడక పోయివుంటే నేను నిన్ను ఎన్నటికీ ముద్దాడను" అని అన్నారు. (బుఖారి)

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ఓసారి హజ్రెఅస్వద్‌ని చేత్తో తాకి ఆ చేతిని ముద్దెట్టుకున్న తరువాత "దైవప్రవక్త (స) దీన్ని ముద్దాడటం చూసినప్పటి నుంచి నేను దీన్ని ముద్దాడుతున్నాను" అని అన్నారు. (సహీ ముస్లిం)

హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) కాబా నిర్మాణం పూర్తి చేశారు. అయితే ఒక చోట గోడలో ఓ మోస్తరు రాయిఅంతటి ఖాళీ మిగిలిపోయింది. ఆయన కుమారుడు హజ్రత్ ఇస్మాయీల్ (అలై) అక్కడ సరిపడే రాయి కోసం వెతకడం ప్రారంభించారు. హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) ఆయన్ని పిలిచి "నేను చెప్పే రాయిలాంటి రాయి తీసుకురా" అన్నారు. హజ్రత్ ఇస్మాయీల్ (అలైహి) మళ్ళీ వెతికి చివరికి ఒక రాయి తీసుకొచ్చారు. కాని హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) అప్పటికే (కాంతిమంతమైన) ఒక రాయిని కాబా గోడలో అమర్చారు. హజ్రత్ ఇస్మాయీల్ (అలైహి) దాన్ని చూసి "నాన్నా! ఈ రాతిని ఎవరు తీసుకొచ్చారు?" అని అడిగారు. దానికి ఆయన "దీన్ని నీ నిర్మాణపు పనుల అవసరంలేని వ్యక్తి తీసుకొచ్చాడు. ఆకాశం నుండి జిబ్రీల్ (అలైహి) తీసుకొచ్చారు" అని అన్నారు. (తఫ్సీరె ఇబ్నెకసీర్)



హజ్రెఅస్వద్ స్వర్గం నుండి దిగిన ప్రారంభకాలంలో ఎంతో తెల్లగా మెరిసిపోతూ ఉండేది. దీన్ని గురించి దైవప్రవక్త (స) ప్రస్తావిస్తూ "హజ్రెఅస్వద్ స్వర్గం నుండి తీసుకు రాబడింది. అప్పుడిది పాలకన్నా తెల్లగా ఉండేది. అయితే ఆ తర్వాత ఆదం సంతతి చేసిన పాపాల వల్ల ఇది నల్లగా మారిపోయింది" అని అన్నారు. (తిర్మిజి)

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈవిధంగా ప్రవచించారు: "హజ్రెఅస్వద్, మఖామె ఇబ్రాహీంలు స్వర్గం నుండి తీసుకురాబడిన రెండు మెరిసిపోతుండిన రాళ్ళు. అయితే దేవుడు వాటి కాంతిని అంతం చేశాడు. దేవుడు వాటి కాంతిని గనక అంతం చేయకపోయివుంటే ఇవి భూమ్యాకాశాల మధ్య లేక తూర్పు పడమరల మధ్య యావత్తు ప్రపంచాన్ని ప్రకాశవంతం చేస్తాయి." (అహ్మద్)

హజ్రెఅస్వద్ అనేక శతాబ్దాల పాటు ఒకే ఒక రాయిగా ఉండేది. కాని ఆ తరువాత ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఇది ముక్కలు ముక్కలుగా పగిలిపోయింది. ఇప్పుడా ముక్కలన్నిటిని కలిపి ఒకటిగా చేసి, దాన్ని ఒక వెండి చట్రంలో బిగించి, యధాతథ స్థానంలో అమర్చారు. హజ్రెఅస్వద్ ప్రతి ప్రదక్షిణ ప్రారంభానికి, ముగింపుకు గుర్తుగా కాబాగోడలో పొదగబడిన ఒక విశిష్ఠ శిలారాజం.

## ముల్తజం, రుకునె యమాని

కాబా గర్భగుడి తూర్పు వైపున తలుపుకు, హజ్రెఅస్వద్‌కు మధ్య ఉన్న ఆరడుగుల గోడ భాగాన్నే ముల్తజం అంటారు. దీనికి కూడా ఎంతో ప్రాముఖ్యం ఉంది. కాబా ప్రదక్షిణ చేసిన తరువాత ఇక్కడదాకా చేరుకోగలిగే హాజీలు ముల్తజంను గుండెలకు గట్టిగా హత్తుకొని కడు దీనంగా దుఆ చేయడం సంప్రదాయం.

**ముల్తజం** దగ్గర నిలబడి దుఆ చేయడం గురించి దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: "కష్టాలలో ఉన్న మనిషి ఎవరైనా ముల్తజం దగ్గర దైవాన్ని వేడుకుంటే అతని కష్టాలు తప్పకుండా దూరమవుతాయి." (అబూదావూద్, ఇబ్నెమాజ)

హజ్రత్ షుఐబ్ కథనం: "అబ్దుల్లా బిన్ అమ్ర్ (రజి) హజ్రెఅస్వద్‌కు, తలుపుకు మధ్య కాబాకు ఎదురుగా నిలబడి తన రొమ్ము, ముఖం, అరచేతులను కాబాగోడకు ఆనిచ్చి, 'దైవప్రవక్త (స) ఇలా చేస్తుంటే చూశాను' అని అన్నారు." (అబూదావూద్)

హజ్రత్ ముజాహిద్ 'ముల్తజం' ప్రాముఖ్యాన్ని గురించి ప్రస్తావిస్తూ ఇలా అన్నారు: "హజ్రెఅస్వద్‌కు, తలుపుకు మధ్య ఉన్న చోటునే ముల్తజం అంటారు. ఇక్కడకు వచ్చి ఎవరయినా దేవుడ్ని వేడుకుంటే దేవుడు అతని వేడుకోలును తప్పకుండా స్వీకరిస్తాడు."

"హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) హజ్రెఅస్వద్‌కు, తలుపుకు మధ్య ఉండే చోటును హత్తుకొని 'హజ్రెఅస్వద్‌కు, తలుపుకు మధ్య (ముల్తజంకు ఎదురుగా) నిల్చొని ఎవరైనా దైవాన్ని వేడుకుంటే అతని పని తప్పక నెరవేరుతుంది' అని చెప్పేవారు." (బైహఖీ)

ప్రవక్త ప్రత్యక్ష అనుచరులలో అనేకమంది ముల్తజంను హత్తుకొని దుఆ చేసేవారు. "అబ్దుల్లా బిన్ ఉమర్, అబ్దుల్లా బిన్ అబ్బాస్, అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) ప్రభృతులు ముల్తజంను హత్తుకొని దుఆ చేస్తుంటే తాను చూశానని హజ్రత్ అబూ జుబైర్ అన్నారు."

హజ్రత్ తారిఖ్ బిన్ అబ్దుర్రహ్మాన్ ఉల్లేఖనం: "నేను హజ్రత్ అలి బిన్ హుసైన్ (రహ్మాలై)తో కలసి కాబా ప్రదక్షిణ చేశాను. ఆయన ప్రదక్షిణ చేసిన తరువాత పొట్ట మీది బట్ట తొలగించి హజ్రెఅస్వద్‌కు, తలుపుకు మధ్య ఉండే చోటుకు (అంటే ముల్తజంకు) తన నగ్నగర్భాన్ని ఆనిచ్చారు." (అఖ్బారె మక్కా)

ప్రాముఖ్యం, ఔన్నత్యాల విషయంలో ముల్తజం తరువాత **"రుకునె యమాని"** చెప్పుకోదగిన కాబా అంతర్భాగం. అందువల్ల హాజీలు రుకునె యమానీని గురించి కూడా తెలుసుకోవలసిన అవసరముంది. కాబా గర్భగుడి నాలుగు మూలలో ఒక మూల యమన్ దేశం దిశగా ఉంది. ఆ మూలనే 'రుకునె యమాని' అంటారు. దాన్ని ఇస్తిలాం (ముద్దాడటం లేక తాకడం) చేయడం అభిలషనీయం (ముస్తహబ్).

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) దీని ఇస్తిలాం ప్రాముఖ్యాన్ని గురించి తెలుపుతూ ఇలా అన్నారు: "రుకునె యమాని దగ్గర డెబ్భయి మంది దైవదూతలు నియమించ బడ్డారు. హాజీలు ఇక్కడ ఈవిధంగా దుఆ చేసినప్పుడు ఈ దైవదూతలు ఆమీన్ (తథాస్తు) అంటారు- 'అల్లాహుమ్మ ఇన్నీ అస్‌అలుకల్ అఫ్‌వ వల్‌ఆఫియత ఫిదున్యా వల్‌ఆఖిరతి రబ్బనా ఆతినా ఫిద్దున్యా హస్నతన్‌వ్వ ఫిల్‌ఆఖిరతి హస్నతన్ వ్వఖినా అజాబన్నార్' (అర్థం: దేవా! నేను ఇహపర లోకాలలో నా మన్నింపు, సంక్షేమాల కోసం నిన్ను వేడుకుంటున్నాను. ప్రభూ! మాకు ఇహలోకంలోనూ, పరలోకంలోనూ మంచిని ప్రసాదించు. మమ్మల్ని నరక యాతనల నుండి రక్షించు.)" (ఇబ్నెమాజ)

## హతీం (ఖాళీగా వదలిన కాబా స్థలం)

కాబా గర్భగుడికి ఒక వైపు దాదాపు తొమ్మిది అడుగుల దూరాన అర్థ వృత్తాకారంలో నాలుగడుగుల ఎత్తుతో కట్టబడిన పిట్టగోడను హాజీలు గమనించి ఉంటారు. దాని లోపలి ప్రదేశాన్నే "హతీం" అంటారు. ఖురైషీయులు కాబాను పునర్నిర్మించవలసి వచ్చినప్పుడు సరిపడ పైకం సమకూరక పోవడంతో ఆ స్థలం ఖాళీగా వదలి కాబాగోడలు కట్టారు. మక్కా పట్టణం దైవప్రవక్త (సల్లం) అధీనంలోకి వచ్చిన తరువాత కూడా ఆయన ఆ ఖాళీస్థలం కలిపేసి కాబాను పునర్నించలేదు. దానికి కారణం దైవప్రవక్త (సల్లం) తన సతీమణి హజ్రత్ ఆయిషా (రజి)కు ఇలా తెలియజేశారు:

"నీ జాతివాళ్ళు ఈ మధ్యనే (కొత్తగా) ఇస్లాం స్వీకరించారు. అలా కాకపోతే నేను కాబాను పడగొట్టి దాని తలుపును నేలబారు చేసేవాడ్ని. తలుపులు రెండు పెట్టించే వాడ్ని; ఒకటి తూర్పు వైపున, మరొకటి పడమర వైపున. అంతేకాదు, హిజ్ర్ (హజ్రత్ ఇబ్రాహీం తన భార్యాపిల్లలకు నిర్ణయించిన ప్రదేశం) నుండి ఆరు మూరల స్థలాన్ని



కాబా కట్టడంలో కలిపేసేవాడ్ని. ఖురైషీయులు కాబానిర్మాణ సమయంలో అంత చోటును తీసేశారు." (ముస్నద్ అహ్మద్)

హజ్రత్ అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) అధికారంలోకి వచ్చిన తరువాత ఆయన ఆ ఖాళీ స్థలం కలిపేసి కాబాను మళ్ళీ నిర్మించారు. కాని హజ్రత్ అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) అమరగతి నొందిన తరువాత మక్కా గవర్నర్‌గా వచ్చిన హజాజ్ ఆ సమగ్ర కట్టడాన్ని పడగొట్టి గతంలో మాదిరిగానే పునర్నిర్మించాడు. ఆనాటి నుంచి ఈనాటి వరకూ కాబా కట్టడం అలాగే ఉంది.

కాబా గర్బగుడిని దైవప్రవక్త (సల్లం) ప్రవచనాల వెలుగులో హజ్రత్ అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) పునర్నిర్మించినట్లు సమగ్ర ఆలయాన్ని ఈనాడు కూడా పునర్నిర్మించవచ్చు కదా! ఈ విధంగా నేటి సౌదీప్రభుత్వం ఎందుకు పునర్నిర్మించలేదో నాకర్థం కాలేదు.

## మఖామె ఇబ్రాహీం

ఇబ్రాహీం ప్రవక్త (అలైహి) కాబాలయం నిర్మించడానికి నిలబడిన బండరాయినే మఖామె ఇబ్రాహీం అంటారు. ఇది కూడా హజ్రెఅస్వద్‌లా స్వర్గం నుండి తీసుకు రాబడిన కాంతిమంతమైన రాయే. (ఈ విషయం 'నల్లరాయిగా మారిన తెల్లరాయి' అనే శీర్షికలో ప్రస్తావించబడింది.)

ఇబ్రాహీం ప్రవక్త (అలైహి) ఈ రాతి మీద నిలబడే ప్రజలకు హజ్ పిలుపు ఇచ్చారని కూడా చెబుతారు. దాని మీద ఆయన అడుగుజాడలు కూడా దశాబ్దాల తరబడి ఉండేవి. కాని ప్రజలు చేతులతో తాకడం వల్ల ఆ గుర్తులు క్రమేణా చెరిగిపోయాయి. వాటి చుట్టూ ఇప్పుడు పాదాకారంలో వెండి అంచు (బార్డర్) మాత్రమే కన్పిస్తుంది.

"హజ్రత్ ఖతాదా కథనం ప్రకారం, ముస్లింలకు మఖామె ఇబ్రాహీం దగ్గర నమాజ్ చేయాలని ఆజ్ఞయింది; దాన్ని తాకాలని కాదు. అనేకమంది ప్రజలు ఇబ్రాహీం (అలైహి) గారి కాలి మడమ, వ్రేళ్ళ గుర్తులు చూశారు. కాని ప్రజల చేతులు తగలడంతో అవి చెరిగి అంతమైపోయాయి." (తఫ్సీరె ఇమాం త్రబీ)

మఖామె ఇబ్రాహీం రాయి పొడవు, వెడల్పు దాదాపు 14 చదరపు అంగుళాలు, మందం 8 అంగుళాలతో తేలికపాటి ఎరుపురంగు మీద నల్లటి చారలు కలిగి ఉంది. దీన్ని ఓపెద్ద పంజరం లాంటి గ్రిల్ లోపల కదలకుండా పెట్టారు. ఈ రాయి మొదటి ఖలీఫా హజ్రత్ అబూబకర్ (రజి) పాలనాకాలం వరకూ కాబా గోడకు దాదాపు ఆనుకునే ఉండేది. అయితే రెండవ ఖలీఫాగా హజ్రత్ ఉమర్ (రజి) వచ్చిన తర్వాత హాజీలకు ప్రదక్షిణ సమయంలో ఇబ్బంది కలుగుతోందని దాన్ని అక్కడ్నుంచి తీసేయించి కాబాకు కొంచెం దూరంలో ప్రస్తుతమున్న చోట పెట్టించారు.

హజ్రత్ అనస్ (రజి) కథనం ప్రకారం హజ్రత్ ఉమర్ (రజి) మాట్లాడుతూ "నేను దివ్యావిష్కృతి (వహీ)కి అనుగుణంగా మూడు విషయాలను ప్రతిపాదించాను. నేను దైవప్రవక్తతో 'దైవప్రవక్తా! మనం (కాబాప్రదక్షిణ తర్వాత) మఖామె ఇబ్రాహీం దగ్గర నమాజ్ చేస్తుంటే ఎంత బాగుంటుంది!' అని అన్నాను. అప్పుడు 'మీరు మఖామె ఇబ్రాహీంని నమాజు చోటుగా చేసుకోండి' అనే ఖుర్ఆన్ సూక్తి అవతరించింది." (బుఖారి)

ఈ కారణంగానే హజ్రత్ ఉమర్ (రజి) 'మఖామె ఇబ్రాహీం' రాతిని దాని పూర్వ స్థానం నుండి జరిపించి కాబా గర్భగుడికి కొద్దిదూరంలో పెట్టించినప్పుడు ఆయన్ని పురప్రముఖులెవరూ విమర్శించలేదు.

## 45. హిరాగుహలో తొలి దివ్యావిష్కృతి

మేము 8-12-2005న ఉమ్రావిధి నిర్వహించిన తరువాత ఇరవై రోజులదాకా హజ్‌కు సంబంధించిన ఆచారాలేమీ లేనందున సాధారణ నమాజులు చేసుకోవడంతో పాటు వివిధ దేశాల హాజీలతో పరిచయం చేసుకోవడానికి కృషి చేశాము. ఆ తరువాత మక్కాలోని ఇతర చారిత్రక ప్రదేశాల వైపు దృష్టి సారించాం. కాని దైవప్రవక్త (సల్లం) నివసించిన, బసచేసిన, తిరిగిన చారిత్రక ప్రదేశాలలో చారిత్రక చిహ్నాలేమీ లేవు. ఆ ప్రదేశాలలో తరువాతి కాలంలో నిర్మించిన మసీదులు మాత్రమే ఉన్నాయి. హిరా, సౌర్ గుహలలో కూడా ఆనాటి చిహ్నాలేమీ లేవు.

అయితే హిరాగుహ నుంచే దైవసందేశవతరణ ప్రారంభమయినందున హిరా గుహ చూసిన ప్రతి హాజీకీ ఆనాటి సంఘటన గుర్తుకొస్తుంది. ఏమిటా సంఘటనా? అది యావత్తు మానవాళి జీవితాన్ని సమూలంగా సంస్కరించడానికి మహాప్రవక్త (స) హృదయఫలకంపై అవతరించిన తొలి దివ్యావిష్కృతి. ఓసారి పద్నాలుగు శతాబ్దాలు వెనక్కి పోయి ఆలోచిస్తే ఆనాటి అపూర్వ దృశ్యం నా మదిలో మెదిలింది......

అది రమజాన్ మాసం. దైవకారుణ్యం ధరిత్రిపై వర్షించే పవిత్ర మాసం. హిరా గుహలో సమస్త విషయాల నుండి దృష్టి మళ్ళించి పూర్తిగా దైవచింతనలో లీనమైపోయిన ముహమ్మద్ మహనీయుని (స) హృదయంలో రుజుమార్గం రోజురోజుకు కాంతిమంతం కాసాగింది. ఒక సుప్రభాతం వేళ హిరాగుహలో హఠాత్తుగా ఓ అద్భుతదృశ్యం ప్రత్యక్షమయింది. ఎంతో అందమైన ముఖవర్చస్సుతో కూడిన అసాధారణమైన ఓ మానవాకారం ఆయన ముందుకు వచ్చి నిలబడింది.

వచ్చీరాగానే "చదువు" అన్నాడా వ్యక్తి.

"నాకు చదవడం రాదు" అన్నారు ముహమ్మద్ (స) తొట్రుపడి భయంతో చూస్తూ.


అప్పుడతను ముహమ్మద్ (సల్లం)ని గట్టిగాఅదిమివదిలేస్తూ "చదువు" అన్నాడు.

"నాకు చదవడం రాదు" తిరిగి అదే జవాబు. మళ్ళీ ఆ వ్యక్తి ఆయన్ని గట్టిగా





హిరా గుహ



కాబా ప్రతిష్ఠాలయం

అదిమి వదిలేస్తూ "చదువు" అన్నాడు.

ఈసారి ముహమ్మద్ (స) తనను ఆ వ్యక్తి మరింత గట్టిగాఅదిమి గొంతు నులి మేస్తాడేమోనన్న భయంతో "ఏం చదవాలి?" అని అడిగారు.

"చదువు సృష్టికర్త అయిన (నీ) ప్రభువు పేరు స్మరించి. ఆయనే మానవుడ్ని గడ్డ కట్టిన రక్తంతో సృజించాడు. చదువు, నీ ప్రభువు మహోన్నతుడు, ఎంతో ఉదారుడు. ఆయనే మానవునికి కలం ద్వారా అతను ఎరగని జ్ఞానం నేర్పాడు" అన్నాడు ఆ విచిత్ర వ్యక్తి. (దివ్యఖుర్ఆన్. 96:1-5)

ముహమ్మద్ (సల్లం) అలాగే చదివి విన్పించారు. తరువాత ఆ వ్యక్తి వెళ్ళిపోయాడు. అతను వెళ్ళిన తరువాత ముహమ్మద్ (సల్లం) గుహలోనే కొన్ని క్షణాలు భీతావహులై నిల్చున్నారు. ఓసారి చుట్టూ కలియజూసి కలవరపడ్డారు.

"ఇప్పుడెవరు తనతో మాట్లాడింది? తనను చదవమని బలవంతం చేసిందెవరు?" మనసులో పరిపరివిధాల ఆలోచనలు, అనుమానాలు రేకెత్తాయి. గుహనుండి చరచరా బయటికి వచ్చారు. తనకేదో పిశాచం ఆవహించిందని భ్రమపడి గబగబా గుట్టలు, మిట్టలు దాటుకుంటూ ఇంటిదారి పట్టారు.

ఇంటికి చేరుకోగానే పడక మీద వాలిపోయి "దుప్పటి కప్పు, దుప్పటి కప్పు" అన్నారు గజగజ వణికిపోతూ. హజ్రత్ ఖదీజా భర్త పరిస్థితి చూసి కంగారు పడిపోయారు. ఆమె వెంటనే దుప్పటి తెచ్చి కప్పారు. ఈ అసాధారణ పరిస్థితికి కారణం అడగడానికి ఆమె సాహసించలేకపోయారు.

"ఏమిటీ, ఈయన ఆరోగ్యం బాగా లేదా? ఏదైనా వ్యాధి సోకిందా? లేక మరేదైనా ఆపద వచ్చిపడిందా?" కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా గడచిపోయాయి. పరిస్థితి కొంచెం కుదుటపడింది. భయం దూరమయింది. వణుకు కూడా తగ్గిపోయింది. దాంతో ముహమ్మద్ (సల్లం) దుప్పటి తొలగించి లేచి కూర్చున్నారు.

అప్పుడు హజ్రత్ ఖదీజాకు కొంచెం ధైర్యం వచ్చింది. "ఏమండీ, ఏం జరిగింది? ఒంట్లో బాగాలేదా? ఇప్పటిదాకా మీరు ఎక్కడున్నారు?" అని అడిగారు ఆమె.

"ఏమని చెప్పను ఖదీజా! ఎప్పుడూ జరగని ఓ వింత సంఘటన జరిగింది. నేను హిరాగుహలో కూర్చొని ఉంటే తెల్లటి వస్త్రాలు ధరించిన ఒక అందమైన వ్యక్తి వచ్చాడు నా దగ్గరికి. వచ్చిరాగానే చదవమని నన్నాజ్ఞాపించాడు. ఇలా మూడుసార్లు జరిగింది. చివరికి నేను అతను చెప్పినట్లు ఎలాగో చదివాను. ఆ తరువాత అతను వెళ్ళిపోయాడు. నాకు భయమేసి గుహ నుండి గబగబా నడిచి ఇంటికొచ్చాను."

"ఖదీజా! ఏమైంది నాకు? ఇదంతా చూస్తుంటే నాకేదో ప్రాణాపాయం కలుగుతుందని భయంగా ఉంది" అంటూ ముహమ్మద్ (సల్లం) జరిగిన సంఘటన భార్యకు తెలియజేశారు.



ఖదీజా చాలా తెలివితేటలుగల మహిళ. ఈ మాటలు విని ఆమె భయపడలేదు. దాని వెనుకఉన్న మర్మాన్ని గ్రహించి భర్త వైపు గౌరవంగా చూస్తూ ఇలా అన్నారు:

"భయపడకండి. శుభఘడియ వచ్చింది, సంతోషించండి. నన్ను సృజించిన దేవుని సాక్షి! మీరు సత్యసంధులు, దయార్ద్రహృదయులు, నిజాయితీపరులు, పేదల పాలిట పెన్నిధి. మీరు అతిథులను సత్కరిస్తారు, మంచి పనులలో ప్రజలతో సహకరిస్తారు. అటువంటివారైన మీకు దేవుడు ఎన్నటికీ ప్రాణాపాయం కలిగించడు".

అర్ధాంగి మాటలతో ముహమ్మద్ (సల్లం)కు కొంచెం ధైర్యం వచ్చింది. కలవరపాటు చాలావరకు తగ్గిపోయింది. వాడిన ముఖపద్మం వికసించింది. ఆయన క్షణంపాటు శ్రీమతి వైపు కృతజ్ఞతా భావంతో చూశారు.

తన భర్త దైవప్రవక్త కాబోతున్నాడని గ్రహించిన ఖదీజా పరమ సంతోషంతో పొంగి పోయారు. ఏమైనప్పటికీ ఈ విషయాన్ని ధృవపరచుకోవడానికి అన్నయ్య వరఖా దగ్గరికెళ్ళి అడుగుదాం అనుకున్నారు ఆమె మనసులో. ఈ విషయాన్నే ఆమె శ్రీవారికి చెప్పి ఆయన్ని తీసుకొని వరఖా దగ్గరకు వెళ్ళారు.

వరఖా బిన్ నౌఫల్ హజ్రత్ ఖదీజా పెద్దనాన్న కుమారుడు. వరసకు అన్నవుతాడు. వయసు బాగా పైబడిన పండుముసలి. అయితే అతను గొప్ప తత్వవేత్త. వివిధ మతాలను కాచి వడబోసిన ప్రముఖ మతపండితుడు. ప్రతి విషయాన్నీ సునిశితంగా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకునే మనస్తత్వం కలవాడు.

ఈయన మొదట యూదమతం వైపు మొగ్గాడు. తర్వాత క్రైస్తవ మతం స్వీకరించాడు. బైబిల్ని ఏండ్లతరబడి అధ్యయనం చేసి, అందులోని లోతుపాతులు తెలుసుకున్న గొప్ప పరిశోధకుడు. అరబీభాషలో దాన్ని అనువదించే పని కూడా ప్రారంభించాడు.

హజ్రత్ ఖదీజా అతని ముందు ముహమ్మద్ (స)కు ఎదురైన అపూర్వ సంఘటన గురించి ప్రస్తావిస్తూ "ఈయన చెప్పేది కూడా కాస్త విను అన్నయ్యా!" అన్నారు.

వరఖా బిన్ నౌఫల్ "బాబూ! ఇంతకూ నువ్వు హిరా గుహలో ఏం చూశావు?" అని అడిగాడు ఎంతో కుతూహలంతో. ముహమ్మద్ (సల్లం) జరిగిన వృత్తాంతం వివరించారు. అది విని వరఖా ఇలా అన్నాడు:

"నా ప్రాణం ఎవరి అధీనంలో వుందో ఆ శక్తిస్వరూపుని సాక్షిగా చెబుతున్నాను. నీవు వర్ణించిన ఆ అద్భుతశక్తి ఎవరో కాదు. గతంలో మూసా ప్రవక్త (అలైహి) దగ్గరకు దైవసందేశం తెస్తూ వుండిన జిబ్రీల్ దైవదూతే ఆయన. దేవుడు నిన్ను తన ప్రవక్తగా ఎన్నుకున్నాడు. నీవిప్పుడు దైవప్రవక్తవు. తౌరాత్, ఇంజీల్ గ్రంథాలలో నీ ప్రవక్తృత్వం గురించి భవిష్యత్ ప్రకటనలు ఉన్నాయి. త్వరలోనే నీ అనుచర సముదాయం యావత్ ప్రపంచంలో విస్తరిస్తుంది."

"అయితే ముహమ్మద్! నీవు దైవప్రవక్త అయినట్లు ప్రకటించావంటే లోకులు నిన్ను తిరస్కరిస్తారు. స్వస్థలం నుంచి నిన్ను బయటికి వెళ్ళగొడ్తారు. చివరకు నీతో యుద్ధం చేయడానికయినా వెనుదీయరు ఈ ప్రజలు. అప్పటిదాకా నేను బ్రతికి ఉంటే ఎంత బాగుండు!"

"ఏమిటీ, ప్రజలు నన్ను ఇక్కడ్నుంచి వెళ్ళగొడ్తారా?" ముహమ్మద్ (సల్లం) ఆశ్చర్యం వెలిబుచ్చుతూ అడిగారు.

"ఔను నాయనా! గతంలో దైవప్రవక్తలు వచ్చినప్పుడల్లా వారి జాతిప్రజలు ఇలాగే ప్రవర్తించారు. నాకా రోజులు చూసే భాగ్యముంటే నా సర్వశక్తులు వొడ్డి నిన్ను ఆదుకుంటాను" అంటూ వరఖా ప్రేమతో దైవప్రవక్త (స) నుదుటిని చుంబించాడు.

ఆ తరువాత మహనీయ ముహమ్మద్ (స) శ్రీమతితో పాటు అక్కడ్నుంచి లేచి భారంగా అడుగులేస్తూ ఇంటికి చేరుకున్నారు.

## 46. సౌర్ గుహలో శరణుపొందిన సందేశహరుడు

హిరాగుహ తరువాత సౌర్ గుహ కూడా చెప్పుకోదగిన చారిత్రక ప్రదేశమే. మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లం)ను శత్రువులు హతమార్చడానికి చేయని ప్రయత్నమంటూ లేదు. ఆయన ఇంటి నుంచి పారిపోయినా శత్రువులు ఆయన్ని వెంటాడటం మానలేదు. అలాంటి పరిస్థితిలో 'సౌర్' గుహ దైవప్రవక్త (సల్లం)ను కాపాడటంలో ప్రముఖ పాత్ర వహించింది. అది ఎలాగో చూడండి.......

....సూర్యుడు గగనం మధ్యకు వచ్చి పుడమి వైపు ఉరిమి చూడసాగాడు. అతని వాడి చూపులు భరించలేక హజ్రత్ అబూబకర్ (రజి) ఇంట్లోకెళ్ళి తలుపేసుకున్నారు. కాని అంతలోనే బయట తలుపు తట్టిన శబ్దం విన్పిస్తే వెళ్ళి తలుపు తెరిచారు. చూస్తే వాకిలి ముందు మహనీయ ముహమ్మద్ (స) గంభీర వదనంతో నిల్చున్నారు.

"రండి, రండి. ఇంత తీక్షణమైన ఎండలో ఏదో ప్రత్యేక పనిమీదే వచ్చినట్లున్నారు" అన్నారు అబూబకర్ (రజి) ఆయన్ని చూడగానే.

"ఔను అబూబకర్! ఇక్కడ ఇంకెవరైనా ఉన్నారా? ఉంటే అవతలికి పంపు. నీతో ఓముఖ్యమైన విషయం మాట్లాడాలి" అన్నారు మహాప్రవక్త (స) లోపలికి వచ్చి కూర్చుంటూ. దానికాయన "ఇక్కడ మీ శ్రీమతి ఆయిషా తప్ప ఇంకెవ్వరూ లేర"న్నారు.

"సరే. నాకు మక్కా నుంచి వలసపోవడానికి అనుమతి లభించింది. అతిత్వరలో నేను ఎస్రిబ్‌కు బయలుదేరాలి" అన్నారు దైవప్రవక్త (స). హజ్రత్ అబూబకర్ (రజి) ఈమాట విని "నిజమా! మరి నాక్కూడా ఈ ప్రయాణంలో మీ సహచర్యభాగ్యం ప్రాప్తమవుతుందా?" అనడిగారు ఆదుర్దాగా. దైవప్రవక్త (స) 'ఆ' అన్నారు ముక్తసరిగా.

"మహాభాగ్యం! నేను ముందుగానే వలస పోవడానికి కావలసిన సామగ్రి సిద్ధం చేసిపెట్టాను. రెండుఒంటెల్ని కూడా ఏర్పాటు చేశాను. ప్రయాణ సౌలభ్యం కోసం



అబ్దుల్లా బిన్ అర్తఖ్‌తో కూడా మాట్లాడాను" చెప్పారు అబూబకర్ (రజి) ఆనందాతిశయంతో.

"ఒంటెలు ఇప్పుడే అవసరం లేదు. శత్రువులు మనల్ని వెన్నంటి ఉన్నారు. అందువల్ల ముందుగా మనం దక్షిణ దిశగా బయలుదేరి సౌర్ గుహలో కొన్నాళ్ళు తలదాచుకోవాలి." అన్నారు దైవప్రవక్త (సల్లం) విషయాన్ని విశదీకరిస్తూ.

సౌర్‌గుహ మక్కాకు దక్షిణదిశగా యమన్‌కు పోయే దారిలో ఉంది. మదీనా ఉత్తరం వైపుంది. మక్కా వదలిన ముహమ్మద్ (స) మదీనా దారిపడ్తారని తలచి ప్రతివాడూ ఉత్తరం దిక్కుగా పరుగెడుతాడు. ఇలా దైవప్రవక్త (సల్లం) తమను వెంబడించేవారికి తామెటుపోయిందో అర్థంకాని విధంగా పథకం రూపొందించారు. ఆయన ఈ పథకం గురించి అబూబకర్ (రజి)కు వివరించి వెళ్ళిపోయారు.

ఖురైషీయులు దైవప్రవక్త (స)ను హతమార్చడానికి ఒక పథకం తయారుచేశారు. తేదీ కూడా నిర్ణయమైపోయింది. నిర్ణయించిన ఆ కాళరాత్రి రానే వచ్చింది.

నలువైపుల నుంచి చీకటి తెరలు అలుముకున్నాయి. నింగిలోని నక్షత్రాలు మిణుకు మిణుకుమంటూ నేల వైపు కళ్ళు చించుకొని చూస్తున్నాయి. గాడాంధకారంలో మక్కా నగరం మౌనముద్ర దాల్చింది. కారుణ్యమూర్తి (సల్లం) ఇంటి చుట్టూ శత్రువులు ఈటెలు, బాకులు తీసుకొని మాటుకాసి కూర్చున్నారు.

స్త్రీలుండే ఇండ్లలో దౌర్జన్యంగా జొరబడటం బహుదైవారాధకులు కూడా తలవంపుగా భావించేవారు. అందువల్ల శత్రువులు బయటనే మాటుకాసి ఉంటూ, ముహమ్మద్ (స) ఎప్పుడు బయటికి వస్తే అప్పుడు మూకుమ్మడిగా మీదపడి ఆయన్ని ముక్కలు ముక్కలుగా నరికి వేద్దామని సిద్ధంగా ఉన్నారు.

దుర్మార్గుల పన్నాగం విశ్వప్రభువు ద్వారా దైవప్రవక్త (స)కు తెలిసిపోయింది. ఆయన వెంట అలి (రజి) కూడా ఉన్నారు. అన్ని విషయాలు అలి (రజి)కి వివరంగా చెబుతూ "అలీ! ఇదీ విషయం. జాగ్రత్తగా మసలుకోవాలి. తెల్లవారగానే మనింట్లో భద్రపరచిన వస్తువులన్నీ ఎవరివి వాళ్ళకు ఇచ్చేసి మదీనా వచ్చెయ్యి" అని అన్నారు.

భద్రపరచిన వస్తువులు ప్రజలకు అప్పగించడానికి హజ్రత్ అలి (రజి) సంతోషంగా అంగీకరించారు. చివరిసారిగా దైవప్రవక్త (సల్లం) అలి (రజి)ని ఆలింగనం చేసుకొని "దేవుడే నీకు రక్ష. ఆయన తలచుకుంటే వారు నిన్నేమీ చేయలేరు. మనం మళ్ళీ మదీనాలో కలుసుకుందాం. ఇక పోయి పడుకో" అన్నారు.

తర్వాత ఆయన బయటికి వచ్చి నేల మీది మన్ను కొంచెం చేతిలోకి తీసుకున్నారు. దాన్ని అవిశ్వాసులపై విసిరేసి ఖుర్‌ఆన్‌లోని యాసీన్‌సూరా పఠిస్తూ వారి మధ్య నుంచే వెళ్ళిపోయారు. కాని అవిశ్వాసులెవరూ ఆయన్ని చూడలేకపోయారు.

ఇస్లామీయఉద్యమ సారథి ముహమ్మద్ (స) ఇతరుల హృదయాల్లో సత్యామృతం చిలికించడానికి నడిరాత్రి చీకట్లో మక్కా నుండి ఎప్పుడో అదృశ్యమయ్యారు.

**మక్కాలో కార్చిచ్చువార్త:** ముహమ్మద్ (స) నగరం వదలిపోయారన్న వార్త మక్కాలో కార్చిచ్చులా వ్యాపించింది. నగరవాసుల్లో పెద్ద కలకలం బయలుదేరింది. పలువురు పలువిధాలుగా చెప్పుకోసాగారు. "పదండి. ఇక ఆలస్యం చేయకండి. వెతకండి" అంటూ క్రోధావేశాలతో గొంతులు చిరిగిపోయేలా అరిచారు ఖురైష్ నాయకులు.

దైవప్రవక్త (స) ఓసారి వెనక్కి తిరిగిచూసి అవ్యక్తమైన బాధతో నిట్టూర్చారు. మనసు కకావికలమయి పోయింది. కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. స్వస్థలం ఎడబాటుతో పొరలి వచ్చిన ఆవేదనని బలవంతంగా దిగమింగి కర్తవ్యోన్ముఖులయ్యారు దైవప్రవక్త (సల్లం). చీకటిలో చరచరా నడవసాగారు. కొంతదూరం పోయిన తరువాత మరోదారి నుంచి ప్రియసహచరుడు అబూబకర్ (రజి) కూడా వచ్చి కలుసుకున్నారు. ఇద్దరూ వేగంగా అడుగులేస్తూ 'సౌర్' గుహకు చేరుకున్నారు.

ఉదయకాంతులతో చీకటి తెరలు క్రమక్రమంగా విడిపోతున్నాయి. దైవప్రవక్త (సల్లం), ఆయన ఆప్తమిత్రుడు అబూబకర్ (రజి) కలసి నమాజ్ చేశారు.

ఆ తరువాత హజ్రత్ అబూబకర్ (రజి) గుహలో ప్రవేశించి రాళ్ళు, ముళ్ళూ తీసేసి నేల శుభ్రం చేశారు. అక్కడక్కడ కన్నాలు ఉంటే గుడ్డపేలికలు చుట్టి వాటిలో పెట్టారు. తరువాత దైవప్రవక్త (సల్లం)ని లోపలికి తీసికెళ్ళారు.

దైవప్రవక్త (సల్లం) చాల అలసిపోయారు. అందువల్ల ఆయన అబూబకర్ (రజి) తొడ మీద తలపెట్టి పడుకున్నారు. కాస్సేపటికి ఆయనకు నిద్ర పట్టింది.

హజ్రత్ అబూబకర్ (రజి) గుహలోని కన్నాలన్నీ గుడ్డ పేలికలతో మూసినా ఇంకో కన్నం మిగిలిఉంది. దానిపై ఆయన తనకాలి బొటనవ్రేలు పెట్టారు. అయితే కాస్సేపటికి ఆ కన్నంలో ఏం విషపురుగుందోగాని, అది అబూబకర్ (రజి) కాలికి కాటేసింది. కాని దైవప్రవక్త (సల్లం)కు నిద్రాభంగం కలుగుతుందని ఆయన కదలకుండా బాధను ఓర్చుకుంటూ అలాగే కూర్చున్నారు. కాస్సేపటికి దైవప్రవక్త (సల్లం) మేల్కొన్నారు. చూస్తే అబూబకర్ (రజి) లోలోన ఏదో బాధపడుతున్నట్లు అన్పించింది.

"అబూబకర్! ఏమయింది ఏదో బాధపడుతున్నట్లు ఉన్నావు?" అనడిగారు దైవ ప్రవక్త (స). దానికి ఆయన "దైవప్రవక్తా! ఏమని చెప్పను? ఇదిగో ఈ కన్నం మూసేయడా నికి కాలి బొటనవ్రేలు అడ్డంపెడ్తే విషపురుగేదో కరిచింది" అని చెప్పారు.

"బాధపడకు. ముందు అక్కడ్నుంచి కాలు తీసెయ్యి" అన్నారు దైవప్రవక్త (సల్లం). హజ్రత్ అబూబకర్ (రజి) కన్నంపై నుంచి కాలు తీసి దగ్గరకు లాక్కున్నారు. వెంటనే కన్నంలో నుంచి భయంకరమైన ఓ త్రాచుపాము బయటికొచ్చి పడగ విప్పింది.

"సర్పమా! నువ్వు నా ఆప్తమిత్రుడ్ని కాటేసి నా మనస్సు నొప్పించావే!" అన్నారు దైవప్రవక్త. ఈమాట వినగానే త్రాచుపాము తలవంచి అక్కడ్నుంచి చరచరా వెళ్ళి పోయింది.



ఆ తర్వాత దైవప్రవక్త (సల్లం) తన లాలాజలం తీసి అబూబకర్ (రజి) కాలిబొటన వ్రేలిపై రాసి రుద్దారు. మరుక్షణమే పాము విషప్రభావం పోయి అబూబకర్ (రజి)కు బాధ తగ్గిపోయింది. తర్వాత దైవప్రవక్త (స) మళ్ళీ నడుంవాల్చి పడుకున్నారు.

కాస్సేపటికి ఓ సాలెపురుగు వచ్చి గుహముఖంపై గూడు అల్లింది. తర్వాత ఎటు నుంచో రెండు పావురాళ్ళు వచ్చి గుహద్వారం ముందు కిచకిచమంటూ ఎగరసాగాయి.

అటు ఖురైషీయులు ఎలాగైనా దైవప్రవక్త (స)ను పట్టుకోవాలని తీవ్రంగా ప్రయత్ని స్తున్నారు. వారు అడుగుజాడల్ని గుర్తించే మనిషి కోసం వెతికారు. చివరికి కుర్జ్ బిన్ అల్ఖమా అనే వ్యక్తి దొరికాడు. కుర్జ్ అడుగుజాడల్ని గుర్తించడంలో గొప్ప ప్రవీణుడు.

మరునాడు మధ్యాహ్నం సౌర్ పర్వతం నరరూపరాక్షసుల అరుపులతో దద్దరిల్ల సాగింది. ఖురైషీయులు ఈలలు, అరుపులు, వికటాట్టహాసాలతో కర్రలు, కటారులు తిప్పుకుంటూ కుర్జ్ బిన్ అల్ఖమా వెంట వచ్చారు.

ఆ సమయంలో దైవప్రవక్త (స) తనను చీల్చిచెండాటానికి వస్తున్న రాకాసిమూకల పొలికేకలకు ఏమాత్రం చలించకుండా ప్రశాంతంగా దైవధ్యానంలో నిమగ్నులై ఉన్నారు. కాని దుష్టుల అరుపులు దగ్గరయ్యే కొద్దీ అబూబకర్ (రజి) మనస్సులో మాత్రం ఆందోళన అంతకంతకు ఎక్కువ కాసాగింది.

"అయ్యో! నేను ముహమ్మద్‌ను నా హృదయంలో దాచుకోగలిగితే ఎంత బాగుండు! శత్రువుల కంటబడకుండా ఆయన్ని నా దేహంతో కప్పగలిగితే నేనెంత అదృష్టవంతుడ్ని!!" ఆయన హృదయం విలపించింది.

కుర్జ్ బిన్ అల్ఖమా ఎంతో జాగ్రత్తగా దారిలో **పాదచిహ్నాలు** చూసుకుంటూ కొండ మీదికి ఎక్కాడు. ఖురైషీయులు అతని వెనకాలగా నడుస్తున్నారు. కుర్జ్ కొండ మీదికి పోయి హఠాత్తుగా ఒక చోట ఆగాడు. తర్వాత ఎటుపోవాలో అర్థంగాక అయోమయంగా చూడసాగాడు. అతని దేహం నుండి చెమటలు కారుతున్నాయి. చివరికి అతను దిక్కుతోచక దిగాలుపడిపోయి నిలబడ్డాడు. అతని వాలకం చూసి ఖురైషీయులకు ఆశ్చర్యం కలిగింది.

"ఏమయింది? అకస్మాత్తుగా ఆగిపోయి అలా దిక్కులు చూస్తున్నావేమిటీ?" అని అడిగారు వారు. "వాళ్ళిద్దరు ఈ రాయి దాకా వచ్చారు. ఆ తర్వాత ఎటు పోయారో తెలియడంలేదు" అన్నాడు కుర్జ్ ఎదురుగా ఉన్న ఓరాతి వైపు చూపిస్తూ. "ఇబ్నె అల్ఖమా! ఈరోజు ఏమయింది నీకు? ఇలా ఇదివరకెప్పుడూ పొరబడలేదే నీవు!" అన్నారు ఖురైషీయులు వస్తున్న కోపాన్ని తమాయించుకుంటూ.

వారికి కొద్దిదూరంలో ఓ పశువులకాపరి కన్పించాడు. ఖురైషీయులు అతని దగ్గరకు పోయి "కొండ మీదికి ఇద్దరు మనుషులు రావడం చూశావా?" అని అడిగారు.

"నేనెవరినీ చూడలేదు. వారిద్దరు అదిగో ఆగుహలో ఉంటారేమో చూడండి" అన్నాడు పశువులకాపరి కొండ ఎగువభాగాన కొద్దిదూరంలో ఉన్న గుహవైపు చూపిస్తూ.

ఖురైషీయులు వెంటనే పైకెక్కి గుహ వైపు వడివడిగా నడవసాగారు. అందరి చేతుల్లో కత్తులు, ఈటెలు, విల్లంబులు ఉన్నాయి. అందరి హృదయాల్లో ఒకే దీక్ష! ఒకే కాంక్ష!! ముహమ్మద్ (స)ని వధించే అదృష్టం తనకే దక్కాలి. అంచేత గుహ దగ్గరవుతున్న కొద్దీ వారి ఆరాటం, ఆర్భాటాలు ఎక్కువ కాసాగాయి.

వారిలో ఒక యువకుడు అతి వేగంగా గుహ వైపు పరుగెత్తాడు. కాని గుహ ఇంకా కొన్ని గజాల దూరం ఉండగానే, తక్కున ఆగిపోయాడు. రెండు క్షణాలు అటూ ఇటూ అయోమయంగా చూసి, నిరుత్సాహంతో వెనక్కి మరిలాడు. వెనకాల వడివడిగా అక్కడికి చేరుకున్న ఖురైషీయులు అతడ్ని చూసి విస్తుబోయారు.

గుహ లోపలున్న అబూబకర్ (రజి)కు గుహ బయట కొద్ది దూరంలో ఉన్న శత్రువుల పాదాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. దాంతో ఆయన దైవప్రవక్త (సల్లం)కు ప్రమాదం ముంచుకొస్తుందేమోనని భావించి కంగారుపడసాగారు. దైవప్రవక్త (సల్లం) ధ్యానం ముగిసింది. ఆయన అబూబకర్ (రజి) ముఖంలోని ఆందోళనను గమనించి "భయపడకు. దేవుడు మనకు తోడున్నాడు" అన్నారు ధైర్యం చెబుతూ.

ఖురైషీయులు ఆ యువకుని వైపు ఆశ్చర్యంగా చూస్తూ "ఏమయింది వెనక్కి తిరిగావు, గుహలోకి తొంగయినా చూడకుండా" అని అడిగారు ఆదుర్దాగా.

"ఏమని చెప్పను? బహుశా అప్పటికి ముహమ్మద్ పుట్టనైనా పుట్టిఉండడు. అప్పట్నుంచి గుహ మీద ఓ పెద్ద సాలెగూడు ఉంది. గుహ బయట రెండు పావురాళ్ళు కూడా గుడ్లు పెట్టి ఎగురుతున్నాయి. దారిలో ఓ పెద్ద చెట్టు కూడా ఉంది. ఇక అలాంటి గుహలో మనుషులు ఉంటారని ఎలా అనుకోను?" అన్నాడా యువకుడు.

అతని మాటలు విని ఖురైషీయులు నీరుకారిపోయారు. చివరికి నిరాశానిస్పృహలతో చేతులు నులుపుకుంటూ, కాళ్ళీడ్చుకుంటూ ఇళ్ళకు తిరుగుముఖం పట్టారు.

అవిశ్వాసులు తనను ఇంకా వెంటాడుతూ ఉండవచ్చని దైవప్రవక్త (సల్లం) మూడు రోజుల దాకా సౌర్ గుహలోనే ఉండవలసి వచ్చింది. ఈ మూడు రోజులు అబూబకర్ (రజి) కొడుకు అబ్దుల్లా (రజి) పగలంతా నగరంలో తిరిగి, ఖురైషీయులు దైవప్రవక్త (సల్లం)కు వ్యతిరేకంగా ఏమేమి కుట్రలు పన్నుతున్నారో తెలుసుకొని రాత్రిపూట వచ్చి సమాచారం అందజేసేవారు. ఆయన చెల్లెలు అస్మా (రజి) తండ్రికి, దైవప్రవక్త (సల్లం)కు అన్నం నీళ్ళు తెచ్చిచ్చేవారు. హజ్రత్ అబూబకర్ (రజి) సేవకుడు ఆమిర్ బిన్ ఫుహైరా మేకలను మేపుకుంటూ గుహ దగ్గరకు వచ్చేవాడు.

హజ్రత్ అస్మా (రజి) తెచ్చిన అన్నం దైవప్రవక్త (సల్లం), అబూబకర్ (రజి) తినేవారు. ఆ తరువాత అస్మా (రజి), అబ్దుల్లా (రజి) గుహ దగ్గర్నుంచి తిరిగి వెళ్ళేటప్పుడు శత్రువులు వారి అడుగుజాడలు గుర్తించడానికి వీలులేకుండా ఉండేందుకు ముందు వారిద్దరు నడుస్తుంటే వారి వెనుకాలుగా ఆమిర్ మేకలను తోలుకుంటూ అనుసరించేవాడు.



ఈవిధంగా మూడు రోజులు సౌర్ గుహలో గడిపి, అబ్దుల్లా (రజి) సేకరించిన సమాచారాన్ని బట్టి శత్రువులు తమను వెంటాడటం మానేశారని నిర్ధారణ చేసుకున్నారు. అప్పుడు హజ్రత్ అబూబకర్ (రజి) తన కొడుకుతో "నేను మన ఇంటి దగ్గర రెండు ఒంటెల్ని సిద్ధంచేసి ఉంచాను. నీవు వెంటనే పోయి, ఎవరికీ తెలియకుండా రహస్యంగా వాటిని తీసుకురా. వచ్చేటప్పుడు అబ్దుల్లా బిన్ అర్ఖత్‌ను కూడా పిలుచుకొనిరా" అని చెప్పి పంపించారు.

ఆ సాయంకాలమే అబ్దుల్లా (రజి) గుహ దగ్గరకు తిరిగొచ్చారు. ఆయన వెంట అస్మా (రజి), ఆమిర్ కూడా ఉన్నారు. వారి వెనకాల ఇబ్నె అర్ఖత్ ఒంటెలను తోలుకొని వచ్చాడు. ఇబ్నెఅర్ఖత్‌కు అబూబకర్ (రజి) కొంత పైకం ముట్టజెప్పి తమను నిర్జనప్రాంతం గుండా మదీనా తీసికెళ్ళటానికి మార్గదర్శిగా కుదుర్చుకున్నారు.

దైవప్రవక్త (సల్లం) ఒకఒంటె మీద, ఆయన సహచరుడు మరోఒంటె మీద కూర్చున్నారు. ఇబ్నె అర్ఖత్ తన సొంత ఒంటె మీద కూర్చున్నాడు. దారిలో ఎందుకైనా ఉపయోగపడవచ్చని హజ్రత్ అబూబకర్ (రజి) తన వెనుక సేవకుడు ఆమిర్‌ని కూర్చోబెట్టుకున్నారు. అలా ఈ నలుగురు న.శ. 14వ ఏట రబీవుల్‌అవ్వల్ ఒకటో తేదీ (క్రీ.శ. 16-9-622)న ఇబ్నె అర్ఖత్ సారథ్యంలో నిర్మానుష్యంగా ఉన్న తీరప్రాంతం గుండా ప్రయాణమయ్యారు.

# 47. మసీదులుగా మారిన చారిత్రక ప్రదేశాలు

మక్కా నగరంలో హజ్ నియమాల పరిధిలోకి రాని చారిత్రక ప్రదేశాలు అనేకం ఉన్నాయి. వాటిలో కొన్ని చారిత్రక ప్రదేశాలు తర్వాతికాలంలో మసీదులుగా రూపొందాయి. ఆ మసీదులలో కొన్ని చెప్పుకోదగిన మసీదులు ఉన్నాయి. వాటిలోనూ పుణ్యం రీత్యా కొన్ని మసీదులు ప్రసిద్ధి చెందాయి. ఇక్కడ కొన్ని మసీదులను గురించి తెలుసుకుందాం.

## మస్జిదె ఆయిషా (మస్జిదె తన్ఈమ్)

ఈ మసీదు కాబాలయం నుండి ఉత్తరం దిక్కున ఏడున్నర కిలోమీటర్ల దూరంలో మదీనారోడ్డు మీద ఉంది. ఈ రోడ్డును 'హిజ్రత్ రోడ్డు' అని కూడా అంటారు. ఈ ప్రదేశంలో దైవప్రవక్త (సల్లం) సతీమణి హజ్రత్ ఆయిషా (రజి)కు సంబంధించిన ఒక సంఘటన జరిగినందువల్ల ఇక్కడ ఆమె పేరుతో మసీదు నిర్మించబడింది. తన్ఈమ్ అనే ఈ ప్రదేశంలో నిర్మించబడినందున దీనికి 'మస్జిదె తన్ఈమ్' అని కూడా అంటారు. అయితే 'మస్జిదె ఆయిషా' అన్న పేరే ఎక్కువ ఖ్యాతి చెందింది.

ఇంతకూ ఈ ప్రదేశంలో హజ్రత్ ఆయిషా (రజి)కు సంబంధించి సంభవించిన సంఘటన ఏమిటీ? హి.శ. 10 ఏట దైవప్రవక్త (సల్లం) హజ్ చేయడానికి నిశ్చయించుకొని ఓ బహిరంగ ప్రకటన గావించారు. ఈ ప్రకటన వినగానే మదీనా పట్నం, దాని పరిసర ప్రాంతాల నుండి వేలాది యాత్రికులు బయలుదేరారు. దైవప్రవక్త (సల్లం) మక్కా

నుండి మదీనా వలస వచ్చిన తరువాత ఆయన చేసిన మొట్టమొదటి హజ్ ఇదే. ఆ తరువాత హజ్ సీజన్ రాకముందే సృష్టికర్త ఆయన్ని తన సన్నిధికి పిలిపించుకున్నాడు. అందువల్ల దైవప్రవక్త (స) చేసిన చిట్టచివరి హజ్ కూడా ఇదే అయింది. ఈ హజ్‌కు ఆయన తన శ్రీమతులలో హజ్రత్ ఆయిషా (రజి)ను వెంటబెట్టుకొని వెళ్ళారు.

దైవప్రవక్త (సల్లం)తో పాటు యాత్రికులంతా మక్కా చేరుకొని హజ్ నియామాలు పాటించారు. అరఫాత్‌లో దైవప్రవక్త (స) 'వీడ్కోలు ప్రసంగం' చేశారు. అయితే హజ్ సందర్భంలో హజ్రత్ ఆయిషా (రజి)కు బహిష్టు అయినందున ఆమె 'హజ్ మూడోరోజు'న కాబా చుట్టు సందర్శనా ప్రదక్షిణ (తవాఫె జియారత్) చేయలేకపోయారు.

మహిళలు సహజసిద్ధమైన అపరిశుద్ధావస్థలో కాబా ప్రదక్షిణ చేయకూడదు. అందువల్ల హజ్రత్ ఆయిషా (రజి) రుతుక్రమం ఆగిపోయి స్నానం చేసిన తరువాతనే కాబా ప్రదక్షిణ చేయగలిగారు. కాని బహిష్టు కారణంగా ఆమె అందరితో పాటు ఉమ్రా చేయలేకపోయారు. అప్పుడు ఆమె దైవప్రవక్త (సల్లం)తో మాట్లాడుతూ "దైవప్రవక్తా! మీరందరూ హజ్, ఉమ్రాలు రెండు ఆరాధనలూ పూర్తిచేసుకొని తిరిగివెళ్ళిపోతున్నారు. నేను ఒక్క హజ్ మాత్రమే చేసి వెళ్ళిపోవాలా?" అని అడిగారు. దైవప్రవక్త (సల్లం) ఈమాట విని "ఈమెను తన్‌ఈమ్ ప్రదేశానికి తీసికెళ్ళు" అని హజ్రత్ ఆయిషా (రజి) సోదరుడు హజ్రత్ అబ్దుర్రహ్మాన్ (రజి)ని ఆదేశించారు. ఈవిధంగా ఆమె తన్‌ఈమ్ ప్రదేశంలో దీక్ష (ఇహ్రాం) పూని ఉమ్రా విధి నెరవేర్చారు. ఇది జిల్‌హజ్జ నెలలో హజ్ తరువాత జరిగింది. (బుఖారి)

ఈ కారణంగానే తరువాతి కాలంలో అక్కడ మస్జిదెఆయిషా పేరుతో ఒక మసీదు వెలసింది. ఈ మసీదు ఇస్లామీయ తరహా నిర్మాణంతో ఎంతో అందంగా నిర్మించబడిన భవనం కావడంవల్ల ఇది మక్కాలోని చారిత్రక స్థలాలలో ఒకటిగా లెక్కించబడుతోంది.

## మస్జిదె జిన్

దైవప్రవక్త (సల్లం) తాయిఫ్ పట్నం నుంచి తిరిగొస్తూ దారిలో ఒక చోట ఆగి నమాజ్ చేస్తుంటే జిన్నులు (భూతాలు) వచ్చి ఖుర్‌ఆన్ పఠనం విన్నారు. అందువల్ల ఆ ప్రదేశంలో మస్జిదె జిన్ పేరుతో ఒక మసీదు కట్టారు.

దైవప్రవక్త (స) ధర్మప్రచారం కోసం తాయిఫ్‌పట్నం వెళ్ళి అక్కడ పరిస్థితి అనుకూలించ నందున బాధాతప్త హృదయంతో మళ్ళీ మక్కా పట్నానికి తిరుగు ముఖం పట్టారు. దారిలో ఆయన నఖ్లా అనే చోట విడిదిచేశారు. ఆ రాత్రి ఆయన నమాజులో ఖుర్‌ఆన్ పఠిస్తుంటే జిన్నుల (భూతాల) సమూహం ఒకటి యాదృచ్ఛికంగా అటువచ్చి ఖుర్‌ఆన్ బోధ విన్నది. తర్వాత వారు తమజాతి ప్రజలకు దగ్గరికెళ్ళి దాన్ని ప్రచారం కూడా చేశారు. అయితే ఈసంగతి దైవప్రవక్త (స)కు ఏమాత్రం తెలియదు. ఆ తరువాత దేవుడు ఈ సంఘటన గురించి దివ్యావిష్కృతి ద్వారా ఆయనకు తెలియజేశాడు.



"ప్రవక్తా! వారికీ సంగతి తెలియజెయ్యి: జిన్నుల సమూహం ఒకటి (ఖుర్‌ఆన్ బోధ) విన్నదని, తరువాత (తన జాతివాళ్ళ దగ్గరికెళ్ళి) ఈవిధంగా అన్నదని నాకు దివ్యావిష్కృతి ద్వారా తెలియజేయబడింది":

"మేమొక అద్భుతమైన ఖుర్‌ఆన్ (వాణి) విన్నాం. అది సన్మార్గం వైపు మార్గదర్శనం చేస్తుంది. అందువల్ల మేము దాన్ని విశ్వసించాం. ఇకనుంచి మేము మా ప్రభువుకు ఎవరినీ సాటి కల్పించము. మా ప్రభువు మహోన్నతుడు, మహిమాన్వితుడు. ఆయన ఎవరినీ తనకు భార్యగాగాని, కుమారునిగాగాని చేసుకో లేదు. మన మూర్ఖజనం దేవుని విషయంలో సత్య వ్యతిరేకమయిన మాటలు చెబుతున్నారు. దేవుణ్ణి గురించి మానవులు, జిన్నులు ఎన్నడూ అబద్ధాలాడరని మేము భావించాము. కొందరు మానవులు జిన్నులలో కొందరి రక్షణ కోరుతున్నారు. ఈవిధంగా వారు జిన్నుల గర్వాన్ని మరింత అధికం చేశారు. మీరు భావించినట్లే మానవులు కూడా దేవుడు ఎవరినీ ప్రవక్తగా నియమించి పంపడని అనుకున్నారు." (72:1-7)

"మేము ఆకాశం వెతికిచూస్తే అది కాపలాదారులతో, ఉల్కలతో నిండిఉన్నట్లు కన్పించింది. ఇదివరకైతే (ఏదైనా) వినడానికి మనకు ఆకాశంలో కూర్చునే చోటు లభించేది. కాని ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. దొంగచాటుగా ఎవరైనా వినడానికి ప్రయత్నిస్తే అతనికి ఒక అగ్నిజ్వాల తన కోసం మాటువేసి ఉండటం కన్పిస్తున్నది. భూవాసులకు ఏదయినా కీడు తలపెట్టే నిర్ణయం జరిగిందో, లేక వారి ప్రభువు వారికి సన్మార్గం చూపగోరుతున్నాడో మాకు అర్థం కావడం లేదు". (ఖుర్‌ఆన్. 72:8-10)

"మనలో కొందరు సజ్జనులు ఉన్నారు; మరికొందరు దుర్జనులు ఉన్నారు. మనం విభిన్న (మత) వర్గాలుగా చీలిపోయి ఉన్నాం. మనం భూలోకంలో దేవుణ్ణి ఎదిరించలేమని, పారిపోయికూడా ఆయన పట్టునుండి బయటపడలేమని మాకిప్పుడు తెలిసొచ్చింది. మేము మాత్రం హితబోధ విని విశ్వసించాం. (ఇలా)ఎవరైనా తమ ప్రభువును విశ్వసిస్తే అతనికి ఎలాంటి నష్టంగాని, అన్యాయంగాని జరుగుతుందన్న భయముండదు. మనలో కొందరు దేవునికి విధేయులై (ముస్లింలై)న వారున్నారు. కొందరు సత్యానికి విముఖులైన వారున్నారు. కనుక ఎవరు విధేయతా మార్గం (ఇస్లాం) అవలంబిస్తారో వారు ముక్తిమార్గం పొందినట్లే. అలాగే ఎవరు సత్యానికి విముఖులవుతారో వారు నరకానికి సమిధలయి పోతారు." (ఖుర్‌ఆన్. 72:11-15)

"మేము జిన్నుల సమూహం ఒకదాన్ని ఖుర్‌ఆన్ వాణి వినేందుకు నీదగ్గరకు పంపాము. వారు (నీవు ఖుర్‌ఆన్ పఠిస్తున్న) స్థలానికి చేరుకొని పరస్పరం నిశ్శబ్దంగా ఉండండని అన్నారు. ఖుర్‌ఆన్ పఠనం ముగిసిన తరువాత వారు హెచ్చరించేవారుగా తమ జాతి ప్రజల దగ్గరికెళ్ళి (ధర్మబోధ చేస్తూ) వారితో ఇలా అన్నారు:

'మాజాతి సోదరులారా! మేమొక (అద్భుత) గ్రంథం విన్నాం. ఇది మూసా నిష్క్రమణ తరువాత అవతరించింది. పూర్వం అవతరించిన గ్రంథాలను ధృవీకరిస్తోంది.

సత్యం, సన్మార్గాల వైపు మార్గదర్శనం చేస్తుంది. కనుక మాజాతి సోదరులారా! దేవుని వైపు పిలిచేవాని పిలుపు అందుకోండి. ఆయన్ని విశ్వసించండి. దేవుడు మీతప్పులు మన్నిస్తాడు. మిమ్మల్ని ఘోరశిక్ష నుండి రక్షిస్తాడు." (ఖుర్‌ఆన్. 46:29-31)

ఈ సంఘటన తర్వాత జిన్నులు తరచుగా దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి ఖుర్‌ఆన్ విని పోతుండేవారు. దైవప్రవక్త (సల్లం) మక్కాలో ఉన్న కాలంలో జిన్నులు ఈవిధంగా ఆరుసార్లు వచ్చి పోయారని తెలుస్తోంది. కొన్ని హదీసుల్ని బట్టి దైవప్రవక్త (సల్లం) జిన్నుల విజ్ఞప్తిపై నిర్ణీత సమయానికి ఓ ప్రత్యేక నిర్జన ప్రదేశానికెళ్ళి ఖుర్‌ఆన్ పఠించేవారని, అప్పుడు జిన్నులు ఆ దైవవాణిని శ్రద్ధగా వినేవారని తెలుస్తోంది.

సౌదీఅరేబియాలోని 'దారుస్సలాం' ప్రచురణ సంస్థ నుండి వెలువడిన "తారిఖె మక్కాముకర్రమా" అనే గ్రంథంలో 'మస్జిదె జిన్' గురించి ఇలా పేర్కొనబడింది:

ఈ మసీదు హజూన్ సమీపంలో ఉంది. (ప్రవక్త అనుచరుడు) హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్వూద్ (రజి) కూర్చోవడానికి దైవప్రవక్త (స) గీసిన గీత పరిధిలోనే ఈ మసీదు నిర్మించబడింది. జిన్నులకు ఖుర్‌ఆన్ విన్పించాలని దేవుడు తన ప్రవక్తను ఆజ్ఞాపించాడు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) అబ్దుల్లా బిన్ మస్వూద్ (రజి)ను వెంటబెట్టుకొని హజూన్ ప్రాంతంలోని అబీదబ్ అనే ప్రదేశానికి చేరుకున్నారు.

"హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్వూద్ (రజి) ఈ సంఘటనను గురించి ప్రస్తావిస్తూ ఇలా అన్నారు- 'దైవప్రవక్త (సల్లం) ఇషా నమాజ్ చేసిన తరువాత బయటికి వచ్చి, నా చేయి పట్టుకొని బయలుదేరారు. ఇలా బయలుదేరి చివరికి మక్కా శివార్లలోకి ప్రవేశించి ఒకచోట నన్ను కూర్చోబెట్టారు. తర్వాత నాచుట్టూ ఓ గీత గీసి 'నువ్వీ గీత దాటి ఏమాత్రం బయటికి పోకూడదు. నీ దగ్గరకు కొంతమంది మనుషులు వస్తారు. వాళ్ళతో నువ్వేమీ మాట్లాడకు. వారు నిన్నేమీ చేయలేరు' అని తాకీదు చేశారు.

ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) అక్కడ్నుంచి వెళ్ళి నానుండి కనుమరుగైపోయారు. కాస్సేపటికి అకస్మాత్తుగా కొందరు మనుషులు నా దగ్గరకు వచ్చారు. వారు భారత దేశంలోని జాట్ కులస్థుల్లా ఉన్నారు. వారి శిరోజాలు, దేహాలు అచ్చం జాట్ కులస్థుల శిరోజాలు, దేహాల్లాగానే ఉన్నాయి. వారి మర్మావయవాలు, చర్మాలు కనపడకుండా ఆచ్ఛాదనలు ఉన్నాయి. వారు గీత వరకు మాత్రమే వచ్చారు. గీత దాటి (నా వైపుకు) రాలేకపోయారు. తరువాత వారు దైవప్రవక్త (సల్లం) పోయిన దిశగా వెళ్ళిపోయారు.

రాత్రి చాలా పొద్దు పోయాక దైవప్రవక్త (సల్లం) తిరిగొచ్చారు. నేను అప్పటిదాకా గీత లోపలే ఉన్నాను. దైవప్రవక్త (సల్లం) వస్తూనే 'వారు నన్ను ఈరోజు రాత్రంతా జాగరణ చేయించారు' అన్నారు. తరువాత ఆయన గీత లోపలికి వచ్చి నా తొడ మీద తలపెట్టి పడుకున్నారు. దైవప్రవక్త (సల్లం) నిద్ర పోతున్నప్పుడు తేలికపాటి గురక పెట్టేవారు." (ముస్నద్ అహ్మద్, తిర్మజి)



## మస్జిదె జీరాన

జీరాన అనేది మక్కా, తాయిఫ్ పట్నాల మధ్య ఉన్న ఒక బావి పేరు. ఇది తాయిఫ్ కన్నా మక్కాకే చాలా దగ్గరగా ఉంది. దైవప్రవక్త (సల్లం) హునైన్ యుద్ధంలో హవాజన్ తెగవారి నుండి లభించిన సమరసొత్తును ఈ ప్రాంతంలోనే సైనికులకు పంచారు. ఆ తరువాత ఆయన ఇక్కడే ఉమ్రా కోసం దీక్ష పూనారు. అందువల్ల ఇక్కడ జీరాన పేరుతో ఒక మసీదు నిర్మించబడింది.

ఖాజీ అబూఅబ్బాస్ ఈ మసీదు ఔన్నత్యం గురించి చెబుతూ "దైవప్రవక్త (సల్లం) జీరానాలో ఉమ్రాదీక్ష పూనారు. అంచేత మక్కా, దాని పరిసర ప్రాంతాలవారు శ్రేష్ఠమైన ఉమ్రా కోసం ఇక్కడ దీక్ష పూనాలి" అని అన్నారు.

"దైవప్రవక్త (స) జీరానాలో ఉమ్రాదీక్ష పూనారు గనక, మక్కాలో ఉండేవారు ఉమ్రాదీక్ష పూనడానికి ఇదే శ్రేష్ఠమైన ప్రదేశం" అని ఇమామ్ మాలిక్, ఇమామ్ షాఫయి, ఇమామ్ ఇబ్నెహంబల్ వగైరా ధర్మవేత్తలు కూడా అభిప్రాయపడ్డారు.

# 48. మీఖాత్, ఇహ్రాం

మక్కా నగరానికి సుదూరప్రాంతాలలో ఉండేవారు హజ్ లేక ఉమ్రా దీక్ష (ఇహ్రాం) పూనడానికి దైవప్రవక్త (సల్లం) ప్రత్యేకంగా కొన్ని ప్రదేశాలు నిర్ణయించారు. ఆ ప్రదేశాలనే "మీఖాత్" అంటారు. హజ్ లేక ఉమ్రా చేయడానికి బయలుదేరేవారు ఈ ప్రదేశాలలో తప్పకుండా ఆగి దీక్ష (ఇహ్రాం) పూనవలసి ఉంటుంది. వారు దీక్ష పూనకుండా మీఖాత్ ప్రదేశాలు దాటి మక్కా వైపు ఒక్క అడుగు కూడా వేయకూడదు. ఈ ప్రదేశాలకు చేరుకోకముందు వైనుక వైపు ఎక్కడైనా దీక్ష పూనవచ్చు. ఈ మీఖాత్ ప్రదేశాలు మొత్తం అయిదు ఉన్నాయి.

**(1) జులైహులైఫా**:- ఇది మదీనా నుండి, మదీనా ఉత్తర దిక్కు ప్రాంతాల నుండి వచ్చే యాత్రికుల కోసం నిర్ణయించ బడిన మీఖాత్ ప్రదేశం.

**(2) జుహ్ఫా**:- ఇది సిరియా నుండి వచ్చే యాత్రికుల కోసం నిర్ణయించబడిన మీఖాత్ ప్రదేశం. ఈనాడు జుహ్ఫాకు దగ్గర్లో ఉన్న **రాగిబ్** అనే ప్రదేశంలో దీక్ష పూనడం జరుగుతోంది.

**(3) ఖర్నుల్ మనాజిల్**:- ఇది నజద్ నుండి వచ్చే యాత్రికుల కోసం నిర్ణయించబడిన మీఖాత్ ప్రదేశం. ఈరోజుల్లో దీన్ని **సైల్** అంటున్నారు.

**(4) యలమ్‌లమ్**:- ఇది యమన్ నుండి వచ్చే యాత్రికుల కోసం నిర్ణయించ బడిన మీఖాత్ ప్రదేశం.

**(5) జాతుల్ఇర్క్**:- ఇది ఇరాఖ్ నుండి వచ్చే యాత్రికుల కోసం నిర్ణయించ బడిన మీఖాత్ ప్రదేశం.

మీఖాత్ ప్రదేశాలలో ఇహ్రాం కోసం కుట్టులేని రెండు వస్త్రాలు తీసుకొని ఒకటి లుంగీగా చుట్టుకోవాలి. రెండోది వీపు నుండి భుజాల మీదుగా తీసి రొమ్ము మీద వేసుకొని కప్పుకోవాలి. కాబా మసీదు భవన సముదాయానికి, కాబా గర్భగుడికి మధ్య ఉన్న విశాలమైన మైదానంలో ప్రవేశించిన తర్వాత ఇహ్రాం బట్టను కుడిచంక కింది నుంచి తీసి ఎడమ భుజమ్మీదుగా రొమ్ము మీదికి లాగి కట్టుకోవాలి.

# 49. మేము నిర్వహించిన హజ్

జిల్‌హజ్జ 8వ తేదీ (8-1-2006) సాయంత్రం మా విడిదిలో హడావిడి మొదలయింది. జిల్‌హజ్జ 8వ తేదీ నుంచి హజ్ దినాలు ప్రారంభమవుతాయి. అందువల్ల జిల్‌హజ్జ 8వ తేదీ రాత్రే "మినా"కు బయలుదేరవలసి ఉన్నందున ఆరాత్రి మా లాడ్జిలో అందరూ ప్రయాణసన్నాహాల్లో మునిగిపోయారు. హిజ్రీ తేదీ సూర్యాస్తమయం నుంచి ప్రారంభమవుతుందనే విషయం గమనార్హం.

నేను, మా మామయ్య, మా శ్రీమతి మూడు బ్యాగుల్లో బట్టలు, తిను బండారాలు పెట్టుకొని, స్నానం చేసి సిద్ధమవుతున్నాం. అంతలో ముఅల్లిం మనిషి వచ్చి ఇషా నమాజ్ తరువాత బస్సుల్లో 'మినా'కు బయలుదేరాలి, సిద్ధంగా ఉండండని చెప్పి వెళ్ళిపోయాడు. నేను, మా మామయ్య ఇషా నమాజ్ తరువాత ఇహ్రాం బట్టలు కట్టుకొని, రెండు రకాతులు నఫిల్ నమాజ్ చేసి బస్సు కోసం ఎదురుచూస్తూ కూర్చున్నాం.

మా లాడ్జి సమీపంలో అనేక బస్సులు నిలబడి ఉన్నాయి. కాని మా ముఅల్లిం బస్సులు ఎంత సేపు ఎదురుచూసినా రాలేదు. చివరికి మేము మరికొందరు హాజీలతో కలసి కొంచెం దూరం నడచి మెయిన్ రోడ్డు మీదికి చేరి బస్సు కోసం ఎదురు చూస్తూ నిలబడ్డాం. మా ముఅల్లిం బస్సులు అనేకం వచ్చాయి. కాని బస్సులన్నీ హాజీలతో కిటకిట లాడుతూ ఆగకుండా వెళ్ళిపోయాయి. చివరికి రాత్రి పన్నెండు గంటలకు ఓ ఖాళీ బస్సు వస్తే అందులో ఎక్కి మినాకు బయలుదేరాం.

మేము బస్సులో తొందరగానే 'మినా' సమీపానికి చేరుకున్నాము. కాని అక్కడ్నుంచి మా డ్రైవర్‌కు కష్టాలు ఎదురయ్యాయి. మినాలో మాకు కేటాయించిన శిబిరాలు ఎక్కడున్నాయో తెలియక పాపం అతను తికమక పడుతూ, అడుగడునా ఎదురవుతున్న ట్రాఫిక్ అవాంతరాలు అధికమిస్తూ బస్సు నడపసాగాడు. చివరికి ఎలాగో రాత్రి దాదాపు నాలుగు గంటలకు మమ్మల్ని మా శిబిరాలకు కిలో మీటర్ దూరంలో దించాడు.

## జిల్‌హజ్జ 8వ తేది కార్యకలాపాలు

'మినా'లో వేలాది శిబిరాలు ఉన్నాయి. అక్కడ సమీపంలో ఉన్న ఓ ఫ్లయి ఓవర్ బ్రిడ్జి ఎక్కిచూస్తే, బ్రిడ్జికి అటు ఇటూ కొన్ని మైళ్ళదాకా మనకు శిబిరాలే శిబిరాలు కానవస్తాయి. ఇవన్నీ ఎంతో దృఢంగా నిర్మించబడిన 'ఫైర్‌ప్రూఫ్' గుడారాలు.



మా గుడారానికి 30 మంది హాజీలను కేటాయించారు. మేమంతా బస్సు దిగి రెండు మూడు వీథులు తిరిగి మా గుడారానికి చేరుకున్నాం.

అయితే అక్కడ ఇంతకుముందే ఓ యాభైయేళ్ళ మహిళ నలుగురికి సరిపోయే చోటులో ఆరుగురి చోటును ఆక్రమించుకొని పక్కలు పరచి పెట్టుకుంది. మాలో ఒకతను ఆ మహిళతో "అమ్మా! స్త్రీలంతా ఒక వైపు, పురుషులంతా ఒక వైపు ఉంటే బాగుంటుంది. నువ్వు ఈ స్త్రీల దగ్గరకు వచ్చెయి" అన్నాడు ఓ వైపు కూర్చొని పడకలు పరచుకుంటున్న స్త్రీల వైపు చూపిస్తూ. దానికి ఆమె కస్సున లేచి 'ఇక్కడ్నుంచి కదిలేది లేద'ని కుండ బద్దలుకొట్టినట్లు చెప్పేసింది. మరికొందరు కూడా నచ్చజెప్పి చూశారు. అయినా ఆమె వినలేదు. అదీగాక మాలో కొందరు చోటు సరిపోక, పక్కలు పరచు కోలేక నానా అవస్థలు పడసాగారు.

నేనా స్త్రీని సమీపించి "మీ గుర్తింపుకార్డు కాస్త చూపండి" అన్నాను. ఆమె నావైపు ఓసారి ఉరిమి చూసి గుర్తింపుకార్డు తీసి నిర్లక్ష్యంగా నా చేతికి అందించింది. నేనా కార్డు చూసి "ఇది మీకు కేటాయించిన గుడారంకాదు, మీ గుడారం వేరేచోట ఉంది వెళ్ళండి" అన్నాను. ఆమె గుర్తింపు కార్డు చూసుకొని నోరు మూసుకుంది. కాస్సేపటికి ఆ స్త్రీ, ఆమెపరివారం వెళ్ళిపోయిన తర్వాత మేమంతా నింపాదిగా పడకలు వేసుకొని నడుం వాల్చాం నిద్రపోవడానికి అన్నట్లు. కాని ఇంకాసేపటికి ఫజ్ర్ నమాజ్ వేళయ్యే పరిస్థితిలో ఎలా నిద్ర వస్తుంది? ఓ ఇరవై నిమిషాలు అటూఇటూ దొర్లి లేచి కాల కృత్యాలు తీర్చుకోవడానికి ఉజూ, స్నానశాలల వైపుకు వెళ్ళాం.

ఉజూ చేసిన తరువాత నేను మా గుడారంలోనే కొందరితో కలసి ఫజ్ర్ నమాజ్ చేశాను. ఆ తర్వాత కాస్సేపు ఒకతను తన గతహజ్ అనుభవాలు చెబుతుంటే వింటూ నిద్రలోకి ఒరిగిపోయాను. టైం ఎంతయిందోకాని లేచిచూస్తే మాలో చాలామంది గురక పెట్టి నిద్రపోవడం చూశాను. కొందరు వెంట తెచ్చుకున్న అల్పాహారం తినసాగారు....

'మినా'లో జిల్‌హజ్జ 8వ తేది ఉదయం నుండి 9వ తేది సూర్యోదయం వరకు గడపవలసి ఉంటుంది. ఈ ఇరవై నాలుగు గంటల సమయంలో హజ్‌కు సంబంధించిన ప్రత్యేక ఆచారాలేమీ లేవు. సాధారణ నమాజులతో పాటు దైవ ధ్యానంలో గడపడం తప్ప ఇతర కార్యక్రమాలు కూడా లేవు.

బయట నుంచి వచ్చే హాజీలు సాధారణంగా నాలుగు రకాతుల ఫరజ్ నమాజును బాటసారులుగా 'ఖసర్' నమాజ్ (నాలుగుకు బదులు రెండు రకాతులే) చేస్తారు. అయితే మేము నాలుగు రకాతులు పూర్తిగా పఠించాలా లేక రెండు రకాతులే పఠించాలా అన్న సమస్య వచ్చిపడింది. గతంలో మక్కా నుండి మినా వచ్చే హాజీలు మినాలో ఖసర్ నమాజ్ చేసేవారు. ఇప్పుడు మక్కా, మినాలు దాదాపు కలసిపోయినందున మినాలో హాజీలు ఖసర్ చేయకుండా నాలుగు రకాతుల ఫరజ్

నమాజ్‌లో పూర్తిగా నాలుగు రకాతులు పఠించాలని ముంబై సెంట్రల్ హజ్ కమిటీ వారు తమ పుస్తకం "హజ్‌గైడ్-2006"లో పేర్కొన్నారు.

ఇది హనఫీ ఫిఖావేత్తల దృక్పథం. ఎవరి ఫిఖా దృక్పథం వారిది. ఇక్కడ ఫిఖా సమస్యలను లేవనెత్తి పాఠకుల దృష్టిని "కాబా సందేశం" నుండి మళ్ళించడం నా అభిమతం కాదు. విభిన్న ఫిఖావర్గాలలో ఈనాడు అనేకమంది ముస్లింలు తమదే సరైన దృక్పథమని, ఇతరులవి తప్పుడు దృక్పథాలని వాదిస్తారు. ఈవిధంగా నేడు అనేక మంది ముస్లింలు శత్రువుల పరోక్ష కుతంత్రజాలంలో చిక్కుకొని విభిన్న వర్గాలుగా విడిపోయి మిల్లీ సమైక్యతను బలహీనపరచడం, ఖుర్‌ఆన్ అసలు ధ్యేయానికి, దాని మానవతా బోధనలకు దూరమవడం జరుగుతోంది. ఇది చాలా విచారకరమైన విషయం. అంచేత నేనీ సమస్యను సాగదీయకుండా ఇంతటితో ముగించి ముందుకు సాగుతున్నాను.

'మినా'లో జిల్‌హజ్జ 8వ తేదీ జుహర్ నుండి 9వ తేదీ ఫజ్ర్ నమాజ్ వరకు అయిదు నమాజులు చేయడం, ఆ రాత్రి అక్కడే ఉండిపోడం సంప్రదాయం (సున్నత్). మేము 9వ తేదీ ఫజ్ర్‌నమాజ్ తరువాత టిఫిన్ చేసి పదిగంటలకు ముఅల్లిం ఏర్పాటు చేసిన బస్సుల్లో అరఫాత్‌కు బయలుదేరాం.

## జిల్‌హజ్జ 9వ తేది కార్యకలాపాలు

మినా నుండి అరఫాత్ దాదాపు పదిహేను కిలోమీటర్లు ఉంటుంది. మినా నుండి అరఫాత్‌కు పోయే రోడ్డు చాలా వెడల్పుగా ఉంటుంది. పన్నెండు ట్రాకులపై ఒకేసారి పన్నెండు బస్సులు నడుస్తాయి. అయినా 'హెవీట్రాఫిక్' కారణంగా అరగంటకు చేరుకునే బస్సు రెండుగంటలకు చేరుకుంటుంది. ఇలా మేము మధ్యాహ్నం పన్నెండు గంటలకు అరఫాత్‌కు చేరుకున్నాం.


అయితే నేను, మా మామయ్య, మా శ్రీమతి, మరో ఇద్దరు వృద్ధ దంపతులు బస్సు దిగిన ఇతరహాజీల నుండి వేరయిపోయాం. మేమా వృద్ధదంపతుల వీల్‌చైర్, బ్యాగులను బస్సు పైనుండి కిందికి దించడంలో కాస్త ఆలస్యమయింది. అందువల్ల మేము అయిదుగురం వెనకబడి పోయాం. బస్సు డ్రైవర్ మాకు కేటాయించిన గుడారాలలో కాకుండా మెయిన్ రోడ్డు మీద ఎక్కడో దించి వెళ్ళిపోయాడు.

ఇక చూడండి మా బాధలు! రోడ్డుకు ఇరుపక్కలా కొన్ని కిలోమీటర్ల పొడుగూతా తాత్కాలిక శిబిరాలు వేల సంఖ్యలో కిటకిటలాడుతున్నాయి. ఆ శిబిరాల్లో మా రాష్ట్రం శిబిరాలు, కనీసం మా దేశం శిబిరాలయినా ఎక్కడున్నాయో మాకు తెలియలేదు. ఎవరిని అడిగినా సరైన చిరునామా చెప్పలేక పోయారు. దానికి తోడు అంతపెద్ద రోడ్డు కూడా వందలాది బస్సులతో నిండిపోయి వాటి సందుల్లో నుంచి నడవడం చాలా కష్టమైపోయింది.





↑ మక్కానగరం శివార్లలో 'మినా పట్నం' దృశ్యాలు ↓



మేము బ్యాగులు తీసుకొని బస్సుల మధ్య ఇరుకు సందుల గుండా నడవ సాగాం. మాతోపాటు ఆ వృద్ధదంపతులు (వారిలో ఒకరు వీల్‌చైర్‌లో కూర్చుంటే, మరొకరు దాన్ని తోసుకుంటూ) నడవసాగారు. ఇలా కొంత దూరం నడిచిన తర్వాత మేము నడుస్తుండిన సందు ఒక చోట మరీ ఇరుకయిపోయి వీల్‌చైర్‌ను తీసుకు రావడం సాధ్యం కాలేదు. అంచేత ఆ వృద్ధదంపతులు తాము వేరేట్రాక్ గుండా వస్తామని చెప్పి కొంచెం వెనక్కి వెళ్ళిపోయారు. మేము మాత్రం అలాగే ముందుకు నడిచాం. ఆ తర్వాత మేము ఎంత వెతికినా ఆ వృద్ధదంపతులు కన్పించలేదు.

మేమీ విధంగా వందల బస్సులు నిలిచిన ఆ మహా రహదారిపై అటునుంచి ఇటు, ఇటునుంచి అటు రెండు గంటలపాటు నడచి చివరికి ఎలాగో కిందామీదా పడి ఓ పెద్ద శిబిరానికి చేరుకున్నాం. అక్కడ ఉజూ చేసి జుహర్, అసర్ నమాజులు చేశాం. అరఫాత్‌లో జుహర్, అసర్ (ఫరజ్) నమాజులు ఒకేసారి వెంటవెంటనే చేయడం సున్నత్ (సంప్రదాయం). నమాజు తరువాత శిబిరంలోని హాజీల మీదికి దృష్టి సారిస్తే దాదాపు అందరూ ఉర్దూ మాట్లాడేవారే ఉన్నారు. కాని మా లాడ్జి సహచరులుగాని, ఇతర పరిచయస్థులుగాని ఒక్కరూ కన్పించలేదు. వారితో మాట్లాడిన తరువాతగాని అసలు విషయం తెలిసిరాలేదు.

ఆ శిబిరం పాకిస్తాన్ హాజీల కోసం కేటాయించిన శిబిరమట! అందులో చేరిన వారంతా పాకిస్తానీయులే. ఓ క్షణం పాటు "భారత సరిహద్దులు దాటి పాకిస్తాన్‌లో ప్రవేశించానా!" అన్పించింది. సరే ఎవరైతేనేం, తోటిహాజీలే కదా అని మేము సరిపెట్టు కున్నాం. తరువాత మా శ్రీమతి మంచినీళ్ళు పట్టుకురావడానికి శిబిరం బయట పంపు దగ్గరకు వెళ్తే అక్కడ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు పాత పరిచయస్థులు కన్పించి తమ శిబిరానికి వచ్చేయమని చెప్పారట. అందువల్ల మేము ముగ్గురం బ్యాగులు సర్దుకొని పక్కనే ఉన్న మా రాష్ట్ర శిబిరానికి చేరుకున్నాం.

జిల్‌హజ్జ 9వ తేదీ మధ్యాహ్నం సూర్యుడు నెత్తి మీద నుండి వాలినప్పటి నుంచి సూర్యాస్తమయం వరకు "వఖూఫెఅరఫాత్" సమయం ఉంటుంది. ఆ సమయంలో వీలైతే జుహర్-అసర్ వేళల సంయుక్త ఫరజ్ నమాజులు నమిరా మసీదులో ఇమామ్ వెనుక చేయాలి. అక్కడకు వెళ్ళడానికి సమయం లేకపోతే లేదా మరేదైనా కారణముంటే మనం బస చేసిన గుడారంలోనే ఆ నమాజులు చేయవచ్చు. మేమూ మస్జిద్‌కు పోలేక గుడారంలోనే జుహర్-అసర్ సంయుక్త నమాజులు చేశాం. తర్వాత మేము వెంట తెచ్చుకున్న తినుబండారాలు తిన్నాం. అక్కడ సౌదీ ప్రభుత్వం సరఫరా చేసిన ప్రత్యేక ఆహారపొట్లాలు కూడా మాకు అందాయి.

## అరఫాత్ ఔన్నత్యం

అరఫాత్‌ను అర్ఫా అని కూడా అంటారు. అరఫాత్‌లో కొంత సేపయినా ఆగడం హాజీలకు విధి (ఫర్జ్)గా నిర్ణయించబడింది. "అర్ఫాలో ఆగడం (ఉఖూఫెఅర్ఫా)కు



మారుపేరే హజ్" అన్నారు దైవప్రవక్త (స)- (తిర్మిజి). జిల్‌హజ్జ 9వ తేదీని "యౌమె అర్ఫా (అర్ఫారోజు)" అంటారు. అర్ఫారోజుకు కూడా ఎంతో ఔన్నత్యం ఉంది.

అర్ఫారోజు ప్రాముఖ్యం గురించి దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు:

"దేవుడు అర్ఫారోజున తప్ప మరే రోజు కూడా ఇంతమంది జనాన్ని నరకాగ్ని నుండి విముక్తి కలిగించడు. అర్ఫారోజున దేవుడు హాజీలకు దగ్గరవుతాడు. అప్పుడాయన దైవదూతల ముందు హాజీలను గురించి గర్వంగా మాట్లాడుతూ '(ఈ హాజీలంతా ఇక్కడకు రావడంలో) వీరి ఉద్దేశం ఏమిటో తెలుసా మీకు?" అని అడుగుతాడు." (సహీ ముస్లిం)

"మీరు అరఫాత్ మైదానంలో ఆగినప్పుడు దేవుడు అరఫాత్‌వారిని చూస్తూ 'నా భక్తులు చెదరిన శిరోజాలతో, దుమ్ముధూళి కొట్టుకొని సుదూర ప్రాంతాల నుంచి నా సన్నిధికి వస్తున్నార'ని అంటాడు. తరువాత దేవుడు దైవదూతల ముందు తన దాసుల్ని గురించి ప్రశంసిస్తాడు. 'మీ పాపాలు ఎడారిలోని ఇసుకరేణువులన్ని ఉన్నా లేక ఆకాశంలోని నక్షత్రాలన్ని ఉన్నా లేదా వర్షం, సముద్రాలలోని నీటిబిందువులన్ని ఉన్నా సరే, దేవుడు వాటన్నిటినీ క్షమిస్తాడు." (తర్గీబ్ వ తర్హీబ్)

"అర్ఫారోజు దేవుని కరుణామృతం విపరీతంగా అవతరిస్తుంది. ఆయన పెద్ద పెద్ద పాపాలను సైతం క్షమిస్తాడు. అందువల్ల షైతాన్ ఆరోజు తప్ప మరే రోజుల్లోనూ అంతగా కుంచించుకు పోవడం, అవమానం పాలవడం, నీచుడవడం, మూతి ముడుచు కోవడం జరగదు." (మువత్తా-ఇమామ్ మాలిక్)

హజ్రత్ తారిఖ్ బిన్ షిహాబ్ ఉల్లేఖనం: ఓసారి ఒక యూదుడు (ఖలీఫా) ఉమర్ దగ్గరకు వచ్చి "విశ్వాసుల నాయకా! మీరు (ముస్లింలు) మీ గ్రంథంలో ఎంతో శ్రేష్ఠమైన ఓ సూక్తి పఠిస్తారు. ఆ సూక్తి గనక మాపై అవతరించివుంటే మేమా సూక్తి అవతరించిన రోజును పండుగ దినంగా చేసుకునేవాళ్ళం" అని అన్నాడు.

హజ్రత్ ఉమర్ (రజి) ఈమాట విని "ఏమిటా సూక్తి?" అని అడిగారు. దానికా యూదుడు సమాధానంగా ఖుర్‌ఆన్‌లోని ఈ సూక్తి పఠించాడు- "నేనీ రోజు మీకోసం మీ ధర్మాన్ని (సమగ్ర జీవనవ్యవస్థగా) పరిపూర్ణం చేశాను. మీకోసం నాఅనుగ్రహాన్ని పూర్తిగా నెరవేర్చాను. మీశ్రేయస్సు కోసం ఇస్లాంను మీ జీవనధర్మంగా ఆమోదించాను." (ఖుర్‌ఆన్-5:4)

హజ్రత్ ఉమర్ (రజి) ఈ సూక్తి విని "దైవసాక్షిగా చెబుతున్నాను. ఈ సూక్తి ఏ రోజు, ఎక్కడ, ఎప్పుడు అవతరించిందో నాకు తెలుసు. ఈ సూక్తి (అరఫాత్‌లో) అర్ఫా రోజున, శుక్రవారం నాడు అవతరించింది" అని అన్నారు. (బుఖారి)

హజ్రత్ అబూఖతాదా (రజి) కథనం ప్రకారం ఒకతను దైవప్రవక్త (సల్లం)తో మాట్లాడుతూ "దైవప్రవక్తా! అర్ఫారోజున పాటించే ఉపవాసం గురించి మీ

అభిప్రాయం ఏమిటీ?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (సల్లం) "దేవుడు ఆరోజు శుభాలతో (ప్రజల) గత సంవత్సరం పాపాలను, వచ్చే సంవత్సరం పాపాలను క్షమిస్తాడని నేను ఆశిస్తున్నాను" అని అన్నారు. (సహీ ముస్లిం)

ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: "దైవప్రవక్త (స) అరఫాత్‌లో దుఆ చేశారు. ఆయన ఆకలిగొన్న పేదవాడు ఏవిధంగా దాత ముందు చేతులుజాపి పరిపరి విధాలా బతిమాలుతూ సహాయం అర్థించినట్లు దైవసన్నిధిలో అత్యంత దీనంగా దుఆ చేశారు."

అరఫాత్ మైదానం ఎంతో విలువైన స్థలం. 'వఖూఫె అరఫాత్' అంతకంటే ఎంతో విలువైన సమయం. కాబట్టి ఇక్కడ ఆ సమయాన్ని వృధా చేయకుండా సాధ్యమైనంత మేరకు దైవధ్యానం, వేడుకోలు (జికర్, దుఆ)లలో గడపాలని పై హదీసుల ద్వారా స్పష్టమవుతోంది. మేము భోజనం చేసిన తర్వాత సూర్యాస్తమయానికి ఓ అరగంట ముందు వరకు గుడారంలోనే ఉండి దుఆ, దైవధ్యానాలలో గడిపాం. ఆ తరువాత మేము సామాను సర్దుకొని గుడారాలు వదలి రోడ్డు మీదకు చేరుకున్నాం.

అరఫాత్ మైదానంలో బతన్ లోయ ఉంది. అక్కడ "జబలెరహ్మత్" పేరుతో ఓ కొండ ఉంది. ఆకొండ సమీపంలోనే నేను ఇంతకుముందు పేర్కొన్న నమీరా మస్జిద్ నిర్మించబడింది. సరిగ్గా అదే ప్రదేశంలో 1400 సంవత్సరాల క్రితం మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) లక్ష మందికి పైగా గుమికూడిన హాజీ అనుచరుల ముందు అతి ముఖ్యమైన ఓ చారిత్రక ప్రసంగం చేశారు. దాన్నే "వీడ్కోలుహజ్" (హజ్జతుల్ విదా) ప్రసంగం అంటారు.

మేము నమీరా మస్జిద్‌లో ఇమామ్ చేసిన జుమా ప్రసంగం వినే భాగ్యానికి నోచుకోలేక పోయాం. అయితే దైవప్రవక్త (సల్లం) చేసిన వీడ్కోలుహజ్ ప్రసంగం నా మనోవీథిలో మెదిలింది.....

## హజ్జతుల్ విదా ప్రసంగం

జిల్‌హజ్ 9వ తేది సూర్యోదయమయింది. యాత్రికులంతా అరఫాత్ మైదానంలో చేరారు. 'అల్లాహుఅక్బర్' నినాదాలు మార్మోగాయి. అరఫాత్ సమీపంలో నిర్మించబడిన ఒక కుటీరంలో దైవప్రవక్త (సల్లం) మధ్యాహ్నందాకా విశ్రాంతి తీసుకున్నారు. ఆ తరువాత ఆయన బతన్ లోయకు వెళ్ళి యాత్రికులందర్నీ సమావేశపరిచారు.

అది అరబ్ చరిత్రలోనే అపూర్వ సమావేశం. దైవప్రవక్త (సల్లం) ఒంటె ఎక్కి యాత్రికుల ముందు ప్రసంగించడం ప్రారంభించారు. అందరికీ వినపడేందుకు వీలుగా హజ్రత్ రబియా (రజి) జనం మధ్య నిలబడి దైవప్రవక్త (సల్లం) పలుకుల్ని పునరుద్ఘాటించసాగారు. దైవప్రవక్త (సల్లం) నోట అమృతవాహిని పారసాగింది:





↑ అరఫాత్‌లో నమిరా మస్జిద్, అరఫాత్ నుండి హాజీలు ↓



"నా ప్రియ సోదరులారా!

"ఒక్క అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడు. ఆయనకు సాటి ఎవరూలేరు. దేవుడు తన (ఈ) దాసునికి సహాయం చేసి, వాగ్దానం నిలబెట్టుకున్నాడు. ఆయన ఒక్కడే యావత్తు దుష్టశక్తుల్ని లొంగదీసుకున్నాడు. ప్రజలారా! వచ్చేయేడు నేనిక్కడ మిమ్మల్ని మళ్ళీ కలుసుకుంటానో లేదో తెలియదు. కాబట్టి నేను చెప్పేదంతా శ్రద్ధగా ఆలకించండి."

**ఆధిక్యతకు గీటురాయి దైవభీతే:** "మానవులారా! మేము మిమ్మల్ని ఒకే స్త్రీ పురుష జంట నుండి పుట్టించాము. తరువాత మీ పరస్పర పరిచయం కోసం మిమ్మల్ని విభిన్న జాతులుగా, తెగలుగా చేశాము. అయితే మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే దేవుని దృష్టిలో ఎక్కువ గౌరవనీయుడు. (49:13)' అని సెలవిచ్చాడు దేవుడు తన గ్రంథంలో. కనుక అరబ్బీయుడిపై అరబ్బేతరునికి, అరబ్బేతరునిపై అరబ్బీయుడికి; తెల్లవాడిపై నల్లవాడికి, నల్లవాడిపై తెల్లవాడికి ఏ విధమైన ఆధిక్యత లేదు. ఆధిక్యతకు గీటురాయి దేవుని పట్ల భయభక్తులు కలిగి ఉండటమే."

"ప్రజలారా! మీ ప్రభువు ఒక్కడే. తండ్రి ఒక్కడే. మీరంతా ఆదం (అలైహి) సంతానం. ఆదం (అలైహి) మట్టితో సృజించబడ్డారు. మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే దేవుని దృష్టిలో అందరికంటే ఉత్తముడు. కనుక ఆధిక్యతా ఔన్నత్యాలకు సంబంధించిన యావత్తు ప్రగల్భాలు, ధన ప్రాణాల ప్రతీకారాలకు సంబంధించిన మొత్తం డిమాండ్లు ఇప్పుడు నా కాళ్ళ కింద తొక్కివేయబడ్డాయి. (అంటే నిషేధించబడ్డాయి.) కాబా సంరక్షణ బాధ్యత, హాజీలకు నీటి సరఫరా సేవలు మాత్రం యథాతథంగా కొనసాగుతాయి."

"ఖురైష్ ప్రజలారా! దేవుని సన్నిధికి ఇతర ప్రజలంతా పరలోక సామగ్రి (పుణ్యభాగ్యం)తో వస్తే, మీరు మీ మెడలపై ప్రాపంచిక (వ్యామోహ పాప) భారంతో రావడం జరగకూడదు సుమా! దురదృష్టవశాత్తు అలా జరిగితే దేవుని దగ్గర మీకోసం నేను ఏ విధంగానూ ఉపయోగపడలేను. ఖురైషీయులారా! దేవుడు మీ గర్వాంధకారాన్ని అంతమొందించాడు. అంచేత మీ తాతముత్తాల ఘనకార్యాలను గురించి గర్వంతో గొప్పలు చెప్పుకోవడానికి ఇప్పుడు ఎలాంటి అవకాశం లేదు."

"ప్రజలారా! మీరు పరస్పరం మీ ధన ప్రాణాలను, మానమర్యాదలను నష్టపరచుకోవడం శాశ్వతంగా నిషేధించబడింది. ఈ (హజ్) దినాన్ని ఈ (జిల్‌హజ్జ) శుభమాసాన్ని, ఈ (మక్కా) నగరాన్ని మనం ఎలా గౌరవిస్తున్నామో వాటిని కూడా అలా గౌరవించవలసి ఉంటుంది. మీరందరూ ఒకరోజు దేవుని సన్నిధికి చేరుకోవలసి ఉంటుంది. అప్పుడు దేవుడు మీ కర్మలను గురించి లెక్క తీసుకుంటాడు. జాగ్రత్త! నా తదనంతరం మీలో మీరే పోట్లాడుకొని మెడలు నరుక్కునే భ్రష్టులయి పోకూడదు."



"ప్రతి ముస్లిం తోటిముస్లింకు సోదరుడి లాంటివాడు. ముస్లింలంతా పరస్పరం అన్న దమ్ములు. మీరు సేవకుల పట్ల మంచిగా మసలుకోండి; సేవకుల పట్ల మంచిగా మసలుకోండి. వారికి మీరు తినేతిండే పెట్టండి; మీరు కట్టుకునే దుస్తులే కట్టబెట్టండి."

"అజ్ఞాన కాలంనాటి వడ్డీకి ఇప్పుడు ఎలాంటి విలువ లేదు. (నా పినతండ్రి) అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ వంశానికి చెందిన మొదటి వడ్డీని నేను వదిలేస్తున్నాను. ఇప్పుడీ వడ్డీ చెల్లింపులు అంతమైపోయాయి."

"ప్రజలారా! ప్రతి హక్కుదారునికి అతని హక్కును దేవుడు స్వయంగా ఇచ్చేశాడు. కనుక ఇప్పుడు ఏ వారసుడి హక్కు కోసం కూడా వీలునామా వ్రాయకూడదు."

"పిల్లవాడు ఎవరి పడక మీద పుట్టాడో ఆ పిల్లవాడు అతనికే చెందినవాడుగా పరిగణించబడతాడు. వ్యభిచార నింద నిరూపించబడిన వాడికి శిక్ష రాళ్ళశిక్షే. కర్మవిచారణ దేవుని దగ్గర జరుగుతుంది."

"అప్పును ఎట్టి పరిస్థితిలోనూ తిరిగి చెల్లించాలి. చేబదులుగా తీసుకున్న వస్తువును తిరిగిచ్చేయాలి. ఎవరైనా పారితోషికం ఇస్తే దానికి బదులు తీర్చాలి. ఎవరైనా ఎవరికైనా హామీ (జామీను) ఇస్తే అతను జరిమానా చెల్లించవలసి ఉంటుంది."

"ఏ ఒక్కడూ తన సోదరుడి నుండి అతని ఇష్టానికి వ్యతిరేకంగా ఎలాంటి వస్తువుని కూడా తీసుకోకూడదు. అతను సంతోషంగా ఇస్తే తీసుకోవచ్చు. ఏ ఒక్కడూ తనపై తానుగాని, ఇతరులపై గాని దౌర్జన్యం చేయకూడదు."

"స్త్రీ తన భర్త సంపద నుండి ఎలాంటి వస్తువుని కూడా అతని అనుమతి లేకుండా ఇతరులకు ఇవ్వడం ధర్మసమ్మతం కాదు."

"వినండి! మీపై మీ భార్యల హక్కులు కొన్ని ఉన్నాయి. అలాగే మీ భార్యలపై మీ హక్కులు కూడా ఉన్నాయి. మీ భార్యలు మీరు ఇష్టపడని ఏ వ్యక్తినీ మీ ఇంట్లోకి రానీయకూడదు. ఇది భార్యలపై మీకున్న హక్కు. వారు ఎలాంటి నమ్మకద్రోహానికి పాల్పడరాదు; ఎలాంటి సిగ్గుమాలిన పనికి ఒడిగట్టకూడదు. ఒకవేళ అలా చేస్తే వారికి తేలికపాటి శారీరక శిక్ష విధించడానికి దేవుని తరఫున మీకు అనుమతి ఉంది. వారా చేష్టల్ని మానుకుంటే, ఇక వారిని (వేధించకుండా) బాగా చూసుకోండి."

"స్త్రీలు మీ అధీనంలోని వారు కనుక వారి పట్ల సత్ప్రవర్తన కలిగివుండండి. వారు తమకోసం ఏదీ చేసుకోలేరు. వారిని మీరు దేవునిపేరు మీద చేపట్టారు. దేవుని పేరు మీదే వారు మీకు (భార్యలుగా) ధర్మసమ్మతం అయ్యారు. కాబట్టి వారి విషయంలో మీరు దేవునికి భయపడండి."

ఇలా అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) ప్రజలకు హితబోధ చేస్తూ ముస్లింలు పరస్పరం ఎలా మసలుకోవాలి; తోటి మానవులతో ఎలా వ్యవహరించాలి; వారి హక్కులు ఏమిటి మొదలైన విషయాలు వివరంగా తెలియజేశారు. ముఖ్యంగా

ఆయన జాతి, తెగ, వర్ణ, వర్గ వివక్షలను, నిమ్నోన్నతా భేదభావాలను నిరసిస్తూ సమానత్వం, సౌభ్రాతృత్వాలను గురించి నొక్కిచెప్పారు.

చివర్లో ఆయన "ప్రజలారా! నేను దైవసందేశాన్ని మీకు అందజేశానా?" అని ప్రశ్నించినప్పుడు "అందజేశారు మీరు" అని లక్షమంది ప్రజలు ముక్తకంఠంతో అన్నారు. ఇది విని దైవప్రవక్త (స) "దేవా! దీనికి నీవే సాక్షివి" అని మూడుసార్లు అన్నారు.

ప్రసంగం ముగిసింది. హజ్రత్ బిలాల్ (రజి) అజాన్ చెప్పారు. దాంతో ప్రజలు నమాజ్ కోసం బారులుతీరి నిలబడ్డారు. చరిత్రలో ఇదివరకెన్నడూ కనీ వినీ ఎరగనంతటి రీతిలో ఒకేసారి లక్షమందికి పైగా దైవదాసులు విశ్వప్రభువు సన్నిధిలో మోకరిల్లారు. అందరూ దైవప్రవక్త (సల్లం) నాయకత్వాన నమాజ్‌లో లీనమయ్యారు.

హజ్ యాత్రికులతో అరఫాత్ మైదానం నిండిపోయింది. దైవప్రవక్త (సల్లం) నేతృత్వంలో ముస్లింలు హజ్‌ధర్మాలు నిర్వహించడంలో నిమగ్నులైపోయారు. ఆకాశ ద్వారం తెరచుకున్నది. విశ్వప్రభువు **కరుణామృతపు కడపటి బిందువులు జాలువారాయి:**

"నేనీ రోజు మీకోసం మీ ధర్మాన్ని (సమగ్ర జీవన వ్యవస్థగా) పరిపూర్ణం చేశాను. మీ కోసం నా అనుగ్రహాన్ని పూర్తిగా నెరవేర్చాను. మీ శ్రేయస్సు కోసం ఇస్లాంను మీ జీవనధర్మంగా ఆమోదించాను." (ఖుర్‌ఆన్-5:4)

ఇది ఇస్లాం సౌధ నిర్మాణానికి సమకూర్చబడిన చివరి ఇటుక! మానవాళి జీవిత నౌక సాఫీగా సాగడానికి అందజెయ్యబడిన అంతిమ తెరచాప!! ఖుర్‌ఆన్ వాణి రూపంలో అంతిమ దైవప్రవక్త (సల్లం) నోట వెలువడిన దివ్యసూక్తి!!!

## జిల్‌హజ్జ 10వ తేది కార్యకలాపాలు

సూర్యాస్తమయం కాగానే 10వ తేదీ ప్రారంభమవుతుంది. కాని అప్పుడు అరఫాత్‌లో మగ్రిబ్ నమాజ్ చేయకూడదు. మగ్రిబ్, ఇషా నమాజులు సంయుక్తంగా 'ముజ్దల్ఫా'లోనే చేయవలసి ఉంటుంది. అందువల్ల హాజీలు సూర్యాస్తమయం కాగానే వీలైనంత త్వరగా 'ముజ్దల్ఫా'కు చేరుకోవడానికి ప్రయత్నిస్తారు. మేము అలాగే ప్రయత్నించాము. కాని బస్సులు దొరికితే కదా! క్యాంపు బయటున్న ఓ పెద్ద మైదానంలో ఎన్నో బస్సులు నిలబడి ఉన్నాయి. కాని ఒక్కటీ ఖాళీగా లేదు. సూర్యాస్తమయం అయిందో లేదో బస్సులన్నీ హాజీలతో నిండిపోయి అనేకమంది ప్లాట్‌ఫారంల మీద పడిగాపులు కాస్తూ నిల్చున్నారు. అలా పడిగాపులు కాసేవారిలో మేము చేరిపోయాం.

బస్సులు ఒక్కొక్కటే బయలుదేరసాగాయి. ఆ బస్సులు ముజ్దల్ఫాకు వెళ్ళి ఖాళీ అయి తిరిగొచ్చిన తరువాతే మాకు అవకాశం లభిస్తుందేమో అనుకున్నా నేను. దాదాపు రాత్రి 9 గంటల నుంచి ఖాళీ బస్సులు రావడం మొదలెట్టాయి. అవి మాకు





↑ అరఫాత్, మినాల మధ్య 'ముజ్దల్ఫా' (మష్‌అరిల్‌హరాం)
మినాలో జమ్రాత్ దగ్గర కంకర్రాళ్ళు విసరే దృశ్యం↓



దొరికితే ఒట్టు! ఖాళీబస్సులు వచ్చీరావడంతోనే మన హాజీమహాశయులు బడిపిల్లల్లా బిలబిలమంటూ ఎక్కుతున్నారు. మేము బిక్కమొహం వేసుకొని చూస్తూ ఉండి పోతున్నాం. మా చేతకానితనాన్ని దాచుకోవడానికో ఏమోకాని, ఇతరులకు అవకాశం ఇస్తున్నాం కదా అని భావించి మేము తృప్తి పడసాగాం. మొత్తం మీద విసుగుచెందని విక్రమార్కుడిలా పెనుగులాడితే రాత్రి 10 గంటలకు అతికష్టం మీద ఒక బస్సులో మాకు చోటు దొరికింది.

“అల్‌హమ్దులిల్లాహ్” అంటూ మేము ఆ బస్సెక్కి చల్లగా ఊపిరి పీల్చుకున్నాం. అయితే ఆ బస్సు ఎంతగానో సహనం వహించి మరీ తాపీగా 11 గంటలకు బయలుదేరింది. అరఫాత్ నుంచి ముజ్దలిఫా పెద్దగా దూరం లేదు. అందువల్ల మా బస్సు పన్నెండు గంటలకు చేరుకోవచ్చని అనుకున్నా నేను. కాని హెవీట్రాఫిక్, పాదాచారుల కారణంగా ఇతర బస్సులతో పాటు మా బస్సు నత్తనడకలా నడచి రాత్రి 2 గంటల ప్రాంతంలో ముజ్దలిఫాలో రోడ్డు మీద కుడివైపున ఓచోట దించింది మమ్మల్ని, మా సామగ్రిని.

అక్కడ్నుంచి మేము మరికొందరు హాజీలతో కలసి బస్సుల సందుల గుండా మెల్లిగా నడచి రోడ్డు కుడివైపు అంచుకు చేరుకున్నాం. ఆ రోడ్డు పక్కనే విశాలమైన మైదానం ఉంది. కాని ఆ మైదానం అప్పటికే హాజీలతో నిండిపోయింది. అందువల్ల మేము రోడ్డుఅంచు మీదే వెంట తెచ్చుకున్న చాపలు పరచుకొని సంచులు పెట్టు కున్నాం. మైదానం వెలుపల ఉజూశాలలు, మరుగుదొడ్లు ఉన్నాయి. వెంటనే మేము మైదానంలోని హాజీలను దాటుకుంటూ వెళ్ళి ఉజూ చేసొచ్చి మగ్రిబ్-ఇషా వేళల సంయుక్త నమాజు చేశాం. అప్పటికి సమయం మూడు గంటలు దాటింది. మా పక్కన పక్కలేసుకున్న హాజీలు చాలామంది గురక పెట్టి నిద్ర పోసాగారు.

నేను కూడా కాస్సేపు నిద్ర పోవాలనుకొని పడక మీద నడుం వాల్చాను. కాని ఈ గురకలు, బస్సుల రణగొణ ధ్వనుల మధ్య నిద్ర పోవడానికి నేను సాహసించలేక పోయాను. లేచి ఓసారి చుట్టూ కలియజూశాను. డజన్ ట్రాకుల డెవిల్ రోడ్డుకు రెండు వైపులా కొన్ని కిలోమీటర్ల పొడుగూతా ఉన్న విశాలమైన మైదానాలు లక్షలాది హాజీలతో నిండిపోయాయి. వారిలో అరబ్బులు, ఆఫ్రికన్లు, ఇండియన్లు, చైనీయులు, మలేషియన్లు, ఇండోనేషియన్లు, ఈరానీయులు, యూరోపియన్లు; నల్లవాళ్ళు, తెల్లవాళ్ళు, పేదలు, ధనికులు- ఇలా విభిన్న దేశాలవాళ్ళు, విభిన్న భాషలు మాట్లాడే వాళ్ళు, విభిన్న జాతులవాళ్ళు ఉన్నారు. అందరూ ఒకేవిధమైన (ఇహ్రాం) దుస్తులు ధరించి ఆకాశం క్రింద కటిక నేల మీద చాపలు పరచుకొని పడుకున్నారు.

**అంతర్జాతీయ సమానత్వం**, సౌభ్రాతృత్వాలకు సరైన అర్థం ఏమిటో, దాని వాస్తవ స్వరూపం ఏమిటో తెలుసుకో దలచినవారు జిల్‌హజ్జ 9, 10 తేదీలలో అరఫాత్, ముజ్దలిఫాలకు వచ్చి చూడవచ్చు. ఇక్కడ ఏవిధమయిన అరుపులు, అలజడులు, కేకలు, కలహాలు మచ్చుకైనా కన్పించవు. ఒకే సారి, ఒకే చోట 30



నుంచి 50 లక్షల మంది హాజీలు గుమికూడిన ఈ మానవ మహాసాగారం ఎలాంటి పోలీసు బందోబస్తు లేకుండా ఎంత ప్రశాంతంగా, నిశ్చింతగా ఉందో ప్రత్యక్షంగా చూస్తేనే తెలుస్తుంది.

“మానవులారా! మేము మిమ్మల్ని ఒకే స్త్రీపురుష జంట నుండి పుట్టించాము. తర్వాత మీ పరస్పర పరిచయం కోసం మిమ్మల్ని విభిన్న జాతులుగా, తెగలుగా చేశాము. అయితే మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే దేవుని దృష్టిలో ఎక్కువ గౌరవనీయుడు.” (దివ్యఖుర్‌ఆన్-49:13)

ఒకే రోజు, ఒకే చోట అంతమందిని, అన్ని దేశాల, జాతులవాళ్ళను, ఒకరి భాష మరొకరికి తెలియని ఆ మహా జనసంద్రాన్ని ఒక్క గొడుకు క్రిందకు చేర్చగలిగిన ఆ మహత్తరశక్తి ఏమిటీ? అదే “దివ్యఖుర్‌ఆన్”- అదిచ్చే మానవీయ విలువలతో కూడిన ఏకదైవారాధనా సందేశం! “లాఇలాహ ఇల్లల్లాహు ముహమ్మద్ రసూలుల్లాహ్” (అల్లాహ్ తప్ప మరే ఆరాధ్యుడు లేడు, ముహమ్మద్ ఆయన ప్రవక్త) అనే సద్వచనం బహిరంగంగా పఠించగానే మనిషి విశ్వప్రభువు సైన్యంలో భర్తీ అయిపోతాడు.

ఆ పరమప్రభువు ఆదేశంతోనే ప్రపంచంలోని వివిధ దేశాల నుండి వచ్చిన ఈ ‘సైనికులు’ మక్కా నుండి మినాకు, మినా నుండి అరఫాత్‌కు, అరఫాత్ నుండి ముజ్దలిఫాకు, ముజ్దలిఫా నుండి మళ్ళీ మినాకు, మినా నుండి కాబాకు, కాబా నుండి తిరిగి మినాకు, మినా నుండి మక్కాలోని తమ తమ స్థావరాలకు ‘మార్చ్’ చేస్తున్నారు. ఈ హజ్‌యాత్ర నమాజ్, రోజా, జకాత్‌ల మాదిరిగానే ఒకవిధమైన శిక్షణ లాంటిది. అన్యాయం, అక్రమాలతో సమాజంలో అశాంతి, అలజడులు రేకెత్తించే దుష్టశక్తులకు వ్యతిరేకంగా పోరాడేందుకు ఇస్తున్న సైనిక శిక్షణ ఇది.

ముస్లింల అసలు లక్ష్యం అయిన ‘ధర్మసంస్థాపన’ కోసం హాజీలకు ఈ హజ్ **‘సైనిక శిక్షణా శిబిరం’** (Military training camp) లాంటిది. సైనికులు మారు మాట్లాడకుండా సేనాపతి ఆజ్ఞలు శిరసావహిస్తారు. అలాగే హాజీలు విశ్వ ప్రభువు ఆజ్ఞలను శిరోధార్యలుగా భావిస్తూ ఎక్కడ ఏపని చేయమంటే తక్షణమే అక్కడ ఆపని చేస్తారు. ఉదాహరణకు- “మీరక్కడ ఉన్నంతకాలం భయభక్తులతో ఉండాలి” (2:203) అనే దైవాజ్ఞను శిరసావహిస్తూ హాజీలు అరఫాత్, ముజ్దలిఫాలలో భయభక్తులతో హజ్ నియమాలు పాటిస్తారు.

ముజ్దలిఫాలో మగ్రిబ్-ఇషా, ఫజర్ వేళల నమాజులు చేయడం; ఆ రాత్రి గడపడం తప్ప ప్రత్యేక కార్యకలాపాలు ఏమీలేవు. ఫజర్ వేళయింది. మేము లేచి కాలకృత్యాలు తీర్చుకొని, ఉజూచేసి ఫజర్ నమాజ్ చేశాం. మా ముగ్గురితో పాటున్న కొందరు ఇతర హాజీలలో ఒక యువకుడు రోడ్డుకు అటువైపుకు వెళ్ళి మినాలో జమ్రాలపై ‘రమీ’ చేయడానికి కావలసిన కంకర్రాళ్ళు ఏరుకొచ్చాడు. మాక్కూడా తలా యాభైరాళ్ళు ఇచ్చాడు.

ముజ్దల్ఫాను "మష్అరిల్ హరాం" అనికూడా అంటారు. ఖుర్ఆన్ దీన్ని గురించి ఇలా ప్రస్తావించింది: "అరఫాత్ నుండి తిరిగివస్తూ మష్అరిల్ హరాం (ముజ్దల్ఫా)లో ఆగి అల్లాహ్‌ను ఆయన నేర్పిన విధంగా స్మరించండి." (2:198)

సూర్యోదయమయింది. ఇక హాజీలంతా ముజ్దల్ఫా నుండి మళ్ళీ 'మినా'కు బయలుదేరాలి. ముజ్దల్ఫాలో ముఅల్లిం గారి బస్సుల కోసం ఎదురుచూస్తూ నిలబడితే ఆరోజు మధ్యాహ్నానికైనా మినాకు చేరుకోగలమని ఆశించడం అత్యాశే అవుతుంది. అందువల్ల మేము బ్యాగులు భుజాన వేసుకొని మెయిన్ రోడ్డు మీద కొద్ది దూరం నడచి వెళ్ళి ట్యాక్సీ కోసం ఎదురుచూస్తూ నిలబడ్డాం. ఆరోజు ముజ్దల్ఫాలో ట్యాక్సీలకు ఉండేటంత డిమాండు మరే రోజూ, మరెక్కడా ఉండదు. అంచేత డ్రైవర్ అడిగినంత ఇచ్చుకోక తప్పదు.

కాళ్ళు నొప్పెట్టేలా తిరుగుతూ, కళ్ళు కాయలుకాచేలా ఎదురుచూస్తే తొమ్మిది గంటలకు ఒక ట్యాక్సీ దొరికింది. ఆ ట్యాక్సీ ఎక్కి మినాకు బయలుదేరాం. ముజ్దల్ఫా, 'మినా'ల మధ్య "వాదియే ముహస్సిర్" అనే ప్రదేశం ఉంది. అక్కడ ఎట్టి పరిస్థితిలోనూ ఆగడంగాని, అటువైపు పోవడంగాని చేయకూడదు. ఒకవేళ అనివార్య పరిస్థితిలో ఆ ప్రదేశంమీదుగా పోవలసివస్తే వేగంగా దాటిపోవాలి. అది కాబాలయాన్ని ధ్వంసం చేసే దురుద్దేశంతో అబ్రహా సైన్యం వచ్చి సర్వనాశనం అయిన ప్రదేశం. ఆ సంఘటన వివరాలను ఓసారి గుర్తుచేసుకుందామా......

## కాబా ముందు అబ్రాహా పర్యవసానం

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) జన్మించడానికి రెండు నెలల ముందు అబిసీనియా రాజ్య పరిధిలోని యమన్ గవర్నర్ అబ్రహా రాజ్యవిస్తరణ కాంక్షతో మొత్తం అరేబియాని జయించాలని, అత్యధికమంది యాత్రికుల్ని ఆకట్టుకోవడానికి అరబ్బుల మతకేంద్రమైన కాబామందిరాన్ని పోలిన ఒక మందిరం నిర్మించాలని నిర్ణయించుకున్నాడు. ఈవిధంగా ఒక వైపు అరేబియా అంతటా క్రైస్తవమతాన్ని వ్యాపింపజేయవచ్చని, మరోవైపు అరబ్బుల వాణిజ్య మార్గాలు మూసేసి ఆర్థిక ప్రయోజనాలు కూడా పొందవచ్చని భావించాడు.

ఈ లక్ష్యంతో అబ్రహా మొట్టమొదట యమన్ రాజధాని 'సనా'లో బ్రహ్మాండమైన ఒక చర్చీ నిర్మించాడు. చర్చీ నిర్మించిన తరువాత తన లక్ష్యం గురించి అబిసీనియా చక్రవర్తికి లేఖ రాస్తూ "అరబ్బుల (కాబా)యాత్రను ఈ'ఎక్లిసియా' (చర్చీ) వైపు మరల్చనిదే నేను విశ్రమించను" అని ప్రతిజ్ఞ చేశాడు. ఈ విషయమై అతను యమన్ అంతటా బహిరంగ ప్రకటన కూడా చేయించాడు.

ఇలా అరబ్బుల మతభావాల్ని రెచ్చగొట్టి, వారి ద్వారా తనకు మక్కాపై దాడి చేయడానికి సాకు దొరుకుతుందని భావించాడు. అతనికి నిజంగానే సాకు దొరికింది. అతని రెచ్చగొట్టే ప్రకటనలకు రెచ్చిపోయిన కొందరు అరబ్ యువకులు ఆ చర్చీకి



నిప్పంటించారు. (మరొక ఉల్లేఖనం ప్రకారం ఒక అరబ్ యువకుడు ఆ చర్చీలో మలమూత్రాలు విసర్జించాడని ఉంది.)

దాంతో ఆగ్రహోదగ్రుడైన అబ్రహా క్రీ.శ. 570లో 60 వేలమంది సైనికులు, 13 ఏనుగులతో మక్కాపై దాడి చేయడానికి బయలుదేరాడు. దారిలో అరబ్బులకు చెందిన వేలాది ఒంటెలు దోచుకున్నాడు. వాటిలో మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) తాత అబ్దుల్ ముత్తలిబ్‌కు చెందిన రెండొందలు ఒంటెలు కూడా ఉన్నాయి.

ఆ తరువాత అతను మక్కావాసుల దగ్గరికి ఒక రాయబారిని పంపాడు. ఆ రాయబారి ద్వారా "నేను మీతో యుద్ధం చేయడానికి రాలేదు. కాబామందిరాన్ని ధ్వంసం చేయడానికి మాత్రమే వచ్చాను. మీరు గనక యుద్ధం చేయకుండా ఉంటే, నేను మీ ధన, మాన, ప్రాణాలకు ఎలాంటి హాని కలిగించను" అని చెప్పి పంపాడు. అదీగాక మక్కా నాయకుడు ఏదైనా మాట్లాడదలిస్తే అతడ్ని తన దగ్గరకు పిలుచుకు రమ్మని కూడా అతను రాయబారికి చెప్పాడు.

రాయబారి వెళ్ళి అబ్దుల్ ముత్తలిబ్‌కు ఈ విషయం తెలియజేశాడు. ఆయన తమకు అబ్రహా సైన్యాల్ని ఎదుర్కొనే శక్తి లేదని చెప్పి, రాయబారి వెంట అబ్రహా దగ్గరకి వెళ్ళారు. అబ్రహా ఆయన ముఖ వర్చస్సు, ఠీవి, దర్పం, గాంభీర్యతలు చూసి ఎంతో ప్రభావితుడయ్యాడు. వెంటనే అతను తన ఆసనం నుంచి లేచి, అబ్దుల్ ముత్తలిబ్‌కు స్వాగతం చెప్పి, అయన్ని తన పక్కన కూర్చో బెట్టుకున్నాడు. తర్వాత "మీరేం కోరుతున్నారో చెప్పండి" అన్నాడు. దానికి అబ్దుల్ ముత్తలిబ్ "మీరు పట్టుకున్న నా ఒంటెల్ని నాకు ఇచ్చేయండి చాలు" అన్నారు నిర్లక్ష్యంగా.

అబ్రహా ఈ మాటలు విని తెల్లబోయాడు. "నేను మిమ్మల్ని చూసి ఎంతో ప్రభావితుణ్ణయ్యాను. కాని మీరు మీ ఒంటెల్ని అడిగి నా దృష్టిపథం నుండి దిగజారి పోయారు. మీ తాతముత్తాతల ఆరాధనాకేంద్రం, శాంతి నిలయమైన కాబా మందిరం గురించి మీరు ఒక్కమాటా ప్రస్తావించలేదు" అన్నాడు అబ్రహా.

"నేను నా ఒంటెలకు మాత్రమే యజమానిని. అందుకని నేను వాటిని గురించే మిమ్మల్ని అడుగుతున్నాను. ఇక కాబా మందిరమంటారా? దానికి దాని ప్రభువు, యజమాని ఒకడున్నాడు. ఆయనే దాన్ని కాపాడుకుంటాడు" అన్నారు అబ్దుల్ ముత్తలిబ్. "ఆ ప్రభువు కూడా దాన్ని నా నుండి కాపాడలేడు" అన్నాడు అబ్రహా కటువుగా. "ఆ సంగతి మీకు, ఆయనకే తెలియాలి (మధ్యలో నాకెందుకు?)" అంటూ అబ్దుల్ ముత్తలిబ్ అక్కడ్నుంచి వెళ్ళిపోయారు.

అబ్దుల్ ముత్తలిబ్ పట్నంలోకి తిరిగిరాగానే ప్రజలను సమావేశపరచి "మీరంతా సామూహిక హత్యాకాండ నుండి కాపాడుకోవడానికి మీ భార్యాపిల్లల్ని తీసుకొని కొండల్లోకి వెళ్ళిపోండి" అని ప్రకటించారు. ఆ తరువాత ఆయన కొందరు ఖురైష్ నాయకులతో కలసి కాబాగృహానికి వెళ్ళారు. ఆ కాలంలో కాబాలో 300 విగ్రహాలు

ఉండేవి. కాని ఖురైష్ నాయకులు ఈ క్లిష్ట సమయంలో వాటన్నిటిని మరచిపోయి కాబా ప్రభువయిన దేవుణ్ణి మాత్రమే తలచుకొని "దేవా! నీవు నీ గృహాన్ని, దాని సేవకుల్ని కాపాడు" అని దీనంగా ప్రార్థించారు. ఇలా వేడుకున్న తరువాత వారు కూడా కొండల్లోకి పోయి దాక్కున్నారు.

మరునాడు అబ్రహా సైన్యంతో మక్కా పట్నంలోకి ప్రవేశించేందుకు బయలు దేరాడు. అయితే సైన్యం ముందు నడుస్తున్న ఓ ప్రత్యేక ఏనుగు ఒకచోట హఠాత్తుగా ఆగిపోయి నేలమీద చతికిలబడింది. మావటివాడు ఎంత కొట్టినా, అంకుశంతో పొడిచి గాయపర్చినా అది కదల్లేదు. మక్కా వైపు నుండి వేరే వైపుకు తిప్పి అదిలిస్తే చాలు అది పరుగెత్తసాగేది. కాని మక్కా వైపు తిప్పగానే అది మళ్ళీ నేలమీద చతికిలబడి పోయేది. మక్కా వైపు ఒక్క అంగుళం కూడా ముందుకు సాగనని మొరాయించింది. ఈ దృశ్యం చూసి అబ్రహా, అతని సైనికులు ఆశ్యర్యపోయారు.

అంతలో ఎక్కడ్నుంచో అకస్మాత్తుగా ఏవో పక్షులు గుంపులు గుంపులుగా వచ్చి సైన్యం మీద కంకర్రాళ్ళు విసరిపడేయటం మొదలెట్టాయి. ఆ రాళ్ళు వచ్చి నేరుగా సైనికుల మీద పడగానే వారి శరీరాలు తీవ్రమైన దురదతో జివ్వుమనేవి. ఆ దురద భరించలేక సైనికులు అక్కడ గోకి గోకగానే చర్మం చిట్లిపోయి మాంసం ఊడి క్రింద పడి పోసాగింది. చూస్తుండగానే మైదానమంతా రక్తం, చీముతో నిండి పోయింది. సైనికులు భీతావహులయి ఎటుపడితే అటు పారిపోవడానికి ప్రయత్నించారు. కాని అప్పటికే చాలామంది మృత్యువాత పడ్డారు. మిగిలినవారు కొద్ది దూరం పారిపోయి ఊపిరి విడిచారు. ఇలా అబ్రహాతో పాటు అతని సైనికులంతా కొన్ని గంటల్లోనే సర్వ నాశనమైపోయారు.

ఈ సంఘటన క్రీ.శ. 571వ సంవత్సరంలో మినా, ముజ్దలఫాల మధ్య ముహస్సిర్ అనే ప్రదేశంలో సంభవించింది. ఆ తరువాత రెణ్ణెల్లలోనే మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) జన్మించారు. ఈ సంఘటనతో ఎంతో ప్రభావితులైన అరబ్బులు కొన్నేళ్ళ వరకు విగ్రహాలు, ఇతర మిథ్యాదైవాలను వదలి, సృష్టికర్త, విశ్వపాలకుడైన నిజదేవుడ్ని మాత్రమే ఆరాధించారు. ఆ తరువాత మళ్ళీ వారిలో బహుదైవారాధనా వ్యాధి ప్రబలింది. కనుక అరబ్బులు ఆనాటి సంఘటన గుర్తుచేసుకొని మిథ్యాదైవా లను వదలి ఆ ఘోరవిపత్తు నుండి కాపాడిన నిజదేవుడ్ని మాత్రమే ఆరాధించాలని వారినిలా ఉపదేశించడం జరిగింది:

"నీ ప్రభువు (అబ్రాహాతో పాటు వచ్చిన) ఏనుగుల వాళ్ళను ఏంచేశాడో నీకు తెలియదా? ఆయన వారి (దుష్ట) యత్నాలను వమ్ము చేయలేదా? వారి మీదికి ఆయన పక్షుల్ని గుంపులు గుంపులుగా పంపాడు. అవి వారి మీద కంకర్రాళ్ళు విసరిపడేశాయి. దాంతో వారు పశువులు తిని ఆగమాగం చేసిన మేతలా (సర్వనాశనం) అయ్యారు." (దివ్యఖుర్‌ఆన్-105)



## 'రమీ' (జమ్రాలపై కంకర్రాళ్ళు విసరడం)

మేము 'మినా'లో ఒక చోట దిగి నడుచుకుంటూ మా గుడారానికి చేరుకునే టప్పటికి మధ్యాహ్నం ఒంటి గంటయింది. కాస్సేపు ప్రయాణ బడలిక తీర్చుకున్న తరువాత జుహర్ నమాజ్ చేసి, భోజనం చేశాం. ఆ తరువాత "దుష్టశక్తులకు శిలాశిక్ష విధించడానికి" నేను, మా మామయ్య మా గుడారం నుండి 2 కిలోమీటర్ల దూరాన ఉన్న జమ్రాత్ ప్రదేశానికి బయలుదేరాం.

జమ్రా అంటే రాయి అని, జమ్రాత్ అంటే రాళ్ళు అని అర్థం. దుష్టశక్తులకు చిహ్నాలయిన ఆ రాళ్ళపై కంకర్రాళ్ళు విసరడాన్ని 'రమీ' అంటారు. రమీ చేయడం అంటే విసరడం, గురిపెట్టడం అని అర్థాలున్నాయి. ఈ ప్రదేశంలో దాదాపు వంద గజాలకు ఒకటి చొప్పున వరుసగా "జమ్రాఅఖబా, జమ్రాఉస్తా, జమ్రాఊలా"అనే మూడు జమ్రాలు ఉన్నాయి. వాటి మీదికి ఒకదాని తరువాత ఒకటి చొప్పున ఏడు కంకర్రాళ్ళు విసరడం విధి (వాజిబ్). ఈవిధంగా జిల్‌హజ్జ 10వ తేదీన 'జమ్రా అఖబా'పై, 11,12 తేదీలలో మూడు జమ్రాలపై రాళ్ళు విసరవలసి ఉంటుంది.

జిల్‌హజ్జ 8వ తేదీ రాత్రి విడిది నుండి 'మినా'కు బయలుదేరినప్పటి నుండి జిల్‌హజ్జ 10వ తేదీన జమ్రాత్ దగ్గరకు చేరుకునేదాకా ప్రతి మిట్టపై ఎక్కేటప్పుడు, ప్రతి పల్లానికి దిగేటప్పుడు లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్ అంటూ 'తల్బియా' పఠించడం ఆచారం. జమ్రాత్‌కు చేరుకోగానే తల్బియా పఠించడం మానేయాలి.

జమ్రాలపై 7 కంకర్రాళ్ళు మాత్రమే ఒక్కొక్కటిగా విసరాలి. ఏడురాళ్ళకు మించ కూడదు. ఏడు రాళ్ళు కలిపి ఒకేసారి విసరకూడదు. కంకర్రాళ్ళు ముజ్దల్ఫాలోనే ఏరి పెట్టుకోవడం అభిలషనీయం (ముస్తహబ్). జమ్రాల దగ్గర పడివుండే కంర్రాళ్ళు ఏమాత్రం ఉపయోగించకూడదు. దేవుని దృష్టిలో స్వీకారయోగ్యంకాని కంకర్రాళ్ళు మాత్రమే జమ్రాల దగ్గర మిగిలివుంటాయి. స్వీకారయోగ్యమయిన కంకర్రాళ్ళను దైవదూతలు ఎత్తుకుపోతారని ఒక హదీసులో ఉంది.

హజ్రత్ అబూసయీద్ ఖుద్రీ (రజి) ఓసారి "దైవప్రవక్తా! మనం ప్రతి యేడూ జమ్రాలపై కంకర్రాళ్ళు విసురుతున్నాం కదా, కాని అవి (పెరిగిపోవాల్సింది పోయి) తరిగిపోతున్నట్లు అన్పిస్తుంది మాకు. కారణం ఏమిటీ?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) సమాధానమిస్తూ "నిజమే, తరిగిపోతున్నాయి. దైవం స్వీకరించిన రాళ్ళు పైకి ఎత్తుకోబడతాయి. అలా జరగకపోతే ఈ కంకర్రాళ్ళు కొండల్లాగా పెద్ద పెద్ద గుట్టలుగా పడి వుండటం మీకు కన్పిస్తుంది" అని అన్నారు. (దారె ఖుత్నీ)

జిల్‌హజ్జ 10వ తేదీన కంకర్రాళ్ళు విసరే సమయం సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు ఉంటుంది. సూర్యాస్తమయం తర్వాత కంకర్రాళ్ళు విసరడం నిషిద్ధం (మక్రూహ్). ఆ తరువాయి తేదీలలో సూర్యాస్తమయం తర్వాత విసరడం సంప్రదాయం మాత్రమే, విధి కాదు. అంటే పరిస్థితులు అనుకూలంగా లేకపోతే

సూర్యాస్తమయం తరువాతయినా విసరవచ్చు. సౌదీ ధర్మవేత్తలు తొక్కిసలాట ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకొని 24 గంటల్లో ఎప్పుడైనా కంకర్రాళ్ళు విసరవచ్చని 'ఫత్వా' జారీచేశారు.

'రమీ' చేయడానికి (అంటే కంకర్రాళ్ళు విసరడానికి) పూనుకున్నప్పుడు ముందుగా జమ్రా ఎదుట నిలబడి "బిస్మిల్లాహి అల్లాహుఅక్బర్ రగ్మన్ లిష్షయితాని వరిజన్ లిర్రహ్మాని అల్లాహుమ్మ అజ్అల్హు హజ్జమ్ మబ్రూరన్ వజన్బమ్ మగ్ ఫూరన్ వసాయమ్ మష్కూరా" అని దుఆ చేయాలి.

ఈ దుఆ మనకు తెలిసిన భాషలోనైనా చేయవచ్చు. దాని అర్థం ఇలా ఉంది: "అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను. అల్లాహ్ అందరికంటే గొప్పవాడు. షైతాన్‌ని అవమానించడానికి, దేవుని ప్రసన్నత పొందడానికి ఈ రాళ్ళు కొడ్తున్నాను. దేవా! నా హజ్‌యాత్రను ఆమోదయోగ్యమైన హజ్‌గా చెయ్యి. నా పాపాలు క్షమించు. ఈ కృషిని స్వీకరించు." ఇలా పఠించిన తరువాత అల్లాహుఅక్బర్ అంటూ కుడిచేత్తో ఒక్కొక్కటి చొప్పున ఏడురాళ్ళు విసరాలి. ఇది 'రమీ' చేసే సాంప్రదాయక విధానం.

**స్తంభం స్థానంలో పొడుగాటిగోడ:** మేమిద్దరం కంకర్రాళ్ళు తీసుకొని జమ్రాత్‌కు చేరుకున్నాం. ఇప్పుడక్కడ గతంలో మాదిరిగా గుండ్రటిపిట్టగోడ మధ్య ఎత్తయిన స్తంభం లేదు. దానివల్ల తొక్కిసలాట ప్రమాదాలు సంభవిస్తుండటంతో సౌదీ ప్రభుత్వం ఇప్పుడా స్తంభం స్థానంలో ముప్ఫయి అడుగుల ఎత్తయిన ఓ పొడుగాటి గోడ నిర్మించింది. దాని చుట్టూ నాలుగడుగుల పిట్టగోడ కూడా ఉంది. దాదాపు వందఅడుగులు పొడవైన ఆ పెద్దగోడ మీదికి రెండువైపుల నుంచి విసరే కంకర్రాళ్ళన్నీ ఆ గోడకు తగిలి దానిక్రింద సొరంగంలో పడిపోతాయి. ప్రస్తుతం ఈజమ్రాలు రెండు అంతస్తులలో ఉన్నాయి. వచ్చేయేడు నాలుగు అంతస్తులకు పెరగవచ్చు.

జిల్‌హజ్జ 10వ తేదీన జమ్రాఅఖబాపై మాత్రమే రాళ్ళు విసరాలి మేమక్కడికి పోయిన సమయంలో జనం పెద్దగా లేకపోవడంతో మేము జమ్రాకు చాలా దగ్గరగా పోయి ఎంతో సులభంగా రాళ్ళు విసరగలిగాం. స్త్రీలు, పిల్లలు, వృద్ధులు, బలహీనుల తరఫున ఇతరులు కంకర్రాళ్ళు విసరవచ్చు. మా శ్రీమతి ప్రయాణ బడలిక వల్ల రాలేక పోయింది. అందువల్ల ఆమె తరఫున కూడా నేనే కంకర్రాళ్ళు విసిరాను.

## ఖుర్బానీ (బలిదానం)

ఆ తరువాత ఖుర్బానీ (పశుబలి) ఇవ్వాలి. అసలు ఖుర్బానీ అంటే త్యాగం అని అర్థం. షరీఅత్ పరిభాషలో త్యాగమంటే కేవలం దైవప్రసన్నత కోసం మనస్ఫూర్తిగా జంతువును బలివ్వడం, తద్వారా దైవమార్గంలో అవసరమైతే ఎలాంటి త్యాగానికైనా, చివరికి ప్రాణత్యాగానికయినా సిద్ధపడతానని ప్రతిన బూనడం అన్నమాట. గత షరీఅత్‌ల (ధర్మశాస్త్రాల)లో కూడా ఈ ఖుర్బానీ సంప్రదాయం ఉండేది. ఈనాడు బహుదైవారాధనా మతాలలో కూడా జంతుబలులు ఇచ్చే ఆచారం కొనసాగుతోంది. అక్కడక్కడ చాటు మాటుగా నరబలుల దురాచారం కూడా సాగుతోంది.



"ప్రజలు తమకు దేవుడిచ్చిన పశువుల్ని దేవునిపేరు స్మరించి బలివ్వడానికి మేము ప్రతి సమాజానికి ఒక బలివిధానం నిర్ణయించాము. గుర్తుంచుకోండి, మీఆరాధ్యుడు ఒక్క దేవుడు మాత్రమే. ఆయన ఆజ్ఞలనే శిరసావహిస్తూ ఆయనకే మీరు విధేయులై ఉండాలి." (ఖుర్ఆన్–22:34)

మానవ చరిత్రలో ఆదిమానవుడు హజ్రత్ ఆదం (అలైహి) కుమారులిద్దరు ఇచ్చిన ఖుర్బానీయే మొట్టమొదటి ఖుర్బానీ. హాబీల్, ఖాబీల్ అనే ఆ ఇద్దరు అన్నదమ్ములలో హాబీల్ చిత్తశుద్ధి కలిగి ఉండటంతోపాటు, మంచి జంతువును బలి ఇచ్చాడు. అంచేత దైవస్వీకారం సూచనగా అతని బలిదానాన్ని ఆకాశం నుండి అగ్ని వచ్చి దహించివేసింది. కాని ఖాబీల్ చిత్తశుద్ధి కలిగి ఉండకపోవడమే గాకుండా, నాసిరకం జంతువును బలిచ్చినందున ఆకాశం నుండి అగ్ని వచ్చి అతని బలి దానాన్ని కాల్చలేదు. వారిద్దరు ఇచ్చిన బలి సంఘటనను ఖుర్ఆన్ ఇలా పేర్కొన్నది:

"వీరికి ఆదం కొడుకులిద్దరి గాథ విన్పించు. వారిద్దరు బలిచ్చారు. అప్పుడు వారిలో ఒకని బలి మాత్రమే స్వీకరించబడింది. రెండోవాని బలి స్వీకరించబడలేదు. దాంతో అతను (చిర్రెత్తిపోయి) 'నేను నిన్ను చంపేస్తాను' అన్నాడు. దానికి రెండోవాడు ఇలా అన్నాడు: 'దేవుడు భయభక్తులు కలవారి మొక్కుబడినే స్వీకరిస్తాడు. నీవు నన్ను చంపడానికి చెయ్యెత్తితే నేను మాత్రం నిన్ను చంపడానికి చెయ్యెత్తను. నేను సర్వలోక ప్రభువయిన దేవునికి భయపడుతున్నాను. నాపాపం, నీపాపం అంతా నువ్వే మూట కట్టుకొని నరకంలోకి పోయిపడు. అదే దుర్మార్గులకు తగిన ప్రతిఫలం. నేను కోరేది కూడా అదే." (5:27–29)

స్తోమత కలిగిన ముస్లిం తప్పకుండా ఖుర్బానీ (పశుబలి) ఇవ్వాలి. ఖుర్బానీ ప్రాముఖ్యం గురించి దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు:

"స్తోమత ఉన్నప్పటికీ ఖుర్బానీ ఇవ్వనివాడు మా ఈద్గాహ్ దరిదాపులకు రాకూడదు." (జమావుల్ ఫవాయెద్)

"ఎవరు పండుగ నమాజ్ తరువాత ఖుర్బానీ ఇస్తాడో అతని ఖుర్బానీ (విధి) నెరవేరుతుంది; అతను ముస్లింల పద్ధతి అవలంబించిన వాడవుతాడు. ఎవరైనా పండుగ నమాజ్‌కు ముందే పశువును జిబహ్ చేయడం జరిగితే అతను (నమాజ్ తరువాత) మళ్ళీ ఖుర్బానీ ఇవ్వవలసి ఉంటుంది."

"దేవుని దగ్గర జిల్‌హజ్జ పదోతేదీన ఖుర్బానీరక్తం చిందించడం కంటే ప్రీతికరమైన కార్యం మరేదీలేదు. ప్రళయదినాన ఖుర్బానీపశువు కొమ్ములతో, రోమాలతో, గిట్టలతో వస్తుంది. ఖుర్బానీ రక్తం నేలమీద పడుతుందో లేదో దైవసన్నిధిలో ఖుర్బానీ స్వీకరించ బడుతుంది. కనుక సంతోషంగా, మనస్ఫూర్తిగా ఖుర్బానీ ఇవ్వండి." (తిర్మిజి)

"ఓసారి ప్రవక్త అనుచరులు 'దైవప్రవక్తా! ఈ ఖుర్బానీ ఏమిటీ?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) 'ఇది మీ తండ్రి సంప్రదాయం' అని చెప్పారు. 'ఇందులో

మాకు లభించే పుణ్యం ఏమిటీ?' అని అడిగారు. ప్రవక్త అనుచరులు. దానికి దైవప్రవక్త (సల్లం) (పశువు మీది) ప్రతి వెండ్రుకకు బదులుగా ఒక యూనిట్ పుణ్యం లభిస్తుంది' అన్నారు. 'మరి ఉన్నికి బదులుగా ఏం లభిస్తుంది?' అనడిగారు అనుచరులు. 'ఉన్ని విషయంలో కూడా అలాంటి పుణ్యమే లభిస్తుంది' అన్నారు దైవప్రవక్త (సల్లం)." (తిర్మిజి, ఇబ్నెమాజ)

దైవప్రవక్త (స) (తన ముద్దుల కుమార్తె) హజ్రత్ ఫాతిమా (రజి)తో "ఫాతిమా! లే, నీ ఖుర్బానీ పశువు దగ్గర నిలబడుదువుగాని రా. దాని నుండి నేల మీద పడే ప్రతి (రక్త)బిందువుకు బదులుగా దేవుడు నీ గత పాపాలు క్షమిస్తాడు" అని అన్నారు. అప్పుడు హజ్రత్ ఫాతిమా (రజి) "ఈ శుభవార్త మన కుటుంబానికి మాత్రమే ప్రత్యేకమా లేక యావత్తు ముస్లిం సముదాయానికి వర్తిస్తుందా?" అని ప్రశ్నించారు. దానికి దైవప్రవక్త (సల్లం) "ఇది మన కుటుంబానికి కూడా వర్తిస్తుంది; యావత్తు ముస్లిం సముదాయానికి కూడా వర్తిస్తుంది" అని చెప్పారు. (జమావుల్ ఫవాయెద్)

ఖుర్బానీ పశువును ఇలా దుఆ చేసి కోయాలి: "ఇన్నీ వజ్జహ్‌తు వజ్‌హియ లిల్లజీ ఫతరస్సమావాతి వల్అర్జ హనీఫన్వ్వమా అనా మినల్ ముష్రికీన్. ఇన్నసలాతి వనుస్కి వమహ్‌యాఅ వమమాతి లిల్లాహి రబ్బిల్‌ఆలమీన్. లాషరీక లహూ వబిజాలిక ఉమిరితు వఅనా మినల్ ముస్లిమీన్. అల్లాహుమ్మ లక వమిన్క అన్నీ బిస్మిల్లాహి అల్లాహుఅక్బర్."

(అర్థం-నిస్సందేహంగా నేను పూర్తి ఏకాగ్రతతో హజ్రత్ ఇబ్రాహీం విధానం ప్రకారం భూమ్యాకాశాలను సృష్టించిన శక్తిస్వరూపుని వైపుకు మరలాను. నా నమాజ్, నా త్యాగం (ఖుర్బానీ), నా జీవన్మరణాలు సమస్తం సాటిలేని సర్వలోక ప్రభువుకే సమర్పితం. నాకు ఆయన ఆదేశమే లభించింది. నేను ఆయనకే విధేయుడ్ని. ఈ ఖుర్బానీ నీవు ప్రసాదించినదే. నీ ప్రసన్నత కోసమే దీన్ని నా తరపున సమర్పించు కుంటున్నాను." దేవుని పేరుతో (కోస్తున్నాను), దేవుడే అందరికన్నా గొప్పవాడు.

"మేము బలి పశువుల్ని మీ కోసం దైవచిహ్నాల జాబితాలో చేర్చాము. వాటిలో మీ శ్రేయస్సు ఉంది. కనుక వాటిని (ఒంటెలను) నిలబెట్టి దేవుని పేరు ఉచ్చరించండి. (అంటే దేవుని పేరు స్మరించి జిబహ్ చేయండి. బలిచేసిన కొద్ది క్షణాలకు) వాటి వీపులు నేలమీద (చలనరహితంగా) నిలిచిపోయిన తరువాత వాటి మాంసాన్ని మీరూ తినండి; అర్థించే వారికి, అర్థించనివారికి కూడా ఇవ్వండి. మీరు మా పట్ల కృతజ్ఞులై ఉండటానికే మేమిలా పశువుల్ని మీకోసం అదుపులో ఉంచాము." (ఖుర్ఆన్-22:36)

ఖుర్బానీకోసం సౌదీప్రభుత్వం మినాలో అనేక పశుశాలలు, వధశాలలు ఏర్పాటు చేసింది. అక్కడకు పోయి మనం కోరుకున్న పశువును కొనుక్కోవచ్చు. అక్కడే వధ శాలల్లో స్వయంగా మనమే పశువును జిబహ్ కూడా చేయవచ్చు.

ఖుర్బానీ పశువుల్ని హాజీలకు అమ్మి, హాజీల తరపున వారే జిబహ్ చేయడానికి



మక్కా, మినాలలో కొందరు ఏజంట్లు కూడా ఉంటారు. వారికి మన పేరు, ఫోన్ నెంబర్ ఇచ్చి డబ్బు చెల్లిస్తే చాలు, మన తరపున వారే ఖుర్బానీ చేసి మనకు తెలియ జేస్తారు. మేము హజ్‌కు బయలుదేరకముందే ఒక ఏజెంటుకు మా ముగ్గురి వివరాలు చెప్పి డబ్బు చెల్లించాం. ఇప్పుడు జమ్రాపై కంకర్రాళ్ళు విసిరి గుడారానికి తిరిగొచ్చిన తర్వాత మా ఖుర్బానీ ఇవ్వడం అయిపోయిందని ఆ ఏజెంటు ఫోన్ చేశాడు.

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) సాక్ష్యం: "దైవప్రవక్త (సల్లం) మదీనాలో పదేండ్లు ఉన్నారు. ఆ పదేండ్ల కాలంలో ఆయన ఒక్క సంవత్సరం కూడా బీరు పోకుండా ప్రతి ఏడూ ఖుర్బానీ ఇస్తుండేవారు." (తిర్మిజి)

హజ్రత్ బరీదా (రజి) కథనం: "దైవప్రవక్త (స) ఈదుల్‌ఫితర్ రోజు ఏదోఒకటి తినకుండా (పండుగ) నమాజ్‌కు వెళ్ళేవారుకాదు. ఈదుల్‌అజ్హా రోజు మాత్రం పండుగ నమాజ్‌కు ముందు ఏమీ తినేవారుకాదు. పండుగ నమాజ్ నుండి తిరిగొ చ్చిన తరువాత ఖుర్బానీపశువు గుండెకాయను తినేవారు." (తిర్మిజి, అహ్మద్)

ఈరోజు ఈదుల్‌అజ్హా పండుగ. అందరూ ఈద్గాహ్ వెళ్ళి రెండు రకాతులతో ఈద్ నమాజ్ చేసి ఇమాం ఇచ్చే ఖుత్బా (ప్రసంగం) వింటారు. తరువాత ఇళ్ళకు తిరిగొచ్చి ఖుర్బానీ (పశుబలి) ఇస్తారు. కాని ఇక్కడ హాజీలకు ఖుర్బానీ తప్ప పండుగ విశేషాలు ఏమీ ఉండవు. ఈద్‌నమాజ్ కూడా ఉండదు.

హజ్‌కు వెళ్ళని వ్యక్తి కూడా స్తోమతఉంటే ఖుర్బానీ తప్పకుండా ఇవ్వాలి. అయితే అలాంటి మనిషి తనమీద ఆధారపడే భార్యాపిల్లల తరపున ఖుర్బానీ ఇవ్వ నవసరం లేదు. ఒకవేళ ఎవరైనా ఏదైనా కారణం వల్ల మూడురోజులు గడచిపోయినా ఖుర్బానీ ఇవ్వలేకపోతే, ఆ తరువాత అతను ఒక మేక లేదా పొటేలు ఖరీదును పేదలకు దానం చేయాలి. ఆ విధంగా అతని ఖుర్బానీ విధి నెరవేరుతుంది.

ఖుర్బానీ మాంసాన్ని ఖుర్బానీ ఇచ్చిన మనిషి కుటుంబం, ఇరుగుపొరుగు, బంధుమిత్రులు, పేదలు అందరూ తినవచ్చు. మొత్తం మాంసంలో మూడోవంతును దానం చేయడం మంచిది. పేదముస్లిమేతరులక్కూడా దానం చేయవచ్చు. ఖుర్బానీ పశు చర్మాన్ని సొంతపనులకు వాడుకోవచ్చు. అయితే దాన్ని అమ్మి సొమ్ము చేసుకోరాదు. అలాంటి పైకాన్ని లేదా ఆ చర్మాన్ని పేదలకు దానం చేయాలి. పాపపరిహారం (కఫ్ఫారా)గా ఇచ్చే, మొక్కుబడి తీరిన తరువాత ఇచ్చే ఖుర్బానీ పశువుల మాంసాన్ని ఖుర్బానీ ఇచ్చేవారు అసలు తినకూడదు. ఆ మాంసమంతా పేదలకు దానం చేయాలి.

జిల్‌హజ్జ నెలవంక చూసిన తరువాత నుండి పండుగరోజు వరకు మనిషి క్షవరం చేయించుకోకుండా, గోళ్ళు కత్తిరించుకోకుండా ఉండటం అభిలషనీయం (ముస్తహబ్) అని ధర్మవేత్తలు అన్నారు. ఈ విషయంలో మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఈవిధంగా ప్రవచించారు:

"ఖుర్బానీ చేయవలసిన మనిషి జిల్‌హజ్జ నెలవంక చూసిన దగ్గర్నుండి ఖుర్బానీ చేసేవరకు క్షవరం చేయించుకోకూడదు; గోళ్ళు కత్తిరించుకో కూడదు." (ముస్లిం)

హజ్రత్ అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) కథనం: "జిల్‌హజ్జ 10వ తేదీన పండుగ జరుపకొమ్మని దైవప్రవక్త (సల్లం) నన్ను ఆదేశించారు. ఆ రోజును దేవుడు ముస్లిం సముదాయం కోసం పండుగ దినంగా నిర్ణయించాడు. ఒకతను దైవప్రవక్త (సల్లం) దగ్గరకు వచ్చి 'దైవప్రవక్తా! ఒకతను పాలు పితుక్కోమని నాకు ఒక మేక ఇచ్చాడు. నా దగ్గర అదొక్కటే ఉంది. మరి నేనా మేకను ఖుర్బానీ చేయాలా?' అని అడిగాడు. దానికి దైవప్రవక్త (సల్లం) సమాధానమిస్తూ ఇలా అన్నారు: 'వద్దు, నీవా పశువును బలిచేయకు. అయితే ఖుర్బానీ రోజు క్షవరం చేయించుకో, గోళ్ళు కత్తిరించుకో, మీసాలు కత్తిరించుకొని సరి చేసుకో, నాభి కింది వెండ్రుకలు తీసి శుభ్రపరచుకో. అంతే, ఈ ఆచరణే నీ ఖుర్బానీకి ప్రత్యామ్నాయం అవుతుంది." (అబూదావూద్, నసాయి)

## తఖ్సీర్ (క్షవరం)

పశుబలి ఇవ్వడం పూర్తికాగానే ఇహ్రాం (దీక్ష) ముగుస్తుంది. ఇక క్షవరం చేయించుకొని స్నానం చేయాలి. స్నానం చేసిన తరువాత సాధారణ బట్టలు ధరించ వచ్చు. క్షవరంలో కటింగ్ లేదా శిరోముండనం చేయించుకోవాలి. శిరోముండనం చేయించుకోవడమే మంచిది.

నేను, మా మామయ్య మంగలి కోసం వెతికాం. కాకతాళీయంగా ఒక మంగలి మా శిబిరాల దగ్గరికే వచ్చాడు. మేము అతని దగ్గరికి వెళ్ళాం. అయితే అక్కడ కూడా "క్యూ" ఏర్పడింది. ఆరోజు క్షురక మహారాజులకు కూడా మంచి డిమాండు ఉంటుంది. షాపుల్లో అయితే 10 నుంచి 20 రియాళ్ళు తీసుకుంటారు. నేల మీద కూర్చోబెట్టి గుండు గొరిగే వాళ్ళయితే 5 రియాళ్ళు తీసుకుంటారు. 5 రియాళ్ళు అంటే మన కరెన్సీ ప్రకారం అక్షరాలా 60/- రూపాయలు మాత్రమే. ఇంతకంటే చౌకబేరం దొరకదని భావిస్తూ మేము నేలతల్లి ఒడిలోనే బుద్ధిగా కూర్చొని శిరో ముండనం చేయించుకున్నాం.

ఆ తరువాత స్నానం (గుసుల్) చేయాలి. కాని స్నానశాలల దగ్గర పెద్ద పెద్ద 'క్యూ'లు ఉన్నాయి. ఇవి అసలు 'త్రీ ఇన్ ఒన్' మరుగుదొడ్లు. అంటే లెట్రిన్ కమ్ బాత్ కమ్ యూరినల్స్ అన్నమాట. ఇలాంటి మరుగుదొడ్లు మా శిబిరాల దగ్గర పురుషుల కోసం పది ఉన్నాయి. అయితే అన్నీ హౌస్ ఫుల్లే. వాటి ముందు 'క్యూ'లలో నిల్చుంటే మన వంతు ఎప్పుడొస్తుందో చెప్పలేం. పైగా ఆ 'త్రీ ఇన్ ఒన్' లావేటరీలోకి వెళ్ళి లెట్రిన్ మీద కూర్చుంటే పైన ఉండే షవర్ నుండి శీతలపానీయం మన నెత్తి మీద బొట్లు బొట్లుగా కారే అవకాశం కూడా లేకపోలేదు.

కనుక సహనం వహించాలి మరి. హాజీ అన్నాక ఆ మాత్రం సహనం వహించక



పోతే ఎలాగండీ! వీటన్నిటిని బట్టి హజ్‌కు మరోపేరు సహనం అని కూడా చెప్పవచ్చు. సహనంలేని ఉద్రేకపరులు హజ్ నియమాలన్నీ సరిగా పాటించలేరు.

నేనా 'క్యూ'లలో ఒక దాని చివర్లో నిల్చున్నాను. నా పక్కనున్న 'క్యూ'లో ఒకతను కాస్తంత సహనం కోల్పోయి "అయ్యా, బాబూ! తొందరగా తెమలండి!!" అన్నాడు. ఏ ఎమర్జన్సీ కేసు వచ్చిపడిందో పాపం! నేనతని వైపు జాలిగా చూస్తూ, కొంచెం ముందుకు జరిగాను. ఇలా గంటకు 60 అడుగుల వేగంతో జరుగుతూ జరుగుతూ నలభై నిమిషాల తరువాత జయప్రదంగా లోపలికి ప్రవేశించ గలిగాను. అయితే సహనం కోల్పోయిన సహచరులు మరెవరైనా కేకలు పెడతారేమోనని భయపడి తొందర తొందరగా స్నానం చేసి బయట పడ్డాను.

ఈలోగా కాబాలో తవాఫె జియారత్ (సందర్శనా ప్రదక్షిణ) పుణ్యకాలం కాస్తా అయిపోయింది. సూర్యాస్తమయం కాగానే జిల్‌హజ్జ 10 ముగిసి 11వ తేదీ ప్రారంభ మవుతుంది. అందువల్ల మేము 10వ తేదీ చేయవలసిన 'తవాఫె జియారత్' వాయిదా పడింది. ఇక చేసేదేముంది? ఆ రాత్రి 'మినా'లోనే అసంతృప్తిగా గడిపాం. "ఏదైనా కారణంవల్ల 10వ తేదీన తవాఫెజియారత్ చేయలేకపోతే 11, 12 తేదీల్లోనైనా చేయవచ్చు." (ఆసాన్‌ఫిఖ్హా-2, మౌలానా ముహమ్మద్ యూసుఫ్ ఇస్లాహి)

## జిల్‌హజ్జ 11వ తేది కార్యకలాపాలు

ఫజర్ నమాజ్ తరువాత అల్పాహారం సేవించి మేము మక్కా వెళ్ళడానికి సిద్ధ మయ్యాం. మా ముగ్గురితో పాటు మరో అయిదుగురు కూడా మా గ్రూపులో ఉన్నారు. మేము ఎనిమిది మంది 10 గంటలకు ఒక టాక్సీ మాట్లాడుకొని మక్కా బయలుదేరాం. డ్రైవర్ షార్ట్‌కట్ రోడ్డుపై హెవీ ట్రాఫిక్ ఉంటుందని లాంగ్‌రూట్ అయిన వేరే రోడ్డు వైపుకు టాక్సీ మళ్ళించి నడపసాగాడు. కాని ఆ రూట్‌లో కూడా హెవీట్రాఫిక్ ఉంది. అనేక చోట్ల చాలా సేపువరకు కారు ఆపవలసి వచ్చింది. చివరికి ఒంటి గంటకు మమ్మల్ని కాబా మస్జిద్‌కు చేర్చాడు.

మేము దైవానికి కృతజ్ఞతలు చెబుతూ టాక్సీ దిగి తవాఫె జియారత్ కోసం మస్జిద్‌లోకి ప్రవేశించాం. అయితే మా గ్రూపులో ముగ్గురు స్త్రీలు కూడా ఉన్నారు. వారు ఇహ్రాం విరమించిన తరువాత 'మినా'లో స్నానం చేయలేక పోయారు. అందువల్ల విడిదికి వెళ్ళి స్నానాదులు ముగించుకున్నాక అందరూ కలసి "తవాఫ్ జియారత్" చేద్దామని చెప్పడంతో మేమంతా మా లాడ్జికి చేరుకున్నాం. అక్కడ మా అవసరాలన్నీ తీర్చుకున్నాక సుష్టుగా భోంచేసి తిరిగి కాబాకు చేరుకున్నాం. కాబాలో అసర్ నమాజ్ తరువాత మేమంతా కలసి "తవాఫె జియారత్, సయీ" చేశాం. ఇవి కూడా హజ్‌లోని నియమాలే.

ఈవిధంగా జిల్‌హజ్జ 10న చేయవలసిన "తవాఫెజియారత్" 11వ తేదీన చేయ వలసివచ్చింది. ఈ పనులన్నీ ముగిసేటప్పటికి మగ్రిబ్ నమాజ్ వేళయింది. అంచేత

మగ్రిబ్, ఇషా నమాజులు కాబాలోనే చేసుకొని మళ్ళీ 'మినా'కు బయలుదేరాం. అప్పుడు మేము మొత్తం తొమ్మిదిమంది అయ్యాం. కాబా నుంచి మెయిన్‌రోడ్డు మీదకు వచ్చి టాక్సీ కోసం ప్రయత్నిస్తే గంట తర్వాత ఎలాగో ఓ టాక్సీ దొరికింది.

టాక్సీ డ్రైవర్ హెవీట్రాఫిక్ కారణంగా టాక్సీని నత్తనడకలా నడిపిస్తూ గమ్యస్థానం చేరుకోకముందే "ఇక్కడ దిగండి, ఇక్కడ దిగండి" అంటూ దారిపొడుగూతూ ఒకటే గోల పెట్టసాగాడు. మాలో ఒక హాజీకు కొంచెం అరబీభాష, మినా రోడ్లు తెలియడం వల్ల అతను డ్రైవర్‌కు మాటకుమాట చెబుతూ అతని నోరు కట్టిపడేశాడు. చివరికి ఆ డ్రైవర్ ఎలాగో రాత్రి రెండు గంటలకు మమ్మల్ని 'మినా'లో ఒకచోట దించాడు.

అక్కడ్నుంచి నడుచుకుంటూ జమ్రాత్ సమీపానికి చేరుకున్నాం. అయితే నడుచుకుంటూ రావడంలో ముగ్గురు స్త్రీలతో పాటు అయిదుగురు వెనకబడి పోయారు. నేను, మరో ముగ్గురు ముందు నడుస్తూ కొంచెం దూరం పోయి వెనక్కి తిరిగిచూస్తే ఆ అయిదుగురు కన్పించలేదు. మేము ఆగి కాస్సేపు ఎదురుచూసినా వారి జాడ లేదు. సరే, వాళ్ళే నిదానంగా వస్తార్లేనని మేము నలుగురం మెట్ల మీదుగా జమ్రాత్ మొదటి అంతస్తు పైకి చేరుకొని వారి కోసం ఎదురుచూశాం. కాని ఎంతసేపైనా ఆ అయిదుగురు రాలేదు. ఫోన్ చేస్తే తాము జమ్రాత్ దగ్గరే ఉన్నామని చెప్పారు వారు. కాని మేమున్న చోట ఎంత వెతికినా కన్పించ లేదు. ఇలా అనేక సార్లు ఫోన్ చేసినా మేము వారిని కలుసుకోలేక పోయాం.

నేను మాటిమాటికి ఫోన్ చేస్తుండిన వ్యక్తితో "బహుశా వాళ్ళు గ్రౌండ్‌ఫ్లోర్‌లోకి వెళ్ళి ఉండవచ్చు" అన్నాను. అతను ఆశ్చర్యపోతూ "ఇక్కడ 'రమీ' కోసం గ్రౌండ్‌ఫ్లోర్ కూడా ఉందా?" అన్నాడు. ఆ విధంగా అతను అసలు విషయం తెలసుసుకొని "సరే, మేము మీ పైన ఫస్ట్‌ఫ్లోర్‌లో ఉన్నాంగాని, మీరు అక్కడే 'రమీ' చేసి నేరుగా విడిది గుడారనికి వచ్చేసేయండి" అని మరోసారి ఫోన్ చేశాడు. ఆ తరువాత మేము నలుగురం రాత్రి మూడు గంటలకు రమీ (కంకర్రాళ్ళు విసిరే) ఆచారం నెరవేర్చి నాలుగు గంటలకు గుడారానికి చేరుకున్నాం. ఆ తరువాత ఓ గంటకు మిగతా అయిదుగురు కూడా గుడారానికి చేరుకున్నారు.

ఈవిధంగా మేము జిల్‌హజ్జ 10వ తేదీన చేయవలసిన 'తవాఫె జియారత్' 11వ తేదీన, 11వ తేదీన చేయవలసిన 'రమీ' 12వ తేదీన చేయవలసి వచ్చింది.

జిల్‌హజ్జ 10,11,12 తేదీలలో తవాఫ్, సయీ, రమీ ఆరాధనలు ఒక్క క్షణం కూడా ఆగకుండా 24 గంటలూ కొనసాగుతుంటాయి. ఆ మూడు తేదీలలో ఆ మూడు చోట్లా రద్దీ కూడా విపరీతంగా ఉంటుంది. ఆ మూడు తేదీలలో ఆ మూడు చోట్ల మాత్రమే కాదు, మినా నుండి కాబా వరకూ చీమల బారులా బస్సులు, కారులు, పాదాచారులతో హెవీట్రాఫిక్ ఉంటుంది. అందుకే మేము కాబాలయం నుండి మినాకు అయిదు గంటలు ప్రయాణం చేసి తెల్లవారుజామున మూడు గంటలకు చేరుకున్నా జమ్రాత్ దగ్గర ట్రాఫిక్ ఏమాత్రం తగ్గలేదు.



## జిల్‌హజ్జ 12వ తేది కార్యకలాపాలు

ఫజర్ నమాజ్ వేళ సమీపించడంతో మేము నిద్రకు ఉపక్రమించకుండా కాల కృత్యాలు తీర్చుకోవడానికి "క్యూ"లలో నిలబడ్డాం. సరే, అవన్నీ అయిపోయాక ఫజర్ నమాజ్ చేసి నిద్రాదేవీ ఒడిలోకి జారుకున్నాం. కాని నాకు మాత్రం నిద్ర పట్టలేదు. గుడారంలో కొందరు అప్పుడే అల్పాహారాలు ఆరగించడంలో బిజీ అయిపోయారు.

నేను చాప మీద కాస్సేపు అటూ ఇటూ దొర్లి లేచాను. మా శ్రీమతి కూడా లేచి అల్పాహారం పొట్లాలు తెరచి పెట్టింది. నేను, మా మామయ్య ముఖం కడుక్కొని టిఫిన్ చేశాం. అప్పటికి తొమ్మిదయింది. జిల్‌హజ్జ 12వ తేదీన కూడా 'రమీ' చేయవలసి ఉంది. సంప్రదాయం (సున్నత్) ప్రకారం మధ్యాహ్నం సూర్యుడు వాలిన తరువాతే చేయాలి. అందువల్ల మా గుడారంలో కొందరు సూర్యుడు వాలిన తరువాతే రమీ చేయలని చెప్పి ప్రశాంతంగా కూర్చున్నారు. కాని తొక్కిసలాట ప్రమాదం ఉన్నప్పుడు ముందే రమీ చేయడంలో తప్పు లేదని చెబుతూ నేను సౌదీ ప్రభుత్వం జారీ చేసిన ఫత్వా సంగతి కూడా వారి ముందు ప్రస్తావించాను.

దాంతో కొందరు నా అభిప్రాయంతో ఏకీభవించారు. అలా ఏకీభవించినవారిలో కొందరిని తీసుకొని నేను 11 గంటలకు జమ్రాత్‌కు చేరుకున్నాను. అక్కడ మేము ప్రశాంతంగా మూడు జమ్రాలపై కంకర్రాళ్ళు విసరి 12.30 గంటలకు మా గుడారం సమీపానికి తిరిగి వచ్చాం. ఆ సమయంలో దాదాపు వేయిమంది షియా ముస్లింలు యూనిఫారం దుస్తుల్లో నినాదాలు చేస్తూ రమీ చేయడానికి వెళ్తుంటే చూశాం.

**తొక్కిసలాటలో వేలాదిమంది హతం:** హాజీలలో సూర్యుడు వాలిన తర్వాతే 'రమీ' చేయాలని నిర్ణయించుకున్నవారే ఎక్కువమంది ఉన్నారు. అలాంటి వారంతా రమీకోసం గుడారాల నుండి, మసీదుల నుండి ఒక్కసారిగా జమ్రాత్ వైపుకు దూసుకుపోయారు. ఫలితంగా అక్కడ తీవ్రమైన తొక్కిసలాట జరిగి వేలాదిమంది జనం ప్రాణాలు కోల్పోయారు. ప్రభుత్వం ఎన్ని ఏర్పాట్లు చేసినా ఒక్కోసారి మానవ పొరపాటు (Human error) ఇలాంటి ప్రమాదాలకు దారి తీస్తుంది.

మేము 'రమీ' చేసి తిరిగొస్తున్నప్పుడు నినాదాలు చేస్తూ మా ముందు నుంచి వెళ్ళిన వేయిమంది షియా హాజీల కారణంగా తొక్కిసలాట జరిగివుండవచ్చని నేను భావించాను. కాని వారి వల్ల జరగలేదట. ఆ సమయంలో మా లాడ్జింగ్ సహచరుడు ఒకతను అక్కడే ఉన్నాడు. అతను ప్రమాదం జరిగిన అరగంట తరువాత కెమేరాతో ఫొటోలు తీస్తుంటే ఒక పోలీసు ఆ కెమేరా లాక్కొని ఫిలిం స్వాధీనం చేసుకున్నాడట. ఈ తొక్కిసలాటను కళ్ళారా చూసిన ఆ ప్రత్యక్ష సాక్షి కథనం ప్రకారం జమ్రాత్ దగ్గర ఓ పెద్ద జనసమూహం రమీ చేసి వాపసుపోవలసిన దారిన కాకుండా రమీ చేయడానికి వచ్చేదారిన ఒక్కసారిగా వస్తుంటే పోలీసులు వాళ్ళను అడ్డగించారు. అంతమందిని హఠాత్తుగా అడ్డగించడం వల్ల తొక్కిసలాట జరిగింది. అదేకాకుండా మరికొన్ని చిన్న కారణాలు కూడా ఉండవచ్చు.

ఏమైనప్పటికీ హజ్ చివరిరోజున ఈ దుర్ఘటన జరగడం ఎంతో విచారకరమైన విషయమే. హజ్ ప్రారంభంకావడానికి కొన్ని రోజుల ముందు కాబా సమీపంలోని అయిదస్తుల ఓ పాతభవనం కూలిపోయి 40 నుంచి 50 మంది హాజీలు ప్రాణాలు కోల్పోయారు. ఆ దుర్ఘటన రేకెత్తించిన భయాందోళనల నుండి జనం ఇంకా తేరుకోక ముందే ఇప్పుడీ దుర్ఘటన జరిగింది. ఏమైనప్పటికీ దైవమార్గంలో ఇలా అసువులు బాసిన హజ్ యాత్రికులకు అమరగతి (షహీద్) భాగ్యం లభిస్తుందని ఆశిద్దాము. వారి బంధువులకు దైవం సహనం ప్రసాదించమని ప్రార్థిద్దాము.

ఆరోజు మేము రమీ చేసి విడిది గుడారాలకు తిరిగొచ్చిన తరువాత భోజనం, జుహర్ నమాజులు ముగించుకొని తరువాయి కార్యక్రమం గురించి మాట్లాడుకున్నాం. జిల్‌హజ్జ 12వ తేదీన హజ్ నియమాలలో రమీ చేయడం తప్ప మరే కార్యక్రమం లేదు. కాకపోతే 'రమీ' చేసిన తరువాత సూర్యాస్తమయానికి ముందే మినా నుండి మక్కా పట్టణానికి బయలుదేరాలి. అందువల్ల మేము మధ్యాహ్నం ఒంటి గంటకు సామాను సర్దుకొని బయలుదేరాం. మక్కా వైపుకు పోయే ఓ ఫ్లయిఓవర్ బ్రిడ్జి రోడ్డు మీదకు చేరుకొని టాక్సీలో మక్కాలోని మా లాడ్జికి చేరుకున్నాం.

ఆరోజు ఎక్కడ చూసినా జనం గుంపులు గుంపులుగా చేరి జమ్రాత్ దగ్గర జరిగిన ఘోరప్రమాదం గురించే మాట్లాడుకోవడం కన్పించింది. హజ్ ముగిసిపోతూ హాజీలగుండెల్లో ఈ విషాదం మిగిల్చిపోయింది. దానికితోడు రెండోరోజు మా లాడ్జిలో మరో దుర్ఘటన జరిగి ఓ కుటుంబాన్ని విషాదసాగరంలో ముంచింది. మాతో చనువుగా ఉండే కొందరు సహహాజీలలో రాయచోటికి చెందిన ఓ యువకుడు గుండెపోటుతో హఠాన్మరణం చెందాడు. ఇబ్రాహీం ప్రవక్త (అలైహి) పునాదులేసిన పవిత్రమైన మక్కానగరంలోనే అతని భౌతికకాయాన్ని ఖననం చేశారు.

దైవమార్గంలో పడిన కష్టాలు, చేసిన త్యాగాలు ఏమాత్రం వృధాపోవు. ధర్మ సంస్థాపనను జీవిత లక్ష్యంగా ఎంచుకొని చిత్తశుద్ధితో త్యాగాలుచేసే విశ్వాసికి విశ్వ ప్రభువు తగిన ప్రతిఫలం తప్పకుండా ప్రసాదిస్తాడు. ఖుర్బానీ చేసేటప్పుడు హాజీ హృదయంలోనే కాదు, ప్రతి విశ్వాసి హృదయంలోనూ ఈ భావనే ఉండాలి.

## 50. ఖుర్బానీ అంటే త్యాగం

ఖుర్బానీ అనగానే ప్రతి ముస్లిం మనోవీథిలో ఈదుల్‌అజ్హా రోజున యాటనో, పొటేలునో జిబహ్ చేసే దృశ్యం మెదలుతుంది. ఆరోగ్యం, ఆర్థిక స్తోమతగల అనేక ముస్లింలు ఆరోజు దైవమార్గంలో పశువుని బలిచేసి ఇక ఖుర్బానీ విధి నెరవేరినట్లేనని భావిస్తారు. కాని ఖుర్బానీ వాస్తవికత ఏమిటో చాలామందికి తెలియదు.

ఖుర్బానీ అంటే సాన్నిధ్యం, సమర్పణ, బలి, త్యాగం అనే నానార్థాలు ఉన్నాయి. ఇస్లామీయ పరిభాషలో ఖుర్బానీ అంటే దైవసాన్నిధ్యం పొందడం, దైవానికి సర్వ సమర్పణ చేయడం, దైవప్రసన్నత కోసం త్యాగం చేయడం అనే భావాలున్నాయి.



మరోమాటలో దేవునికి తన సర్వసం సమర్పించడం ద్వారా ఆయన సాన్నిధ్యం, ప్రసన్నతలు పొందడం అన్నమాట.

అయితే దేవునికి ఏం సమర్పిస్తే ఆయన సాన్నిధ్యం, ప్రసన్నతలు దాసునికి లభిస్తాయి? ఆయన ప్రసన్నత కోసం దాసుడు ఏం త్యాగం చేయాలి? దీనికి సమాధానం విస్తృత భావంతో కూడుకున్నది. దేవునికి సమర్పించడానికి దాసుని దగ్గర అసలు తనదంటూ ఏముందో తెలుసుకుందాం.

విశ్వప్రభువు ఈ సువిశాల విశ్వంలోని సమస్త వస్తువుల్ని మానవునికి స్వాధీనం చేశాడు. ఇక్కడి వస్తువులన్నిటినీ తన ఇష్టానుసారం వాడుకోవడానికి అతనికి స్వేచ్ఛ కూడా ఇచ్చాడు. కాని దేవుడ్ని విశ్వసించిన మనిషి దైవేచ్ఛ ప్రకారమే వీటిని వినియోగించుకుంటాడు. ఎందుకంటే ఇక్కడ తనకు లభించిన వస్తువులన్నీ దైవప్రసాదితాలేనని, చివరికి తన ఆత్మ, శరీరం, శక్తిసామర్థ్యాలు సైతం దేవుడు అనుగ్రహించినవేనని, తాను కేవలం ఆయన ప్రతినిధి (ఖలీఫా) మాత్రమేనని అతను నమ్ముతున్నాడు.

దేవునికి ఏదైనా సమర్పించ వలసివస్తే ఇలాంటి మనిషే సమర్పిస్తాడు. ఈ భావన, ఈవిశ్వాసం అతని హృదయంలో ఎంతదృఢంగా నాటుకుంటే అంత ఉదారంగా అతను దైవమార్గంలో సమర్పిస్తాడు. నిజానికి అతను ఏనాడైతే విశ్వ ప్రభువును, ఆయన ప్రవక్త (సల్లం)ను విశ్వసించి ముస్లిం (దైవవిధేయుడు) అయ్యాడో, ఆనాడే అతను తన సర్వస్వాన్ని దైవానికి సమర్పించాడు. ఇప్పుడతని దగ్గర ఉన్నవన్నీ విశ్వయజమాని తన కరుణాకటాక్షాలతో అతని ప్రయోజనార్థం ఇచ్చిన తాత్కాలిక వస్తువులు మాత్రమే. వీటిని తన ఇష్టానుసారంగాక, అసలు యజమాని అభీష్టం మేరకే వినియోగిస్తాడు.

పైగా అతను వీటిలో ఏ ఒక్క వస్తువునైనా లేదా మొత్తం వస్తువులనైనా అవసరమయితే ఏ క్షణాన్నయినా దైవమార్గంలో ధారపోయడానికి సిద్ధంగా ఉంటాడు. ఇలా చేయడం తన విధి అని భావిస్తాడు. విశ్వయజమానిని విస్మరించి ఆయన ప్రసాదించిన వస్తువుల్ని దుర్వినియోగంచేస్తే లేక సద్వినియోగంలో పిసినారితనం వహిస్తే పరలోకంలో పట్టుబడతానని విశ్వసిస్తున్నాడు.

ఈ విశ్వాసమే మనిషిలో త్యాగనిరతిని పెంపొందిస్తుంది. అతను దైవప్రసన్నత కోసం ఎన్ని కష్టాలైనా భరిస్తాడు. ధర్మసంస్థాపనా మార్గంలో ఎలాంటి త్యాగాన్నయినా చేస్తాడు. దాని కోసం అవసరమైతే తన ఆస్తిపాస్తులనే కాదు, ప్రాణాన్ని సైతం త్యాగం చేస్తాడు. ఇదే అతనిచ్చే నిజమైన ఖుర్బానీ.

### ఇబ్రాహీం ప్రవక్త (అలైహి) త్యాగనిరతి

హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) ఇలాంటి త్యాగాన్నే చేశారు. దైవధర్మం కోసం ఆయన తన జాతివారితో విరోధం కొనితెచ్చుకున్నారు. కన్నతండ్రికి దూరమయ్యారు. పరమ దుర్మార్గుడు, క్రూరుడయిన నమ్రూద్ చక్రవర్తి ఆగ్రహానికి గురయి భయంకర

మైన అగ్నిగుండంలోకి విసిరివేయబడ్డారు. దేవుడు ఈ విపత్తు నుండి కాపాడినప్పటికీ ఆయన తన జాతిప్రజల ఆదరణకు నోచుకోలేక పోయారు. ఆ ప్రజలు, వారి రాజు అగ్నిపరీక్ష వంటి గొప్పమహిమ చూసినా వారికి కనువిప్పు కలగలేదు. చివరికి ఆ పుణ్యపురుషుడు ధర్మసంస్థాపన కోసం ఇల్లువాకిలి, బంధుమిత్రులు, స్వస్థలం, సమస్తం వదలిపెట్టి పరదేశాలకు వలసపోయారు.

హ్రజత్ ఇబ్రాహీం (అ) కేవలం దైవప్రసన్నత కోసం ఇలా యావజ్జీవితం దుర్భర బాధలు అనుభవించారు. వృద్ధాప్యంలో లేకలేక కలిగిన ఏకైక సంతానాన్ని కూడా కలలో చూసిన దృశ్యాన్ని దైవాజ్ఞగా పరిగణించి బలివ్వడానికి సిద్ధమయ్యారు.

హ్రజత్ ఇబ్రాహీం (అలైహి) చేసిన ఇలాంటి అసాధారణ త్యాగాన్నే ప్రతి ముస్లిం ధర్మసంస్థాపన కోసం చేయవలసి ఉంటుందని ఆదేశిస్తూ దేవుడు ముస్లింలకు ఈదుల్‌అజ్హా రోజున ఖుర్బానీని విధిగా నిర్ణయించాడు. హ్రజత్ ఇబ్రాహీం (అలై)కు ఆనాడు హ్రజత్ ఇస్మాయీలే (అలైహి) సర్వసం. ఆయనకు ప్రపంచంలో అత్యంత ప్రియమైన వస్తువు ఏదైనా ఉందంటే అది ఆయన ఏకైక కుమార రత్నమే. అలాంటి ప్రియమైన వస్తువును సైతం త్యాగం చేసిన హ్రజత్ ఇబ్రాహీం (అలైహి) లాగానే ప్రతి ముస్లిం దైవప్రసన్నత కోసం అవసరమైతే తనకు ప్రియమైన ఎలాంటి వస్తువునైనా ధారపోయాలని ఖుర్బానీ సంప్రదాయం ప్రతియేడూ మనకు గుర్తు చేస్తోంది.

## యావత్తు ఆస్తిపాస్తుల త్యాగం

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) కాలంలో ఆయన అనుచరులు చేసిన త్యాగాలు కూడా మనం గుర్తుంచుకోవలసిన విషయాలే. ఇక్కడ కొందరు అనుచరులు (సహాబీలు) చేసిన త్యాగాలను గురించి తెలుసుకుందాం.

ఇతర సహచరుల మాదిరిగానే హ్రజత్ సుహైబ్ రోమీ (రజి) కూడా మక్కా నుంచి మదీనా వలసపోవడానికి ప్రయత్నించారు. ఆయన బానిసత్వపు బంధనాలు త్రెంచుకొని రోమ్ నుండి పారిపోయి మక్కా వచ్చిన తరువాత, వ్యాపారం చేసి లక్షలు సంపాదించారు. అందువల్ల ఈ ధనమంతా తన వెంట తీసికెళ్తాడేమోనని భావించి ఖురైషీయులు ఆయన్ని మక్కా వీడి పోనివ్వకుండా నిఘా ఉంచారు.

అయినప్పటికీ హ్రజత్ సుహైబ్ (రజి) నిరాశ చెందకుండా అవకాశం కోసం ఎదురుచూడసాగారు. ఓరోజు ఆయనకు మెరుపులాంటి ఓ ఆలోచన తట్టింది. మలవిసర్జన సాకుతో ఆయన మాటిమాటికి బహిర్ ప్రదేశానికి వెళ్ళిరావడం మొదలెట్టారు. ఆయన పరిస్థితి చూసిన ఖురైషీయులు ఆయనకు ఏదో విరోచనరోగం పట్టుకుందని తలచి సంతోషంతో చంకలు కొట్టుకున్నారు. పైగా ఆ రాత్రి ఎంతో సంతృప్తితో గురకపెట్టి నిద్రపోయారు.

హ్రజత్ సుహైబ్ (రజి) ఈ అవకాశాన్ని జారవిడుచుకోకుండా తక్షణమే ధనుర్బాణాలు తీసుకొని నిద్రపోతున్న కాపలా దారుల మధ్య గుండా మెల్లిగా అడుగులు



వేసుకుంటూ బయటికి వెళ్ళారు. అక్కడ్నుంచి మదీనా దిశగా చకచకా నడచి కనుమరుగైపోయారు.

ఖురైష్ కాపలాదారులు నిద్రమత్తు వదలిన తరువాత విషయం తెలియగానే ఆదరాబాదరాగా గుర్రాలెక్కి మదీనా దిశగా పరుగెత్తారు. హ్రజత్ సుహైబ్ రోమి (రజి) తననెవరో వెంటాడుతున్నట్లు గుర్రపుడెక్కల చప్పుడు ద్వారా తెలుసుకున్నారు. తక్షణమే ఆయన పరుగెత్తి ఓ గుట్ట పైకెక్కి నిలబడ్డారు. అంతలో కాపలాదారులు కూడా ఆ గుట్ట దగ్గరికి చేరుకున్నారు. హ్రజత్ సుహైబ్ రోమి (రజి) అంబులపొది నుండి చర్రున ఓ బాణం తీసి ధనస్సుపై ఎక్కుపెడుతూ ఇలా అన్నారు:

“ఖురైషీయులారా! నేను విలువిద్యలో ఆరితేరిన సమరయోధుణ్ణని, నా బాణాలు ఎట్టి పరిస్థితిలో కూడా గురితప్పవని మీకు బాగా తెలుసు. బాణాలు అయిపోయాక కరవాలంతో నా చివరి రక్తపుబొట్టు చిందేవరకు పోరాడుతూ మిమ్మల్ని ఒక్కొక్కర్నే వరుసుగా హతమారుస్తాను. జాగ్రత్త! ఇంకొక్క అడుగు ముందువేశారా ఈ బాణం మీ గుండెల్లో నుంచి దూసుకుపోవడం ఖాయం.”

కాపలాదారుల్లో ఒకతను మాట్లాడుతూ “నువ్వు మా పట్టణానికి చేతిలో చిల్లిగవ్వ కూడా లేని నిష్టదారిద్ర్య స్థితిలో వచ్చావు. ఇక్కడకు వచ్చి లక్షలు సంపాదించావు. అదంతా తీసుకొని నిన్ను పొనిస్తామనుకుంటున్నావా?” అన్నాడు.

“మరి నా ధనమంతా మీకప్పగిస్తే నాకు దారి వదులుతారా?” అడిగారు హ్రజత్ సుహైబ్ (రజి). దానికి ఖురైషీయులు “తప్పకుండా వదిలేస్తాం” అన్నారు.

అప్పుడు హ్రజత్ సుహైబ్ తన ఇంట్లో ధనం దాచిపెట్టిన ప్రదేశం తెలియజేశారు. నూతన ధర్మం స్వీకరించి ముస్లింలయినవారు అబద్ధమాడరని ఖురైషీయులకు బాగా తెలుసు. అందువల్ల వారు సుహైబ్ రోమీ (రజి) మాటలు నమ్మి ఆయన్ని మదీనా వెళ్ళిపోవడానికి వదిలేశారు.

ఆ తరువాత వారు పట్టణానికి తిరిగొచ్చి సుహైబ్ (రజి) ఇంట్లో ఆయన చెప్పిన చోట వెతికి చూస్తే నిజంగానే అపార ధనరాసులు కన్పించాయి. ధన కాంక్షాపరులైన ఖురైషీయులు సంతోషంతో పొంగిపోతూ వాటిని తీసేసుకున్నారు.

హ్రజత్ సుహైబ్ (రజి) ఆ తరువాత వేగంగా ప్రయాణం సాగించారు. లక్షల ధనరాసులు కోల్పోయినా ఏమాత్రం బాధపడకుండా విశ్వాసమహాభాగ్యం దక్కినందుకు ఆయన పరమ సంతోషంతో, ద్విగుణీకృత ఉత్సాహంతో ప్రయాణం చేసి మదీనా సమీపంలోని ఖుబా గ్రామానికి చేరుకున్నారు.

ఖుబా గ్రామంలో దైవప్రవక్త (సల్లం) హ్రజత్ సుహైబ్ రోమీ (రజి)ని చూడగానే “అబూయహ్యా! నీవు చేసిన ఈవ్యాపారం నీకెంతో ప్రయోజనకారి అవుతుంది” అన్నారు సంతోషం వెలిబుచ్చుతూ.

## హజ్రత్ అబూతల్హా (రజి) త్యాగం

హజ్రత్ అబూతల్హా (రజి) మదీనా ముస్లిములలో కెల్లా గొప్ప ధనికులు. ఆయనకు అనేక ఖర్జూరపుతోటలు ఉండేవి. వాటిలో 'బైర్హా' తోటంటే ఆయనకు చాలా ఇష్టం. ఈ తోట మస్జిదెనబవీ ముందుభాగాన ఉండేది. ఖుర్‌ఆన్‌లో "మీకు అత్యంత ప్రీతికరమైన వస్తువుని దైవమార్గంలో ఖర్చు చేయనంతవరకు మీరు పుణ్య స్థాయికి చేరుకోలేరు" అనే సూక్తి (3:92) అవతరించినపుడు హజ్రత్ అబూతల్హా (రజి) లేచి దైవప్రవక్త (సల్లం)తో ఇలా అన్నారు:

"దైవప్రవక్తా! 'అత్యంత ప్రీతికరమయిన వస్తువుని దైవమార్గంలో ఖర్చు చేయ నంతవరకు మీరు పుణ్యస్థాయికి చేరుకోలేర'ని దేవుడు సెలవిస్తున్నాడు కదా! 'బైర్హా' తోట నాకెంతో ఇష్టమైనది. అంచేత నేనా తోటను దైవమార్గంలో దానం చేయాలను కుంటున్నాను. దైవం నుండి దాని పుణ్యఫలం ఆశిస్తున్నాను. మీరు దైవాజ్ఞ ప్రకారం దాన్ని ఉపయోగించండి."

అప్పుడు మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఇలా అన్నారు: "చాలా మంచిది. ఇదెంతో లాభదాయకమైన సంపద. అయితే నాదొక సలహా. ఆ తోటను నీ (పేద) బంధువులకు పంచివ్వు." అబూతల్హా (రజి) ఈమాట విని "నేను మీఆజ్ఞ శిరసావ హిస్తున్నాను" అన్నారు. తరువాత ఆయన ఆ తోటను తన పెదనాన్న, చిన్నాన్న కొడుకు లకు పంచివేశారు. (బుఖారి).

త్యాగభావంలేని ధర్మపరాయణత నిజమైన ధర్మపరాయణత అన్పించుకోదు. ఆ త్యాగల్లో కూడా ప్రాణత్యాగం తరువాత ధనత్యాగం ఎంతో గొప్పవిషయం. ఈ వాస్తవాన్ని గురించి ఖుర్‌ఆన్‌లోని ఈ క్రింది సూక్తులు చూడండి:

"భూమ్యాకాశాల్లోని సర్వస్వం దేవునిదే. ఆయనే వాటికి వారసుడు. అలాంటప్పుడు మీరు దైవమార్గంలో సంపదను ఎందుకు ఖర్చుపెట్టరు? విజయానికి పూర్వం ధనత్యాగం చేసి యుద్ధం చేసినవారితో, విజయానంతరం సంపద ఖర్చుపెట్టి సమరంలో పాల్గొనేవారు ఎన్నటికీ సమానులు కాలేరు. దేవుడు ఉభయులకూ (ప్రతిఫలం విషయంలో) మంచి వాగ్దానం చేసినప్పటికీ హోదా, అంతస్తులలో వీరికంటే విజయానికి పూర్వం ధనత్యాగం చేసి యుద్ధంచేసినవారే అధికులు." (ఖుర్‌ఆన్-57:10)

"మీలో దేవునికి రుణమిచ్చే వారెవరైనా ఉన్నారా? శ్రేష్ఠమైన రుణం? అలాంటి వారికి దేవుడు ఆ రుణాన్ని అనేకరెట్లు పెంచి తిరిగి ఇచ్చివేస్తాడు. పైగా వారికి అత్యంత శ్రేష్ఠమైన ప్రతిఫలం కూడా లభిస్తుంది." (ఖుర్‌ఆన్-57:11)

## హజ్రత్ అబుద్దహ్దా అన్సారీ (రజి) త్యాగం

భూమ్యాకాశాలన్నీ దేవునివే అయినప్పుడు, ఆ దేవుడు ప్రసాదించిన ధనకనక వస్తువుల్ని ఆయన నిర్దేశించిన మార్గంలో ఖర్చు చేయడానికి మానవులకు ఎలాంటి అభ్యంతరం ఉండకూడదు. కాని మానవుడు పిసినారితనంతో సత్కార్యాల కోసం



డబ్బు వెచ్చించడానికి వెనుకంజ వేస్తాడు. ఉపాధి ప్రసాదించేది తానేనని, మీరేదైనా దానంచేస్తే తానా కొరత తీరుస్తానని దేవుడు అంటున్నాడు (ఖుర్‌ఆన్-34:39). పైగా నేను ప్రసాదించిన ఆ ధనాన్ని నాకు రుణంగా అందజేస్తే దాన్ని నేను అనేకరెట్లు పెంచి తిరిగి తీర్చుతానని, ఆపై అదనంగా తగిన ప్రతిఫలం కూడా ప్రసాదిస్తానని కూడా సృష్టికర్త వాగ్దానం చేస్తున్నాడు. (ఖుర్‌ఆన్-57:11) ఈ వాగ్దానం పరలోకంలో నెరవేరుతుందనడంలో ఎలాంటి సందేహంలేదు.

హజ్రత్ అబుద్దహ్దా అన్సారీ (రజి) మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) నోట ఈసూక్తి (57:11) విని "దైవప్రవక్తా! దేవుడు మనల్ని అప్పు అడుగుతున్నాడా?" అని ప్రశ్నించారు. దానికి ఆయన (సల్లం) అవునన్నారు. అప్పుడు అబుద్దహ్దా "అయితే కాస్త మీ చేయి జాపండి" అన్నారు. దైవప్రవక్త (సల్లం) చేయి జాపారు. హజ్రత్ అబుద్దహ్దా (రజి) ఆయన చేతిని తన చేతిలోకి తీసుకొని "నేను నా ప్రభువుకు నా తోటను (అప్పుగా) ఇస్తున్నాను" అని చెప్పారు.

హజ్రత్ అబుద్దహ్దా (రజి) తోటలో ఆరొందల ఖర్జూర చెట్లున్నాయి. తోటలోనే ఆయన ఇల్లు కూడా ఉంది. అక్కడే ఆయన భార్యాపిల్లలు కూడా నివసిస్తున్నారు. ఈ మాట చెప్పి ఆయన నేరుగా తోట దగ్గరికెళ్ళి "ఉమ్మెదహ్దా! బయటికి వచ్చేసెయి. నేనీ తోటను నా ప్రభువుకు అప్పుగా ఇచ్చేశాను" అన్నారు. ఆయన భార్య కూడా ఎంతో సాధ్వీమణి. ఆమె ఈ మాట విని "మీరు చాల లాభదాయకమైన వ్యాపారమే చేశారు" అన్నారు. అప్పటికప్పుడు ఆయన తన ఇంటి సామగ్రిని, భార్యాపిల్లల్ని తీసుకొని తోటలో నుంచి బయటికి వచ్చేశారు. మనం గనక అప్పుడా దానశీలుడ్ని చూస్తే 600 చెట్లకు బదులు 600 కోట్ల రూపాయలు ఆర్జించానన్న ధీమా ఆయన ముఖవర్చస్సులో తప్పక గమనించగలం.

అదేవిధంగా ఖుర్బానీ అంటే పశువుని జిబహ్ చేసి (కోసి) దాని రక్తమాంసాల్ని దేవునికి సమర్పించడం కాదని ఖుర్‌ఆన్ స్పష్టం చేస్తోంది:

"దేవుని దగ్గరకు వాటి రక్తమాంసాలు చేరవు. మీ భయభక్తులే ఆయన దగ్గరకు చేరుకుంటాయి. మీకు సన్మార్గం చూపినందుకు కృతజ్ఞతగా తనను స్తుతించడానికే దేవుడు ఈ పశువుల్ని మీ అదుపులో ఉంచాడు. ప్రవక్తా! సజ్జనులకు శుభవార్త అందజేయి." (ఖుర్‌ఆన్-22:37)

మనిషి త్యాగాలు చేయడానికి బలమైన ప్రేరకాలు కావాలి. సాధారణంగా పదార్థ పూజారులకు సిరిసంపదలు, పేరుప్రతిష్ఠలు, పదవీహోదాలే ప్రేరకాలు. కాని దేవుడ్ని, ఆయన ప్రవక్త (సల్లం)ను దృఢంగా విశ్వసించే ముస్లింలకు దైవప్రసన్నత, పరలోక సాఫల్యాలే అన్నిటి కంటే బలమైన ప్రేరకాలు. ఈ ప్రేరకాల ముందు ప్రపంచంలోని ఎలాంటి భయప్రలోభాలయినా సరే బలదూర్. ఇస్లాంలో ప్రాపంచిక ప్రేరకాల కంటే పారలౌకిక ప్రేరకాలే ఎంతో శక్తిమంతమైనవి.

## సహన త్యాగాలు

పూర్వం మక్కాలో ముస్లింలకు, ఇస్లామీయ ఉద్యమానికి అవిశ్వాసుల నుండి తీవ్రమైన ప్రతిఘటన ఎదురయింది. అవిశ్వాసులు ముస్లింలను అనేక విధాలుగా వేధిస్తూ వారి జీవితాలను దుర్భరం చేశారు. ఈ పరిస్థితిని గురించి ప్రస్తావిస్తూ హజ్రత్ ఖబ్బాబ్ బిన్ అరత్ (రజి) ఇలా అన్నారు:

"మేము బహుదైవారాధకుల వేధింపులతో విసిగిపోయాం. ఆ కాలంలో ఓరోజు నేను దైవప్రవక్త (సల్లం)ను కాబాగోడ నీడన కూర్చొని ఉండటం చూసి, ఆయన దగ్గరికెళ్ళి 'దైవప్రవక్తా! మా కోసం దైవాన్ని ప్రార్థించరా?' అని విన్నవించాను. ఈ మాట వినగానే ఆయన ముఖం కోపంతో జేవురించింది. ఆయన ఇలా అన్నారు: 'మీకు పూర్వం ఉండిన విశ్వాసులపై మీకంటే ఎంతో ఘోరమైన కష్టాలు వచ్చి పడ్డాయి. వారిలో ఒకడ్ని నేలపై గుంటత్రవ్వి అందులో కూర్చోబెట్టి అతని తల మీద రంపం పెట్టి చీల్చివేయడం జరిగింది. మరొకడ్ని ఇస్లాం నుండి మరల్చడానికి అతని కీళ్ళలోకి ఇనుప దువ్వెనలు గుచ్చి లాగేశారు. దైవసాక్షి! ఈపని ఎట్టి పరిస్థితిలోనూ నెరవేరుతుంది. చివరికి ఒక మనిషి ఒంటరిగా సనా నుండి హజ్రెమౌత్ వరకు నిర్భయంగా ప్రయాణం చేస్తాడు. అప్పుడతనికి దైవభయం తప్ప మరెవరి భయమూ ఉండదు." (బుఖారి)

ధర్మసంస్థాపన కోసం త్యాగం చేయడం అన్ని మతాల్లోనూ ఉంది. అయితే ఇస్లాం, కుఫర్ (సత్యతిరస్కారం)ల మధ్య సంఘర్షణ చెలరేగి ఇస్లాంపై కుఫర్ ఆధిక్యత పొందే ప్రమాదకర పరిస్థితి ఏర్పడినప్పుడు ధనప్రాణాల త్యాగం ముస్లింలకు అనివార్యమవుతుంది. ఇదే పరిస్థితి తబూక్ దండయాత్రలో ఏర్పడినప్పుడు ధర్మరక్షణ కోసం ఆనాడు ప్రవక్త అనుచరులు అసామాన్య త్యాగాలు చేశారు. ఇదివరకెన్నడూ ఇవ్వనంతటి భూరివిరాళాలు కూడా ఇచ్చారు.

## ధర్మసంస్థాపన కోసం ధనత్యాగాలు

ఆనాడు ఇస్లాంకు రోమ్ రాజ్యం నుండి తీవ్రమైన ప్రమాదం ముంచుకొచ్చింది. అప్పుడు ముస్లింలు దైవప్రవక్త (స) వెంట బయలుదేరి శత్రువుల్ని ఎదుర్కోవడానికి సిద్ధమయ్యారు. వారు ధన ప్రాణాలు త్యాగం చేయవలసిన సమయం వచ్చింది. అది ఎండలు నిప్పులు కురిపిస్తుండిన నడిఎండకాలం. వందలమైళ్ళ సుదీర్ఘప్రయాణం, అత్యంత కఠినమార్గం. చాలీచాలని ఒనరులు. మరోవైపు కపటవిశ్వాసులు రకరకాల కుట్రలతో పక్కలో బల్లెమయి కూర్చున్నారు. ఇలాంటి పరిస్థితిలో రోమ్‌రాజ్యంతో తల పడటమంటే మృత్యుకుహరంలోకి వెళ్తున్నట్లేనని అవిశ్వాసులంతా భావించారు.

దైవప్రవక్త (సల్లం) చేసిన యుద్ధ ప్రకటన వినగానే ముస్లింలు యుద్ధసన్నాహాలు ప్రారంభించారు. ఈ భారీ దండయాత్ర కోసం అపారమైన ఆయుధాలు, ఆహార పదార్థాలు కావాలి. అంచేత ఆయన ధన, కనక, వస్తు త్యాగాల కోసం ప్రజలను



ప్రేరేపించారు. అప్పుడు అనుచరులు ఎంతో ఉత్సాహంతో తమతమ స్తోమతను బట్టి విరాళాలు తెచ్చివ్వసాగారు. కొందరు ఈ క్లిష్ట పరిస్థితిలో ధర్మసంస్థాపన కోసం తమ సర్వస్వం త్యాగం చెయ్యాలన్న వీరావేశంతో తమ శక్తికి మించిన విరాళాలు కూడా ఇవ్వడానికి ముందుకు వచ్చారు.

హజ్రత్ ఉస్మాన్ (రజి) వేయి దీనార్‌ల విలువగల వస్తువులు అందజేశారు. ఆయన ధనికులైనప్పటికీ ఈ విరాళం ఆ కాలంలో చాలా ఎక్కువే.

హజ్రత్ ఉమర్ (రజి) ధనత్యాగం విషయంలో అబూబకర్ (రజి)ని మించి పోవాలని నిర్ణయించుకొని తన యావదాస్తిలో అర్ధభాగం తీసుకొని వచ్చారు. దైవప్రవక్త (సల్లం) అది చూసి "భార్యాపిల్లల కోసం ఏమైనా మిగిల్చిపెట్టావా లేదా?" అని అడిగారు. దానికి హజ్రత్ ఉమర్ "వాళ్ళ కోసం సగం వదలిపెట్టాను" అన్నారు.

ఆ తరువాత హజ్రత్ అబూబకర్ (రజి) ఇంట్లో ఉన్నదంతా ఊడ్చి తెచ్చి దైవప్రవక్త పాదాల చెంత పోశారు. ఈ అసాధారణ దాతృత్వం చూసి ఆయన అబ్బురపడుతూ "అబూబకర్! ఉన్నదంతా తెచ్చినట్లుంది. మరి ఇంట్లో భార్యాపిల్లల కోసం ఏం వదలి పెట్టావు?" అని అడిగారు ఆయన.

"భార్యాపిల్లల కోసం దేవుడు, దైవప్రవక్త చాలు" అన్నారు అబూబకర్ (రజి).

ఇది ధనికుల పరిస్థితి. మరి మధ్యతరగతి ప్రజల పరిస్థితి ? వాళ్ళు కూడా ఈ మహాకార్యం కోసం తమకున్న దాంట్లోనే అత్యధికంగా విరాళాలు అందజేశారు. పేద వాళ్ళు కూడా తమ సంపాదనలో అంతోఇంతో తెచ్చి విరాళాలగుట్టలో పెట్టేశారు.

పాపం అబూఖలీల్ (రజి) దగ్గర విరాళం ఇవ్వడానికి ఏమీ లేదు. ఆయన కూలినాలి చేసి బ్రతికే నిరుపేద శ్రమజీవి. ఒక్కోరోజు ఆ కూలిపని కూడా దొరికేది కాదు. అప్పుడాయన కుటుంబం పస్తులుండవలసి వచ్చేది.

అయితే దైవప్రవక్త (సల్లం) ప్రకటన వినగానే అబూఖలీల్ (రజి) ఓ తోట యజమాని దగ్గరికెళ్ళి చెట్లకు నీళ్ళు తోడిపోస్తానని చెబితే అతను ఒప్పుకున్నాడు. ఆరోజు అబూఖలీల్ (రజి) ఇషానమాజ్ తరువాత తోటకెళ్ళి రాత్రి తెల్లవారేదాకా బావి నుంచి నీళ్ళు తోడారు.

ఇంత కష్టపడితే యజమాని కూలి క్రింద ఆయనకు నాలుగుసేర్లు ఖర్జూర పండ్లు ఇచ్చాడు. అబూఖలీల్ (రజి) వాటిని తీసుకొని ఇంటికి వచ్చారు.

ఆ ఖర్జూర పండ్లలో సగం భార్యాపిల్లల కోసం వదలిపెట్టి మిగతా సగం మూట కట్టుకొని ఆయన దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వెళ్ళారు. కాని జనం పెద్దపెద్ద విరాళాలు ఇస్తుంటే తాను ఈ చిన్నవిరాళం ఇవ్వాల్సి వస్తున్నదే అని భావించి సిగ్గుపడి పోతున్నారు. అందువల్ల ఆయన ఓ క్షణం అటూ ఇటూ చూసి ఆ పండ్లమూటను విరాళాల కుప్పలో ఎక్కడో అడుగుభాగాన పెట్టేశారు సిగ్గుపడుతూనే.

కాని దైవప్రవక్త (సల్లం) అది గమనించారు. వెంటనే ఆయన ఆ పండ్ల మూటను అక్కడ్నుంచి తీసి విరాళాల కుప్పలో అన్నిటికన్నా పైభాగాన పెట్టేశారు. అబూఖలీల్ (రజి) అది చూసి ఎంతో సంతోషించారు.

కొందరు ముస్లింలు ఈ దండయాత్రకు కావలసిన ఏర్పాట్లన్నీ స్వయంగానే సిద్ధం చేసుకున్నారు. ఇంకాస్త శక్తి కల్గినవారు స్వంత ఏర్పాట్లు చేసుకోవడమేగాక, ఇతరుల కోసమని కొన్ని వస్తువుల్ని కూడా దైవప్రవక్త (స) ముందు ప్రవేశపెట్టారు.

పోతే పేదవాళ్ళు మాత్రం తమకు కావలసిన యుద్ధావసరాలను సమకూర్చుకోలేక పోయారు. వారు దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి తమకోసం ఏదైనా ఏర్పాట్లు చేయమని మనవి చేసుకున్నారు. దైవప్రవక్త (సల్లం) అలా సాధ్యమైనంతవరకు అనేకమందికి ఏర్పాట్లు చేశారు. మిగిలినవారికి ఆయన తన అసహాయత వ్యక్తపరిచారు. ధర్మ యుద్ధంలో పాల్గొనాలని ఎంతో ఉత్సాహంతో వచ్చిన వీరు, దైవప్రవక్త (సల్లం) తన అసహాయత వెలిబుచ్చడంతో ఢీలాపడి పోయారు. ధర్మయుద్ధం చేసే భాగ్యానికి తాము నోచుకోలేక పోతున్నామేనని కంటతడి పెట్టుకున్నారు. చివరికి క్రుంగిన హృదయాలతో, వాడిన ముఖాలతో వెనుదిరిగి పోయారు.

“అలాగే నీ దగ్గరకు వచ్చి వాహన సౌకర్యం కల్పించమని మనవి చేసుకున్నవారి విషయంలో కూడా ఎలాంటి ఆక్షేపణ లేదు. వారి విజ్ఞప్తికి సమాధానంగా “మీకు నేను వాహన సౌకర్యాలు కల్పించలేను” అన్నావు నీవు. అప్పుడు వారు గత్యంతరంలేక అశ్రు పూరిత నయనాలతో వెళ్ళిపోయారు. సొంత ఒనరులతో ధర్మపోరాటంలో పాల్గొనే భాగ్యం తమకు లేకపోయిందే అని వారు ఎంతగానో బాధపడ్డారు.” (ఖుర్ఆన్–9:92)

మరి ఈనాటి ముస్లింల పరిస్థితి ఏమిటీ? ప్రపంచంలో వారి జనాభా శత కోట్లు దాటినా, ఇస్లాం నామమాత్రంగానే ఉంది. దైవధర్మం, ముఖ్యంగా సామూహిక జీవన రంగానికి సంబంధించిన విభాగం చరిత్రపుటల్లోనే ఉండిపోయింది. ఇప్పుడు ముస్లిం ల వ్యక్తిగత జీవితం కూడా కొన్ని ఆరాధనలు, ఆచారాలకు పరిమితమైపోయింది.

దైవధర్మాన్ని చరిత్ర పుటల నుంచి దైనందిన జీవితంలోకి తీసుకురావడానికి ముస్లింలు చేస్తున్న త్యాగాలేమిటి? త్యాగోత్సవంనాడు పశువుల్ని జిబా చేసి చేతులు దులుపుకోవడమేనే? సామాజిక రంగంలో అన్యాయం, అత్యాచారం, అశ్లీలతలు యదేచ్ఛంగా కొనసాగుతున్నా, ఆర్థిక రంగంలో వడ్డీ, జూదం, అవినీతి, అక్రమ వ్యాపారాలు పాముపుట్టల్లా పెరిగిపోతున్నా, రాజకీయ రంగంలో నీతిరాహిత్యం, నిరంకుశత్వాలు స్వైరవిహారం చేస్తున్నా వారికి చీమ కుట్టినట్లయినా లేదు.

ఒకవేళ ఎవరైనా అన్ని రంగాల్లో ధర్మసంస్థాపన జరగాలని కోరుతున్నా వారి బ్యాంకు బ్యాలెన్సులు తరగకూడదు; వారి శరీరాలు కందిపోకూడదు; వారి ఉద్యోగ వాణిజ్యాలకు ముప్పు రాకూడదు; భార్యాపిల్లలకు కొన్నాళ్ళు కూడా దూరం కాకూడదు. ఇదీ నేటి ముస్లింలు ప్రతియేడూ ‘ఖుర్బానీ’ ద్వారా వ్యక్తపరుస్తున్న త్యాగశీలత!



ఇలాంటి ఆనవాయితీ ఖుర్బానీ దైవధర్మానికి ఎలాంటి ప్రయోజనం చేకూర్చదు. దాని వల్ల పరలోకంలో వారికి దక్కేది ఖుర్బానీ పశువుల రక్తమాంసాలే!!

“దైవమార్గంలో (సంపద) ఖర్చు పెట్టండి. చేజేతులా నాశనం కొనితెచ్చుకోకండి. సత్కార్యాలు చేస్తూవుండండి. సత్కార్యాలు చేసేవారిని దేవుడు తప్పకుండా ప్రేమిస్తాడు.” (దివ్యఖుర్ఆన్–2:195)

## 51. ధర్మసంస్థాపనా బాధ్యత

ఇంతకూ త్యాగాలు ముస్లింలు ఏ ఘనకార్యాల కోసం చేయాలి? ధర్మప్రచారం కోసం, ధర్మసంస్థాపన కోసం త్యాగాలు చేయవలసి ఉంటుంది. ధర్మ సంస్థాపనే ముస్లింల జీవితాశయం. అదే వారి అంతిమలక్ష్యం.

హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) దైవప్రవక్తగా ప్రజల ముందుకు వచ్చి మొట్టమొదట ఏకదైవారాధనా నినాదం ఇచ్చారు. మానవుని సమస్త జీవితరంగాల్లో ఏక దైవారాధనా విశ్వాసం ద్యోతకమవ్వాలి. అది దైవధర్మం పూర్తిగా స్థాపన జరిగినప్పుడే సాధ్యమవు తుంది. ధర్మసంస్థాపన కోసం హజ్రత్ ఇబ్రాహీం (అలై) అనేక కష్టాలు ఎదుర్కోవలసి వచ్చింది; మరెన్నో సమస్యలను అధిగమించవలసి వచ్చింది.

ధర్మసంస్థాపనా బాధ్యత కేవలం దైవప్రవక్తల మీదనే లేదు, దైవప్రవక్తల అనుచరులపై కూడా ఉంది. ముఖ్యంగా ప్రవక్తల తదనంతరం వారి అనుయాయు లపై ఈ బాధ్యత మరింత ఎక్కువగా ఉంటుంది. కనుక దైవప్రవక్తల అనుచరులైన ముస్లింలలో ఈ బాధ్యతాభావం ఎల్లప్పుడూ జాగృతమయివుండాలి. ఏకదైవారాధనతో కూడిన ధర్మప్రచారం, ధర్మవ్యాప్తి వారి జీవిత ప్రధానాశయంగా ఉండాలి. ప్రపంచ ముస్లిములందరికి ‘కాబా’ ఇస్తున్న సందేశం కూడా ఇదే.

“విశ్వాసులారా! ఇకనుండి ప్రపంచ మానవులకు మార్గదర్శనం చేస్తూ వారిని సంస్కరించడానికి రంగంలోకి తీసుకురాబడిన శ్రేష్ఠసమాజం మీరే. మీరు మంచి పనులు చేయమని ప్రజలను ఆదేశిస్తారు. చెడుల నుండి వారిస్తారు. దేవుడ్ని ప్రగాఢంగా విశ్వసిస్తారు.” (ఖుర్ఆన్–3:110)

ఖుర్ఆన్ ప్రజలలో దైవభీతి, పరలోకచింతన జనింపజేసి తద్వారా వారిని నీతి మంతులుగా, సత్ప్రవర్తకులుగా తీర్చి దిద్దగోరుతోంది. అంధవిశ్వాసాలు, దురాచారాలతో సహా ప్రపంచంలోని వివిధ చెడుల్ని నిర్మూలించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నెల కొల్పదలచింది. ఈ లక్ష్యం కోసం ఖుర్ఆన్ ముస్లింలపై మంచిని పెంచే, చెడును త్రుంచే పని నిర్బంధం చేసింది. దీనికోసం ముస్లింలలో ఒక వర్గం వ్యవస్థీకృత సంఘంగా ఏర్పడాల్సిన ఆవశ్యకత ఉందని నొక్కి చెబుతోంది.

ఈ ఆశయం దృష్ట్యానే దైవప్రవక్త (సల్లం) కాలంలో, ఆ తర్వాత సద్వర్తనులైన ఖలీఫాల కాలంలో ముస్లింలు ధర్మసంస్థాపన కోసం తమ సర్వస్వాన్ని ధారపోసి కృషి

చేశారు. సమాజంలో ఏ కొద్ది చెడు కన్పించినా వారు ప్రశాంతంగా నిద్రపోయేవారు కాదు. ప్రజలలో దైవభీతి కలిగిస్తూ వారిని దుష్కార్యాలకు దూరంగా ఉంచడానికి ప్రయత్నించేవారు. తత్ఫలితంగా ఆనాడు సమాజంలో సర్వత్రా నీతి, న్యాయం, సౌశీల్యం, సౌభ్రాత్రతలు వెల్లివిరిశాయి. భక్తిపరాయణత, బాధ్యతాభావం, పరస్పర గౌరవాభిమానాలు ఎల్లడెల్లడలా విస్తరించాయి.

అదొక స్వర్ణయుగం. ముస్లిమేతర మేధావులు సైతం కీర్తించిన కాంతి యుగం. కాని ఆ యుగం అంతరించింది. ఆ కాంతి కనుమరుగయి పోయింది. ఈనాడు ప్రపంచంలో అవినీతి, అన్యాయం. అశ్లీలం, అత్యాచారాలు సర్వసామాన్యమయి పోయాయి. ప్రజల వ్యక్తిగత జీవితాల్లోనేగాక వారి సామూహికజీవితాల్లో కూడా ఈ చెడులు చేరాయి. చివరికి రాజకీయ వ్యవహారాలు, చట్టసభలు సయితం వివిధ చెడులతో దుర్గంధ భూయిష్టమయి పోయాయి.

అంతకంటే విచారకరమైన విషయం- ధర్మసంస్థాపనా బాధ్యత నిర్వహించ వలసిన ముస్లిం సమాజం కూడా ఈ చెడులలో కూరుకుపోయింది. ఇలాంటి పరిస్థితిలో ధార్మిక, సామాజిక స్పృహ వున్న ముస్లింలపై **చెడును త్రుంచే, మంచిని పెంచే బాధ్యత** మరింత అధికమయింది. ఈ పనిని గనగ నిర్వహించకపోతే సమాజ పతానానికి దేవుని సమక్షంలో ప్రధాన బాధ్యులు వారే అవుతారు.

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఈ విషయాన్ని ఓ తార్కాణం ద్వారా ఈ విధంగా వివరించారు:

“దేవుడు, ఒక ఊరిని ఆ ఊరిప్రజలతో సహా తల్లక్రిందులు చేయమని జిబ్రీల్ (అలైహి)ని ఆజ్ఞాపించాడు. హజ్రత్ జిబ్రీల్ (అలైహి) ఆ ఊరిని చూసివచ్చి ‘ప్రభూ! అక్కడ ఒక్కక్షణం కూడా నీకు అవిధేయత చూపని నీదాసుడు కూడా ఒకడున్నాడు కదా (నేనెలా ఆ ఊరిని శిక్షించను)?’ అని అన్నారు. ‘కాని నా ధర్మం అగౌరవం, అపచారాలకు గురవుతుంటే అతని ముఖం ఏనాడూ (ఆగ్రహంతో కాస్తయినా) జేవురించలేదు. కనుక ఇతరులతో పాటు అతడ్ని కూడా కలిపి మొత్తం ఊరిని తల్లక్రిందులు చేసెయ్యి’ అని దేవుడు మళ్ళీ ఆదేశించాడు.” (మిష్కాత్)

సమాజమంతా భ్రష్టుపట్టి పోయినప్పుడు, దాన్ని సంస్కరించే ప్రయత్నం చేయ కుండా కేవలం వ్యక్తిగత సత్కార్యాలు చేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని ఈ హదీసు వివరిస్తోంది. అంతేకాదు, అలాంటి సమాజంపై విరుచుకుపడే దైవశిక్ష నుండి వ్యక్తిగత సత్కార్యాలతో తృప్తిపడే ముస్లింలు కూడా తప్పించుకోలేరని ప్రస్ఫుటం చేస్తోంది.

నైతికంగా పతనం చెందిన సమాజంలో మనిషి వ్యక్తిగత సత్కార్యాల్లో కూడా ఎంతోకాలం స్థిరంగా ఉండలేడు. చుట్టూ స్వైరవిహారం చేసే చెడుగులు క్రమేణా అతడ్ని కూడా తమలో ఇముడ్చుకుంటాయి. ఏమైనప్పటికీ దేవుడు మానవుల నుండి



వారి వ్యక్తిగత సదాచరణను మాత్రమే కోరడంలేదు. ఆయన కోరుతున్న అసలు విషయం- సంఘసంస్కరణకై నిరంతర కృషి, ధర్మసంస్థాపనకై ఎడతెగని పోరాటం. ఇలా చేస్తున్నప్పుడే ముస్లిం సమాజం శ్రేష్ఠసమాజం అనబడుతుంది.

దైవప్రవక్త (స) సంఘసంస్కరణ గురించి పలికిన ఈ పలుకులు చూడండి:

“నాప్రాణం ఏ శక్తిస్వరూపుని అధీనంలో ఉందో ఆ దేవుని సాక్షి! మీరు (ప్రజలను) సత్కార్యాలు చేయమని ఆదేశించే, దుష్కార్యాల నుంచి వారించే పనైనా చేయాలి. లేదా దేవుడు మీపై శిక్షనయినా దించుతాడు. అప్పుడు మీరు ఎంత మొర పెట్టుకున్నా ఆయన మీ మొరలు ఆలకించడు.” (మిష్కాత్)

“ఏ జాతిలో చెడులు ప్రబలుతాయో ఆ జాతిలో ఉండే సంస్కరణా సామర్థ్యం కలవారు దాన్ని సంస్కరించకపోతే దేవుడు ఆ జాతిపై ఏదయినా శిక్ష దించే సమయం ఆసన్నమయిందని వారు తెలుసుకోవాలి.” (మిష్కాత్)

ఈ రెండు హదీసులు సమాజ సంస్కరణ ఆవశ్యకతను మరింత నొక్కి చెబుతున్నాయి. సమాజ సంస్కరణ ధర్మసంస్థాపనా బాధ్యతలోని భాగమే. కనుక ముస్లింలు సమాజంలో ప్రబలిపోతున్న చెడుల్ని చూస్తూ చేతులు ముడుచుకొని కూర్చోవడానికి వీల్లేదు.

వారు ఎల్లప్పుడూ ప్రజలలకు దైవసందేశం అందజేస్తూ సంఘ సంస్కరణ పనులలో నిమగ్నులై ఉండాలి. వారు తమ పొరుగున ఉండే, తమతో కలసి పనిచేసే, ప్రాపంచిక వ్యవహారాల్లో తమకు తారసపడే ముస్లిమేతరులక్కూడా దైవ సందేశం అందజేయాలి. అలా చేయకపోతే మరణానంతరం దైవన్యాయస్థానంలో ఈ ముస్లిమేతరులే వారిపై అభియోగం మోపుతారు. అప్పుడు విశ్వప్రభువు ముస్లిమేతరు లను వదలి ప్రచారబాధ్యత విస్మరించిన ముస్లింలను నిలదీసే ప్రమాదముంది. ఈ విషయాన్ని వారు ఎల్లప్పుడూ దృష్టిలో పెట్టుకోవాలి.

ఇదే ముస్లిం సముదాయం (ఉమ్మెతె ముస్లిమా) అసలు ధ్యేయం. ఇదే హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) దైవప్రవక్తగా చేపట్టిన మిషన్ లక్ష్యం. ఇదే అంతర్జాతీయ ప్రబోధనా కేంద్రమయిన కాబా ప్రతిష్ఠాలయం ముస్లింలకు ఇస్తున్న సందేశం. ఈ సందేశాన్ని ఆచరణలో పెట్టేందుకే నమాజ్, రోజా, జకాత్‌లతో పాటు హజ్ కూడా ముస్లింలకు కావలసిన శిక్షణ ఇస్తోంది.

## 52. పాప పరిహారం

హజ్‌యాత్రకు వెళ్ళేవారు దేవుడు నిషేధించిన పనులను తెలిసి చేసినా, తెలియక చేసినా, పొరపాటున చేసినా పాపపరిహాం చెల్లించవలసి ఉంటుంది.

☯ ఇహ్రాం పూనకుండా ఎవరైనా ప్రతిష్ఠాలయం (హరం) సరిహద్దులలో ప్రవే శించడం జరిగితే అలాంటివ్యక్తి ఒక పశువుని ఖుర్బానీ ఇవ్వడం విధి (వాజిబ్).

☯ హాజీ “హరం” సరిహద్దుల బయట క్షవరం చేయించుకుంటే దానికి కూడా పరిహారంగా ఒక పశువుని ఖుర్బానీ ఇవ్వడం విధి (వాజిబ్).

☯ పురుషుడు గాఢమైన సువాసన తలకు రాసుకుంటే, ఆ సువాసన ఒకరాత్రి, ఒకపగలు ఉంటే దానికి అతను రెండు పశువుల్ని ఖుర్బానీ (బలి) ఇవ్వడం విధి (వాజిబ్) అవుతుంది. స్త్రీ అయితే ఒక పశువును ఖుర్బానీ ఇస్తే సరిపోతుంది. గాఢమైన సువాసన పూసుకుంటే, అది కొద్దిసేపు ఉన్నాసరే ఒక పశువును ఖుర్బానీ ఇవ్వడం విధి (వాజిబ్) అవుతుంది.

☯ సంభోగం లేక స్వప్నస్ఖలనంతో కూడిన అశుద్ధావస్థలో కాబాప్రదక్షిణ చేస్తే, ఒక ఖుర్బానీ ఇవ్వడం విధి (వాజిబ్) అవుతుంది. ఉజూలేని అశుద్ధావస్థలో ఐచ్ఛిక ప్రదక్షిణ చేస్తే ఒక సదఖా (ఫిత్రాఅంత) దానం చేయడం విధి (వాజిబ్) అవుతుంది.

☯ ఇహ్రాంలో ఉన్నప్పుడు తలపై ఆచ్ఛాదన ఉండకూడదు. ఒకవేళ తలపై కొన్ని గంటల పాటు వస్త్రం కప్పుకుంటే, లేదా టోపీ పెట్టుకుంటే ఒక సదఖా (అంటే ఫిత్రాఅంత) దానం చేయడం విధి (వాజిబ్) అవుతుంది.

☯ విధి (వాజిబ్)గా పాటించాల్సిన హజ్ నియమాలలో దేన్నయినా కారణం లేకుండా వదిలేస్తే ఒక ఖుర్బానీ ఇవ్వడం విధి (వాజిబ్) అవుతుంది. ఏదైనా బలమైన కారణం ఉండి వదిలేస్తే ఖుర్బానీగాని, సదఖాగాని ఏదీ ఇవ్వనవసరం లేదు.

☯ హాజీ ప్రతిష్ఠాలయం (హరం) సరిహద్దులలోపల జంతువును వేటాడితే అతను ఒక మేకనో, పొటేలునో బలివ్వడం విధి (వాజిబ్) అవుతుంది. వేటాడేవారికి ఆ పనిలో సహకరించడం కూడా నిషిద్ధమే.

“విశ్వాసులారా! మీరు హజ్‌దీక్ష (ఇహ్రాం)లో ఉన్నప్పుడు వేటాడకండి. ఒకవేళ ఎవరైనా కావాలని ఇలా చేస్తే అతను తాను వేటాడిన జంతువుకు సమానమైన మరో జంతువును సమర్పించి మొక్కుబడి చెల్లించవలసి ఉంటుంది. దీన్ని గురించి మీలో ఇద్దరు నిజాయితీపరులు నిర్ణయం తీసుకోవాలి. తరువాత ఈ (బలిపశువు) కానుకను కాబాగృహానికి చేర్చాలి. అలాంటి మొక్కుబడి చెల్లించే స్తోమత లేనివారు తమపాపానికి నిష్కృతిగా కొందరు పేదలకు అన్నదానం చేయాలి. లేదా దానికి సమానమయిన ఉపవాసాలు పాటించాలి. ఈవిధంగా వారు తాముచేసిన నేరానికి శిక్ష అనుభవించాలి. గతంలో చేసిన దాన్ని దేవుడు క్షమిస్తాడు. అయితే మళ్ళీ అలాంటి పనికి పాల్పడితే మాత్రం దేవుడు దానికి ప్రతీకారం చేస్తాడని తెలుసుకోండి. దేవుడు సర్వశక్తిమంతుడు, ప్రతీకారం చేయగల సమర్థుడు కూడా.” (ఖుర్ఆన్–5:95)

ఈ నిషేధం నేల మీద వేటాడబడే జంతువులకు, ఆకాశంలో ఎగిరే పక్షులకు మాత్రమే వర్తిస్తుంది. సముద్రం, నదులు, సరస్సులలో వేటాడబడే ప్రాణులకు వర్తించదు. హరం పరిధిలో జలచరాలను వేటాడవచ్చు.



“దేవుడు మీకు సముద్ర జీవాలను వేటాడటాన్ని, వాటిని తినడాన్ని ధర్మసమ్మతం చేశాడు. దానివల్ల మీకూ, తోటి ప్రయాణీకులకూ ప్రయోజనం ఉంది. అయితే మీరు ఇహ్రాం (దీక్ష)లో ఉన్నంతవరకు నేలపై వేటాడకూడదు. కనుక మీరు దేవునికి భయపడండి. ఆయన మిమ్మల్నందరినీ (తీర్పుదినాన) సమీకరించి తనముందు సమావేశ పరచుకుంటాడు.” (ఖుర్ఆన్–5:96)

☯ ఇహ్రాం (దీక్ష) పూనిన తరువాత హజ్‌యాత్రలో ఏదైనా అవరోధం ఏర్పడితే ఒక మేకనో, పొటేలునో కొని ప్రతిష్ఠాలయం దగ్గరకు పంపి ఖుర్బానీ చేయించాలి. ఇది విధి(వాజిబ్). ఆ తర్వాతే దీక్ష విరమించవలసి ఉంటుంది. ఆ ఖుర్బానీ మాంసం తాను తినకుండా మొత్తం పేదలకు దానం చేయాలి.

“దైవప్రసన్నత కోసం హజ్‌యాత్ర చేయండి. ఉమ్రా ఆచారం కూడా పాటించండి. మార్గమధ్యలో మీకేదైనా అవరోధం ఎదురైతే, మీకు అందుబాటులో ఉన్న బలిదానాన్నే దేవునికి సమర్పించుకోండి. అయితే బలి (పశువు) దానం, దాని స్థానానికి చేరుకోనంత వరకు మీరు శిరోముండనం చేయించుకోకండి. ఒకవేళ మీలో ఎవరైనా వ్యాధిగ్రస్తులయితే లేదా శిరోబాధకు లోనయి (బలిపశువు నిర్ణీతస్థలానికి చేరుకోకముందే) శిరోముండనం చేయించుకో వలసివస్తే అలాంటివారు దానికి పరిహారంగా ఉపవాస వ్రతం పాటించాలి; లేదా దానధర్మాలు చేయాలి; లేదా ఖుర్బాని (పశుబలి) ఇవ్వాలి.” (ఖుర్ఆన్–2:196)

“తర్వాత (ఆ అవరోధం తొలగిపోయి లేదా) ప్రశాంత పరిస్థితి ఏర్పడినప్పుడు మీలో ఎవరైనా హజ్ దినాలు రాకముందే యాత్రాస్థలానికి చేరుకొని ఉమ్రా ఆచారం పాటిస్తే, అలాంటివారు తమ స్తోమతను బట్టి బలిదానం ఇవ్వాలి. బలిదానం ఇవ్వలేని వారు హజ్ కాలంలో మూడురోజులు, ఇంటికి తిరిగొచ్చిన తరువాత ఏడురోజులు చొప్పున మొత్తం పదిరోజులు ఉపవాసం పాటించాలి. ప్రతిష్ఠాలయం (మస్జిదుల్‌హరాం) సమీపంలో ఇల్లూ వాకిలి లేనివారికి మాత్రమే ఈ సౌలభ్యం వర్తిస్తుంది. దేవుని పట్ల భయభక్తులు కలిగి ఉండండి. ఆయన (ఆజ్ఞోల్లంఘనకు పాల్పడేవారిని) కఠినంగా శిక్షిస్తాడని గుర్తుంచుకోండి.” (ఖుర్ఆన్–2:196)

అజ్ఞానకాలంలో అరబ్బులు ఒకసారి చేసే ప్రయాణంలో హజ్, ఉమ్రా రెండు విధులూ నెరవేర్చడాన్ని ఘోరపాపంగా భావించేవారు. ఈ రెండిని నెరవేర్చడానికి విడివిడిగా రెండుసార్లు ప్రయాణం చేయవలసి ఉంటుందని వారి అభిప్రాయం. ఖుర్ఆన్ ఈ దురభిప్రాయాన్ని ఖండిస్తూ సుదూరప్రాంతాల నుంచి వచ్చేవారు ఆ ఒక్క ప్రయాణంలోనే ఈ రెండు విధులు (ఒకదాని తరువాత ఒకటి) నెరవేర్చవచ్చని తెలిపింది. కాకపోతే మక్కా చుట్టు పక్కల ‘మీఖాత్’ సరిహద్దుల్లోపల నివసించేవారు మటుకు హజ్, ఉమ్రాలు నెరవేర్చడానికి విడివిడిగా రెండు సార్లు ప్రయాణం చేయవలసి ఉంటుంది.

“సఫా, మర్వా (కొండ)లు (కూడా) దేవుని సూచనలే. కనుక ఆ రెండు కొండల మధ్య తిరగడంలో ఎలాంటి తప్పులేదు. (అది పుణ్యకార్యం.) పుణ్యకార్యం చేసేవారిని దేవుడు (తప్పక) ఆదరిస్తాడు. ఆయన సమస్తం తెలిసినవాడు.” (ఖుర్ఆన్–2:158)

సఫా, మర్వాలు ప్రతిష్ఠాలయం (మస్జిదుల్‌హరాం) సమీపంలో ఉండే కొండల పేర్లు. హజ్ సందర్భంలో ఈ రెండు కొండల మధ్య ‘సయీ’ (తిరిగే, పరుగెత్తే) పని ఇబ్రాహీం ప్రవక్త (అలైహి) నేర్పిన హజ్ నియమాల్లోని ఒక నియమం. కాని ఆయన తదనంతరం మక్కాలో, దాని చుట్టుపట్ల ప్రాంతాల్లో బహుదైవారాధన వ్యాపించి నప్పుడు ఆనాటి అరబ్బులు సఫా కొండపై ‘ఇసాఫ్’ అనే దేవతావిగ్రహాన్ని, మర్వా కొండపై ‘నాయిలా’ అనే దేవతా విగ్రహాన్ని ప్రతిష్ఠించుకొని వాటి చుట్టు ప్రదక్షిణ చేయడం మొదలెట్టారు. ఆతర్వాత అంతిమ దైవప్రవక్త (స) ద్వారా అరబ్బులు ఇస్లాం స్వీకరించి ఆయన నేర్పిన పద్ధతి ప్రకారం హజ్ నియమాలు పాటించసాగారు.

అయితే ఆనాడు మదీనా ముస్లింలు కొందరు ‘సయీ’ పని హజ్ నియమాల్లోని దేనా లేక బహుదైవారాధనా కాలంనాటి అవశేషమా, ఈ సయీ వల్ల తాము బహు దైవారాధనా చేష్టలకు పాల్పడినవారమవుతామా అన్న అనుమానాల్లో పడిపోయారు. మదీనా ప్రజలు మూఢకాలంలో మనాత్ దేవతను మాత్రమే విశ్వసించేవారు. మక్కా లోని ఇసాఫ్, నాయిలా దేవతలను నమ్మేవారు కాదు. అందువల్ల కాబాను “ఖిబ్లా”గా నిర్ణయించే సమయంలో సఫా, మర్వాలకు సంబంధించిన అపోహల్ని దూరం చేయ వలసిన అవసరం వచ్చింది. అందువల్ల సృష్టికర్త తన గ్రంథంలో ఈ సూక్తి (2:158) ద్వారా ‘సయీ’ నియమం హజ్ నియమాల్లోనిదేనని స్పష్టం చేశాడు.

“హజ్‌దినాలలో మీరు దేవుని అనుగ్రహం (ఉపాధి) అన్వేషించ దలచుకుంటే నిరభ్యంతరంగా అన్వేషించవచ్చు. అందులో ఎలాంటి తప్పులేదు. అరఫాత్ నుండి తిరిగివస్తూ మష్‌అరిల్ హరాం (ముజ్దల్ఫా)లో ఆగి అల్లాహ్‌ను ఆయన నేర్పిన విధంగా స్మరించండి. దీనికిపూర్వం మీరు దారితప్పి నడుస్తుండేవారు.” (ఖుర్ఆన్–2:198)

అజ్ఞానకాలంలో అరబ్బులు **హజ్ సీజన్‌లో జీవనోపాధి** కోసం కృషి చేయడాన్ని పాపంగా భావించేవారు. ఇది మూఢనమ్మకం మాత్రమే. వారిదృష్టిలో బ్రతుకు తెరువు కోసం కూలి, వ్యాపారం వగైరా పనులు చేసి సంపాదించడం అనేది ప్రాపంచిక కార్యం. హజ్‌లాంటి గొప్ప మతకార్యం నిర్వహిస్తున్నప్పుడు ప్రాపంచిక కార్యమైన జీవనోపాధి కోసం పాటుపడటం చాలా నీచమయిన పనని, పాపకార్యమని వారు భావిస్తుండేవారు.

ఖుర్ఆన్ ఈ మూఢనమ్మకాన్ని ఖండిస్తోంది. దైవభీతిపరుడయిన ఒక ముస్లిం దైవాదేశాలను గౌరవిస్తూ జీవనోపాధి కోసం కృషి చేస్తున్నాడంటే అతను తన ప్రభువు అనుగ్రహాన్ని అన్వేషిస్తున్నాడన్న మాట. ఏ ప్రాపంచిక కార్యమైనా, చివరికి బ్రతుకు తెరువు కోసం పాటుపడటమైనా సరే దైవాజ్ఞల పరిధిలో ఉండి చేస్తే అది ఏమాత్రం పాపకార్యం క్రిందికి రాదు. పైగా అది పుణ్యకార్యంగా పరిగణించబడుతుంది.



దైవప్రవక్త (సల్లం) అలాంటి ముస్లింను గురించి ప్రస్తావిస్తూ “నీతిమంతుడైన వ్యాపారి అంతిమ (ప్రళయ) దినాన దైవప్రవక్తల, సత్యసంధుల, అమరగతుల సహ చర్యంలో ఉంటాడు” అని ప్రవచించారు. (తిర్మిజి)

“ఆ తరువాత ప్రజలు ఏ స్థలం నుండి వెనక్కి మరలి వస్తారో మీరు కూడా అదే స్థలం నుండి వెనక్కి మరలండి. దేవుణ్ని క్షమాపణ కోరుకోండి. దేవుడే మీ పొరపాట్లను క్షమించేవాడు. ఆయన ఎంతో దయామయుడు. హజ్ నియమాలు నెరవేర్చిన తర్వాత మీరు పూర్వం మీ తాత ముత్తాతలను ఏవిధంగా జ్ఞాపకం చేసుకునేవారో అదేవిధంగా లేదా అంతకంటే అధికంగానే ఇప్పుడు దేవుణ్ని స్మరించండి.” (ఖుర్ఆన్–2:199,200)

మూఢకాలంలో అరబ్ తెగలు హజ్ ముగిసిన తర్వాత ‘మినా’లో సమావేశమై తమ తాతముత్తాతలు వెలగబెట్టిన ‘ఘనకార్యాల’ను గురించి గర్వంగా చెప్పుకునేవి. ఇప్పుడు ఇస్లాం ఛత్రచ్ఛాయలో చేరి ముస్లింలయినవారు అలాంటి అజ్ఞాన విషయాల్ని వదిలేసి ఆ సమయాన్ని వ్యర్థపరచుకోకుండా దైవధ్యానంలో గడపాలని పై సూక్తిలో సృష్టికర్త ఆదేశిస్తున్నాడు. ఇది మినాలో విడిదిచేసే కాలంలో అరఫాత్, ముజ్దల్ఫాలలో చేయవలసిన దైవధ్యానం.

“మీరు కొన్నాళ్ళే (అక్కడ) దైవనామ స్మరణలో గడపవలసి ఉంటుంది. ఎవరైనా రెండు రోజుల్లోనే త్వరగా అక్కడ నుండి వెళ్ళిపోయినా లేదా ఆలస్యంగా వెళ్ళినా ఎలాంటి దోషం లేదు. ఏమైనా మీరక్కడ ఉన్నంతకాలం భయభక్తులతో ఉండాలి. దేవుని పట్ల భయభక్తులు కలిగివుండండి. చివరికి మీరంతా ఆయన సన్నిధికే చేరుకోవలసి వుంటుంది.” (ఖుర్ఆన్–2:203)

“కొందరు ప్రజలు దేవుణ్ని ప్రార్థిస్తూ ‘ప్రభూ! మాకు (నీవు ప్రసాదించేవన్నీ) ప్రపంచంలోనే ప్రసాదించు’ అంటారు. అలాంటివారికి (ప్రపంచంలోనే తప్ప) పరలోక (స్వర్గ)ంలో ఎలాంటి వాటా లభించదు. (ఖుర్ఆన్–2:201)

“మరికొందరున్నారు. వారు ‘ప్రభూ! మాకు ఇహలోకంలోనూ, పరలోకంలోనూ మంచిని ప్రసాదించు. మమ్మల్ని నరక యాతనల నుండి రక్షించు’ అని వేడుకుంటారు. ఇలాంటివారికి వారి సంపాదనను బట్టి ఉభయలోకాల్లోనూ తగిన ప్రతిఫలం) లభిస్తుంది. దేవుడు త్వరలోనే (కర్మలను గురించి) లెక్క తీసుకుంటాడు.” (ఖుర్ఆన్–2:202)

సాధారణంగా బహుదైవారాధకులు, పదార్థపూజారులు దేవుణ్ని వేడుకుంటు న్నప్పుడు క్షణభంగురాలయిన ప్రాపంచిక విషయాలను గురించే వేడుకుంటారు. శాశ్వతంగా ఉండే పరలోక విషయాలను ఏమాత్రం పట్టించుకోరు. వారికి ఇహలోకమే స్వర్గం, సర్వస్వం. అందువల్ల వారి దృష్టి పరలోకం మీదికే పోదు. దీనికి భిన్నంగా దేవుణ్ని, ఆయన ప్రవక్తను దృఢంగా విశ్వసించే ముస్లింలు తమ ప్రభువును ఉభయ లోకాల శ్రేయస్సును అర్థిస్తారు.

"ఇబ్రాహీం కోసం మేమీ ఆలయ స్థలాన్ని ప్రతిపాదిస్తూ ఇలా ఉపదేశించాం: 'నా దైవత్వంలో ఎవరికీ భాగస్వామ్యం కల్పించకూడదు. నా ఆలయప్రదక్షిణ చేసేవారి కోసం, ఇక్కడ ప్రార్థనకై నిలబడే, మోకరిల్లే, సాష్టాంగపడేవారి కోసం పవిత్రంగా ఉంచాలి. హజ్ చేయడానికి ప్రజలకు సాధారణ అనుమతినివ్వాలి. వారు దూర దూర ప్రాంతాల నుంచి కాలినడకన, ఒంటెల మీద వస్తారు. వారిక్కడ తమకోసం ఉంచబడిన ప్రయోజనాలు చూసి తరిస్తారు. కొన్ని నిర్ణీత దినాలలో మేము ప్రసాదించిన పశువుల్ని దేవుని పేరుతో బలిచేస్తారు. తరువాత దాన్ని తింటారు, పేదలకూడా దానం చేస్తారు. ఆ తర్వాత వారు తమ మురికి, మలినాలు తొలగించుకుంటారు. తమ మొక్కుబడులు తీర్చుకుంటారు. ఆపై ఈ ప్రాచీనాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తారు."(ఖుర్ఆన్-22:26-29)

"ఇదే (కాబానిర్మాణ లక్ష్యం). దేవుడు నిర్దేశించిన ప్రతిష్ఠాత్మక విషయాలను ఎవరు గౌరవిస్తారో అది దేవుని దృష్టిలో వారికే శ్రేయస్కరం." (ఖుర్ఆన్-22:30)

"ఎవరు దేవుడు నిర్ణయించిన ధార్మికచిహ్నాలను గౌరవిస్తారో వారి హృదయాలలో ఇది దైవభీతికి నిదర్శనం అవుతుంది. ఓ నిర్ణీతకాలంవరకు ఆ బలిపశువుల్ని మీరు ఇతర పనులకోసం ఉపయోగించుకోవచ్చు. తర్వాత (వాటిని) వాటి (బలి)ప్రదేశమైన ప్రాచీనాలయం దగ్గర (బలిచేయవలసి) ఉంటుంది." (ఖుర్ఆన్-22:32,33)

"ప్రవక్తా! నమ్రత, అణుకువలతో నడచుకునేవారికి శుభవార్త విన్పించు. దేవుని ప్రసక్తి రాగానే వారి హృదయాలు కంపించిపోతాయి. కష్టాలు వచ్చినప్పుడు వారు సహనం వహిస్తారు. నమాజ్ (వ్యవస్థ)ను నెలకొల్పుతారు. మేము ప్రసాదించిన ఉపాధి నుండి (మా మార్గంలో) ఖర్చుపెడ్తారు." (ఖుర్ఆన్-22:35)

## 53. ఐదురోజుల హజ్ సంక్షిప్తస్వరూపం

హజ్ విధానమంతా కేవలం అయిదు రోజుల్లో పూర్తవుతుంది. మొదటి మూడు రోజుల్లోనే హజ్ విధి (ఫర్జ్) నెరవేరుతుంది. అయితే మిగతా నాలుగైదు రోజుల్లో 'రమీ' చేయడానికి, అంటే జమ్రాలపై కంకర్రాళ్లు విసరడానికి 'మినా'లో ఉండి పోవలసి ఉంటుంది. ఒక్క చూపులో హజ్ స్వరూపం ఎలా ఉంటుందో తెలుసుకోవడానికి ఇక్కడ అయిదు రోజుల హజ్ సంక్షిప్త స్వరూపం పేర్కొంటున్నాను.

### మొదటి రోజు జిల్‌హజ్జ 8వ తేదీ:

✦ స్నానం చేసి ఇహ్రాంకు సంబంధించిన కుట్టులేని రెండు బట్టలలో ఒకదాన్ని నడుముకు కట్టుకొని మరొకదాన్ని భుజాల మీద కప్పుకోవాలి.

✦ రెండు రకాతులు నఫిల్ నమాజ్ చేసి, తల మీది ఆచ్ఛాదన తీసేసి, "దేవా! నేను హజ్ చేయడానికి సంకల్పించుకున్నాను. ఈ హజ్ నాకోసం సులభతరం చెయ్యి, దీన్ని స్వీకరించు" అని పలకాలి.

✦ మూడు సార్లు 'లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్....' అంటూ బిగ్గరగా



'తల్బియా' పఠించాలి. కనీసం ఒక సారి పఠించడం విధి. కాని మూడు సార్లు పఠిస్తే మంచిది.

✦ ఈ తల్బియా జిల్‌హజ్జ 8వ తేదీన హజ్ దీక్ష పూనిన దగ్గర్నుంచి 10వ తేదీన 'జమ్రాఅఖబా' మీద 'రమీ' (కంకర్రాళ్ళు విసరడం) చేసే వరకు ప్రతి మిట్టా గుట్టా ఎక్కేటప్పుడు, ప్రతి పల్లానికి దిగేటప్పుడు, ప్రతి జనసమూహాన్ని కలుసుకునేటప్పుడు పఠించాలి.

✦ ప్రతిష్ఠాలయం (బైతుల్‌హరాం)కు వెళ్ళి నఫిల్ తవాఫ్ చేయాలి. ఆ తర్వాత విడిదికి వచ్చి ముఅల్లిమ్ ఏర్పాటు చేసే బస్సులో ఒక సూట్‌కేస్, ఒక బ్యాగ్ మాత్రమే తీసుకొని 8వ తేదీ రాత్రి 'మినా'కు వెళ్ళాలి.

✦ మినాలో మనకు కేటాయించిన గుడారంలో ఇతర హాజీలతో పాటు బస చేయవలసి ఉంటుంది. ఒక్కొక్క గుడారంలో 20 నుంచి 50 మంది హాజీల వరకు ఉంటారు. ఇలా అనేక గుడారాలు ఉంటాయి. ఉమ్మడి ఉజూశాలలు, మలమూత్ర విసర్జనశాలలు కూడా ఉంటాయి.

✦ 'మినా'లో 8వ తేదీ సూర్యాస్తమయం వరకు, ఆ తరువాత 9వ తేదీ సూర్యోదయం వరకు మాత్రమే ఉండాలి. (హిజ్రీ క్యాలండర్ ప్రకారం సూర్యాస్తమయంనుంచి తేదీ ప్రారంభమవుతుందన్న సంగతి గమనార్హం). అప్పటిదాకా రోజువారీ నిర్ణీత వేళల నమాజులతో పాటు, దైవధ్యానంలో సమయం గడుతుండాలి. ఆరోజు మినాలో హాజీలు అంతకుమించి ఆచరించవలసిన ప్రత్యేక కార్యక్రమాలు ఏవీ ఉండవు.

### రెండవ రోజు జిల్‌హజ్జ 9వ తేదీ:

★ 9వ తేదీ ఉదయం చాప, గొడుగు, దుప్పటి వగైరా కొద్దిపాటి సామగ్రి తీసుకొని 'తల్బియా' పఠిస్తూ ముఅల్లిం ఏర్పాటు చేసే బస్సుల్లో అరఫాత్‌కు చేరుకోవలసి ఉంటుంది. ఇక్కడ పూర్తి తాత్కాలికమైన పెద్దపెద్ద గుడారాలు ఉంటాయి. ఈ గుడారాలలో కొన్ని గంటలు మాత్రమే గడపవలసి ఉంటుంది.

★ వీలైతే జుహర్-అసర్ వేళల సంయుక్త నమాజుల్ని నమిరా మసీదులో ఇమామ్ వెనుక చేయాలి. ఒక అజాన్, రెండు తక్బీర్‌లతో చేసే ఈ నమాజ్‌ల మధ్య సున్నత్, నఫిల్ నమాజులు చేయకూడదు. నమిరా మసీదుకు వెళ్ళడానికి సమయం లేకపోతే లేదా మరేదైనా కారణముంటే మనం బసచేసిన గుడారంలోనే ఆ నమాజులు చేయవచ్చు.

★ సూర్యుడు వాలినప్పటి నుంచి 'వఖూఫె అరఫాత్' (అరఫాత్‌లో ఆగి వుండే) సమయం మొదలయి సూర్యాస్తమయం వరకు ఉంటుంది. ఆ

సమయంలో తప్పకుండా అరఫాత్ మైదానంలోనే ఉండిపోవాలి. అప్పుడు సమయం వృధా చేయకుండా దాన్ని దైవధ్యానం, వేడుకోలు (జికర్, దుఆ)లలో గడపాలి.

★ సూర్యాస్తమయం కాగానే మగ్రిబ్ నమాజ్ చేయకుండా అరఫాత్ నుండి ముఅల్లిం ఏర్పాటుచేసే బస్సుల్లో 'ముజ్దల్ఫా'కు బయలుదేరాలి. ముజ్దల్ఫాలో మగ్రిబ్, ఇషా నమాజులు కలిపి చేయాలి. రెండు నమాజుల మధ్య సున్నత్, నఫిల్ నమాజులు చేయకూడదు.

★ ఫజర్ నమాజ్ తరువాత 49 కంకర్రాళ్ళు ఏరుకొని దగ్గరుంచుకోవాలి. ఇవి 'మినా'లో 'రమీ' చేయడానికి ఉపయోగపడతాయి.

## మూడవ రోజు జిల్‌హజ్జ 10వ తేదీ:

❖ ఉదయం ఇక్కడ్నుంచి 'మినా'కు బయలుదేరాలి. ముజ్దల్ఫాలో మినాకు వెళ్ళడానికి సాధారణంగా ముఅల్లిం బస్సులు దొరకవు. అందువల్ల వాటి కోసం ఎదురుచూడకుండా ఏదో ఒక ట్యాక్సీ పట్టుకొని వెళ్ళిపోవడమే మంచిది.

❖ 'మినా'లోని మన విడిది గుడారానికి చేరుకొని సమయముంటే కాస్తంత విశ్రాంతి తీసుకోవచ్చు. ఆ తర్వాత గుడారాలకు కొద్ది దూరంలో ఉండే జమ్రాత్‌కు వెళ్ళాలి. అక్కడ మూడు జమ్రాలు పొడవైన, ఎత్తయిన గోడల రూపాల్లో ఉంటాయి. వాటిలో 'అఖబా జమ్రా' మీద ఏడు కంకర్రాళ్ళు ఒకదాని తరువాత ఒకటి విసరాలి. దీన్నే 'రమీ' అంటారు. ఆ తరువాత దుఆ చేయాలి.

❖ 'రమీ' చేసేటప్పుడు అల్లాహుఅక్బర్ అంటూ కుడిచేత్తో రాళ్ళు విసరాలి. ఈపని ముగిసిన తర్వాత గత మూడురోజుల నుంచి 'లబ్బైక్' అంటూ పఠిస్తున్న తల్బియా పలుకుల్ని ఆపేయాలి. ఆ తర్వాత ఖుర్బానీ (పశువును బలి) ఇవ్వాలి. దీనికోసం కొందరు ఏజంట్లు ఉంటారు. వారికి మనం మన పేరు, ఫోన్‌నెంబర్ ఇచ్చి డబ్బు చెల్లిస్తే చాలు, మన తరపున వారే ఖుర్బానీ చేసి మనకు తెలియజేస్తారు.

❖ ఖుర్బానీ విధి నెరవేరిందని తెలిసిన తరువాత క్షవరం చేయించుకొని స్నానం చేయాలి. క్షవరంలో కటింగ్ కూడా చేయించుకోవచ్చు. శిరో ముండనం అయితే ఇంకా మంచిది. దీంతో ఇహ్రాం (దీక్ష) ముగుస్తుంది. ఇక ఇహ్రాంబట్టలు వదలి సాధారణ దుస్తులు ధరించవచ్చు.

❖ ఆ తరువాత కాబాలయ 'సందర్శనా ప్రదక్షిణ' (తవాఫె జియారత్) కోసం మక్కా నగరానికి బయలుదేరాలి. ఈ సందర్శనా ప్రదక్షిణ హజ్ నియమాలలోని చివరి అంశం.



❖ జిల్‌హజ్జ 8వ తేదీన 'సయీ' చేయకపోతే ఇప్పుడు తవాఫ్ తరువాత అయినా తప్పకుండా చేయాలి. ఆ రోజు వీలైతే సూర్యాస్తమయానికి ముందే మినా చేరుకోవాలి. జిల్‌హజ్జ 11, 12 తేదీలు మినాలోనే ఉండి పోవాలి. అవసరమైతే 13వ తేదీ కూడా మినాలో ఉండవచ్చు.

## నాల్గవ రోజు జిల్‌హజ్జ 11వ తేదీ:

✇ సూర్యుడు వాలిన తరువాత 'రమీ' చేయడం సంప్రదాయం. కాని జమ్రాత్ దగ్గర తొక్కిసలాట జరిగే ప్రమాదం ఉండవచ్చన్న భయంతో సౌదీ ధర్మవేత్తలు రమీ 24 గంటల్లో ఎప్పుడైనా చేయవచ్చని 'ఫత్వా' జారీచేశారు. ఆ విషయం అనేకచోట్ల పోస్టర్ల ద్వారా కూడా ప్రభుత్వం హాజీలకు తెలియజేస్తోంది. కనుక ఆ ప్రకారం చేయడమే మంచిది.

✇ ముందుగా "జమ్రతుల్ ఊలా"పై ఏడు కంకర్రాళ్ళు విసరాలి. అలాగే "జమ్రతుల్ ఉస్తా" మీద, ఆ తరువాత "జమ్రరుత్ అఖబా" మీద ఏడేసి కంకర్రాళ్ళు చొప్పున విసరాలి. ఇలా మొత్తం 21 కంకర్రాళ్ళతో 'రమీ' చేసిన తర్వాత దుఆ చేయాలి.

## అయిదవ రోజు జిల్‌హజ్జ 12వ తేదీ:

☸ ఈరోజు కూడా గత దినం చేసినట్లే మూడు జమ్రాలపై రమీ చేయాలి. రమీ తరువాత దుఆ చేయడం మంచిది.

☸ 'రమీ' చేసిన తరువాత సూర్యాస్తమయానికి ముందే మక్కా పట్టణా నికి బయలుదేరాలి. ఆరోజు రమీ చేయలేకపోతే మరునాడయినా మినాలో ఆగి మూడు జమ్రాలపై రమీ చేయవచ్చు.

☸ దీంతో హజ్ విధి నెరవేరుతుంది. అయితే మక్కా నుండి స్వదేశం తిరిగి వెళ్ళే ముందు కాబా గర్భగుడి చుట్టూ ఏడుసార్లు 'తవాఫె విదా' (వీడ్కోలు ప్రదక్షిణ) చేయవలసి ఉంటుంది.

# 54. మహిళా హాజీల సమస్యలు

పురుష హాజీలకు, స్త్రీ హాజీలకు మధ్య కొన్ని వ్యత్యాసాలు ఉన్నాయి. హజ్, ఉమ్రాల వివరాలు పేర్కొన్నప్పుడు సమిష్టి నియమాలతోపాటు, స్త్రీ హాజీలకు వర్తించే ప్రత్యేకనియమాలు కూడా కొన్నిటిని చర్చించడం జరిగింది. ఇక్కడ మహిళా హాజీలకు సంబంధించిన నియమాలు, నిబంధనలన్నిటినీ వివరంగా పేర్కొంటున్నాను.

❀ స్త్రీలు భర్త లేక ముహ్రిమ్ (వివాహ నిషిద్ధ) పురుషుడు తోడులేకుండా ఒంటరిగాగాని, పరపురుషులతోగాని హజ్‌యాత్రకు పోకూడదు.

❀ హజ్‌విధి (ఫరజ్) అయిన స్త్రీ ముహ్రిమ్ (తండ్రి, కుమారుడు, సోదరుడు వగైరా వివాహనిషిద్ధ) పురుషుల్లో ఎవరైనా తోడు ఉన్నప్పుడు భర్త అనుమతి

లేకపోయినా హజ్‌యాత్రకు వెళ్ళవచ్చు. నఫిల్ (ఐచ్ఛిక) హజ్‌యాత్రకు వెళ్ళేందుకు మాత్రం భర్త అనుమతి తప్పకుండా ఉండాలి.

❀ హజ్‌యాత్ర విధి (ఫరజ్) అయిన స్త్రీకి ముహ్రరిమ్ (తండ్రి, కుమారుడు, సోదరుడు వగైరా వివాహనిషిద్ధ) పురుషుల్లో ఎవరూ హజ్‌యాత్ర కోసం తోడుగా వెళ్ళడానికి సిద్ధంగా లేనప్పుడు భర్త ఆమెవెంట తప్పకుండా వెళ్ళాలి.

❀ ఏ స్త్రీ అయినా భర్త చనిపోవడం వల్ల లేక విడాకులివ్వడం వల్ల ఏర్పడే ఇద్దత్ గడువుకాలంలో హజ్ సీజన్ వచ్చినప్పుడు స్తోమత ఉన్నప్పటికీ హజ్‌కు పోకూడదు. ఒకవేళ రెండవసారి హజ్ సీజన్ వచ్చినప్పుడు ఆ స్త్రీ చనిపోవడం జరిగితే ఆమె తరపున మరెవరైనా బదులు హజ్ చేయవచ్చు.

❀ ఇహ్రాం (దీక్ష) పూనే మహిళా హాజీలు పురుష హాజీల మాదిరిగా ఇహ్రాం కోసం ప్రత్యేక దుస్తులేమీ ఉండవు. వారు రోజూ ధరించే సాధారణ దుస్తులే ధరించి దీక్ష పూనవలసి ఉంటుంది. పరదా పాటించాలి. అయితే దీక్షలో ఉన్నంతకాలం ముఖ ముసుగు (నిఖాబ్) ఉండకూడదు.

❀ మహిళా హాజీలు లబ్‌బైక్ అల్లాహుమ్మ లబ్‌బైక్ అనే 'తల్బియా' పలుకులను బిగ్గరగా కాకుండా మెల్లగా పలకాలి. దగ్గర్లో పరపురుషులు ఎవరూ లేకపోతే బిగ్గరగా తల్బియా పఠించవచ్చు.

❀ స్త్రీలు కాబా ప్రదక్షిణ చేస్తున్నప్పుడు పురుషులు మాదిరిగా రమల్ (నిక్కుతూ, భుజాలు ఎగరేస్తూ నడవడం) చేయకూడదు. అలాగే పురుషుల మధ్య నుంచి దూరిపోయి ఇస్తిలాం (హ్రజెఅస్వద్‌ను ముద్దాడటం) చేయకూడదు.

❀ సఫా, మర్వా కొండల మధ్య 'సయీ' చేస్తున్నప్పుడు ఇరువైపులా ఉండే రెండు పచ్చలైట్ల నడుమ పురుషులు మాదిరిగా స్త్రీలు పరుగెత్తకూడదు.

❀ మహిళా హాజీ తన ఖుర్బానీని పురుషుల చేత చేయించవచ్చు. అలాగే ఏదైనా కారణం ఉంటే 'రమీ' (కంకర్రాళ్ళు విసరడం) కూడా పురుషుల చేత చేయించవచ్చు.

❀ మహిళా హాజీలు జిల్‌హజ్జ 10వ తేదీన ఖుర్బానీ విధి నెరవేరిన తరువాత ఏ విధమైన క్షవరం చేయించుకోకూడదు. అయితే జడ చివర్లో మొత్తం శిరోజాలు కలిపి ఒకటి, ఒకటిన్నర అంగుళం మేరకు వెంట్రుకలు కత్తిరించుకోవాలి.

❀ బహిష్టు లేక ప్రసవంవల్ల ఏర్పడే అపరిశుద్ధావస్థలో స్త్రీలు కాబా ప్రదక్షిణ చేయడం, నమాజ్ చేయడం, ఖుర్‌ఆన్ పఠించడం నిషిద్ధం. ఇవి తప్ప మిగతా హజ్ నియమాలు నిస్సంకోచంగా నిర్వహించవచ్చు. పరిశుద్ధం అయిన తరువాత సందర్శనా ప్రదక్షిణ (తవాఫె జియారత్) చేయవలసి ఉంటుంది. జిల్‌హజ్జ 12వ తేదీన సహజసిద్ధమైన అపరిశుద్ధావస్థకు సంబంధించిన సూచనలకు ముందు మహిళాహాజీ సందర్శనా



ప్రదక్షిణలో నాలుగు ప్రదక్షిణలు చేయగలిగితే తప్పకుండా చేయాలి. అలా చేయలేని పక్షంలో ఆమె పరిహారంగా ఒక ఖుర్బానీ ఇవ్వవలసి ఉంటుంది. శుద్ధి అయిన తర్వాత సందర్శనా ప్రదక్షిణ కూడా చేయవలసి ఉంటుంది.

❀ హజ్ కమిటీ ద్వారా వచ్చే హాజీలకు సౌదీ ప్రభుత్వం కేటాయించే విడిది గృహాల్లో కనీసం ముగ్గురు హాజీలు ఉండవలసి వస్తుంది. ఒక్కోసారి అయిదారుగురు హాజీలు కూడా ఉండవలసి వస్తుంది. వారిలో విభిన్న కుటుంబాలకు చెందిన స్త్రీలు, పురుషులు ఉండవచ్చు. అలాంటి పరిస్థితిలో స్త్రీలు పూర్తి పరదా పాటించడం కష్టమై పోతుంది. ముఖ్యంగా ముఖముసుగుతో అసలే ఉండలేరు. కోటానుకోట్ల రూపాయల విలువైన బహుళ అంతస్తుల భవనాలను సైతం కూలగొట్టి పునర్నిర్మిస్తున్న సౌదీ ప్రభుత్వం పరదా నియమాలను దృష్టిలో పెట్టుకొని ఇద్దరు ఉండే గదుల్ని కూడా ఎందుకు నిర్మించదో అర్థంకావడం లేదు. ఏమయినప్పటికీ స్త్రీలు వీలైనంతవరకు పరదా పాటించడానికి ప్రయత్నించాలి.

# 55. బదులు హజ్

ఎవరైనా ఆర్థికస్తోమత ఉన్నప్పటికీ అనారోగ్య కారణాల వల్లగాని లేక మరేవైనా షరీఅత్ పరమైన కారణాల వల్లగాని విధి (ఫరజ్)గా చేయవలసిన హజ్ చేయలేని పరిస్థితిలో ఉంటే అతను తన తరపున డబ్బిచ్చి ఇతరుల చేత హజ్ చేయించాలి. దీన్నే "బదులుహజ్" (హజ్జెబదల్) అనంటారు. నఫిల్ (ఐచ్ఛిక) హజ్ విషయంలో మాత్రం మనిషి ఆరోగ్యంగా ఉన్నాసరే తన తరపున ఇతరుల చేత 'హజ్జెబదల్' నిరభ్యంతరంగా చేయించుకోవచ్చు. అలాగే ఐచ్ఛిక ఉమ్రా విషయంలో కూడా డబ్బిచ్చి ఇతరుల చేత చేయించుకోవచ్చు.

హ్రజత్ అబూరజీన్ (రజి) ఓరోజు హజ్‌యాత్ర గురించి దైవప్రవక్త (సల్లం)తో మాట్లాడుతూ ఇలా అడిగారు: "దైవప్రవక్తా! మానాన్న చాలా ముసలివారయి పోయారు. ఆయన ఇప్పుడు హజ్, ఉమ్రాలు చేయలేని పరిస్థితిలో ఉన్నారు; వాహనం మీద కూర్చునే శక్తి కూడా లేదు ఆయనకు. (ఇలాంటి పరిస్థితిలో నేనేం చెయ్యాలి)?" దానికి దైవప్రవక్త (సల్లం) "నీవు నీ తండ్రి తరపున హజ్, ఉమ్రా (విధు)లు నెరవేర్చు" అని సమాధానమిచ్చారు. (తిర్మిజి)

దైవప్రవక్త (స) సన్నిధికి ఒక వ్యక్తి వచ్చి "దైవప్రవక్తా! మా నాన్న చనిపోయారు. ఆయన బ్రతికుండగా హజ్ చేయలేకపోయారు. మరి నేనిప్పుడు ఆయన తరపున హజ్ చేయవచ్చా?" అనడిగాడు. దానికి దైవప్రవక్త (సల్లం) "నీ తండ్రి అప్పు చేసివుంటే దాన్ని నీవు తీర్చవా?" అనడిగారు. దానికా వ్యక్తి "తప్పకుండా తీర్చుతాను దైవప్రవక్తా!" అన్నాడు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) "అలాగే దేవుని రుణం కూడా తప్పకుండా తీర్చాలి" అన్నారు. (జమావుల్ ఫవాయెద్)

పై రెండు హదీసుల్ని బట్టి వృద్ధాప్యం, శాశ్వతమైన అనారోగ్య కారణాల వల్ల హజ్ చేయలేని మనిషి తరఫున ఇతరులు హజ్జెబదల్ చేయవచ్చని; అలాగే బ్రతికుండగా హజ్ చేయలేకపోయిన మనిషి చనిపోయిన తరువాత అతని తరఫున అతని వారసులు హజ్జెబదల్ చేయాలని స్పష్టంగా తెలుస్తోంది.

బదులుహజ్ (హజ్జెబదల్) సక్రమంగా నెరవేరడానికి కొన్ని షరతులు ఉన్నాయి. వాటిని పాటించవలసి ఉంటుంది. అవి ఈ విధంగా ఉన్నాయి:

✦ వృద్ధాప్య బలహీనత, తీవ్రమైన అంగవైకల్యం వంటి శాశ్వతమైన అనారోగ్య కారణాలు ఉన్నప్పుడే (ఫరజ్) హజ్‌ని "హజెబదల్"గా ఇతరుల చేత డబ్బిచ్చి చేయించుకోవాలి.

✦ బ్రతికుండగా హజ్ చేయలేకపోయిన మనిషి చనిపోయేముందు తన వారసులకు తన తరఫున హజ్ చేయాలని వీలునామా వ్రాసినా, వ్రాయకపోయినా వారసులు అతని తరఫున హజ్ చేస్తే అతనిపై ఉండే హజ్ విధి నెరవేరుతుంది.

✦ బదులుహజ్ (హజ్జెబదల్) ఇతరుల చేత చేయించే వ్యక్తి హజ్‌కు సంబంధించిన ఖర్చులన్నీ స్వయంగా తానే భరించాలి.

✦ బదులుహజ్ చేసేవ్యక్తి చేయించే మనిషి తరఫున హజ్, ఉమ్రాల దీక్ష పూనాలి. ఫలానా మనిషి తరఫున తాను హజ్ చేయబోతున్నానని మనోవాక్కులతో సంకల్పించుకోవాలి.

✦ బదులుహజ్ చేసేవ్యక్తి యుక్తవయస్సుకు చేరుకోకపోయినా బుద్ధికుశలత కలిగినవాడయితే చాలు, హజ్ విధి నెరవేరుతుంది.

✦ బదులుహజ్ చేయించే మనిషి "ఇఫ్రాద్ హజ్, ఖిరాన్ హజ్, తమత్తో హజ్" లలో ఏ విధమైన హజ్ చేయమని చెబుతాడో బదులుహజ్ చేసేవ్యక్తి అలాంటి హజ్ మాత్రమే చేయాలి.

✦ బదులుహజ్ చేసేవ్యక్తి ఆ హజ్‌ను చెడగొట్టడంగాని, తన ఇష్టమొచ్చినట్లు జరపడంగాని చేసి ఆ తరువాత "ఖజా"హజ్ చేస్తే, దానివల్ల బదులుహజ్ చేయించే మనిషి 'హజ్‌విధి' నెరవేరదు. బదులుహజ్ చేసేవ్యక్తి వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకొని బాధ్యతాయుతంగా హజ్జెబదల్ చేయాలి.

హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "ఒక (బదులు) హజ్ ద్వారా దేవుడు ముగ్గురు మనుషులను స్వర్గంలో ప్రవేశింపజేస్తాడు. ఆ ముగ్గురిలో ఒకతను, (ఎవరి తరఫున బదులుహజ్ చేయడం జరుగుతుందో ఆ) మృతమనిషి. రెండో అతను, హజ్ చేసేవాడు. మూడో అతను, హజ్‌యాత్రకు పంపేవాడు." (తర్గీబ్ వ తర్హీబ్, కన్జుల్ అమ్మాల్)



# 56. మా తిరుగు ప్రయాణం

జిల్‌హజ్జ 8వ తేదీ నుండి 12వ తేదీ వరకు అయిదు రోజుల పాటు నిర్వహించిన ఆచారాలు, నియమాలతో హజ్ విధి పూర్తయింది. అయితే హాజీలు మక్కా వీడిపోతూ కాబా చుట్టు చివరిసారిగా "వీడ్కోలు ప్రదక్షిణ" (తవాఫే విదా) చేయవలసి ఉంటుంది. హజ్‌కు ముందు, హజ్ ముగిసిన తరువాత కూడా అనేక మంది హాజీలు షాపింగ్ చేస్తారు. హజ్ ముగిసిన తరువాత ఈషాపింగ్ మరింత ఎక్కువయిపోతుంది. మక్కా పవిత్రతా, శుభాలను దృష్టిలో పెట్టుకొని హాజీలు ఖర్జూర పండ్లు, జపమాలలు, జానిమాజులు, టోపీలు కొనడానికి దుకాణాలపై ఎగబడతారు.

ఇలాంటి పరిస్థితిలో మేము ముందుగా 'తవాఫెవిదా' చేద్దామని భావించాము. కాని స్వదేశాలకు తిరిగి వెళ్ళిపోయే హాజీలతో తవాఫ్ ప్రదేశం కిటకిటలాడ సాగింది. మా తిరుగు ప్రయాణానికి వారంరోజులు మాత్రమే గడువుంది. అంచేత మేము హజ్ ముగిసిన మొదటి రెండుమూడు రోజులు షాపింగ్ చేసుకొని తర్వాత 'తవాఫెవిదా' చేద్దామనుకున్నాం. అలాగే ముందు షాపింగ్ చేసుకున్నాం. అయితే ఆ తర్వాత తవాఫె విదా చేద్దమని ఎప్పుడు పోయినా తవాఫ్ ప్రదేశం కిటకిటలాడుతూనే ఉండేది. అలా రెండుమూడు రోజులు చూసి, చివరికి నేను, మా మామయ్య, మా శ్రీమతి పై అంతస్తుకు వెళ్ళి ప్రశాంతంగా తవాఫ్ చేశాం. పైఅంతస్తులలో అంతగా రష్ ఉండదు. కాకపోతే ఆ ప్రదక్షిణ పరిధి గ్రౌండ్‌ఫ్లోర్ ప్రదక్షిణ పరిధికి రెట్టింపు ఉంటుంది.

ఈ విధంగా మేము తవాఫెవిదా చేశాక తిరుగు ప్రయాణానికి సన్నాహాలు ప్రారంభించాం. జనవరి 19వ తేదీ రాత్రే ముఅల్లిమ్ మనిషి మా లాడ్జికి వచ్చి "రేపు ఫజర్ నమాజ్ తరువాత జిద్దాకు బయలుదేరాలి, సిద్ధంగా ఉండండి" అని ప్రకటించి వెళ్ళిపోయాడు. ఆరాత్రి మా లాడ్జిలో మళ్ళీ హడావిడి మొదలయింది. కొందరు ఆ రోజురాత్రి కూడా తావాఫెవిదా చేశారు. మరికొందరు పెట్టేబేడా సర్దుకోవడంలో నిమగ్నులయ్యారు. మేము కూడా ఆరాత్రి సామానంతా సర్దుకొని పన్నెండు గంటలకు నిద్రపోయాం.

తెల్లవారింది. రోడ్డు మీద ముఅల్లిం బస్సులు బయలుదేరడానికి సిద్ధంగా నిలబడ్డాయి. 20-1-2006న ఫజర్ నమాజ్ తరువాత మేమంతా బస్సెక్కి కూర్చున్నాం. ఇంకా అప్పటికి సూర్యోదయం కాలేదు. మా బస్సు బయలుదేరి కాస్సేపటికే వేగం పుంజుకుంది. నేనొక సారి కిటికీ గుండా వెనక్కి తొంగి చూశాను. మక్కా భవనాలు విద్యుద్దీపాల వెలుగులో మెరిసిపోతూ రైలుపెట్టెల్లా వెనక్కి పరుగెత్తుతుంటే నా మనసు మరొకసారి కకావికలమయింది.

"హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) స్వహస్తాలతో పునాదులు పడి ఇంత ఎత్తుకు ఎదిగి ఏటా లక్షలమంది జనాన్ని ఆకర్షిస్తున్న పవిత్ర మక్కా నగరమా! మళ్ళీ నీ దర్శన భాగ్యం మాకెప్పుడు లభిస్తుందో తెలియదు. నీ పవిత్ర భవనాలు, చారిత్రక కట్టడాలు,



↑ బైతుల్‌ముఖద్దస్-ముస్లింల మొదటి ఖిబ్లా (జెరూసలేం)-పేజి.76
మా తిరుగు ప్రయాణం (జిద్దా నుండి విమానయానం)↓






కాబా మనోహరదృశ్యాలు మా హృదయాల్లో శాశ్వతంగా ఉండిపోయేలా చేయమని నీ ప్రభువును ప్రార్థించు" అంటూ నాఅంతరాత్మ ఘోషించింది. ఇటు దయలేని మా బస్సు మమ్మల్ని బలవంతంగా మక్కా నుండి దూరంగా, బహుదూరంగా లాకెళ్ళింది.

ఆరోజు మధ్యాహ్నాం ఒంటి గంటకు జిద్దా ఎయిర్‌పోర్టుకు చేరుకున్నాం. అక్కడ భోజనాలు చేసిన తరువాత జుహర్, అసర్ నమాజులు కలిపి ఒకేసారి ఖసర్ నమాజ్ చేశాం. సరిగ్గా మూడు గంటలకు పిలుపు వచ్చింది హైదరాబాదుకు వెళ్ళే హాజీలు ఎయిర్‌పోర్టు ఆఫీసుకు చేరుకోవాలని. మేము సూట్‌కేసులు, బ్యాగులు తీసుకొని ఆఫీసు ముందు 'క్యూ'లో నిల్చున్నాం.

ఓ గంట తరువాత మేము లోపలికి ప్రవేశించగలిగాము. ఆఫీసులో మా పాస్‌పోర్టులు, లగేజి సామగ్రి, ఎయిర్ టికెట్లు చెకింగ్ కావడానికి మరోగంట సేపు పట్టింది. ఆ తరువాత మేము ఐదు గంటలకు 'రన్‌వే' మీదకు చేరుకొని బస్సెక్కాం. కాస్సేపటికి ఆ బస్సు మమ్మల్ని విమానం దగ్గరకు చేర్చింది. మేము విమాన మెక్కిన అరగంటకు సరిగ్గా సూర్యుడు అస్తమిస్తున్న సమయంలో అది ఆకాశంలోకి ఎగిరింది. చీకటి తెరలను చీల్చుకుంటూ మా విహంగ యంత్రం రాత్రి ఒంటి గంటన్నరకు హైదరాబాద్‌కు చేరింది.

చెకింగ్ తరువాత మేము లగేజి సామగ్రి చేరుకునే ఓ పెద్ద హాలులోకి వచ్చాం. హాలాంతా లగేజి సామగ్రి, హాజీలతో నిండిపోయింది. నేను మా లగేజి సామాను కోసం వెతుకుతుండగా మన రాష్ట్ర హజ్‌కమిటీ చైర్మన్ జనాబ్ గౌస్ మొహియుద్దీన్ గారు కన్పించారు. ఆయన నన్ను చూడగానే అభినందిస్తూ కౌగలించుకున్నారు. ఆ రోజు హజ్‌కమిటీ చైర్మన్‌తో పాటు, కమిటీకి చెందిన ఇతర ఉద్యోగులు కూడా హాజీలకు స్వాగతం చెప్పడానికి వచ్చారు. లగేజి హాల్లోనే దాదాపు రెండుగంటలు గడచిపోయాయి. చివరికి లగేజి సామాను తీసుకొని 'అల్‌హమ్దులిల్లాహ్' అంటూ బయటపడ్డాము. బయటకు రాగానే మా సంతానం, ఇతర బంధువులు మా కోసం ఎదురుచూస్తూ నిలబడ్డారు. తరువాత టాక్సీలో 21-1-06న ఉదయం 4గంటలకు ఇంటికి చేరుకున్నాం. ఈవిధంగా దైవానుగ్రహం వల్ల మా తిరుగుప్రయాణం కూడా సుఖాంతంగా ముగిసింది. సకల స్తోత్రాలు ఆ సర్వేశ్వరునికే శోభిస్తాయి.

## 57. హాజీ ఎలా ఉండాలి?

సాధారణంగా ప్రజలు మతవ్యవహారాల్లో బాహ్యావిషయాలకే ప్రాధాన్యమిస్తారు. అంతర్విషయాల్ని గురించి అంతగా పట్టించుకోరు. నమాజ్, రోజా, హజ్ వగైరా విషయాల్లో ఈనాడు ముస్లింల పరిస్థితి ఇలాగే ఉంది. "హజ్" అనగానే ఓ ప్రత్యేక వస్త్రధారణతో మక్కా వెళ్ళడం, కాబా చుట్టు ప్రదక్షిణ చేయడం, సఫా-మర్వా కొండల మధ్య తిరగడం, అరఫాత్, ముజ్దల్ఫాలకు వెళ్ళి రావడం విషయాలే వారి హృదయాల్లో మెదలుతాయి. కాని హజ్ అసలు ధ్యేయం ఏమిటో, అది మనిషిని ఎలా తీర్చిదిద్ద

దలచిందో ఆలోచించరు. హజ్ ఆశయాలను గురించి ఇక్కడ ముందుగా మనం మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ప్రవచనాలను పరిశీలిద్దాం.

“మీ రక్తం, మీ ధనం, మీ మానమర్యాదలు మీకు ఈ పట్టణంలో ఏవిధంగా నిషేధించబడ్డాయో అదేవిధంగా (ఇవన్నీ ఇకనుంచి) మీ మధ్య నిషేధించబడ్డాయి. జాగ్రత్త! ఎవరైనా దౌర్జన్యపరుడు దౌర్జన్యం చేస్తున్నాడంటే తనపై తానే దౌర్జన్యం చేసుకుంటున్నాడు (అని గ్రహించండి). జాగ్రత్త! ఏతండ్రీ తన సంతానంపై, ఏ సంతానం కూడా తన తండ్రిపై దౌర్జన్యం చేయకూడదు....” (ఇబ్నెమాజ, తిర్మిజి)

హజ్ సీజన్‌లో ప్రజలు మక్కాలో పరస్పరం రక్తపాతం జరుపుకోవడం, దోచుకోవడం, అవమానించుకోవడం నిషిద్ధం. అలాగే ఇకనుంచి శాశ్వతంగా ఇస్లామీయ సమాజంలో రక్తపాతం, దోపిడీలు, అగౌరవాలు జరగకూడదని, ప్రజలు పరస్పరం సఖ్యతతో, ఒకరి హక్కులు ఒకరు గౌరవించుకుంటూ శాంతియుతంగా మెలగాలని దైవప్రవక్త (స) ఈ హదీసులో అనుచరులకు బోధించారు. ఇలాంటి శాంతియుత వాతావరణం, పరస్పర గౌరవాదరణలు, స్నేహసంబంధాలు ఏర్పడటానికి హజ్ విధిని నిర్దేశించినట్లు తెలుస్తోంది. అదీగాక, ముస్లిం సముదాయంలో సమైక్యతా, సౌభ్రాతృత్వాలను గురించి కూడా ఈ హదీసు పరోక్షంగా మనల్ని ఉపదేశిస్తోంది.

హజ్రత్ ఉసామా బిన్ షరీక్ (రజి) ఇలా తెలియజేస్తున్నారు:“నేను దైవప్రవక్త (సల్లం)తో కలసి హజ్ చేయడానికి బయలుదేరాను. అప్పుడు ప్రజలు (హజ్ ఆచారాలు తెలుసుకోవడానికి) ఆయన సన్నిధికి వస్తుంటారు. వారు వచ్చి ‘దైవప్రవక్తా! కాబాప్రదక్షిణ చేయకముందు నేను ‘సయీ’ (సఫా, మర్వా కొండలు ఎక్కిదిగే పని) చేశాను. లేదా (మొదట చేయవలసిన) పని తర్వాత చేశాను. లేదా (తర్వాత చేయవలసిన పని) మొదట్లో చేశాను’ అని అంటాడు. దైవప్రవక్త (సల్లం) ప్రతి మనిషికీ ‘పర్వాలేదు. (అందులో నష్టమేమీ లేదు). కాని ఎవరైనా దౌర్జన్యంగా ఒక ముస్లిం పరువుప్రతిష్ఠలకు భంగం కలిగిస్తే మాత్రం నష్టమే. కనుక అలాంటి మనిషి నష్టపోయి హతమయ్యాడు (అని తెలుసుకోండి)’ అని చెప్పేవారు.” (అబూదావూద్)

హజ్ విధులలో ఎవరైనా పొరపాటున ముందు చేయవలసిన పని వెనుక, వెనుక చేయవలసిన పని ముందు చేసినంత మాత్రాన దైవధర్మం పట్ల మనిషికుండే విశ్వాసానికి పెద్ద ప్రమాదమేమీ ముంచుకురాదు. మనిషిని ఇహపరలోకాల్లో నష్టపరచే అసలు విషయం తోటి మనుషులపై అన్యాయానికి, అత్యాచారాని, అగౌరవానికి పాల్పడమే. కాబట్టి ఈ చెడులకు దూరంగా మసలుకోండని దైవప్రవక్త (సల్లం) పైహదీసులో ముస్లింలకు ఉపదేశించారు. మరోవిషయం- అశ్లీలం, అసభ్యతలకు దూరంగా ఉండాలని కూడా ముస్లింలకు కాబా సందేశమిస్తోంది. దీన్ని గురించి దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు:

“ఎలాంటి అశ్లీలకార్యానికి పాల్పడకుండా, మరే పాపకార్యానికి గురికాకుండా ఈ (కాబా)గృహాన్ని సందర్శించిన మనిషి తన తల్లి గర్భం నుండి (అప్పుడే) పుట్టిన



వాడిలా (పరమ పవిత్రుడిగా హజ్ నుండి) మరలిపోతాడు.” (ముస్లిం)

మనిషి హృదయంలో నిజమైన భయభక్తులు గనక ఉంటే అతను ఏ చెడునూ దరికి చేరనివ్వడు. ప్రత్యేకంగా హజ్ సందర్భంలోనైతే మనసులోకి చెడుల తలంపును కూడా రానివ్వకుండా దైవగృహాన్ని సందర్శించాలన్న అకుంఠిత దీక్షతో ఆయన్ని స్మరిస్తూ తన ఉనికినే మరచిపోతాడు. ఇలాంటి భక్తుడ్ని గురించి దేవుడు ఎలా వర్ణించాడో దైవప్రవక్త (సల్లం) పేర్కొన్న ఈ ప్రవచనం చూడండి:

“హజ్ చేసేవారు అరఫాత్‌లో ఆగి దేవుడ్ని ప్రార్థించడంలో, (దైవభీతితో) దుఃఖించడంలో నిమగ్నులై ఉన్నప్పుడు దేవుడు ఇహలోక ఆకాశానికి వచ్చి దైవదూతలతో ఇలా అంటాడు- ‘నా ఈ దాసుల్ని చూడండి. చెదరిన శిరోజాలతో, దుమ్ము ధూళితో ఉన్న స్థితిలో వీరు నా దగ్గరికి వచ్చారు చూడండి.” (హదీస్)

నీటుగా, టిప్‌టాప్‌గా ఉండాలిగాని, ఇదేమిటీ దేవుడు దుమ్ము ధూళి కొట్టుకున్న వారిని పొగడుతున్నాడు! అని కొందరు ఆశ్చర్యపడవచ్చు. కాని మనిషి ఏదైనా ముఖ్యమైన పని దీక్షగా చేస్తున్నప్పుడు జుట్టు చెదిరిపోతే దువ్వుకోవాలని ఆలోచిస్తాడా? చెమట, దుమ్ము పడ్తుంటే మాటిమాటికి టాయ్‌లెట్ అవుతూ బట్టలు మార్చుకుంటాడా? అలా ఎన్నటికీ చేయడు. తలపెట్టిన పని ముగిసేదాకా అతనికి మరోపని మీద ధ్యాసేఉండదు. హజ్‌చేసే మనిషి పరిస్థితి కూడా ఇలాగే ఉండాలని ఈహదీసు మనకు వివరిస్తోంది.

ఈవిధంగా అన్ని రకాల చెడులను విసర్జించి నిష్కల్మష హృదయంతో దేవుని పట్ల భయభక్తులతో, ఆయన ఆలయాన్ని సందర్శించి, ఆ దయామయుడి మహిమోన్నతలను వీక్షించి తరించాలన్న దృఢమైన దీక్షాకాంక్షలతో హజ్ చేసిన మనిషే దేవుని దృష్టిలో నిజమైన హాజీ అన్పించుకుంటాడని **హజ్రత్ జునైద్ బగ్దాదీ (రహ్మ)** అంటున్నారు. హజ్ చేసివచ్చిన ఒక యాత్రికునికి, ఆయనకు మధ్య జరిగిన ఈ సంభాషణ వినండి:

జునైద్:- నువ్వు ఎక్కడ్నుంచి వస్తున్నవు?

హాజీ :- నేను హజ్ చేసి వస్తున్నానండీ!

జునైద్:- ఏమిటీ! నువ్వు హజ్ చేసి వస్తున్నావా!!

హాజీ :- ఔనండీ! హజ్ చేసే దైవగృహం నుండి వస్తున్నాను. హజ్ నియమాలన్నీ పాటించి, ఆ మహాకార్యాన్ని నెరవేర్చి మీ దగ్గరికి వచ్చాను.

జునైద్:- హజ్ సంకల్పం చేసుకొని బయలుదేరేటప్పుడు ఇల్లూ వాకిలీ అంతా వదలిపెట్టావు గదా, అప్పుడు నీలోని పాపాలన్నిటిని కూడా వదలిపెట్టావా?

హాజీ :- ఆ సంగతి గురించి నేను ఆలోచించలేదండీ. ఏదో హజ్ చేయాలనుకొని బయలుదేరాను.

జునైద్:- అయితే నువ్వు హజ్ కోసం బయలుదేరనే లేదు. సరే, హజ్ ప్రయాణంలో నువ్వు ఎన్నోమజిలీలు దాటి ఎన్నెన్నో ప్రదేశాలలో రాత్రిళ్ళు గడిపి ఉంటావు. అప్పుడు నువ్వు దైవసాన్నిధ్యపు మజిలీ కూడా దాటావా?

హాజీ :- ఏమోనండీ! ఆ సంగతి నాకు మదిలో కూడా మెదలల్లేదు.

జునైద్:- అయితే నువ్వు కాబా దిశగా ప్రయాణం చెయ్యనే లేదు. ఆ మార్గంలోని ఏ మజిలీ కూడా దాటలేదు. సరే, ఇహ్రాం (హజ్ దీక్ష) పూనినప్పుడు రోజూ తొడుక్కునే బట్టలను వదిలేశావు కదా; దాంతోపాటు నీ దురలవాట్లను, దుర్గుణాలను కూడా వదలిపెట్టావా లేదా?

హాజీ :- లేదండీ! వాటి గురించిన ఆలోచన నాకు తట్టనేలేదు.

జునైద్:- అయితే నువ్వు ఇహ్రాం పూననే లేదు. పోనీ అరఫాత్ మైదానం వెళ్తే అక్కడ నీకు జ్ఞానోదయం ఏదైనా కలిగిందా?

హాజీ :- అంటే ఏమిటో నాకు అర్థం కాలేదండీ!

జునైద్:- అంటే అక్కడ నీ ప్రభువు నీ కళ్ళ ముందున్నాడని, నువ్వాయన దర్శన భాగ్యం చవిచూస్తున్నావని నీలో ఏమైనా ఆలోచన కలిగిందా?

హాజీ :- ఆ సంగతేమో తెలియదండీ! నేను హజ్‌విధి నిర్వహించి వచ్చా.

జునైద్:- అలాగైతే నువ్వు అరఫాత్ మైదానానికి కూడా వెళ్ళలేదు మరి. సరే, నువ్వు ముజ్దలిఫా వెళ్ళి ఉంటావు గదా, అక్కడ నీ మనోవాంఛల్ని వదిలేశావా?

హాజీ :- అటువైపు నా దృష్టే పోలేదండీ!

జునైద్:- అయితే నువ్వు ముజ్దలిఫా కూడా పోలేదన్న మాట. సరే, నువ్వు ప్రదక్షిణ (తవాఫ్) చేసివుంటే అప్పుడు నీకు దేవుని మహిమలేమైనా కన్పించినట్లు అన్పించిందా?

హాజీ :- అలాంటిదేమీ అన్పించ లేదండీ!

జునైద్:- అయితే నువ్వు తవాఫ్ కూడా చేయలేదు. సరేపోనీ, బలి ప్రదేశానికి పోయి బలి పశువుతో పాటు నీ మనోవాంఛల్ని కూడా బలిచేశావా లేక నీ కోర్కెలగుర్రాలకు గాలికి వదిలి బలిపశువుని మాత్రమే జిబా చేశావా?

హాజీ :- అయ్యో! నేను పశువు గొంతుపై కత్తి తిప్పి ఖుర్బానీ చేసి వచ్చాను. అది తప్ప కోర్కెల గుర్రాలను గురించి నేను ఆలోచించనే లేదు.

జునైద్:- అయితే నువ్వు ఖుర్బానీ కూడా ఇవ్వలేదు. వెళ్ళు నాయనా! వాపసు వెళ్ళి మళ్ళీ హజ్ చెయ్యి. హజ్రత్ ఇబ్రాహీం (అలై) చేసిన విధంగా హజ్ చెయ్యి ఆయన గుణగణాలు, అనుభూతులను దృష్టిలో పెట్టుకొని హజ్ చెయ్యి. ఎంతో విశ్వసనీయత, సర్వసమర్పణ భావం ఉట్టిపడేలా హజ్ చేసిరా.



ప్రముఖ దైవప్రియుడు (వలి) హజ్రత్ జునైద్ బగ్దాది (రహ్మలై)కి, ఒక సాధారణ హాజీకి మధ్య జరిగిన పై సంభాషణ బట్టి, హజ్‌యాత్ర జరిపి వచ్చిన మనిషి ఎంత పవిత్రుడిగా, సజ్జనుడిగా ఉండాలో మనకు తెలుస్తోంది. ఒకవేళ హజ్ చేసి వచ్చిన తరువాత కూడా మనిషి అబద్ధం, అవినీతి, అక్రమాలను మానుకోకపోతే, అతను దేవుని దృష్టిలో, హజ్రత్ జునైద్ బగ్దాది (రహ్మలై) దృష్టిలో హజ్ చేయనే లేదు.

హజ్ నుండి తిరిగొచ్చిన హాజీలను కలుసుకునే వారిని గురించి దైవప్రవక్త (సల్లం) ఈవిధంగా ప్రవచించారు: "మీరెప్పుడైనా హజ్‌యాత్ర జరిపి వచ్చినవ్యక్తిని కలుసుకోవడం జరిగితే, ఆ హాజీ తన ఇంటికి చేరుకోక ముందే అతనికి సలాం చెప్పి, కరచాలనం చేయండి. ఆ తరువాత మీ పాపమన్నింపు కోసం దైవాన్ని ప్రార్థించమని అడగండి. ఎందుకంటే ఆ హాజీ పాపమన్నింపును గురించి (దేవుని దగ్గర) నిర్ణయం జరిగిపోయింది." (ముస్నద్ అహ్మద్)

## 58. హజ్ చేసివచ్చిన తరువాత?

"హజ్" చేసివచ్చిన తరువాత హాజీల కర్తవ్యం ఏమిటీ? హాజీలు మక్కా, మదీనా లలో దాదాపు నలభై అయిదు రోజులు గడిపారు. ఈ నలభై అయిదు రోజుల్లో వారు తమ ఇండ్లను గురించి, తమ ఉద్యోగవ్యాపారాలను గురించి ఆలోచించకుండా దేవుని స్మరణలో, ఆయన ధర్మాన్ని ప్రస్తావించుకోవడంలోనే నిమగ్నులై ఉంటారు. మహాప్రవక్త (సల్లం) శుభసమాధిని దర్శిస్తున్నప్పుడు ఆ మహనీయుని సదాచరణను, ఆయన అమృత ప్రవచనాలను జ్ఞాపకం చేసుకొని ఉంటారు. కాబా ప్రతిష్ఠాలయంలో ప్రవేశించినప్పుడల్లా ఏకేశ్వరోపాసన కోసం, ధర్మసంస్థాపన కోసం హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) చేసిన అవిరళ కృషి, అనన్య త్యాగాలు గుర్తుకు తెచ్చుకొని ఉంటారు. కాబా ఇచ్చిన సందేశాన్ని మనసులో పదిలపరచుకొని ఉంటారు. ఇప్పుడు హజ్‌యాత్ర నుండి తిరిగొచ్చిన తరువాత యధాప్రకారం దైనందిన ప్రాపంచిక కార్యకాలాపాల్లో మునిగి పోయి వాటన్నిటిని మరచిపోవడమేనా?

ఇది తీవ్రంగా ఆలోచించ వలసిన విషయం. ముఖ్యంగా ఏకదైవారాధన గురించి, ధర్మసంస్థాపన గురించి, వాటికోసం చేయవలసిన త్యాగాలను గురించి ప్రతి ముస్లిం ఆలోచించవలసిందే. అయితే ఇప్పుడిప్పుడే సంపూర్ణ ధార్మిక స్పృహతో హజ్ నుండి తిరిగొచ్చిన హాజీలు వీటిని గురించి మరింత తీవ్రంగా ఆలోచించాలి. ఆలోచించి ఓదృఢమైన నిర్ణయానికి రావాలి. ఆ నిర్ణయాన్ని గట్టిగా అమలుపరచడానికి శాయాశక్తులా కృషిచేయాలి. అప్పుడే హాజీ జీవితం సార్థకమవుతుంది.

ఇస్లాం అవిశ్రాంత సంఘర్షణ, పోరాటాలతో కూడిన సమగ్ర జీవన వ్యవస్థ. ముస్లిం నిత్య సమరయోధుడు. అతను తన మనోవాంఛలకు వ్యతిరేకంగా జిహాద్ చేయాలి. దుష్టశక్తులపై యుద్ధభేరి మోగించాలి. దురాచారాలకు, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడాలి. అజ్ఞానం, అనాగరికతలతో కూడిన సమాజానికి, సంస్కృతికి

వ్యతిరేకంగా ఉద్యమించాలి. అన్యాయం, అత్యాచారాలకు వ్యతిరేకంగా తిరుగుబాటు బావుటా ఎగరవేయాలి. ఇలా దైవగ్రంథానికి, ప్రవక్త సంప్రదాయాలకు భిన్నంగా ఉండే ప్రతి విషయానికి వ్యతిరేకంగా నిరంతరం పోరాడుతూనే ఉండాలి.

ఇస్లాం తనను విశ్వసిస్తున్నవారిని ఏకాంత కుహురాల నుండి వెలికితీసి యుద్ధ మైదానంలోకి తెచ్చి నిలబెడుతుంది. వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ప్రశాంత వాతావరణం నుంచి తీసి సామూహిక (జన) జీవితానికి సంబంధించిన అలజడి వాతావరణంలోకి తెస్తుంది. వైరాగ్య మార్గం నుంచి, పూజాపురస్కారాల పరిమిత మత భావాల నూతి నుంచి తీసి పోరాట మార్గంపై వేస్తుంది.

ఒకసారి దైవప్రవక్త (సల్లం), ఆయన అనుచరులు ప్రయాణం చేస్తుంటే తిరుగు ప్రయాణంలో ఒక చోట పచ్చని చెట్లు చేమలతో కూడిన ఒయాసిస్సు ఒకటి వచ్చింది. అక్కడి ఆహ్లాదకరమైన వాతావరణం చూసి ఒక అనుచరుడు ఎంతో ముచ్చట పడి. ఇక్కడ ఉండిపోయి ఏకాంత జీవితం గడిపితే బాగుంటుందని భావించాడు. అయితే తనకు తానుగా నిర్ణయించుకోవడం మంచిది కాదని, దైవప్రవక్త (సల్లం) అభిప్రాయం ఏమిటో తెలుసుకోవాలని అనుకున్నాడాయన. అంచేత దైవప్రవక్త (సల్లం) దగ్గరికెళ్ళి తన ఉద్దేశాన్ని వెలిబుచ్చాడు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు:

"మీలో ఎవరైనాసరే తన భార్యాపిల్లల మధ్య (ప్రశాంతంగా) జీవితం గడుపుతూ డెబ్బయి సంవత్సరాలపాటు ఆరాధన చేయడం కంటే (ధర్మవ్యాప్తి కోసం) దైవ మార్గంలో బయలుదేరడం ఎంతో శ్రేష్ఠమైన పని. దేవుడు మీ పాపాలు క్షమించడం, మీకు స్వర్గప్రవేశం లభించడం మీకు ఇష్టంలేదా? కనుక దైవమార్గంలో పోరాటం జరపండి. ఒంటెకు పాలు పితకడానికి ఎంత సమయం పడ్తుందో అంత సమయం కూడా దైవమార్గంలో పోరాడితే మీకు తప్పనిసరిగా స్వర్గం లభిస్తుంది."

మరో సందర్భంలో ఆయన అన్నారు: "ప్రతి దైవప్రవక్త కోసం ఒక వైరాగ్యత ఉండింది. నా అనుచరసమాజం వైరాగ్యత దైవమార్గంలో జిహాద్ చేయడమే."

ఖుర్ఆన్ ముస్లింలను జిహాద్ వైపుకు ప్రేరేపిస్తుంది. దైవప్రవక్త (సల్లం) తన అనుచర సమాజానికి ఆచరణాత్మకమైన జిహాద్ పాఠం నేర్పారు. ఇతర మతాలలో ఆరాధనా విభాగం మనిషికి వైరాగ్యశిక్షణ ఇస్తుంది. కాని ఇస్లాంలోని నమాజ్, రోజా, జకాత్, హజ్ ఆరాధనలు మనిషికి జిహాద్‌శిక్షణ ఇస్తాయి.

నమాజ్, రోజా, జకాత్ ఆరాధనల మాదిరిగానే హజ్ కూడా ముస్లింని జిహాద్ కోసం సమాయత్త పరుస్తుంది. జిహాద్‌కు సంబంధించిన అతిపెద్ద మైదానం మనిషి మనస్సే. అంటే మనిషి మనస్సు ఎంతో శక్తిమంతమైనది. ఎంతో అందమైనది, ఆకర్ష ణీయమైనది కూడా. అది తన శక్తితో, అందచందాలతో మనిషిని ఎల్లప్పుడూ తన వైపుకు లాగడానికి ప్రయత్నిస్తుంది. ఈ రంగంలో ఓడిపోయే వాడు జీవిత సమరానికి సంబంధించిన ప్రతి యుద్ధరంగంలో కూడా పరాజయాన్నే చవిచూస్తుంటాడు. ఈ



మైదానంలో గెలిచే మనిషి జీవిత సమరానికి సంబంధించిన ప్రతి యుద్ధమైదానం లోనూ విజయ దుందుభినే మోగిస్తూ అప్రతిహతంగా ముందుకు సాగుతాడు.

మనస్సు కోరే అనేక రుచులలో ఒకటి సిరిసంపదల వ్యామోహం. ఈ విషయంలో దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "మనిషి ముసలివాడయి పోతాడు. (అంటే అతని శక్తిసామర్థ్యాలన్నీ క్రమంగా క్షీణించిపోతాయి.) అయితే ఆ వయస్సులో కూడా అతని రెండు కోరికలు మాత్రం ఇంకా యౌవనంలోనే ఉంటాయి. ఆ రెండిటిలో ఒకటి ధనవ్యామోహం, రెండోది దీర్ఘకాలం బ్రతికుండాలనే కోరిక." (బుఖారి)

దైవప్రవక్త (సల్లం) ముఖ్యంగా **ధనవ్యామోహం** గురించి చెప్పిన హితోక్తులు ఎంతో గమనార్హమైనవి. ఆయన ఇలా ప్రవచించారు:

"అత్యధిక సిరిసంపదలతో కలిమి రాదు. నిజమైన కలిమి ఆత్మసంతృప్తి వల్లనే ఒనగూడుతుంది." (బుఖారి, ముస్లిం)

"ఐశ్వర్యం దైవభీతిపరుడికి ఉంటే పరవాలేదు. అయినా దైవభీతిపరాయణుడి కోసం ఐశ్వర్యం కంటే దేహారోగ్యం, అన్ని భాగ్యాల కంటే ఆత్మసంతృప్తి ఎంతో శ్రేష్ఠ మైనవి." (అహ్మద్-మిష్కాత్)

"మానవునికి సిరిసంపదలతో నిండిన ఓ పెద్ద లోయ లభించినప్పటికీ, అలాంటి మరొక లోయ దొరికితే బాగుంటుందని భావిస్తాడు. అతని పేరాశ కడుపు (సమాధి) మట్టితో మాత్రమే నిండుతుంది. అయితే ప్రాపంచిక వ్యామోహం వదలి పశ్చాత్తాప హృదయంతో దేవుని వైపుకు మరలితే అలాంటి మనిషిని దేవుడు మన్నిస్తాడు. అతని పశ్చాత్తాపాన్ని స్వీకరిస్తాడు. (అతనికి ఆత్మసంతృప్తి భాగ్యం ప్రసాదిస్తాడు.)" (బుఖారి)

"నీవొక శత్రువుని చంపి విజయం సాధించాననో లేక అతను నిన్ను చంపడం వల్ల నీకు స్వర్గప్రాప్తి కలుగుతుందనో అనుకుంటావు. కాని నీ అసలు శత్రువు అతను కాదు. నీ అసలుశత్రువు నీ కడుపున పుట్టిన పిల్లవాడు కావచ్చు. అంతకంటే పెద్ద శత్రువు నీ అధీనంలో ఉన్న నీ సిరిసంపదలే'. (తబ్రాని)

"తన ప్రపంచాన్ని (అంటే ఆర్థిక వ్యవహారాలను, పేరుప్రతిష్ఠలను) బాగుపరచు కోవడంలోనే మునిగిపోయేవాడు తన పరలోకాన్ని నష్టపరచుకుంటాడు. అదేవిధంగా తన పరలోకాన్ని బాగుపరచుకునేవాడు తన ఇహలోకాన్ని (అంటే ఐహిక ప్రయోజనా లను) నష్టపరచుకుంటాడు. కనుక మీరు శాశ్వతంగా ఉండే (సత్కార్యాలకు సంబం ధించిన) విషయాలు అవలంబించండి. త్వరలో అంతమయిపోయే అశాశ్వతమైన విషయాలు అవలంబించకండి." (బైహఖీ.)

ఈవిధంగా మనిషి ఒకవైపు హద్దులు మీరిన ధనవ్యామోహం ఊబిలో కూరుకు పోతే, మరోవైపు ఈ ధనవ్యామోహం అతని ధర్మాన్ని, విశ్వాసాన్ని అంతమొందిస్తూ చివరికి అతడ్ని సర్వనాశనం చేసివేస్తుంది. దీన్ని గురించి దైవప్రవక్త (స) చెప్పిన హితోక్తి కూడా ఎంతో గమనార్హమైనదే. ఆయన ఇలా ప్రవచించారు:

"ఆకలిగొన్న రెండు తోడేళ్ళను మేకలమందలోకి వదిలితే ఆ తోడేళ్ళు మేకలను ఎంత నష్టపరుస్తాయో, మనిషిలోని ధనపిపాస అతని ధర్మాన్ని అంతకంటే ఎక్కువ నష్ట పరుస్తుంది." (తిర్మిజి, దార్మి)

దివ్యఖుర్ఆన్‌లోని ఈ సూక్తులు కూడా చదవండి:

"ప్రాపంచిక వ్యామోహంలో పరస్పరం పోటీపడి వీలైనంత ఎక్కువ సంపాదిం చాలన్న తపనే మిమ్మల్ని ఏమరుపాటులో పడవేసింది. చివరికి (అదే రందిలో) మీరు సమాధికి చేరుకుంటారు. (మీరసలు ప్రాపంచిక సంపదే ప్రగతికి చిహ్నమని అను కుంటున్నారు కాబోలు.) ఎంతమాత్రం కాదు. త్వరలోనే మీకు తెలుస్తుంది (వాస్తవం ఏమిటో). ఎంతమాత్రం కాదు. త్వరలోనే మీకు తెలుస్తుంది." (ఖుర్ఆన్.102:1-4)

"ఎంతమాత్రం కాదు. విశ్వసనీయ జ్ఞానంతో మీరు విషయాన్ని గ్రహిస్తే (మీ వైఖరి ఇలా ఉండదు). మీరు తప్పకుండా నరకాన్ని చూస్తారు. ఔను, మీరు నమ్మకంగా దాన్ని మీ కళ్ళారా చూస్తారు. ఆరోజు ఈ సౌఖ్యాలు, సిరిసంపదల్ని గురించి మిమ్మల్ని తప్పకుండా నిలదీయడం జరుగుతుంది." (ఖుర్ఆన్.102:5-8)

"దైవమార్గంలో ఖర్చుపెట్టండి. (అంటే సత్కార్యాల కోసం సంపద వినియో గించండి.) చేజేతులా నాశనం కొనితెచ్చుకోకండి. సత్కార్యాలు చేస్తూ ఉండండి. సత్కార్యాలు చేసేవారిని దేవుడు తప్పకుండా ప్రేమిస్తాడు." (2:195)

"దేవుడు తన అనుగ్రహంతో ప్రసాదించిన సంపద విషయంలో పిసినారితనం వహించేవారు ఆ పిసినారితనం తమకు మేలు చేకూరుస్తుందని భావించకూడదు. అది వారికి హాని కలిగిస్తుంది. వారు ఏ ధనం విషయంలో పిసినారితనం వహిస్తున్నారో అది రేపు ప్రళయదినాన వారి మెడకు గుదిబండగా మారుతుంది. యావత్తు భూమ్యాకాశాలకు దేవుడే వారసుడు. మీరు చేస్తున్నదంతా దేవునికి బాగా తెలుసు." (3:180)

"మీలో ఎవరయినా దేవునికి శ్రేష్ఠమైన రుణదానం అందజేసేవారు ఉన్నారా? ప్రతిఫలంగా ఆయన దాన్ని అనేక రెట్లు పెంచి తిరిగి మీకు అందజేస్తాడు. దేవుడే మీ ఉపాధిని తగ్గించేవాడు. దాన్ని వృద్ధి చేసేవాడు కూడా ఆయనే. చివరికి ఆయన సన్నిధికే మీరంతా మరలి పోవలసి ఉంది." (2:245)

"ఈ ప్రాపంచిక జీవితం ఒక ఆట, తమాషా (లాంటి మూన్నాళ్ళ ముచ్చట) మాత్రమే. మీరు విశ్వాసులై భయభక్తులతో నడచుకుంటే దేవుడు మీకు రావలసిన ప్రతిఫలం తప్పకుండా ప్రసాదిస్తాడు. ఆయన మిమ్మల్ని మీ సిరిసంపదలు ఇవ్వమని అడగటం లేదు. ఆయన మీ ధనాన్ని అడిగితే, చాలా తరిగిపోయే వరకు ఇవ్వమని అడుగుతుంటే మీరు పిసినారితనం చూపుతారు. ఈవిధంగా దేవుడు మీ బలహీనతలను బయటపెడ్తాడు." (ఖుర్ఆన్-47:36,37)

"వినండి, (అవసరార్థం) దైవమార్గంలో ధనం ఖర్చుపెట్టమని మిమ్మల్ని కోరడం జరుగుతోంది. కాని మీలో కొందరు పిసినారితనం వహిస్తున్నారు. అయితే పిసినారితనం



వహిస్తున్నవాడు నిజానికి తన సొంత విషయంలోనే పిసినారితనం వహిస్తున్నాడు (అని వారు తెలుసుకోలేకపోతున్నారు). దేవుడు నిరపేక్షాపరుడు. మీరే (సమస్త అవసరాలకు) ఆయనపై ఆధారపడేవారు. మీరు గనక (మా ఆజ్ఞలకు) విముఖులైపోతే దేవుడు మీ స్థానంలో కొత్తగా మరో జాతిని తెచ్చిపెడతాడు. వారు మీలా ప్రవర్తించరు." (ఖుర్ఆన్-47:38)

"వారికిలా చెప్పు: 'నా ప్రభువు తన దాసులలో తానుకోరిన విధంగా కొందరికి విస్తృతంగా, మరికొందరికి స్వల్పంగా ఉపాధి ప్రసాదిస్తున్నాడు. మీరు (దైవమార్గంలో) ఏది ఖర్చుపెట్టినా ఆ వెల్తిని భర్తీచేయడానికి ఆయన మీకు మరింత ప్రసాదిస్తాడు. ఆయన యావత్తు ఉపాధి ప్రదాతల్లోకెల్లా గొప్ప ఉపాధిప్రదాత". (ఖుర్ఆన్-34:39)

# 59. మృత్యువు తరుముకొస్తోంది!

హజ్ సీజన్‌లో హజ్ చేయడానికి, రమజాన్ మాసంలో ఉమ్రా చేయడానికి లక్షలాది యాత్రికులు కాబా ప్రతిష్ఠాలయానికి, మస్జిదె నబవీకి వస్తుంటారు. ఆ సందర్భాల్లో ఏ కారణంగానైనా ఇహలోకం వీడిపోయే ముస్లింల కోసం ఈ పుణ్య క్షేత్రాలలో జనాజా నమాజ్ చేయడం జరుగుతుంది. ఈవిధంగా హజ్ సీజన్‌లో, రమజాన్ మాసంలో ఈ పుణ్యక్షేత్రాలలో దాదాపు ప్రతి ఫరజ్ నమాజ్ తర్వాత జనాజా నమాజ్ జరుగుతుంది. హజ్ సీజన్‌లో ముఖ్యంగా కాబా ప్రతిష్ఠాలయానికి అయితే ప్రతి ఫరజ్ నమాజు తర్వాత ఒకటి రెండు జనాజాలు (శవాలు) వస్తుంటాయి. ఒక్కో సారి అయిదారు జనాజాలు రావడం కూడా జరుగుతుంది.

కాబా ప్రతిష్ఠాలయం, మస్జిదె నబవీ లాంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలలో మృతుని కోసం జనాజా నమాజ్ చేయడం, చేయించడం గొప్ప పుణ్యకార్యంగా భావిస్తారు. అందుకే సుదూర దేశాల నుండి వచ్చే యాత్రికులు తమ బంధుమిత్రులలో ఎవరైనా చనిపోతే ఆ మృతదేహానికి ఈ పుణ్యక్షేత్రాలలోనే అంతిమ సంస్కారం జరుపుతారు.

కాబాలో, మస్జిదెనబవీలో ఫరజ్ నమాజ్ తరువాత జరిగే జనాజా నమాజ్‌లో యాత్రికులు పాల్గొనడం కూడ గొప్ప పుణ్యకార్యమే. అందువల్ల ఇక్కడ జరిగే ఫరజ్ నమాజుల తర్వాత యాత్రికులు వెంటనే సున్నత్, నఫిల్ నమాజులు చేయకుండా జనాజానమాజ్ కోసం ఎదురుచూసి అందులో పాల్గొనడం మంచిది.

దైవప్రవక్త (స) ఇలా బోధించారు: "ఎవరైనా విశ్వాసస్ఫూర్తితో, పుణ్యఫలాపేక్షతో ఒక ముస్లిం జనాజా (శవం) వెంట వెళ్ళి అతని జనాజా నమాజ్‌లో పాల్గొని, అతడ్ని ఖననం చేసేవరకు అక్కడే ఉంటే, అలాంటి వ్యక్తి రెండు యూనిట్ల పుణ్యం తీసుకొని (ఇంటికి) తిరిగి వస్తాడు. ఆ రెండు యూనిట్ల పుణ్యంలో ఒక్కొక్క యూనిట్ పుణ్యం ఉహుద్ కొండంత ఉంటుంది. ఒకవేళ ఎవరైనా ఖననం అయ్యేవరకు ఉండకుండా జనాజా నమాజ్‌లో మాత్రమే పాల్గొనడం జరిగితే అతను అలాంటిదే ఒక యూనిట్ పుణ్యం తీసుకొని తిరిగొస్తాడు." (బుఖారి, ముస్లిం)

**జనాజా నమాజ్**: జనాజా నమాజ్ చేయడానికి ఇమాం మనిషి భౌతిక కాయం ఎదురుగా నిలబడాలి. పురుషుని జనాజా అయితే ఇమామ్ అతని రొమ్ముకు ఎదురుగా నిలబడాలి. స్త్రీ జనాజా అయితే ఇమామ్ ఆమె నడుముకు ఎదురుగా నిలబడాలి. తరువాత ఇమామ్, ఆయన వెనుక నమాజ్ చేసేవారు "నేను దైవ ప్రసన్నత కోసం ఈ జనాజా నమాజ్ చేస్తున్నాను" అని సంకల్పించుకోవాలి.

ఇలా సంకల్పించుకున్న తరువాత ఇమాం అల్లాహుఅక్బర్ అంటూ అరచేతులు రెండూ చెవులదాకా ఎత్తి దించి కట్టుకోవాలి. తరువాత "సుబ్హానక అల్లాహుమ్మ వ బిహమ్దిక వ తబారకస్ముక వ తఆలా జద్దుక వ లాఇలాహ గైరుక్" అని పఠించాలి.

(అనువాదం: దేవా! మేము నీ పవిత్రతను కొనియాడుతున్నాం. నిన్నే స్తుతిస్తున్నాము. నీ నామం ఎంతో శుభదాయకమైనది. నీ మహనీయత మహత్తరమైనది. నీవు తప్ప మరో ఆరాధ్యుడు లేడు.)

తరువాత చేతులు పైకెత్తకుండా అల్లాహుఅక్బర్ అని పలికి దరూద్షరీఫ్ పఠించాలి. మనం రోజూ నమాజ్లో పఠించే దరూద్షరీఫే పఠించడం మంచిది. ఆ తరువాత మళ్ళీ చేతులు పైకెత్తకుండా అల్లాహుఅక్బర్ అని పలికి ఈక్రింది దుఆ పఠించాలి:

"అల్లాహుమ్మగ్ఫిర్లి హయ్యినా వమయ్యితినా వషాహిదినా వగాయిబినా వ సగీరినా వకబీరినా వమన్తవఫ్ఫయితహు మిన్నా. అల్లాహుమ్మ మన్ అహ్యైతహు మిన్నా ఫలహ్యిహీ అలాల్ ఇస్లామి వమన్ తవఫ్ఫయితహు మిన్నా ఫతవఫ్ఫహు అలల్ ఈమాన్."

(అనువాదం: దేవా! మాలో సజీవంగా ఉన్నవారిని, చనిపోయినవారిని క్షమించు. మా దగ్గర ఉన్నవారిని, మా దగ్గర లేనివారిని, మా పిన్నలను, మా పెద్దలను, మా స్త్రీలను, మా పురుషులను కూడా క్షమించు. దేవా! మాలో నీవు సజీవంగా ఉంచే వారిని ఇస్లాం (ఆదేశాలను ఆచరిస్తున్న) స్థితిలో సజీవంగా ఉంచు. మాలో నీవు మృత్యువు కలిగించేవారిని విశ్వాస స్థితిలో మృత్యువు కలిగించు.)

ఈ దుఆ రానివారు మరే దుఆ అయినా పఠించవచ్చు. తర్వాత అల్లాహుఅక్బర్ అనాలి. ఆతర్వాత ముందు కుడివైపు, తర్వాత ఎడంవైపు తిరుగుతూ సలాం పలకాలి.

మనిషి మట్టిగూడు నుంచి ఆత్మ ఎప్పుడు ఎగిరిపోతుందో ఎవరూ చెప్పలేరు. మనం ఇప్పటి వరకు ఎంతోమంది జనాజానమాజుల్లో పాల్గొనిఉంటాం. అలాగే ఇతరులు మన జనాజానమాజులో పాల్గొనే సమయం కూడా వస్తుంది. అందువల్ల మనం ఎల్లప్పుడూ **కర్మవిచారణ కోసం సిద్ధంగా ఉండాలి.**

దైవప్రసాదిత భాగ్యాల విచారణ గురించి మహాప్రవక్త (సల్లం) ఇలా తెలిపారు: "ప్రళయదినాన అయిదు విషయాలను గురించి అడిగిన ప్రశ్నలకు సమాధానం



ఇవ్వనంతవరకు మానవుడు నిల్చున్నచోటు నుంచి ఒక్క అంగుళం కూడా కదలలేడు. ఆ అయిదు విషయాలివి: ① నీ వయస్సును ఏ కార్యకాలాపాలలో అంతమొందించావు? ② నీ యౌవనాన్ని ఎక్కడ వ్యర్థపరిచావు? ③ నీవు ధనాన్ని ఎలా సంపాదించావు? ④ దాన్ని ఏవిధంగా ఖర్చుపెట్టావు? ⑤ నీకు ప్రసాదించిన (ధర్మ) జ్ఞానాన్ని ఏమేరకు ఆచరించావు?" (తిర్మిజి)

ఈ జీవితం క్షణభంగురం. క్షణకాలం కూడా ఉండని నీటిబుడగ వంటిది. కలలా కరిగిపోయే మంచుగడ్డ లాంటిది. సంవత్సరాలు నెలలవుతూ, నెలలు దినాలవుతూ కాలం అతివేగంగా వెనక్కి పరుగెడుతోంది. మనిషికి మృత్యువు ఎప్పుడు కాటువేస్తుందో తెలియదు. కోరలు చాచి బుసలుకొడ్తూ వెంటపడే కొండచిలువలా, రక్తదాహం తీరని పెద్దపులిలా మృత్యువు మనిషిని తరుముకొస్తోంది.

మరి ఈ ముస్లింలకు ప్రాపంచిక మైకం వదలి స్వార్థానికి సమాధి కట్టే సమయం ఇంకా ఆసన్నం కాలేదా? అడవిలోని ఓ నూతిలో పడిపోయి చెట్టుకొమ్మను పట్టుకొని వ్రేలాడుతూ, పైన పెద్దపులి గాండ్రిస్తున్నా, క్రింద మొసలి నోరుతెరచి వగరుస్తున్నా గమనించకుండా చెట్టుకొమ్మ నుండి పడుతున్న తేనె బిందువుల్ని నాకేవాడిలా ఏమరుపాటులోనే పడివుంటారా? అంతర్జాతీయ ఆరాధనా కేంద్రం, ఇస్లామీయ జ్ఞాననిధికి ప్రతీక అయిన కాబాప్రతిష్ఠాలయం ఇస్తున్న సందేశాన్ని గమనించరా? ఈ విషయంలో హాజీ మహాశయుల అభిప్రాయం ఏమిటీ? ముఖ్యంగా ఈమధ్యనే హజ్ చేసి వచ్చిన హాజీలు ఆత్మావలోకనం చేసుకోవాల్సిన విషయమిది.

(దైవానుగ్రహం వల్ల సమాప్తం)


## మానవాళికి వెలుగుబాట




ఖురాన్ను బాగా అర్థం చేసుకోవాలంటే దాన్ని శ్రద్ధగా, పూర్తిగా చదవాలి. ఖురాన్ అందరికీ అందుబాటులోలేని కాలంలో కొంత మంది స్వార్థపరులు ఖురాన్బోధనలను వక్రీకరించిన సంఘటనలు చరిత్రలో ఎన్నో కనబడతాయి. ప్రపంచంలోని మారుమూల ప్రాంతాలకు కూడా బైబిల్ అనువాదాలు చొరబడినంత సులభంగా, వేగంగా ఖురాన్ చేరక పోవడం వల్ల చాలానష్టమే జరిగింది...

తెలుగులో గతంలో వచ్చిన అనువాదాలు సమగ్రంగా లేకపోవడం, గ్రాంథికంలో ఉండడంవల్ల ఎవరూ అంతగా పట్టించుకోలేదు. ఇన్నాళ్ళకి తెలుగులో సులభ సుందర శైలిలో, అందరికీ అర్థమయ్యే విధంగా అనువదించడంలో అత్యంత ప్రతిభ కనబరచిన అబుల్ఇర్ఫాన్ అభినందనీయుడు... ఈ పుస్తకాన్ని అరబిక్ లిపితో, దాని అనువాదంతో పాటు ఇచ్చిన పాదపీఠికలు విషయాన్ని సులభంగా వివరిస్తాయి. ఈ కృషి విజ్ఞానదాయకమయినది.

**-కె.పి. అశోక్ కుమార్ ('వార్త' దినపత్రిక-22.5.2005)**